

సూర్యదేవర రామ్మోహన రావు
గోతెలుగు.కామ్
చక్కటి కుటుంబ వార పత్రిక
నాగలోకయాగం

# కొత్తసీరియల్ ప్రారంభం






కలియుగ ఆరంభ కాలం క్రీ.పూ. 3102 సంవత్సరాలు. క్రీస్తు తర్వాత ఇప్పటి వరకు జరిగిన కాలాన్ని కూడా కలుపుకుంటే కలియుగం ఆరంభమై 3102+2015=5117వ సంవత్సరం నడుస్తోంది.

ఈ కలి యుగానికి అధిపతి కలి పురుషుడు.

కలికి పుణ్యాత్ములు శత్రువులు, పాపాత్ములు ఆత్మీయులు.

కలి కూడ కాలం లో ఒక భాగం. తన అధీనంలో వున్న కాలానికి బలాన్నిచ్చేవాడు కలి. ఈ కలి ప్రభావం ఎంత గొప్పదంటే భవిష్య పురాణంలో ఓ చోట ఇలా చెప్పబడింది.

శ్లో॥ బలాదివ వికృష్యంతే కాలేన జన బుద్ధయః।

నను దూరాద్వికీర్యంతే వాత్సయావన పాదపః ॥

ఈ శ్లోకానికి అర్థం: మహా వృక్షాలు సైతం పెను గాలిచేత లాగ బడి దూరంగా విసిరి వేయబడినట్లు మానవుడు ధర్మ గుణాలన్నీ కలి కాలం చేత బలవంతంగా పెకలించి వేయబడతాయి.

ఈ కలి ప్రభావం ద్వాపరం నందు యుగ సంధికి ముందు నుంచే ఆరంభమైంది.

కురుక్షేత్ర సంగ్రామం జరిగిన ముప్పై అయిదు సంవత్సరాకు కలియుగం ఆరంభమైంది. అది శ్రీ కృష్ణ నిర్యాణం రోజునే ఆరంభమైంది. తర్వాత వారం రోజులకు శ్రీకృష్ణుని ద్వారక నీట మునిగింది. ఈ కలియుగ ఆరంభ కాలానికి కాస్త ముందు వెనుకలుగా మూడు వంశ క్షయాలు జరిగాయి.

కురుక్షేత్ర సంగ్రామంలో కురువంశ క్షయం జరిగింది.

ఇది జరిగిన ముప్పై అయిదేళ్ళకు కలియుగ ఆరంభంలో గాంధారి శాపం ఇతర కారణాల వల్ల యాదవ కులంలో ముసలం పుట్టింది. తద్వారా యాదవ కుల క్షయం జరిగింది. ఇది నాటి రెండో దారుణ విషాద ఘటన.

శ్రీకృష్ణ నిర్యాణం తర్వాత పాండవు తమ వంశాంకురము అర్జునుని మనవడు అభిమన్యుడి కొడుకు అయిన ముప్పై అయిదేళ్ళ ప్రాయమున్న పరీక్షిత్తును హస్తినకు రాజుగా చేసి స్వర్గారోహణ చేయటం జరిగింది. కొంత కాలానికి ముని కుమారుడి శాపాన్ననుసరించి తక్షకుడనే నాగు కరవగా పరీక్షిత్తు మరణించాడు.

అప్పటికి కొడుకు జనమేజయుడు ఏడేళ్ళ పసివాడు. జనమేజయుడు యుక్త వయస్కుడై సింహాసనం ఎక్కాక తన తండ్రి మరణానికి కారణం తెలుసుకుని మండిపడ్డాడు. భూమి పైన నాగ జాతి లేకుండా నాశనం చేయాలని సంకల్పించి ప్రతీకారంగా సర్పయాగం చేసాడు. ఆ యాగాగ్నిలో పడి అనేక నాగజాతులు నశించాయి.

దీనికి కారకుడైన తక్షకుడు మాత్రం ఇంద్రసింహాసనాన్ని ఆశ్రయించి యాగాగ్నిలో పడకుండా చివరి క్షణంలో తప్పించుకున్నాడు. కర్కోటకుడనే నాగం పాతాళం వెళ్ళి ప్రాణాలు దక్కించుకున్నాడు. సర్పయాగం నిలిపే సమయానికి సర్పకులం లో మిగిలింది తక్షకుడు, కర్కోటకుడు యిద్దరే. ప్రస్తుతం భూలోకంలో సంచరించే నాగజాతులన్నీ వీరి సంతతే.

సర్పయాగం వల్ల జరిగిన తమ నాగలోక క్షయానికి సహజంగానే నాగలోక రేడు నాగరాజుకి అంతులేని మనోవేదన, దుఃఖం కలిగాయి. ఆ బాధలో ఆగ్రహావేశంతో పాండు వంశాన్ని శపించాడు. ఆ తర్వాత కాలం లో దేశకాల పరిస్థితులేమిటి? పరిణామాలేమిటి? ఏం జరిగింది?

*****************************************************

అది కలియుగం మూడు వందల యాభై ఒకటో సంవత్సరం. అంటే ఇప్పటికి నాలుగు వేల ఏడు వందల అరవై ఆరు (4,766) సంవత్సరాల క్రితం మాట.

ఒకనాటి అపరాహ్న వేళ.

అది నలనామ సంవత్సరం.

గ్రీష్మ ఋతువు.

ఎండలు మండిపోతున్న సమయం.

సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు.

నీలాకాశం అద్దంలా మెరుస్తోంది.

గగన సీమలో ఎక్కడా మచ్చుకైనా ఒక మబ్బు తునక కనిపించుట లేదు. వడగాల్పులు వెచ్చగా ఈ చెవి నుంచి ఆ చెవికి సోకుతోంది. రత్నగిరి రాజ్య భూభాగంలో ఉత్తర అటవీ ప్రాంతంలో నిశ్శబ్దం ఆవరించుకొనుంది. ఎండ ధాటికి భయపడి కీకారణ్యంలోని అడవి మృగాలేవీ తమ తావులు వదిలి బయటకు రావడం లేదు.

అటువంటి మండు వేసంగి రోజున`

అంతటి వడగాడ్పునూ ఇసుమంతయినా లెక్క చేయకుండా అటవీ మార్గంలో ప్రయాణం సాగిస్తున్నాడో యువకుడు. అతడి అశ్వం కాలిగిట్టల శబ్దం మార్గం వెంట మారు మోగుతోంది. ధూళి ఎగసి పడుతోంది. అది రాజధాని రత్నగిరి నగరం నుండి ఈశాన్యంగా ఆరావళి పర్వతాలను చేరి అక్కడి నుండి ఉత్తర ఈశాన్యంగా వింధ్య పర్వత ప్రాంతాల్లోని మాళవ రాజ్యానికి చేర్చే రాజమార్గం.

మహేంద్రుని ఉశ్చైశ్వరంను ధిక్కరించే బలిష్టమైన పాల నురుగులాంటి తెల్లని అశ్వం మీద ఆ యువకుడు ప్రయాణం చేస్తున్నాడు. అశ్వం శ్వేత వర్ణంలో వున్నా దాని జూలుకు భాగం, తోక భాగాలు మాత్రం కాటుక పూచినట్టు చిక్కటి నలుపు రంగులో విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ జాతి అశ్వాలు చాలా అరుదుగా లభిస్తాయంటారు.

అంతటి అందమైన మగ గుర్రం మీద ప్రయాణం చేస్తోంది కూడ ఒక సుందరాకారుడైన యువ పురుషుడే. అతను ఏడడుగుల పైగా పొడవుంటాడు. అతడి ముఖ వర్చస్సు చూస్తే మాత్రం వయసు ఇరవై రెండు లేదా ఇరవై మూడేళ్ళ వయస్సు మించదనిపిస్తుంది. వంటి మీద ఎలాంటి ఆభరణాలు అలంకారాలు లేవు. సాదాసీదా దుస్తులు ధరించాడు. కాని అతడి ఠీవి చూస్తుంటే ఖచ్చితంగా ఎవడో ఉన్నత వంశీయుడని ఇట్టే తెలిసిపోతుంది.

అతడు క్షత్రియ వీరుడని ఖచ్చితంగా చెప్పొచ్చు. ఎందుకంటే నడుం నుండి పొడవాటి ఒరలో వీర ఖడ్గం వేలాడుతోంది. ఇంకా భుజాన విల్లు, మూపున అంబుల పొది వున్నాయి. ఇవి గాక, గుర్రం జీను దిగువన అడ్డంగా బళ్ళెం, శూలం , బరిసె వంటి ఆత్మ రక్షణ ఆయుధాలు సిద్ధంగా వున్నాయి. జీనుకు అటు యిటు రెండు తోలు సంచులు నిండుగా దుస్తులు, ఇతర సామాగ్రి కావలిసినంత ధనం వున్నాయి. ముందు భాగంలో మంచి నీటితో కూడిన సొరకాయ బుర్ర వేలాడుతోంది.

చూడ్డానికి సుకుమారుడిలా కన్పిస్తున్నాడు. కాని అతడి అంగ సౌష్టవం చూస్తుంటే నిత్య వ్యాయామం, వీర విద్యల సాధనలో రాటు దేలిన వీరుడని అర్థమవుతోంది. పసిమి ఛాయ మేనితో అతడు లాగి వుంచిన వెదురు బద్దలా వాడిగా వేడిగా చాలా హుషారుగా వున్నాడు.

కొటేరు వంటి నాశిక, విశాల ఫాల భాగం, చురుకైన కనుదోయి నీటయిన కోర మీసం అతడిలో ప్రత్యేకతని చాటుతున్నాయి. నిశితమైన చూపులు అతడి పట్టుదల, కార్యదీక్షను ప్రకటిస్తున్నాయి. విశాలమైన ఛాతీ, సింహపు నడుము, అజాను బాహువులతో సాక్షాత్తూ ఆ చెరకు విలుకాడే వచ్చి తన పవనాశ్వంపై వనవిహారం చేస్తున్నాడాని భ్రమింపజేసేంతగా బహు సుందరాకారుడా యువకుడు.

అతడు రత్నగిరి నుండి బయలుదేరి ఇది రెండవ దినము. అనువైన చోటు చూసి భోంచేసి, ఒకింత విశ్రమించడానికి తగిన ప్రాంతాన్ని అన్వేషిస్తూ అశ్వాన్ని నెమ్మదిగా పోనిస్తున్నాడు. ఉష్ణ తాపానికి అలసిపోయిన అశ్వాన్ని మరింత బాధించటం అతనికిష్టం లేదు.

ఆ అడవిని రెండుగా చీలుస్తూ`

నిలువు రేఖలా వుందా బాట.

అసలే వేసవి. ఆ పైన ఎర్రమట్టినేల. గాలికి ధూళి ఎగసి పడుతోంది. దిగువన ఒక ఎత్తయిన మిట్టను దాటి వచ్చిన ఆ బాట దూరంగా ఎగువన మరో ఎత్తయిన మిట్ట వైపు సాగుతోంది. కళ్ళాలు బిగించకుండా అశ్వాన్ని ముందుకు పోనిస్తున్నాడా యువకుడు.

ఇది కలియుగ ఆరంభ కాలం నాటి గాధ. ఆ నాటి దేశకాల పరిస్థితులు ఏయే రాజ్యాలుండేవి మొదలయిన విషయాల మీద కొంతయినా అవగాహన అవసరం.

కురు సార్వభౌముడు దుర్యోధన చక్రవర్తి పతనం తర్వాత పాండవాగ్రజుడు ధర్మరాజు చక్రవర్తి అయి ముప్పై అయిదేళ్ళ పాటు ధర్మ పరిపాలన సాగించాడు. అశ్వమేధ యాగం చేసి మరిన్ని రాజ్యాలు జయించి సామంతుల్ని చేసుకుని సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించాడు. కలియుగం ఆరంభమైంది. పాండవుల వారసుడిగా పరీక్షిత్తు రాజ్యాధికారానికి వచ్చాడు. తర్వాత అతని కొడుకు జనమేజయుడు చక్రవర్తి అయ్యాడు.

జనమేజయుని తర్వాత నాలుగు తరాలు మారేసరికి పరిస్థితులు మారాయి. వారసులు రాజ్యాన్ని పంచుకోవటం, సామంతులు స్వతంత్రులుగా ప్రకటించుకోవటంతో రాజధాని హస్తిన బలహీనపడిపోయింది. కారణాలు ఏమైనా హస్తిన ప్రాభవం తగ్గి తిరిగి చిన్న చిన్న రాజ్యాలు అనేకం ఏర్పాడ్డాయి. వీటిలో చాలా రాజ్యాలకి పాండువంశీకులే రాజులు. ఆ క్రమంలో ఏర్పడిందే రత్నగిరి రాజ్యం కూడ. ప్రస్తుతం ఈ రాజ్యం పాండువంశీకుడైన ధర్మతేజుడనే రాజు ఆధీనంలో వుంది.

ఈ రత్నగిరి రాజ్యానికి రాజధానీ నగరం రత్నగిరి. పశ్చిమ సముద్ర తీరంలోని ఎత్తైన కొండకు రత్నగిరి అని పేరు. ఈ కొండను పరివేష్టించి సముద్ర తీరం వరకు విస్తరించి నగరం వుంది. రత్నగిరి కొండ పేరు మీదు గానే ఇది రత్నగిరి నగరమైంది. ఈ నగరం రాధానిగా విస్తరించిన రాజ్యం గాబట్టి రత్నగిరి రాజ్యం అయింది.

రత్నగిరి కొండ పైన కోటలు పేటలతో దుర్గం వుంది. కొండ పైకి చక్కటి రాచబాటలతో బాటు విశాలమైన మెట్ల దారి కూడ వుంది. ఈ నగరానికి అనేక రహదారులలతో బాటు పెద్ద ఓడ రేవు కూడా వుంది. దాంతో రత్నగిరి పెద్ద వ్యాపార కూడలి కూడా. రేవులో ఎప్పుడూ దేశ విదేశ నౌకలు అనేకం వచ్చి పోతూంటాయి.

ఆనాటికింకా మనుషులు పొడగరులే.

పురుషుల సరాసరి ఎత్తు ఏడు నుంచి ఏడున్నర అడుగులు. స్త్రీ సరాసరి ఎత్తు ఆరు నుంచి ఆరున్నరడుగులు. నాటి ప్రజంతా శ్రమ జీవులు. సంపూర్ణ ఆరోగ్యంతో సుఖ శాంతులతో జీవించేవారు. వారి ప్రధాన వృత్తులు వ్యాపారం, వ్యవసాయం, చేపల వేట, పశు సంపద, కుల వృత్తులు. ఆ రోజుల్లో పశ్చిమ సముద్రాన్ని (అరేబియా సముద్రం) రత్నదధి అని పిలిచేవారు. రత్నగిరి కొండకు ఆ పేరు రావటానికి కూడా సమీప సముద్రంలో రత్నాలు లభించటమే కారణం. దక్షిణ సముద్రాన్ని (హిందూ మహా సముద్రం) రత్నాకర దధియని, తూర్పు సముద్రాన్ని (బంగాళాఖాతం) మహోదధియని వ్యవహరించేవారు.

ఇక సరిహద్దుల విషయానికొస్తే`

ఈ రత్నగిరి రాజ్యానికి సుదీర్ఘమైన పశ్చిమ సముద్ర తీరం సరిహద్దుగా వుంది. ఉత్తరాన నర్మదా నది వరకు విస్తరించి వుంది. దక్షిణాన కుంతల రాజ్యం (కర్నాటక) సరిహద్దు. ఇక తూర్పు దక్షిణ దిశలో త్రిలింగదేశం (తెలుగు) తూర్పున విదర్భ (పూర్వ భీష్మకుని రాజ్యం. రుక్మిణీదేవి పుట్టిన రాజ్యం), ఇక ఉత్తర ఈశాన్యంగా మాళవ రాజ్యం సరిహద్దుగా గల విశాల రాజ్యం రత్నగిరి.

అప్పట్లో రత్నగిరితో బాటు, హస్తిన, మగధ, కోసల, కౌశాంబి, కాంభోజ, గాంధార, అయోధ్య, మత్స్య, ద్వారక, మధుర, పాంచాల, సాళ్వ, విదేహ, బాహ్లీక, చేది, శూరసేన, అంగ, వంగ, కళింగ, కరూష్ట, కాంచి, పాండ్య, కాశీ, కుంతల, అమర కటకం, బ్రహ్మదేశం(బర్మా) మొదలయిన చిన్న పెద్ద అనేక రాజ్యాలుండేవి.

వీటిలో రత్నగిరితో బాటు ద్వారక, కోస, కాశీ, అయోధ్య, మధుర, మగధ, కౌశాంబి, కాంచిపుర రాజ్యాలు సంపన్న రాజ్యాలుగా పేరు పొందాయి. ఈ రాజ్యాలతో వర్తక వ్యాపారాలకు దేశవిదేశీ వర్తకులు అధిక ఆసక్తి చూపేవారు. అలనాటి ధర్మరాజు ప్రభువుల సుపరిపాలనను తలపింపజేస్తూ ధర్మాతేజుడు రాజ్యాన్ని సుభిక్షంగా పరిపాలిస్తున్నాడు.

సరిగ్గా ఈ తరుణంలోనే రత్నగిరి కోటలో ఓ విషాదం. ప్రభువు ధర్మతేజకు ఓ కష్టం ఏర్పడింది. సరిగ్గా అప్పుడే ఆ క్షత్రియ వీరుడు రత్నగిరి నగరం వదిలి బయలుదేరాడు. తను ఎందుకు బయలుదేరాడో అతడికి తెలుసు. కాని ఎక్కడికి వెళ్ళాలో తెలీదు. అది తెలుసుకునే ప్రయత్నంలోనే అడవి బాట పట్టాడు. ఒక విధంగా ఇది అతనికి గమ్యం తెలిని ప్రయాణమే. అడవి బాటన ప్రయాణం సాగిస్తున్న ఆ వీర యువకుడి అశ్వం క్రమంగా రెండో కొండ పైకి కూడా చేరుకుంది. దారిలో ఎక్కడా ఒకింత విశ్రాంతికి అనువైన చోటు కన్పించ లేదు. అశ్వాన్ని సరిగ్గా కొండ మీద బాట మధ్య నిలిపి సొరకాయలోని కొంచెం నీరు తాగాడు. చల్లని నీటితో ముఖాన చెమట కడుక్కుని పైతుండులో ముఖం తుడుచుకుంటూ ఓసారి చుట్టూ పరికించాడు.

కనుచూపు మేర ఎగువన కొండ దిగువకు పోతున్న బాట నిర్మానుష్యంగా వుంది. వెనక వైపున అర్ధజాము క్రితం తనకు ఎదురు పడిన బిడారు గుంపు (వర్తక సముహం) అటు పక్క ఏటవాలుగా బాట వెంట దిగువ కొండవపైకి తమ వాహనాలు, సరుకులతో సాగిపోతూ చీమలబారులా కన్పిస్తున్నారు. సుదూర ప్రాంతం వరకూ ఎటు చూసినా కీకారణ్యం. పశ్చిమాన దూరంగా మైదాన ప్రాంతంలో పైకి లేస్తున్న పొగను బట్టి అక్కడేదో అటవిక గూడెం వుందని వూహించాడు.

ఎక్కడోచోట ఒకింత విశ్రమించే ఉద్దేశంతో అశ్వాన్ని వృక్ష ఛాయల్లోకి అదిలించబోతూ చివరి క్షణంలో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. చుట్టూ వృక్షశాఖల మీద విశ్రాంతిగా వున్న పక్షి సమూహాన్ని గగ్గోలుగా ఒకేసారి గాల్లోకి లేచి కకావికలై తలో దిశగా ఎగిరి పోతున్నాయి. ఆ దృశ్యం చూడగానే యువకుడి ముఖంలో ఆశ్చర్యం పొడ చూపింది.

సందేహం లేదు. చెట్ల మాటుగా ఎవరో వస్తున్నారు. ఎవరది? మనుషులా..? మృగాలా...? శత్రువులా...? ఏమీ అర్థం గావటం లేదు. నింగికెగసిన పక్షులు ఆ ప్రాంతం లోనే చక్కెర్లు కొడుతూ ఇంకా అరుస్తూనే వున్నాయి. గాలి మరింత వేడెక్కుతున్నట్టుంది.

ఏం జరుగుతోందక్కడ!

నిశితంగా గమనిస్తున్నాడు.

ఇంతలో ఒక కొమ్ము బూర శబ్దం బిగ్గరగా విన వచ్చింది. దాన్ని అనుసరించి భేరీనాదం ఒకటి లయ బద్ధంగా మ్రోగటం ఆరంభించింది. ఆ శబ్దాలకు మరింత విభ్రాంతి చెందాడా యువకుడు. ఆ శబ్దాలకు యుద్ధానుభవం గల అతడి పవనాశ్వం బిగ్గరగా సకిలించి కదం తొక్కనారంభించింది.

భేరీనాదం, కొమ్ము బూర ఇవి రెండూ యుద్ధ సంకేతాలు. ఇంత నిశ్శబ్దంగా ఇంతటి అకస్మాత్తుగా ఇప్పటికిప్పుడు యుద్ధానికి తలపడుతున్న ఇరువర్గాలు ఎవరు? ఆటవిక తండాలేవైనా యుద్ధానికి సన్నద్ధమయ్యాయా? తనకు తెలీకుండానే యుద్ధక్షేత్రంలోకి ప్రవేశించాడా? ప్రమాదాన్ని ఎదుర్కోబోతున్నాడా? పరిసరాల్ని నిశితంగా గమనిస్తూ పరిపరి విధాలా యోచిస్తున్న ఆ యోధ యువకునిలో ఎన్నో సందేహాలు. మరెన్నో అనుమానాలు. అప్రయత్నంగానే అతడి కుడిచేయి ఖడ్గం పిడి మీద పడి బిగుసుకుంది.

ఇంతలో పరిసర పొదు చెట్ల మాటు నుండి విచిత్రమైన దుస్తులు, ఆభరణాలు ధరించిన ఆటవికులు ఆయుధాలు ఎక్కుపెట్టి బయటికి రావడం కన్పించింది. చూస్తుండగానే సుమారు వంద మంది సాయుధులైన ఆటవికులు వృత్తాకారంలో అతడ్ని చట్టు ముట్టి ఎడంగా నిలబడ్డారు. అప్పటిగ్గాని ఆ యుద్ధ సన్నాహమంతా తన కోసమేనన్న సంగతి ఆ యువకునికి అర్థం కాలేదు. అర్థంకాగానే ఒకింత ఆశ్చర్య సంభ్రమాలకు లోనయ్యాడు. ఎందుకంటే వాళ్ళంతా శత్రు సైనికులు కారు, ఆటవికులు. అందునా నాగాలు. రత్నగిరి అడవుల్లో ఎక్కడా నాగాలు నివశిస్తున్నట్టుగా ఇంత వరకు తను వినలేదు. అదే అతని ఆశ్చర్యానికి కారణం.

వీళ్ళంతా ఎక్కడి నుంచి వచ్చారు? ఎందుకొచ్చారు? తనను చుట్టుముట్టడంతో వీళ్ళ ఉద్దేశం ఏమిటి? ఇలాంటి నాగా తెగ ఆటవిక జాతులు కొన్ని వింధ్యా పర్వతాల పైన అవతల ఎక్కడో ఉత్తర భూములన్దు (నాగాలాండ్) నివశిస్తారని విన్నాడు. అలాంటి జాతికి ఈ దక్షిణ అడవుల్లో ఏం పని?

ఇదే విషయాన్ని తీవ్రంగా ఆలోచిస్తున్నాడా యువకుడు. అశ్వాన్ని ఉన్న చోటే తిప్పుతూ వాళ్ళని నిశితంగా గమనిస్తున్నాడు. చూస్తుంటే తన అంచనా సరైనదేననిపించింది. వాళ్ళంతా నడుంకి జింక చర్మాలు ఆచ్ఛాదనగా ధరించారు. ఛాతీకి అడ్డంగా సర్ప కుబుసం వేసుకున్నారు. కాళ్ళకు వెండి తోడాలు, మెడలో కర్ణాభరణాలుగా వెండి ఆభరణాలు ధరించారు. ముఖ్యంగా పడగ విప్పిన వెండి నాగాభరణాన్ని తల మీద కిరీటంలా ధరించారు.

విచిత్రమైన విషయం, వాళ్ళు యుద్ధభేరీ మోగిస్తూ తన మీద యుద్ధం ప్రకటిస్తున్నారు. ఆయుధాలు ఎక్కుపెట్టి యుద్ధ సన్నద్ధులై వున్నారు. కాని యుద్ధం ఆరంభించటం లేదు. దాడికి సిద్ధంగా వున్నారు. కాని దాడి చేయటం లేదు. అంతా ఏక కాలంలో కుడిపాదాన్ని నేలకు తాటిస్తున్నారు. దాంతో వెండి తోడాలు లయబద్ధంగా శబ్దం చేస్తూ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి. తననే నిశితంగా చూస్తూ పాము బుస కొడుతున్నట్టు విచిత్రమైన శబ్దం చేస్తున్నారు.

తనకు యాభై ధనువుల దూరంలో వలయాకారంలో చుట్టి వున్న ఆ నాగాలు ఇంత హడావుడి చేస్తున్నారు గాని ఒక్కడూ తన వైపు కదిలి ముందుకు రావడం లేదు. ఇంతకీ యుద్ధం వాళ్ళు ఆరంభిస్తారా లేక తను మొదలు పెట్టాలా? కలబడని శత్రువు మీదకు తెగబడటం న్యాయసమ్మతం కాదు గదా! ఏం చేయాలి? ఆ వీర యువకునికేమీ అర్థంగావటం లేదు. లిప్తలు... ఘడియలు కరిగిపోతున్నాయి గాని పరిస్థితిలో మార్పు లేదు.

ఇప్పుడు తనేం చేయాలి?

అశ్వాన్ని అదిలించి వాళ్ళని దాటి తన దారిన వెళ్ళి పోవటమా? లేక వీళ్ళ సంగతేమిటో తేల్చుకోవడానికి తలపడి అంతు చూడ్డమా? ఏం చేయాలి? ఓ పక్క ఎండ మాడ్చేస్తుంది, మరో పక్క వడగాలి. నాలుక పిడచ గట్టుకు పోతోంది. చెమటలతో దుస్తులు తడిసిపోతున్నాయి. దీనికి తోడు, జరగని యుద్ధానికి ఆర్భాటం ఎక్కువన్నట్టు కొమ్ముబూర భేరీనాదాల శబ్దాలు మరింత చికాకును, కోపాన్ని కలిగించాయి.

వీళ్ళ వ్యవహారం ఏమిటో తేల్చుకోకుండా ముందుకు సాగటం మంచిది కాదనిపించింది. వెంటనే విల్లు అందుకుని రెండు బాణాలు సంధించాడు. అది చూసి గొల్లున అరుస్తూ ఆయుధాలు ఎత్తారు నాగా వీరులు. వాళ్ళ ఆర్భాటాన్ని పట్టించుకోకుండా రెండు

బాణాలను ఏకకాలంలో ప్రయోగించాడు.

ఝూంకారం చేస్తూ గాలిని చీల్చుకెళ్ళిన బాణాల్లో ఒకటి సూటిగా కొమ్ము బూరను తాకి రెండు ముక్కలు చేసింది. రెండో బాణం భేరీని తాకి ధ్వంసం చేసింది. అంతవరకు వాటిని ఏకధాటిగా వాయిస్తున్న నాగాలు యిద్దరూ భయంతో ఎగిరి వెనక్కి దూకారు. మరో రెండు బాణాలు అందుకున్నాడా వీరుడు. ఇంతలో ఒక బలిష్టమైన కంచర గాడిద పొదలను విరుగదోసుకొంటూ ముందుకు రావడం కన్పించింది. దాని మీద వయసు మళ్ళిన వృద్ధ నాగా నాయకుడు ఒకడు కూచునున్నాడు. అతడు అశ్వం మీది వీరుడ్ని శాంతించమన్నట్టు రెండు చేతులతో సైగ చేస్తూ నాగా భాషలో ఏదో అరుస్తున్నాడు. అతడ్ని చూడగానే బాణాలు ప్రయోగించే ఉద్దేశం విరమించుకున్నాడు అశ్విక వీరుడు. తనను సమీపిస్తున్న కంచర గాడిదను, ఆ నాగా నాయకుడ్ని నిశితంగా చూడసాగాడు.

*******************************************************

సరిగా అక్కడికి చాలా దూరంలో దిగువన మరో చిన్న కొండ వుంది. అంత క్రితమే బిడారు గుంపు ఒకటి ఆ కొండ పైకి చేరుకుంది. అప్పటికి భోజన సమయం మించటంతో వాళ్ళంతా కొండ పైకి చేరుకోగానే చెట్ల నీడన తాత్కాలికంగా మజిలీ చేసారు.

ఈ బిడారు గుంపు నెల రోజులు కిందట మాళవ రాజ్య రాజధాని అవంతీ నగరం (ఉజ్జయిని) నుండి సుమారు ఏడు వందల మంది వర్తకులు వారి సరుకులు, వాహనాలు, నౌకర్లతో బయలుదేరింది. మార్గంలో వివిధ నగరాలు, పట్టణాల్లో వ్యాపారం కోసం ఆగిన వాళ్ళు ఆగిపోగా, అక్కడ బిడారులో చేరిన వర్తకులు చేరి వస్తుండగా ఇప్పటికింకా సుమారు రెండు వందల మంది వర్తకులు వారి సరుకులతో కూడిన బండ్లు, నౌకర్లు ఆ గుంపులో వున్నారు. వీళ్ళంతా రత్నగిరి నగరం చేరగానే ప్రయాణం ముగుస్తుంది. రత్నగిరి నుండి ఓడలో ప్రయాణం చేయాల్సిన వర్తకులు కూడ వారిలో వున్నారు.

బిడారు గుంపు బయలుదేరి ప్రయాణం చేస్తోందంటే చిన్న వూరే బయలుదేరి తరలిపోతున్నట్టుంటుంది. ఈ వర్తకులు సమూహమంతా బిడారు రక్షణ వ్యవహారం చూసే బిడారు నాయకుని ఆధీనంలో వుంటుంది. ఈ నాయకుడు ఆయా మార్గాల్లో ఎంతో అనుభవం నిండిన వాడై వుంటాడు. అతడి చేతికింద యుద్ధ విద్యలు తెలిసిన సుశిక్షితులైన మనుషులు అశ్వాల మీద ఆయుధాలతో అనుసరిస్తూ బిడారు రక్షణ బాధ్యత నిర్వర్తిస్తూంటారు.

అడవి మార్గాల్లో దోపిడి దొంగలు, బందిపోటు దొంగల నుండి కాపాడుతారు. కౄరమృగాల్ని తరిమేందుకు అవసరమైన డోలు వాద్యాలు, డప్పు, బాణాసంచా కూడా వెంట వుంటాయి. మార్గంలో ఎక్కడ మజిలీ చేయాలి, ఎక్కడ వాగు వంక దాటాలి, ఏ

మార్గం సురక్షితంగా వుంటుందనే విషయాలు బిడారు నాయకునికి క్షుణ్ణంగా తెలిసి వుంటాయి.

నాయకుడు ఎప్పుడూ ధైర్యసాహసాలు కలిగి, అనుభవం పండిన వాడై వుంటాడు. ఆ విధంగా వర్తకుల్ని ఒక నగరం నుంచి మరో నగరానికి సురక్షితంగా చేరుస్తున్నందుకు బిడారు నాయకుడు వర్తకుల నుండి రుసుం తీసుకుంటాడు. ప్రయాణంలో వారం రోజుల తర్వాత ఈ బిడారు అవంతికి తిరుగు ప్రయాణమవుతుంది.

బిడారు నాయకుడు తప్పు చేస్తే ఎంత ప్రమాదం జరుగుతుందో నీలోపాఖ్యానంలో ఓ చోట వివరంగా చెప్పబడింది. శని ప్రభావం చేత అడవుల పాలైన నలమహారాజు తనతో బాటు కష్ట పడుతున్న మహారాణి దమయంతి కష్టం చూసి బాధ పడతాడు. తాను వెళ్ళిపోతే తనయినా పుట్టింటికి చేరి సుఖపడుతుందని ఆశ పడతాడు. రాత్రికి రాత్రి ఆమెను నట్టడవిలో వదిలి తన దారిన వెళ్ళిపోతాడు

భర్త జాడ తెలీని దమయంతి దుఖితురాలై చేసేది లేక పుట్టింటికి బయలుదేరుతుంది. దారిలో కన్పించిన ఒక బిడారు గుంపు వెంట తను పుట్టిన రాజ్యానికి నడక సాగిస్తుంది. చాలా పెద్ద బిడారు సమూహం అది. అందులో ఎందరో వర్తక వ్యాపారులతో బాటు తీర్థయాత్రీకు, బిచ్చగాళ్ళు ఇంకా ఇతర పను మీద వూళ్ళకు వెళ్తున్న వాళ్ళు యిలా ఎందరో తమ స్వస్థలాలు వదిలి బిడారుతో ప్రయాణం చేస్తున్నారు.

ఒక రాత్రి వారంతా ఒక లోయ ప్రాంతంలో మజిలీ చేసారు. అయితే అర్ధరాత్రి ఏనుగుల సమూహం నీళ్ళ కోసం మడుగు వైపు పోతూ అటుగా వచ్చి బిడారు మజిలీ మీద పడ్డాయి. బిడారు నాయకుని అవగాహనారాహిత్యమే ఆ బిడారు పాలిట శాపమైంది. అది ఏనుగుల రాకపోకలు సాగించే దారి. చీకట్లలో ఒక్కసారిగా గగ్గోలు చెలరేగింది. బెదిరిన ఏనుగు గుంపు బిడారు మజిలీని ధ్వంసం చేసాయి. దొరికిన వాళ్ళని కాళ్ళతో తొక్కి తొండంతో కొట్టి చంపేసాయి.

ఏనుగు కోపానికి బిడారంతా సర్వనాశనమైపోయింది. ఎందరో చనిపోగా, కొందరు పారిపోయారు. విలువైన సరకు, బండ్లు ధ్వంసమయ్యాయి. ఎలాగో ఆ భయంకరమైన విపత్తు నుండి బయట పడిన దమయంతి అష్టకష్టాలు పడి చివరకు పుట్టింటికి చేరుతుంది. బిడారు నాయకుడు అసమర్థుడైతే ఎంత నష్టం జరుగుతుందో చక్కగా వివరించిన సంఘటన యిది.

బిడారులంటేనే వర్తక సమూహం.

దేశ విదేశాలతో బాటు ఖండాంతరాల వరకు భూమార్గం గుండా, జలమార్గం వెంట ధనార్జనే ధ్యేయంగా ఎండనక వాననక సుదూర ప్రాంతాల వరకు వెళ్ళి వచ్చే అనాటి వర్తకులే భారత ఖండం ఔన్నత్యాన్ని దిశదిశలా వ్యాపింపజేసారు. వారి వల్లనే భారత ఖండం ఒక ఆధ్యాత్మిక కేంద్రమని, రాజ్యాలు సర్వతోముఖంగా అభివృద్ధి చెందిన ధనవంతమైనవని విదేశీయుకు తెలిసింది. అనేక సాహస గాధ ప్రచారానికి కూడా వారే కారణం.

విశ్వ విజేత అలెగ్జాండర్ గ్రీసు దేశం నుండి ఉత్తర భారతం వరకు జయించుకొచ్చినా, గజనీ మహమ్మదు పదిహేడుసార్లు దండెత్తి వచ్చి సోమనాధ ఆలయ సంపదలను దోచుకెళ్ళినా, పామీరు పీఠభూమి నుంచి బాబర్ అనే మంగోలియన్ ఇండియాకు దండెత్తి వచ్చి షర్షాను ఓడించి హస్తిన సింహాసనం ఎక్కి మొగలాయి రాజ్యం స్థాపించినా, ఇలా భారత భూమి తరచూ విదేశీయుల దండయాత్రకు గురికావటానికి కారణం నాటి దేశవిదేశీ వ్యాపారుల మూలంగా కథలు కథలుగా ఇక్కడి సుసంపన్నమైన రాజ్యాల గురించి వినటమే.



ప్రస్తుతం కొండపైన తాత్కాలికంగా మజిలీ చేసిన బిడారు నాయకుని పేరు భల్లాతకుడు. అవంతీ నగరానికి చెందినవాడు. యాభై సంవత్సరాల వయసు. ఏడడుగు ఎత్తున బలిష్టంగా పోతపోసిన నల్లనిని విగ్రహంలా వుంటాడు. చింపిరి జుత్తు, గుబురు గడ్డం, మధిర సేవించటంతో ఎర్రబారిన కళ్ళతో చూడ్డానికి రాక్షసుడ్ని తలపిస్తాడు. కాని వ్యక్తిగతంగా మనిషి చాలా మంచివాడు. విడిగా బాట సమీపంలో చెట్ల నీడన నులక మంచం మీద విశ్రమించాడు.

ఆ కాలంలో నాలుగు విధాలయిన ప్రయాణ మార్గాలుండేవి. అవి ఒకటి భూమార్గం, రెండు జలమార్గం, మూడు శంకు మార్గం, నాలుగు ఆకాశ మార్గం లేదా వాయు మార్గం.

వీటిలో భూ మార్గం, జల మార్గం అందరికి తెలిసినవే. మూడవదైన శంకుపథం అంటే అతి ప్రమాద కరమైన పర్వత సానువుల వెంట ప్రయాణం. చాలా దుర్గమమైన మార్గాలవి. ఇక నాలుగవదైన వాయు మార్గం విచిత్రమైంది.

ప్రయాణ సౌకర్యం లేని పెద్ద నదుల్ని సువిశాలమైన సముద్రపు కయ్యల్ని, నడవడానికి అవకాశం లేని భయంకరమైన లోయ ప్రాంతాల్ని దాటవలసినప్పుడు ఈ వాయు మార్గాన్ని ఎంచుకొనే వారు.

ఆ కాలంలో గండభేరుండ పక్షులనీ, రాక్షస రాబందులనీ యిలా పెద్ద పెద్ద పక్షి జాతులుండేవి. అవి గగన మార్గంలో ఆహారాన్ని వెదుక్కొంటూ నదులు, కొండలు లోయల్ని దాటి తిరుగుతూ వుంటాయి. ఆ ప్రాంతాన్ని దాటవలసి వచ్చిన మనిషి అప్పుడే చంపిన అడవి గొర్రె, దుప్పిలాంటి ఏదో ఒక జంతువు చర్మాన్ని వలిచి దాన్ని కప్పుకొని కొండ మీద పడుకునే వారు.

అటుగా వచ్చిన రాక్షస పక్షి అదేదో చచ్చిన జంతువనుకొని దాన్ని బలమైన తన గోళ్ళతో పట్టి ఎత్తుకు పోతుంది. అది లోయను లేదా కయ్యను దాటి ఆకాశంలో ప్రయాణం చేస్తూ అవతలి ప్రాంతంలోకి తన గూటికి చేరి పక్షులకి ఆహారంగా వేసేవి. ప్రయాణించిన సాహసికుడు జంతు చర్మాన్ని వాటికి వదిలి పక్షి కంట పడకుండా గూటిలోంచి తప్పించుకొని తన దారిన వెళ్ళేవాడు.

నుగురైదుగురు ప్రయాణించవలసి వచ్చినప్పుడు ఇదే విధంగా మిగిలిన వాళ్ళు కూడా వచ్చే వరకు వేచి వుండి తర్వాత తమ ఆయుధాలతో గుంపుగా సాగిపోయే వారు. ఇలా శంకు పథం గాని వాయు పథం గాని రెండూ ఎంతో సాహస వంతులుగాని చేయలేరు. ఒక్కోసారి ప్రాణాలు పోయే అవకాశం వుంటుంది.

ప్రస్తుతం బిడారు నాయకుడైన భల్లాతకుడికి ఈ నాలుగు పథాలు అనుభవమే. గతంలో ఎన్నో సాహసాలు చేస్తూ సుదూర ప్రాంతాల

వరకు ప్రయాణం చేసిన అనుభవం అతడిది. ఒకసారి ఇలాగే బ్రహ్మదేశం (బర్మా) ప్రయాణం చేస్తూ బ్రహ్మ పుత్రా నదిని దాట వలసి వచ్చి వాయు పథంలో వెళ్ళాడు. ఆ పక్షి గూటికి చేరే లోపలే దాని కాళ్ళ నుండి పట్టు తప్పి జారి భూమికి నూరు ధనువుల ఎత్తు నుండి కింద పడ్డాడు. అప్పట్లో చని పోవలసిన వాడు అదృష్టవశాత్తూ ఒక ఎత్తయిన వట వృక్ష శాఖల మీద పడ్డంతో బ్రతికి పోయాడు.

అప్పుడు ఎడం కాలికి తగిలిన దెబ్బ మూలంగా ఇప్పటికీ ఓ కాలు ఎత్తెత్తి వేస్తూ నడుస్తూంటాడు. అతడి అశ్వం బలిష్టమైంది కావటం చేత ఎంత దూరమైనా సునాయాసంగా అతడ్ని తీసుకు పోతూంటుంది.

వృక్ష ఛాయలో నులక మంచం మీద విశ్రమించిన భల్లాతకుడికి సేవకుడొకడు జొన్న రొట్టెలు, పట్టు తేనె ఆహారంగా అందించాడు. నులక మంచం మీద లేచి కూచుని జొన్న రొట్టెల్ని తేనెలో ముంచుకుని తిన సాగాడు భల్లాతకుడు.

వర్తకులు, సేవకులు, భల్లాతకుడి నూటయాభై మంది రక్షకులు, జంతువులు, గుర్రాల అరుపులతో ఆ మజిలీ ప్రాంతమంతా కోలాహలంగా వుంది. అంత రొణగొణ ధ్వనిలో కూడ కొండ దిగువ నుంచి బాట వెంట ఒక అశ్వం వేగంగా వస్తున్న గిట్టల శబ్దాన్ని చెవులు పసి గట్టాయి. భోంచేస్తూనే దృష్టిని అటు సారించాడు భల్లాతకుడు.

*******************************************

ఫెళ్ళున కాస్తున్న మంటుటెండలో`

రత్నగిరి వైపు నుండి కొండ పైకి సాగే బాట వెంట ఎగువన పరుగు తీస్తోందో హయము. దాని గిట్టల వెంట ఎర్రటి ధూళి ఎగసి పడుతోంది. గిట్టల శబ్దం ప్రతిధ్వనిస్తూ చాలా దూరం విన్పిస్తోంది.

అది మచ్చల గుర్రం.

తెలుపు మీద ఎరుపు మచ్చలు కలిగిన బాడబ (ఆడు గుర్రం). సాధారణంగా ఈ జాతి గుర్రాలన్నీ బలిష్టంగా పోతరించి వుంటాయి. కాని ఈ వారువము సన్నగా నాజూగ్గా వేట జాగిలం పోలి బహు చలాకీగా వుంది.

సాధారణ అశ్వాలకన్నా కాస్త పొట్టిగా వుంది. ముఖం కాస్త పొడవుగా వుండి, ముక్కు రంధ్రాలు పెద్దవి. మెడ మీది జూలు నల్లగా ఒత్తుగా వుంది. తోక మాత్రం తెల్లగా పొడవుగా కుచ్చులా వుంది. కళ్ళు పెద్దగా వుండి విచిత్రం గాను, ఆకర్షణీయం గాను వుందా హయము. చెవులు సూదుల్లా నిక్క బొడుచుకొనున్నాయి.

అది ఏ జాతి గుర్రమో అంచనా వేయటం కష్టమే గాని దాని పరుగు చూస్తే మాత్రం ముక్కున వేలేసుకొని ఆశ్చర్య పోవలసిందే. కొండ ఎక్కేప్పుడు కూడ కాస్తయినా వేగం మందగించకుండా రొప్పుతూనే నాలుగు కాళ్ళమీద ఎగబడి దౌడు తీస్తోంది.

అటు వంటి చక్కని అశ్వం మీద ఒక లేబ్రాయపు యువకుడు ప్రయాణం చేస్తున్నాడు. సుమారు ఆరున్నర అడుగుల పొడవుంటే చినవాడు, పెద్దనిమిదేళ్ళు మించని పసివాడు, నూనూగు మీసాలు కూడా మొలవని ముద్దులొలికే బాలుడు.

ఇప్పుడిప్పుడే యవ్వనంలో అడుగు పెడుతున్న ఆ యువకుని తలమీద నీలిరంగు అందమైన తలపాగా వుంది. దాని తోక వీపు మీదకు జారి వుంది. ఒంటినంటిపెట్టుకునుండేలా తెల్లటి వస్త్రం దట్టీ బిగించి పైన లేత పసుపు వర్ణం అంగీ తొడిగాడు. నడుం నుండి పొడవాటి ఖడ్గం వేలాడుతోంది.

గుర్రం జీనుకు ముందు భాగంలో మంచి నీటితో సొరకాయ బుర్ర వేలాడగా వెనుక భాగంలో రెండు తోలు సంచుల్లో దుస్తులు ఇతర సరంజామా వున్నాయి. కళ్ళాలు బిగిచి అతను అశ్వాన్ని నడుపుతున్న తీరు చూస్తుంటే చాలా చిన్న వయసు నుండే అతడికి గుర్రపు స్వారీలో అభ్యాసం వుందనిపిస్తుంది. ముఖం చంద్ర బింబంలా అద్భుత సౌందర్యంగా వుంది. విశాల నేత్రాలు, చక్కగా తీర్చి దిద్దినట్టు పగడాలవంటి పెదవులు, కొనదేరిన చుబుకం, అద్దాల చెక్కిళ్ళు, శంఖం వంటి మెడ, విశామైన ఛాతీ, సన్నటి నడుం చూస్తుంటే ఆ రూపంలోని అమ్మాయా లేక పసితనం వీడని బాలుడాని సందేహం ఏర్పడక మానదు.

అతడు ఏ పని మీద ఎచటికి ప్రయాణం చేస్తున్నాడో తెలీదు గాని కొండ పైకి చేరక ముందే బిడారు మజిలి చేసిన ప్రాంతం నుండి కోలాహలం గమనించాడు. కొండ పైకి చేరగానే గుర్రం వేగం మందగింప చేస్తూ ముందుకొచ్చాడు.

కొద్ది సేపట్లోనే మచ్చల గుర్రం బిడారు విడిది చేసిన చోటుకి చేరుకుంది. బాట పక్కనే నీడన తీరిగ్గా కూచుని భోం చేస్తున్న భల్లాతకుడ్ని గుర్తించి చెంగున తన అశ్వాన్ని దిగాడా యువకుడు. కళ్ళాలు జీనుకు తగిలించి అశ్వాముఖాన్ని ముద్దాడి భుజం తట్టాడు. ‘‘ఎక్కడికీ వెళ్ళకు ఇప్పుడే వచ్చెద’’ అంటూ అశ్వం చెవిలో చెప్పి నేరుగా భల్లాతకుడి ముందుకి నడిచాడు.

భల్లాతకుడు ఆశ్చర్య సంభ్రమాలతో అతడ్నే చూస్తున్నాడు.

ఎవడీ యువకిశోరం!

రూపం బాలుడిలా వున్నప్పటికీ నడకలో వయ్యారం ఆ సుకుమారం చూస్తుంటే బాలిక అనిపిస్తున్నదే. ఇంతటి కుసుమ కోమలంగా ఆగుపిస్తున్నాడు. మండుటెండలో ఏ కార్యార్థియై ఒంటిగా ఈ మహారణ్యంలో ప్రయాణిస్తున్నాడో గదా. ఇలా చిత్ర విచిత్రములైన అనేక ఆలోచనలు ముట్టడిస్తుండగా భల్లాతకుడు ఆ యువకుడ్నే తదేకంగా చూస్తున్నాడు.

అతడ్ని సమీపిస్తూనే ఆ యువకుడు సవినయంగా నమస్కరించాడు. ‘‘బిడారు అధినాయకులు, అవంతీ పురవాసులగు శ్రీ భల్లాతకులవారికి ప్రణామములు’’ అంటూ చిరునవ్వుతో పలకరించాడు.

ఆ వినయ విధేయతలు భల్లాతకుడ్ని ముగ్ధుడ్ని చేసాయి. ‘‘బాలకా.. ఎవరు నీవు? నిన్నెప్పుడూ చూసిన గుర్తు లేదే. నేన్నీకు తెలుసా?’’ అనడిగాడు సంభ్రమంగా.

‘‘నేను మీకు తెలియక పోవచ్చును బాబాయ్. కాని మీరు సామాన్యులు కాదు గదా. ఈ రత్నగిరి నగరం నుండి అవంతీ పురం వరకు ఈ మార్గంలో మిమ్మల్ని, మీ బిడారును తెలియని వారుందురా? నాకో చిన్న సమాచారం కావాలి. అందుకే మీ దర్శనం కోసం ఆగితి’’ అన్నాడు దరహాసంతో.

ఆ మాటలకు మరీ ముగ్ధుడయ్యాడు భల్లాతకుడు. కాని ఆ గొంతు వింటూ మరోసారి సందేహానికి గురయ్యాడు. ఎందుకంటే, ఆ గొంతు మావి చిగురులు మెక్కి గానం చేస్తున్న ఎలకోయిల గొంతులా మధురంగా వుంది. ఈ వయసుకి ఈ అబ్బాయి గొంతు పురుష స్వరంలా మారాలి. కాని అలా మార లేదంటే తన సందేహం నిజం కాదు గదా! తను పొరబడుతున్నాడా లేక` ఇతడు అబ్బాయి కాదు, అమ్మాయేనా? తాత్కాలికంగా తన సందేహాన్ని పక్కన పెట్టి`

‘‘ఇంతకీ నీ నామ దేయం ఏమిట్రా అబ్బాయ్. బాబాయ్ అంటూ వరస కలిపి మరీ దగ్గరయ్యావ్. రా.. యిలా కూచో’’ అంటూ ఎదురుగా తిన్నె చూపించాడు.

"లేదు బాబాయ్... నేను వెళ్ళాలి..."

"వెళ్ళొచ్చునులే. నీ నామధేయం ఏమి?"

"అపర్ణుడు"

"అపర్ణుడా?"

"అవును అపర్ణుడే. ఏమా సందేహము?"

"ఏం లేదు గాని పర్ణం అంటే పత్రము. ఆకు అని గదా అర్థము. అపర్ణము అనగా ఆకు కానిది అని గదా. నీవు ఆకు గాకున్న వేరేమి?" అంటూ ఛలోక్తిగా అడిగాడు భల్లాతకుడు.

ఆ మాటలకు ఫక్కున నవ్వాడు అపర్ణుడు. అతడి నవ్వు ముఖం చూస్తుంటే మరింత అందంగా వున్నాడనిపించింది భల్లాతకుడికి.

"బాబాయ్... అపర్ణ అంటే అమ్మవారు పార్వతీ దేవికి గల పేర్లలో ఒకటి. ఆ పేరు ఎలా వచ్చిందన్నది పక్కన పెడితే వృక్షం యొక్క ప్రధాన అంగాల్లో పత్రం ఒకటి... అవునా?" అనడిగాడు.

"అవును.. అయితే?" ఆసక్తిగా అడిగాడు భల్లాతకుడు.

"చెట్టుకు పుట్టినది ఆకులు మాత్రమేనా... ఇంకేమీ లేవా?"

“లేకేమి? పూత, పూలు, పిందె, కాయలు, పండ్లు....”

“అవును గదా. నేను అపర్ణుడను. ఆకును కానంటే మిగిలిన వాటిలో ఏదో ఒకటనే అర్థం వుంది గదా?”

“అవునవును వుంది.” అంటూ పెద్ద పెట్టున నవ్వాడు భల్లాతకుడు.

“భలే చెప్పావ్ అబ్బాయ్. నువ్వు పత్రం కాదు అంటే పనస పండులా వున్నావ్. నిన్ను పండు అని పిలవచ్చు.” అంటూ మళ్ళీ నవ్వాడు. అపర్ణుడు కూడా నవ్వాడు.

“నీలో అందమే కాదు, అద్భుత వాక్చాతుర్యం, తెలివితేటలు కన్పిస్తున్నాయి. నీ రాక మాకు చాలా సంతోషం” అన్నాడు నవ్వాపుకొంటూ. ఇంకా తనే`

“చూడు అపర్ణుడా! అతిధి దేవోభవ అన్నారు పెద్దలు. భోజనం వేళకొచ్చిన నువ్వు మా అతిధివయ్యావు. ముందు భోంచేస్తే తర్వాత మాట్లాడుకుందాం. ఆ పక్క మంచినీటి చెలమ వుంది, వెళ్ళి ముఖం కరచరణాలు ప్రక్షాళనం చేసుకొని రా. ఉష్ణ తాపం ఉపశమిస్తుంది వెళ్ళిరా.” అన్నాడు.

అతడి మాట కాదనలేక నీటి చెలమ వద్దకెళ్ళి ముఖం, కాళ్ళు, చేతులు కడుక్కుని వచ్చాడు అపర్ణుడు. అతను తిరిగి వచ్చే సరికి ఆకులో నాలుగు జొన్నరొట్టెలు, దొన్నెలో పట్టు తేనె సిద్ధంగా వున్నాయి. అతడి మచ్చల గుర్రానికి దాణా యివ్వబడింది.

అపర్ణుడు తిరిగ్గా జొన్నరొట్టెలు తినసాగాడు.

“ఇప్పుడు చెప్పవయ్యా. నన్నేదో అడగాలన్నావ్ అడుగు.” భోజనం ముగించిన భల్లాతకుడు చేయి కడుక్కుని వచ్చి కూచుంటూ అడిగాడు.

“ఏం లేదు బాబాయ్. మీరు వచ్చే దారిలో తెల్లటి పవనాశ్వం మీద ఎవరైనా యోధుడు ఎదురయ్యాడా? ఎంత దూరంలో

కన్పించాడో చెప్పండి.'' అన్నాడు అపర్ణుడు.

భల్లాతకుడి కనుబొమలు విశాలమయ్యాయి ఆ మాటలకి. ఆశ్చర్యంగా అపర్ణుడ్ని చూసాడు.

''నువ్వడుగుతున్నది రత్నగిరి యువరాజు ధనుంజయుల వారి గురించి కాదు గదా?'' అన్నాడు.

''కాక పోవటమేమి... వారి గురించే అడుగుచున్నాను. వారిని ఎరుగుదువా?''

''ఆహాఁ... పరిచయ భాగ్యం లేదు గాని రత్నగిరి వచ్చిన కొన్ని సందర్భాలలో వారిని చూచినానులే. ఇంతకూ వారితో నీకేమి పని?''

''నేను ధనుంజయులవారి మిత్రుడను. ఆయన కన్పించినాడా లేదా?''

''సందేహమేల? కన్పించాడు. అర్ధ జాము క్రితం అదో, ఆ ఎగువ కొండకు పోవు మార్గమున మాకు అశ్వము మీద పోతూ ఎదురైనాడు. నీ మచ్చల గుర్రం యువరాజా వారి శ్వేతాశ్వాన్ని ఈ రోజుకు చేరుట దుర్లభమే.''

భోజనం ముగించి చేయి కడుక్కున్న అపర్ణుడు భల్లాతకుడితో ఏదో చెప్పబోతూ ఆగి, చెవులు రిక్కించాడు. ఎక్కడో దూరం నుంచి భూకంపం వచ్చినట్టు, పిడుగులు వర్షిస్తున్నట్టుగా అనేక అశ్వాలు ఏకకాలంలో దౌడు తీసి వస్తున్నట్టుగా కర్ణాకర్ణిగా విన వచ్చిందో శబ్దం. అది వినగానే అపర్ణుడి ముఖం గంభీరంగా మారి పోయింది. అది గమనించాడు భల్లాతకుడు. లేచి దగ్గరకొస్తూ ` ''ఏమైంది?'' అనడిగాడు.

''నా అంచనా సరైనదైతే ఏదో సైనిక పటాలం ఒకటి అశ్వాల మీద ఇటుగా వస్తోంది'' అంటూ వేగిరం బాట మీదకు పోయి, కొండ దిగువకు దృష్టి సారించాడు. అది కొండ పైభాగం గాబట్టి అక్కడి నుంచి చాలా దూరం చూడ గలుగుతున్నారు.

దూరంగా బాట వెంట ఎర్రటి ధూళి మబ్బులా ఎగసి పడుతోంది. సుమారు నూరు మంది సైనికులతో కూడిన అశ్విక దళం ఒకటి

శరవేగంతో దూసుకొస్తోంది. అగ్ర భాగంలోని అశ్వం నుండి ఎత్తుగా వున్న జెండా కొయ్యకు పెద్ద పసుపు రంగు పతాకం రెపరెపలాడుతోంది. అది రత్నగిరి రాజ్య పతాక. దాని మధ్యలో ఎరుపు రంగు వజ్రం రాజ చిహ్నంగా ముద్రించి వుంటుంది. సందేహం లేదు, అది రత్నగిరి అశ్విక దళం. అది యువరాజు ధనుంజయుల వారి కోసమే బయలుదేరి వుండాలి.

తీవ్రంగా ఆలోచిస్తున్న అపర్ణుడు చివ్వున తిరిగి చూసే సరికి భల్లాతకుడు పక్క కొచ్చి కన్పించాడు. అతను కూడ ఆశ్చర్య సంభ్రమాలతో ఆ అశ్విక దళాన్నే చూస్తున్నాడు.

''సందేహం లేదు, అది రత్న గిరి అశ్విక దళం. వాళ్ళంతా సైనిక శిబిరాలు వదిలి యుద్ధ సన్నాహాలతో ఇటు వస్తున్నట్టుందే... ఏదన్నా యుద్ధం ఒన గూడినదా? రత్నగిరిపై దాడి జరిపేంత ధైర్యం ఏ రాజ్యానికున్నది?'' తనలో తను అనుకుంటూ, అపర్ణుడిని చూసాడు.

''లేదు లేదు. ఇది యుద్ధ సంరంభం కాదు'' అన్నాడు వెంటనే అపర్ణుడు.

''యుద్ధ సంరంభం కాదా?''

''కాదంటిని గదా. వేరే కారణముండు. నాకు అట్టే సమయము లేదు. నేను బయలుదేరుచున్నాను. బాబాయ్ మీ ఆతిథ్యానికి కృతజ్ఞుడను'' అంటూ మరో మాటకి అవకాశం యివ్వకుండా చెంగున ఎగిరి తన మచ్చలగుర్రాన్నధిరోహించాడు. కళ్ళాలు అందుకోగానే తన యజమాని ఉద్దేశం గ్రహించినట్టు గాలితో పోటీ పడుతూ పరుగు అందుకుందా అశ్వం.

భల్లాతకుడికి ఏమీ అర్థం కాలేదు. అటు వస్తున్న అశ్విక దళాన్ని, ఇటు వెళ్తున్న అపర్ణుడి మచ్చల గుర్రాన్ని మార్చి మార్చి చూస్తు` ''ఇది యుద్ధ సంరంభం కాదా` వేరే కారణముందా? అదేమై వుంటుంది. అదేమిటో చెప్పకుండా వెళ్ళిపోతున్నాడే అపర్ణుడు... నీవు సామాన్యుడవు కాదురా...'' అంటూ అయోమయంగా జుత్తు పీక్కున్నాడు. అప్పటికే మచ్చల గుర్రం బాట వెంట శర వేగంతో కొండ దిగువలో అదృశ్యమైంది.

**********************************************

రత్నగిరి యువరాజులుం గారు... శ్రీ శ్రీ శ్రీ ధనుంజయుల వారికి జయహో జయహో... ప్రణామములు ప్రభూ.''

శ్వేతాశ్వాన్ని సమీపించగానే`

మర్యాద పూర్వకంగా తను అధివశించిన కంచర గాడిదను దిగి సవినయంగా వంగి నమస్కరించాడా నాగా వృద్ధ నాయకుడు. నిశితంగా అతన్నే చూస్తున్నాడు యువరాజు ధనుంజయుడు. ఆ నాగా తీరు కొంచెం కూడ అతనికి అర్థం గావటం లేదు. పోరుకు తెగబడి వచ్చిన వాళ్ళు పోరాడకుండా ఈ రాయబారములేమి?

''మీరంతా నాగాలని, నీవు వీళ్ళ నాయకుడవని అర్థమవుతోంది....'' ధనుంజయుడు ఇంకా ఏదో చెప్పబోతూండగా వృద్ధనాయకుడు అడ్డం వస్తూ`

''అవును ప్రభూ! నేను వీళ్ళకు మాత్రమే నాయకుడను. మా అసలు నాయకుడు వేరే వున్నాడు. ఆయన పేరు నాగకేసరి. నా పేరు నాగనందుడు'' అన్నాడు.

''మంచిది. అయితే నాకు అవగతము గాని విషయం ఒకటే! మా రాజ్య భూభాగంలో ఇంత వరకు మీ ఉనికి మాకు తెలిక పోవుట మా అజాగ్రత్త కావచ్చును. కాని... ఉత్తర ఈశాన్యంలో, కొండ కోనల్లో సుదూరంలో ఎక్కడో వుండాల్సిన మీరు ఇక్కడికెందుకొచ్చారు? నా ప్రయాణమునకు అవరోధము కల్పించ కారణం ఏమి? కదన కుతూహలంతో కాలు దువ్వే నీ మనుషులు పోరు ఆరంభించరేమి? అయిననూ మీకును మాకును గత శత్రుత్వములు ఏమియును లేవు గదా! అసలేమి జరుగుతోందిక్కడ?'' కాస్త స్వరం పెంచి నిలదీస్తున్నట్టుగా అడిగాడు ధనుంజయుడు.

''యువ రాజా వారు క్షమించాలి. తమతో సమరం మా అభిమతం కాదు'' అన్నాడు నాగానందుడు.

''గాకున్న వేరేమి? అనవసర కాల విలంబన దేనికి? మమ్ము నిలువరింప పని యేమి?'' వెంటనే అడిగాడు ధనుంజయుడు.

''తగిన కారణముండు ప్రభు. మీరిలా కారడవులబడి యిడుములు పడుట మా అధినాయకునికి నప్పలేదు. అందుకే మీకో హెచ్చరిక    దించమని మా నాయకుడు నాగకేసరి పంపగా యిలా మీ ముందుకొచ్చినాము యువరాజా. మీతో పోరు

సలుపునంత వారము కాము గాని, సమరమే శరణ్యమన్న అందుకు సిద్ధపడే వచ్చినాము'' అంటూ నర్మ గర్భంగా పలికిన నాగానందుని మాటలు యువరాజు ధనుంజయుని ఆలోచనలో పడేసాయి.

ఎక్కడి నాగా నివాసం, ఎక్కడి రత్నగిరి రాజ్యం. తను తమ కోట విడిచి ఇది రెండో రోజే. ఇంతలోనే ఈ వార్త నాగాలకు ఎలా చేరింది? అంత దూరం నుండి వీళ్ళిచ్చటికి ఎలా రాగలిగారు? నాగ కేసరి తనకు పంపిన హెచ్చరిక సందేశం ఏమై వుంటుంది? తన కదలికల్ని సుదూర ప్రాంతంలో వుండి కూడా నాగాలు ఎప్పటికప్పుడు ఎలా గమనించ గలుగు తున్నారు? ఎంతగా ఆలోచించినా ఒక ప్రశ్నకీ ధనుంజయకు సమాధానం లభించటం లేదు. విషయం ఏమిటో నేరుగా అడిగి తెలుసుకోవటం తప్ప మరో దారి లేదు.

''ఇంతకీ మీ నాయకుని హెచ్చరిక సందేశమేమి?'' సూటిగా విషయాని కొస్తూ అడిగాడు.

నాగానందుడు ఓసారి గొంతును సవరించుకున్నాడు.

''క్షమించండి యువరాజా! నిజానికి ఇది మా నాయకుని హెచ్చరిక కూడ కాదు. అధినాయకుని హెచ్చరిక'' అన్నాడు.

''ఎవరా అధినాయకుడు?'' ముంచుకొస్తున్న కోపాన్ని నిగ్రహించుకొంటూ అడిగాడు. సహనానికీ ఓ హద్దుంటుంది. తన సహనాన్ని పరీక్షిస్తున్నారీ నాగాలు.

''నాగలోకాన్ని పరిపాలించే నాగరాజు ప్రభువులే మా అధినాయకులు'' చెప్పాడు నాగానందుడు.

''నాగరాజా....'' విస్తుపోయాడు ధనుంజయుడు. ''అవును. నాగరాజు... ఫణీంద్రుడు... మహాపద్మడు.. ప్రత్యక్షదైవం. మా నాగాల కులదైవం. మా నాయకుడు నాగకేసరి ఆ స్వామికి పరమ భక్తుడు. ఆ స్వామి హెచ్చరిక సందేశాన్నే మీకు చెప్పమని మమ్మల్ని పంపించారు. మీకెవ్వరికీ లేని నాగ లోక ప్రవేశార్హత మా నాగకేసరి నాయకునికుంది.''

''ఇంతకీ మమ్మల్ని హెచ్చరింప వలసిన అగత్యం మీ నాగరేడు కెందుకొచ్చినది?''

“అది వారికే తెలియాలి ప్రభూ. కాని వారి హెచ్చరిక సారాంశం మాత్రం యిదే ` ఓ రత్నగిరి యువరాజా ధనుంజయా. విధిరాతను అల్ప మానవులు తప్పించ లేరు, తప్పించు కోజాలరు. నాడు అంతటి నీ జేజితాత గారైన పరీక్షిత్తు మహారాజే విధిని తప్పించు కోలేక తక్షకుని మూలంగా మరణించాడు. ఇక నీ తండ్రి ధర్మతేజ మహారాజు ఎంత? ఆలోచించు. వృధా ప్రయాస వలదు.

నీ లక్ష్యాన్ని విడిచి కోటకు మరలి పొమ్ము. నిరర్ధకమగు నీ లక్ష్యం కోసం నీ వయసునూ సమయాన్ని వృధా చేసుకోవలదు. ఇక నుండి మీ రాజ్య రక్షణ నీ లక్ష్యంగా వుంచుకో, శుభమవుతుంది. ఈ హెచ్చరిక కాదని ముందుకొస్తే మా ఆగ్రహాన్ని నీవు చవి చూడక తప్పదని గ్రహింపుము. తక్షణం మరలి పొమ్ము.” అంటూ విన్నవించాడు నాగానందుడు.

ఆ హెచ్చరిక యువరాజు ధనుంజయుని అగ్రహోదగ్దుడ్ని చేసింది. వెంటనే కర్ణభేరీలు పగిలి పోతాయా అన్నట్టు ధనుష్టంకారం చేస్తూ అశ్వం పైనుండి ఉరిమి చూసాడు. ఆ చూపుల వేడి తట్టుకోలేక వెంటనే అయిదడుగులు వెనక్కి వేసాడు నాగా వృద్ధనాయకుడు నాగానందుడు.

“అల్ప మానవులా! ఏమా అర్ధ రహిత ప్రేలాపన?” అనరిచాడు ధనుంజయుడు.

“అతల వితల సుతల పాతాళముల గ్రుమ్మారు (నివశించు) మీ నాగ రేడుకి మతి తప్పినదా లేక భూలోక మానవుల చరిత్ర మరిచినాడా! లేక మానవుల పూజలు అందుకొంటూ మత్తెక్కి వదరినాడా. అల్ప మానవులట. ఏమా మాట? అల్ప మానవులు విధిరాతను తప్పించలేరు, తప్పించుకొనజాలరా! మానవులు అంత చులకన అయినారా! క్షత్రీయ రాజై కూడ విధిని వెక్కిరించి, రాజర్షి అయి, బ్రహ్మర్షి అయి సృష్టికి ప్రతి సృష్టి చేసిన మహర్షి విశ్వామిత్రుల వారు మానవులు కారా?

అల్పాయుష్కునిగా పుట్టి, అచంచలమగు తన శివభక్తితో మృత్యువునే జయించి చిరంజీవి అయిన మహర్షి మార్కండేయుల వారు మానవులు కాదా? యముని వెంటాడి వేధించి పతి ప్రాణాములి తెచ్చుకున్న సాధ్వి అనసూయ మానవి కాదా? అంత దేనికి దేవ దానవ యుద్ధంలో స్వర్గం వెళ్ళి మహేంద్రునికి సాయంగా యుద్ధం చేసి దానవుల్ని నిర్జించి ఇంద్రుని అర్ధ సింహాసనం అలంకరించి విజయుడను బిరుదు పొందిన పాండవ మధ్యముడు అర్జునుడు మానవుడు కాదా. ఆయన మీ వంశీకు అల్లుడు కాదా..? మీ వంశాంకురం ఉలూచిని వివాహం చేసుకోలేదా? వారి కొడుకు బభ్రువాహనుని మీరు దత్తత తీసుకున్నది నిజము కాదా? భూలోకమందలి నాగాజాతి ప్రజల మూల పురుషుడు బభ్రువాహనుడని మీకు తెలియదా? ఎవరు అల్పులు. కన్పించగానే కర్ర పుచ్చుకొంటే ఆమడ దూరం పారిపోయే అల్ప సర్పజాతులకు రాజువైన నీకే అంత అహంకారమైతే రత్నగిరి రాజ్య భావి సామ్రాట్టుని మాకెంత అహంకారం వుండాలి? త్వరలోనే మీ నాగలోకం వస్తాను. మానవులు అల్పులు కారు అధికులని నిరూపిస్తాను. నాగ, గరుడ, యక్ష, కిన్నెర, కింపురుష, గంధర్వ, దేవ, భూతాల్లో ఎవరైనా గాని మానవ జాతితో ముడి పడకుండా మనుగడ లేదని మీ నాగరాజుకి నా మాటగా చెప్పు…” అంటూ వీరావేశంతో పలికిన యువరాజు మాటలకి ముగ్ధుడైన నాగనందునికి నోట

కొద్దిసేపు మాట రాలేదు.

“మీ ఆవేశం అర్థం చేసుకోగలను యువరాజా! కాని మేము నిమిత్త మాత్రులం గదా. మీ ఆవేశ పూరిత ప్రసంగం ఖచ్చితంగా మా నాయకుడు నాగకేసరి, అధినాయకుడు నాగరాజు ఫణీంద్రుడు వినే వుంటారు. అయిననూ...” అంటూ ఆపైన చెప్పడానికి ఒకింత సందేహించాడు నాగానందుడు.

“ఊఁ.... అయిననూ.... సందేహమేల. వచింపుము వృద్ధ నాయకా. నన్ను వెను తిరిగి పొమ్మందువా?” ఒకింత పరిహాసంగా అడిగాడు ధనుంజయుడు.

“లేదు యువరాజా! మిమ్మల్ని వెనక్కి పొమ్మను సాహసం చేయను. అలాగని ముందుకూ పోనివ్వ. మావాళ్ళు మిమ్ము వెళ్ళనివ్వరు.” అన్నాడు తన కంచర గాడిద కళ్ళాలు అందుకుంటూ.

తిరిగి అదే సందిగ్ధత.

ఏమిటీ వృద్ధుడి వుద్దేశం?

తనను వెనక్కి పొమ్మనడట. అలాగని ముందుకీ పోనివ్వడట. అంటే పోరుకి సిద్ధ పడినట్టే గదా.


సీరియల్ 3వ భాగం
నాగలోకయాగం
శతాధిక నవలా రచయిత..
వరల్డ్ రికార్డ్ హోల్డర్
మాస్టర్ రైటర్
సూర్యదేవర రామ్మోహన రావు

‘‘సరిసరి ఆలస్యమెందుకు? ఇక పోరు ఆరంభించుటే మంచిది. వదరి పోకుండా మీ నాగాలను ముందుకొచ్చి పోరాడమని ఆదేశించు. కాని యుద్ధం మొదలయ్యాక మీలో ఒక్కడూ ప్రాణాలతో మిగలరని గుర్తుంచుకో.’’ అంటూ హెచ్చరించాడు ధనుంజయుడు.

అప్పటికింకా మండుటెండలో గిరిశిఖరం మీద బాటమీదే నిలబడున్నారంతా. ఉష్ణతాపం అధికరించి అతడి అశ్వం గరుడ కదం లొక్కుతోంది. వడగాల్పు తాకిడికి అడవంతా భయానక నిశ్శబ్ధం ఆవరించి వుంది. గగనతలంలో పక్షి కూడ తిరుగుతున్న జాడ లేదు. కంచర గాడిదను మళ్ళించి వెను తిరిగిన నాగా వృద్ధుడు వెనక్కి చూసి విచిత్రంగా నవ్వాడు.

ఆ నవ్వుకి అర్థం ఏమిటి?’’

అదేమిటో ఆ వృద్ధుడికే తెలియాలి. కాని`

ధనుంజయుడికి ఆ నవ్వు వెక్కిరింపుగా తోచి తీక్షణంగా చూస్తూ` ‘‘యుద్ధం ఆరంభమైతే నీ ముఖంలో ఆ నవ్వు వుండదు వృద్ధ నాయకా. కదం లొక్కే నీ మనుషుల్ని ముందుకు రమ్మని ఆనతివ్వు’’ అంటూ తీక్షణంగా హెచ్చరించాడు.

అప్పుడు కూడ ఆ వృద్ధుని ముఖంలో నవ్వు చెరగలేదు. ‘‘క్షమించాలి యువరాజా! మీకు తెలియని విషయం ఏమంటే` మాలో ఏ ఒక్కర్ని మీరు చంప లేరు. చచ్చినా తిరిగి తిరిగి లేస్తూనే వుంటాం. పోరాడి పోరాడి మీరు అలసిపోవాలి గాని మాకు చావటం, ఓటమి రెండూ వుండవు’’ అన్నాడు.

వృద్ధుడి చిరునవ్వుకి అర్థం ఏమిటో ఇప్పుడు తెలిసింది ధనుంజయకి.

విభ్రాంతుడై కొద్ది క్షణాలు`

అలాగే ఆ నాగా వృద్ధున్ని చూస్తుండి పోయాడు.

ఏమంటున్నాడీ వృద్ధ నాగా? చచ్చినా తిరిగి తిరిగి బ్రతుకుతూంటారా. వీళ్ళకి చావు లేదా? ఇదెలా సంభవం? వీళ్ళేమి పిశాచ జన్మలు కాదుగా? సాధారణ ఆటవిక నాగ తెగ నరులే గదా. వీళ్ళకి చావు ఎందుకుండదు? అదే నిజమైతే పోరాడి పోరాడి తను అలసి పోవాలి గాని వీళ్ళు స్థిరం గానే వుంటారు. ఇక వీళ్ళ ఓటమి చూడకుండా తను ముందుకు పోవుట ఎలా? లేదు లేదు. తనను బెదిరించటానికే ఇతను అబద్ధం చెప్తున్నాడు. హతుడైన మనిషి తిరిగి బ్రతుకుట సాధ్యం కానే కాదు.

‘‘ఓయీ... నీవేం చెపుతున్నావో నీకైనా అర్థమవుతోందా? నాకయితే ఏమీ అర్థం గావటం లేదు. అబద్ధాలతో నన్ను మోసగించ లేవు. యుద్ధం చేస్తారా దారి తొలగుతారా వెంటనే చెప్పుము’’ అనరిచాడు.

వృద్ధుడు ముఖంలో చిరునవ్వు చెరగ లేదు, అలాగే వుంది. చుట్టూ అతడి మనుషులు ఆవేశంతో ఆయుధాలు ఝుళిపించి కదం తొక్కుతూ పాములు బుస కొడుతున్నట్టు హుంకరిస్తూనే వున్నారు. వారి కాళ్ళ తోడాల శబ్దం లయబద్ధంగా మోగుతూనే వుంది. ఒకింత ఆగి పెదవి విప్పాడు వృద్ధ నాగానందుడు.

‘‘నేను అబద్ధం చెప్పుట లేదు యువరాజా. సత్యమే చెప్పినాను. మాకు చావు లేదు. ఎందుకంటే, ఇక్కడ మీకు కన్పిస్తున్న మేమంతా నిజం కాదు, ఇవన్నీ మా ప్రతిరూపాలు’’ అన్నాడు.

ఆ మాటలో ధనుంజయుడు మరింత ఆశ్చర్యానికి గురవుతూ ` ‘‘ప్రతి రూపాలా.....’’ అనరిచాడు.

‘‘అవును. ప్రతి రూపాలమే. మా నిజ శరీరాలు ఇదే విధంగా మా నాగా గూడెంలో మోహరించి వున్నాయి. నీ ప్రతి రూపం మా నిజ శరీరాల మధ్యన వుండగా నీవు ఇక్కడ నిజ శరీరంతో మా మధ్యన వున్నావు. అందుకే నీవు మమ్మల్ని, మేము మిమ్మల్ని చూడగలుగుతున్నాము. నీవు మాతో యుద్ధం చేస్తే మా మాయ శరీరాలు అంతం కావు. మా నిజ శరీరాలు అక్కడ క్షేమం గానే వుంటాయి.’’ చెప్పాడు నాగా వృద్ధుడు.

అప్పటికీ ధనుంజయుడికి ఆ మాటల మీద నమ్మకం కుదరలేదు.

‘‘నేను నమ్మజాల . నీవు చెప్పునది అభూతకల్పన. ధ్వనికి ప్రతిధ్వని వుండొచ్చుగాని దృశ్యానికి ప్రతి దృశ్యం వుండదు’’ అన్నాడు.

‘‘ఉంటుంది యువరాజా. అది సాధ్యమే. మా నాగాలకు మాత్రమే సొంతమైన ఓజో తాంత్రిక విద్య అనే క్షుద్ర విద్య మా సొంతం.’’

‘‘ఓజో తాంత్రిక విద్యా. అలాంటి ఒక క్షుద్ర విద్య ఉన్నట్టు వినలేదు.’’

‘‘ఇప్పుడు వింటున్నారు గదా. వుంది. అక్కడ సుదూర ప్రాంతాల్లోని మా గూడెం మధ్యలో మా నాయకుడు నాగకేసరి ఆధ్వర్యంలో ఈ క్షుద్రపూజ చేసి ఈ ఓజో విద్యను ప్రయోగించటం ద్వారా మా కులపెద్దలు మా ప్రతిరూపాన్ని మీ వద్దకు పంపించారు.’’

‘‘ఇది నిక్కమని నమ్మవచ్చునా?’’

‘‘ముమ్మాటికీ నమ్మవచ్చును యువరాజా’’

‘‘నీ గార్ధభ వాహనం కూడ ప్రతిరూపమేనా?’’

‘‘అవును.’’

‘‘అయినచో నీ గార్ధభాన్ని సంహరించి సంశయనివృత్తి చేసుకొందును.’’ అంటూ గార్ధభ మీదకు బాణాన్ని ప్రయోగించాడు. బాణం సూటిగా గుండెల్లో దిగబడింది. పెద్దగా అరుస్తూ నేలకూలిందా గాడిద. అది చనిపోయింది. నాగా మాటలు అసత్యమని వూహించాడు ధనుంజయుడు. కాని మరుక్షణమే అతడి వూహల్ని చెరిపేస్తూ నేలకూలిన గార్ధభం చెంగున లేచి నిబడింది. నాటుకున్న బాణం నేల మీదపడుంది. ధనుంజయుడు తన కళ్ళను నమ్మలేకపోయాడు.

‘‘ఇప్పటికీ మీ సంశయం తీరకున్న మీ ఖడ్గంతో నన్ను సంహరించి చూడండి యువరాజా. నేను చావను. మా ఓజో తాంత్రిక క్షుద్ర విద్య మహత్తు అది. మీరు మాతో యుద్ధం చేసి మమ్ములను దాటి ముందుకు పోలేరు. నా మాట విని కోటకు మరలిపోవుట మంచిది. పోరాటమే మీ నిర్ణయమైతే మేం సిద్ధంగానే వున్నాం’’ అంటూ తన కంచరగాడిద కళ్ళాలు పుచ్చుకుని హుందాగా తన మనుషుల వైపు వెళ్ళిపోయాడు నాగా వృద్ధ నాయకుడు నాగానందుడు.

ధనుంజయునికి ఏం చేయాలో కొద్దిసేపు అర్థం కాలేదు.

సరిగ్గా అదే సమయానికి`

అక్కడికి కొద్ది దూరంలో`

ఒక శాలివృక్షం ఛాయలో నిలబడుంది అపర్ణుడి మచ్చల గుర్రం ఢాకిని. అంతకు కొద్దిక్షణాల క్రితమే ఆ గిరిశిఖరం పైకి చేరుకున్నాడు అపర్ణుడు.

దిగువ మిట్ట మీద బిడారు గుంపు నాయకుడు భల్లాతకుని వద్ద శలవు తీసుకుని బయలుదేరిన అపర్ణుడు మార్గంలో ఎక్కడా ఆగలేదు. రత్నగిరి సైన్య ఆగమన వార్తను యువరాజుకు తెలియపర్చి హెచ్చరించే ఉద్దేశంతో వాయువేగంతో మచ్చలగుర్రాన్ని దౌడు తీయించాడు. అయినప్పటికీ తను కొండపైకి చేరేలోపలే యువరాజు బాటవెంట ఆవలికి దిగిపోయి వుండొచ్చనుకున్నాడు. కాని పైకి చేరుతూనే అక్కడే వున్న ధనుంజయుని, కదం తొక్కుతున్న అతడి అశ్వాన్ని గమనించి విస్మయం చెందాడు. అక్కడ ఏదో జరుగుతోందని అర్థమై కాస్త ఎడంలోనే ఆగిపోయాడు.

చాలా విచిత్రమైన దృశ్యాన్ని చూస్తున్నాడతను.

యువరాజు ఎవరితోనో మాట్లాడుతున్నాడు. కాని అతని సమీపంలో కంటికెవరూ కన్పించటం లేదు. మాటలు అస్పష్టంగా విన్పిస్తున్నాయి. చుట్టూ ఎవరో వున్నట్టు చూస్తున్నాడు. చేతుల్లో ధనుర్బాణాలున్నాయి. విల్లు ఎక్కుపెట్టి సమీపంలోకి బాణం వేసాడు. అది భూమిలో దిగబడింది. ఎవరో వెళ్తున్నట్టు చూస్తున్నాడు. అంతా విచిత్రంగా వుంది.

నిజానికి సాధారణ పరిస్థితుల్లో అయితే చాలా దూరం వినబడే తన అశ్వం గిట్టల శబ్దాన్ని గమనించి అతడు తన వైపు చూడాలి. కాని తన అశ్వాన్నే అతడు గమనించటం లేదు. అంటే! ఖచ్చితంగా అక్కడేదో విచిత్రం జరుగుతోంది. అది ఏమై వుంటుంది? ఒకింత తీవ్రంగా ఆలోచించిన అపర్ణుడు తన కుడిచేతి బొటనవేలిని భ్రూమధ్యంలో వుంచుకొని జ్ఞానదృష్టిని కేంద్రీకరించి కొద్దిక్షణాలు అంతర్ముఖుడయ్యాడు. అంతే`

అక్కడ ఏం జరుగుతోంది వెంటనే`

అపర్ణుడికి అర్థమైపోయి, కనులు తెరిచాడు.

అశ్వాన్ని ముందుకు పోనిచ్చాడు.

ధనుంజయుని సమీపించగానే ఏదో మంత్రాన్ని పఠించి, రెండు చేతులు చేర్చి బిగ్గరగా మూడుసార్లు చప్పట్లు చరిచాడు.

**************************************

అది ఉత్తర భరతవర్షంలో సుదూరంగా`

ఈశాన్య ప్రాంతాల్లోని దట్టమైన అటవీ ప్రాంతం.

కీకారణ్యాలకూ, క్రూరమృగాలకూ నిలయం.

చీమలు దూరని చిట్టడవి, కాకులు దూరని కారడవి అనే నానుడికి అర్థం ఏమిటో ఆ అరణ్యాలను చూస్తే అర్థమవుతుంది. ముఖ్యంగా అక్కడ ఖడ్గమృగాలు, అనేక సర్పజాతులు, విషకీటకాల సంచారం ఎక్కువ. వర్షపాతం కూడా ఎక్కువే. నదులు, వాగులు, వంకలు ఎప్పుడు పొంగుతాయో ఎప్పుడు శాంతిస్తాయో అర్థంకాదు. అక్కడ నాగాజాతి ప్రజలు నివశించటం చేత ఆ ప్రాంతాన్ని నాగభూమి అని, నాగారణ్యాలని పిలుస్తూంటారు. నాగాలు తప్ప ఇతర ఆటవిక జాతులేవీ అక్కడ కన్పించవు. నాగాజాతి తప్ప ఇతరులెవరూ అక్కడ బ్రతికి బట్టకట్టడం అసాధ్యం. ఆపైన అవి ఏ రాజ్యానికీ అధిపత్యం లేని భూభాగాలు గావటం వలన అక్కడ నాగాలదే ఆధిపత్యం.

సహజంగానే నాగాల జనసంఖ్య స్వల్పం. వారంతా అయిదారు గూడారాలలో తలోచోట నివశిస్తున్నారు. ప్రతి గూడానికి గూడెం నాయకుడు, కులపెద్ద, కుల గురువు లాంటి ముఖ్యులు పెద్దలుగా వుంటారు. ఈ గూడాలన్నిటికి ముఖ్యమైన పెద్ద గూడెం ఒకటుంది. అది నాగుల దిబ్బ అనబడే పెద్ద కొండ మీద వుంది. ప్రతి నాగ గూడానికి నాయకత్వం ఉన్నప్పటికీ ఆ గూడాలన్నిటికి నాయకత్వం వహించేది మాత్రం నాగులదిబ్బ మీది నాగ గూడెం మాత్రమే. ఆ గూడెం నాయకుని మాటకి మిగిలిన నాగాలంతా కట్టుబడి వుంటారు. అటువంటి నాగ గూడెం దొర అయిన నాయకుడి పేరు నాగ కేసరి.

బయటి వారికి ఆఖరికి ఆటవిక సంచార తండాలయిన బోయ, కోయ, చెంచు, యానాది, ఉప్పర, ఎరుకల మొదలయిన ఇతర ఆటవిక జాతులు కూడా నాగ భూముల్లో అడుగు పెట్టే సాహసం చేయరు. అంతటి ప్రమాద కరమైన ప్రాంతాలవి. అందుకే నాగాటవిని మర్మ భూమి అని కూడ వ్యవహరిస్తారు.

ఆ అడవి దారులన్నీ కొట్టిన పిండి గాబట్టి స్థానికులయిన నాగాలు మాత్రం యధేచ్ఛగా బయటి కొచ్చి జన పదాలు, నగర ప్రాంతాలు చుట్టి తమ స్థానాలకు వెళ్ళి పోతూంటారు.

అంటే నాగాల గురించి బయటి ప్రపంచానికంతా తెలిదు గాని నాగాలకు బయటి ప్రపంచం తెలుసు. వీళ్ళ ప్రధాన వృత్తి వేట. వీళ్ళు తమ కుల దైవంగా నాగ రాజును పూజిస్తారు. ఇంకా కొండ దేవరకు, కాళికమ్మను, వన దేవతను పూజిస్తారు. వీరి ప్రధాన వృత్తి వేట. ప్రకృతి ఒడిలో పరిమళించిన నిండైన జీవితం వారిది.

తర్వాత కాలంలో వీరిలో కొందరు బయటి కొచ్చి వీర విద్యలు నేర్చుకుని సైన్యాల్లో చేరి గొప్ప ధైర్య సాహసాలు ప్రదర్శించారు. క్రమంగా నాగ జాతి అభివృద్ధి చెందింది. వీరు దక్షిణ ప్రాంతానికి వలస పోయి రాజ్యాల్ని స్థాపించారు. నాగుల పరిపాలనా కాలానికి చెందిన చారిత్రకాధారాలు వున్నాయి. అలాగే గరుడ జాతి వారూ కొన్ని భూ భాగాల్ని పరిపాలించారు.

మానవ జాతి యావత్తూ ఒకే సారి ఏర్పడింది కాదని ఆయా కాలాల్లో ఆయా జాతులు ఏర్పడ్డాయని చరిత్రను గాని పురాణాలను గాని పరిశీలిస్తే అర్థమవుతుంది.

సాధారణంగా ఎవరో ఒక ప్రసిద్ధ పురుషుడు ఆ వంశానికి మూల పురుషుడై వుంటాడు. శ్రీరామునిది సూర్య వంశం, శ్రీకృష్ణునిది యదు వంశం, దుర్యోధనుడిది కురు వంశం ఇలా ప్రతి వంశానికి మూల పురుషుడున్నాడు. అర్జునుడు తీర్థ యాత్రా సమయంలో తనను వలచిన నాగ కన్య ఉలూచిని పెళ్ళి చేసుకున్నాడు. ఆమె నాగ రాజు కుమార్తె. నాగ లోక వాసులు కోరిన రూపం ధరించగల శక్తిమంతులు.

అదే భూమిపై సంచరించే నాగ సర్పాలయితే నూరు సంవత్సరాలు ఎవరినీ కాటు వేయకుండా బ్రతికుంటే ఆ పాము విషమంతా శిరస్సున చేరి నాగమణి ఏర్పడుతుంది. అలా మణి ఏర్పడిన నాగానికి జ్ఞాన సిద్ధి కలిగి కోరిన రూపం ధరించగల శక్తి వస్తుంది.

ఇక ఉలూచి, అర్జునుల ప్రణయంలో కొడుకు బభ్రు వాహనుడు జన్మించాడు. పుట్టగానే అతడ్ని మామ గారైన నాగ రాజుకు దత్తత ఇచ్చి భార్యను నాగ లోకానే వదిలి తను తీర్థయాత్రలు కొనసాగించాడు అర్జునుడు. తర్వాత పరిణామాల్లో అర్జునుడు ఉలూచి, బభ్రు వాహనుల్ని కలుసుకోలేదు. నాగ రాజుకు దత్త పుత్రునిగా ఉన్నందున బభ్రు వాహనుడూ నాగజాతికి చెందిన వాడవుతాడు. ఆ కారణంగా అతడి సంతతి నాగ జాతిగా భూలోకంలో ప్రసిద్ధి చెందింది.

హనుమంతుడు సీతాన్వేషణకు సముద్రాన్ని లంఘిస్తుండగా ఆయన చెమట బిందువు ఒకటి సముద్రంలో పడింది. ఒక మత్స్య గంధి ఆ చెమట బిందువును మ్రింగి గర్భం దాలచగా మచ్చేంద్రుడనే కొడుకు పుట్టాడు.

శ్రీహరి స్వేద బిందువు జారి పుడమిపై పడగా భూదేవి స్వీకరించింది. ఆ విధంగా జన్మించిన వాడు కుజుడు. ఈయనకే అంగారకుడు, మంగళుడు అని పేర్లు. ఆయన పుడమి పుత్రుడు.

పరమ శివుని తపో వేడిమికి ఆయన త్రిశూలం నుండి జారి పడిన స్వేదం ఒక కన్యగా అవతరించింది. ఆమె శివ పుత్రిక. శివానుగ్రహంతో నదిగా మారి ఆమె నర్మద అయినది. ఇలాగే మరో సందర్భంలో శివుని స్వేదం నుండి చర్చిక అనే కన్య పుడుతుంది. ఇదలా వుంచితే`

మన పురాణాలు, ఇతిహాసాల గాథల్లో మరో విధమైన పునరుత్పత్తి పద్ధతి కన్పిస్తుంది.

కుంభ సంభవులు అనగా కుండ నుండి పుట్టిన వారని అర్థం. కుండ నుండి మనిషి పుట్టడం ఏమిటి? ఇది మనకు విడ్డూరంగా వుండొచ్చు. కానీ`

విచ్ఛిన్నమైన గాంధారి గర్భస్థ పిండాన్ని వ్యాసుల వారు తన తపోశక్తితో నూరు కుండల్లో భద్రం చేయగా వాటి నుండి దుర్యోధనితో సహా నూరుగురు సోదరులు జన్మించారు. వీరంతా కుంభ సంభవులే.

కురు పాండవులకు విద్య నేర్పిన ద్రోణా చార్యుడున్నాడు. ద్రోణము అంటే కుండ. ఈయనా కుంభ సంభవుడే. ఇలాంటివి మరి కొన్ని వున్నా ముఖ్యంగా చెప్పుకోవలసిన కుంభ సంభవు ఇద్దరున్నారు. సప్తర్షుల్లోని వశిష్టుడు, అగస్థ్యుడు వీరిద్దరూ కవల సోదరులు కుంభ సంభవులు. అదో ఆసక్తి కరమైన గాథ.

ఒకప్పుడు నారాయణాంశతో జన్మించిన నర నారాయణులనే సోదరులు మహాభక్తులు. తపస్సంపన్నులు. ఇరువురు బదరికా వనంలో ఘోర తపస్సు చేస్తున్నారు. ఆ తపో వేడిమికి ముల్లోకాలు తల్లడిల్లాయి. తన ఇంద్ర పదవి కోసమే వాళ్ళు తపస్సు చేస్తున్నారని భ్రమ పడ్డాడు మహేంద్రుడు. వెంటనే ఆ సోదరులకు తపో భంగం కలిగించమని అప్సర భామలను పంపిస్తూ తోడుగా మన్మథుడ్ని, వసంతుడ్ని కూడా పంపించాడు.

బదరికా వనంలో అకాలాన వసంతం వెల్లి విరిసింది. అప్సర భామలు ఆడి పాడారు. మరుడు సుమశరాలు కురిపించాడు. కాని చెరకు విలుకాని సుమ శరాలు గాని బదరికా వనంలోని వసంతశోభ గాని, అప్సరసల సరస శృంగార నాట్య గీతాలు గాని నర నారాయణులను తపో భంగం కలిగించలేక పోయాయి. అప్పుడు కనులు తెరిచిన నర నారాయణులు అప్పటి కప్పుడు తమ ఊరువుల నుండి (తొడలు) అప్సర కామినులకు మించిన ఒక అద్భుత సౌందర్య రాశిని సృష్టించారు. ‘‘ఓ అప్సరలారా! మా తపోశక్తి మీకు తెలియదు. తలచుకుంటే మిమ్ము మించిన మదవతులైన మోహనాంగిలను సృష్టించ గలము. ఇదో... మా ఊరువుల నుంచి ఆవిర్భవించిన ఈ సౌందర్య వతి పేరు ఊర్వశి. ఈమెను మా కానుకగా మహేంద్రునికి వప్పగించండి. మా తపస్సు మహేంద్ర పదవి కోసం కాదని మా మాటగా చెప్పండి’’ అన్నారు.

అలా అప్సరల వెంట స్వర్గం వైపు వెళ్తున్న ఊర్వశిని సూర్య దేవుడు చూసి, మోహించి తన సూర్యా లోకానికి ఆహ్వానించాడు. సరేనని సూర్య లోకం వైపు వెళ్ళింది ఊర్వశి. దారిలో అగ్ని దేవుడు ఆమెను చూసి మోహించి తన కోరిక తీర్చమన్నాడు. ముందు సూర్యునికి మాటిచ్చినట్టు చెప్పింది ఊర్వశి. అయితే నన్ను తులుచుకుంటూ వెళ్ళు చాలు అన్నాడు అగ్ని. ఊర్వశి అలాగే చేసింది. అంతలో వాయు దేవుడు ఆమెను గాంచి మోహితుడై తన కోరిక చెప్పగా అదే సమాధానం చెప్పింది ఊర్వశి. వాయు దేవుడు కూడ తనను తలచుకొంటూ వెళ్ళమని కోరాడు. ఆ విధంగా మనసులో అగ్నిని, వాయు దేవుని తలచుకొంటూ సూర్య లోకం చేరింది ఊర్వశి. సూర్యుడు విషయం తెలుసుకొని ఆగ్రహించి` ‘‘నీవు ఇరువుర్ని తలచుకొంటూ నా వద్దకొచ్చావు. నీకు సూర్య లోక ప్రవేశం లేదు. మహేంద్రుడి వద్దకే వెళ్ళమన్నాడు.

ఆ విధంగా తన వద్ద కొచ్చిన ఊర్వశికి సముచిత స్థానమిచ్చి తన అప్సరగా చేసుకున్నాడు ఇంద్రుడు. అయితే ఇది ఇంతటితో అయి పోలేదు. ఊర్వశి సౌందర్యాన్ని చూసిన మోహంలో తాపం భరింప లేని అగ్ని, వాయువు ఇరువురూ తమ తేజస్సును ఒక కుండలో భద్రపర్చి వెళ్ళి పోయారు. ఆ కుంభంలో నుండి ఇరువురు కవలు బయటి కొచ్చారు. ఆ శిశువులే వశిష్టుడు, ఆగస్త్య మహర్షులు.

పార్వతి నందునుడు గణేశునికి ఏనుగుతల చేర్చబడింది. త నరక బడిన దక్షునికి మేకతల అతికించబడింది.     అలాగే మృగ శీర్షంతో సహజంగా అవతరించిన దేవతలున్నారు. వారిలో నరశింహుని ముందుగా చెప్పుకోవాలి. తురగ ముఖులు మనకు ఇద్దరు కన్పిస్తారు. ఒకరు గాన గంధర్వుడు తుంబురుడు, రెండవది సాక్షాత్తూ నారాయణావతారమైన హయగ్రీవుడు. ఇంకా భైరవుడు కుక్క మొఖం కలిగిన వాడు.

*********************************************

అది ఎర్రరాతి మన్నుతో ఏర్పడిన అతి పెద్ద కొండ గుట్ట. ఎత్తు తక్కువే. మూడు వందల ధనువుల ఎత్తుకు మించదు. కాని గుట్ట చుట్టూ కైవారం సువిశాలమైనది. బోర్లించిన దిబ్బ రొట్టెలా కన్పించే ఆ కొండ గుట్ట పేరే నాగుల దిబ్బ. కొండకు శిఖరం వుంటుంది. గుట్టకు శిఖరం వుండదు. ఉపరితలం సమతలంగా వుంటుంది. అలాంటి వాటిని కొండ గుట్టలంటారు. ఈ నాగులదిబ్బ ఎంత విశాలం అంటే దాని మీద ఒక విశాల నగరమే నిర్మించ వచ్చు. అంత సువిశాలమైనది. ఆ గుట్ట మీదే వుంది నాగాల నివాసస్థలమైన నాగా గూడెం.

అది కీకారణ్య ప్రాంతమైనా ఆ గుట్ట పైకి చేరటానికి అనేక దారులున్నాయి. నాగులదిబ్బ గుట్ట పైనా పరిసరాణ్యాలంతటా అనేక వృక్షజాతులు, ఫలవృక్షాలతో ఆ ప్రాంతం కను విందు చేస్తోంది. ఏటవాలు కాలిబాటల వెంట కొండ పైకి నడవాలి. నాగుల కంచర గాడిదలు, పశువులు కూడా ఆ దారుల్లోనే తిరగాలి గాబట్టి దారులన్నీ విశాలంగానే వున్నాయి.

గుట్ట పైకి చేరి మరి కొంత దూరం చెట్టు పుట్లట వెంట నడిచాక గుట్ట మధ్య ప్రాంతంలో పచ్చని చెట్ల క్రింద కను విందు చేస్తూ కన్పిస్తుంది నాగుల గూడెం.

సుమారు అయిదారు వందల ఇళ్ళుంటాయక్కడ. అవన్నీ పూరిళ్ళు. పెద్ద పెద్ద చుట్టు గుడిసెలుగా వున్నాయి. విశాలమైన ప్రాంగణాలతో విసిరేసినట్టు తలో ప్రక్క కన్పిస్తున్నాయి. మూడువేల మందికి పైగా నాగా జాతి ప్రజలు ఆడ, మగ పిల్లా పీచులతో సుఖశాంతులతో జీవిస్తున్నారక్కడ. సహజంగానే నాగాలు శ్రమజీవులు. బలిష్టులు, ధైర్యసాహసాలకు పెట్టింది పేరు. ప్రతి ఒక్కరు విలువిద్య అభ్యసిస్తారు. వేట కత్తి, గండ్ర గొడ్డలి వీరి ప్రధాన ఆయుధాలు. బళ్ళెం, ఖడ్గ చాలనం, కర్ర సాము యువకులు ఎక్కువ సాధన చేస్తుంటారు. ఆయుధం లేకుండా ఎవరూ అడవి లోకి వెళ్ళరు.

గూడెంలో చూడ్డానికి ఒక పద్ధతి లేకుండా కట్టుకున్నట్టు కన్పిస్తాయి అక్కడి యిళ్ళు. కాని గమనిస్తే అర్థమవుతుంది వారి పద్ధతి.

గూడెం మధ్యలో వృత్తాకారాంలో ఒక మైదాన ప్రాంతం వుంది. అక్కడ ఫలాలనిచ్చే కొన్ని వృక్షాలు మాత్రమే పెంచ బడ్డాయి. ఆ వృత్తాకార మైదానం నుండి నాలుగు దిక్కులకు నాలుగు ప్రధాన మార్గాలున్నాయి. ఆ నాలుగు దారులను అనుసరించి అటు యిటు యిళ్ళ నిర్మాణం మధ్యలో చిన్న వీధులు, సందులు ఏర్పడ్డాయి. ఎటు నుండి కొండ గుట్ట ఎక్కినా ఏదో ఒక మార్గం గుండా మైదానం వద్దకు చేరుకోవచ్చును.

గూడెం మొత్తానికి ఆ వృత్తాకార మైదానం గుండె లాంటిది. నాగాల వేడుకలు, పెళ్ళిళ్ళు, విందు వినోదాలు, పండుగలు ఏదయినా సామూహికంగా ఆ మైదానంలో జరుపుకుంటారు. వీరికి ఇష్టమైన వృక్షం వెదురు. వీరి యిళ్ళ నిర్మాణమంతా వెదురు తోనే సాగుతుంది. అలాగే వెదురుతో చేసిన ఒక విధమైన తీగ వాద్యం, వేణువు వీరికి ఇష్టమైన వాద్య పరికరాలు. ఇక సంబరాలు, ఉత్సవాల్లో కొమ్ము బూరలు భేరీలు డోళ్ళు మొదయిన అన్ని వాద్య పరికరాలు ఉత్సాహంగా వినియోగిస్తారు. ఆ పరికరాలు సొంతంగా తయారు చేసుకోటంలో వీరు నిష్ణాతులు.

మైదానం పశ్చిమ భాగంలో తూర్పు ముఖంగా రాళ్ళతో పేర్చిన పెద్ద ఆలయం వుంది. అనేక శిరస్సులతో కూడిన నాగరాజు విగ్రహాన్ని ఆ గుడిలో పూజిస్తారు. అక్కడే కాస్త ఎడం ఎడంగా కొండ దేవర, కాళికమ్మ, వన దేవతల గుడులు దర్శనమిస్తాయి. ఒక్క నాగ రాజు ఆలయాన తప్ప మిగిలిన గుడుల వద్ద కొలువులు, వేడుకల్లో జంతు బలి జరుగుతుంది.

సరిగ్గా ఈ గుడులకు ఎదురుగా`

మైదానం రెండో పక్క పశ్చిమాభి ముఖంగా కన్పించే ఇల్లు గూడెం నాయకుడైన దొర నాగ కేసరిది. పెద్ద అరుగుల మీద నిర్మించిన పెద్ద చుట్టు గుడిసె అది. అక్కడ ఏ ఇంటిని చుట్టి సరిహద్దులు గాని ప్రహరీలు గాని కన్పించవు.

ప్రస్తుతం అది మధ్యాహ్న వేళ.

సూర్యుడు నడిమింట నిప్పులు చెరుగుతున్న వేళ.

ఉష్ణ తాపానికి నాగాలు ఎవరి యిళ్ళలో వాళ్ళు విశ్రాంతిగా గడుపుతున్నారు. అట్టి వేళ నాయకుడు నాగ కేసరి ఇంటి ముందు ఒక కార్యక్రమం నిర్వహించ బడుతోంది. అదే అతి ప్రమాద కరమైన ఓజో తాంత్రిక క్షుద్ర విద్యా ప్రయోగం. నాయకుడు నాగ కేసరి అధ్వర్యంలోనే జరుగుతున్నది.

ఎరుపు, తెలుపు కలగలిసిన గోధుమ వర్ణంలో సుమారు ఎనిమిదడుగుల భారీ మనిషి నాయకుడు నాగ కేసరి. అతడి వయసు కూడ ఎనభై సంవత్సరాలుండొచ్చు. ఇప్పటికీ చాలా బలంగా దృఢంగా భీమబలుడి లాంటి ఆకారం. గుబురు మీసాలు, భూజాల మీద పడుతున్న వంకీల జుత్తు, తలమీద పడగ విప్పిన నాగాభరణం, నుదుట విభూది పూసి కుంకుమ ధరించి వింత శోభతో మెరిసే ముఖ వర్ఛస్సు.

నడుంకి నార బట్ట ఆచ్ఛాదనగా కట్టుకున్నాడు. నడుంకి, మెడ, చేతులకి పూసలదండలు, వెండి కడియాలు ఆభరణాలుగా వున్నాయి. కుడి కాలికి పెద్ద వెండి తోడా వుంది. అసలా గూడెంలో వయసు కొచ్చిన యువకుల నుంచి వృద్ధుల వరకు పురుషులంతా ఖచ్చితంగా కుడి కాలికి వెండి తోడా ధరించే వుంటారు. అది వారి ఆచారంలో భాగం.

ఇంటి ముంగిట ఎత్తయిన వెదురు ఆసనం మీద గంభీరంగా ఆసీనుడై వున్నాడు నాయకుడు నాగ కేసరి. ఎదురుగా వాకిట హోమం ప్రజ్వరిల్లుతోంది. అక్కడ నాగాల కుల గురువు, అక్కడి ఆలయాల పూజారి, గణచారి ముగ్గురూ హోమం చుట్టూ కూచుని దీక్షగా ఓజో తాంత్రిక ప్రయోగంలో వున్నారు. ముగ్గురూ శతాధిక వృద్ధులే. వారి రూపాలు బీభత్సంగా వున్నాయి. ఎర్రటి రక్త వర్ణపు దుస్తులు ధరించి వున్నారు. ఎర్రటిపూలు, ఎర్రటి హోమద్రవ్యాలను సమర్పిస్తూ ఏవేవో హోమ దినుసుల్ని వేస్తూ, కళ్ళు మూసుకుని నిష్టతో మౌనంగా మంత్రాలు పఠిస్తున్నారు. పొగ మంచు లాంటి తెల్లటి ధూమం హోమ గుండంనుంచి గాల్లోకి వ్యాపిస్తోంది.

వారికి ఎదురుగా అవతల మైదానం మీద తెల్లటి సున్నం పొడితో వేసిన విశాలమైన రెండు వృత్తాలు కన్పిస్తున్నాయి. ఒక దానిలో ఒకటిగా ఒకటి అంతర్ వృత్తం, రెండోది బాహ్య వృత్తం. అంతర్ వృత్తం ముప్పై ధనువుల వైశాల్యం కలిగివుంటుంది. హోమ గుండం నుంచి లేచిన శ్వేత ధూమం అంతర్ వృత్తంలోకి చేరి ఆ వృత్తం పైన ఒక ధూమ నాళికలా ప్రకాశిస్తోంది.

ఇక బాహ్య వృత్తంలో`

ఇద్దరు నాగాలు కొమ్ము బూరా, భేరీలు వాయిస్తూండగా నూరు మంది నాగాలు సాయుధులై వృత్తాకారంలో నిలబడి కదం తొక్కుతూ తోడా శబ్దం చేస్తూ పాములా బుసలు కొడుతున్నారు. అద్దంలో ప్రతిబింబించినట్టు ఆ నాగా వీరుల ప్రతిరూపాలు

అంతర్ వృత్తం మీద ధూమ నాళికలో ప్రతిబింబిస్తున్నాయి. ఇక్కడ వీళ్ళు ఏం చేస్తే ప్రతి రూపాలు అదే చేస్తున్నాయి. ఆ ప్రతిబింబాల మధ్యన కదం తొక్కుతున్న శ్వేతాశ్వం ఆ అశ్వం మీది రాకుమారుడు ధనుంజయుడు స్పష్టంగా కన్పిస్తున్నాడు. అంటే ` ఎక్కడో కొండ శిఖరం మీద ధనుంజయుడు, అతడి పరిసర ప్రాంతాలతో బాటు అక్కడ చుట్టుముట్టిన నాగాల ప్రతిరూపాలు కూడా ఆ ధూమనాళికలో ప్రతిబింబించటమే కాదు, వారి మాటలు, శబ్దాలు కూడ విన్పిస్తున్నాయి. నాయకుడు నాగ కేసరితో బాటు మరి కొందరు అక్కడ కూచున్న నాగాపెదలుదు ఏం జరుగుతుందాని ఆసక్తిగా ధూమనాళిక లోని ప్రతిబింబ దృశ్యాలనే వీక్షిస్తున్నారు.

సాధారణ కనులతో చూస్తే ఓజో దృశ్యం కనబడదు. అలా చూడాలంటే మంత్ర యుక్తమైన ఒక నల్లటి లేపనాన్ని కళ్ళకు కాటుకగా ధరించాలి. ఆ లేపనం వున్న డబ్బీ నాగాకుల గురువు చెంత వుంటుంది. ఆరుదైన పికిలిపిట్ట గుండె, నల్ల పిల్లి కళ్ళు, ఊసర వెల్లి కాలేయం ఈ మూడింటిని సేకరించి ఒక విశేష అమావాస్య నాడు వాటికి కొన్ని దినుసులు చేర్చి పుటం పెట్టి దాంతో తయారు చేసిన కాటుక అది. విధిగా ఆ కాటుక ధరిస్తేనే ధూమ నాళిక లోని దృశ్యాలు కన్పిస్తాయి.



అప్పటికే జరుగుతున్నదంతా కుతూహలంగా చూస్తున్నారంతా. నాగానందుడు తన కంచర గాడిద దిగి అంతర్ వృత్తంలో ధనుంజయుని ప్రతి రూపానికి ప్రణామం చేస్తున్నాడు.

సరిగ్గా ఇదే సమయంలో`

చర చర మంటూ ఏదో పాకి వస్తున్న శబ్ధం ఆలకించి తలతిప్పి అటు చూసాడు నాగ కేసరి. అతి పెద్దదైన ఒక సర్ప సుందరి అటుగా పాకుతూ రావటం కన్పించింది. విచిత్రమైన నాగ సుందరి. సుమారు పది ధనువుల పొడవుంటుంది. ఆమె నడుం వరకు మానవ

స్త్రీగా వుంది. నడుం నుండి కింది భాగం సర్ప రూపం.

ఆమె వయసు ఎంతో చెప్పటం కష్టం.

ఎందుకంటే ఆమెలో ఎక్కడా వార్ధక్య ఛాయలు కన్పించటం లేదు. నవ యవ్వనిలా వుంది. నడుం వరకు సహజమైన మానవ కాంత, దిగువ భాగం నాగాకారం. అందమైన ముఖ వర్చస్సు, కరి మబ్బులా విర బోసిన నల్లలని కురులు, ఆరోగ్యంతో మిస మిసలాడే లేత గులాబి మేని ఛాయ, తామర తుండ్ల వంటి చక్కని చేతులకు దంతం గాజులు ధరించింది. సమున్నతమైన వక్షోజాలకు అడ్డంగా ఒక నార వస్త్ర భాగాన్ని ఆచ్ఛాదనగా కట్టుకుంది. ముఖాన బొట్టు, చెరగని మందహాసంతో ఆమె రూపం విచిత్రం గాను ముగ్ధ మనోహరం గానూ వుంది. ఆమె స్థానిక నాగాలకు సుపరిచితురాలే. అందుకే ఎవరూ ఆమెను వింతగా చూడరు. అప్యాయంగా పలకరిస్తారు. ఆమెను చూసిన గూడెం దొర నాగ కేసరి పలకరింపుగా నవ్వాడు.

''రా తల్లీ శంఖు పుత్రీ. నీవింకనూ ఈ దినము రాలేదేమిటాని అనుకొంటిని. వచ్చినావు. ఇలా కూచో'' అన్నాడు.

నాగ సుందరి పడగ విప్పినట్టుగా మరి కాస్త పైకి లేచి జరుగుతున్న హోమాన్ని పరిసరాల్ని కలియ జూసింది.

''నాయకా... ఏమి జరుగుతున్నదిచట? ఓజో ప్రయోగమా? నేను కూడ తిలకింప వచ్చునా? ఏమి విశేషము?'' అంటూ, పాకుతూ ముందుకెళ్ళింది. అంతా తనకు తెలిసినట్టే. కులగురువు చెంతనున్న డబ్బీలోని నల్లని పదార్ధాన్ని కొద్దిగా తన చూపుడు వేలితో తీసి రెండు కనులకు కాటుకగా అద్దుకొని వెనక్కి వచ్చి నాగ కేసరి పక్కనే తన శరీరాన్ని చుట్టు చుట్టుకొని లేచి కూచుంటూ ఎదురుగా వృత్తాల్లోకి చూసింది.

ఇప్పుడు ధూమనాళికలోని దృశ్యాలు ఆమెకు స్పష్టంగా కన్పిస్తున్నాయి. కదం తొక్కుతున్న శ్వేతశ్వం, అశ్వం మీది ఆజాను బాహుడు, సుందరాకారుడైన పురుషుడ్ని చూసింది. యువ కిశోరంలా వున్న ధనుంజయుని గాంచగానే ఆశ్చర్య సంభ్రమాలతో కొద్ది లిప్తల పాటు, శంఖుపుత్రిగా పిలువబడే ఆ నాగ సుందరికి నోట మాట రాలేదు. విప్పారిన కనులతో అలాగే చూస్తుండిపోయింది. పాలిండ్లు ఉబికి శ్వాస బరువై మోహ పరవశంతో కను రెప్పవాల్చటం మర్చి పోయింది.

శంఖు పుత్రి భూలోక వాసి కాదు. సాక్షాత్తూ నాగలోకానికి చెందిన స్త్రీ. నాగ లోకంలో నాగుల రేడైన ప్రభువు నాగరాజుకి అత్యంత ఆప్తుడైన శంఖు చూడుడను అనుచరుని కుమార్తె. కాబట్టి అంతా ఆమెను శంఖుపుత్రి అనే పిలుస్తారు. కాని ఆమెకో పేరుంది.

మధూలిక అసలు పేరు. ప్రస్తుతం ఆ పేరు ఎవరికీ గుర్తు లేదు. అందుక్కారణం ఆమె నాగ లోకం నుండి బహిష్కృతురాలు గావటమే.

ఇది సుమారు నూటయాభై సంవత్సరాల క్రితం నాటి మాట.

అప్పట్లో యుక్త వయసు లోని నాగకన్య మధూలిక అత్యంత సౌందర్య రాశిగా భాసిల్లేది. ఆమెకు ప్రకృతి సౌందర్యమంటే ఇష్టం. తరచూ భూలోకం వచ్చి ఒంటరి గానే వన విహారం చేసేది. ఒక్కోసారి సుదూర ప్రాంతాలక్కూడ వెళ్ళి వచ్చేది.

ఒకసారిలాగే మాళవ రాజ్యంలోని సుందర వన ప్రాంతాలకు వెళ్ళింది. అక్కడ కుప్పించి దూకే తుంటరి జలపాతాలకు కొదువ లేదు. ఉరుకులు పరుగులు తీసే కొండ వాగు, తామరపూలతో నిండుగా ప్రశాంతంగా మైమరపించే తామర మడుగులు, గుంపులుగా తిరిగే లేళ్ళ సమూహాలతో కూడిన పచ్చిక మైదానాలు, ఫలవృక్షాలు, ఎటు చూసినా చిన్న చిన్న కొండలు, గుట్టలతో రమణీయమైన ప్రాంతం ఆ సుందరవనాల అటవీ ప్రాంతం. ఓసారిలాగే మధూలిక సుందర వనాల్లో మానవ కన్య రూపంలో విహరిస్తుండగా అదే ప్రాంతాల్లో వేటకు వచ్చిన మాళవ రాజ కుమారుడు బిల్వుడనే వాడు ఆమెను చూసి మోహించాడు. అంద గాడయిన అతడ్ని మధూలిక వరించింది. ఆమె నాగకన్య అని తెలిసాక కూడా ఆమెనే కోరుకున్నాడతను. ఇరువురూ ప్రేమ బంధంలో చిక్కుకున్నారు. కానీ`

ఈ విషయం తెలుసుకున్న నాగ రేడు కోపంతో మండి పడ్డాడు. నాగలోక వాసుకు మానవులతో సంబంధాలు ఆయనకిష్టం లేదు. నాగ సంతతి వర్ణ సంకరం జాతి కారాదన్నది ఆయన అభిమతం.

ఒకప్పుడు నాగరాజు కుమార్తె అయిన ఉలూచి, పాండవ మధ్యముడైన అర్జునుని ప్రేమను అంగీకరించిన అప్పటి నాగరేడయితే. మధూలిక ప్రేమ ఫలించేదేమో. కాని ప్రస్తుత రేడు ఆయన కాదు.

ద్వాపర యుగం చివరి ప్రాంతాల నుండి కలియుగారంభంలో కొంతకాలం వరకు నాగలోక అధిపతిగా వున్న నాగరాజు తర్వాత తన వారసుడైన మహా పద్ముడనే అతడ్ని నాగరాజుగా పట్టాభిషిక్తుడ్ని చేసి తను తపస్సుకు పాతాళ లోకానికి వెళ్ళి పోయాడు. ప్రస్తుతం నాగరాజు మహా పద్ముడు. ఇతడిది తండ్రి అంతటి విశాల హృదయం కాదు. అందుకే మధూలిక బిల్వుల ప్రణయం అతనికి కంటగింపయింది. దాంతో అధినాయకుడి ఆజ్ఞను కాదని మధూలిక బిల్వుడి కోసం భూలోకం వెళ్ళిపోవాలనుకుంది. ఈ విషయం తెలిసి కోపంతో మండిపడ్డాడు నాగరాజు. మాళవ యువరాజుని ఒక కులీన సర్పం చేత కాటు వేయించి చంపించాడు. అంతే కాదు, తన ఆనతిని ధిక్కరించిన మధూలికకి శాశ్వతంగా నాగ లోకం నుండి బహిష్కృతి శిక్ష విధించాడు. ఈ విషయంలో మధూలిక తండ్రి

శంఖ చూడుడు నిస్సహాయుడయ్యాడు.

ఆ విధంగా నాగ లోకం నుండి వెలి వేయ బడిన నాగ సుందరి మధూలిక పుట్టెడు దుఃఖం, ప్రియుని వియోగంతో నాగాటవి అయిన మర్మభూమికి చేరుకుంది. క్రమంగా నాగ జాతి మనుషులకు దగ్గరయింది. నాగులదిబ్బ ఆమె నివాసమైంది. గూడెంలోకొచ్చినప్పుడు యిలా సగం స్త్రీ రూపం కలిగిన సర్పంలా సంచరిస్తుంది. సహజమైన తన అహార అన్వేషణకు గట్టు దిగి అడవిలోకి పోయేప్పుడు పూర్తిగా సర్ప రూపం ధరిస్తుంది. కోరిన రూపం ధరించగల శక్తివంతురాలామె. కాని నాగ లోకం విడిచిన తర్వాత తన సహజమైన అద్భుత సౌందర్యంతో కూడిన నాగ కన్యగా ఎవరికీ కన్పించలేదు. ఆమె చరిత్ర గూడెంలో ముఖ్యులయిన కొందరు పెద్దలకు మాత్రమే తెలుసు. నాగా నాయకుడైన నాగ కేసరికి కూడ తెలుసు. అందుకే శంఖు పుత్రీ అంటూ ఎంతో ఆత్మీయంగా పిలుచుకుంటాడు. అతని వయసుకు రెట్టింపు ఆమె వయసంటే ఆశ్చర్యమే.

అటువంటి నాగ సుందరి మధూలిక తన్మయంతో అక్కడ ధూమ నాళికలోని ధనుంజయుని ప్రతి రూపాన్ని చూస్తూ ఆలోచిస్తోంది. ఇంతలో మేఘ ఘర్జనలా ` ''ఓజో ప్రయోగం అర్ధాంతరముగా విఫలమవుతోంది. ఏం జరుగుచున్న దచట...'' అంటూ విన్పించేసరికి ఒక్కసారిగా మధూలిక ఆలోచనలు చెదిరి పోయాయి.

ఎదురుగా ధూమ నాళికలోని ప్రతిరూపాలు లీలగా కదిలి చెదరి పోతున్నాయి. పొగ తేలి పోతోంది. ఒక్కసారిగా గందరగోళం నెలకొందక్కడ.

*******************************

తన మచ్చల గుర్రం మీద ధనుంజయుడి సమీపంలోకి రాగానే అపర్ణుడు ఏదో మంత్రాన్ని పఠించి రెండు చేతులూ చేర్చి మూడుసార్లు బిగ్గరగా చప్పట్లు చరిచాడు గదా ` దాని ఫలితం వెంటనే కన్పించింది.

శ్వేతాశ్వం గరుడ మీది యువరాజు ధనుంజయుడు ఒక్కసారిగా ఉలికిపడ్డాడు. ఏం జరుగుతుందో అర్ధం కాలేదు. ఎదురుగా తనేం చూస్తున్నాడో తెలీలేదు.

ఎక్కడికక్కడ ప్రకృతి మసక బారుతున్నట్లనిపించింది. ఎక్కడివక్కడ యథాతథంగా వున్నాయి. కాని కంచర గాడిదతో వెళ్తున్న వృద్ధ నాగా నాయకుడు నడుస్తూ నడుస్తూనే అస్పష్టం కాసాగాడు. చుట్టూ అతని నాగా మనుషులూ చెరిగి కరిగిపోతున్న బొమ్మల్లా కదులుతున్నారు. చూస్తుండగానే వాళ్ళంతా కరిగిపోతున్న పిండి బొమ్మల్లా, అలల తాకిడికి కదలాడే నీటి మీది

దృశ్యంలా అలలు అలలుగా కదలాడుతూ క్రమంగా గాలిలో అదృశ్యమైపోయారు. ఒక్కరూ మిగల్లేదు. ఇప్పుడు తనను చుట్టి నాగాలు లేరు. వారి కదం తొక్కే తోడాల శబ్దం గాని, హుంకరించే పాము బుసలుగాని లేవు. పోరు తప్పదనుకున్న స్థితిలో అంతా కలలా చెదిరిపోయింది. అంతా భ్రాంతి సదృశంగా వుంది.

ఎప్పుడైతే నాగాలంతా అదృశ్యమయ్యారో అప్పుడు బాహ్య స్పృహలోకి వచ్చాడు యువరాజు ధనుంజయుడు. ఒక కల నుంచి బయటపడినట్టు విభ్రాంతుడై చుట్టూ చూసాడు. అప్పుడు కన్పించింది ఎదురుగా తన వైపు వస్తున్న మచ్చల గుర్రం. ఆ గుర్రం మీద నిండా పద్దెనిమిది వత్సరాలయినా ఉంటాయో లేదో అన్పించే లేత వయసు అతి సుందరుడైన బాల యువకుడ్ని చూసాడు. ఎవడితడు? ఎన్నడూ చూసిన గుర్తులేదే. ఇంత సమీపం లోకి వచ్చే వరకు ఆ అశ్వాన్ని తను ఎందుకు గమనించలేక పోయాడు? కనుబొమ్మలు ముడిచి మంత్ర ముగ్ధుడిలా అతన్నే చూడసాగాడు.

యువరాజును సమీపిస్తూనే`

వినయ పూర్వకంగా చెంగున తన అశ్వం దిగాడు అపర్ణుడు.

‘‘అశేష రత్నగిరి రాజ్య బావి సామ్రాట్టులు అనంగుని ధిక్కరించు అతులిత రూపసుందరులు, మానిని చిత్తచోరులు, వీరాధివీరులు, రణరంగధీరులు, దయాహృదయులైన యువరాజు శ్రీ ధనుంజయుల వారికి జయము జయము. ఏలిన వారికి ఈ అపర్ణుడి ప్రణామములు’’ అంటూ వంగి వంగి నమస్కరించాడు.

అపర్ణుడి వినయ విధేయతలకి వాక్చాతుర్యానికి ముగ్ధుడవుతూ ధనుర్బాణాలను యధా స్థానంలో వుంచి అశ్వం దిగి అపర్ణుడి ముందుకొచ్చాడు ధనుంజయుడు. నిశితంగా అతని ముఖాన్ని గమనిస్తూ` ‘‘నీవు అపర్ణుడవా?’’ అనడిగాడు.

అంతటి ఎండలో కూడ యువరాజు చూపు తాకిడికి అపర్ణుడి బుగ్గలు గులాబి మొగ్గల్లా ఎర్ర బారాయి.

‘‘అవును ప్రభూ! నన్ను అపర్ణుడంటారు.’’ అన్నాడు.

అపర్ణుడి రూపం, ఆ గొంతు, నడకతీరు యువరాజు ధనుంజయకు ఏవో కొన్ని సందేహాలకు కారణమయ్యాయి. కాని వాటిన్నిటిని పక్కపెట్టి సందిగ్ధంగా చూస్తూ` ‘‘మనకు గత పరిచయం వున్నట్టు లేదే!’’ అనడిగాడు.‘‘మనకు పరిచయం లేదు గాని మీరు నాకు

పరిచయస్థులే యువరాజా''

''ఎలా? నేను నీకు అంతగా తెలుసా?''

''తెలుసు.''

''ఎలా తెలుసు? నీవు రత్నగిరి వాసివేనా?''

''రత్నగిరి నివాసినే ప్రభూ. ఇక మీరు ఎలా తెలుసునంటే ఏం చెప్పగను. లోకమున సూరీడు తెలిని వారుందురా? రత్నగిరి రాజ్యమున యువరాజు ధనుంజయుల వారు తెలిని వారుందురా? అందునా నేను మీ అభిమానిని ప్రభూ. అందుకే మీ గురించి సర్వం తెలుసుకుంటూ ఉంటాను. రోజంతా ప్రభాకరుని తన్మయంగా చూస్తూ సూర్యకాంత పుష్పం తల తిప్పదా? కోకిల వసంతం వెంట పరుగులు పెడుతూ కమ్మటి పాటలు ఆలపించదా? నేనూ అంతే! మీ పట్ల అంతటి అభిమానం వున్నవాడ్ని. విశ్వాసపాత్రుడ్ని.'' అన్నాడు సవినయంగా అపర్ణుడు.

తలపంకించాడు ధనుంజయుడు.

''నీ పలుకులు కడు విచిత్రములు. రూపము పరమాద్భుతం. ఇంతటి మా వీరాభిమానితో ఇంత దనుక పరిచయం లేకపోవుట మా దురదృష్టమే'' అన్నాడు దరహాసం చేసి.

''అంత మాట వలదు ప్రభూ. నన్ను మీ మిత్రునిగా తలచిన చాలును'' అన్నాడు అపర్ణుడు.

''మంచిది. నీ కోరిక మన్నిస్తున్నాం. ఇక నుండి నీవు మా అంతరంగిక మిత్రుడివి. చాలునా? విషయం ఏమన` ఇంత క్రితం చాలా సేపటిగా ఇక్కడే ఒక విచిత్ర సంఘటన జరిగినది...''

''తెలుసు ప్రభూ'' అన్నాడు వెంటనే అపర్ణుడు.

“తెలుసునా?”

“తెలుసు. క్షణం క్రితం వరకు మీరు నాగాలు ప్రయోగించిన ఓజో తాంత్రిక విద్య మాయలో వున్నారు. భ్రమలో పడ్డారు. మీ లక్ష్యం నెరవేరకూడదని అవరోధం కల్పించి వెనక్కు పంపించాలని చూసారు. ఆ పరిస్థితి రాకూడదని నేనే వారి ప్రయోగాన్ని తిప్పికొట్టి భ్రమ నుంచి మిమ్మల్ని బయటకుతెచ్చాను.”“నీకా ఓజో తాంత్రిక విద్య తెలుసునా? చూచినట్టు అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలిగావు? నీ వద్ద అదీ ఇంత పిన్న వయసులో అద్భుత మంత్ర శక్తులేవో వున్నట్టున్నాయి.”

“లేదు లేదు ప్రభూ...” అంటూ నవ్వేసాడు అపర్ణుడు.

“నా వద్ద గొప్ప మంత్ర శక్తులేవీ లేవు. మంత్ర శాస్త్రంలో కొద్దిగా పరిజ్ఞానం వుంది. అది సమయానికి ఉపయోగ పడింది. అంతే! కాని ప్రభూ, అసలు ప్రమాదం మీ వెనకనే తరుముకొస్తోంది. అది మీరు గమనించలేదు.”

“అసలు ప్రమాదమా...?”

“అవును. అసలు ప్రమాదమే. ఓ సారి పరిసరాల మీద దృష్టి సారించండి. మీకే అర్థం కాగలదు.”

అప్పుడు గమనించాడు ధనుంజయుడు.

కొండ దిగువ నుండి అనేక అశ్వాలు శర వేగంతో దూసుకొస్తున్న పదగిట్టనల ధ్వని. వింటూనే వడివడిగా కొండ వంచకు నడిచి బాట మీదకు దృష్టి సారించి విభ్రాంతి చెందాడు.

అశ్విక దళం దుమ్ముతెరలు రేపుతూ పిడుగుపాటులా కొండశిఖరం మీదికి దూసుకొచ్చేస్తోంది. అది తమ రత్నగిరి అశ్విక దళమే. వెళ్ళినంత వేగం గానూ తిరిగి అపర్ణుడి ముందుకొచ్చి అతడ్ని ఆశ్చర్యంగా చూసాడు.

“వాళ్ళు మా సైనికులే. నా కోసమే వస్తున్నారు కదూ?” సంశయ నివృత్తి కోసం అడిగాడు.

‘‘అవును. మీ కోసమే. కారణము నా కన్నా మీకే బాగా తెలుసు. మీరు వాళ్ళ కంట బడకుండా తప్పించాలని వచ్చాను. కాని ఆలస్యమైపోయినది. వాళ్ళు వచ్చేస్తున్నారు. తప్పించుకోను అవకాశమూ లేదు’’ అన్నాడు నిరుత్సాహపడుతూ అపర్ణుడు.

‘‘రానిమ్ము. సమస్యకు భయపడి పారిపోవు భీరుడు కాదీ ధనుంజయుడు. తప్పదంటే సొంత సైన్యంతోనే తలపడి తేల్చుకుంటాను గాని నా లక్ష్యం నుండి మారుట కల్ల’’ అన్నాడు ఆవేశంగా ధనుంజయుడు.

అంతలో అశ్వాలు కొండ పైకి రానే వచ్చాయి. దూరం నుంచే ధనుంజయుని బాట మీద గమనించిన సైనికులు అశ్వముల వేగాన్ని తగ్గించారు. అవి వచ్చిన వేగానికి ఎర్రటి ధూళి మేఘంలా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టింది. ధనుంజయునికి ఇరవై ధనువుల దూరంలో అగ్ర భాగంలోని రత్నగిరి పతాకపూన్చిన సైనికాశ్వం నిలువగా దాని సరసనే దళపతి అశ్వం వచ్చి నిలిచింది. వాటి వెనకే సుమారు నూరు అశ్వాలు అయిదు వరుసల్లో క్రమశిక్షణతో నిలిచాయి. అశ్వ సైనికులంతా సుశిక్షితులై యుద్ధానికి సిద్ధంగా ఆయుధాలు ధరించి వున్నారు.

అందర్నీ ఉన్నచోటే నిలవమని చెప్పి దళనాయకుడు తన అశ్వం దిగాడు. సైనిక పద్ధతిలో ముందుకొచ్చి ధనుంజయకు సైనిక వందనం చేసి జయ వాచకం పలికాడు.

ఆ దళపతి పేరు కరివీరుడు.

మనిషి ఏడడుగుల పైగా ఎత్తున విశాలమైన ఛాతీతో దృఢంగా బలిష్టంగా వున్నాడు. నడివయసుంటుంది. గుబురు మీసాలతో ఎప్పుడూ గంభీరంగా వుంటాడు. ప్రభువు ధర్మతేజ మహారాజుకు ఎంతో నమ్మకమైన వాడు కరివీరుడు. చక్కని వ్యవహారదక్షుడు. ఏ విషయంలోనూ తొందరపడని మనిషి. కరివీరుని తన కోసం పంపించుటలో తన తండ్రి సరైన నిర్ణయమే తీసుకున్నాడనిపించింది ధనుంజయునికి.

‘‘దళపతీ! ససైన్యంగా మీ రాకడకు అర్థమేమి?’’ సైనిక వందనం స్వీకరించి, హుందాగా ప్రశ్నించాడు ధనుంజయుడు.కరివీరుడు ఓ సారి అపర్ణుడి వంక సందేహంగా చూసాడు. అది గమనించి ధనుంజయుడు కల్పించుకుంటూ ` ‘‘మా మిత్రుడు! సందేహింపక వచ్చిన పని చెప్పుము’’ అన్నాడు.

‘‘ఇది ప్రభువు ఆనతి యువరాజా. సరిహద్దులు దాటక ముందే మిమ్మల్ని కలుసుకొని వెనక్కి తీసుకురావసిందిగా

ఆజ్ఞాపించినారు. ఈ లేఖను మీ కోసం పంపించినారు.'' అంటూ కరివీరుడు ఒక లేఖను అందించాడు.

ఆ లేఖలో స్పష్టంగా యిలా వ్రాయబడి వుంది.

ప్రియ కుమారా ధనుంజయా`

మీకింకనూ స్వయం నిర్ణయాధికారం సంక్రమించలేదు. మా అనుమతి లేకుండా మీరిలా కోట విడిచి వెళ్ళుట మాకు సమ్మతము కాదు. మీరు పంపించిన లేఖ సారాంశము అర్థమైనది. అయినను స్వక్షేమము కన్నా రాజ్యక్షేమమే ప్రభువులకు ముఖ్యమని మీకు తెలియదా? ఆ శాశ్వతమగు శరీరము గురించి గాని శరీర బాధ గురించి గాని మాకు చింత లేదు. రాజ దంపతులుగా మా చింత ఎల్లప్పుడును మీ గురించే. మా ఏకైక కుమారునిగా సువిశాల రత్నగిరి రాజ్యలక్ష్మికి వారసునిగా మా తర్వాత రాజ్య భారం వహించవలసిన బాధ్యత మీకున్నది.

ఆ బాధ్యతను విస్మరించి మీరిలా అడవుల గ్రుమ్మరించుచూ యిడుముల బడి ఎద్దియో సాధించి మమ్ముద్ధరింప బూనుట మాకు సమ్మతము కాదు. వృధా ప్రయాస. మీరు కోటకు తిరిగి వచ్చి మా సమక్షమునే ఉండవసిందిగా ఆనతిస్తున్నాము. ఈ లేఖను చదివిన తక్షణమే కరివీరుని వెంట కోటకు మరలి రావసిందిగా ఆజ్ఞాపిస్తున్నాము. రాకున్న మన సైనిక దళం వదలదు. స్వసైన్యంలోనే తలపడిన అపఖ్యాతిని మూట కట్టుకొని సాటి రాజన్యుల ముందు తలవంపులు తీసుకురారని ఆశిస్తున్నాము. మీ రాక కోసం ఎదురు చూసే మీ తండ్రిగారు.

ధర్మతేజ ప్రభువు.

ధనుంజయుడు ఆ లేఖ చదివే లోపలే పక్కనున్న అపర్ణుడు ఓరకంట సాంతం చదివేసాడు. అతడి పగడాల పెదవుల మీద మృదు దరహాసం విరిసింది. అటు దళపతి కరివీరుని గాని ఇటు యువరాజు ధనుంజయకు గాని ఇది ఒక అగ్నిపరీక్షయే. ఎవరి ధర్మానికి వారు కట్టుబడి వున్నప్పుడు సమస్యకు పరిష్కారం లభించదు. దీని పర్యవసానం యుద్ధమా! కాకపోవచ్చు.

లేఖను ఒకటికి రెండు మార్లు చదివిన ధనుంజయుడు దాన్ని తిరిగి కరివీరునికే ఇచ్చి వేసాడు` ''ఇది నీకు అవసరం పడొచ్చు. నీ వద్దనే వుంచు'' అన్నాడు.

‘‘కాని… మీరు మా వెంట రత్నగిరికి రాక తప్పదు యువరాజా’’ లేఖను భద్రం చేసుకుంటూ స్థిరంగా పలికాడు కరివీరుడు.

‘‘దళపతీ మీకు తెలుసు. ఒక నిర్ణయం తీసుకున్నాక అడుగు వెనక్కు తీసే అలవాటు నాకు లేదు. నాకో విషయం చెప్పండి. పితృ ప్రేమ ఎప్పుడూ బిడ్డల క్షేమం కోరుట సహజమే గదా?’’

‘‘అవును యువరాజా. ఎవరు కాదనగలరు?’’

‘‘అదే విధముగా పితృ రుణం తీర్చుకొనే బాధ్యత కూడ పుత్రులదే గదా?’’

‘‘ఆ మాట నిక్కము.’’

‘‘నా మీది వాత్సల్యంతో నన్ను వారించే ప్రయత్నం చేస్తున్నారు తండ్రి గారు. కాని సమర్థుడనై వుండి చేతులు ముడుచుకుని వారి చెంతనే ఉండి వారి బాధను వేదనను చూస్తూ భరించలేను గదా. ఆలోచించు. నా కర్తవ్యం నేను పాటించ నివ్వండి. కొద్ది దినాలు నన్ను వదిలేస్తే విజయంతో తిరిగి వచ్చి పితృ రుణం తీర్చుకుంటాను.’’

‘‘మీ పలుకులు సత్యములు యువరాజా. ప్రభువులది కన్న ప్రేమ. మీది పితృ మమకారం. కాని మాది వృత్తి ధర్మం. ప్రభు భక్తి పరాయణులం. మంచిచెడులు ఎంచకుండా రాజాజ్ఞను పాటించటం మా ధర్మం. ఆ ధర్మాన్ని పాటించక తప్పదు. మీరు మా వెంట కోటకు రాక తప్పదు.’’

‘‘వచ్చుట లేదు. పోరుకైనా సిద్ధమే గాని రత్నగిరికి వచ్చుట అసాధ్యం’’

‘‘మేమును పోరుకు సిద్ధపడే వచ్చినాము యువరాజా. మీరు రాకుండా మేము వెనుతిరుగుట అసంభవం. మీరు అసహాయశూరులని తెలిసి కూడ వచ్చినాము. రాజాజ్ఞ అట్టిది. మా కర్తవ్య పాలన తప్పదు గదా. మా అశ్విక దళాన్ని ఓడించి మా శవాల మీదుగా మీరు యధేచ్ఛగా పోవచ్చును’’ అన్నాడు స్థిరంగా కరివీరుడు.

అతడి మాటల్లో స్థిర నిశ్చయం ధ్వనిస్తోంది.

"ఇదే మీ నిర్ణయమా?" ఆఖరి సారిగా అడిగాడు ధనుంజయుడు.

"అవును యువరాజా"

"సరి. మన ఇరువురి ధర్మ పరిపాన కోసం అనవసరంగా ఇందరు వీరులను బలిపెట్టుట ధర్మం కాదు గదా. ఇంత కన్నా ఉచితమగు నిర్ణయం గైకొనుట మంచిది"

"చెప్పండి. ఏమా నిర్ణయం?"

"మనమిరువురము ద్వంద్వ యుద్ధం సలుపుదము. అప్పుడు స్వసైన్యంతోనే పోరాడినామన్న మచ్చ మాకు ఏర్పడదు. సైనిక నష్టమూ వుండదు. మన పోరాటంలో మీరు గెలిచిన నేను మారాడక మీ వెంట రత్నగిరికి వచ్చెదను. ఒక వేళ నేను గెలిచిన మీరంతా క్షేమంగా వెనుతిరిగి నేను చెప్పిన భంగి నడుచుకోవలె. ఇది మీకు సమ్మతమైన ఇక ద్వంద్వ యుద్ధం ఆరంభించెదము."

యువరాజు నిర్ణయం దళపతి కరివీరుడ్ని ఒకింత ఆలోచనలో పడవేసింది. ధనుంజయతో ద్వంద్వ యుద్ధమంటే ఎలా వుంటుందో కరివీరునికి తెలీని విషయం కాదు. యుద్ధంలో ప్రభంజనంలా విజృంభించే యువరాజు ముందు ఎవరూ నిలవలేరు. ఎందుకంటే, చేతిలో ఆయుధం ఏదయినా అలవోకగా చెలరేగి ప్రత్యర్థిని మట్టికరిపించుటలో దిట్ట. ఒకటి కాదు రెండు కాదు, అనేక విధములైన వీర విద్యల్లో నిష్ణాతుడతను. అలాంటి వీరుని తను ఒంటిగా జయించుటా… అసాధ్యమే. కాని తప్పదు. యువరాజు ఒక్కడే గావచ్చు. కాని అతడి ముందు తమ అశ్విక దళం నిలువలేదనుట సత్యము. అతడి పరాక్రమాన్ని గతంలో అభీరులతో జరిగిన యుద్ధంలో స్వయంగా చూసినవాడు తను. అర్ధజాములో రెండు వందల మంది దుండగులను కడతేర్చిన సాహసి. అయినప్పటికీ ఒక్కని కోసం మొత్తం దళాన్ని బలిచేయటం కన్నా యువరాజు చేతిలో తను మరణించినా అది సంతోషమే.

ఈ విధంగా ఆలోచించిన కరివీరుడు చివరకు తను ద్వంద్వ యుద్ధానికి సమ్మతి చెప్పాడు.

అయితే పరిస్థితి యుద్ధం వరకు దారి తీయటం పక్కనున్న అపర్ణుడికి నచ్చలేదు. ఒక్కనితో చేసినా వంద మందితో చేసినా యుద్ధం యుద్ధమే. అదీ దళపతితో యుద్ధం చేయటమంటే ఆ దళం మొత్తం మీద దాడి చేసినట్టే. స్వసైన్యం మీద దాడి. ఆ పరిస్థితి

తెచ్చి సాటి రాజన్యులలో మచ్చ తేవలదని మహారాజ ధర్మతేజుడు తన లేఖలో స్పష్టంగా పేర్కొన్నాడు. కాబట్టి ప్రస్తుతం సమస్యకు పోరు పరిష్కారం కాదు.

ఉన్నట్టుండి కదిలాడు అపర్ణుడు. ద్వంద్వ యుద్ధానికి కత్తులతు దూయబోతున్న వీరులు ఇరువురి మధ్యకు వచ్చి చేతులు చాపి వారించాడు.

‘‘మిత్రమా అపర్ణా. ఇది మా సమస్య. నీవు పక్కకు తొలుగుట మంచిది.’’ తన కరవాలం పిడి మీద చేయి వేస్తూ హెచ్చరించాడు ధనుంజయుడు.

‘‘సమస్య మీదే గాని మీరిలా ద్వంద్వ యుద్ధానికి తలపడుట సమస్యకు పరిష్కారం కాదనిపిస్తోంది. దళపతి మీద మీరిలా కత్తి దూయటం కూడ ప్రభువుకు సమ్మతం కాదు. ఆ విషయం లేఖలో స్పష్టంగా వుంది. మరిచారా?’’ అంటూ గుర్తుచేసాడు అపర్ణుడు.

‘‘మరి సమస్యకు పరిష్కారం?’’ దళపతి కరివీరుడు సందిగ్ధంగా అడిగాడు.

‘‘ఉంది. మధ్యవర్తిగా కత్తులు కలపకుండానే దీనికో పరిష్కారం నేను చెప్తాను. అదీ నా మీద నమ్మకం వుంచి మీరు సమ్మతిస్తేనే సుమా!’’

‘‘ముందు అదే ఉపాయమో చెప్పు చూద్దాం.’’ అన్నాడు ధనుంజయుడు. గొంతు సవరించుకుని కరి వీరుని వైపు చూసాడు అపర్ణుడు.

‘‘దళపతి కరివీరులు ధీమంతులు, శౌర్య ప్రతాపాల్లో సాటిలేని వారని విన్నాను. కార్యదక్షులు, ఆలోచనాపరులనీ, నిండుగా దేశభక్తి, రాజభక్తి కలవారని, న్యాయధర్మాలు తెలిసిన వారని కూడా విన్నాను. మీ దర్శనం నాకు సంతోషం కలిగిస్తోంది.’’ అంటూ ముందుగా కరివీరుని స్తుతించాడు అపర్ణుడు. ఆ పొగడ్తకు మెత్తబడని వారుండరు. ఇంకా ఏం చెప్తాడాని ముగ్ధుడవుతూ చూసాడు కరివీరుడు.



“స్వామీ నేనో మాటడుగుతాను చెప్పండి. మన ధర్మతేజ ప్రభువుల వారి ఏలుబడిలో ఈ రత్నగిరి రాజ్యాన ధర్మం నాలుగు చెరగులా వ్యాపించింది. ప్రజలు సుఖ శాంతులతో జీవిస్తున్నారు. న్యాయం నెలకొని వుంది. రాజ్యం ఐశ్వర్య సమృద్ధమైవుంది. అవునా?”

“నిశ్చయంగా అవును. సంశయమేల?”

“నాకెలాంటి సంశయం లేదు. చిన్నవాడ్ని. మీ అంత అనుభవం నాకు లేదు. కాని ఎందుకు అడుగుతున్నానో ఆలోచించి

బదులివ్వండి చాలు. అశేష సిరి సంపదలతో వర్ధిల్లు.  మన రత్నగిరి రాజ్యలక్ష్మికి సర్వ ధర్మాలు తెలుసు. ఆ తల్లి అబద్ధం చెప్పదు. మీకు నమ్మకం వుంది కదా?''

''వుంది'' అన్నాడు వెంటనే కరివీరుడు.

ఆ సంభాషణ వింటున్న ధనుంజయునికి అపర్ణుడి ఉద్దేశం ఏమిటో బోధపడక అయోమయంగా చూస్తున్నాడు. విషయం ఎక్కడికి పోతోందో అర్థంగావటం లేదు. కాని ఒక్కటి మాత్రం స్పష్టంగా అర్థమైంది. అపర్ణుడి వాక్చాతుర్యం ఎదుటివారిని మంత్ర ముగ్ధుల్ని చేస్తుంది. క్షణాల్లో సమస్యను అన్ని కోణాల నుండి పరిశీలించి సరైన నిర్ణయం తీసుకుని సలహా యివ్వటంలో అనుభవం నిండిన ఒక ప్రధానమంత్రి లక్షణాలు అపర్ణుడిలో కన్పిస్తున్నాయి. అందుకే అపర్ణుడు ఏం చెప్పబోతున్నాడాని ఇరుపక్షాలు ఎదురుచూస్తున్నాయి. తిరిగి గొంతు విప్పాడు అపర్ణుడు.

''రత్నగిరి రాజ్యలక్ష్మికి చెందిన కొన్ని బంగారు నాణాలు నా వద్ద వున్నాయి. వాటి లోంచి ఒక నాణాన్ని తీసి బొమ్మ  బొరుసు వేస్తాను. ధర్మం  తెలిసిన రాజ్యలక్ష్మి నిర్ణయం యిరువురికీ శిరోధార్యం. బొమ్మపడితే యువరాజా వారు చెప్పినట్టు దళపతి నడుచుకోవాలి. బొరుసు పడితే దళపతి చెప్పినట్టు యువరాజా వారు నడుచుకోవాలి. రత్నగిరి రాజ్య చిహ్నమైన రత్నం బొమ్మ. మన విదేశీ వ్యాపారానికి గుర్తుగా వెనుక పక్క ముద్రించిన ఓడ బొమ్మ బొరుసు. ఇది మీకు సమ్మతమైతే నాణెం ఎగురవేస్తాను'' అంటూ అపర్ణుడు తన దట్టీలోంచి ఒక బంగారు నాణాన్ని బయటకు తీసి చూపించాడు. ముందు పక్క రత్నం బొమ్మ, వెనక పక్క తెరచాప ఓడ బొమ్మ  స్పష్టంగా  వున్నాయి.

''నాకు సమ్మతమే'' అన్నాడు ధనుంజయుడు.

''నాకును సమ్మతం'' అన్నాడు కరివీరుడు.

అపర్ణుడు నాణాన్ని ఎగురవేసాడు.

అది గింగిరాలు తిరిగి కొంత ఎత్తు ఎగిరి కిందపడింది. చూస్తే అది రత్నం గుర్తు. బొమ్మ. యువరాజు పక్షాన్ని సూచించింది.

కరివీరుని సంశయ నివృత్తి కోసం`

బంగారు నాణాన్ని ముమ్మారు ఎగురవేసాడు అపర్ణుడు. మూడుసార్లు బొమ్మపడి యువరాజుని సమర్ధించింది నాణెం. దళపతి ఓటమి నంగీకరించి ధనుంజయుని మాటకు కట్టుబడక తప్పలేదు.

“యువరాజా! ధర్మము మీ పక్షాన నిలిచింది. మీ మాటకు బద్ధుడును. రక్తపాత రహితముగా మన సమస్యను పరిష్కరించిన మీ మిత్రుడు ఈ అపర్ణుని మనం అభినందించాలి. ఇక ఆనతివ్వండి. మనసుకు కష్టమైనను మీ ఆనతిని ఇష్టముగా పాటించగలను.” అన్నాడు.

“దళపతీ! మీరు మానధనులని, అనృతము పులుక జాలరని నాకు తెలుసు. కానీ, స్త్రీ యందు, ధన, మాన, ప్రాణములకు హాని వున్న సందర్భమున బొంకవచ్చు. అది దోషము కాదని రాక్షస గురువు శుక్రా చార్యుల వారు చెప్పినది మీరూ వినే వుంటారు. ఎవరికీ హాని కలిగించని అబద్ధము దోషము కాదు.

మీ అశ్విక దళంతో మూడు నాలుగు దినములు అడవుల గ్రుమ్మరి, నేటికి అయిదో దినమునకు రత్నగిరి చేరుకోండి. నేను మీకు కనబడలేదని ప్రభువులకు మనవి చేయండి. నా జాడలు మాళవ రాజ్యం దిశగా వెళ్తున్నట్టు తెలిసి మీరు సరిహద్దుల వరకు వెళ్ళారు. కాని అప్పటికే ధనుంజయుడు సరిహద్దులు దాటి మాళవ రాజ్యంలోకి ఎటో వెళ్ళిపోయారు. జాడతెలిక మీరు వెనుతిరిగారు. మీ దళ సభ్యులు కూడ ఇదే మాట చెప్పేలా వారిని హెచ్చరించండి. ఇక నేను తిరిగి వచ్చులోన మీకెలాంటి సంకటము నేరదు. అర్థమైనది గదా?” అంటూ కర్తవ్యాన్ని సూచించాడు యువరాజు.

అంతకుమించి మరో మార్గం కూడ దళపతి కరివీరునికి లోచలేదు. అంతటితో శలవు తీసుకుని యువరాజును వదిలి తన అశ్విక దళంతో వెళ్ళిపోయాడు.

ఆ అశ్విక దళం కనుమరుగయ్యేంత వరకు చూసి వెనుతిరిగిన ధనుంజయ, అపర్ణులు తమ అశ్వాల వైపు అడుగులేసారు.

*****************************************

ఆ రోజు మధ్యాహ్నం నాగుల దిబ్బమీద`

ఎవరూ వూహించని సంఘటనే జరిగింది.

'ఓజో' ప్రయోగం అర్థాంతరంగా విఫలమైంది.

ఇది నాగాల చరిత్రలో చాలా అరుదైన సంఘటన.

ప్రయోగం విఫలమవుతున్న సూచన ముందే తెలిసిపోయింది. ధూమనాళికలోని ప్రతిరూపాలు మసక బారటం ముందుగా నాయకుడు నాగకేసరి గమనించాడు. అదే సమయంలో`

హోమగుండం మూడు పక్కలా కూచుని నిష్టగా ప్రయోగంలోవున్న కులగురువు, ఆలయాల పూజారి, గణాచారి ముగ్గురూ ఎవరో ఛెళ్ళున వీపు మీద చరిచినట్లు తృళ్ళిపడి కళ్ళు తెరిచారు. క్షణం కూడ ఆలస్యం చేయకుండా ఎగిరి వెనక్కి దూకేసారు. అదే సమయాన`

హోమగుండం ఫెళ్ళున శబ్దం చేస్తూ అంత ఎత్తున లేచి తిరగబడింది. ఆ క్షణంలో అలా జరుగుతుందని ముందే తెలిసి హోమకర్తులు ముగ్గరూ వెనక్కి దూకి తప్పించుకున్నారు గాని లేకుంటే నిలువునా అగ్నిస్నానం చేసుండే వాళ్ళు.

అప్పటికే తన ఆసనం నుండి లేచి ''ఏం జరుగుతోంది? ప్రయోగం ఎందుకు విఫలమైంది?'' అంటూ తన ఉరుములాటి గొంతుతో అరుస్తున్నాడు నాయకుడు. ఎవరూ బదులు చెప్పలేదు. కాసేపు నిశ్శబ్దం అలుముకుందక్కడ. కొద్దిసేపటికి గాల్లో వ్యాపించిన పొగలు, ధూళి అంతరించి సాధారణ స్థితి నెలకొంది. ఇప్పుడు ధూమనాళిక అదృశ్యమైంది. అందులోని ప్రతిరూపాలూ అదృశ్యమయ్యాయి. ఈ ప్రయోగంలో పాల్గొన్న నాగానందుడు తన కంచరగాడితో దగ్గరకొస్తున్నాడు. అతన్ని అనుసరించి మిగిలిన నాగావీరులూ వస్తున్నారు.

అసలు ఇదంతా ఏమిటో, ఏం జరిగిందో అర్థంగాక నాగకుమారి శంఖుపుత్రి కనులు విప్పార్చి అయోమయంగా చూస్తోంది. నాగాల కులగురువు తన త్రిశూలం అందుకొంటూ నాయకుడు నాగకేసరి వంక గంభీరంగా చూసాడు.

“నాయకా! ఇందులో మా తప్పులేదు. మన ప్రయోగాన్ని ఎవరో తిప్పికొట్టి విఫలంజేసినారు” అన్నాడు.

“ఎవరు? ఎవరు విఫలంజేసినారు? అక్కడ రాకుమారుడు తప్ప ఎవరూలేరు గదా” తన భారీకాయాన్ని, ఆగ్రహాన్ని నిగ్రహించుకొంటూ అరిచాడు నాగకేసరి.

“అవును నాయకా. ఎవరూ లేరు. కాని ఎవరో రాకుమారునికి సాయం చేసి తప్పించినారు. ఇది అసాధారణ విషయము. ఒజో విద్య మన నాగాల సొంతం. ప్రయోగించాలన్నా, విఫలం చేయాలన్నా మనమే చేయగలం. ఆలోచించండి” అంటూ హెచ్చరించాడు కులగురువు.

“అంటే... మనవాళ్ళే ఎవరో రత్నగిరి వారసునికి సాయపడినారందురా?”

“అవును దొరా!” అన్నాడు గణాచారి.

“ఎవరు చేసి వుంటారా పని? మన వాళ్ళెవరునూ గూడెం వదిలిపోలేదాయె. రాకుమారుడెక్కడనో సుదూర ప్రాంతాల్లో వున్నాడు. ఇది జరగని పని” అంటూ నాగానందుని వంక చూసాడు నాయకుడు.

“నాగానందా! మీ ప్రతిరూపాలు అక్కడ కొండపై నున్నవి. అప్పుడు రాకుమారుడుగాక ఇంకెవరయినా అటుగా వచ్చుట చూచినారా?” అనడిగాడు.

నాగానందుడు ఒకింత ఆలోచించి బదులిచ్చాడు` “నాయకా! మీరడుగుతుంటే గుర్తుకొచ్చినది. సరిగా చూడలేదు గాని ఏదో ఒక మచ్చల గుర్రం సమీపంలోకి రావటం కనిపించినది. గుర్రం మీద ఎవరున్నారో చూచే లోపలే ప్రయోగం విఫలమై, మేము వెనక్కి

వచ్చినాము'' అన్నాడు.

''మచ్చల గుర్రమా?'' సందేహంగా అడిగాడు నాగకేసరి.

''అవును నాయకా. తెలుపు మీద ఎరుపు మచ్చల జాగిలంలాంటి గుర్రము''

''సందేహం లేదు. మనం కంచర గాడిదలు తప్ప అశ్వాలను ఉపయోగించము. ఆ మచ్చల గుర్రం మీద వచ్చిన వాడు సాయపడి వుండాలి.'' కాని అతను మాత్రం మన నాగాజాతికి చెందిన వాడై వుండడు. గురునాథా మీ అభిప్రాయమేమి?'' కుల గురువు అభిప్రాయాన్ని అడిగాడు.

''ఇప్పుడే ఒక అభిప్రాయానికి వచ్చుట సరికాదు నాయకా!'' అన్నాడు దీర్ఘంగా ఆలోచిస్తూ కుల గురువు.

''మన నాగాల్లో కూడ అందరికీ ఈ విద్య తెలీదు. ఈ రహస్య విద్య కొందరికే తెలుసును. గతంలో ఎవరన్నా బయటవారికి తెలిపివున్నారేమో తెలియదు. ప్రస్తుతం మనం చేయగలిగినది ఏమీలేదు. వేచిచూచెదముగాక'' అన్నాడు.

''కాని... ఇలా అయితే ప్రభువు నాగరాజుకి నేనిచ్చిన మాట ఏమి కావలె? ఆ రాకుమారుని వెనక్కి మరలించుటకు మరో మార్గమేమి?'' నాగకేసరి ఆత్రపడుతూ అడిగాడు.

''ఆందోళన చెంద పనిలేదు నాయకా. అందుకు చాలా సమయమున్నది. రాకుమారుడు ఇంకనూ దక్షిణా పథానే వున్నాడు. తమ రాజ్య సరిహద్దులు దాటలేదు. అతడు వింధ్యాటవి దాటి ఉత్తరాపథానికొచ్చే లోన ఏదో విధంగా వెనక్కి మరలించెదము. మరొక్కపరి శుభ తిథి జూచి, మరొక్కమారు ఓజో ప్రయోగించి తగు నిర్ణయము చేసెదముగాక'' అని చెప్పి అక్కడి నుండి నిష్క్రమించాడు నాగా కులగురువు.

క్రమంగా అంతా చెదిరిపోగా నాగకేసరి, శంఖుపుత్రి ఇరువురే మిగిలారక్కడ. బయట ఎండ తీవ్రంగా వున్నా నాయకుడి ఇంటి ముంగిట తాటి ఆకు చలువ పందిరి కింద చల్లగానే వుంది. అంతక్రితమే కొందరు నీళ్ళు చల్లి వాకిట్లో నిప్పుల్ని ఆర్పేసారు.

శంఖుపుత్రి ఇంకా అక్కడే వుండటం గమనించిన నాగకేసరి తన ఆలోచనలు పక్కనపెట్టి తిరిగి కూచుని ఆమె వంక చూసాడు.

అప్పటికింకా విభ్రాంతి నుండి శంఖుపుత్రి బయటపడినట్టు లేదు. తేరి విప్పార్చిన నేత్రాలతో అంత దూరంలోని మధ్యవృత్తం వంకే తదేకంగా చూస్తోంది. ''పార్థా... కిరీటి... విజయా...'' అంటూ అర్జునుడి నామాలను ఉచ్చరిస్తోంది. అదికూడ కాదు, ఆమె ముఖంలో ఏదో తెలిని పరవశత్వం దోబూచులాడుతోంది. నాయకుడు నాగకేసరికేమీ అర్థం కాలేదు.

''తల్లీ శంఖుపుత్రీ! ఏమైనాది నీకు? అచ్చట ఏమున్నదని చూస్తున్నావు'' అనడిగాడు.

ఒకటికి రెండుసార్లు పిలిచాకగాని`

బాహ్యస్పృహలోకి రాలేదు శంఖుపుత్రి.

''నాయకా... అర్జునుల వారిని దర్శించిన కనులు గదా. తన్మయంతో పరవశించినాను. నాకీ దినము ఎంతో సుదినము. వారిని కనులార జూచు భాగ్యము లభించినది'' అంది మృదుమధురంగా.

శంఖుపుత్రి మాటలు నాగకేసరికి ఏమీ అర్థముకాలేదు. ఆమె పలుకులు విచిత్రంగా తోచాయి. తామంతా ఇక్కడే వున్నారు గదా. తమకు కనబడని పాండవమధ్యముడు ఈ శంఖుపుత్రికి ఎలా కన్పించినాడు?

''ఏమంటున్నావు? అర్జునులవారు కన్పించినారా?'' అడిగాడు.

''అవును నాయకా... వారే.''

''వారినెప్పుడు జూచినావు?''

‘‘ఇప్పుడే... ఇక్కడే... ధూమనాళికయందగుపించిన శ్వేతాశ్వ సుందరాంగుడు ఆ సవ్యసాచియే గదా’’ చిలుకపలుకుల్లాంటి ఆమె మాటలాలకించిన నాగకేసరి ఫక్కున నవ్వేసాడు.

అప్పటికి విషయం బోధపడిందతడికి.

రత్నగిరి రాకుమారుడు ధనుంజయుని జూచి అతడే పాండవమధ్యముడు అర్జునుడు అనుకొంటోందామె. ఇంత వయసు వచ్చినా అమాయకత్వం పోలేదీమెకు అనుకున్నాడు. అతడి నవ్వు విని అలిగినట్టు చూసింది శంఖుపుత్రి.

‘‘నాయకా... పరిహాసమేల. అతడు పార్థుడు గాడా?’’ అంది.

‘‘కాదమ్మా. కాని నీవతడ్ని పార్థుడనుకునే ఆయనపేర్లను ఉచ్ఛరించినట్లున్నావు. అవునా?’’

‘‘అవును. అతడు పార్థుడుగాకున్న ఇంకెవరు?’’

‘‘చెప్తానుగాని, నీవింతగా అర్జునుల వారినభిమానిస్తావన్న సంగతి నాకు తెలియదు సుమా. ఏదీ... పార్థుని దశ నామములు నీకు తెలుసునా?’’ అనడిగాడు.

తిరిగి అర్జునుని తలవగానే`

శంఖుపుత్రి బుగ్గలు ఎర్రబారి పులకరించాయి. తన నాగశరీరాన్ని ముడుచుకుని మరింత ముగ్ధగా మారింది.

‘‘ఓ... తెలియకేమి. అన్ని నామములు తెలుసును. అర్జున`ఫల్గుణ`పార్థ`కిరీటి` ధనుంజయ`సవ్యసాచి` గాండీవి`శ్వేతవాహన`విజయుడు`బీభత్సుడు అని ఇవన్నీ పార్థుని పది నామములు. ఇవిగాక జిష్ణువు అని మరో పేరుకూడ

కలదు'' అంది శంఖుపుత్రి.

''ఆహా... ఎంత చక్కగా గుర్తుంచుకున్నావు తల్లీ. ఏదీ పదిపేర్లు ఎలా వచ్చినవో అది కూడ చెప్పు'' అనడిగాడు కుతూహలంగా నాగకేసరి.

''తెలుపురంగు మేని ఛాయవాడు గావున ఆయన్ని అర్జునుడు అన్నారు. ఉత్తరా ఫల్గుణ నక్షత్రమందు జన్మించినవాడు గనుక ఫల్గుణుడు అన్నారు. కుంతీదేవికి పృధతి అని మరో పేరు వుంది. ఆ విధంగా పార్థుడు అయ్యాడు. మహేంద్ర దత్తమైన కిరీటమును సదా ధరించువాడు కావున ఆయన్ని కిరీటి అన్నారు. సకల సంపదలను జయించినవాడగుటచే ధనుంజయుడయ్యాడు. రెండు చేతులా బాణప్రయోగము చేయు నేర్పరిగా సవ్యసాచి అయినాడు. శివదత్తమైన గాండీవమును ధరించి గాండీవి అయినాడు. ఎప్పుడూ తెల్లటి అశ్వాలు పూన్చిన రథమునధి రోహించువాడు అందుకే శ్వేతవాహనుడన్నారు. అపజయమన్నది ఎరుగని వీరునిగా విజయుడన్నారు. శత్రువు మధ్య బీభత్సమును సృష్టించు మహావీరునిగా బీభత్సుడు అన్నారు. అంతటి మహావీరుని దశనామాలు స్మరించు వారికి సకల శుభములు ఒనగూరునట...'' అంటూ శంఖుపుత్రి వివరిస్తుంటే ముగ్ధుడై విన్నాడు నాయకుడు నాగకేసరి.

''చక్కగా వివరించినావు శంఖుపుత్రీ. నీ పలుకులు నిజములేగాని నీవు జూచినవాడు మాత్రం పార్థుడుగాడు'' అన్నాడు.

''గాకపోవుటయేమి? శతవర్షముల పూర్వము నా బాల్యమందు ఎప్పుడో అర్జునుల వారి శౌర్యపరాక్రమములు ఆయన రూపవిలాసముల గురించి ఎన్నో గాథలు వినియుంటిని. వాటికి సరితూగు ఈ వీరుడు అర్జునుడే''

''కాదంటినిగదా. ఇతని పేరు కూడ ధనుంజయుడే. పాండువంశీకుడు అర్జునుల వారికి ముదికి ముదిమనవడవుతాడు. కలియుగారంభంలోనే పాండవులంతా స్వర్గారోహణ జేసినారు గదా. ఇప్పుడెక్కడి అర్జునుడు. ఇతడు రత్నగిరి మహారాజు ధర్మతేజుని ఏకైక కుమారుడు. కార్యార్థియై నాగలోకమునకు దారి వెదుకుచూ ఉత్తరాపథానికి బయలుదేరినాడు. అతడి రాక నాగరాజు ప్రభువుకు నచ్చలేదు. అతడి ప్రయత్న భంగమొనర్చి కోటకు మరలించమని నాగలోకాధిపతి ఆనతి. అ ప్రయత్నమే ఈ ఓజో ప్రయోగం. మేమా ప్రయత్నంలో ఉండగానే నీ విటకు వచ్చినావు'' అంటూ వివరించాడు.

శంఖుపుత్రికి విషయగ్రాహ్యము కాలేదు.

అర్థమైకూడ అర్థంగానట్టుంది.

అతడు అర్జునుడు కాదు. రత్నగిరి రాకుమారుడు గావచ్చు కాని అతడికి నాగలోకంలో ఏమి పని? అతని నిరోధింప నాగరాజుకు అవసరం ఏమున్నది? నాగలోకానికి రత్నగిరి శత్రువా? కాదే అదే అడిగింది.

"ధనుంజయుడు ఎందుకు బయలుదేరినాడు?"

"తెలిదు?"

"నాగలోకంలో అతడికి పని ఏమి?"

"తెలిదు"

"నాగరాజుకి ధనుంజయుడు శత్రువా? అతడ్ని మరలింప నగత్యం ఏమిటి?"

"చాలు తల్లీ! నీ ప్రశ్నలు   చాలును." అంటూ నవ్వేసాడు నాగకేసరి.

"నీ ప్రశ్నలకు నా వద్ద సమాధానములు లేవు. ఏమి జరిగినదో కూడ నాకు తెలియదు. నేను నాగరాజ వారి పరమభక్తుడనని నీకు తెలుసు. వారి ఆనతి నెరవేర్చటం మాత్రమే నా పని. ఇంతకుమించి ఏమీ తెలియదు. సరియా? ఇకపద, భోజనవేళ మించినది. లోన అంతా మన కోసం ఎదురు చూస్తున్నారు. ఈరోజు నీవు మాతో విందారగింపవలె. లోనికి పోవుదము రమ్ము." అంటూ లేచాడు నాగకేసరి.

"అటులనే వచ్చెదను. నీవు నడువుము. ఒకింత తాళి (ఆగి) వచ్చెదను" అంది, తిరిగి తన ఆలోచనల్లో కూరుకుపోతూ శంఖుపుత్రి.

అభ్యంతరం చెప్పకుండా ఓసారి ఆమెను చూసి`

చరచరా ఇంట్లోకి వెళ్ళిపోయాడు నాగకేసరి.

శంఖుపుత్రి తీవ్రంగా యోచిస్తోంది.

ఆమె మదిలో రత్నగిరి యువరాజు ధనుంజయ మెదులుతున్నాడు. అతడి రూపవిలాసాలు మర్చిపోలేక పోతోంది. అసలు విషయం తెలీకున్నా పరిస్థితుల్ని కొద్దికొద్దిగా అర్థం చేసుకోగలుగుతోంది.

ధనుంజయుడు నాగలోకం చేరడానికి బయలుదేరి వస్తున్నాడు. అతడి రాక నాగరాజుకి ఇష్టంలేదు. తన లోకంలో మానవుల ప్రవేశాన్ని ఆయన సహించడు. ధనుంజయుని శత్రువుగానే భావిస్తాడు. అలాచూస్తే నాగరాజు తనకూ శత్రువే. చిరకాలంగా తన మనసులో నాగరాజు మీద పగ, ప్రతీకార జ్వాలలు అలాగే వున్నాయి. ఈ లోకమంతా ప్రేమబంధంతోనే నడుస్తున్న విషయం ఆయనకు తెలియదా? అన్యాయముగా తన ప్రియుడు బ్విని చంపించాడు. తనను నాగలోకం నుండి బహిష్కరించి దిక్కులేని అనాధను చేసాడు. తన కష్టాకు కారణమయ్యాడు.

అలాంటి తన శత్రువు నాగరాజుమీద పగతీర్చుకొనే ఒక అవకాశం కొరకు చాలాకాలంగా తను ఎదురు చూస్తోంది. మదిలోనే వేదన పడుతోంది. తన వేదన తీరే సమయం కలిసి వచ్చినదా? రాకుమారుడు ధనుంజయుని ప్రయాణం తనకు ఒక అందివచ్చిన అవకాశముగా భావింపవచ్చునా? నాయకుని మాటల్నిబట్టి ధనుంజయుడింకను తన రాజ్య సరిహద్దులు దాటలేదని తెలుస్తోంది. అతడు మర్మభూమిలో కాలుమోపకముందే తను ఓసారి అతడ్ని కలుసుకుంటే మంచిదేమో. శంఖుపుత్రి మనసులో నెమ్మదిగా ఓ పథకం రూపుదిద్దుకుంటోంది. తన మనసులోని ఆలోచనల్ని నాయకుడు నాగకేసరితో పంచుకోవటం శంఖుపుత్రికి ఇష్టంలేదు. అతను నాగరాజు భక్తుడు. తన ఆలోచనలు నాగరాజుకి తెలిస్తే తన ప్రాణాలకు అపాయము. అందుకే నాగకేసరి ముందు ఈ విషయాలేవీ ప్రస్తావించ దలుచుకోలేదామె. ఆమె ఆలోచనలు ఓ కొలిక్కి రాకముందే ఇంట్లోంచి నాయకుడి పిలుపు వినవచ్చింది. అంతటితో తన భావాలను పక్కనపెట్టి విందారగించడానికి చరచరా పాకుతూ నాయకుని గృహంలో ప్రవేశించింది శంఖుపుత్రి.

*******************************************

కరివీరుని అశ్వికదళం కనుమరుగవగానే` రాకుమారుడు ధనుంజయుడు, అపర్ణుడు తమ అశ్వాలనధిరోహించి కొండదిగువకు బయలుదేరారు. బాటవెంట నెమ్మదిగా దౌడు తీస్తున్నాయి గరుడ, ఢాకినీ అశ్వాలు రెండూ.

ఈ కొద్ది పరిచయంలోనే అపర్ణుడిపట్ల నమ్మకమూ, స్నేహభావమూ ఏర్పడింది ధనుంజయుడికి. పిలవకుండానే వచ్చాడు, తనకు మిత్రుడయ్యాడు. రెండు జటిల సమస్యల నుండి అవలీలగా తనను తప్పించాడు. అందుకే కృతజ్ఞతా బావం ఏర్పడింది.

''నాకో విషయం బోధపడుటలేదు అపర్ణా. మూడుసార్లూ బొమ్మపడుట ఏమి? సంభవమేనా? నిజంగా మా రత్నగిరి రాజ్యక్ష్మితల్లి నా పక్షాన నిలిచి మార్గం చూపిందంటావా?'' దారిలో అడిగాడు ధనుంజయుడు.

ఆ మాటలకు గుంభనగా నవ్వాడు అపర్ణుడు.

''యువరాజా! నన్ను నిజం చెప్పమందురా, అబద్ధము చెప్పమందురా?'' అన్నాడు.

''నిజమే చెప్పవలె'' అన్నాడు ధనుంజయుడు.

''ప్రభూ! లోకంలో ఇంద్రజా, మహేంద్రజా, గజకర్ణ, గోకర్ణ, టక్కు టమారాది షడ్వర్గములైన గారడీ విద్యలున్నాయి. అవన్నీ చూసేవారికి కనికట్టు చేసి మోసగించుటకే. ఉన్నదిలేనట్టు, లేనిది ఉన్నట్టు చూపించేదే కనికట్టు విద్య. నీ విజయము కొరకు వాటిలో ఒక విద్యను ప్రయోగించి కరివీరుని మోసగించినాను'' నవ్వుతూ అపర్ణుడు వివరిస్తూంటే, నమ్మలేనట్టు చూసాడు ధనుంజయుడు. మోసం ఎక్కడ, ఎలా జరిగిందో అర్థంకాలేదు.

''లేదు లేదు. మోసము జరిగినట్టు నాకు తోచలేదు'' అన్నాడు.

''ఆహాఁ... ఇది చూడండి ప్రభూ. మీకే తెలియును'' అంటూ దట్టీలోంచి రెండు బంగారు నాణాలను తీసి ధనుంజయుని చేతిలో ఉంచాడు.

వాటిని పరిశీలించి విస్తుపోయాడు ధనుంజయుడు.

ఒక నాణెం బొమ్మ, బొరుసు కలిగి బాగానే వుంది. కాని రెండో నాణానికి బొరుసు లేదు. ఇరువైపులా బొమ్మ ముద్రించి వుంది. అంటే అపర్ణుడు చేతిలో చూపించింది మంచి నాణమే. కాని గాలిలో ఎగరేసినది మాత్రం ఈ రెండో నాణెము. కాబట్టి ఎన్నిసార్లు ఎగరేసినా బొమ్మేపడుతుంది. 'భళా! ఏమి ఈ అపర్ణుడి చాతుర్యము' అనుకున్నాడు ధనుంజయుడు మనసులో. తనూ నవ్వేస్తూ నాణాలను అపర్ణుడికి తిరిగి ఇచ్చేసాడు.

"ఇలాంటి నాణాలు కూడ వుంటాయాల్`-`? ఇరువైపులా ఒకే బొమ్మతో?" అనడిగాడు.

"ఉంటాయి ప్రభూ! మనం తయారుచేసుకుంటే." అంటూ ఫక్కున నవ్వి బదులిచ్చాడు అపర్ణుడు.

"నమ్మలేకున్నాను. నీకు చాలా విద్యలు తెలిసినట్టున్నాయే."

"చాలా కాదుగాని ఏవో కొంచెం తెలుసు."

మాటల్లోనే అశ్వాలు బాటదిగి, కొండపాదం వైపు వచ్చేసాయి. అపర్ణుడు ఏదో గుర్తుకొచ్చినట్టు యువరాజును చూస్తూ`

"అన్నట్టు మీరింకనూ భోజనం చేయనేలేదనుకుంటాను. అలసినట్టు కన్పిస్తున్నారు. భోజనం చేసి, ఒకింత విశ్రాంతిగైకొని బయలుదేరుట మంచిదికదా?" అనడిగాడు.

"అవును మిత్రమా. కాని అందుకు అనువైన చోటు అగుపించుట లేదే"


"నాతో రండి, చూపిస్తాను. సమీపమందే ఓ చక్కని ప్రదేశము కలదు."

‘‘ఊహుఁ... నాకు తెలిసి అలాంటి చోటిచటలేదు. ఆకురాల్చిన చెట్లు నీడనిచ్చుట లేదు. వేడిగాలి, పాదప్రక్షాళనకు నీరుగల చెలమగాని, వాగులు గాని లేవు. జలశయాలు ఎండినవి’’

‘‘నా మాటలు సత్యము యువరాజా! ఇంతకుమించిన వేసవిలో కూడ చల్లటి నీటితో సేదతీర్చే ప్రదేశమొకటి సమీపమునందే యున్నది. నాతో రండి’’ అంటూ అశ్వాన్ని కుడిపక్కకు మళ్ళించి, బాట నుండి చిక్కటి అడవిలోకి దారితీసాడు అపర్ణుడు. అదేమిటో చూడాలని తన అశ్వాన్నికూడ అటు మళ్ళించాడు ధనుంజయుడు.

బాటనుండి సుమారు వేయి ధనువుల దూరంలో అజ్ఞాతంగా వుందాచోటు. రెండు చిన్నగుట్టల మధ్య సన్నటి దారి వెంట ఆవలకుపోగానే కన్పించిందా చోటు. చూడగానే అశ్వాన్ని నిలువరించి, ఆశ్చర్యసంభ్రమాలతో అలాగే చూస్తూండిపోయాడు ధనుంజయుడు.

తాను చూస్తున్నది కలో నిజమో అర్థంకాలేదు..




ఎవరో అజ్ఞాత చిత్రకారుడు రంగు కుంచెతో అద్భుతంగా చిత్రించిన సుందర వనంలా ఉందా ప్రాంతం. చిన్న చిన్న కొండ గుట్టల

మధ్యన విశాలమైన నీటి మడుగు కనువిందు చేస్తోంది. మడుగును చుట్టి దట్టంగా అనేక వృక్షాలు, పొదలు, లతలు పచ్చగా మెరుస్తూ చల్లటి నీడనిస్తున్నాయి. ఓ కొండ గుట్ట పై నుంచి జాలు వారుతున్న స్వచ్ఛమైన నీరు నిశ్శబ్దంగా కొండవాలు వెంట జారి కింద మడుగు లోకి చేరుతోంది. సమృద్ధిగా నీరు వున్న చోట తారు లతలు కళకళ లాడుతూంటాయి. కొంత దూరంలో ఏపుగా పెరిగిన అడవి అరటి చెట్లు అనేకం కన్పిస్తున్నాయి. మాగిన అరటి పండ్లతో గెలలు నోరూరిస్తున్నాయి. అరటి పండ్లు మెక్కిన కోతులు వృక్ష శాఖల మీద తీరిగ్గా విశ్రాంతి పొందుతున్నాయి. శుక పిక శాలి కాది వృక్ష సమూహాలు మడుగు మీదుగా ఎగురుతూ సందడి చేస్తున్నాయి. మడుగు మీదుగా వీస్తున్న శీతల గాలులు వడ దెబ్బ నుండి సేద తీరుస్తున్నాయి. నయన మనోహరమగు ఆ ప్రదేశాన్ని చూస్తూ అశ్వం దిగాడు ధనుంజయుడు. పులకించిపోయాడు. తన్మయంతో` ‘‘నమ్మలేకపోతున్నాను మిత్రమా! ఈ సమీపాల్లో ఇంతటి రమణీయ ప్రదేశమొండు కలదని ఇంతవరకు తెలియనైతిని సుమా’’ అన్నాడు ముందుకు నడుస్తూ.

అప్పటికే తన అశ్వం దిగిన అపర్ణుడు అతన్ని అనుసరిస్తూ చెప్పాడు` ‘‘మీకే కాదు యువరాజా! బాటసారులు చాలా మందికి ఈ చోటు తెలిదు. ఎందుకంటే, బాట నుండి దూరంగా గుట్టల మధ్య వున్నది కదా. ఈ మడుగు నీరు స్వచ్ఛమైనది, రుచిగా వుంటుంది. మీరు స్నానమాచరించి, భుజించి ఒకింత విశ్రాంతి నొందుటకు అనువైన చోటు. సాయం సమాయన తిరిగి ప్రయాణం సాగింపవచ్చు’’ అన్నాడు.

ధనుంజయుడు సాలోచనగా వెనుతిరిగి`

అపర్ణుని వంక చూసాడు.

‘‘నాకు తెలిక అడుగుతాను అపర్ణా. చూస్తుంటే మా అటవీ ప్రాంతాన్నీ నీకు కొట్టిన పిండిలా వున్నట్టుంది. ఈ రహస్య ప్రాంతం నీకు మాత్రం ఎలా తెలుసును?’’ సందేహం వ్యక్తం చేసాడు.

చిన్నగా దరహాసం చేసాడు అపర్ణుడు.

‘‘మీ మాటలు సత్యదూరము కాదులే యువరాజా. నేను తిరగని అటవీ ప్రాంతాలు లేవు. పిన్న వయసు నుంచి అలవాటే. ఏలాగున అని అడగవద్దు. సమయమంటూ వస్తే తప్పక వివరించగలను. మీరు స్నానం చేయండి. నేనలా వెళ్ళి అరటి పండ్లు తెచ్చెదను’’ అంటూ మరో మాటకి అవకాశం యివ్వకుండా అపర్ణుడు ముందుకు సాగాడు.

కొద్ది క్షణాలు వెళ్తున్న అపర్ణుడినే చూస్తుండి పోయాడు ధనుంజయుడు.

‘‘పండ్లకు తొందరేమున్నది మిత్రమా. వెనక్కురా. ఇరువురము కలిసే స్నానమాచరించెదముగాక’’ అంటూ పిలిచాడు.

‘‘లేదు లేదు. నేనిపుడు స్నానమాచరింప. మీరు కానిండు’’ తిరిగి చూడకుండానే బదులిచ్చాడు అపర్ణుడు.

అతడు వెళ్తున్న దారిలో అడవి నెమళ్ళు రెండు పురి విప్పి నాట్యం చేస్తున్నాయి. ఆడ నెమళ్ళు ఆడుతున్నాయి. అపర్ణుడి నడకలో నాట్యం కన్పిస్తోంది. నడక తీరు హొయలు మనోహరంగా వున్నాయి. ఎందుకో కాసేపలా సందిగ్ధంలోనే వుండిపోయాడు ధనుంజయుడు. వీడు నిజముగా అపర్ణుడా? లేక... అపర్ణా... వీడు నాకు అర్ధం గావటం లేదే. అయినా వయసుకు మించిన అంత పెద్ద తలపాగా అవసరమా... మర్మమేదో ఆ తలపాగా లోనే వున్నట్టుంది. సూర్యాస్తమయం లోన వీడి గుట్టు తెలుసుకోలేనా?

ఆలోచిస్తూనే అశ్వాలు రెంటిని పచ్చిక మీద మేతకు వదిలాడు. వంటి మీది ఉడుపు (దుస్తులు) తీసి, నడుంకి వస్త్ర భాగం చుట్టుకుని స్నానానికి మడుగు లోకి దిగాడు.

ఛాతికి మించి లోతు లేదా మడుగు.

చల్లటి నీరు ఉష్ణతాపాన్ని పోగొట్టి శరీరానికి హాయినిస్తోంది. ముదములో మునకలు వేసి ఈతలు కొడుతూ జల క్రీడకు ఉపక్రమించాడు ధనుంజయుడు. వెళ్తున్న అపర్ణుడికి నీళ్ళ శబ్దం విన్పిస్తూనే వుంది. అయినా తిరిగి చూడలేదు. నేరుగా అంత దూరంలోని కదళీ వనాన్ని చేరుకున్నాడు. అనేక అరటి చెట్లు ఏపుగా పెరిగున్నాయక్కడ.

అచటికి చేరుకోగానే ఓరకంట ఓసారి వెనక్కి చూసాడు అపర్ణుడు. జలక్రీడలో తన్మయుడై వున్నాడు యువరాజు. ఏడడుగులపైగా ఆజాను బాహుడు, గోధుమ వన్నె మేని ఛాయవాడు, విశాలమైన వక్ష స్థలం, సన్నటి నడుం, కండలు తిరిగిన దృఢమైన బాహువులు, సన్నటి సింహం నడుంతో నీటి తడిలో నవ మన్మధునిలా మెరిసి పోతున్న ధనుంజయుని చూడ్డానికి రెండు కళ్ళు చాలవనిపించింది. బలవంతంగా చూపులు తిప్పుకొని అరటి చెట్లలో జొరబడి ఖడ్గం అందుకున్నాడు.

సరిగ్గా అప్పుడే`

అంత వరకు అక్కడి నీడలో ప్రశాంతంగా పడుకునుంది అయిదు మూర్ల నల్లత్రాచు ఒకటి. అపర్ణుడి రాక గమనించి చేటలా సర్పం విప్పింది. 'బుస్' మని భీకరంగా బుసలు కొడుతూ కస్సున పైకి లేచింది.

తన దారికి అడ్డంగా వున్న ఆ కరి నాగును ` అపర్ణుడు గమనించాడు.

అయినా కొంచెం కూడ తొట్రు పడలేదు, భయ పడలేదు. తీక్షణంగా దాని కళ్ళ లోకే చూస్తూ ముందుకెళ్ళాడు. ఏదో మంత్రం పఠిస్తూ తన కుడి చేతిని ముందుకు చాపాడు అంతే `

అంతగా బుసకొట్టిన సర్పం కూడ తన రోషాన్ని వదిలి పడగ మూసి పిల్లిలా అపర్ణుడి ముందు తల నేలకు వాల్చింది.

అది లోనే ఒకప్పుడు తన బిడ్డయిన సర్పాలు తన మాట విని అవినీతికి పాల్పడలేదన్న కోపంలో తల్లి కద్రువ గరుడలకు ఆహారం కమ్మని తన సంతానాన్ని శపించింది. ఆ శాప ఫలితం గరుడులకు నాగులకు వైరం. అందుకే సర్పజాతి కన్పిస్తే గరుడ పక్షులు వదలవు. అలాంటి గరుడ రేఖ అపర్ణుడి కుడిచేతిలో వుంది. ఆ పైన మంత్ర కట్టులో కరి నాగు అపర్ణుడి వశమైపోయింది.

''కరి నాగమా! ఏమా పొగరు నీకు? నీకును నాకును శత్రుత్వము లేదు గదా! నీ దారి నీది, నా దారి నాది. అడ్డు తొలగి స్వేచ్ఛగా వెళ్ళిపో త్వరితముగా.'' అంటూ ఆజ్ఞాపించాడు.

ఆ మాటకు కట్టు బడుతూ వెనక్కు వెనక్కు జరిగిందా పాము. అక్కడి నుండి ఎడం పక్కకు తిరిగి వేగంగా పాకుతూ అంత దూరం లోని దట్టమైన పొదలోకి వెళ్ళిపోయింది. ఇక బయటకు కన్పించలేదు.

అపర్ణుడు ముందుకెళ్ళి చక్కగా పండిన రెండు అరటి గెలలను నరికి వాటితో వెనుతిరిగాడు.ఈ లోపల అక్కడ యువరాజు ధనుంజయుడు స్నానం ముగించి, తీరం ఎక్కి దుస్తులు మార్చుకున్నాడు. తడి బట్టను పొద మీద ఆరవేసాడు. వృక్ష ఛాయలో కంబళి పరిచి కూచున్నాడు. అశ్వాలు జంటగా పశ్చిక మేస్తున్నాయి. చన్నీటి స్నానంతో శరీరం తేలిక పడి ధనుంజయునికి నిద్ర ముంచుకొస్తోంది. ఇంతలో అపర్ణుడు అరటి గెలలతో తిరిగి వచ్చాడు. అపర్ణుడు మడుగు నీటిలో ముఖం, కాళ్ళు చేతులు కడుక్కొని వచ్చాడు. ఇద్దరూ జొన్న రొట్టెలతో బాటు అరటి పళ్ళు ఆరగించారు.

''ఇక మీరు విశ్రమించండి యువరాజా!'' అంటూ లేచాడు అపర్ణుడు.

“మరి నీవు? ఒకింత విశ్రమించ వచ్చు గదా. ఇచట కౄరమృగాల జాడ కూడ లేదు” కంబళి మీద మేను వాలుస్తూ అడిగాడు ధనుంజయుడు.

“ఇది భల్లూకాలు అధికంగా సంచరించే చోటు. నేను కాపలా వుంటాను, మీరు విశ్రమించండి” అన్నాడు అపర్ణుడు.

ధనుంజయుడు గాఢ నిద్రా వశుడయ్యాడు.

తిరిగి మెలుకువ వచ్చేసరికి పగటి మూడో యామం పూర్తయి సూర్యుడు పశ్చిమకాశంలో పైన ప్రకాశిస్తున్నాడు. రాత్రి పడ్డానికి ఇంకో జాము పొద్దు మాత్రమే మిగిలి వుంది. అది కూడ కాదు, లేచి కూచునే సరికి ఒక విచిత్రమైన దృశ్యం అతడి కంట బడింది.

భయంకరమైన రెండు అడవి ఎలుగొండ్లు వాటి పిల్లలు రెండు, వాటి మెడలో లతలు పూలతో కూడిన మాలలు వేసి గంతులేస్తూ వాటితో ఆడుకుంటున్నాడు అపర్ణుడు. ఇది అసాధారణ విషయం.

అడవి భల్లూకాలు మనుషుల్ని చూస్తే రెచ్చిపోయి దారుణంగా దాడి చేస్తాయి. కొన్ని సందర్భాల్లో చంపేస్తాయి. ఓడిపోతే తిరిగి చూడకుండా పారిపోతాయి. అలాంటి కౄర మృగాలను పెంపుడు జంతువుల్ని చేసి ఆడుకోవటం నమ్మ శక్యం గావటం లేదు. అసలు ఎవరీ అపర్ణుడు. ఇతడికి రాని విద్యంటూ వుందా? చూస్తుంటే ఇతడిలో అసాధారణ ప్రతిభలు చాలా వున్నాయనిపిస్తోంది. ప్రతిక్షణం కొత్తగా కన్పిస్తూ సరికొత్త సందేహాలకు తావిస్తున్నాడు. ఇతడు నిజంగా రత్నగిరి వాడేనా? ఎక్కడి నుండి వచ్చాడు? ఎంత వరకు వస్తాడు? ఏమీ అర్థం గావటం లేదే. ఎడ తెగని ఆలోచనలతో కొద్దిసేపు ముచ్చటగా భల్లూకాలతో అపర్ణుడి ఆటను చూస్తుండిపోయాడు ధనుంజయుడు.

అంతలో యువరాజు నిద్ర లేవటం గమనించిన అపర్ణుడు, ఆటలు ఆపి భల్లూకాన్ని భుజం తట్టి పంపించేసాడు. అవి కనుమరుగు కాగానే ధనుంజయుని వద్దకొచ్చాడు.

“లేచారా ప్రభూ! సాయం సమయమైనది. ఒక జాము పొద్దు మాత్రమే వున్నది. మనము బయలుదేరుట మంచిది.” అంటూ గుర్తు చేసాడు.

“అలాగే మిత్రమా! కాని ఆ భల్లూకాలేమిటి? నీ పాత మిత్రులా లేక గత జన్మ అనుబంధమా! సాధు జంతువుల్లా నీతో

ఆడుకొనుచున్నవి?" లేచి పరిహాసంగా నవ్వుతూ అడిగాడు ధనుంజయుడు.

"అదేం కాదులే" అంటూ తనూ నవ్వాడు అపర్ణుడు.

"ఏ జంతువైనా నాకు ఇట్టే వశమై పోతుంది. అదొక విద్య అంతే!" అన్నాడు అపర్ణుడు. ఇక జాగు చేయకుండా అశ్వారూఢులై అక్కడి నుంచి బయలు దేరారు ఇరువురూ.

అడవి నుంచి తిరిగి బాట మీదకు చేరుకోగానే అశ్వాలు గరుడ, ఢాకినీ రెండూ పోటీ పడి దౌడు ఆరంభించాయి. దారిలో కొందరు అశ్వికులు, రథాలు, ఎడ్లబండ్లు, గుంపులుగా బాటసారులు అక్కడక్కడా ఎదురవుతున్నారు. మధ్యలో ఎక్కడా ఆగలేదు అపర్ణుడు, ధనుంజయుడు.

క్రమంగా సూర్యుడు పడమట వాలుతున్న వేళయింది. ఎండ తీవ్రత చాలా వరకు తగ్గింది. ఆడవి మీదుగా శీతల గాలులు ఆరంభించాయి. ఆకాశంలో కొంగల బారులు దక్షిణంగా సాగి పోతున్నాయి. ఉత్తరాకాశంలో కొన్ని నల్ల మబ్బులు గోచరిస్తున్నాయి. ఇంకొంత వ్యవధిలో చీకటి పడనుందనగా అశ్వాలు అడవి మధ్య లోని ఒక కూడలి ప్రాంతానికి చేరుకున్నాయి. ప్రధాన మార్గం నుండి అక్కడ ఎడం పక్కగా మరో మార్గం పశ్చిమంగా చీలి పోతోంది.

తన అశ్వాన్ని అక్కడి నిలువరించాడు అపర్ణుడు.

"ఆగితివేనయ్యా మిత్రమా! చీకటి పడకముందే మనం ఏదో ఒక సురక్షిత ప్రదేశానికి చేరుకొనుట ఉత్తమం కదా?" తన అశ్వాన్ని అపర్ణుడి పక్కగా పోనిస్తూ అడిగాడు యువరాజు ధనుంజయుడు.

"యువరాజావారికింతవరకు దేశాటన చేసిన అనుభవం వున్నట్టు లేదు" ఒకింత పరిహాసంగా అడిగాడు అపర్ణుడు.

"ఆ మాట నిజము. మా రత్నగిరి రాజ్యంలో కూడ కొంత భాగం మాత్రమే తిరగాను. ఇది దేశాటనకు బయలుదేరు సమయమే... కాని కారణాంతరాల వలన వేరే పని బడింది. నీకెందుకొచ్చినదా సంశయం?"

“కాబోయే ప్రభువులు మీరు. దేశాటన చేయుట చాలా అవసరము. దేశాలు తిరిగి చూచుట వలన అనుభవం వస్తుంది. దేశ కాల పరిస్థితుల్లో ఆయా దేశాలు అచటి ప్రజలు వారి భాషలు, ఆచార వ్యవహారాలు, అచటి పరిపాలనా పద్ధతులు, ప్రజల కష్ట సుఖాలు అనుభవంలోకి వస్తాయి. ఇప్పుడు మీ ప్రయాణం ఆ కొరత తీరుస్తుందని ఆశిస్తాను. మీరిలా కొంత దూరం వెళ్ళగానే అటవీ ప్రాంతం తరిగి పోయి సుక్షేత్రాలయిన పంట భూములు కన్పిస్తాయి. చీకటి పడిన కొద్ది సేపటికే ఎగువన రామగిరి అనే గ్రామం చేరుకుంటారు. రాత్రికి అచటి సత్రంలో మజిలి చేసి, ఉదయం బయలు దేరవచ్చు.”

అపర్ణుడివన్నీ ఎందుకు చెప్తున్నాడో ధనుంజయుడికి అర్థం కాలేదు. “అంటే… నీవిటు నాతో వచ్చుట లేదా?” అనడిగాడు

“లేదు యువరాజా. నా మార్గము ఇటు. రాత్రికి బోయ పల్లెలో మజిలి చేసి వేకువనే చంపక పురానికి బయలు దేరతాను”

“చంపక పురంలో పని ఏమి అని అడగను. కాని మాకు అంతరంగిక మిత్రుడివయ్యావు. పునర్దర్శనం ఎప్పుడు?”

భుజాలు ఎగురవేసి సన్నగా నవ్వాడు అపర్ణుడు.

‘మీ స్నేహం లభించటం నా అదృష్టం యువరాజా. మన స్నేహం స్వచ్ఛమైతే త్వరలోనే మనం కలుసుకోగలమన్న నమ్మకం నాకున్నది. ఇక శెలవు ప్రభూ. మీరును ముందుకు సాగండి. పోయి వచ్చెద” అంటూ మరో మాటకు అవకాశం యివ్వకుండా తన అశ్వం ఢాకినిని అదలించాడు అపర్ణుడు.

దౌడు తీస్తున్న అశ్వాన్ని దాని మీద వెళ్ళిపోతున్న అపర్ణుడిని చూస్తూ భారంగా నిట్టూర్చాడు ధనుంజయుడు. ఇలా మధ్యాహ్నం పరిచయమై అలా సాయంత్రం వెళ్ళి పోతుంటే బాధగానే వుంది. కొద్ది రోజులు తన వెంట వస్తాడనుకున్నాడు. కాని ఇక్కడే విడిపోయాడు. లోకం ఎవరి కోసం ఆగదు. ఎవరి పనులు వారివి. లక్ష్యాన్ని వెదుక్కొంటూ ఒంటరి గానే తను ముందుకు సాగాలి.

అపర్ణుడి అశ్వం అడవి దారిన కను మరుగు కాగానే తన అశ్వం గరుడను అదిలించి ముందుకు దూకించాడు.

అపర్ణుడిది వయసు తక్కువ గాని అనుభవంలో దిట్ట. అతడు చెప్పినట్టే చీకటి పడిన కొద్ది సేపటికే పొలాల మధ్య వున్న రామగిరి గ్రామ పొలి మేరల్లోకి అడుగు పెట్టింది అశ్వం గరుడ

*******************************

రాజధాని నగరం రత్నగిరి.

పేరుకు తగ్గట్టు గానే సిరి సంపదలతో వర్ధిల్లే ఒక అద్భుత నగరం. సముద్ర తీరంలోని ఈ నగరం దుర్భేద్యమైనది. ఎటు చూసినా ఎత్తైన భవంతులు, కోటలు, పేటలు, సుఖ సంతోషాలతో జీవించే ప్రజలు, కళకళలాడే వీధులతో నయన మనోహరంగా వుంటుంది.

ప్రస్తుతం రత్నగిరి పాలకుడైన ధర్మతేజ మహారాజు పాండు వంశంలో నాటి పాండవాగ్రజుడైన ధర్మరాజు తర్వాత అంతటి ధర్మ ప్రభువుగా ఆదర్శ మూర్తిగా ప్రజల మన్ననలు పొందిన వాడు. రత్నగిరి ప్రజలు ఆయన్ని దైవంగా భావిస్తారు.

అలాగని ధర్మ తేజుడు తన రాజ్య రక్షణ విషయంలో ఎన్నడూ అశ్రద్ధ చేయలేదు. అసంఖ్యాక సైనిక బలం వుంది. పటిష్టమైన పరిపాలనా విధానం వుంది. ఎప్పటికప్పుడు దేశ విదేశాల సమాచారాన్ని అందించే గూఢచార వ్యవస్థ వుంది. పావురాల మూలంగా ఎప్పటికప్పుడు రాజధానికి సమాధానం చేరవేయటంలో రత్నగిరి వాసులు బహు చతురులని పేరు పొందారు. అందుకే పొరుగు రాజులు ఎవరూ రత్నగిరి వైపు కన్నెత్తి చూడరు. దాడికి తెగబడరు.

ఆశనేది మనకి లేక పోవచ్చు.

కాని ఎదుటి వారికుండొచ్చు.

రాజ్య కాంక్ష మనకు లేక పోవచ్చు. కాని పొరుగు వాడికుంటుంది.అలాంటి వాళ్ళు అవకాశం కోసం గుంట నక్కల్లా కాచుకుని వుంటారు. వాళ్ళని కని పెట్టడం అంత సులువు కాదు. ప్రస్తుతం రత్నగిరిలో పరిస్థితుల్ని బట్టి అవకాశాన్ని పరిశీలిస్తున్న మేక వన్నె పులులు కొన్ని వున్నాయి. వాటి గురించి రత్నగిరి ప్రభువుకు తెలీదు. వేగులు కూడ ఇంతవరకు పసి గట్ట లేక పోయారు.

ఆ రోజు వేకువనే కరూర దేశానికి చెందిన వర్తక నౌక ఒకటి రత్నగిరి ఓడరేవుకు చేరుకుంది. రేవు సుంకం చెల్లించి ఓడలోకి అవసరమైన మంచి నీరు పట్టుకున్నారు. ఆహార పదార్థాలు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసారు సరంగులు. తమ ఓడ వ్యాపార నిమిత్తంగా సింహళ ద్వీపం వెళ్ళి తిరిగొస్తోందనీ, కొన్ని మరమ్మతుల కారణంగా రెండు దినాలు రత్నగిరి సాగర జల్లాల్లో నిలిపేందుకు రేవు అధికారుల నుంచి అనుమతి తీసుకున్నారు. తర్వాత తీరానికి దూరంగా సముద్ర జల్లాల్లో తెర చాపు దించి తమ ఓడకు లంగరు వేసి అక్కడే వుండి పోయారు సరంగులు.

నిజానికి ఆ ఓడ సింహాళ ద్వీపం వెళ్ళనేలేదు. ఎగువన కరూర రేవు నుంచి నేరుగా రత్నగిరికే వచ్చింది. అది అనేక తెర చాపలతో కూడిన భారీ వర్తక నౌక. కాని అందులోని వర్తక వేష ధారులంతా గాంధార సైనికులు. అందులో వచ్చిన వాడు సాక్షాత్తు గాంధార దేశాధీశుడు శతానీకుడు. గాంధారం నుండి ఇక్కడి వరకు కూడ చాలా రహస్యంగా సాగింది అతడి ప్రయాణం.

ఎవరీ శతానీకుడు?

గాంధార దేశ రాజధాని గాంధార నగరం. ప్రస్తుతం దీన్ని కాంథహార్ అంటున్నాం. అప్పటి గాంధార దేశమే నేటి ఆఫ్ఘనిస్థాన్. ఈ గాంధార యువరాణి ధృతరాష్ట్రుని భార్య గాంధారీ దేవి. ఆమెకు నూరుగురు సోదరులు. ఆఖరి వాడు శకుని. శకుని చరిత్ర తెలిసిన వారికి ఏం జరిగిందన్నది ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కురు సామ్రాజ్య వైభవ కాలంలో పేరుకు శకుని రాజే గాని గాంధార మీద పెత్తనమంతా సుయోధనుడిదే. కురు క్షేత్ర యుద్ధానంతరం ధర్మరాజు పరిపాలన వచ్చాక గాంధారను సామంత రాజ్యం చేసి శకుని వంశీకుడ్ని అక్కడ రాజును చేయటం జరిగింది.

పిమ్మట తరాలు మారాక వచ్చిన రాజకీయ పరిణామాల్లో హస్తిన ఏలుబడి నుండి స్వతంత్రించిన కొన్ని రాజ్యాల్లో ఈ గాంధార కూడ ఒకటి. ఆ విధంగా కథా కాలం నాటికి శకుని వంశీకుల్లో ఏడో తరం వాడి శతానీకుడు. పొరుగు పచ్చగా వుంటే సహింప లేడు. కుట్రలు కుతంత్రాలు చేయటంలో అపర శకునిగా ప్రసిద్ధుడు.

గాంధార దేశం వాయువ్య భారత దేశంలో ఈశాన్యంగా పర్వతాలతో విస్తరించి వున్న దేశం. దీనికి ఎగువన కాశ్మీర రాజ్యం, దిగువన పాంచాల రాజ్యం (పంజాబ్) తూర్పు సరిహద్దు దేశాలు. వీటికి దిగువన సింధూ నది నానుకొని దిగువ సముద్రం వరకు ఉత్తర దక్షిణాలుగా ఒక పీలికలా వ్యాపించి కరూర దేశం వుంది. నేటి పాకిస్థాన్ లో కొంత భాగం, తూర్పున భృగుకచ్చా దీన్నే భరూచ్ అని పిలుస్తున్నాం. దీని మీద అధిపత్యం ద్వారక పాలకులయిన యాదవులదయినా కొంత భాగం కరూర దేశం ఆధిపత్యంలో వుండేది. శ్రీకృష్ణుని ద్వాపర నీటి మునిగిన తర్వాత ఏర్పడిన రాజకీయ పరిణామాల్లో ప్రభాస రాజధానిగా శ్రీకృష్ణుని వంశీకుల పాలన సాగింది. యాదవులు బలహీన పడ్డంతో భృగుకచ్చలో కొంత భాగం కరూరు పాలకుల ఆధీనం లోకి పోయింది.

ఇక కరూర రాజ్యం విషయానికొస్తే ఇది గతంలో మరాట్వాల ఆధీనంలో వుండేది. గాంధార దేశానికి మరాట్వాలకు శతృత్వం వుంది. కరూరులు మరాట్వాను జయించటంలో శతానీకుడు కాశ్మీరీలను, పాంచాల వారిని కలుపుకొని సాయం చేసి వున్నాడు. ఆ విధంగా కరూర రాజ్యం గాంధారకు మిత్ర రాజ్యమైంది.

కరూర దేశానికి దక్షిణాన సముద్ర తీరం తక్కువగా ఉన్నప్పటికీ ముఖ్యమైన రెండు రేవు పట్టణాలున్నాయి. సింధూ నది మీదుగా

ఈ రేవు పట్టణాల వరకు నౌకల రాక పోకలున్నాయి. కరూర దేశం వాణిజ్య పరంగా అభివృద్ధి చెందడానికి అదో కారణమైంది. పోతే గాంధారం, కాశ్మీరం, పాంచాల, కరూర దేశాలు మిత్ర దేశాలు గావటంతో గాంధార ప్రభువు శతానీకుడు నిరాటంకంగా దక్షిణ సముద్రం వరకు వచ్చి పోడానికి ఎలాంటి ఆటంకాలు లేవు. సింధూ నది మీదుగా అతడు సముద్ర రేవు పట్టణానికి చేరుకుంటే చాలు. అక్కడ సొగసైన భారీ విలాస నౌక ఒకటి సిద్ధంగా వుంటుంది. సముద్ర యానానికి తగు ఏర్పాట్లన్నీ తృటిలో జరిగి పోతాయి.

కాని ప్రస్తుత పరిస్థితి వేరు.

అతడి ప్రయాణం రహస్యంగా ఉంచ బడింది.

ముఖ్యమైన పని మీద గాంధారం నుండి బయలు దేరిన శతానీకుడు కరూర రాజ్యం మీదుగా వర్తక నౌకలో రత్నగిరి సముద్ర జలాల్లోకి ప్రవేశింప గలిగాడు. రత్నగిరికి చెందిన ఒక ఉన్నత వ్యక్తి కోసం పగలంతా ఎదురు చూస్తూనే వున్నాడు. అతడితో బాటు అతడి పరివారమూ వర్తకులు వేషాల్లోనే వున్నారు. అయినప్పటికీ కూడ శతానీకుడు నౌక ఉపరితలానికి రాకుండా దిగువన తనకు కేటాయించిన ప్రత్యేక మందిరానికే పరిమితమయ్యాడు.

క్రమంగా సాయంకాలమైంది.

పశ్చిమాకాశం అరుణ వర్ణం దాల్చి ప్రభాకరుడు సముద్ర జల్లాల్లో అస్తమించడానికి సిద్ధ పడుతున్నాడు. వాతావరణం ఇప్పుడిప్పుడే చల్ల బడుతూ సాగర జలాల మీదుగా శీతల గాలులు వీస్తున్నాయి. నౌక దిగువ భాగంలోని ప్రత్యేక మందిరంలో గవాక్షం చెంత ఉచితాసనం మీద సుఖాసీనుడై వున్నాడు గాంధారాధీశుడు.

మధ్యాహ్న భోజనానంతరం ఒకింత విశ్రాంతి నొందిన శతానీకుడు నిద్ర లేచినప్పటి నుండి అక్కడే కూచుని మధిర సేవిస్తూ ప్రశాంతంగా ఆలోచిస్తున్నాడు. వచ్చింది రహస్య ప్రయాణం కాబట్టి శిరస్సున మణిమయ కిరీటంగాని రాజోచితమైన దుస్తులు, ఆ భూషణాలు గాని లేవు. ఒక సాధారణ వర్తకుని వేషంలో వున్నాడు. అతడి వయసు అయిదు పదులు దాటి ఉండొచ్చు. నలుపు తెలుపు కలగలిపిన మేని ఛాయతో ఏడున్నరడుగుల ఎత్తున సన్నగా వున్నాడు. కోల ముఖం, చికిలి కళ్ళు, వంపు తిరిగిన నాసిక, గుబురు మీసాలతో మనిషి చాలా గంభీరంగా వున్నాడు. అతడి చూపు దూరంగా తీరంలోని రత్నగిరి నగరాన్ని వీక్షిస్తున్నాయి.

ఎదురుగా తీర సమీపంలోనే వుంది రత్నగిరి కొండ. దాని మీద దుర్భేధ్యమైన రత్నగిరి కోట. సముద్ర మార్గంగా శత్రువులెవరూ కోటమీద దాడి చేయకుండా తీరం వెంట అగడ్తలతో కూడిన రెండంచెల ఎత్తున కోట గోడల నిర్మాణం వుంది. కొండను చుట్టి మిగిలిన మూడు పక్కలా రత్నగిరి నగరం విస్తరించి వుంది. నగరానికి పెడగా ఉత్తరాన సువిశాలమైన ఓడ రేవు వుంది.

రత్నగిరి మీది అద్భుతమైన కోట సంధ్య వెలుగులో స్పష్టంగా అందంగా కన్పిస్తోంది. కోట బురుజులు బంగారు తాపడాలతో మణిమయ రత్న స్వర్ణ కాంతులీనుతూ కళ్ళకు మిరుమిట్లు గొలుపుతున్నాయి. బురుజుల మీద రత్నగిరి జయ కేతనాలు రెపరెప లాడుతున్నాయి.

అటు ఓడరేవులో దేశ విదేశీ నౌకలు అనేకం నిలిచి వున్నాయి. కొన్ని ఓడలు రంగు రంగుల తెర చాపలు గాలికి రెపరెపలాడుతూ సముద్రం మీదకు వెళ్ళి పోతున్నాయి. రేవులో ఓడ నుండి సరుకు దించుతున్న రేవు కార్మికుల పాటలు కర్ణా కర్ణిగా గాలి వాటున వినవస్తున్నాయి. గవాక్షం గుండా వీక్షిస్తున్న శతానీకుని చూపులు కోట మీది జయ కేతనం మీదే వున్నాయి. ఆ పతాక స్థానంలో తమ గాంధార జయ కేతనం ఎగిరే శుభ దినం వస్తుందా? అది ఎంత దూరంలో వుంది?

రత్నగిరిని జయించటం అంత సులువు కాదని తెలుసు. కాని జయించాలనే కాంక్ష పూర్తిగా వుంది. దక్షిణాన రత్నగిరి తన వశమైతే చాలా రాజ్యాలు జయించి చక్రవర్తి కాగలడు. యుద్ధ నీతిని పక్కన పెట్టి కుట్రలు కుతంత్రాలను ఆశ్రయిస్తే విజయాన్ని రుచి చూడటం కష్టం కాదు. కాదంటే రత్నగిరి పరిస్థితులు తనకు అనుకూలంగా మారాలి. తనకు అందిన సమాచారాన్ని బట్టి ఇక్కడ పరిస్థితులు బాగా లేవు. రావలసిన మనిషి వస్తే ఖచ్చితమైన సమాచారం తెలుస్తుంది. కాని పగటి వేళ అతడు రాలేడు గాబట్టే ఓపిగ్గా రాత్రి వరకు ఎదురు చూస్తున్నాడు.

క్రమంగా సముద్రం మీదుగా చీకట్లు అలుముకున్నాయి. చలి గాలులు అధికరించటంతో గవాక్షం మూసి వేయ బడింది. ఆ ప్రత్యేక మందిరంలో ఆముదం దీపాలు వెలిగించ బడి వెలుగు నిండుకుంది. అలల తాకిడికి ఉయ్యాలాలా వూగుతోంది నౌక. నౌక పైభాగాన అనేక దివిటీలు వెలిగించ బడ్డాయి. చీకటితో బాటే ఆకాశాన నల్లని మబ్బులు కూడ చేరటంతో రాత్రికి వర్షం పడే సూచనలు తెలుస్తున్నాయి.

చీకటి పడిన కొద్ది సేపటికి`


తన మందిరం నుంచి బయటికొచ్చాడు శతానీకుడు. చెక్క మెట్ల వెంట నౌక ఉపరితల భాగానికి వచ్చాడు. తెరచాపలు దించ బడినప్పటికీ కొయ్యల నుంచి కిరకిర శబ్దాలు విన్పిస్తున్నాయి. చుట్టూ గాఢాంధకారం. చుట్టు పక్కల రాత్రి వేళ చేపలు పట్టే జాలరుల నావల కదలికలు వాటి మీద కాగడా కాంతులు కన్పిస్తున్నాయి. అటు వైభవోపేతమైన రత్నగిరి నగర దీప కాంతులు సముద్ర జలాల మీద ప్రతిఫలిస్తున్నాయి. శతానీకుడు కాసేపు అటు యిటు తిరిగి ఒక ఉన్నతాసనం మీద కూచున్నాడు. పగటి ఉష్ణ తాపం నుంచి శీతల గాలులకు చక్కటి ఉపశమనంగా వుంది.

మరికొంత తడవు నౌక పైనే ఉండే వాడేమో. కాని తడి పొడి చినుకులతో వర్షం ఆరంభమైంది. ఆకాశంలో ఉరుములు మెరుపులు లేకుండానే వర్షం. అది ఉధృతం గావటంతో శతానీకుడు కిందకు వెళ్ళిపోయాడు. వర్షం మూలంగా కాసేపు హడావుడి చోటు చేసుకుందక్కడ. కాని వచ్చినంత వేగం గానూ వర్షం నిలిచి పోయింది.

నౌక దిగువ భాగం చివరలో వుంది వంట శాల. చక్కని విందు భోజనాల సువాసనలు గాల్లో వ్యాపిస్తున్నాయి. తన భోజనం ఆలస్యమవుతుంది గాబట్టి ఈ లోపల సరంగులతో సహా సిబ్బందిని భోజనాలు కానిచ్చి సిద్ధంగా వుండమని ఆజ్ఞాపించాడు శతానీకుడు. అంతా విడతలుగా వంటశాలకు వెళ్ళి భోజనాలు ముగించి వచ్చారు.

క్రమంగా రాత్రి మొదటి జాము ముగిసింది. కోట పై నుండి రెండో యామాన్ని సూచిస్తూ నగరా మోగింది. తిరిగి తడి పొడి చినుకులు ఆరంభమయ్యాయి. సరిగ్గా అప్పుడే`

శర వేగంతో ప్రయాణించే చిన్న నౌక ఒకటి అటుగా వచ్చింది. నౌక చెరో పక్కన రెండు దివిటీలు మాత్రమే మండుతున్నాయి. నౌక ముందు భాగంలో నలుగురు వ్యక్తులు నిలబడున్నారు. వారిలో ఒకడు శతానీకుని మనిషి. ఉదయం రేవులో దిగి అటునుంచి అటే నగరంలోకి వెళ్లిన వాడు. ఇప్పుడు కావలిసిన మనిషిని తీసుకుని తిరిగి వస్తున్నాడు. మిగిలిన ముగ్గురిలో ఇద్దరు అంగ రక్షకులు. మధ్యలోవున్న వ్యక్తి సామాన్యుడు కాదు. రత్నగిరి రాజ్యానికి ఉప సైన్యాధ్యక్షుడు. అరి వీర భయంకరుడని పేరు పడ్డ మహా వీరుడు బాహ్లీకుడు. వాళ్ళ ముగ్గురూ ముఖాలు తెలికుండా నల్ల దుప్పట్లు ముసుగులుగా ధరించి వున్నారు. ముగ్గురూ కృపాణధారులై వున్నారు.




ఆ నౌక తమ సమీపం లోకి రాగానే వారిలో తమ మనిషిని గుర్తు పట్టారు సరంగులు. వెంటనే తమ నౌక నుంచి చెక్క మెట్ల మార్గాన్ని తెరిచారు. ఆ నౌకలోంచి ఒకరి వెనుక ఒకరుగా నలుగురూ మెట్ల మార్గం గుండా వర్తక నౌక లోకి ప్రవేశించారు. వారిని తీసుకొచ్చిన నౌక లోని సరంగులు తమ నౌకను అక్కడి నుండి ఎడంగా తీసుకు పోయి పరిసరాల్లోనే గస్తీ తిరగనారంభించారు.

కొద్ది సేపట్లోనే బాహ్లీకుడు నేరుగా శతానీకుని మందిరంలో వున్నాడు. అతడి అంగరక్షకులిరువురూ ద్వారపాలకుల్లా బయటే నిబడ్డారు. నిజానికి ఈ బాహ్లీకుడు ఎవరో ఆ వర్తక నౌక సరంగులకు గాని అక్కడి పరివారానికి గాని తెలిదు. అతనితో శతానీకుని సమావేశం యొక్క ఆంతర్యం ఏమిటో కూడ అస్సలు తెలిదు. అతడ్ని తీసుకొచ్చిన గాంధారాధీశుని అంతరంగిక సేవకుడికి

తెలిదు. తెలుసుకోవాలన్న కుతూహలం కూడ ఎవరికీ లేదు. రాజకీయ ప్రయాణాలు భవిష్యత్తులో ఏ మార్పులకు హేతువులో ఇప్పుడే చెప్పలేం గాని నాయకులు వాటిని మనసులోనే రహస్యంగా వుంచుకుంటారు. సమయం వచ్చినప్పుడే బయట పడుతూంటారు.

బాహ్లీకుడు వచ్చిన కొద్ది సేపటికే తిరిగి వర్షం ఆరంభమైంది. ఈదురు గాలులులతోబాటు వర్షం క్రమంగా అధికరిస్తోంది. శతానీకుని మందిరం లోకి వర్షం హోరు వినబడుతోంది.

బాహ్లీకుని చూడగానే ముఖం నిండా నవ్వు పులుముకుంటూ చివ్వున లేచాడు శతానీకుడు. బాహ్లీకుడు తన ముసుగు తొలగించుకున్నాడు. మూసిన తలుపు వద్దే నిలబడి సగౌరవంగా వంగి నమస్కరిస్తూ` ''గాంధారాధీశులకు జయము జయము. బాహ్లీకుని ప్రణామాలు'' అన్నాడు.

ఒకింత ఇబ్బందిగా చూసాడు శతానీకుడు.

''అహో... మిత్రమా బాహ్లీకా. మన మధ్య ఈ గౌరవాలు లాంఛనాలు అవసరమందువా? నేను గాంధారకు వారసునిగా గద్దెనెక్కకముందే మనం తక్షశిల విశ్వవిద్యాలయమందు విద్యాభ్యాసంలో సహాధ్యాయిలమని, మంచి మిత్రులమని నీవు మరచినను నేను మరువలేదు సుమా. ఆహా.... ఆ రోజు తిరిగి వచ్చునా! ఎంత కాలమైనది మిత్రమా నిన్ను గాంచి'' అంటూ దగ్గరకొచ్చి గాఢంగా కౌగిలించుకున్నాడు.

ఒక దేశాధీశుడై ఉండి కూడ తన పట్ల ఇంతటి స్నేహాన్ని ఔదార్యాన్ని శతానీకుడు చూపుతుంటే బాహ్లీకుడు నిలువునా పులకించిపోయాడు. కళ్ళలో ఆనందబాష్పాలు నిలిచాయి.

''ధన్యుడ్ని మిత్రమా. మిమ్మల్ని దర్శించిన ఈ శుభ రాత్రిని ఎన్నటికీ మర్చి పోలేను. కాని నేరుగా మీరు రత్నగిరికి రాజోచితంగా వేంచేసి వుంటే మీకు మీ పరివారానికి మా ప్రభువులు అపూర్వ స్వాగత సత్కారాలకు ఏర్పాట్లు చేసేవారు గదా. ఈ వర్తక నౌకలో ఇలా మారు వేషంలో రానగత్యం ఏముందని?'' తన సందేహాన్ని నేరుగా బయట పెట్టాడు బాహ్లీకుడు.

''అగత్యం వుంది బాహ్లీకా. కలికాలం గదా. ఏ క్షణంలో ఎవరి బుద్ధులు ఎలా మారునో చెప్పలేం గదా. మాకు మిత్రదేశములున్నవి, శత్రుదేశములున్నవి. నేరుగా దూర ప్రయాణాలు క్షేమం కాదు. ఆ పైన ఇది సింహళ ద్వీపం వరకు ఉద్దేశించిన రహస్య ప్రయాణం.

కేవలం నిన్ను చూచి పోవలెనన్న ఆశ తోనే ఇక్కడ ఓడను లంగరు వేయించాను. రా మిత్రమా... కొద్దిసేపు మధిర సేవిస్తూ ముచ్చట్లాడుకుందాము."

"కాని మిత్రమా...."

"అహో... అభ్యంతరము చెప్పకుము బాహ్లీకా. ఈ రేత్రికి మాతోనే వుంటున్నావు. నాతో భోంచేస్తున్నావు. ఇక్కడే విశ్రాంతిగా గడిపి వేకువనే నిన్ను సాగనంపించాక మేమును బయలుదేరెదము గాక, కాదనకు సుమా" అంటూ స్వయంగా చేయి పట్టి తీసుకెళ్ళి ఉచితాసనం మీద కూచుండ జేసి ఎదురుగా కూచున్నాడు శతానీకుడు. రెండు బంగారు లోటాల్లో మధిర నింపాడు.

శతానీకుని దర్శించి అర్ధరాత్రివేళ తీరానికి వెళ్ళిపోవానుకున్నాడు బాహ్లీకుడు. కాని ఇంత దూరం వచ్చిన తన కోసం పగలు రాత్రి కూడ వేచి వున్న మిత్రుని మాటను కాదనలేక ఇక అభ్యంతరం చెప్పలేదు. బయట వర్షం పడుతున్న చప్పుడు విన్పిస్తూనే వుంది. నౌకను తాకి ఎగిరి పడుతున్న కెరటాల చప్పుడూ విన్పిస్తోంది. వాతావరణం చలి చలిగా ఆహ్లాద భరితంగా వుంది. కాసేపు మధిర సేవిస్తూ కుటుంబ క్షేమ సమాచారము చెప్పుకున్నారు. అంతలో ఒకింత బాధగా బాహ్లీకుని వంక చూసాడు శతానీకుడు.

"నిన్నిలా చూస్తూ వుంటే చాలా బాధగా వున్నది మిత్రమా! అదే తట్టుకోలేక పోతున్నాను. ఈపాటికి నిన్నొక స్వతంత్ర రాజుగా చూడాల్సిన వాడ్ని, ఇంకా ఈ రత్నగిరికి ఊడిగము చేస్తూ ఉప సైన్యాధక్షుని గానే వున్నావు. నేను గాంధార ప్రభువును కాగానే నీవే గుర్తుకొచ్చినావు. తీసుకెళ్ళి ఒక ప్రాంతానికి నిన్ను రాజును చేయాలనుకున్నాను. కాని మాది మిగిలిన దేశాల్లా కాదు. కొండలు మిట్ట పల్లాలతో కూడిన దేశము. ప్రజలు కష్టజీవులే గాని మొరటు వాళ్ళు. అక్కడి పద్ధతులు నీకు తెలీదాయె. అలాంటి చోట రాజును చేసి నిన్ను ఇబ్బందులపాలు చేయటం యిష్టం లేక వూరుకుంటి. కాని ఏదో రోజున నిన్ను రాజుగా చూడవలె. అది నా ఆశ. అందుకు ఏ సహాయం కావాలన్నా నేనుంటిని. ఇది మర్చిపోవలదు." అంటూ చిన్న బాణం వదిలాడు. అది బాహ్లీకునికి తగలాల్సిన చోటే తగిలింది. కాని వెంటనే బయట పడలేదు.

శతానీకుడు కుట్రలు కుతంత్రాల్లో ఆరి తేరిన వాడు. వాక్చాతుర్యంలో నేర్పరి. అతడి మాటల గారడీ ఎదుటి వారి మీద సమ్మోహనాస్త్రంలా పని చేస్తుంది. ఎదుటి వారిలో బహీనతల్ని చాకచక్యంగా బయటికి రప్పించగలడు. తన మనసులో వున్నది బయట పెట్టకుండానే ఎదుటి వారి మనోభావాలను బయట పెట్టించగలడు. తర్వాత ఎదుటి వారిని తన ఆయుధంగా మలచుకోగలడు. తేనె పూసిన కత్తి లాంటి శతానీకుని మాటల మర్మాన్ని గ్రహింప లేని బాహ్లీకుడు కొద్ది సేపట్లోనే తన అంతరంగాన్ని బయట పెట్టేసాడు.

తనే తన పథకాలకు అనుకూలంగా రత్నగిరిలో ఒక కత్తిని సిద్ధం చేసి వుంచాలనుకున్నాడు శతానీకుడు. కాని తన కన్నా ముందే ఆ కత్తి ఇక్కడ పదును తేలి సిద్ధంగా వుందని తెలిసి విభ్రాంతి చెందాడు. తన చికిలి కళ్ళ వెనుక ఆ విభ్రాంతిని దాచేస్తూ కొన్ని లిప్తల పాటు అలా బాహ్లీకుని చూస్తుండి పోయాడు.

"మిత్రమా! నీ మాటలు సత్యములేనా? నిజముంగా ఇది నీ దృఢసంకల్పమేనా?" నమ్మలేనట్టు అడిగాడు.

"ఆహా.... ఇంకనూ సంశయమా?" అన్నాడు నర్మ గర్భంగా నవ్వుతూ బాహ్లీకుడు.

"వారెవా... ఇప్పుడు కదా నా మిత్రుడివనిపించినావు. శభాష్..." అంటూ మెచ్చుకోలుగా భుజం తట్టి అభినందించాడు శతానీకుడు.

"ఇప్పటికైనా నీలో రాజ్యకాంక్ష ఏర్పడినందుకు చాలా ఆనందంగా వున్నది బాహ్లీకా. రాజ్యం వీర భోజ్యం. అవకాశాన్ని వీరుడెన్నడూ వదులుకోడు. నీలోని వీరత్వానికి బుద్ధి కుశలతకి పదును పెట్టే సమయం వచ్చినది. త్వరలోనే ఎవరూ వూహించని ఒక అంతర్యుద్ధాన్ని రాజ లోకం తిలకించబోతోంది.

ఈ విషయంలో ఒక ఆప్త మిత్రునిగా నా సాయం నీకెప్పుడూ వుంటుంది మిత్రమా. ఈ విషయం మర్చి పోమాకు. రత్నగిరి గద్దె మీద నా మిత్రుడు బాహ్లీకుని చూడటం కన్నను నాకు ఆనందం ఏముంటుంది? నా చిరకాల వాంఛ కూడ అదేనాయె. చూసావా! నిన్ను చూడాలన్న తపనతో నేనిక్కడ ఆగటం ఒకందుకు మంచిదే అయినది" అన్నాడు.

"కాని మిత్రమా. ఒక విషయం నన్ను కలవర పరుస్తోంది" తన మధిర పాత్రను ఖాళీచేసి పేలవంగా నవ్వాడు బాహ్లీకుడు.

"నేను పక్కనుండగా నిన్నే కలవరమూ బాధింపదు మిత్రమా! అదంతయు నాకు విడిచి పెట్టుము." అంటూ తిరిగి రెండు పాత్రల్లోనూ మధిర నింపాడు శతానీకుడు. తిరిగి తనే చెప్పాడు.

"నీ ఆలోచన సమయోచితము. ఏమి చేయాలో ఎలా చేయవలెనో నేను చెబుతాను. నేనంటూ కదిలితే మనకు సాయం చేయుటకు మన మిత్రదేశములున్నవి. ఇక చింతయేల? కాని ఇది కత్తి మీద సాము వంటి వ్యవహారము. గుట్టు రట్టయిన యుద్ధం

ఒనగూడక ముందే నీకు చెరవాసము, మరణ దండన తప్పదు. కావున ఆచి తూచి అడుగు ముందుకేయవలె…'' అంటూ హితవు పలికాడు.

''అవును మిత్రమా. తగు జాగ్రత్తలోనే ఉన్నప్పటికీ, ఆచి తూచి అడుగు ఎటు వేయవలెనో ఇంకా అర్థం గావటము లేదు'' అన్నాడు బాహ్లీకుడు.

''సరి సరి. మిత్రుడిగా నీకు తగిన సలహాలు, సూచనలు చేయుటకు నా అభ్యంతరాలు ఏమీ లేవు. కాని దానికి ముందు ఏదీ దాచకుండా అడిగిన వాటికి నువ్వు బదులివ్వాలి. రత్నగిరి బలం ఏమిటి? బహీనతలు ఏమిటి? నీ ప్రణాళికలు ఏమిటి? సమయం రాగానే నీ పక్కన నిలబడేది ఎంతమంది? అంతా… అంతా నాకు తెలియ వలె. మీ బలాబలాలు తెలిస్తేనే గదా అదనంగా నీకు తగినంత సైనిక సమీకరణ నేను చేయ గలిగేది?''

''అడుగు మిత్రమా. అవసరం నాది గావున, సమయం వచ్చినది గాబట్టి నీ ముందు ఏదీ దాచను. ఎంత రహస్య సమాచారమైనా చెబుతాను. కాని నేను రత్నగిరి గద్దె మీద కూచోవాలి.''

''ఇక మర్చి పొమ్ము. రత్నగిరి సింహాసనం నీది. ఆ విషయం మర్చిపో. ముందుగా నాకో విషయం చెప్పుము. నేను గాంధారలో బయలుదేరి కరూర దేశం రేవు పట్టణం చేరగానే అక్కడో మాట విని వుంటిని. రత్నగిరిలో పరిస్థితులు బాగా లేవని అది ఎంత వరకు నిజము?''

''లేదు లేదు. అలా బావించుట సరి కాదు.'' అన్నాడు వెంటనే బాహ్లీకుడు.

''అంటే! అంతా సరిగానే వున్నదని అనుకోవలెనా?'' వెంటనే అడిగాడు శతానీకుడు.

''అనుకోవటం కాదు గాని పరిస్థితులు సవ్యం గానే వున్నవి. అసలు విషయం ఏమందువా? గత రెండు మాసములుగా ప్రభువు ధర్మతేజునికి ఆరోగ్యం సరిలేదు. అప్పట్నుంచి రాజ దర్శనం గగనమై పోయినది. ఆయనకి సోకిన వ్యాధి ఏమిటో బయట ఎవరికీ తెలికుండా తగు జాగ్రత్తలతో రహస్యంగా వుంచినారు. మహారాజు రాజ మందిరానికే పరిమితమైనారు. రాజవైద్యులు బాహు గుట్టుగా వైద్యము నెరపుచున్నారు. రాజ కుటుంబం, మహా మంత్రి వాసుదేవ నాయకుడు, సర్వ సైనాధ్యక్షుడు అలర్కుల వారికి మాత్రమే రాజ మందిర ప్రవేశం వుంది. పరిపానా పరమైన రాజ నిర్ణయాలన్నీ వారిరువురి మూలంగానే బయట అమలు చేయటం

జరుగుతున్నది...”

“ఆగాగు మిత్రమా... కొంచెము తాళుము” అంటూ బాహ్లీకుని మాటకు మధ్యలోనే అడ్డుకున్నాడు శతానీకుడు.

“మీ సర్వ సైనాధ్యక్షుని పేరేమంటివి? అలర్కుడా?” విస్మయం చెంది అడిగాడు.

“అవును. కాని ఆయన అసు నామధేయం ప్రఫుల్ల సేనుడు. అది ఎవరికీ ఇప్పుడు గుర్తు లేదు. ఆయన అలర్కుని గానే ప్రసిద్ధుడు.”

“బాగు బాగు. అలర్కము అనిన పిచ్చి కుక్కయని గదా అర్థము?”

“అవును మిత్రమా” అంటూ ఫకాలున నవ్వాడు బాహ్లీకుడు.

“సరి గానే చెప్పినావు. ఒక పిచ్చి కుక్క ఎలా కనబడిన వారిని కరుస్తుందో, అదే విధంగా రణ భూమిలో కంటికి కనబడిన శతృసేనల్ని ప్రచండ వేగంతో ఊచ కోత కోస్తాడు. అందుకే ప్రత్యర్థులు అలర్కుడని గూఢ నామంతో పిలిచే వారు. చివరకు అదే ఆయనకు సర్వనామంగా స్థిరపడింది” అంటూ వివరించాడు.

“బాగున్నది. ఇంతకూ ప్రభువు ధర్మతేజునికి సంక్రమించిన వ్యాధి ఏమిటి? అది ప్రాణాంతక వ్యాధిగా భావింప వచ్చునా?”

“వ్యాధి నిర్ధారణ అయినప్పటికీ బయటకు తెలిసియుట లేదు. రత్నగిరి ప్రజలు ఆయన్ని దైవాంశుడుగా భావిస్తారు. ప్రజలకు తెలిస్తే ఆందోళన చెందుతారని వ్యాధిని రహస్యంగా వుంచినారు. అయితే ఆరు మాసములు మించి ఆయన బ్రతకడని రాచనగరులో గుసగుసలు విన్పిస్తున్నాయి.”

“ఇంత జరుగుతుంటే యువరాజు ఏం చేస్తున్నాడు? అతడు యుక్త వయస్కుడని, మహా వీరుడని విన్నాము. పరిపాలనా బాధ్యతల్లో కూడ పాలుపంచుకోడా?” సందేహాన్ని వ్యక్తం చేసాడు శతానీకుడు.

‘‘యువరాజు ధనుంజయుడు మహావీరుడు, సమర్థుడు. అందులో ఎంత మాత్రమూ సంశయం లేదు. ప్రస్తుతం అతనిక్కడ లేడు. తండ్రి వ్యాధి గుణపడాలన్న ఏవో అరుదైన కొన్ని మూలికలు అవసరమట. అవి ఇచట లభించవట. నాలుగు మాసముల లోపల ఆ దినుసులు తేకున్న ప్రభువు మరణించునట. వాటి కోసం మూడు దినాల క్రిందటే ఎవరికీ చెప్పకుండా నగరం వదిలి వెళ్ళిపోయినాడు యువరాజు ధనుంజయుడు.

క్లిష్ట సమయంలో ఇలా ఒక్కగానొక్క కొడుకు కోటను విడిచి వెళ్ళుట ప్రభువుకి ఇష్టం లేదు. అతన్ని వెనక్కు తీసుకు రమ్మని కరివీరుడను వాని నాయకత్వంలో ఒక అశ్విక దళాన్ని పంపించుట జరిగినది. వెళ్ళినవారింకను నగరానికి తిరిగి రానేలేదు.’’ అంటూ బాహ్లీకుడు వివరిస్తూంటే ఆసక్తిగా విన్నాడు శతానీకుడు.

తలపంకించి గాఢంగా నిట్టూర్చాడు.

బయట వర్షం ఉధృతి తగ్గినట్టు లేదు.

అలల తాకిడికి నౌక వూగుతోంది.

మధిర పాత్రలు కాళీ అయ్యాయి.

‘‘మిత్రమా. కాసేపు రాచనగరు వార్తలు పక్కన పెడదాము. ఇప్పుడు రత్నగిరి సైనిక బలం ఎంతో వివరించు. ఉప సైన్యాధ్యక్షునిగా అవి నీకు తెలిని విషయాలు గావు.’’ అనడిగాడు శతానీకుడు.

అవునన్నట్టు తల పంకించాడు బాహ్లీకుడు.

రాజభక్తి, దేశభక్తి కలిగిన కీలక పదవుల్లోని వ్యక్తులు ఎవరైనా గాని ప్రాణం పోయినా తమ సైనిక రహస్యాలు బయటపెట్టరు. అవి శత్రు పరమైతే అనర్థ హేతువు. అతి సన్నిహితులక్కూడా చెప్పరు. కాని ఇక్కడ బయటికి చెప్పకున్నా, గాంధారాధీశుని

సహాయాన్ని బాహ్లీకుడు వాంఛిస్తున్నాడు. ఈ వంకతోనే రత్నగిరి సైనిక రహస్యాలను బాహ్లీకుడి నుండి రాబట్టాలని శతానీకుడు ప్రయత్నిస్తున్నాడు. ఎవరి ఆలోచనలు వారికున్నాయి గాబట్టి శతానీకుని వలలో బాహ్లీకుడనే పెద్ద చేప సులువుగానే పడిపోయింది. అందుకే ఏదీ దాచకుండా రత్నగిరి సైనిక రహస్యాలను బయట పెట్టడానికి ఉద్యుక్తుడయ్యాడు బాహ్లీకుడు.

''మా సైనిక బలం మొత్తం రెండు అక్షౌణీలకు పైనే'' అన్నాడు తిరిగి నింపిన మధిర పాత్రను అందుకుంటూ.

''అంటే! రెండు లక్షల ముప్పై ఆరువేల మందిగల సైనిక శక్తి. రత్నగిరి వరకు చూస్తే ఇది చాలా ఎక్కువే. ఇందులో నీ ఆధీనమందున్న సైనిక బలమెంత?''

కుతూహలంగా అడిగాడు శతానీకుడు.

''ఇందులో సగం బలం అంటే ఒక లక్షా పద్దెనిమిది వేల మందితో కూడిన ఒక అక్షౌణీ సైనిక బలం నా ఆధీనంలో వుంది. మిగిలిన అక్షౌణీ బలం సర్వ సైనాధ్యక్షుడు అలర్కుని ఆధీనమందున్నది. మొత్తం సైన్యానికి సర్వ సైనాధ్యక్షుడు గాబట్టి మేమంతా అలర్కుని ఆజ్ఞకు బద్ధులమై పని చేయాల్సి వుంటుంది.

ఇది గాక, కోట రక్షక దళం, గ్రామ, నగరాల రక్షక దళాలు, సరిహద్దుల రక్షక దళాలు వెరసి అదనంగా అలర్కుని ఆధీనంలో మరో ముప్పై వేల మంది సైనికులు పని చేస్తున్నారు. వీరు గాకుండా మూడు వేల మంది సుశిక్షితులయిన విలుకాండ్రతో కూడిన ప్రత్యేక దళం కూడ అలర్కుని ఆధీనమందు వున్నది.''

''ఇందులో చతురంగ బలాలుగా చెప్పుకునే రథ, గజ, తురగ, పదాతి దళాల బలగముల సంఖ్య ఎంత?''

''చతురంగ బలగాన్ని ఎప్పుడూ బలోపేతంగా సర్వ సన్నద్ధంగా ఉంచుట మా ప్రభువు ధర్మతేజుని అలవాటు. ఆయన మహావీరుడు. అరివీర భయంకరుడు. సైనిక పరంగా చిన్న పొరబాటును కూడ ఆయన సహించడు. ఆయన అభిరుచుల్ని తుచ తప్పక పాటిస్తాడు అలర్కుడు. మాకు అయిదువేల రథాలు, రథికులు వున్నారు. రెండు వేల గజ దళం వుంది. ముప్పై వేల అశ్విక బలం వుంది. మూడు వేల విలుకాండ్రు అదనం. మిగిలింది పదాతి దళాలు.''

ఆ వివరాలు విని మెచ్చుకోలుగా తల వూపాడు శతానీకుడు.

“ప్రస్తుతం మన ఉప ఖండమందు గల ముక్క చెక్కలయిన చిన్న రాజ్యములతో పోలిస్తే రత్నగిరి సైనికంగా చాలా శక్తివంతమైన దేశం. సుమారు మూడు లక్షల సైన్యాన్ని పోషించటం అసాధారణ విషయం. సైనిక పరంగా ధర్మతేజుని మెచ్చుకోవాల్సిందే. మిగిలిన విషయాలు చివరిలో ముచ్చటిద్దాం. ఇప్పుడు నాకు మరో విషయం తెలియాలె. రేపు నీవు తిరుగుబాటు బావుటా ఎగురవేసి అంతర్యుద్ధానికి నాంది పలికినపుడు ఈ మొత్తం సైన్యంలో నీ పక్షాన పోరాడే సైనిక బలమెంత? సుమారుగా చెప్పగలవా?” అంటూ కుండ బద్దలు కొట్టినట్టు సూటిగా అడిగాడు.

“నా ఆధీనంలోని ఒక అక్షౌనీ సైన్యం నా పక్షాన పోరాడుతుంది. అందులో అణుమాత్రం సందేహం లేదు. నా రధికులు, దళపతులు, సేనాపతులు అంతా నా అనుకూలురు, నన్ను సమర్థించువారే. అలాంటి వారినే నా ఆధీనంలోకి ఎంచుకున్నాను. అలాగే నాకంటూ ఒక ప్రత్యేక గూఢచార విభాగం వున్నది. అలర్కుని వేగుల కన్నా చురుకైన వాళ్ళు. వీళ్ళ గురించి ఇంత వరకు అలర్కుని గూఢచారులక్కూడ తెలియదు. చాలా కాలంగా ముందు చూపుతోనే నేను చేసుకున్న అంశాలన్నీ అక్కరకొచ్చే తరుణం ఆసన్నం కానుంది.

కాదంటే అలర్కుని ఆధీనంలోని ప్రభుత్వ సైన్యంతో సరితూగాలన్నా ఇంకనూ నాకు యాభై వేల సైన్యం అవసరమవుతుంది. గెలుపు నా పక్షాన వుండాలన్న కనీసం మరో లక్ష సైన్యం మద్దతు అవసరం” వివరించాడు బాహ్లీకుడు.

“ఆ మాట నిజము. ఇక్కడ ముందుగా నాకు రెండు విషయములు నిర్ధారణ కావలె. ఒకటి రోగ పీడితుడై మందిరానికి పరిమితమైన ప్రభువు ధర్మతేజుడు లేచి రణ భూమికి రాగలడా? రెండు, మూలికల కోసం వెళ్ళిన యువరాజు ధనుంజయుడు రానున్న నాలుగు మాసాల్లోపనే తిరిగి వస్తాడా?”

“రెండునూ అసంభవం.” అన్నాడు వెంటనే బాహ్లీకుడు.

“నాలుగు మాసాల్లోపల మూలికలు అందకున్న అప్పటికి మహారాజు మరణిస్తాడు. గమ్యం తెలికుండా ప్రయాణం చేస్తున్న యువరాజు ఇప్పట్లో తిరిగి వస్తాడనుకోను” అన్నాడు.

“ఒకవేళ యువరాజు తిరిగి వచ్చినచో?”

‘‘రాలేడనే అనుకొందును.’’

‘‘ఊహు... ఇలాంటి సందర్భముందు వూహలు నిజం కావు బాహ్లీకా. లాభ నష్టాలు రెంటిని మనం సమతూకం వేసి చూడాలె. ఒకవేళ నీ తిరుగుబాటు ముగిసి రత్నగిరికి రాజువైనాక తిరిగి వచ్చినా లేక యుద్ధ సమయానికి తిరిగి వచ్చినా పరిస్థితి ఏమిటి? రత్నగిరికి మిత్ర రాజ్యాల సాయంతో దండెత్తి రాడన్న నమ్మకమున్నదా? మహావీరుడైన ధనుంజయుడు నీ ద్రోహాన్ని సహించి మిన్నకుంటాడా? ఆ పైన నేను విన్న సమాచారం ప్రకారం మాళవ రాజ్య పట్టమహిషి ధర్మతేజుని సోదరి. రత్నగిరి ప్రమాదంలో వుంటే మాళవ సైన్యం మిన్నకుండునా? ఇవన్నీ ఆలోచించాలి.’’

ఆ మాటలు బాహ్లీకుని ఉత్సాహం మీద నీరు చల్లినట్టయింది. ఆలోచనలో పడినాడు. వదనంలో రంగులు మారాయి. శతానీకుని హితబోధ వాస్తవాన్ని ప్రతిబింబిస్తోంది. చివరకు `

‘‘అవును మిత్రమా. యువరాజు తిరిగి వచ్చిన రాజకీయ గండం నాకు తప్పదు’’ అన్నాడు.

‘‘అయితే ఆలస్యమెందుకు? సరిహద్దు దాటిన యువరాజు తిరిగి రత్నగిరిలో అడుగు పెట్టకూడదు. అందుకు మార్గం ఒక్కటే. అతడ్ని రాజ్యం బయటే ఎక్కడో హతమార్చాలి.’’

‘‘హత్యా....’’

‘‘అవును. హత్యే. రాజకీయ హత్య. బయటకు పొక్కరాదు. మరణ వార్త రత్నగిరికి చేరకూడదు.’’

‘‘కాని మిత్రమా. అది సాధ్యమా? ధనుంజయుడు మహావీరుడు...’’

‘‘అతడిని మించిన మహావీరులు కూడ మన్నులో కలిసి పోయినారు బాహ్లీకా.’’ అంటూ పెద్దగా నవ్వాడు శతానీకుడు. ఆ నవ్వు చూస్తూంటే కలిపురుషుడు నవ్వినట్టు, ఒక నిశాచరుడు వికటాట్టహాసం చేసినట్టుంది. కొన్ని లిప్తల పాటు బాహ్లీకుడి వెన్ను

జలధరించింది. సాయం చేసినట్టే చేసి చివరి క్షణంలో తనను తప్పించి ఈ శతానీకుడే రత్నగిరిని అక్రమించడు గదా. రత్నగిరికి తను చేస్తున్న నయవంచనలాగే శతానీకుడు తనకు చేయడని నమ్మిక ఏమున్నది? రాజకీయ నీతి రాక్షస నీతి. అవసరం తనది అయినప్పటికీ తన జాగ్రత్తలో తనుండాలి శతానీకుని విషయంలో అన్పించింది.

''నమ్మకంగా గొంతు కోసే వాళ్ళుంటే అసాధ్యాలు సుసాధ్యాలు కాగలవు బాహ్లీకా. ఎంత వీరుడయినా శత్రువు పట్ల జాగ్రత్తగా వుంటాడు గాని అపరిచితులు , భక్తులు తన చుట్టూ మంచిగా చేరిన వారి పట్ల జాగ్రత్త వహింపరు. ఆకస్మికంగా ఓ అయిదుగురు అతి సమీపం నుండి ఒకేసారి దాడి చేస్తే మట్టి కరవక తప్పదు. నీ గూఢచారుల్లో సమర్థుల్ని అయిదుగురు ఒక జట్టుగా మూడు జట్లను ఎంపిక చేసి మూడు పక్కలా పంపించు. ఒక్కో జట్టును వారితో సంబంధం లేకుండా నీడలా అనుసరించే ఒక్కొక్కడ్ని వెనకే పంపించు. అక్కడ ఏమి జరిగినా తిరిగివచ్చి నీకు సమాచారం అందించేందుకు ఈ ఏర్పాటు అవసరం. అర్థమైనదా?'' అంటూ సలహా యిచ్చాడు శతానీకుడు.

''ఊఁ.... అర్థమైనది మిత్రమా. తీర్థయాత్రికుల వేషాల్లో వారిని పంపిస్తాను. ముందుగా ధనుంజయుడు భీమశంకరుని దర్శించేందుకు ఢాకినీ వనానికి వెళ్ళే అవకాశమున్నది. ఎందుకంటే, ప్రభువు ధర్మతేజుడు భీమశంకరుని భక్తుడు. రెండోది అటు పోకుండా నేరుగా మాళవ రాజ్యంలోకి పోవచ్చు. అవంతీపురం తన మేనత్త మేనమామ నగరం (ఉజ్జయిని). అటు ఒక జట్టును పంపిస్తాను. మూడవ జట్టు మాళవం దాటి వింధ్యాటవి మార్గంలో కాపు వేస్తారు. ఎక్కడో ఓ చోట పనయి పోతుంది'' అన్నాడు ఉత్సాహంగా బాహ్లీకుడు.

మెచ్చుకోలుగా చూసాడు శతానీకుడు.

''ఇప్పుడు... నీ మెదడు పాదరసంలా పని చేయుచున్నది మిత్రమా. నా మాటలు శ్రద్ధగా ఆలకించుము. నేను గాంధారం చేరగానే మిత్ర రాజ్యాలను సంప్రదించి మా గాంధారసైన్యంతో బాటు రెండు లక్షల సైన్యాన్ని నీకు మద్ధతుగా సిద్ధం చేస్తాను. గంధారం నుండి రత్నగిరి వరకు అనేక రాజ్యాలను దాటి ఆ సైన్యం రత్నగిరి చేరటం అసాధ్యం. ఆయా రాజ్యాలతో అకా శత్రుత్వం ఏర్పడుతుంది. కాబట్టి రథాలు, ఏనుగుల సాయం చేయలేను. కరూర దేశం మీదుగా ఓడలు మీద సైన్యం రత్నగిరి వచ్చి పశ్చిమం నుండి రత్నగిరిని తాకుతుంది. ముందు పక్క నీ సేనలు, వెనక నుండి మా సేనలు ముప్పేట దాడితో రత్నగిరికి వూపిరి సలపకూడదు.

ఇదిగాక పాతికవేల అశ్వక దళాలు ఎవరికి అనుమానం రాని విధంగా సాధారణ దుస్తుల్లో జట్లు జట్లుగా బయలుదేరి ఎవరికీ అనుమానం రాకుండా రత్నగిరి సరిహద్దుకు చేరి వేచి ఉంటాయి. ఇవన్నీ జరగాలంటె సరిగ్గా నేటికి రెండు మాసాల తర్వాత ముందుగా నాకు ధనుంజయుని మరణ వార్తతో బాటు నీవు తిరుగు బాటు ఆరంభించు రోజు పావురం సందేశం మూలంగా నాకు తెలియపర్చాలి. నా ఆంతరంగిక సేవకుడు కరోతి అనేవాడు పావురా సందేశం పంపించుట లోను, వాటికి శిక్షణ ఇచ్చుట లోను బహు నేర్పరి. వాడే నిన్ను నా వద్దకు తీసుకు వచ్చిన వాడు. కొన్ని పావురాలతో బాటు వాడ్ని నీ వద్ద వుంచి వెళ్తాను. ఇక

ఈలోపల మహారాజు ధర్మతేజుని ఆరోగ్యం గురించి మర్చిపొమ్ము. మృత్యువును సమీపిస్తున్నవాడు మనల్ని ఏమీ చేయలేడు. ఇప్పుడు రత్నగిరి భవిష్యత్తు సర్వసైన్యాధ్యక్షుడు అలర్కుని మీదే ఆధారపడున్నది. అతడి విషయంలోనే నీవు అప్రమత్తుడవై వుండాలి.'' అంటూ అనేక విషయాల్ని బోధించాడు శతానీకుడు.

అంతా శ్రద్ధగా ఆలకించాడు బాహ్లీకుడు.

చివరిగా మరోమాట కూడ చెప్పాడు గంధారాధీశుడు.

''మిత్రమా. కేవలము మన స్నేహమునకు గుర్తుగా నిన్ను రాజును చేయాలనే సంకల్పం తోడనే ఇంత భారీ సహాయమునకు నీకు మాట యిస్తుంటిని. ఇందులో నాకంటూ ఏ స్వార్థమూ లేదు. కాదంటే మనతో బాటు మిత్రదేశాల సైనిక ఖర్చున్నాయి. కాబట్టి నీవు సింహాసనం ఎక్కగానే నాలుగు లక్షల వరహాలు సైనిక ఖర్చుకింద చెల్లిస్తే చాలు, సంతోషిస్తాను'' అన్నాడు.

''ఎంత మాట మిత్రమా!'' అంటూ ఆనంద పడి పోయాడు బాహ్లీకుడు.

''నీవింత సాయం చేస్తున్నందుకు నేను నీకు ఏ విషయంలో కూడా లోటు రానిస్తానా? నాలుగు కాదు, ఆరు లక్షల బంగారు వరహాలతో బాటు మణిమయ రత్నాల సంచులను కానుగ్గా ఇచ్చి పంపిస్తాను'' అంటూ మాటిచ్చాడు.

పిమ్మట మరొకొన్ని ముఖ్య విషయాల్ని చర్చించుకున్నారు. అప్పటికి అర్ధరాత్రయింది. మూడో యామాన్ని సూచిస్తూ కోటపై నగారా శబ్దం సముద్ర జలాల మీద ప్రతిధ్వనించింది. వర్షం కూడ నిలిచింది. ఆ అర్ధరాత్రి వేళ శతానీకునితో బాటు విందు భోజనాలారగించిన బాహ్లీకుడు ఆ మందిరంలోనే మిత్రుని చెంత నిద్రపోయా

డు.

వేకువనే లేచిన బాహ్లీకుడు తన అంగరక్షకులతో తిరుగు ప్రయాణమయ్యాడు. నాలుగు పావురాలతో కూడిన పంజరంతో కరోతి కూడా వారి వెంట తీరానికి బయలుదేరాడు. సమీపంలోనే తిరుగుతున్న చిన్న నౌకలో బాహ్లీకుడి బృందం బయలుదేరుతుంటే ఓడ పైభాగం నుండి వీడ్కోలు పలికాడు శతానీకుడు. ఆ నౌక చీకటల్లో కను మరుగు కాగానే ఆ వర్తక నౌక లంగరు ఎత్తివేయబడిరది.

సరంగు తెరచాపు లేపారు. ఎవరూ గమనించముందే శతానీకుని సూచన మేరకు ఆ నౌక ఉత్తర దిశగా కరూర రేవు పట్టణం దిశలో వేగంగా సాగిపోయింది. సూర్యోదయానికి అది రత్నగిరికి కొన్ని యోజనాల దూరంలో వుంది.



రత్నగిరి మీద ఒక భయంకరమైన కుట్రకు బీజం పడిన రోజు అది. ఎదుటి వారి కష్టాలను, బాధలను తమకు అవకాశాలుగా మలచుకునే గుంట నక్కలున్నంత వరకు మంచి వారికి వెతలు తప్పవు. గాంధారాధీశుడు శతానీకుడు, రత్నగిరి ఉప సైన్యాధ్యక్షుడయిన బాహ్లీకుడు ఇరువును చేతులు కలిపి నడపనున్న ఈ దారుణ మారణ కాండ ఫలిస్తుందా? లేక విఫలమవుతుందాన్నది కాలమే నిర్ణయించాలి.

తన వెనక జరుగుతున్న కుట్రలేమీ తెలీని రత్నగిరి రాకుమారుడు ధనుంజయుడు అదే రోజు సాయంత్రం ముని మాపు వేళ దాటిన కొద్ది సేపటికే రామగిరి గ్రామ పొలిమేరలకు చేరుకున్నాడు. అతడి అశ్వం గరుడ గ్రామ వీధుల్లో అడుగు పెట్టే సరికి బాగా చీకటి పడిరది.

రామగిరిని ఓ మోస్తరు పెద్దగ్రామమనే చెప్పుకోవాలి. గ్రామమంతటా పండుగ వాతావరణం కన్పిస్తోంది. విశాలమైన బాటలు ఇరు వంకలా తీర్చి దిద్దినట్టున్న గృహ సముదాయాలు. ప్రతి యిల్లు శోభనంగా అలంకరించి వాకిట ముగ్గులు తీర్చి దీపాలంకరణ చేయబడ్డాయి. ప్రతి ముంగిట కాగడాల కాంతులు వెలుగు నింపుతున్నాయి. నూతన వస్త్రాలు ధరించిన గ్రామ బాలబాలికలు కళకళలాడుతూ వీధుల్లో ఉత్సాహంగా పరుగులు తీస్తున్నారు. గుడికి వెళ్ళొస్తున్న స్త్రీ, పురుష, బాల, వృద్ధులనేకులు ప్రధాన

వీధిలో ఎదురవుతున్నారు.

అదంతా చూస్తున్న యువరాజు ధనుంజయునికి అప్పటిగ్గాని గుర్తుకు రాలేదు... ఆ రోజు కృష్ణాష్టమి. శ్రీకృష్ణుల వారి జయంతి అని. స్వయంగా తను ఆ మాధవయ్య భక్తుడు. తను రత్నగిరిలో వుంటే ఈ పండుగ చాలా వేడుకగా జరిపించేవాడు. తన గురువు దైవం ఆపద్బాంధవుడు అంతా ఆ స్వామిగా భావించి కొలిచేవాడు. ఆలోచిస్తూనే అశ్వాన్ని నెమ్మదిగా పోనిస్తున్నాడు ధనుంజయుడు. యువరాజుగా తనను తెలిసిన వారు గాని, గుర్తించ గల వారు గాని రామగిరిలో ఎవరూ వుండే అవకాశం లేదు. ఒకవేళ గ్రామకొత్వాలుకు తెలుసేమో గాని అతని గురించి తనకు తెలీదు. సాధ్యమైనంత వరకు తన గురించి ఎవరికీ తెలికుండా ఉండటమే మంచిది. తెలిస్తే ఆ మర్యాదలు భరించి ప్రయాణం అపుకోవటం తనకి కష్టం.

అయితే ఉత్తమాశ్వం మీద ఆ రాత్రి వేళ పున్నమి చంద్రుడిలా విజయం చేస్తున్న ధనుంజయుని చూస్తున్న గ్రామ పౌరులు ఎవరో ఉన్నత వంశీకుడని గ్రహించి పక్కకు తొలగి దారి ఇస్తున్నారు. ఇక వయసు పడుచులయితే అతడి నుండి చూపు తిప్పుకోలేక మదన తాపంతో తిరిగి తిరిగి అతడ్ని చూస్తూనే వున్నారు.

గ్రామ మధ్యంలో నాలుగు వీధుల కూడలికి కాస్త ఇవతలగానే కుడి పక్కన వుంది బాటసారులు విడిది గృహంగా చెప్పుకునే సత్రం ఒకటి. సువిశాలమైన ఆవరణలో అనేక గదులతో కూడిన పెద్ద మండువా లోగిటిని వసతి గృహంగా మార్చి నిర్వహిస్తున్నాడు దాని యజమాని.

రాత్రికి బస చేసేందుకు తనకు ఒక గది, తన స్నానపానాలకు, అశ్వ సంరక్షణకు అన్నింటికి కలిపి రుసుం చెల్లించాడు ధనుంజయుడు. తన తోలుసంచులు ఆయుధాలు అన్నీ గదిలోకి చేర్చాక అశ్వాన్ని నౌకర్లకు వప్పగించాడు. సత్రంలో అప్పటికే చాలా మంది విడిది చేస్తున్నారు. తను రత్నగిరి రాకుమారుడన్న విషయం బయట పడకుండా చాలా జాగ్రత్త వహించాడు ధనుంజయుడు. చక్కగా వేడి నీట స్నానం చేసి, పొడి దుస్తులు ధరించగానే ప్రయాణ అసట తీరింది. గుడికి వెళ్ళి వచ్చి భోంచేసే ఉద్దేశంతో గదికి బీగం వేసుకుని బయటి కొచ్చాడు.

సత్రం యజమాని వృద్ధుడు.

"అయ్యా! తమరే దేశ రాజకుమారులో గాని సామాన్యులు మాత్రం కారు. దేశాటన చేస్తూ మా గ్రామానికొచ్చినారా?" అంటూ కుతూహం ఆపుకో లేక అడిగాడు.

‘‘అలా అనుకున్నా తప్పు లేదు గాని ఇక్కడ కృష్ణ జయంతి బాగా జరుపుతున్నట్టున్నారే. ఆలయం ఇక్కడికి ఎంత దూరంలో వున్నది?’’ అనడిగాడు ధనుంజయుడు.

‘‘ఎంతోనా... కుడి పక్క వీధిలో కాస్త ముందు కెళితే కన్ను పండువుగా ఆలయం కన్పిస్తుంది నాయనా. ఆ కోలాహమంతా అక్కడి నుంచే. వేణుగోపాలుని గుడి దర్శించాల్సినదే. అదో... కోలాట భజన ఆరంభం కానుంది. మా వూరి కుర్రాళ్ళు కోలాటం బాహుగొప్పగా వుంటుంది.’’

‘‘అయితే పోయి చూడాల్సిందే. తిరిగి వచ్చాక భోజనం చేస్తాను’’

‘‘తప్పకుండా వెళ్ళిరండి బాబూ. కాస్త ఆస్యమైనా ఇబ్బంది లేదు. మీకు చక్కని అతిథ్యంతో వేడి వేడి భోజనం వడ్డించేందుకు మా వాళ్ళు సిద్ధంగా వుంటారు.’’

సత్రం యజమానితో మాట్లాడి వీధిలోకి కాలి నడకన బయలుదేరాడు ధనుంజయుడు. గుడి దిశగా నడుస్తుంటే భజన పాటలు విన్పిస్తున్నాయి. ఆ పాటల వెంట అద్భుతమైన వేణు గాణం కూడా పరవశింప చేస్తోంది.

కొద్ది సేపట్లోనే ఆలయ ప్రాంతాన్ని చేరుకున్నాడు. వీధికి పెడగా ఎడమ పక్కన విశాలమైన ఆవరణలో కనువిందు చేస్తోంది వేణుగోపాలస్వామి ఆలయం.

ఆలయం తూర్పు ముఖంగా ఉండగా`

కుడి పక్కగా పదహారు స్తంభాలతో ఎత్తయిన ఆలయ మండపం వుంది. ఆ ప్రాంతమంతా తిరునాళ్ళ వాతావరణంతో సందడిగా వుంది. పచ్చని పందిళ్ళు వేసి మామిడాకు తోరణాలు కట్టారు.

ఆలయ సోపానాలకు ఎదురుగా`

వెయ్యిన్నొక్క జ్యోతులతో కూడిన అఖండ దీప చెమ్మాయి నిలబెట్టబడుంది. ఆ దీపాలశోభ తిలకించడానికి రెండు కళ్ళు చాటం లేదు. ఒక దీప వృక్షంలా విస్తరించి వుంది. గాలికి జ్యోతులు ఆరి పోకుండా నాలుగు పక్కలా తెల్లని వస్త్రంతో తెరలు కట్టి లోన ఒక మనిషి వాటి సంరక్షణ చూస్తున్నాడు.

తెరలకు ముందు చాపలు పరచ బడ్డాయి. వాటి మీద కోలాట బృందం గురువు కూచుని పాడుతుంటే నలుగురు పక్క కూచుని వాద్య సహకారం అందిస్తున్నారు. ఇక యాభై జోడీలుగా వంద మంది గ్రామ యువకులు కోలాటంలో వున్నారు. రంగు రంగుల దుస్తులు ధరించి కాళ్ళకు గజ్జెలు కట్టారు. మూడు జానల పొడవుంటే కోలాటం కర్రలు చేత బట్టారు. గురువు గారి పాటకు అనుగుణంగా కర్రలు తాటిస్తూ, వంత పాడుతూ వలయాకారంలో తిరుగుతున్నారు. లయగా కదిలే కుర్రాళ్ళ కాళ్ళ గజ్జెల మోతలు, కోలాటల కర్రల శబ్దాలు వాద్య ఘోష పాటను రక్తి కట్టించి చూపరులను ఆకర్షిస్తున్నాయి.

భక్తులు గుళ్ళోకి వెళ్ళే వాళ్ళు వెళ్తున్నారు, వచ్చేవాళ్ళు వస్తున్నారు. పరవశంతో చుట్టూ చేరి తన్మయంతో కోలాటాన్ని చూసే వాళ్ళు చూస్తున్నారు. రాజకుమారుడు ధనుంజయుడు కూడ అక్కడికి రాగానే కాసేపు అలా చూస్తుండి పోయాడు. కాస్త విరామం తర్వాత మరో పాట అందుకున్నారు గురువు గారు. కోలాటం ఆరంభమైంది. గురువు గారి పాటకు అంతా ముక్త కంఠంతో వంత పాడుతూ కోలాటం ఆరంభించారు.

అందాల బాలకిట్టయ్యా ` గోపాల బాలా రారా

కిట్టయ్యా ` గోపాల బాల కిట్టయ్యా

ఆయ్ ` చిడతెయ్ ` చిడతెయ్

అందాల బాలుడమ్మా ` నవనీత చోరుడమ్మా

నందునింట పెరిగినాడు ` నందా కిశోరుడమ్మా

యశోధా తనయుడమ్మ ` యదుకుల తిలకుడమ్మ

అందాల బాల కిట్టయ్యా ` గోపాలా బాలా రా రా.

ఆః......

నెమలి ఈక కట్టుకోని ` మురళి చేత పట్టుకొని

కాలి గజ్జెలు మ్రోగ ` గోప బాలను చేరి

అల్లరంటె అల్లరంట ` రేపల్లె నందడంట

ఉట్టి మీద పెరుగు కుండ ` గూటి లోన వెన్న ముంత

ఎట్టి పట్టు వెన్నదొంగ ` ఎవరికీ దొరకడమ్మ

గొల్లా భామల తోడ ` గంతులేయు చిలిపి వాడు

కరుణ తోడ కాచు వాడు ` కరుణామయుడు వాడు

నల్లా నల్లాని వాడు ` రాధా మనోహరుండు

అవతార పురుషుడే ` శంఖూ చక్రాల సామి

లీలా వినోదుడే ` వేణుగోపాలసామి

అందాలా బాలా కిట్టయ్య ` గోపాల బాలా రా రా.

రస మయ వేణు గానం కోలాటంతో చేరి భక్తులకు అలౌకిక భక్తి భావాన్ని పరవశాన్ని కలిగిస్తోంది. కాసేపు ఆ కార్యక్రమాన్ని వీక్షించిన ధనుంజయుడు ఆలయ ప్రవేశం చేసి పురజనులతో బాటు వరుసలో వెళ్ళి స్వామిని దర్శించాడు. పూలు, పళ్ళు సమర్పించాడు. తను బయలుదేరిన పనిలో కార్యసిద్ధిని, విజయాన్ని కలిగించమని వెన్నంటి వుండి సహకరించమని ఆ వేణుగోపాలుని మనసారా ప్రార్థించుకున్నాడు. ప్రసాదం స్వీకరించి బయటి కొచ్చేసరికి కోలాటం కొనసాగుతూనే వుంది. అప్పుడో విశేషాన్ని గమనించాడు ధనుంజయుడు.

వేణు గానం వినవచ్చేది కోలాటం గురువు దగ్గర్నుంచి కాదు, పక్కనున్న మండపం అరుగు నుంచి వస్తోంది. అక్కడి చిరు చీకట్లో మండప స్థంభాన్ని ఆనుకొని కూచున్న ఓ వ్యక్తి మురళి వాయిస్తున్నాడు.

అంతా యిక్కడ వుండగా అతను మాత్రం అక్కడ విడిగా ఎందుకున్నాడు? అతను కోలాట బృందం మనిషి కాడా? పరిశీలించిన ధనుంజయుడికి ఆశ్చర్యం గొలిపిన విషయం...

ఆ వ్యక్తి శతాధిక వృద్ధునిలా వున్నాడు. తెల్లగా నెరసిన గిరజాల జుత్తు భుజాల మీద పడుతోంది. కొద్దిగా మాసిన గడ్డం, నల్లని మేని ఛాయతో, ఆ వయసులో కూడా ఆకర్షణీయంగా వున్నాడు. నుదుట త్రిచూర్ణం ధరించి, మెడలో పూమాల ధరించాడు. కావి

పంచె కట్టి భుజాన కండువా వేసుకున్నాడు.

“ఆ పెద్దాయన ఎవరు? అద్భుతంగా వేణు గానం చేస్తున్నారు?” పక్కనున్న ఒక వ్యక్తిని అడిగాడు ధనుంజయుడు.

“అయ్యా! ఆయనెవరో, వూరేదో, పేరేదో తెలిదు. కను చీకటి పడు వేళ ఆలయానికొచ్చాడు. వేణు గానంతో పులకింపజేస్తున్నాడు. ఎవరింటా భోం చేయలేదు. పాలు తాగి ఆలయ ప్రసాదం ఆరగించాడు. అంతకు మించి వివరములు తెలియవు” బదులిచ్చాడతను.

ఇంతలో కోలాటానికి కొద్దిసేపు విరామం యివ్వబడింది. మండపం లోని వృద్ధుడు తన వద్దకు రమ్మని ధనుంజయునికి చేయి వూపాడు. ఇక్కడ ఇంత మంది వుండగా ఆయన తననే ఎందుకు పిలుస్తున్నాడు? ఒకింత ఆలోచించి మండపం సోపానాలెక్కి వృద్ధుని చేరుకున్నాడు.

“రావయ్యా మిత్రమా. రా కూర్చొనుము. నీ కోసమే ఎదురు చూస్తుంటిని సుమా!” అన్నాడు దరహాసంతో వృద్ధుడు.

ధనుంజయునికి ఏమీ అర్థం కాలేదు. ‘మిత్రమా’ అంటున్నాడు. తన వయసెక్కడ ఆయన వయసెక్కడ? పైగా నీ కోసమే ఎదురు చూస్తున్నాను అంటున్నాడు. ఈయన్ని ఏమనుకోవాలి? సన్యాసి అనుకోవాలా, హరి భక్తుడనుకోవాలా, సిద్ధుడనుకోవాలా లేక పిచ్చి వాడనుకోవాలా? ఎవరైనా గానీ పిచ్చి వాడు మాత్రం కాడు. వేణువుతో గానామృతం కురిపిస్తున్న వాడు పిచ్చివాడెలా అవుతాడు? ఆయనతో ఒకింత సంభాషిస్తే గాని విషయం ఏమిటో తెలిదు.

“స్వామీ! మీరెవరో నాకు తెలియదాయె. నా కొరకు మీరు ఎదురుచూచుట ఇదియేమి వింత?” ఎదురుగా బాసిం పట్టు వేసి కూచుంటూ అడిగాడు. ఆ పలుకులకు చిద్విలాసంగా నవ్వాడా పెద్దాయన.

“ఇది వింత కాదయ్యా మిత్రమా. మనం బాగా పరిచయస్థులమే. నీవు నాకు బాగా కావలసిన వాడవు గదా. ఇక్కడికి తప్పక వచ్చెదవని నాకు తెలుసు.”

“ఇంతకూ తమరెవరు స్వామి?”

‘‘నన్ను మాధవస్వామి అంటారులే. అందరికీ నేను తెలిక పోవచ్చును. కాని అందరూ నాకు తెలిసినవారే.’’

‘‘మీ మాటలు కడు విచిత్రముగ నున్నవి స్వామి. అయిననూ నాతో మీకేమి పని?’’

‘‘వూహుఁ... నీతో నాకే పని లేదయ్యా. నాతోనే నీకు పని వున్నది.’’

‘‘మీతోనా!’’

‘‘అవును. నాతోనే. నీకు దిశానిర్దేశం గావింప వలసిన పని వున్నది. అయిననూ నన్ను నీవు ఆర్చెడి వానివా తీర్చెడి వానివా అనుకొనుచున్నావు కదూ! ఆర్చెడు వానిని నేనే. తీర్చెడి వానిని నేనే. బోధ పడినదా?

‘‘లేదు స్వామీ. మీ మాట అంతరార్థం ఒకింతయు బోధ పడకున్నది.’’

‘‘అవును. బోధపడదు. అర్థము జేసుకొనెడి వయసు కాదు నీది’’

ఇంతలో కోలాట బృందం తిరిగి కోలాటం ఆరంభించారు. కొత్తపాట మొదయింది. మాధవస్వామి కొద్దిసేపు మురళి వాయించాక ఆపి యువరాజు ధనుంజయుని వంక చూసాడు.

‘‘యువరాజా. నాకు తెలిక అడుగుచున్నాను. నీవు ఆ వేణుగోపాలుని భక్తుడవుగదా. మిత్రునిగా, సఖునిగా, ఆపద్బాంధవునిగా ఆయన్ని నమ్మి కొలిచే భక్తుడవాయె. మరి ఆయనకును నాకును గల భేదమేమిటో చెప్పు చూతము’’ అనడిగాడు.

తనకు తెలియకుండానే ఒకింత ఉలికి పాటుకు గురయ్యాడు ధనుంజయుడు. అది వూహకు అందని విషయం. ఇక్కడ ఎవరికీ తెలిని విషయమిది. తను యువరాజని, వేణుగోపాలుని భక్తుడని ఇంత స్పష్టంగా పలికాడంటే ఈ శతాధిక వృద్ధుడు సామాన్యుడు

కాడు. పిచ్చివాడు అంతకన్నా కాడనిపించింది.

‘‘స్వామి! ఆయన దైవము. మనం మానవమాత్రులం. అదేగా బేధము’’ అంటూ బదులిచ్చాడు.

ఫక్కున నవ్వాడు వృద్ధుడు.

‘‘పొర బడితివి జూచినావా మిత్రమా? ఆయన కూడ మనలాగ మానవుడే. శరీరమును విడిచిన పిమ్మటే ఆయన్ని దైవంగా జేసినారు. లీలా వినోదుడు గదా నల్లనయ్య. ఆయనకు నాకును బేదం ఏమున్నది? ఆయన నల్లనయ్య, నేను నల్లనయ్యనే. అయనా పూమాల ధరించువాడు. నేనూ ధరించితిని. ఆయన మురళీధరుడు, వేణుగానలోలుడు, నేనూ వేణు గాన ప్రియుడినే. ఆయన పేరు మాధవ స్వామి అయితే నా పేరును అదియే గదా. మరి నేను వేరు ఆయన వేరు అనుట ఉచితమా? కాదనిన ఆయన శిఖిపింఛమౌళి. అది నాకు లేదు. అంతియే కదా బేధము?’’ అన్నాడు.

ఈసారి వృద్ధుని మాటలు ఒకింత నవ్వు పుట్టించాయి ధనుంజయునికి. అబ్బో. ఈ వృద్ధునికి అతిశయం ఎక్కువే. ఏవో కొన్ని మహిమలున్నంత మాత్రాన మానవుడు దేవుడు కాగలడా? సందేహం లేదు ఒకింత పిచ్చి కూడ వున్నదీ స్వామికి.

‘‘పోలికలెందుగ్గాని స్వామీ. నాకు దిశా నిర్దేశము గావింప పని వున్నాదంటిరే. దానికి అర్థమేమి? నేను వెళ్ళు మార్గము సరి కాదందురా?’’ అనడిగాడు.

‘‘సరియే… నీ మార్గము సరియే. లక్ష్యమును సరియేను. అయినను ఒక ముఖ్య విషయము మరచినావే.’’

‘‘ముఖ్య విషయమా….?’’‘‘అవును మిత్రమా. అతి ముఖ్యమైన విషయము. మరచితివి! నీ పితృభక్తి శ్లాఘనీయము. తండ్రిని బ్రతికించుకొని పితృ రుణం తీర్చనెంచితివి, మెచ్చతగు విషయం. కాని నీ తండ్రి ధర్మతేజుడు పరమ శివ భక్తుడు గదా. జ్యోతిర్లింగములో ఒకటగు సహ్యాద్రి మీది భీమశంకరుని దర్శించకుండా ఏ పనీ ఆరంభించడే. నీవు ముందుగా చేయాల్సినది ఢాకినీ వనానికి పోయి భీమశంకరుని సేవించాలి గదా. అనారోగ్యమున కోట విడిచి రాలేని నీ తండ్రి తరఫున భీమశంకరుని అర్చించి కార్య జయము కలిగించమని ప్రార్థించి ఆ శివుని ఆశిస్సులతో బయలుదేరుట మంచిది మిత్రమా….’’

‘‘లేదు స్వామీ! అది జరగని పని’’ మాధవ స్వామి సలహాను మధ్యలోనే తిరస్కరించాడు ధనుంజయుడు.

‘‘ఏలా జరుగదు మిత్రమా?’’ చిరునవ్వుతో అడిగాడు మాధవస్వామి.

‘‘స్వామీ. నిజముగా ఆ భీమశంకరుడు అంతటి శక్తిమంతుడయితే నిజముగా భక్తవత్సుడయితే నా పితృ దేవునకీ వ్యాధి సోకి వుండదు. తీరని వ్యాధితో నరక యాతన పడు వారు కాదు. శివుని పట్ల నాకు విశ్వాసము లేదు. అందుకే ఢాకినీ వనానికి వెళ్ళు ఉద్దేశ్యము లేదు’’ అని బదులిచ్చాడు.

‘‘పోనీ నీవు కొలుచు ఆ వేణు మాధవ స్వామి అంత శక్తిమంతుడా?’’ మేఘ గంభీర స్వరంతో వెంటనే ప్రశ్నించాడా వృద్ధుడు.

‘‘వూహుఁ.... అంత శక్తిమంతుడే అయితే నీ ప్రార్థనలాలకించి నీ తండ్రి గారిని వ్యాధి నుండి విముక్తుడ్ని చేయాలి గదా. వూహుఁ... చేయడు. ఎందుకంటే ఇది సంచిత కర్మఫలం. అనగా గత జన్మ ననుసరించి వచ్చిన పాప ఫం. దీనికి గతంలో మీ వంశానికి నాగరాజొసగిన శాపం తోడయినది. అనుభవింపక తప్పదు. ఎందుకు చెబుతున్నానో ఆలోచించుము మిత్రమా.’’

‘‘వీర విద్యలతో బాటుగ దేవభాషను ఇతర భాషలను నేర్చితివి. వేద వేదాంగములను చదివితివి. శివకేశవులకు భేదము లేదను సత్యము నెరుంగవా? పద్మ పురాణం స్పష్టంగా చెబుతున్నది గదా!


శ్లో॥ శైవంచ వైష్ణవం రూప మేకరూపం నరోత్తమ।

ద్వయోశ్చైవాంతం నాస్తిః ఏకరూప మహాత్మనోః

శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే।

శివస్య హృదయం విష్ణుర్విష్ణోశ్చ హృదయగ్ంశివః

అలా శివుని హృదయంలో విష్ణువు, విష్ణువు హృదయంలో శివుడు వుంటారు. వారిరువురికి భేదం లేదు. కాబట్టి నామాట విను మిత్రమా. బీమ శంకరుని దర్శించి వేడుట నీ తండ్రికిని నీకును క్షేమము, జయకరము.’’ అంటూ హితబోధ చేసాడు వృద్ధ మాధవస్వామి. కాని ఆయన మాటలు ధనుంజయునికి రుచించలేదు. శివుని దర్శింప మనసంగీకరించలేదు. చివ్వున లేచాడు.




'క్షమించండి స్వామి. మీరెవరో తెలీదు గాని అసాధారణ పురుషులని బోధ పడినది. కాని నా నిర్ణయం మారదు. సహ్యాద్రికి పోజాలను. శలవు.'' అన్నాడు.

''ఆలోచించు మిత్రమా. నీవుగా వెళ్తే శ్రమ తప్పును. తానుగా పిలుచుకొంటే శ్రమ తప్పదు.''

''శ్రమా.... నా దైవం ఆ కృష్ణ పరమాత వుండగా శ్రమ ఏటికి? పోయి వచ్చెద స్వామి'' అంటూ నమస్కరించి చర చరా మండపం దిగి పోయాడు ధనుంజయుడు.

‘‘పోయిరా మిత్రమా. ఆ తిక్క శంకరుడు నిన్ను వదులునా ఏమి? నీ తిక్క కుదర్చ గలడులే’’ వెనక నుంచి గొణిగాడు మాధవ స్వామి.

ఆలయ ఆవరణ దాటిన ధనుంజయుడు మండపం వైపు తిరిగి చూసాడు. ఇంతలోనే ఎటు పోయాడో గాని అక్కడ మాధవ స్వామి లేడు. ఆ తర్వాత వేణు గానమూ విన్పించలేదు.

*****************************************************

మరు నాడు`

వేకువనే బయలు దేరిన రాజ కుమారుడు ధనుంజయుడు భళ్ళున తెల్లవారేసరికి రామగిరి మూడు యోజనాల దూరంలో వున్నాడు. శ్వేతాశ్వం గరుడ ఉదయపు గాలికి పోటీ పడి వాయు వేగంతో పరుగులు తీస్తోంది. చుట్టూ పచ్చని పొలాలు కనువిందు చేస్తున్నాయి. పనులు చేస్తున్న రైతు జనాలు పాడుకొంటున్న పాటలు శ్రావ్యంగా వినవస్తున్నాయి. పల్లెలు, గ్రామాలు దాటుకొంటూ ఎక్కడా ఆగకుండా ప్రయాణం ముందుకు సాగుతోంది.

దారి పొడవునా రాత్రి గుడి వద్ద జరిగిన సంఘటన గురించి ఆలోచిస్తూనే వున్నాడు. మాధవ స్వామి శతాధిక వృద్ధుడు ఎవరాయన? తన కోసం ఎదురు చూడ్డం ఏమిటి? భీమ శంకరం వెళ్ళమని సలహా యివ్వటం ఏమిటి? తిరిగి చూస్తే కనబడకుండా ఎటు పోయాడు? అంతా విచిత్రంగా వుంది. అదేమిటో తను రత్నగిరి విడిచినప్పట్నుంచీ అన్నీ విచిత్రాలే జరుగుతున్నాయి. మనసు అపర్ణుడి వైపు మళ్ళింది. నిన్న మధ్యాహ్నం పరిచమయ్యాడు. సాయంకాలం వీడ్కోలు తీసుకున్నాడు. ఎక్కడి వాడో ఎక్కడికి వెళ్ళాడో ఇదమిద్ధంగా తెలీదు. కాని కొద్ది పరిచయం లోనే చెరగని ముద్ర వేసాడు. ఈ ప్రయాణంలో అలాంటి వాడు పక్కనుంటే ఎంతో బాగుండేది.

పరిపరి విధాలా ఆలోచిస్తున్నాడు ధనుంజయుడు. మార్గం పొడవునా వృషభ శకటాలు, అశ్వికులు, బాటసారులు ఎదురు పడుతున్నారు. కొండగుటట్టల వెంట పచ్చని పొలాల వెంట వంపు తిరిగిసాగుతూ అనేక పల్లెలు గ్రామ నధిగమించిస్తోంది మార్గం.

సాయంత్రానికి అనేక యోజనాల దూరం ప్రయాణించి కను చీకటి వేళకు ఒక పల్లెను చేరుకున్నాడు. ఆ పల్లెను దాటితే తిరిగి అడవి దారి ఆరంభమవుతుంది. ఇంకో రెండు దినాలు ఇలాగే సాగితే సరిహద్దు దాటి మాళవ రాజ్యంలోకి వెళ్ళి పోగలడు.

రాత్రికి పల్లెలో మజిలీ చేసిన ధనుంజయుడు. మరునాడు సూర్యోదయం తోనే తిరిగి బయలుదేరాడు. చిక్కని అడవి మార్గంలో ప్రవేశించింది అశ్వం. ఆ పగలు రెండో యామం వరకు వాతావరణం బాగానే వుంది. సూర్యుడు నడిమింట కొచ్చే వేళకి వాతావరణం మారి పోయింది. ఉత్తరం నుండి నల్లటి మబ్బులు క్రమ్ముకు రానారంభించాయి. అంత వరకు వెచ్చగా వీచిన వేడిగాలులు ఉన్నట్టుండి చల్ల బడి పోయాయి. గాలి విసురు హెచ్చింది. చూస్తుండగానే ఆకాశం మేఘావృతమైంది. ఝుంఝూమారుతం వీస్తోంది. వృక్షశాఖలు అల్లల్లాడి పోసాగాయి. తుఫాను సూచనలు కన్పిస్తూ గాలి జివ్వున వీస్తోంది. వర్షం పడే లోపలే ఏదో ఒక అనువగు చోటుకి చేరుకోవాలనుకున్నాడు. అంతలోనే చినుకు చినుకుగా చిరుజల్లు ఆరంభమైంది. గాలి విసురుకు ఫెళ ఫెళ మంటూ చెట్లకొమ్మలు విరిగి పడుతున్నాయి. ఉరుములు, మెరుపులతో ఆకాశం బీభత్సంగా మారిపోయింది. వీదురు గాలికి అశ్వం వేగం మందగించింది. వాతావరణానికి ఎదురీది ముందుకు సాగవలసి వస్తోంది.

అంతలో పెద్ద మెరుపు మెరిసింది.

సమీపంలో ఎక్కడో పిడుగు పడింది.

భూమి బీటలు వారుతోందా అన్నట్టు`

పిడుగుల శబ్దంతో దిక్కులు పిక్కటిల్లాయి. నభోంతరాళాలు మారు మ్రోగాయి. అంతే` అశ్వం గరుడ బెదిరి పోయి అదుపు తప్పింది.

ఒక్క సారిగా పక్కకు తిరిగి మార్గం విడిచి ఎడం పక్కగా అడవి లోకి దౌడు తీసింది. దాన్ని అదుపు చేయాలన్న ధనుంజయుని ప్రయ్నతమేదీ ఫలించ లేదు. దారి తెన్ను లేని అడవిలో ఇష్టం వచ్చినట్టు పరుగు తీస్తూనే వుంది. అదే సమయంలో చిటచిట చినుకులతో భారీ వర్షం ఆరంభమైంది.

ధనుంజయుడు ఎంత మాత్రం వూహించని సంకట స్థితి యిది. గాలివాన అంతకంతకూ ఉధృతమవుతోంది గాని ఎక్కడా తగ్గే సూచనలు కన్పించటం లేదు. ఫెళ ఫెళార్భాటాలతో చెట్లకొమ్మలు విరిగి పడుతున్నాయి. మహావృక్షాలు కూలిపోతున్నాయి. తను ఎటు పోతున్నాడో తెలీదు. అశ్వాన్ని ఇష్టానికి వదిలేసి కూచున్నాడు.

అశ్వం పోతున్న వేగానికి ఛెళ్ళున చెట్ల కొమ్మలు తాకి వంటి మీద చిన్న చిన్న గాయాలేర్పడుతున్నాయి. పట్ట పగలే చీకట్లు

ముసిరాయి. వాతావరణం బీభత్సంగా వుంది.

"హే కృష్ణా... ఏమిటయ్యా యిది? ఎటు వెళ్ళే వాడిని ఎక్కడకు మళ్ళిస్తున్నావ్? ఏమి అర్థం గాకున్నదే. ఇది యేమి లీల స్వామి. దారి చూపించుము." అంటూ తన దైవం వేణు గోపాలుని మనసులోనే వేడుకున్నాడు.

అదే సమయంలో మొన్న రామగిరి గుడి మండపంలో కన్పించిన వృద్ధుడు మాధవ స్వామి మాటలు కూడ గుర్తుకొచ్చాయి. ఒకవేళ ఇది ఆ భీమశంకరుని మహత్తు కాదు గదా! తొలి సారిగా మదిలో అనుమాన బీజం మొలకెత్తింది.

సమయం ఎంత గడిచిందో తెలీదు.

లోతట్టు అడవి లోకి ఎంత దూరం వచ్చేసాడో తెలీదు.

సాయం కాలానికి గాని అశ్వం అదుపులోకి రాలేదు. నిలువునా తడుస్తూ గడగడ వణికించే చలి గాలిలో ముందుకు సాగుతున్నాడు. కీకారణ్యంలో కౄర మృగాల  ఉనికి తెలుస్తోంది. తను వెళ్ళాల్సిన మార్గానికి ఏ దిశలో, ఎంత దూరంలో వున్నాడో తెలీదు. ఘోరాటవిలో నర సంచారమన్నది ఎక్కడా కన్పించటం లేదు. నిలువునా తడుస్తున్న ధనుంజయుని చలిగాలి గడ గడ వణికిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే రాత్రికి నరకాన్ని చవి చూడాల్సి వస్తుంది. తలదాచుకోడానికి అనువైన చోటు కన్పించటం లేదు. దారి తెన్నూ లేని అడవిలో ఇష్టానికి ముందుకు పోతోంది అశ్వం.

అయితే ఏమూలనో అదృష్టం కొంచెం కరుణించినట్టుంది. కాసేపట్లో చీకట్లు ముసురుకుంటాయనగా ఏనాటిదో పాడు పడిన ఒక ఆలయం కన్పించింది. వెంటనే అశ్వాన్ని అటు మళ్ళించాడు. మండపంతో బాటు ఆలయం చాలా భాగం శిథిలమైనప్పటికీ గర్భ గుడి బాగానే వుంది. అది ఏ దేవుడి గుడో అర్థం కాలేదు. గర్భ గుడిలో విగ్రహం లేదు. ధ్వంసమై వుంటుంది. కొన్ని ఎండుకట్టెలు ఓ మూలన పడున్నాయి.

ముందుగా పొడి దుస్తులు ధరించి, తడి దుస్తులు పిండి ఆరేసాడు. లోపలంతా శుభ్రం చేసి ఎండు కట్టెలతో నెగడు మండించాడు. అశ్వంతో సహా రాత్రికి ఆ గుడిలోనే తలదాచుకున్నాడు. గుడి తలుపు మూసి వెంట తెచ్చుకున్నవే తిన్నాడు. కంబళి నెగడు పక్కన పరుచు కొని వెచ్చగా పడుకున్నాడు. కొంత అలసట తీరింది.

రాత్రంతా వర్షం పడుతూనే వుంది.

సమయానికి ఆశ్రయమిచ్చిన ఆ పాడు బడిన గుడి ఆ క్షణంలో ఇంద్ర భవనం కన్నా మిన్న అన్పించింది. ధనుంజయుని ఆలోచనలు కొద్ది రోజులు వెనక్కి మళ్ళాయి.

**********************************************

కత్తులు మరొక్క మారు కణేలన మ్రోగాయి.

అది రాచకనగరునానుకొని వున్న విశాల ప్రదేశం. రాజ కుటుంబానికి చెందినవారు యుద్ధ విద్యల్ని అభ్యాసించే ప్రదేశం. నేలంతా ఎర్రమన్ను, ఇసుక ఒత్తుగా వేసి చుట్టూ కొద్దిపాటి ఎత్తుగా గోడకట్టబడింది. అక్కడ ప్రస్తుతం రత్నగిరి యువరాజు ధనుంజయుడు, మాళవ యువరాజు ఇంద్రజిత్తు తమ ఖడ్గ విద్యానైపుణ్యాన్ని పరీక్షిచుకోడానికి ద్వంద్వ యుద్ధం చేస్తున్నారు.

అప్పటికి రెండుమార్లు ఇంద్రజిత్తు చేతినుండి ఖడ్గం జారిపడింది. మూడోసారి తిరిగి తలపడ్డారు. ఉదయపు లే ఎండకు పొడవాటి ఖడ్గాలు శ్వేతనాగుల్లా మెరుస్తున్నాయి. ఇరువురి శరీరాలు శ్వేదంతో నిండి వున్నాయి.

మూడవసారి కూడ ధనుంజయుని ముందు ఎక్కువసేపు నివలేకపోయాడు ఇంద్రజిత్తు. ఖడ్గ ఛాలనంలో మెళకువలు తెలిసిన ధనుంజయుని విచిత్ర ఖడ్గ ప్రహారానికి ఇంద్రజిత్తు ఖడ్గం జారింది. చివ్వున తారాచువ్వలా నింగికి ఎగసి నిలువునా వచ్చి జండాకొయ్యలా భూమిలో దిగబడింది.

తన ఓటమికి ఇంద్రజిత్తు కించిత్తకూడ బాధపడలేదు. ఫక్కున నవ్వుతూ` ''బావా!'' అంటూ వచ్చి ధనుంజయుని వాటేసుకొని అభినందించాడు.

''నీముందు ఎవరూ నిలువజాలరని నాకు తెలుసు బావా. నిను ఓడించాలంటే ఆరుమాసములు నేను రత్నగిరిలోనే వుండి నీ నుండి శిక్షణ పొందవలె'' అన్నాడు.

‘‘ఉండిపోరాదూ. అవంతి వెళ్ళి నీవు చేయు రాచకార్యమేమున్నది’’ అన్నాడు నవ్వుతూ ధనుంజయుడు.

‘‘నా సంగతి సరి బావా. అదో...నా చెల్లెమ్మ స్వయం ప్రభాదేవి ఇటే వచ్చుచున్నది. ఖచ్చితముగా నీ కోసమే... నా ఖడ్గ ప్రహారాలను తప్పించుకోగలిగావు గాని, తన వాడి చూపుల నుండి తప్పించుకోలేవునులే. వెళ్ళు వెళ్ళు’’ అంటూ హాస్యమాడాడు ఇంద్రజిత్తు.

ఇంద్రజిత్తు సోదరి మాళవరాజ్య యువరాణి అయిన స్వయంప్రభ. చక్కగా సింగారించుకొని పసిడి బొమ్మలా మెరిసిపోతోంది. కరకంకణాలు కాలి అందియలు మృదుమధురంగా రవళిస్తూండగా అల్లన వచ్చి అంతదూరంలో గోడపక్కన ఆగి ధనుంజయుని ఓరకంట వీక్షిస్తూ` ‘‘బావా... రమ్ము. ఇటురమ్ము’’ అంటూ వీణమీటినట్టు తీయని స్వరంతో పిలిచింది.

తన ఖడ్గాన్ని నేలకు గ్రుచ్చి ఒక వస్త్రభాగంతో శ్వేదాన్ని అదుముకొంటూ చెంతకు వెళ్ళాడు ధనుంజయుడు.

మాళవ రాజదంపతులు హర్షవర్ధనుడు వసుంధరాదేవిలు. యువరాజు ఇంద్రజిత్తు, యువరాణి స్వయంప్రభతో కుటుంబసమేతంగా రత్నగిరికి విచ్చేసి వారములు దినము గడచినవి. రత్నగిరి ప్రభువు ధర్మతేజనకు తన సోదరి పట్ల ఎనలేని ప్రేమ. వారి రాకతో రత్నగిరి కోటలో మరింతగా ఆనందం వెల్లివిరిసింది. ముఖ్యంగా ధనుంజయుడు, ఇంద్రజిత్తు మధ్య బంధుత్వంతోబాటు మంచి స్నేహం కూడ వుంది. ఎప్పటికయినా రత్నగిరి గద్దెమీద ధనుంజయుని పక్కన కూచునే పట్టమహిషి తన కూతురేనని మాళవ మహారాణికి గాఢ నమ్మకం. ఆ నమ్మకానికి పరీక్షా సమయం సమీపించింది.

‘‘ఊఁ... వచింపుము స్వయంప్రభా. అంతఃపురము విడిచి ఉదయమే ఇటు వచ్చితివేమి?’’ గోడమీద కూచుకుంటూ అడిగాడు ధనుంజయుడు.

‘‘నీ కోసమే బావా!’’ అంది సిగ్గులో.

‘‘నా కోసమా....’’

‘‘అవును. నీ కోసమే. ఈ విషయం నీకు తెలుసునా?’’

“ఏ విషయము?”

“మన వివాహ విషయము.”

“వివాహమా... మనకా....”

“అవును. రాత్రి చాలా సమయము మన వివాహము గురించే పెద్దలు చర్చించినారు. ఈ ఉదయము కూడ ఈ విషయము చర్చకు వచ్చినది.”

“బాగు బాగు. నీవు సమ్మతించినావా?”

“ఇదియేమి ప్రశ్న? నీకు సమ్మతము కాదా?”

“పెద్దలు ఏమనుచున్నారు?”

“మనకు సమ్మతమైన వెంటనే ముహూర్తము నిశ్చయించెదరట బావా. నిక్కము వచింపుము. నన్ను వివాహమాడుట నీకు సమ్మతము కాదా?”

“కాదు స్వయంప్రభా. మన వివాహము జరుగదు.”

ధనుంజయుని నిర్ణయం వినగానే స్వయంప్రభ సోగకళ్ళలో గిర్రున నీరు సుడులు తిరిగింది.

“బావా! నేను అందముగా లేనా? వన్నె చిన్నెలు లేవా? నీకు తగినదానను గానా? ఏల ఈ నిరాదరణ? వరసయిన బావవని చిన్నప్పటినుండి నిన్నే ఆరాధిస్తున్నానే...” ఆపైన చెప్పలేక చిన్నగా ఏడ్చేసింది. బాధను చూసాడు ధనుంజయుడు.

ఆ సంభాషణ వింటున్న ఇంద్రజిత్తు కూడ ఆశ్చర్యం నుండి తేరుకుంటూ దగ్గరకొచ్చాడు.

“బావా! ఇది నీ మనసులో మాటేనా లేక మరదలని ఉడికింపనెంచితివా? మీ వివాహంతో రత్నగిరి మాళవ రాజ్యాల బంధుత్వం మరింత బలపడుతుందని ఎప్పటినుండో అనుకొంటున్నదే గదా...” అనడిగాడు.

“క్షమించు బావా” అన్నాడు బాధగా ధనుంజయుడు.

“మీరంతా నన్ను అపార్థం చేసుకున్నారు. నా మనసులో మాటను గూర్చి ఎవరూ ఎన్నడూ అడగలేదు. నీకో సోదరి ఉన్నందుకు ఎప్పుడూ అసూయ చెందేవాడిని. ఎందుకో తెలుసా? రత్నగిరికి నేనొక్కడినే ఏకైక వారసుడ్ని. నాకు సోదరులుగాని అక్కచెల్లెండ్రుగాని ఎవరూ లేరు. ఆ లోటు తీర్చుకోవటం కోసమే నీ సోదరిని నా సోదరిగానే భావిస్తూ వచ్చాను. అందుకే స్వయంప్రభ నా మరదలయినా ఎన్నడూ మేళమాడలేదు. ఛతురోక్తులు పలుకలేదు. మరో దృష్టితో ఏనాడూ వీక్షింపలేదు. ఎంతగా సొంత మరదలయినప్పటికీ సోదరిగా భావించిన అతివను ఎలా వివాహమాడగలను. ఇది అసంభవం....”

“లేదు బావా. నీ వాక్కు నిజము కాదు.” అంటూ మధ్యలోనే అరిచింది స్వయంప్రభ. ధనుంజయుని మాటాడనీయలేదు.

“నీ మాటలు అసత్యము. నేను నీకు నచ్చలేదు అంతియే. ఆ మాట చెప్పకుండా ఏవో సాకులు చెబుతున్నావు. ఇక ఏమీ చెప్పకుము. చాలును బావా. ఇంతకాలము నీ మీద ఆశలు పెంచుకున్నందుకు తగిన బుద్ధి చెప్పినావు. చాలు.” అంటూ కన్నీళ్ళు తుడుచుకొని చిన్నగా రోదిస్తూ వేగంగా అక్కడి నుండి వెళ్ళిపోయింది. ధనుంజయుడు నిశ్చేష్టుడయ్యాడు.

ఇంద్రజిత్తు ధనుంజయుని భుజం తట్టాడు.

“నిన్ను నేను అర్థం చేసుకోగలను బావా. కాని స్వయంప్రభ గాని మా యొక్క మాతాపితరులుగాని అర్థం చేసుకోగలరనుకోను. నీమీదే ఆశలు పెంచుకున్న ఈ పిచ్చిపిల్ల అక్కడ ఏమి రగడ చేస్తుందో ఏమిటో. నేను వెళ్ళి నీ తరఫున చెప్పిచూస్తాను.” అంటూ

తనూ వడివడిగా అక్కడినుండి వెళ్ళిపోయాడు.

ధనుంజయుడు భారంగా నిట్టూర్చి`

అక్కడినుండి తన మందిరానికి బయలుదేరాడు.

అయితే ఈ సమస్య సమసిపోయేది కాదని తెల్సుసు. అపోహలకు, అపార్థాలకు దారి తీస్తుందని తెలుసు. అదే జరిగింది.

అవంతి మహారాణి వసుంధరాదేవి కూతురి కన్నీళ్ళు చూడగానే భగ్గుమంది. కోపంతో యాగీ చేసింది. రత్నగిరి రాజదంపతులకు ఏంచేయాలో పరిస్థితినెలా చక్కదిద్దాలో అర్థం కాలేదు. వెంటనే యువరాజు ధనుంజయుని పిలిపించారు.

ధనుంజయుడు తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పాడు. అవంతి వారికి కావలసింది అభిప్రాయాలు కాదు. ధనుంజయునితో స్వయంప్రభ వివాహం. ఇటు కొడుక్కి నచ్చచెప్పలేడు అటు సోదరికి నచ్చచెప్పలేని సంకటస్థితి మహారాజు ధర్మతేజునిది.

అపోహు, అపార్థా రానేకూడదు. వస్తే కతు కన్నీళ్ళు తప్పవు. అలిగిన వసుంధరాదేవి అప్పటికప్పుడు స్వదేశానికి ప్రయాణమైంది. భర్త మహారాజు హర్షవర్ధనుడు భార్యావిధేయుడుగాబట్టి మౌనం వహించాడు. అవంతి రాజకుటుంబం వెంట వచ్చిన పరివారం వెంటనే రథాలను, అశ్వాలను సిద్ధం చేసి ప్రయాణ ఏర్పాట్లు చేసారు. వసుంధరాదేవిని శాంతింపజేయటం ఎవరివల్లా కాలేదు. ఆఖరికి అన్నవదినలు కానుకగా బంగారుపళ్ళెరంలో ఇస్తున్న చీరలు, రత్నాభరణాలను నేలకు విసిరికొట్టిందామె.

‘‘సంతోషంగా పుట్టింటికి వచ్చిన నన్ను కన్నీళ్ళతో సాగనంపుతున్నారు. ఇంకనూ ఈ లాంఛనాలు అవసరమా? నా కన్నీళ్ళు వృధా పోవు. ఇంతకింత ఇక్కడ కన్నీరు కార్చే రోజు వస్తుంది. మీ కుమారుడు మా కుమార్తెను మించిన ఎలాంటి రంభను వరిస్తాడో చూచెదముగాక.’’ అనరుస్తూ బయలుదేరింది.

చివరిగా వెళుతూ ఇంద్రజిత్తు ధనుంజయుని చేయి అందుకున్నాడు. ‘‘క్షమించు బావా. నీ మేనత్త కోపం నీకు తెలియనిది కాదు. ఈ కోపతాపాలు ఎంతకాం. అన్నీ సర్ధుకుంటాయి. త్వరలోనే నేను వస్తాలే’’ అని చెప్పి వెళ్ళిపోయాడు.

ముందు ఒక అశ్వికదళం వెనుక ఒక అశ్వికదళం రక్షణగా అనుసరిస్తుండగా మూడు రథాలమీద అవంతీ రాజ కుటుంబం తరలి రత్నగిరి వదిలి వెళ్ళిపోయింది.

మహారాజ మందిరంలో జరిగిన ఈ గొడవ`

అక్కడి పరిచారికలకు తప్ప ఒరుకు తెలీదు.

వాళ్ళు ఎవరికీ చెప్పరు. సరిగ్గా`

ఇది జరిగిన వారం దినముల తర్వాత`




అది వసుంధరా దేవి నోటివాక్కో లేక విధి లిఖితమో గాని రత్నగిరి కోటలో కన్నీరు ప్రవహించే క్షణాలు ఆరంభమయ్యాయి. ఈ రోజు ఉదయం మహారాజ ధర్మతేజుడు నిద్ర లేచే సరికి వీపు మీద కంది గింజ ప్రమాణంలో బుడిపె లేచి ఎర్రగా కంది వుంది. అది

రెండు రెక్క గూళ్ళ మధ్యన సరిగ్గా వెన్ను మీద లేచి చిన్నగా సలుపుతోంది. రాజ వైద్యులు పరీక్షించారు. అది సాధారణ కణితి అనుకున్నారు. ఎందుకంటే, వ్రణాలు అనేక రకాలు. అవి పక్వానికొస్తే గాని నిర్ధారణ చేసుకోవటం కష్టం. అది అణగి పోయేందుకు ఏవో లేపనాలు, మందులు వాడారు.

రోజులు గడుస్తున్నాయి గాని మందుల దారి మందులది. కణితి దారి కణితి అవుతోంది. పక్షం దినాలయ్యే సరికి నిమ్మకాయ సైజుకు పెరిగి వ్రణంగా మారింది కణితి. ఎర్రగా గట్టిగా నెత్తురు ముద్దలా వుండి భరింప రాని వేదన ఆరంభమైంది.

రాజ వైద్యులిరువురూ ఆయుర్వేదంలో అపర ధన్వంతరీలనదగ్గ ఘనాపాటీలు. వ్రణం పక్వానికి రావటం లేదు. దాని తీరు చూస్తుంటే వారికి తొలిసారిగా అనుమానం మొదలయింది. ఇది రాచపుండు కాదు గదా! ఎప్పుడో అరుదుగా ఏర్పడే ఈ రాచపుండునే పుట్ట వ్రణం అని కూడ అంటారు. నాటికి ఈ వ్రణాన్ని గుణ పరిచే మూలికలేవీ కనుగొనబడ లేదు. ఇది క్రమంగా పిలకలు వేస్తూ ఒక పక్క పగిలి రసి ఓడుతూ మరో పక్క పెరుగుతూ క్రమంగా ఒక పుట్టలా వీపు మీద విస్తరిస్తోంది. బాధితుడు బ్రతికుండగానే నరక యాతన అనుభవిస్తాడు. ఆరు మసాలు మించి బ్రతకడు. రాజ వైద్యులు ఎన్నో గ్రంధాలు తిరగేసి చికిత్సలు చేస్తున్నా ప్రయోజనం లేక పోయింది.

మహారాజు తన రాజ మందిరంలో తల్పానికే పరిమితమయ్యారు. మహారాణి కనకాంబిక దుఖ్ఖానికి అంతులేదు. రాజుగారి రాచ పుండు గురించి ప్రజలకు తెలిస్తే ఆందోళన చెందుతారని ఈ విషయాన్ని గోప్యంగా వుంచారు. ఈ లోపల అవంతి నగరం నుండి యువరాజు ఇంద్రజిత్తు వచ్చి ఒకసారి చూసి వెళ్ళాడు. ఇదే సమయంలో త్రిలింగ దేశం నుండి, కరునాడు నుండి ఆయుర్వేదంలో తల పండిన వృద్ధ వైద్యులు రప్పించబడ్డారు. అప్పటికి రాచపుండు ఏర్పడి రెండు మాసాలయింది. వైద్యులు మహారాజు ధర్మతేజుని వ్రణాన్ని క్షుణ్ణంగా పరీక్షించి అది పుట్ట వ్రణమని తేల్చి చెప్పారు. బాధా నివారణకు కొన్ని మందులు వాడమని, ఓ విషయం తేల్చి చెప్పారు.

‘‘మహారాజా. ఇది తీరని వ్యాధి. పూర్తిగా నివారణకు ఎలాంటి చికిత్సయు లేని మొండి వ్రణము. మీకు ఆరోగ్యం చేకూరడానికి ఒకే ఒక మార్గం వున్నది. ఈ వ్రణము నాగ దోషము వలన ఏర్పడుతుంది. ఎవరైనా ఒక సాహసికుడు నాగ లోకం వెళ్ళి దివ్య నాగమణిని మరో నాలుగు మాసముల లోపు తేగలిగినచో వ్యాధి గుణమగును. నాగమణి మహిమ వలన క్షణాలలో ఈ రాచ పుండు హరించి పోయి సంపూర్ణ ఆరోగ్యము చేకూర గలదు’’ అంటూ సలహా యిచ్చారు.

నాగలోకము!

ఎక్కడ వుందది?

ఎక్కడో ఉత్తర ఈశాన్య ప్రాంతపు అడవులలో అక్కడికి మార్గముందని వైద్యులు చెప్పారు గాని, ఖచ్చితంగా ఎవరికీ తెలీదు. అయినప్పటికీ తను వెళ్తానన్నాడు యువరాజు ధనుంజయుడు. కాని ఈ పరిస్థితిలో రాజ్య క్షేమం కోసమైనా యువరాజు కోటలోనే ఉండాలని శాసించాడు ధర్మతేజుడు. అంతే కాదు, నాగలోకం నుండి దివ్య నాగమణిని తెచ్చిన సాహసికునికి అర్ధరాజ్యం బహుకరింప బడునని రాజ్యంలో దండోరా వేయించాలని నిర్ణయం తీసుకున్నాడు.

కాని యువరాజు ధనుంజయునికి మనసు అంగీకరించ లేదు. తండ్రి పడే బాధను చూస్తూ తల్లి దుఖ్ఖాన్ని చూస్తూ ఒక అసమర్థునిలా తను కోటలో వుండలేడు. అందుకే ఒక నిర్ణయం తీసుకున్నాడు. తండ్రి అభీష్టానికి విరుద్ధంగా దివ్య నాగమణి కోసం తనే బయలుదేరాడు.

తన మందిరంలో తండ్రి ధర్మతేజుని పేర ఒక లేఖ వుంచి ప్రయాణ ఏర్పాట్లు చేసుకుని వేకువనే తన అశ్వం గరుడనధిరోహించి రత్నగిరి వదిలి వేగంగా సాగిపోయాడు.

మధ్యాహ్నం వేళగాని ధర్మతేజునికి ఈ విషయం తెలియ లేదు. లేఖ చూడగానే హతాశుడయ్యాడు. వెంటనే యువరాజును వెనక్కు తీసుకు రావలిసిందిగా ఆజ్ఞాపిస్తూ దళపతి కరివీరుని ఆజ్ఞాపించాడు.

వంద మంది అశ్వికులలతో కూడిన సైనిక దళంతో ఆ సాయం కాలమే కరివీరుడు యువరాజు కోసం బయలు దేరి, ఎక్కడా ఆగకుండా ప్రయాణించి మూడో రోజు యువరాజు ధనుంజయుని కలుసుకో గలిగాడు.

***************************

గాలి వానకు పాడుపడ్డ ఆలయంలో తల దాచుకున్న యువరాజు ధనుంజయునికి ఎడతెగని ఆలోచనల మధ్య ఎప్పుడు నిద్ర పట్టిందో కూడ తెలీదు. ఎంత సమయం గడిచింది కూడ తెలీదు.

అంతలో `

‘‘మిత్రమా ధనుంజయా. నిద్ర పోయినది చాలును. ఇకలెమ్ము’’ అంటూ ఒక ఆత్మీయ పిలుపు అతడ్ని నిద్ర లేపింది. అదే పిలుపు, ఆలయ మండపంలో కన్పించిన వృద్ధ మాధవ స్వామి పిలుపు.

దిగ్గున లేచి కూచున్నాడు ధనుంజయుడు.

ఎదురుగా చేతిలో వేణువును విలాసంగా తిప్పుతూ మాధవ స్వామి. తన ముందే బాసిం పట్టు వేసి కూచుని దరహాసం చేస్తూ కన్పించాడు. అయితే ఇప్పుడున్నది రాత్రి తను బస చేసిన శిథిలాలయం కాదు, దివ్య ప్రభలతో ప్రకాశిస్తున్న అద్భుతమైన ఆలయం. చుట్టూ దేదీప్య మానంగా జ్యోతులు ప్రకాశిస్తున్నాయి. మాధవ స్వామి వెనుక కొద్ది దూరం లోని ఆలయ మూల విరాట్టు స్థానంలో వేణు గోపాలుని విగ్రహం చిరునవ్వు చిందిస్తోంది. పూల మాలాంకృతుడైన స్వామి ముందు పూజలు జరిగినట్టుగా ధూప నైవేద్యాలతో అగరు, కస్తూరి, పునుగు సువాసనలతో ఆ ప్రాంతం పరిమళ భరితంగా వుంది.

ధనుంజయునికి ఏమీ అర్థం కావడం లేదు. శిథిలాలయంలో నిద్రించిన తను ఇక్కడికెలా వచ్చాడు? మాధవ స్వామి తిరిగి తన ముందు కన్పించటం ఏమిటి? ఏం జరుగుతోంది? లేచి కూచుంటూ`

‘‘స్వామీ... మీరా!’’ అన్నాడు అప్రయత్నంగా.

‘‘అవునయ్యా. నేనే.’’ బదులిచ్చాడు వృద్ధ మాధవ స్వామి.

‘‘ఇక్కడున్నారేమి?’’

‘‘ఎక్కడైనా వుంటాను. సందేహమే?’’

‘‘శిథిలాయంలో కదా నిద్రించితి. ఇచట కెలా వచ్చితిని?’’

“పిచ్చివాడా! నేనెచటనున్న అదియే నా దేవాలయము గదా”

“మీ మాటలు కడు విచిత్రముగా నున్నవి”

“చిత్రము చేయువాడను. మాటలూ చిత్రములే గాని, నా పలుకులు పెడ చెవిన పెట్టినావు గదా. రామ గిరి నుండే నేరుగా సహ్యాద్రికి పోయిన ఇప్పుడు నీకీ శ్రమ దమాదులున్డేవి కాదు గదా”

“అవును స్వామీ. ఇది నా తప్పిదమే. మీరే దారి చూపాలి. సహాద్రికి వెళ్ళి ఆ భీమ శంకరుని దర్శించెదను”

“తథాస్తు. నీ సంకల్పమును ఆ శంకరుడు నెరవేర్చ గలడు. అంతయు మన మంచికే యని గ్రహింప వలె. శుభమగు గాక. పోయి వచ్చెదను.” అంటూ లేచాడు.

“స్వామీ! ఇన్ని తెలిసిన మీరు నాకు నాగ లోకము చేరుటకు మార్గము తెలుప వచ్చును గదా.” అడిగాడు ధనుంజయుడు. వెను తిరిగి చూసి మంద హాసం చేసాడు మాధవ స్వామి.

“మిత్రమా! కష్టే ఫలి అన్నారు గదా పెద్దలు. కర్మలు ఆచరించుట నీ వంతు, ఫలితాన్ని నాకు వదిలెయ్. నీ శ్రమ వృధా పోదు.” అని చెప్పి అలా నడుచుకొంటూ వెళ్ళిపోయాడు వృద్ధుడు. ధనుంజయుడు చూస్తుండగానే ఆ వృద్ధ మాధవ స్వామి వేణు గోపాలుని విగ్రహంలో ఐక్యం చెందాడు.

అప్పటిగ్గాని ధనుంజయునికి అసలు విషయం బోధ పడ లేదు. వచ్చింది ఎవరో కాదు, సాక్షాత్తూ తన ఆరాధ్య దైవం ఆ వేణుగోపాలుడే. ఆయన్ని గుర్తించలేని తన అవివేకాన్ని నిందించుకున్నాడు. రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ ` “హే పరంధామా... మాధవా... మధుసూదనా... వాసుదేవా... నన్ను నీ సఖుడిగా ఆదరించి, నా కోసం వచ్చినావా ప్రభూ రాధా మనోహరా రుక్మిణీ వల్లభా... వేణు గోపాలా...” అంటూ స్తుతించ సాగాడు.

అదే సమయంలో బయట పక్షుల కిలకిలారావాలకు చట్టున మెలకూ వచ్చేసింది. కల నుంచి బయట పడి కళ్ళు తెరిచాడు ధనుంజయుడు. జరిగిందంతా కలయని తెలిగానే ఆశ్చర్య పోయాడు. శిథిలాలయం గర్భ గుడిలో రాత్రి ఎక్కడ నిద్రించాడో అక్కడే

ఉన్నాడతను. పక్కన నెగడు ఎప్పుడో ఆరి పోయింది. బయట వర్షం కూడ లేదు. లేచి తలుపు తెరిచి బయటకు చూసాడు. తెల్లవారింది. కాని ఆకాశంలో మబ్బులు అలాగే వుండి పొద్దు కన్పించటం లేదు. వర్షం నిలిచి పోవడంతో అడవంతా మృగ సంచారం ఆరంభమైంది. పక్షులు కిలకిలారావాలతో సందడి చేస్తున్నాయి.

అసలే కీకారణ్యం. ఆపైన పొద్దు కనబడక పోవటంతో దిక్కు తెలియటం లేదు. తన సామాన్లు సర్దుకొని అశ్వం మీద వేసి అశ్వాన్ని బయటకి తీసుకొచ్చాడు. సొరకాయలో మిగిలిన నీళ్ళతో ముఖం కడుక్కుని దొరికిన ఫలాలు తిన్నాడు. ఎందుకైనా మంచిదని అల్లెతాడు బిగించి విల్లును సిద్ధం చేసి భుజాన తగిలించుకుని అశ్వాన్ని అధిరోహించి ముందుకు అదిలించాడు. ఆలయ ప్రాంతం నుండి బయలు దేరింది అశ్వం.

నిన్నటి గాలి వానకు అడవంతా చిందర వందర గానూ బీభత్సంగాను వుంది. అనేక వృక్షాలు నేల కూలాయి. వృక్ష శాఖలు విరిగిపడ్డాయి. దిక్కు సంగతి అలా వుంచి ముందుకు పోడానికి వీలుగా ఒక దారంటూ కన్పించటం లేదు. ఎటు వీలుంటే అటు దారి చేసుకుని అశ్వాన్ని ముందుకు పోనిస్తున్నాడు.

సింహ శార్దూలాది కౄర మృగాలకు, వృక్షాలను అధిరోహించే చిరుతలు, నల్లపులులు, ఎలుగుబంట్లకు నిలయం ఆ అడవి. ఇక గుంపుగా సంచరించే ఏనుగుల గురించి చెప్పనక్కర్లేదు. వాటి అరుపులు వినవస్తున్నాయి. కాస్త ఏమరు పాటుగా వున్నా ప్రాణహాని తప్పదు. వేయి కళ్ళతో పరిసరాలను గమనిస్తూ ముందుకు సాగుతున్నాడు. ఇంతలో`

వృక్ష శాఖల మీద పక్షలు కలకలం అధికరించింది. కొమ్మలవెంట ఏవో దూకుతున్న అలికిడవుతోంది. యధాలాపంగా అటు చూసిన ధనుంజయుడు ఉలికి పడ్డాడు.

పాములు… ఎటు చూసినా విషనాగులు.

ఒకటి కాదు రెండు కాదు.

అసంఖ్యాకమైన పాములు. వృక్ష శాఖల వెంట కన్పిస్తున్నాయి. అవి అసాధారణ విష నాగులు. వృక్ష శాఖల వెంట సంచరిస్తాయి. ఒక చెట్టు నుండి మరో చెట్టు మీదికి దూకే ఎగిరే పాములు. వీటికి రెక్కలతో పని లేదు. మడిచి వదిలిన ఉక్కు తీగలా శరీరాన్ని బిగించి వదిలి చివ్వున గాలిలో ఎగిరి దూకుతాయి. సుమారు యాభై ధనువుల దూరం వరకు అవలీలగా ఎగరగలవు. అవతల

వృక్ష శాఖలను చుట్టుకొని పక్షి గూళ్ళను గాలించి గుడ్లను మ్రింగేస్తుంది.

అసలివి ఒకే ప్రాంతంలో వృక్షాలనాశ్రయించి వుండటం అరుదైన విషయం. వాటి కదలికలు అసహజంగా కన్పిస్తున్నాయి. ఎటు చూసినా వందలాది పాములు కన్పిస్తున్నాయి. అవి తనను లక్ష్యంగా చేసుకొని తన అశ్వం వెంబడే పైన కొమ్మల మీద ఎగురుతూ అనుసరిస్తున్నాయి. తనను దిగ్బంధనం చేస్తున్నట్టున్నాయి.

అవన్నీ ఒకేసారి తన మీదకు దాడి చేస్తే తనతో బాటు తన అశ్వం గరుడ కూడ ప్రాణాలతో నిలవటం కష్టం. అసలివన్నీ నిజ పాములేనా లేక ఆ రోజు లాగే ఇది కూడ నాగాల ఆటవికుల ఓజో తాంత్రిక విద్యా ప్రయోగమా! అశ్వాన్ని అదలిస్తూ ధనుంజయుడు ఆలోచిస్తుండగానే సమీప శాఖల మీద పాములు రెండు తొందరపడ్డాయి. ఇంత లావున నోరు తెరిచి బుసలు కొడుతూ పగ బట్టినట్టు కుప్పించి గాల్లోకి ఎగిరాయి.

తననే లక్ష్యంగా చేసుకుని ఎగురుతూ సూటిగా అవి తన మీదికే వస్తుండటం గమనించగానే అప్రమత్తుడవుతూ సర్రున ఖడ్గం దూసాడు ధనుంజయుడు. కన్ను మూసి తెరిచేలోన మీద పడబోతున్న పాములు రెండూ తలలు తెగి అవతల పడ్డాయి.

ఖడ్గానికి అంటిన నెత్తురు చూడగానే ఇది నాగాల ఓజో మాయ కాదని, నిజ సర్పాలని గ్రహించాడు. అంటే... వాటికవి తన మీద పగతో రావాల్సిన పని లేదు. వెనక వుండి ఎవరో వీటిని తన వైపు ప్రేరేపిస్తున్నారు. ఎవరది? నాగరాజా? ఆలోచించే వ్యవధి లేదు. చూస్తుండగానే మరో అయిదు సర్పాలను ముక్కలుగా ఖండించాడు.

ఒకటి కాదు రెండు కాదు, అడవిలోని ఈ జాతి పాములన్నీ రాత్రికి రాత్రి యిక్కడికి కేంద్రీకృతం చేయబడి వుండాలి. ఇవి తనను చుట్టు ముట్టక ముందే దూరంగా వెళ్ళిపోవాలి. ఆలస్యం చేయకుండా అశ్వం కళ్ళాలు బిగించి బలన్గా తన్నాడు.

‘‘పదరా గరుడా! క్షణం ఆలస్యమైనా మన ప్రాణాలు నిలువవు. ఈ విపత్కర పరిస్థితిని అధిగమించాలంటే నీ శక్తి చూపించాలి. పరుగెత్తూ’’ అనరిచాడు. అంతే`

యజమాని ఉద్దేశం గ్రహించినట్టు ఒక్కసారిగా ఎగిరి నాలుగు కాళ్ళమీద దౌడు ఆరంభించింది గరుడ. అదే సమయంలో సర్పాలు కూడ దాడి ఆరంభించాయి. శర పరంపరలా వృక్ష శాఖల నుండి దూసుకు రాసాగాయి. తన ఖడ్గాన్ని నిర్విరామంగా తిప్పుతూ వచ్చిన వాటిని వచ్చినట్టు తెగ నరక సాగాడు.

పాములకు అందకుండా`

పొదలను విరగ ద్రోసుకుంటూ`

ఇష్టం వచ్చినట్టు పరుగు తీస్తోంది అశ్వం.

తమను సమీపిస్తున్న ఎగిరే పాముల్ని గాలిలో వుండగానే తన ఖడ్గానికి బలి పెడుతున్నాడు ధనుంజయుడు. ఒక వృక్ష శాఖల నుండి మరో వృక్ష శాఖల మీదికి అవలీలగా దాటుకొంటూ మందలు మందలుగా ఎగిరి వస్తూనే వున్నాయా విష నాగులు. లాగి వదిలిన బాణంలా`

దూసుకు పోతూనే వుంది అశ్వం గరుడ. వెళ్తున్న దారి పొడవునా ఖండిత సర్పాల నెత్తురుతో ఎర్ర బారుతోంది. వచ్చేవి వస్తూనే వున్నాయి, చచ్చేవి చస్తూనే వున్నాయి. శరీరాలు ముక్కలయినా కూడ కొన్ని సర్పాలు ప్రాణాలు శిరస్సున వుంచుకొని గుర్రం వెళ్తున్న మార్గాన్ననుసరించి నేలమీద నెత్తురోడుతూనే భీకరంగా బుసలు కొడుతూ పాకి వస్తూనే వున్నాయి.

అయినా సరే`

పగ సాధించే తీరుతాం అన్నట్టుగా.

గుర్రం వేగంతో సమంగా వృక్ష శాఖల వెంట దండెత్తి వస్తున్నట్టుగా ఎగిరెగిరి దూకి తరుముకొస్తూనే వున్నాయా పాములు.

ఇంతలో ఎగువన`

మరో ప్రమాదం పొంచి వుండటం గమనించాడు ధనుంజయుడు. అక్కడో శాలి వృక్షం శాఖల మీద మాటు వేసి కూచునుందో నల్ల పులి.

అతి ప్రమాద కరమైన ఆ పులి వున్న చెట్టు వైపే దౌడు తీస్తోంది అశ్వం. చుట్టూ దట్టమైన వృక్షాలు లతలు, పొదల కారణంగా అశ్వాన్ని మరో పక్కకు మళ్ళించే అవకాశం కూడ అక్కడ లేదు. కొద్ది క్షణాలు ఏం చేయాలో తోచలేదు ధనుంజయునికి. ఎగువన`

వృక్ష శాఖల మీది నల్ల పులి అప్పటికే అశ్వాన్ని గమనించింది. వేట కోసం దూకటానికి సిద్ధపడుతోంది.

విల్లుకు బాణం సంధించే సమయం గాని, అవకాశం గాని ధనుంజయునికి లేదు. అటు చూస్తే ఒకటీ అరా ఇంకా పాములు దూకుతూనే వున్నాయి. అశ్వం పిడుగు పాటులా దూసుకు పోతూనే వుంది. వెంటనే ఖడ్గాన్ని ఎడమ చేతిలోకి మార్చుకొని తిప్పుతూ కుడి చేత్తో శూలం అందుకున్నాడు. చూస్తూండగానే వృక్షాన్ని సమీపించింది అశ్వం. కొమ్మ పైన మాటు వేసిన నల్ల పులి కూడ దూకడానికి సిద్ధంగా వుంది. అదే సమయంలో జీను మీద లేచి గురి చూసి బలంగా శూలాన్ని విసిరాడు ధనుంజయుడు.

అతడి గురి తప్పదు.


గాలిని చీల్చుకుంటూ దూసుకెళ్ళిన శూలం సూటిగా పోయి నల్లపులి గుండెల్ని చీల్చుకుంటూ దిగబడింది. బాధతో భీకరంగా గాండ్రిస్తూ విలవిలా తన్నుకొని దబ్బున కింద పడింది. క్షణాల్లో దాని ప్రాణాలు ఎగిరి పోయాయి. ఈ లోపల అశ్వం పులిని దాటేసింది. ధనుంజయుడు అశ్వం పైనుండి వంగి లాఘవంగా తన శూలాన్ని లాక్కున్నాడు. పులిని కొంత దూరం లాక్కొచ్చి వదిలింది శూలం. ఈ సారి ఓ చేత్తో ఖడ్గాన్ని, ఓ చేత్తో శూలాన్ని తిప్పుతూ వచ్చిన పాముని వచ్చినట్టు తెగటార్చుతూ అశ్వాన్ని ఇష్టానికి వదిలేసాడు. మరి కొద్ది సేపట్లోనే సర్పాలు క్రమంగా వెనక బడ్డాయి. అశ్వం ముందుకు పోతూనే వుంది. దాని వేగం మందగించ లేదు. గిట్టల శబ్దం కొండ గుట్టల వెంట అడవిలో ప్రతిధ్వనిస్తోంది.

అదే సమయాన`

మరో శబ్దాన్ని కూడ పసి గట్టాయి ధనుంజయుడి చెవులు. తనకు ఎడం పక్కగా చెట్టు పుట్ట వెనక జరజర పాకుతూ ఏదో వేగంగా వస్తున్న శబ్దం. చాలా సేపటి వరకు శబ్దం విన్పిస్తూనే వచ్చింది. కాని ఆకారం మాత్రం కన్పించ లేదు. ఎందుకైనా మంచిదని కళ్ళాలు బిగించి అశ్వాన్ని దౌడుతీయిస్తున్నాడు. ఎంత దూరం అలా ముందుకు సాగి పోయాడో తెలీదు గాని అడవి కాస్త పల్చబడి రాతినేల ప్రాంతాన్ని సమీపిస్తుండగా అప్పుడు... అప్పుడు కన్పించిందా ఆకారం. దాన్ని చూడగానే ఉలికిపడ్డాడు.

జీవితంలో ఎన్నడూ చూడని`

ఒక అరుదైన దృశ్యాన్ని చూస్తున్నాడు.




సుమారుగా పది ధనువుల పొడవుండే దుంగ లాంటి పెను సర్పం ఒకటి ఒక పెడగా వాయు వేగంతో పాకుతూ తనను అనుసరిస్తోంది. కాలిన దుంగ లాంటి అతి నల్లని శరీరం. అది శ్వాస వదులుతూంటే పొగలతో కూడిన అగ్ని జ్వాల వెలువడుతోంది. దాని ఒళ్ళంతా కాల కూట విషం లాంటి భయంకరమైన విష తుల్యమని చూడగానే అర్థమవుతోంది. అగ్నిసర్పం!

అరుదైన ఈ అగ్ని సర్పం పాము గురించి తను విన్నాడు గాని నేరుగా ఇప్పుడే చూస్తున్నాడు. గాలిలో వ్యాపిస్తున్న దాని విష జ్వాలలకు ఆకులు, అలములు క్షణాల్లో మాడి మసై పోతున్నాయి. ఇక దాని నోరు తెరిస్తే ఎంత పెను విష జ్వాలలు వ్యాపిస్తాయో వూహించు కోవచ్చు. ఇంత వేగంతో దూసుకొచ్చే పెను నాగాన్ని ఇప్పుడే చూస్తున్నాడు. దీనికి చిక్కితే క్షణాల్లో ప్రాణాలు హరిస్తుందనడంలో సందేహం లేదు.

ఇంతగా ఇది తనను వెంబడిస్తోందంటే సందేహం లేదు. ఇది నాగ లోకాధిపతి ఆ నాగ రాజు పనే. ఓజో ప్రయోగం విఫలం గావటంతో ఎగిరే పాముల్ని తన మీదికి ప్రేరేపించాడు. అదీ తప్పించుకుంటే అంతం చేయమని ఈ అగ్ని సర్పాన్ని అంపకం చేసాడు. రానీ....

ఎంత దూరం వస్తుందో అదీ చూచెదను గాక అనుకొంటూ కళ్ళాలు బిగించి అశ్వాన్ని అదిలిస్తున్నాడు. అగ్నిసర్పం కదలికల్ని ఓర కంట గమనిస్తూనే వున్నాడు.

ఆకాశంలో మేఘాలు అలాగే వున్నాయి.

సూర్యుడు కన్పించ కుండా పోయాడు.

గాలి విసుర్లు ఆగి ఆగి వీస్తున్నాయి.

నట్టడివిలో దిక్కు దరి తెలికుండా పోయాయి.

తిరిగి వర్షం ఆరంభమైనా ఆశ్చర్యం లేదు.

రాత్రి కురిసిన వర్షానికి మిట్ట పల్లాల్లో వర్షం నీరు నిలిచి వుంది. క్షణాలు భారం గానూ, వేగం గానూ దొర్లి పోతూనే వున్నాయి. క్రమంగా ఒక మైదాన ప్రాంతాన్ని సమీపించింది అశ్వం.

చూడ్డానికి ఒక మడుగులా వుంది గాని, నిజానికి అది సువిశాలమైన లోతట్టు మైదాన ప్రాంతం. పైగా చాలా వరకు రాతి నేల విస్తరించి వుంది. రాత్రి కురిసిన వర్షం నీరు నిలిచి వుంది. అక్కడో చెట్టు ఇక్కడో చెట్టుగా పెరిగి మిగిలిన ప్రాంతమంతా ఒత్తుగా పచ్చిక పెరిగుంది. పచ్చిక తాలూకు చిగుళ్ళు నీటి పైకి స్పష్టంగా కన్పిస్తున్నాయి. మైదానంలో మోకాలి లోతు మించదు నీరు.

తను మైదానానికి అడ్డం బడి వెళ్ళి పోవచ్చును. కాని అంత వేగంగా వస్తున్న అగ్ని సర్పానికి నీరు అడ్డు కాదు సరి గదా నీటి మీద అది మరింత వేగంగా తన అశ్వాన్ని చేరు కొంటుంది. కాబట్టి నీటి లోకి దిగటం దానికి మరింత అవకాశం ఇచ్చినట్టవుతుంది. తెలిసీ పొరబాటు చేయ కూడదు.

ఇక మిగిలింది ఒకటే దారి.

తాడో-పేడో తేల్చుకోవటం.

అలా మైదానంలో ప్రవేశించటం క్షేమం కాదనుకొంటూ నీటి వంచకు దూరం లోనే తన అశ్వాన్ని నిలువరించాడు ధనుంజయుడు. అది గమనించ లేదు అగ్ని సర్పం. వస్తున్న వేగానికి నేరుగా మైదానంలో నీటి మీద కొంత దూరం దూసుకు పోయింది. తల తిప్పి

ధనుంజయుని క్రూరంగా చూస్తూ వెను తిరిగి తనూ ఆగింది. దాని శరీర విషానికి నీరు మరిగి ఆవిర్లు వస్తున్నాయి. దాని శ్వాసకు నీటి మీదకు కన బడుతున్న పచ్చిక క్షణాల్లో నల్లగా మాడి పోతోంది. ధనుంజయుని తీక్షణంగా చూస్తూ అది బుసలు కొట్టి నోరు తెరవ గానే భయంకర అగ్ని కీలలు గాలి లోకి వ్యాపించాయి. దాన్ని చూసిన అశ్వం గరుడ బెదిరి నాలుగడుగులు వెనక్కి వేసింది. వెన్ను తట్టి ధైర్యం చెప్పాడు ధనుంజయుడు.

అగ్ని సర్పం తీరు చూస్తే అది తనను వదలదని అర్థమవుతోంది. ఎగిరే పాముల నుంచి ఎలాగో తప్పించుకు రాగలిగాడు గాని భీకరమైన ఈ అగ్ని సర్పం నుంచి మాత్రం తను తప్పించు కోలేడు. ఒకటి దాన్ని సంహరించాలి లేదా తను చావాలి. ఏదో ఒకటి జరక్కుండా మాత్రం ముందుకు పోలేడు. అగ్ని సర్పం నెమ్మదిగా కదులుతోంది.

అది నేరుగా తన వైపే వస్తోంది.

ధనుంజయుడు ఇక ఉపేక్షించ లేదు.

వెంటనే ధనస్సు అందుకున్నాడు.

అంబుల పొది నుండి రెండు బాణాలు తీసాడు. ఒకటి అర్ధ చంద్రాకార శరము, రెండోది వాడి యగు బాణం. రెంటిని ఏక కాంలో వింటికి సంధించాడు. క్షణ కాలం కనులు మూసుకొని తన దైవం కృష్ణ పరమాత్మను, సహ్యాద్రి భీమ శంకరుని తలచుకున్నాడు. తిరిగి కనులు తెరిచే సరికి అగ్ని సర్పం నీటి మీద ప్రచండ వేగంతో వచ్చేస్తోంది.

బుస కొట్టి గొడుగులా పడగ విప్పింది.

దాని నోటి నుండి ఛెళ్ళున విష వాయువులతో కూడిన అగ్ని జ్వాలలు ఎగసాయి. క్రమంగా నీటిని చెల్లా చెదురు చేస్తూ సమీపం లోకి వచ్చేస్తోంది. గురి చూసి బాణాలను వదిలాడు ధనుంజయుడు. బాణాలు రెండూ గాలిని చీల్చుకు వెళ్ళాయి. ఒకటి దాని శరీరంలో దిగ బడింది. అర్ధ చంద్రాకారం బాణం నేరుగా వెళ్ళి దాని పడగ దిగువకు శరీరాన్ని రెండు ముక్కలు చేస్తూ అవతలకు దూసుకు పోయింది. తల తెగి అవతల పడగానే దాని శరీరం నీటిని అల్ల కల్లోలం చేస్తూ ఎగిరెగిరి పడింది. వెంట వెంటనే మరి కొన్ని బాణాలు సంధించి వదిలాడు.

అదే సమయంలో వూహించని సంఘటన జరిగింది. అగ్ని సర్పం యొక్క ఖండిత శిర భాగం ఉన్నట్టుండి నిటారుగా లేచి చివ్వున గాల్లోకి ఎగిరింది. నిప్పులు కక్కుతూ సూటిగా ధనుంజయుని మీదికి వచ్చేసింది. చివరి క్షణంలో ప్రమాదం గ్రహించి చటుున తన

బళ్ళాన్ని అడ్డం వేసాడు. వచ్చీ రావడమే బళ్ళానికి దిగ బడింది. కాని దాని నోటి నుంచి విష వాయువులు మీదకు ఎగసాయి. బళ్ళెంతో సహా సర్ప శిరస్సును నీటి లోకి విసిరేసాడు. కాని విష గాలి ప్రభావంతో ఒక్క సారిగా కళ్ళు గిర్రున తిరిగాయి. ఒళ్ళు తూలింది. శరీరంలో శక్తి మొత్తం హరించుకు పోతున్నట్టయింది. అంతే` ఉన్నట్టుండి తెలివి తప్పి` అశ్వం పై నుండి దబ్బున కింద పడి పోయాడు ధనుంజయుడు. తర్వాత ఏం జరిగిందీ అతనికి తెలీదు.

********************************************************************

సమయం ఎంత గడిచిందో గాని`

అశ్వం గరుడ ముఖంలో ముఖం పెట్టి చూస్తూ లేవమని మృదువుగా కదిలిస్తుంటే స్పృహ వచ్చింది ధనుంజయుడికి. కనులు తెరవగానే అశ్వ ముఖమే కన్పించింది. దాని కళ్ళలో కన్నీరు చూసి చలించి పోయాడు. దాని ముఖాన్ని కౌగిలించుకొని ప్రేమగా ముద్దాడాడు. నిజానికి నిన్నటి నుంచి అది ఏమీ తినలేదు. తను కింద పడగానే వెళ్ళి పచ్చిక మేయవచ్చు. కాని తన ఆకలి కూడ మర్చిపోయి తన కోసం అది పడిన వేదన గ్రహించి బాధ పడ్డాడు. అప్యాయంగా జూలు నిమిరాడు.

''నాకేమీ కాలేదురా గరుడా. అలా వెళ్ళి చెట్ల కింద కడుపార పచ్చిక తినిరా. నేను క్షేమంగా వున్నాను. వెళ్ళు.'' అంటూ చెప్పాడు.

అయినా అశ్వం కదల్లేదు.

''ఈ ఒంటరి ప్రయాణంలో నీకన్నా నాకు తోడు ఎవరురా? నాకేమీ కాలేదంటిని గదా. పద!'' అంటూ హెచ్చరించగానే అప్పుడు అక్కడి నుండి కదిలింది అశ్వం.

చిన్నగా లేచేందుకు ప్రయత్నించాడు ధనుంజయుడు. తల దిమ్ముగా వుండి, కాళ్ళు చేతులు ఇంకా పూర్తిగా స్వాధీనంలోకి రాలేదు. అదృష్టం బాగుండి అగ్ని సర్పం శిరస్సును మీద పడకుండా నిరోధించ గలిగాడు గాని లేకున్న దాని విష జ్వాలలకు తను అంతమై వుండేవాడు.

శక్తి నంతా కూడ దీసుకుని` నెమ్మదిగా లేచి నిలబడ్డాడు.

వాతావరణంలో మార్పు లేదు సరి కదా` చినుకు చినుకుగా తిరిగి చిరు జల్లులు ఆరంభించింది. ఈదురు గాలి ఆగి ఆగి వీస్తోంది.తను సంహరించిన అగ్ని సర్పం తాలూకు ఖండిత భాగాలు నీటి మీద కన్పించాలి కాని వాటి జాడ ఎక్కడా లేదు. కాని జరిగిందానికి సాక్షిగా నల్లగా మాడి పోయిన పచ్చిక, విష పూరితమై నల్లగా మారిన నీళ్ళు కన్పిస్తున్నాయి. ఏదో జరిగింది...!

తను తెలివి తప్పాక ఇక్కడ ఏదో జరిగింది. ఏమిటది? ఆలోచిస్తూ వెను తిరిగిన ధనుంజయుడికి అప్పుడు కన్పించాడు భీకరాకారుడు. తనకు సమీపంలోనే అంత ఎత్తున శిలా విగ్రహంలా నిలబడున్నాడతను. విచిత్రమైన ఆ ఆకారాన్ని చూసి ఘ్రాన్పడి పోయాడు. సుమారు పదడుగుల ఎత్తున చామన ఛాయ దేహంతో బలిష్టుడైన మహా కాయుడతడు. నున్నగా బోడి గుండు వెనుక పొడవాటి పిలక గాలికి రెప రెప లాడుతోంది.

ఉక్కు పలక వంటి ఛాతికి అడ్డంగా జంధ్యం పోగు వుంది. నీలి వర్ణపు పట్టు వస్త్రం దట్టీ బిగించి కట్టాడు. చెవులకు మణిమయ కుండలాలు వున్నాయి. మెడలో బెత్తెడు వెడల్పున్న కంఠ హారం ధరించాడు. రెండు చేతులకు బంగారు కడియాలు, ఎడమ కాలికి స్వర్ణ తోడాలు వున్నాయి. నుదుటిన అర్ధ చంద్రుడు, మధ్య చుక్కతో ఎర్రటి బొట్టు వుంది. గడ్డం మీసాలు లేవు. కను బొమలు పెద్దగా తీర్చి దిద్దినట్టుండి విశాలమైన నేత్రాలు కలిగి వున్నాడు. ముక్కు పొడవుగా కొటేరులా వుంది.

అతి బలాఢ్యుడైన అతడు ఎవరో, ఎందుకు ఇక్కడ వున్నాడో అర్థం కాలేదు. శత్రువో, మిత్రుడో అంత కన్నా తెలిదు. ఎందుకైనా మంచిదని చట్టున విల్లంబులు అందుకున్నాడు ధనుంజయుడు.

అది చూసి మందహాసం చేసాడతను.

రెండు చేతులూ జోడిస్తూ` ''మహా వీరా నమో నమః నేను నీ శత్రువుని కాను. ఆయుధాలతో పని యేమి?'' అన్నాడు. ''అలాగని మిత్రుడవూ కాదు.'' అన్నాడు కరుగ్గా ధనుంజయుడు.''ఇక నుండి నేను నీ మిత్రుడను'' మేఘ గంభీర స్వరంతో పలికాడతడు.

''ఎవరు నీవు? ఇక్కడ ఏమి పని? నాకు ఎలా మిత్రుడవు కాగలవు?

''నాకు శాప విమోచన కలిగించిన సాహస వీరుడవు నీవు. కృతజ్ఞతగా నా స్నేహ హస్తం అందిచు చున్నాను.''

‘‘శాప వియోచనమా?’’

‘‘అవును. శాప వియోచనమే. వీర కుమారా! నేనొక యక్షుడను. నన్ను రుచికుడందురు. నీవు సంహరించిన అగ్ని సర్పం ఎవరో కాదు, నేనే.’’

ధనుంజయునికి అతడేమి చెప్తున్నాడో, తనేమి వింటున్నాడో అర్థం కాలేదు. ఆశ్చర్య చకితుడై చూస్తున్నాడు.

‘‘శాప వశమున నీవు అగ్ని సర్పముగా మారి వుండొచ్చును గాక. కాని నా మీద నీకు పగ యేమి? ద్వేషమేమి? అటు ఎగిరే పాములు, యిటు నీవు. నను మృత్యువు సమీపము వరకు తరిమినారు గదా. ఏమిటిదంతా?’’ అనడిగాడు.

‘‘ఇది నా వలన జరిగిన తప్పిదము గాదు.’’ వెంటనే బదులిచ్చాడు యక్షుడు.

‘‘వీర కుమారా! ఇది యంతయు నాగ రాజగు మహా పద్ముని ఆనతి మేరకు జరిగినది. నేను నిమిత్త మాత్రుడను’’ అన్నాడు. నాగ లోకాధిపతి ద్వేషం గురించి ధనుంజయుడు ఇది రెండో సారి వినటం. అడుగడుగునా అవరోధాలు కల్పించి, తనను వెనక్కు పంపించాలని లేదా నాగ లోకం చేరు లోపలే తనను నిర్జించాని చూస్తున్నాడు. తను అప్రమత్తుడై వుండక తప్పదు.

‘‘సాటి లేని విక్రముడవు. నా శాపం గురించి చెప్తాను విను మిత్రమా.’’ అంటూ తన గురించి చెప్పుకొచ్చాడు యక్షుడు రుచికుడు.

‘‘మాది యక్ష లోకం. యక్షులలో విలక్షణమైన స్వభావము నాది. తరచూ భూలోక విహారం చేసే వాడిని. అలా విహరించేప్పుడు నాగు పాము కనబడితే చాలును, పట్టి శిరము తుంచి తినేసే వాడిని. సర్ప భక్షణ నా అలవాటు. అందుకే సర్ప భక్షకుడను నామాంతరము కూడ కలదు నాకు.

అప్పట్లో… అనగా కలి యుగారంభానికి ముందు అయిదు వందల సంవత్సరాల నాటి మాట. ఇప్పటి నాగరాజు మాహా పద్ముడి తండ్రి యగు పద్ముడు నాగ రాజుగా వున్న కాలం. ఒక పరి నేను దక్షిణా పథ మందలి దండకార్యణమున సంచరిస్తుండగా అయిదు శిరస్సుల మహా నాగాన్ని చూసినాను. దాన్ని భక్షింప నిచ్చగించితిని. దాన్ని పట్ట బోయినపుడు గాని అది సాధారణ సర్పము కాదని, నాగ లోకాధిపతి యగు నాగరాజు పద్ముడని నాకు తెలియనైతిని.

దివ్య దృష్టితో నా గురించి గ్రహించిన నాగ రాజు ఆగ్రహోదగ్రుడయ్యాడు. ‘‘ఓరీ యక్షా. సర్ప భక్షణతో మా నాగ జాతి ఉసురు పోసుకొను నిన్ను క్షమింప జాలను. పొమ్ము. భయంకర అగ్ని సర్పంగా మారి మా నాగ లోక మందు నాగాలకు సేవకునిగా పడి వుండుము.’’ అంటూ శాపమిచ్చినాడు. నేను తప్పిదము గ్రహించి శాప వియోచన అనుగ్రహింపుమని వేడుకొంటిని. ఒక మహా వీరుడు మహర్జాతకుడైన ఒక రాజ కుమారుని చేతిలో మరణ మొందినపుడు నీకు శాప విముక్తి కాగలదని అనుగ్రహించాడు.

అప్పటి నుండి అగ్ని సర్పంగా మారిన నాకు నాగ లోకమే నివాసమైనది. కలి యుగారంభమైన పిమ్మట జరిగిన సర్ప యాగంలో అనేక నాగ జాతులు నశించుట తెలిసి వ్యధ చెంది తన వారసుడైన మహా పద్ముడిని నాగ రాజుగా అభిషేకించాడు పద్ముడు. పిమ్మట తను తపస్సుకై నాగ లోకం విడిచి పాతాళానికి వెళ్ళి పోయినాడు. నేను మాత్రం ఇంత కాలమూ నాగ లోకాన అగ్ని సర్పముగా నాగుల భృత్యునిగా అక్కడే పడి వుంటిని.

ఇప్పుడు నిను అంతం చేయమని నాగరాజు నాకు ఆనతి పంపించినాడు. అలాగే ఎగిరే పాముల్ని కూడ నీ మీదకు ప్రేరేపించినాడు. తదుపరి ఏమి జరిగినది నీకు తెలిసినదే. మహర్జాతకుడవైన నీవలన నేటికి నాకు శాప వియోచన లభించి నిజరూపు ధరించినందుకు చాలా ఆనందముగ వున్నది. ఇక నుండి నను నీ మిత్రునిగా బావింపుము’’ అంటూ వివరిస్తుంటే విస్మయం చెంది అలా వింటూండి పోయాడు ధనుంజయుడు.

‘‘సరి. నీ మాటలు నిక్కముని నమ్ముచున్నాను. నిను మిత్రునిగా భావించెదను. నేను నాగ లోకము వెళ్ళుటకు మార్గము చెప్పుము.’’ అనడిగాడు.

‘‘లేదు మిత్రమా! అది దేవ రహస్యము. నేను చెప్ప కూడదు. అయిననూ తొందరేల? మార్గము తానుగా నిను వెదకుచూ రాగలదు. నేనుగా నీకో వరమిచ్చెదను. ఇక ముందు నీకు ఎలాంటి సంకటము నేరినను నను తలుచుకుని ‘యక్ష వీరా రుచికా’ అని పిలువు చాలును. తక్షణమే నీ చెంత కొచ్చి వలసిన సాయము చేసెదను. చాలునా? ఇక శలవు మిత్రమా. ఈ మైదానమును దాటి నేరుగా ప్రయాణిస్తే నీకు శుభం జరుగును. పోయి వచ్చెదను’’ అంటూ ధనుంజయునికి మరొక్క సారి నమస్కరించి అదృశ్యుడయ్యాడు యక్షుడైన రుచికుడు.

నాగ లోకము చేర్చు మార్గము అంత సులువుగా తెలియదని తెలుసు. కాని యక్షుడైన రుచికుడు కూడ చెప్పక పోవటం విస్మయం కలిగించింది.

నిజానికి కొన్ని వందల ఏండ్లుగా అగ్ని సర్పంగా మారి నాగ లోకాన భృత్యుడిగా పడి వున్నందున రుచికుడిలో నాగుల మీద కోపం, ద్వేషం సహజం కాబట్టి తప్పక చెబుతాడనే ఆశించాడు. కాని ధనుంజయునికి నిరాశే ఎదురైంది. దేవ రహస్యమంటూ చెప్పటానికి నిరాకరించాడు రుచికుడు. భారంగా నిట్టూర్చుతూ వెను తిరిగాడు.

అంత వరకు రాలుతున్న వర్షపు చినుకులు ఆగాయి. గగన తలంలో నల్లటి మబ్బులు ఇప్పుడిప్పుడే చెదరి పోవటం ఆరంభించాయి. గాలి విసురు కూడ తగ్గింది.


పచ్చిక మేస్తున్న గరుడను పిలిచి తన ఆయుధాలు సర్దుకొని అధిరోహించాడు. కళ్ళాలు అందుకొని కొంత దూరం ఎగువకు వెళ్ళాక అశ్వాన్ని మైదానం నీటి లోకి మళ్ళించాడు. మోకాలి లోతు నీటిలో మైదానం ఆవల కన్పిస్తున్న అటవీ భాగం వైపు అదలించాడు. నీటిని చెల్లా చెదురు చేస్తూ వేగంగా పరుగు ఆరంభించింది గరుడు.

*********************************************************************

మర్మ భూమి అటవీ ప్రాంతం.

నాగ జాతి ప్రజలు నివశించు నాగుల దిబ్బ కొండ గుట్టల నుండి దక్షిణంగా సుదూర ప్రాంతంలో సంపంగి వనమగు ఒక కాననము వుంది.

అక్కడ చట్టూ మూడు కొండ గుట్టల నడుమ మనోహరమగు సువిశాల సరోవరం ఒకటి వుంది. ఆ సరోవరం ఎప్పుడూ నిండుగా తామర పూలలతో కళ కళ లాడుతూ వుంటుంది. ఆ తామర మడుగును చుట్టి సంపంగి మొక్కు విస్తారంగా పెరిగి సంపంగుల సువాసనలతో ఆ ప్రాంతం ఎప్పుడూ గుబాళిస్తూంటుంది. అందుకే ఆ ప్రాంతాన్ని సంపంగి వనముగా పిలుస్తుంటారు. మల్లలు, సంపంగి పూల వాసనలు నాగులకు ప్రితి కరమని వేరే చెప్పనక్కర్లేదు. అందుకే ఆ ప్రాంతం పాముల కు్కాడ ప్రసిద్ధి.




మడుగు లోని నీటి మీద రెక్కలల్లార్చుతూ అందమైన హంసలు విహరిస్తుంటాయి. తామర తూండ్లను తిని కొన్ని హంసలు తలను రెక్కల మధ్య దాచుకుని మత్తుగా నీటి మీద తేలుతూ నిద్ర పోతూంటాయి. అలాంటప్పుడు అవి ఎవరో ఉతికి గుట్టలుగా నీటి మీద వుంచిన తెల్లటి వస్త్రంలా శోభిస్తూంటాయి.

ఇక కొన్ని కొంగలు తామరాకు మీద పరుగిడుతూ కొన్ని ఒంటి కాలి మీద జపం చేస్తూ నీటి పైకి వచ్చిన చేపల్ని గుటుక్కున మ్రింగేస్తుంటాయి. పూల మకరందం గ్రోలిన తుమ్మెదలు అనేకం తామర పూల రేకుల మీద మత్తుగా సోలి పోతూంటాయి.

వృక్షశాఖల వెంట శుక పిక శారికాది వివిధ పక్షి జాతులు తిరుగుతూ కలకలం రేపుతూంటాయి. లేళ్ళు, కుందేళ్ళు వంటి వన్య ప్రాణులు సంపంగి వనంలో స్వేచ్ఛగా తిరుగాడుతూంటాయి. కఋూరమృగాలు ఏవీ సంపంగి వనం దరిదాపులకు రావు. పాముల సంచారం అధికంగా వుండటమే అందుక్కారణం. ఫలవృక్షాలకు తీగలు, లతల వెంట పూచే అరుదైన పుష్ప జాతులకు అచట కొదువ లేదు.

నయన మనోహరమగు ఆ సంపంగి వనానికి నాగ సుందరి శంఖు పుత్రి చేరుకునే సరికి సంధ్యా సమయం దగ్గర పడింది. ఆకాశం నిర్మలంగా వుంది. పశ్చిమాన కొన్ని మబ్బులు కన్పిస్తున్నాయి. నాగకుమారి యువరాణి ఉలూచీశ్వరీ దేవిని కలవాలని సంపంగి వన ప్రాంతంలోనే సంచరిస్తోంది శంఖుపుత్రి.

ఎలాగయినా యువరాణిని కలిసి రత్నగిరి యువరాజు ధనుంజయుని గురించి చెప్పి ఆ యిద్దర్నీ కలపటం ద్వారా నాగరాజు మీద ప్రతీకారం తీర్చుకోవాలని భావించింది శంఖు పుత్రి. తను నాగ లోకంలో ప్రవేశించ లేదు. నాగ రాజు నిషేధం ఉంది. ప్రవేశించి మరో సారి తను దండనకు గురి కావటం ఇష్టం లేదు. కాబట్టి బయటే యువ రాణిని కలవాలి. అందుకు అనువైన చోటు సంపంగి వనం. కాబట్టి`

వెలుగు దూరాన వున్న నాగుల దిబ్బ ప్రాంతం నుండి మూడు దినముల క్రితమే శంఖు పుత్రి సంపంగి వనానికి చేరుకుంది. కాని ఇంత వరకు యువరాణి దర్శనం లభించ లేదు. ఉలూచీశ్వరికి చాలా ప్రియమైన వనమిది. తరచూ చెలికత్తెలతో వన విహారానికి వస్తూంటుంది. ఇవాళ గాకున్న రేపు తప్పక వచ్చునని నమ్మికతో ఆ ప్రాంతాల్లోనే సంచరిస్తోంది.

సాయంకాలపు శీతలగాలులకు తోడు సంపెంగపూల మధుర సువాసనలు మనసును పులకింప జేస్తున్నాయి. తన సర్పశరీరాన్ని అల్లన కదిలిస్తూ మడుగు వైపు కదిలింది శంఖుపుత్రి. ఇంతలో మడుగు నుండి నీళ్ళ చప్పుడు. కొందరు వనితల కిలకిలా నవ్వులు విన వచ్చాయి. యువ రాణి విచ్చేసి వుంటుందన్న వూహ తో చర చరా ముందుకెళ్ళింది.

శంఖు పుత్రి వెళ్ళే సరికి నలుగురు నాగకన్యలు మడుగు నీటిలో తామరపూల మధ్య జలక్రీడా నిమగ్నులయి వినోదిస్తున్నారు. పరిహాసోక్తులతో ఒకరిపై ఒకరు నీరు చల్లుకొంటూ కిలకిలా నవ్వుకొంటున్నారు. వారి అల్లరికి బెదిరి హంసలు, కొంగలు దూరంగా వెళ్ళి పోతున్నాయి. వారంతా ఎప్పుడూ యువరాణిని వెన్నంటి వుండే చెలికత్తెలు. అయితే యువరాణి ఉలూచీశ్వరి అక్కడ

కన్పించ లేదు.

అర్ధ నగ్నంగా వున్న నాగకన్యలు మడుగు వద్ద కొస్తున్న శంఖు పుత్రిని గమనించి జల క్రీడలాపి, సగౌరవంగా నమస్కరించారు.

“ఏమిటే? మీరు మాత్రమే వుంటిరి. యువరాణీ వారెచట?” అనడిగింది శంఖుపుత్రి. ఆ మాటకు`

“ఏమి చెబుదుమమ్మా” అంటూ నాగకన్యలంతా ముఖ ముఖాలు చూసుకుని ముసి ముసిగా నవ్వుకోసాగారు.

శంఖు పుత్రికి ఏమీ అర్థం గాలేదు.

“ఏయ్... ఏమియా పరాచికము? యువ రాణి వారు క్షేమములే గదా?” కించిత్తు కోపంగా అడిగింది.

“అయ్యో! ఆమె క్షేమము కేమి కొదువ. కాదంటే ఒకింత జ్వరమున బాధ పడుచున్నారు” అని బదులిచ్చిందొక యువతి.

“ఏయ్! పరిహాసము లాపి సత్యము పలుకుడు. జ్వరము ఏమి?”

“ఏమి చెప్పుదునమ్మా. సత్యమే పలుకుచున్నాము. అది జ్వరమే సుమా. మామూలు జ్వరము కాదు, మదన జ్వరము” అంది మరో వనిత.

శంఖు పుత్రి వ్యాకుల పడింది. ఆందోళన నిండిన స్వరంతో` “మదన జ్వరమా... అంటే...?” అంది.

“అంటే ఏముంది? అది ఖచ్చితముగా కామ జ్వరమే. అ లక్షణము స్పష్టముగా పొడ చూపినవి. వారిప్పుడు మన లోకములో లేరు.” అంటూ బదులిచ్చింది మూడో నాగకన్య.

“ఏమైనదే మీకు! ఇటు వదరుచున్నారు? ఏమి జరిగినది? ఇన్ని రోజులూ మీరంతా ఎచట వున్నారు?” విస్మయంతో నిలదీసింది శంఖు పుత్రి.

“అదేమడుగుతావు లేమ్మా” అంటూ పెద్దగా నిట్టూర్చిందొక యువతి.

“అవును. పెను ప్రమాదము నుండి బయట పడినాము. వారము దినముల క్రిందట మేమంతా ఢాకినీ వన ప్రాంతమున విహారమునకు పోతిమి” అంది మరో యువతి.

శంఖు పుత్రి మరింతగా విభ్రాంతురాలయింది.

“ఢాకినీ వనమా… వింధ్య పర్వతముకు ఆవల గదా వున్నది. బహు దూరము. అంత శ్రమ పడి పోవుటకు ఏమున్నది యచట?” అంది.

“ఢాకీని వన ప్రకృతి అందము ఈ కాల మున బహు రమ్యము. అది చూడ వసినదే గాని చెప్పనవి గాదు. అచట మైదానము పూచు గడ్డిపూలు కూడా అనేక రంగులలో ఆకర్షిస్తుంటాయి. యువరాణీ వారి కోరిక మేరకే మేమంతా వెడలినారము” అంది నాలుగో నాగ కన్య.

“బాగున్నది. మరి పెను ప్రమాదమంటిరి అదేమిటి?” కుతూహలంగా ప్రశ్నించింది శంఖు పుత్రి.

“అదియే చెబుతున్నాను. మేము నిన్న పగటి వేళ పచ్చిక బయలు నందు విహరిస్తూ ఒక పెద్ద గరుడ పక్షి కంట పడినాము. మేము మానవ కాంతలు కాదు నాగకన్యలమని గ్రహించి మమ్మల్ని పట్టి చంపి భక్షింపనెంచి వెంట బడి తరిమినది…”

“అయ్యో! ఎంత పని జరిగినది. పిమ్మట ఏమైనది?”

‘‘మేము నలుగురమూ ఎలాగో తప్పించుకొని పొదలో దూరినాము. గరుడ పక్షి యువరాణీ వారి వెంట పడినది. తను కూడ తప్పించు కొని వుంటుందనుకున్నాము. చాలా సేపటి తర్వాత బయట కొచ్చి చూస్తే ఎవరును లేరు. భయాందోళన చెంది మేము వెతుకులాడగా ఒక చోట పచ్చికలో చచ్చి పడున్న గరుడ పక్షి కనిపించినది. కొంత దూరమున పొదల వెనక యువ రాణీ వారు కన్పించారు. వారు క్షేమంగా ఉన్నందున తేలిగ్గా వూపిరి తీసుకున్నాము. ఎవరో బాణమేసి గరుడ పక్షని చంపి కాపాడినారు. కాని ఎవరో ఏమిటో తెలిదాయె. యువ రాణీ వారు ఏమి జరిగినదీ చెప్పరాయె. అప్పటి నుండి ఆమె ధోరణి మారి పోయింది. ఎవరి తోనూ మాటలాడరు. పర ధ్యానము. మోమున ఆనందము, పెదవు చిరునవ్వు. తిండి మీద ధ్యాస లేదు. వెంటనే బయలు దేరి వచ్చేసినాము. మన నాగ లోకము రాకుండా ఇచటనే ఆగి పోయినారు. శరీరము వేడెక్కి ఉశ్చ్వాస నిశ్వాసలు బరువై ఎవరినో పదే పదే తలపోయుచున్నది. ఆమెకు సపర్యలు చేసి చేసి ఆ జ్వరము మాకు సోకి ఇదో ఉష్ణ తాపము తీర జల క్రీడలాడు చుంటిమి’’ అంటూ వివరించిందో నాగకన్య. వెంటనే ఫక్కున నవ్వారు మిగిలిన యువతులు.

శంఖు పుత్రి ఆ మాటలు శ్రద్ధగా ఆలకించింది.

ఇదే నిజమైతే ఉలూచీశ్వరి ఎవరో సుందరాకారుడ్ని చూసి మనసు పారేసుకొని వుండాలి. వయసు కొచ్చిన అతివలు సుందరాకారుడైన పురుషుడ్ని గాంచి చలించుట సహజం. అతను ఎవరై వుంటాడు? అతను మానవ వీరుడా లేక యక్ష, గంధర్వ, కిన్నెర, విద్యాధరాది దేవ జాతులకు చెందిన వాడా! తన ప్రయత్నము విఫలము కాదు గదా. అసలచట ఏమి జరిగినదో ముందు తెలుసుకోవాలి.

‘‘యువరాణీ వారెక్కడ?’’ వెంటనే అడిగింది.

‘‘అదో… ఆ పొదల వెనక మండపమునందున్నారు’’ నలుగురూ ముక్త కంఠంతో పలికారు.

ఇక ఆలస్యం చేయకుండా వెను తిరిగింది శంఖు పుత్రి. నడుం దిగువ సర్ప శరీరము నుండి పూర్తిగా నాగ స్త్రీగా మారి నడుచుకొంటూ మండపం వైపు వెళ్ళింది. ఆమె అటు వెళ్ళగానే తిరిగి జల క్రీడల్లో నిమగ్నులయ్యారు నాగకన్యలంతా.

పూల పొద వెనక వుంది ఏనాటిదో ఒక చలువ రాతి మండపం. దాని మధ్యలో ఒత్తుగా తామరాకు పరిచి వాటి మీద ఎత్తుగా తామర పూలు పరిచి శయ్యగా చేసారు. దాని మీద వెల్లికిలా శయనించి వుంది నాగలోక యువ రాణీ ఉలూచీశ్వరి. అప్పటి కింకా సూర్యుడస్తమించ లేదు. సంపంగి పూల సౌరభాలతో కూడిన చల్లటి గాలులు పరవశింప చేస్తున్నాయి.

అతి లోక సౌందర్య వతి యగు నాగ రాజ తనయ యువ రాణి ఉలూచీశ్వరిని చూడగానే ఆమె మన్మథావస్థలో వుందని నాగ కన్యలు చెప్పింది అక్షర సత్యమని గ్రహించింది శంఖు పుత్రి.

సోగకనులు అర మూతలు పడ్డాయి, కపోలాలు ఎర్ర బారాయి, కంచుకం బిగుతైనది. శ్వాసలు బరువుగా వున్నాయి. కుదురు లేక అటు యిటు దొర్లుతోంది. బాహ్య స్పృహ కోల్పోయి పర ధ్యానంలో వుందామె. శంఖు పుత్రి ఆమెను అబ్బురంగా వీక్షిస్తూ చిన్నగా వెళ్ళి పక్కన కూచుంది.

"ఏవమ్మా అత గాడిని మరువ లేకున్నావా?" మృదువుగా అడిగింది.

"ఊఁ..." అంది ఏవో కలలలోకంలో విహరిస్తున్నట్టు.

"అంత సొగసుకాడా?"

"బహు సుందరాకారుడు. మానినీ చిత్త చోరుడు"

"మహా వీరుడా?"

"ఒకే బాణమున గరుడ పక్షిని జంపి నను కాపాడినాడు."

"ఎవడు వాడు? నరుడా... మరుడా... గంధర్వుడా..."

"తెలిదు."

“ఎచటివాడు?”

“తెలిదు”

“తెలికుండానే ప్రేమించినావా?”

“ప్రేమా…!”

ఉలికి పడి కళ్ళు తెరిచింది ఉలూచీశ్వరి.

ఎదురుగా శంఖు పుత్రిని చూసి. చివ్వున లేచి కూచుంది. “నువ్వా అత్తా! ఎంత తడవైనది వచ్చి?” అంది సిగ్గు పడుతూ.

“ఈ సిగ్గు నా ముందు ఎందుకులేమ్మా. ఢాకినీ వనమందు ఏమి అద్భుతము జరిగినది? సవిరముగా తొపుము. నీ సఖియలు చెప్పలేకున్నారు” అనడిగింది.

“చెప్పెదను గాని అత్తా. నీ రాక అనూహ్యము. అనుకోకుండా ఏతెంచి నావు. ఏమి విశేషము?” మోకాలి మీద చుబుకము ఆన్చి ఓర కంట చూస్తూ అడిగింది ఉలూచీశ్వరి.

“అవును. విశేషమే మరి. కంతుడా జయంతుడా యన దగ్గ ఒక వీర కుమారుని గాంచి నీకు తగిన జోడియని యెంచి నీకు తెలుప నెంచి వచ్చినాను. లాభమేమి? నా శ్రమ వృధా పోయినది. తగిన వాడిని నీవే ఎంచుకొంటివాయె. సరి సరి. నీవింతగా మోహ పరవశ వైతి వంటే ఖచ్చితంగా గొప్ప వాడయి వుంటాడు. ఎవరా అదృష్టవంతుడు, ఏమా కథ?” అనడిగింది శంఖు పుత్రి.

ఉలూచీశ్వరి ఆలోచను గతానికి మళ్ళాయి. ఆమె కనుల ముందు ఢాకినీ వనం కన్పిస్తోంది. చిన్నగా చెప్పడం ఆరంభించింది.

****************************************

ఆ రోజు ఎగిరే పాము, అగ్ని సర్పం నుండి వీరోచితంగా పోరాడి బయట పడిన యువరాజు ధనుంజయుడు రెండు దినాలు ఘోరాటవిలో దారి తెన్ను లేకుండా తిరిగాడు. రెండో రోజు ఉదయానికే మబ్బులు పూర్తిగా చెదిరి పోయాయి. ఆకాశం నిర్మలమైంది. సూర్యుడు తొంగి చూసాడు. దిశయితే తెలిసినాయి గాని తను దారి తప్పి ఎంత దూరం వచ్చేసాడో తెలికుండా పోయింది.

“హే ప్రభో భీమ శంకరా. ఏమిటయ్యా నీ లీల. నీ దర్శనానికి రాలేదని నా దారి మరల్చి కీకారణ్యమున నన్నింతగా శ్రమ పుచ్చుట న్యాయమా? ఇలా గయితే సహ్యాద్రికి ఎప్పటికి చేరగలను, నాగలోకం ఎప్పుడు వెళ్ళగలను? నీ చేష్టలకు అర్థమేమో నీకే తెలియాలి” అనుకున్నాడు మనసులో.

మూడో రోజు మధ్యాహ్నం అడవికి వేటకొచ్చిన కొందరు ఆటవికులు కన్పించారు. వారి ద్వారా తను వెళ్ళాల్సిన దిశ తెలుసుకొని ముందుకు సాగాడు. ఆ విధంగా సంధ్యా సమయానికి కాస్త ముందు గానే అశ్వం గరుడ ఢాకినీ వనాటవిలో ప్రవేశించింది.

ఒకప్పుడు ఢాకినీ అనే రాక్షసి ఆధీనంలో ఈ అటవీ ప్రాంతం వున్నందున దీనికి ఢాకినీ వన మను పేరు సార్థకమైంది. అందుకే ఢాకిన్యాం భీమ శంకరం అన్నారు. ఎందుకంటే, జ్యోతిర్లింగాలో ఒకటయిన భీమ శంకరుని ఆలయం ఈ ఢాకినీ వనం లోని భీమా నది తీరాన సహ్యాద్రి పర్వతం మీద వుంది. చాలా పురాణ ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రం.

ఢాకినీ వనము కూడ కీకారణ్యాలకు ప్రసిద్ధి అయినప్పటికీ చాలా ప్రాంతం రాతినేల గాబట్టి పచ్చిక బయళ్ళు అధికం. వాటి అందం చూడ తరమే గాని చెప్పనలవి గాదు. కొండ దిబ్బలు మైదానాల వెంట ఎటు చూసినా పచ్చని పచ్చిక ఒత్తుగా ఏపుగా పెరిగి కన్పిస్తుంది.

చిత్ర విచిత్రములైన గడ్డిపూలు అనేక రంగులలో విర బూసి ఆకర్షిస్తుంటాయి. మకరందం కోసం ఆ పూల వెంట తుమ్మెదలతో బాటు అర చేయంత వుండే రంగు రంగుల సింగారాల సీతాకోక చిలుకలు రెక్కలల్లార్చుతూ మందలు మందలుగా సంచరిస్తూంటాయి. మరో పక్క పచ్చికలో తిరుగాడే కృష్ణజింకలు, లేళ్ళ అందాలు చెప్పనలవి కాదు.

తనివి తీరా ఆ అందాలను ఆస్వాదిస్తూ తరుత వెనగ్గా ముందుకు సాగుతున్నాడు రాకుమారుడు ధనుంజయుడు. ఇదే సమయంలో ఎగువన మైదానంలో విహరిస్తున్నారు నాగరాజ తనయ యువరాణి ఉలూచీశ్వరి, ఆమె చెలికత్తెలయిన నాగకన్యలు

నలుగురూ.

అందమైన కృష్ణ జింకలను తరుముతూ అవి మూకుమ్మడిగా చెంగు చెంగున దూకి పరుగులిడుతుంటే వినోదిస్తున్నారు. ఉలూచీశ్వరి సీతా కోక చిలుకల వెంట పరుగులు తీస్తూ పట్టుకునే ప్రయత్నం చేస్తోంది. నవ్వులు, కేరింతలతో నాగకన్యలంతా ఉత్సాహంగా పచ్చికలో గంతులు వేస్తుండగా తొలి సారిగా విన వచ్చింది కృష్ణ పక్షి అరుపు. అదిరి పడి ఆకాశం వైపు చూసారంతా.

పోతరించిన గరుడ పక్షి ఒకటి రెక్కు చాపి రివ్వున తమ వైపు వస్తూ కన్పించింది. అది తమ కోసమే వస్తోందని అర్థం కాగానే అంత వరకు వున్న ఉత్సాహమంతా మటు మాయమై పోయి ఆ స్థానంలో అంతు లేని భయం చోటు చేసుకుంది. అప్పటికే అది సమీపంలో వుండటంతో ఏమీ చేయటానికి పాలు పోక ప్రాణ భయంతో తలో పక్కకు పరుగు తీసారు. చెలికత్తెలు ఎలాగో ఎవరికి వారు పూల పొదల్లో దూరి ప్రాణాలు దక్కించుకున్నారు. కాని యువ రాణి ఉలూచీశ్వరికి ఆ అవకాశం దొరక లేదు. తన్నుకు పోడానికి రెట్టించిన ఉత్సాహంతో కృష్ణ పక్షి ఉలూచీశ్వరి వెంట పడింది.

కాలి కొద్ది పరుగు తీస్తోంది ఉలూచీశ్వరి. మూడు సార్లు తన మీదికి ఎగురుతూ వచ్చిన పక్షి గోళ్ళకు చిక్కకుండా తప్పించుకుంది. దారిలో దొరికిన ఒక ఎండు కొమ్మను అందుకుని దానితో పక్షిని అదలించే ప్రయత్నం చేసింది. కాని వెళ్ళినట్టే వెళ్లి భీకరంగా అరుస్తూ తిరిగి తిరిగి వస్తూనే వుందా పక్షి. అది తమను నాగకన్యలుగా గుర్తించే దాడికి తెగ బడిందని అర్థమై పోయింది. చెలికత్తెలు ఎటు పోయారో కన్పించ లేదు. ఎంత దూరం పారి పోగలదు. తన సహజ రూపమైన సర్ప రూపం ధరించే సమయం కూడ లేదు. చివరి ప్రయత్నంగా` ''రక్షించండి... కాపాడండి'' అనరుస్తూ పరుగిడ సాగింది. ఆ అరుపు చెట్ల వెనకగా వస్తున్న ధనుంజయునికి విన్పించాయి. ఉలికి పడి అశ్వాన్ని నిలువరించాడు.

ఎవరో యువతి ప్రమాదంలో ఉన్నట్టుంది. ఎవరామె? ఈ నిర్జన అటవీ ప్రాంతానికి ఎవరు వస్తారు? ఒక వేళ యిది అడవుల సంచరించు భూత ప్రేత పిశాచ గణాలకు చెందిన ఎవరో మాయావి మాయాజాలం కాదు గదా! దీర్ఘంగా ఆలోచిస్తూ చెవులు రిక్కించాడు.

అంతలో మరో మారు విన వచ్చిందా ఆక్రందన.

తనకు కుడి వైపు నుండి విన వచ్చింది. ఆమె ఏమి ప్రమాదాన వుందో తెలిదు. క్షణం కూడ ఆస్యం చేయకుండా`

అశ్వాన్ని అటు మళ్ళించాడు.

తృటిలో చెట్ల పొదలను దాటి మైదానం లోని పచ్చిక మీదకు దూసుకొచ్చింది అశ్వం గరుడ. అప్పుడు కన్పించిందో వింత దృశ్యం. పెద్ద కృష్ణ పక్షి ఒకటి ఒక యువతిని తరుముకొస్తోంది. ఆమె చేతిలో ఒక ఎండు కట్టె వుంది. దాంతో పక్షిని అదలిస్తూ ప్రాణ భయంతో పరుగు తీస్తూ అరుస్తోందామె.

చూస్తుంటే ఆమె సాధారణ యువతిలా లేదు. దివ్య తేజస్సుతో సకలాభరణ భూషిత యగు అతి లోక సుందరిలా వుంది. గరుడ పక్షి ఒక యువతిని తరమటం వింత అయితే! అంతటి మోహనాంగి ఒంటరిగా మైదానమున సంచరించుట మరి యొక వింతగా తోచింది. అశ్వాన్ని ఆమె దిశగా పరుగు పెట్టిస్తూ విల్లంబులు అందుకున్నాడు ధనుంజయుడు.

గిట్టల శబ్దం వింటూనే చివ్వున తల తిప్పి చూసింది ఉలూచీశ్వరి. శ్వేతాశ్వం నాలుగు కాళ్ళ మీద దూసుకొస్తోంది. దాని మీద విల్లంబులతో తనను కాపాడ వస్తున్న ధనుంజయుని గాంచి విభ్రాంతురాలయింది. రూపెత్తిన కల్కి అవతారంలా వున్న ధనుంజయుని రూపురేఖా విలాసాలకు ముగ్ధురాలవుతూ తన గతిని మార్చుకొని అశ్వానికి ఎదురు పరుగెత్తింది. అదే సమయంలో`

ఉలూచీశ్వరి సౌందర్యం ధనుంజయుని మనసులో ముద్ర పడి పోయింది. ఆమె మానవ కాంత కాక పోవచ్చని సందేహం కూడ ఏర్పడింది. అయితే నిజంగా ఆమె దేవ కన్య అయితే ఒక గరుడ పక్షికి భీతిల్ల వలసిన పని లేదు. అనేక ఆలోచనలు మనస్సున ముప్పిరి గొంటూండగా అశ్వాన్ని వేగంగా పోనిచ్చాడు.

ఆమెను సమీపిస్తున్నకొద్ది ఆమె దివ్య సౌందర్య ప్రభాలను వీక్షిస్తూ తన్మయుడయ్యాడు ధనుంజయుడు. అంతలో సుడి గాలిలా ఉలూచీశ్వరిని సమీపించింది అశ్వం.




అప్పటికి గరుడపక్షి వెనక్కి వెళ్లినట్టే వెళ్ళి పెద్దగా అరుస్తూ రెట్టించిన వేగంతో ఉలూచిశ్వరి కోసం గగన వీధి నుండి దూసుకు రాసాగింది. అశ్వం తనను దాటి ముందుకెళ్ళగానే క్షణం కూడ ఆస్యం చేయకుండా పచ్చిక మీదకు వాలి పోయిందామె.

ధనుంజయుడు అశ్వం కళ్ళాలు వదిలి వింటికి బాణం సింధించి సిద్ధంగా వున్నాడు. గరుడ పక్షి చాలా ఎత్తులో వుండగానే వింటిని చెవి వరకు లాగి గురి చూసి బాణం వదిలాడు.

ఒకే బాణం.

గాలిని చీల్చుకొని దూసుకెళ్ళింది.

సూటిగా గరుడ పక్షి గుండెల్లో నాటుకుంది. అంతే! గాల్లో వుండగానే దాని ప్రాణాలు ఎగిరి పోయాయి. గింగిరాలు తిరుగుతూ వచ్చి నేల మీద పడింది. విల్లు భుజాన వేసుకుని కళ్ళాలు అందుకుని అశ్వాన్ని పక్షి వద్దకు పోనిచ్చాడు. అది చనిపోయిందని గ్రహించి, అశ్వాన్ని వెనక్కి తిప్పాడు. అపరిచిత అయిన ఆ సౌందర్యరాశి కోసం చూసాడు.

పరిసరాల్లో ఎక్కడా ఆమె కనబడ లేదు.

ఇంతలోనే ఎటు పోయినది? ఏమైనది? అశ్వాన్ని పచ్చిక మీద పరుగులెత్తిస్తూ పొద లతలను వెదుకుతూ కొంతసేపు గాలించాడు. ప్రయోజనం లేకపోగా, ఉన్నట్టుండి గాలికి సంపంగి పూల సౌరభం గప్పున సోకింది.

ధనుంజయుడు మరో సారి విభ్రాంతి చెందాడు. మైమరపించే సువాసనలు ఎక్కడి నుండి వీస్తున్నాయి. సమీపంలో సంపంగి మల్లె వంటి మొక్కలు లేవు. ఎటు చూసినా గడ్డిపూలు, ఇక ఆ ముగ్ధ మోహనాంగి ఎటు పోయిందో గాని ఆమె జాడ తెలీటం లేదు. ఇంతలో `

ఒక పొద ముందు శ్వేత వర్ణంలో ధగ ధగాయమానంగా ప్రకాశిస్తూ పడగ విప్పి అడుతున్న శ్వేత నాగు ఒకటి అతడి కంట బడింది.

చుట్ట చుట్టుకొని పైకి లేచి పడగ విప్పి ఆడుతోంది. తననే వీక్షిస్తున్న ఆ శ్వేత నాగును సంభ్రమంగా చూసాడు ధనుంజయుడు. చాలా పెద్ద నాగు. చెప్పనవి గాని అందమైన ఆ నాగును చూస్తున్నాడు. అది కూడ కదం తొక్కుతున్న అశ్వాన్ని దాని మీది ధనుంజయుడ్ని తదేకంగా చూస్తోంది. ఆ నాగు పాము తన మీద దాడి చేసే ఉద్దేశంతో వున్నట్టు లేదు. ఆనంద పరవశంలో పడగ విప్పి నాట్యం చేస్తున్నట్టుంది.

తను ఆఘ్రాణిస్తున్న సంపంగి సువాసనలు ఆ శ్వేత నాగువని అర్థమైంది. తను వెదుకుతున్న యువతి జాడ లేదు ఇటు చూస్తే సూర్యాస్తమయం దగ్గర పడుతోంది. ఇప్పటికే పాముతో పెను ప్రమాదం నుంచి బయట పడ్డాడు. దీని జోలికి పోయి కొత్త ప్రమాదం తెచ్చుకునే ఉద్దేశం ధనుంజయునికి లేదు. అందుకే `

ఇక ఆ అజ్ఞాత సుందరి కోసం వెదుకులాడే ఉద్దేశం విరమించుకొని అశ్వాన్ని వెనక్కు మళ్ళించాడు. అశ్వం గరుడ నాలుగు కాళ్ళ మీద దూకుతూ మైదానానికి అడ్డం బడి పచ్చికలో పరుగు ఆరంభించింది.

ఎప్పుడైతే అశ్వం వెళ్ళి పోవటం ఆరంభించిందో ఆ మరు క్షణమే సహజమైన తన సర్ప రూపం వదిలి నాగలోక యువ రాణి ఉలూచీశ్వరిగా మారి పోయిందా శ్వేత నాగు. వేడి నిట్టూర్పు వదుతూ వెళ్తున్న ధనుంజయుడినే చూస్తుండి పోయింది.

ఆమె శ్వాస బరువైంది, శరీరం వెచ్చ బడింది. వేడి నిట్టూర్పు విడుస్తూ అటే చూస్తోంది. ఆమెకు తెలికుండానే కనుకొలుకుల్లో నీరు నిలిచింది. అది సంతోషమో బాధో ఆమెకే తెలిదు. ధనుంజయుడు దూరమయ్యేకొద్ది తెలిని విరహవేదన. అతడికి కన్పించి మాటలాడానే కోరిక క్షణ క్షణానికి అధికరిస్తోంది. అతని వెంట బడి వెళ్ళమని మనసు తొందర చేసింది. తొలివలపు బం ఇదేనేమో! ఏ పురుషుని పట్ల చలించని మనసు ఇతన్ని చూడగానే ఇంతగా మోహ పరవశమైనదేమిటి? అతను ఎవరో ఏమిటో వూరేదో పేరేమిటో ఏమీ తెలిదాయె. అయినా ఈ వలపు మైకం ఏమిటి? ఆలోచిస్తోంది.

చూస్తుండగానే ఆ అశ్వం చాలా దూరం వెళ్ళి పోయింది. అది కనుమరుగవుతున్నంతలో చెలికత్తెలు నలుగురూ ఉలూచీశ్వరిని వెదుకులాడుతూ అక్కడికి చేరుకున్నారు. బాణం దెబ్బకు చచ్చి పడున్న గరుడ పక్షిని చూసారు. కాని బాణం వేసి తమ యువ రాణిని ఎవరు కాపాడారో తెలిలేదు. యువ రాణి క్షేమంగా ఉన్నందుకు సంతోషించారు. ఇంకా ఢాకినీ వనంలో సంచరించుట క్షేమంకాదని వారంతా యువ రాణిని తీసుకుని వెను తిరిగారు.

***********************

యువరాణి ఉలూచీశ్వరి చెప్పిందంతా `

శ్రద్ధగా ఆకించింది శంఖుపుత్రి.

జరిగింది అర్థమైంది.

ఇంతగా ఒక మగ ధీరుడి మీద మనసు పడిందంటే అతడెవరోగాని నవ మన్మథుడును పరాక్రమ వంతుడును అయి వుండాలి. కానీ...

శంఖు పుత్రికి రాకూడని అనుమానే వచ్చింది. ఒకవేళ అతడు రాకుమారుడు ధనుంజయుడు కాదుగదా! తన ఆలోచనే తనకే

నవ్వు పుట్టించింది.

తన పిచ్చిగాని అతనెందుకవుతాడు? ఈ పాటికి తమ రాజ్య సరిహద్దు దాటి మాళవ రాజ్యంలో ప్రవేశించి, వింధ్య పర్వతాలవైపు ఉత్తరంగా ప్రయాణిస్తుంటాడు. ఢాకినీ వనానికి వెనక్కు పోవాల్సిన పని అతడికి లేదు. ఖచ్చితంగా యువరాణి గాంచిన వీరుడెవరో వేరొక్కడయుంటాడు అనుకుంటూ ఫక్కున నవ్వుకుంది. ఉలూచీశ్వరి చిరు కోపంగా చూసింది.''అత్తా! ఎందుకే నవ్వుతావు? నేను సత్యమే చెప్పినాను గదా! నిజంగా నాది ప్రేమ కాదంటావా?'' అనడిగింది.

''లేదు లేదు. నా నవ్వునకర్థం అది కాదు లేవే.'' అంది వెంటనే శంఖుపుత్రి.

''ఇంకేమి?''

''చూడు దేవీ. ఇంతగా నీవతనిని మరువ లేకున్నావంటే నీది ప్రేమ కాదని, వలపు లేదని ఎలా అనగలను? ముందుగా నాకో విషయము చెప్పుము. నీవు గాంచిన వీరుడి అశ్వము ఏ వర్ణములో వున్నది?'' సందేహ నివృత్తి కోసం అడిగింది.

''పాలకన్నా తెల్లని శ్వేత వర్ణము''

''ఆ అశ్వం జూలు, తోక భాగము కూడ తెలుపేనా? బాగుగా గుర్తు చేసుకొని చెప్పుము.''

కొద్దిక్షణాలు కనులు మూసుకుంది ఉలూచీశ్వరి. ఆమె కనుల ముందు అశ్వం గరుడ, దానినధిరోహించిన ధనుంజయుడు కదలాడారు.

''లేదత్తా. అవి తెలుపు వర్ణము కాదు.'' అంది కనులు తెరవకుండానే.

''తెలుపు వర్ణము కాదా!'' నమ్మ లేనట్టు అడిగింది శంఖు పుత్రి.

‘‘కాదంటినిగ. అశ్వం జూలు, తోక భాగము చిక్కని కాటుక పూసినటుల నల్లగా వున్నవి’’ అని చెప్పి కనులు తెరిచింది.

ఆ సమాధానం విని నిర్ఘాంత పోయింది శంఖుపుత్రి. సందేహ నివృత్తి అయినది. అయిననూ నమ్మ లేకున్నది. అది ధనుంజయుని అశ్వం. అతడు రత్నగిరి యువరాజు ధనుంజయుడే. తన అంచనా తప్పి అతను ఢాకినీ వనానికెందు కెళ్ళినాడో వూహ కందని విషయం.

‘‘అతడు ఆజాను బాహుడా?’’

‘‘అవును.’’

‘‘ఎత్తు భుజములవాడా?’’

‘‘అవును.’’

‘‘అయితే ఇకనేం? నీ వపు చెలికాడు ఎవడో తెలిసి పోయినది.’’

‘‘తెలిసినదా. ఎవరతడు?’’

‘‘ఆహాఁ... అంత తొందరే గాని మీ ప్రేమ ఫలించదు. నీవు అతన్ని మరిచి పోవుట మంచిది’’ కావాలనే హెచ్చరించింది శంఖు పుత్రి. ఉలూచీశ్వరికి అర్థం గాక తెల్లబోయి చూసింది.

‘‘అత్తా! ఏమంటివి? నా ప్రేమ ఫలించదా! ఎందుకు?’’ అనడిగింది.

‘‘ఎందుకనగా, నీవు వలచిన వాడు అమరులగు దేవజాతులకు చెందిన వాడేమీ కాదు. నరుడు. మానవుడైన అతను నీ తండ్రికి శత్రువు. ఆ యువకుడు నాగ లోకమునకు వచ్చు ప్రయత్నములో వున్నాడు. ఇప్పటికే నీ తండ్రి నాగరాజు ఆ యువకుని భయ

పెట్టి వెనక్కు మరలించుటయో లేదా అతన్ని అంతమొందించుటయో జరగాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. ఈ పరిస్థితిలో నీవా మానవ యువకుని వరించుట వ్యర్థం. అందుకే మీ ప్రేమ ఫలించదని చెప్పితిని'' వివరించింది శంఖుపుత్రి.

''నా తండ్రితో అతనికి శత్రుత్వం ఎందుకు?'' కుతూహలంగా అడిగింది ఉలూచీశ్వరి.

''శత్రుత్వము నీ తండ్రిది. ఆ యువ కిశోరానిది గాదు. ఏమి? ఒకప్పుడు నా ప్రియుడు మానవుడని అన్యాయముగ అతనిని జంపించి నను నాగలోకము నుండి బహిష్కరించిన వాడు నీ విషయమున మిన్న కుండునా? నీ తండ్రి దృష్టిలో మానవు అల్పులు, అప్రయోజకులు.''

''లేదు లేదు. ఆ అభిప్రాయము సరి కాదు. నా తండ్రి అతన్ని శత్రువుగా భావింపవచ్చు గాక. నాకు శత్రువు కాదు గదా. అతని వలపు దక్కిన నా జన్మ ధన్యమైనట్టే. నేనా వీరు కుమారుని మరువజాల. ఈ విషయమున నేను నా తండ్రిని ఎదిరించుటకునూ సిద్ధమే. అత్తా. నీకు చాలా విషయము తెలుసునని అర్థమైనది. ఇక తామసించక నా వలపు రేడు వివరములు తెలుపుము'' అంటూ అర్థించింది.

''సరి. నీవింతగా అడుగుతున్నావు గాబట్టి అతని వివరము వివరించి మీ యిద్దర్ని కలిపెదను. కాని ఎన్ని కష్టములైననూ నీవు అతడి చేయి విడువనని, మాట తప్పనని నాకు వాగ్దాన మొనర్చుము.''

''అత్తా! ఆడిన మాట తప్పను. మాటిస్తున్నాను. ప్రాణము పోయినా పోవు గాక, ఎవరికీ భయ పడను. ఆ సుందరాంగుని వలపు దక్కిన చాలును'' అంటూ ప్రమాణం చేసింది యువరాణి ఉలూచీశ్వరి.

శంఖు పుత్రికి చాలా ఆనందంగా వుంది. తన పథకం ఫలించు సమయం అసన్నమైంది. నాగ రాజుపై ఇంతకాలం తనలో గూడు కట్టుకొనున్న కోపం చల్లారే రోజు త్వరలో రానుంది. ఇక ఆలస్యం చేయ లేదామె.

''అతను రత్నగిరి రాకుమారుడు. ధనుంజయుడను నామధేయుడు...'' అంటూ తనకు తెలిసిందంతా వివరించింది.

శంఖు పుత్రి మాటలను శ్రద్ధగా ఆలకించింది ఉలూచీశ్వరి. ఎప్పుడైతే ధనుంజయుని వివరాలు తెలిసాయో ఆ మరుక్షణమే అతనిని

చూడాలి, మాట్లాడాలన్న కోరిక అధికరించింది ఆమెలో.

“అత్తా. నేను వెంటనే ఆ మోహనాకారుని గాంచవలె. ఇప్పుడే ఢాకినీ వనమునకు పోయెదను గాక. నీవును రావలె” అంది.

ఉలూచిశ్వరి తొందర పాటు చూసి`

ఫక్కున నవ్వింది శంఖు పుత్రి.

“ఏమమ్మా యువరాణీ. లేడికి లేచినదే ప్రయాణమా ఏమిటి? ధనుంజయుడు నీకోసం గాలిస్తున్నాడని తెలుసు గదా. సర్ప రూపాన తప్పించుకొన పని యేమి. అప్పుడే అతని ఎదురుగా బోయి పలకరింప వచ్చును గదా?” అనడిగింది.

“ఏమో! ఆ సమయాన నాకా ఆలోచనే రాలేదు. అతని ఎదురుగా బోతే సిగ్గు దొంతర కనులార అతన్ని జూడ సాధ్యం కాదని యెంచి సర్పమునైతి...”

“సరి సరి. ఇప్పుడు బోవుట సాధ్యము గాదులే.”

“అది యేమి? ఎందుకు సాధ్యము గాదు. నీకు వేరే పనున్నవా ఏమి?”

“నాకే పనులూ లేవుగాని. ఒక విషయము నీవు మరచితివి. ఆలోచింపుము. ఇప్పటికే నాగ లోకము వదిలి వారము దినములు ఢాకినీ వన విహారమున వుంటివి. ఇంకను ఆలస్యమైన నీ తండ్రి సందేహింపగలడు. నా మాట వినుము.

ధనుంజయుడు ఏ కార్యర్థియై ఢాకినీ వనమున వున్నను మరలి వచ్చి వింధ్యా పర్వతాను చేరుటకు పది దినములగును. ఈలోపల నీవు నిజ లోకమున కేగి నీ తండ్రి గారిని సందర్శించి ఏమీ తెలియ నటులే వుండుము. వారము దినములకు ఇదే రోజున ఇటకు రమ్ము. నీ సఖియను ఈ సంపంగి వనమందే వుంచి మన మిరువురము వింధ్య పర్వతముకు పోయి వచ్చెదము” అంటూ వివరించింది శంఖుపుత్రి.

అంతలో జలక్రీడలు ముగించుకొని నాగకన్యలు నలుగురూ అచటికి రావటంతో వారి సంభాషణ ఆగి పోయింది.

***************

ఎడ తెరిపి లేని ప్రయాణం.

అశ్వం గరుడ అలుపు లేకుండా`

ఏక బిగిన పరుగు తీస్తూనే వుంది.

దారి తెన్ను లేని అడవి.

ఈ రోజు కూడ ఎండ వేడిమి అధికంగా వుంది. కాలం గాని కాలంలో ఈ ఎండలు, వడగాడ్పులేమిటో అర్థం గాలేదు. ధనుంజయుడు దారి తప్పి ఇది ఆరవ రోజు. రామ గిరిలో తిన్న భోజనం తప్ప తిరిగి భోంచేయ లేదు. దొరికిన కాయలు, పండ్లు తిని ప్రయాణం చేస్తున్నాడు. ఈ రోజు ఉదయం సొర కాయలో మంచి నీరు కూడ నిండుకుంది. దారిలో వాగుల వంకల జాడ లేదు. ఎండ వేడిమికి నాలుక పిడచ కట్టుకు పోతోంది. మంచి నీటి జాడ కోసం గాలిస్తూనే ముందుకు సాగుతున్నాడు.

ఇదే పరిస్థితిలో నిన్నటి సాయంకాలపు సంఘటన కూడ ఇంకా మర్చి పోలేదతడు. అద్భుతమగు ఆ సౌందర్య రాశి ముగ్ధ మోహన రూపాన్ని మరువ లేక పోతున్నాడు. ఎవరా అతివ? ఎక్కడి నుండి వచ్చింది? ఎటకు నిష్క్రమించింది? తన మనసును గిలిగింతలు పెట్టి మంత్రం వేసినట్టు మాయమైనదే. తిరిగి కన్పిస్తుందా? ఆలోచిస్తుంటే ఆమె ఖచ్చితంగా మానవ కన్య కాదనిపిస్తోంది.

మర్చి పోదామన్నా ఆమెను మర్చి పోలేక పోతున్నాడు. పదే పదే గుర్తు కొచ్చి వ్యాకుల పరుస్తోంది.

ఆమె వూరేమి, పేరేమి, ఏ లోకానికి చెందినది ఏమీ తెలియదాయె. కాని ఇంతగా తన మనసును హరించి అదృశ్యమవుతుందని

వూహించ లేదు. ఆ సొగసును వర్ణింప తరమా?

ఆలోచనల నుండి ఉలికి పడి`

అశ్వాన్ని నిలువరించాడు ధనుంజయుడు.

ఉన్నట్టుండి మంచు కొండల నుండి వీస్తున్నట్టుగా చల్లని శీతల గాలులు తన శరీరాన్ని తాకి సేద తీర్చటమే అందుక్కారణం. అక్కడి కొచ్చే సరికి చల్లని గాలికి శరీర శ్వేదం హరించి హాయి గొలుపుతూ కొత్త శక్తి ఏర్పడినట్టుంది. ఇంతలోనే మార్పా... ఏమైనది? చుట్టూ పరికించాడు.

వాతావరణంలో మార్పు లేదు.

ఎంత తీవ్రత అలాగే కొనసాగుతోంది.

ఆకాశన మబ్బుల జాడ కూడ లేదు.

కాని ఈ ప్రాంతం ఇంత శీతలంగా ఆహ్లాద భరింతంగా ఉందేమి? ఒకవేళ` తపోధనులు, మహాసిద్ధులు వశించు చోట ఇలాగే వ్యతిరేక వాతావరణం వుంటుందంటారు. ఇది ఎవరో ముని పుంగవుడు వశించు తపో భూమి కాదు గదా! ఎండ వేడిమి తట్టు కోలేని అనేక పక్షిజాతులు వన్యమృగాలు ఆ ప్రాంతాల్లో గుంపుగా చేరి సేద తీరుతున్నాయి. కౄర మృగాలేవీ ఆ పరిసరాల్లోకి రావటం లేదు. ఖచ్చితంగా ఇది తపో భూమి అయి వుండాలి.

ఆ మహనీయుని దర్శన భాగ్యం పుణ్య ప్రదం పాప హరం. ఆ పైన తనకు అతిధ్యం లభిస్తుంది. సందేహ నివృత్తి కూడ జరుగుతుంది. ఈ విధంగా ఆలోచించిన ధనుంజయుడు సమీపంలో ఏదయినా ముని వాటిక గాని ఆశ్రమం గాని కన్పిస్తుందేమోనని గాలిస్తూ బయలుదేరాడు.

మరికాస్త ముందుకెళ్ళగానే పర్ణశాల ఒకటి కన్పించింది. విశాలమైన మట్టి దిబ్బమీద అందమైన పర్ణశాల. దాని వెనక తట్టున కొండవాగు ఒకటి ప్రశాంతంగా ప్రవహిస్తోంది. దిగువ నుండి పర్ణశాలను చేరుకోడానికి పద్దెనిమిది మెట్లతో కూడిన విశాలమైన రాతి మెట్ల వరుస కన్పిస్తోంది. ఇక ఆ పరిసరాలలో అనేక ఫలవృక్షాలు, పండిన ఫలాలతో కనువిందు చేస్తున్నాయి. దిబ్బను చుట్టి పైన

కూడ అనేక పూలమొక్కల తీగలు విర బూసిన పూలతో ఆకర్షిస్తున్నాయి. పర్ణశాల నుంచి ‘‘ఓం నమః శ్శివాయ’’ అనే పంచాక్షరీ మంత్రం మంద్ర స్వరంలో నినదిస్తూ ఆ ప్రాంతాన్ని పునీతం చేస్తోంది. వింటుంటే అలౌకిక భక్తి భావం ఏర్పడుతోంది.

తన అంచనా వాస్తవమైనందుకు`

సంతసించాడు ధనుంజయుడు.

ఎవరో మహా తపశ్శాలియగు మునీంద్రుని నివాసం అది. ఆయన దర్శనం చేసుకోవాలి. ఇక ఆలోచించ కుండా అశ్వం దిగాడు ధనుంజయుడు. కొండ వాగు చెంతకు అశ్వాన్ని తీసు కెళ్ళి నీళ్ళు తాపించాడు. తను ముఖం కర చరణాలు ప్రక్షాళనం చేసుకున్నాడు. అశ్వాన్ని ఒక చెట్టు మొదలుకు కట్టి మెట్ల దారి వైపు అడుగులు సారించాడు.

పాద రక్షల్ని మెట్ల వద్దనే విడిచి`

మెట్లెక్కి పైకి వెళ్ళాడు.

అక్కడంతా చాలా ప్రశాంతంగా వుంది.

దిగువ నుండి చూసిన దాని కన్నా పర్ణశా ఆవరణ మరింతగా శోభయమానంగా వుంది. చుట్టూ ఫెళ్ళున ఎండ కాచి వడగాలి వీస్తున్న ఇక్కడ మాత్రం చలి వాతావరణం నెలకొని ఆహ్లాద భరితంగా వుంది. ఆవరణ అంతటా విర బూసిన పూలతో ఎన్నో మొక్కలు లతలు కనువిందు చేస్తున్నాయి. సువిశాలమైన ఆ పర్ణశాల వెదురుతో నిర్మించ బడి పైన తాటియాకు కప్పబడ్డాయి. ముఖ ద్వారం తలుపు దగ్గరగా మూసి వుంది.




లోన తాపసి ఒంటరిగా వుంటున్నాడో లేక ధర్మపత్ని సమేతంగా కుటుంబంతో వుంటున్నాడో తెలీదు. పరిసరాల్లో ఎక్కడా మరో మనిషి జాడ లేదు. లోపలి నుంచి మాత్రం శివ పంచాక్షరి విన్పిస్తూనే వుంది. ఆ తపోధనుడి అనుమతి లేకుండా తను లోన ప్రవేశించ లేడు. ఆయన ఎవరో గాని తపస్సులో వున్నాడు. తన మూలంగా తపో భంగమైతే శాపానికి గురి కావలసి వస్తుంది. ఏం చేయాలో తోచక కాసేపు వాకిట్లోనే తట పటాయిస్తూ నిలుచున్నాడు ధనుంజయుడు.

ఇంతలో`

లోన పంచాక్షరి జప దీక్ష నిలిచి పోయింది. ''ఎవరక్కడ? వాకిట నిలిచినది ఎవరు?'' అంటూ అదే శాంత గంభీర స్వరం విన వచ్చింది.

‘‘స్వామీ. అడవిలో దారితప్పి వచ్చిన బాటసారిని. తమ దర్శనార్థం ఏతెంచిన అతిధిని.’’ వెంటనే బదులిచ్చాడు ధనుంజయుడు.

‘‘మంచిది నాయనా. అతిధి దేవోభవ అన్నారు. నీవు మా అతిధివి. పాద ప్రక్షాళన జేసుకుని లోనకు వచ్చి విశ్రాంతి గైకొనుము. ముందు గదిలో వలసిన కందమూలములు ఫలములు గంపలో వున్నవి. వలసినవి ఆరగించి క్షుద్బాధ తీర్చుకొని వెళ్ళ వచ్చును. రమ్ము’’ పిలిచాడు మహనీయుడు. దయార్ధ హృదయుడగు ఆ తాపసి పిలుపుకు సంతసించాడు ధనుంజయుడు. చిన్నగా తలుపున నెట్టుకొని లోనకు అడుగు పెట్టాడు.

ముందు గది చాలా పెద్ద గది.

దానికి కుడి ఎడమలుగా రెండు తలుపుల్లేని కిటికీలున్నాయి. గాలి వెలుతురు ధారాళంగా లోనకు వస్తోంది. కుడి పక్క కిటికీ సమీపంలో నేలమీద దర్భ చాప పరిచి చక్కగా పక్క వేసి వుంది. తల దిండ్లు వున్నాయి. అది స్వామి వయనించే పాన్పుగా వూహించాడు. గది మధ్యలో పేము కర్రతో చేసిన నాలుగు కుర్చీల మధ్యన ఒక ఎత్తు బల్ల వున్నాయి. బల్ల మీద ఒక గంపలో చక్కగా కాల్చిన కంద మూలాలు అనేక పండ్లు కాయలు వున్నాయి. పక్కనే లోటాతో బాటు మంచి నీటి కుండ మూత పెట్టి వుంది. కాని ఆ గదిలో ఎవరూ లేరు. నిర్మానుష్యంగా వుంది. అవతల మరో గదిలోకి తలుపు లేని ద్వార బంధం కన్పిస్తోంది. బహుశ ఆ మహనీయుడు అవతలి గదిలో ఉండొచ్చనుకున్నాడు. ఆయన్ని దర్శించాలనే కుతూహలంతో అటు వెళ్ళి లోనకు తొంగి చూసాడు. అంతే`

తన కళ్ళను నమ్మ లేనట్టుగా`

చూస్తున్నది కలో నిజమో అర్థం గానట్టుగా`

అలా మ్రాన్పడి పోయాడు.

లోన వున్నది మనిషి కాదు.

పెను సర్పం.

దర్భాసనం మీద జింక చర్మం పరిచి దాని మీద చుట్ట చుట్టుకొని పడగ విప్పి కనులు మూసు కొని ధ్యానంలో వుంది. ఆ శ్వేత వర్ణం పాము శరీరం మీద అక్కడక్కడా కాలిన గాయాల్లా పుండ్లు కన్పిస్తున్నాయి. ధనుంజయుడు విభ్రాంతి చెంది చూస్తున్నాడు.

ఇతనెవరు?

నిజంగా సర్ప రూపుడైన ముని పుంగవుడా? లేక తనను అంతం చేయనెంచిన నాగ రాజు కుటిల పన్నాగమా? ఈ పన్నాగము నాగ రాజేనా! నాగ రాజుకి అయిదు శిరస్సులుంటాయంటారు. ఇతడు ఒకటే శిరస్సు కలిగి వున్నాడు. వంటి మీద ఆ పుండ్లు ఏమిటి? ఏమీ అర్థంగావటం లేదే. ఏమైనప్పటికీ తను అప్రమత్తంగా వుండుట మంచిది.

ఆలోచిస్తూ ఎలా వెళ్ళాడో అలాగే నిశ్శబ్దంగా వచ్చి ఒక ఆసనం మీద కూర్చున్నాడు. ఇంతలో లోపలి నుంచి తిరిగి మంద్ర స్వరంలో అదే గొంతు విన్పించింది. సర్పం మానవ భాషలో మాట్లాడుతోంది.

''ఏమి నాయనా. లోనికి వచ్చినావా?'' అనడిగింది.

''వచ్చి, ఆసీనుడనైతి స్వామీ'' వెంటనే బదులిచ్చాడు ధనుంజయుడు.

''నీకు అతిధి మర్యాదలు చేయనశక్తుడను నాయనా. నీకిష్టమైన ఫలములో కందమూలములో కడుపార భుజింపుము.''

''క్షమించండి స్వామీ. ఎదురుగా గృహస్థు లేకుండా భుజించుట ధర్మ యుక్తము కాదు గదా. ఒక సారి తమ దర్శన భాగ్యాన్ని అనుగ్రహించండి.''

''అలాగునే నాయనా. నేను వచ్చెదను. కాని నను గాంచి నీవు భయ పడ కూడదు సుమా. నీకే అపకారము ఒనర్చు వాడను కాను.''

''అలాగే స్వామీ.''

కొన్ని లిప్తల తర్వాత`

నెమ్మదిగా పాకుతూ ముందు గది గుమ్మంలో కొచ్చిందా సర్పం.

ముందే ఆ సర్పాన్ని చూసాడు గాబట్టి ధనుంజయుడు భక్తి భావంతో లేచి నిలబడి నమస్కరించాడు. అయితే ధనుంజయుని చూడగానే స్థాణువై పోయిందా సర్పం. అక్కడ ఆగి పోయింది.

''హే మహేశా... శంకరా.... నేను ఏమీ చూచుచున్నాను'' అంటూ అప్రయత్నంగా మాటలు వెలువడ్డాయి.

మరొక్క మారు విస్మయానికి గురయ్యాడు ధనుంజయుడు. ఆ పెను సర్పం ఏమంటుందో అర్థం కాలేదు. అంతలో సర్పం ముందుకొస్తూ` ''అర్జునా... విజయా... పార్థ.... కిరీటి... ఏమి నా భాగ్యము. నీవు నను జూడ వచ్చుటయా.... ఇది నిజమా...'' అని అంటుంటే` ఆ పలుకులను ఎలా అర్థం చేసుకోవాలో ధనుంజయునికి తెలిలేదు.

''స్వామీ. మీరు నను జూచి పాండవ మధ్యముడనని బ్రమ పడుతున్నట్టున్నారు. నేను పార్థుడను కాను స్వామీ'' అన్నాడు

''పార్థుడవు కావా....?''

''కాను స్వామీ. కాని ఆ వంశజుడనే.''

ఆ మాటలు ఆలకించిన మరు క్షణమే`

కట్టెదుట వున్న సర్ప రూపం అదృశ్యమై`

ఆ స్థానంలో ఒక తాపసి ప్రత్యక్షమయ్యాడు.

ఆయన ముఖ మండం దివ్య తేజస్సుతో ప్రకాశిస్తోంది. నిడు పాటి జుత్తును వెనక్కు లాగి కొప్పున ముడి వేసుకున్నాడు. నార

బట్టను దట్టీగా బిగించి కట్టాడు. ఒంటి మీద వేరే ఏ ఆచ్ఛాదనా లేదు. శ్యామ వర్ణ మేని ఛాయ. నుదుట విభూది రేఖలు, ఛాతికి అడ్డంగా జంధ్యం పోగును బట్టి ఆయన బ్రహ్మణోత్తముడని తోచింది. మెడలో రుద్రాక్షమాల చేతిలో జపమాల వున్నాయి. మంచు కన్నా చల్లని ప్రశాంతమైన చూపులతో చూడగానే నమస్కరించాలనిపించే దివ్య రూపం. కాని చంద్రుడిలో మచ్చల్లా ఆ మహనీయుని వంటి మీద పుండ్లు కన్పిస్తున్నాయి. ఆయన ఒక మహా వ్యాధి గ్రస్తుడు. కుష్టు రోగ పీడితుడు. అంతటి తపఃశ్శాలికి ఈ వ్యాధి ఏమిటో అర్థం కాలేదు. అయినప్పటికీ`

చెంత కెళ్ళి వినమ్రుడై`

పాదాభివందనం చేసాడు ధనుంజయుడు.

అతడి వినయానికి ముగ్ధుడవుతూ` ''ఆయుష్మాన్ భవ... అభీష్ట సిద్ధిరస్తు... ఇష్ట కామ్యార్థ సిద్ధిరస్తు. లే నాయనా'' అంటూ అశీర్వదించి భుజాలు పట్టి లేపాడా ముని పుంగవుడు.

అప్పుడు కూడ ఆశ్చర్య సంభ్రమాలనుండి బయట పడ లేకున్నట్టుగా ధనుంజయుని ముఖారవిందాన్నే విస్మయంగా వీక్షిస్తున్నాడు.

''ఆశ్చర్యము. మహదాశ్చర్యము. చరిత్ర పునరావృతమవునంటే ఇదియేనేమో. అన్ని విధాలా శుభ క్షణాలతో అచ్చు గుద్దినటుల ఆ మహా వీరుడు పార్థుని లాగే వున్నావు నాయనా. నమ్మ లేకున్నాను. నీవు విజయుడవేననుకొని భ్రమించి పోతిని'' అన్నాడు.

ఈసారి మరింత విస్మయానికి గురయ్యాడు ధనుంజయుడు. చూస్తుంటే తన కన్నా పొడగరిలా సుమారు ఎనిమిది అడుగుల ఎత్తు వున్నాడీయన. ఆపైన తనకు అర్జునుడు బాగా తెలిసినట్టు మాట్లాడుతున్నాడు. ఈయన వయసు ఎంతయి వుంటుంది? ఏ కాలం వాడు? ఎవరీ తాపసోత్తముడు? వూహకు అందటం లేదు.

''స్వామీ. తమకు పాండవ మధ్యముడు తెలుసునా?'' సందేహ నివృత్తి కోసం అడిగాడు. కాని ఆ ప్రశ్నకు బదులు చెప్పకుండా`

''నీ నామ ధేయం ఏమిటి? ఎచటి వాడవు నాయనా?'' అనడిగాడు.

“స్వామీ. నన్ను ధనుంజయుడంటారు. ఈ రత్న గిరి ధరా చక్రము నేలు ధర్మతేజ ప్రభువుల వారి కుమారుడను. రాకుమారుడను. చంద్ర వంశ సుక్షత్రియుడను.”

“అర్థమైనది నాయనా. నీవు పార్థుని వంశజుడవే. రమ్ము ఆసీనుడవు కమ్ము” అంటూ తానొక ఆసనం మీద కూచున్నాడు. ఎదురుగా మరో ఆసనాన్ని అలంకరించాడు ధనుంజయుడు. ఇక ఉండ బట్ట లేక మరో సారి తన ప్రశ్నను వినిపించాడు.

“సామీ. తమకు అర్జునుల వారు తెలుసా?”

“తెలుసు నాయనా.” అన్నాడు చిత్తంతో.

గత కాలపు జ్ఞాపకాల పొరలేవో కదులాడి చిత్తమును వ్యాకుల పరిచినట్టు ఆయన ముఖమండం తెలియజేస్తోంది. భారంగా నిట్టూర్చి చెప్పాడు.

“ఒక్క అర్జును డేమిలే నాయనా. ఆయన ఏకైక కుమారుడు సుభద్రా దేవి తనయుడైన మహా వీరుడు అభిమన్యుడును తెలుసు. ధర్మ మూర్తి ధర్మజుడు మహా బలశాలియగు భీమ సేనుడును వారి సోదయి నకులసహదేవులును తెలియు. పాండవులే కాదు, కురు సామ్రాజ్యాన్ని ఏకచ్ఛత్రాదిపత్యంగా పరిపాలించిన సుయోధన చక్రవర్తి ఆయన సోదయి అందరూ తెలియును. బలరామకృష్ణుల వారి బంధు వర్గమును తెలియు. కురు వృద్ధుడగు భీష్మా చార్యుల వారు నీతి కోవిదుడగు విదురుడు, మహా దాత కర్ణుడు, వికర్ణుడు శకుని శల్యాది విశిష్ట ప్రముఖులందరూ నాకు తెలిసిన వారే.

బాల్యము నుండి కౌరవులు, పాండవులతోడ కలిసి ఒకే గురువు చెంత విద్యాభ్యాస మొనర్చి అస్త్ర శస్త్రాది సమస్త విద్యలు అభ్యసించిన వాడను గాన నాకు అందరునూ తెలిసిన వారే. అంతియే కాదు సుమా, నభూతో న భవిష్యతి అన్నట్టుగా పదునెనిమిది దినములు సాగిన మహా సంగ్రామము కురు క్షేత్ర రణ రంగమున పాల్గొన్న వాడిని. నాకు తెలియని వారెవరు నాయనా. కాదంటే`

కాల ప్రవాహము ఎవరినీ దేనికీ శాశ్వతముగా వుంచదు. అందరూ పోయినారు. నేను మాత్రం మిగిలే వుంటి. కలియుగాంతం వరకు ఉండ వలసిన వాడినే. చిరంజీవినను నాకు యిది వరమో శాపమో నాకే తెలీదు. కర్మఫలం అనుభవింపక తప్పదు.” అంటూ అప్రయత్నంగా కళ్ళలో నిలిచిన నీటిని తుడుచుకున్నాడు. చివరి మాటల్లో గొంతు తడుమారింది. తెలియని వేదన యేదో ఆ తాపసి గుండెల్ని తాకి చింతా క్రాంతుడ్ని చేసింది.

ఆ తాపసి మాటలు ధనుంజయునికి అర్థమై కూడ అర్థం గానట్టే వుంది. నాటి కురుక్షేత్ర సంగ్రామమున పాల్గొన్న హేమా హేమీలందరూ తనకు తెలుసునంటున్నాడు. సుమారు అయిదు వందల సంవత్సరాల క్రితం మాట. ఒక మనిషి ఇంత కాలం జీవించుట సాధ్యమేనా? పైగా కలి యుగాంతం వరకు ఉండ వలసిన వాడినే అంటున్నాడు. అంటే యుగంతం వరకు జీవించే వుంటాడా? ఆంజనేయ, పరుశు రామ, మార్కండేయాది చిరంజీవుల్లో ఈయన కూడ ఒకడా. అయితే ఎవరీయన?

అనేక ప్రశ్నలు ఒకే సారి ఉదయించి ఉక్కిరి బిక్కిరి చేస్తుండగా అమాయకంగా చూసాడు ధనుంజయుడు.

“స్వామీ. తమరు ఇంత చెప్పినా మీ నామ ధేయం ఏమిటో, మీరెవరో గుర్తించ లేకున్న స్వామీ. ఆ వివరాలు కూడ చెప్తే సంతసించెదను” అన్నాడు.

“ఏమి నాయనా? చంద్ర వంశ క్షత్రియుడవు, పార్థుని సంతతికి చెందిన వాడవు. మీ పూర్వీకుల గాధలు వినలేదా?” మనసు కలత బారకుండా దృఢ పర్చు కొంటూ శాంత చిత్తంతో అడిగాడా తాపసి.

“ఏదో ఆనోట ఈనోట వినటమే గాని పూర్తిగా తెలియదు స్వామీ. వ్యాస మహర్షు వారు భారత భాగవత కావ్యమును రచించిరని వింటిని గాని చదువుటకు వాటి వ్రాత పత్రులేవీ లభించ లేదు మాకు.”

“ఏమంటివి నాయనా. వ్యాసుల వారు నాటి చరిత్రను భారత, భాగవతమును పేర ఆ గాథను గ్రంథస్థము చేసినారా?”

“అవును స్వామీ.”

“ఆహా... వ్యాస మహర్షుల కృషి కడు శ్లాఘనీయము గదా. భవిష్య తరాలకు తన రచన మూలంగా మహోపకార మొనర్చినారు. అయితే విను నాయనా. నాది ఏమంత గొప్ప చరిత్ర కాదు. సద్బ్రాహ్మణ వంశంలో జన్మించి ఉన్నత చరిత్రుడనై వుండి కూడ ఘోర తప్పిదము చేసి హీన చరిత్రుడనయినాను. నన్ను అశ్వత్థామ అంటారు. కురు పాండవులకు అస్త్ర శస్త్రాది సమస్య విద్యలు నేర్పిన గురు దేవుడు ద్రోణా చారుల వారి కుమారుడను” అన్నాడు.

"అశ్వత్థామ?" అప్రయత్నంగా పలికాడు ధనుంజయుడు.

"అవునా్నయనా. అశ్వత్థామనే. ద్రోణ సంభవుడైన మదీయ జనకుడు ఘోర తపస్సు చేసి శివుని మెప్పించి చిరంజీవి యగు కొడుకు కావలెనని వరం పొందినాడు. ఆ వరమున జన్మించిన వాడే ఈ అశ్వత్థామ"

"మరి ఈ కుష్ఠువ్యాధి ఎలా సంక్రమించినది స్వామీ?"

"సంక్రమించినది కాదు నాయనా. నా ఘోర తప్పిదాలకు ఫలితంగా శ్రీకృష్ణ వారి నుండి నాకు లభించిన శాపం. కలి యుగాంతం వరకు ఈ వ్యాధిని అనుభవింపక తప్పదు. మా వంశ గౌరవాన్ని కుల ప్రతిష్టను ఇనుమడింప జేయు చిరంజీవి యగు తనయుని బడసినందుకు మదిలో జనకుడు ఆనందించినాడు. కాని ఆ ఆచార్యుని ఆశలు అడియాశలు జేసి మదీయ చిరంజీవత్వమును వ్యర్థ పరుచు కొని ఘోర పాతకము గావించి పాపి నైతిని. కావున నగు బాటు నుండి తప్పించు కొనుటకు ముఖము చాటు చేసు కొని ఆ నాటి నుండి సర్ప రూపమున అజ్ఞాతముగా గడుపు చున్నాను. ఇప్పుడు కూడ నిను పార్ధునిగ నెంచి నిజ రూపు ధరించినాడను."

"నమ్మ శక్యము గాకున్నది. తపో ధనులైన మీరు తెలిసి కూడ అంతటి పాప కార్యము ఏమి జేసినారు. శ్రీకృష్ణుని శాపానికి ఎలా గురయ్యారు?""చెబుతాను నాయనా. కాని అతిధిగా వచ్చిన నిన్ను కూర్చుండ బెట్టి మాటలాడుచున్నాను. ఆకలితో వచ్చి వుందువు. ముందు ఫలములారగించిన పిమ్మట తెలిపెదను."

అశ్వత్థామ అభ్యర్ధన మేరకు రెండు ఫలములు తిని, నీరు తాగాడు ధనుంజయుడు. గతాన్ని వివరించాడు అశ్వత్థామ.

"ఆ నాడు కురుక్షేత్ర సంగ్రామ మందు ఏమి జరిగినది? ధర్మం ఎవరి పక్షాన వున్నది? అందరికీ తెలుసు. అయినప్పటికీ కౌరవుల పక్షాన నిలిచి యుద్ధమున పోరాడుతున్నారంటే కారణము కేవలము భృత్యు ధర్మం. అతిరథ మహారథులు కురువృద్ధులు అంతా దుర్యోధన సార్వభౌముని విజయం కోసం శత విధాలా పోరాడిన ఫలితం దక్క లేదు. లక్షలాది సైన్యం నశిస్తోంది. కురు వృద్ధులు అతిరథ మహా రథులు ఎందరో నేలకొరిగిపోయారు. యుద్ధం ముగింపు కొస్తోంది. కౌరవులు ఓటమి పాలవుతున్నారు. ఆ సమయాన రాజ భక్తి భృత్యు ధర్మాలు నాలో అత్యుత్సాహం చూపించాయి. పాండవులు కురు క్షేత్రంలో విజయులైనప్పటికీ వారికి వారసులుండ కూడదు. పాండు వంశం నిర్వీర్యం కావాలన్న కసితో తల వంపు తెచ్చే ఘాతుకమునకు ఒడి కట్టినాను. న్యాయ ధర్మమును విడిచితి, దయా దాక్షిణ్యాదులు మరిచితి. బ్రహ్మణుడై వుండి కూడ యుద్ధనీతికి విరుద్ధముగా క్రూర కార్యము జేసితి. గాఢ నిద్ర యందున్న ఉప పాండవుల కుత్తుకలు కోసి వధించితి. పాండవుల ద్వారా ద్రౌపతీ దేవికి కలిగిన సంతానమే ఉప

పాండవులు.

అంతటితో ఆగలేదు నేను.

ఉత్తర గర్భస్థ శిశువును జంపుటకు, భ్రుణ హత్యకు తెగ బడి హీన చరిత్రుడనైతి. ఆ శిశువు పైకి ఆగ్నేయాస్త్రమును ప్రయోగించితి. సమయానికి కృష్ణ పరమాత్మ అడ్డు పడి ఆమె గర్భస్థ శిశువును కాపాడినాడు. లేకున్న పాండు వంశం ఆనాడే నిర్వీర్యమయ్యేది. ఆ శిశువే పార్థుని మనుమడు అభిమన్యుని కొడుకు పరీక్షిత్తూ. ఆ పరీక్షిత్తూ నుంచే మీ వంశ వృద్ధి జరిగినది.

నేను గావించిన కౄర కార్యముకు ప్రతిగా కలి యుగాంతం వరకు మహా వ్యాధితో బాధ పడమని కృష్ణ భగవానుడు నాకు శాపమిచ్చినాడు. ఆ శాపఫలమే నాకీ కుష్టు వ్యాధి.'' అంటూ వివరించాడు బాధా తప్త హృదయంతో.


అశ్వత్థామ చెప్పిన శాప వృత్తాంతం విని విస్తు పోయాడు రాజ కుమారుడు ధనుంజయుడు. ప్రభు భక్తి పెచ్చరిల్లి తమ వంశానికే హాని చేసిన దోషి ఇప్పుడు తన ఎదురుగా వున్నాడు. కాని ఆ నాడు ఘోర పాపం చేసిన తర్వాత పశ్చాత్తప్తుడయ్యాడు. పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదంటారు. ఆ పైన అపారమైన శివ భక్తితో ముని వృత్తిలో వున్నాడు. నాటి తన పాపాలు పరిహారమైనట్టే. ఇప్పుడు విచారింప పని లేదు. తమ వంశ మూల పురుషులను చూసిన మహానీయుడీయన.

''స్వామీ. గతమును తలచి చింతింప పని లేదు. మీరిపుడు పరమ పవిత్రమగు ముని వృత్తిలో వుంటిరి. మీ వంటి మహనీయుడు మా రత్నగిరి రాజ్యమున వశించుట మాకు సంతోష కరము. నేను సకల విద్యలు అభ్యసించితి కాని అస్త్ర విద్య బోధించు గురువు లభించలేదు...'' అంటూ ధనుంజయుడు ఏదో చెప్పబోతూండగా, చేయి ఎత్తి వారించాడు అశ్వత్థామ.

''నాయనా నాకు నీ ఉద్దేశము అవగతమైనది. అస్త్ర విద్య నేర్చుకోవాలని ఆశ పడుతున్నావు. అవునా?'' అనడిగాడు.

అవునన్నట్టు తల పంకించాడు ధనుంజయుడు.

''నీ కోరిక ఫలించదు నాయనా.''




"ఫలించదా స్వామి?"

"అవును. ఫలించదు. అస్త్ర విద్య తెలిసిన వారంతా ద్వాపర యుగాంతానికి ఎవరూ మిగిలి లేరు. సప్త ఋషులతో బాటు పరశురాముల వారు మార్కండేయుల వారు మరి కొద్ది మంది వున్నారు. అంతా దివ్య పురుషులు మహా తపస్సంపన్నులు. నా జనకుడు ద్రోణాచార్యుల నుండి అస్త్ర శస్త్రాది సమస్త విద్యలు నేర్చిన వాడ్ని. అయినప్పటికీ బోధింప జాలను. కలి యుగంలో ప్రయోగ ఉప సంహరణాది అస్త్రవిద్యలేవీ బోధింప రాదన్న నియమమున్నది. మహనీయులు విధించిన నియమాలను ఉల్లంఘించి నీకు అస్త్ర విద్యలు బోధింప లేను. ఆపైన మారణాయుధములైన అస్త్రములను ప్రయోగించుటకు ఆ వ్యిద తెలిసిన ప్రత్యర్థి శత్రువుండాలి గాదా...,, లేరు. కావున విలయం సృష్టించే అస్త్ర విద్యల కోసం ఆశ పడకు నాయనా. వాటితో నీకు పని లేదు."

అశ్వత్థామ హితో పదేశం సమంజసం గానే తోచింది ధనుంజయునకు.

“చిత్తము స్వామీ. తమ అజ్ఞానువర్తిని. ఇక ముఖ్యముగా రెండు సంశయములు నాలో మిగిలి వున్నవి. మీరు సర్వజ్ఞులు. నా సంశయ నివృత్తి జేసిన ఇక మీ ఏకాంతమునకు భంగము కలిగించక నా మార్గమున బయలుదేరగలను” అన్నాడు.

అశ్వత్థామ ప్రసన్నంగా చూసాడు.

కొద్ది క్షణాలు కను మూసుకొని`

జ్ఞాన దృష్టిలో అవలోకించాడు.

“నీ సంశయము ఏమిటో గ్రహించితిని నాయనా” అన్నాడు.

“నిన్నటి సంధ్యా సమయమున ఒక అద్భుత సౌందర్య రాశిని గరుడ పక్షి నుండి కాపాడినావు. ఆమె అంతలోనే కనుమరుగైనది. ఆమె ఎవరన్నది నీ మొదటి సంశయము. అవునా?” కనులు తెరిచి చూస్తూ అడిగాడు.

“అవును స్వామీ.” అన్నాడు విభ్రాంతుడై చూస్తూ ధనుంజయుడు.

“ఆమెను రెండో సారి కూడ జూచినావు గదా.”

“లేదు స్వామీ.”

“బాగుగా జ్ఞప్తికి తెచ్చు కొనుము. సంపంగి సువాసనలు, పడగ విప్పి ఆడుతూ నిన్నే వీక్షించిన శ్వేత నాగు…”

“ఆ మాట నిజము స్వామీ. శ్వేత నాగును జూచితిని. కాని....”

“కాని గుర్తించ నైతివి. నీవు గాంచిన ఆ సుందరియే శ్వేత నాగు. ఆమె నాగ కన్య.”

“నాగ కన్యా....”

“అవును. అందుకే గరుడ పక్షి ఆమెను, ఆమె చెలికత్తెలను పట్టి భక్షింపనెంచి తరిమినది. ఆమె సాధారణ నాగ కన్య కాదు. ఆమె నామ ధేయము ఉలూచీశ్వరి. నాగ లోకమునకు నీవు ప్రవేశింపకుండా నిన్ను ఇక్కట్లపాలు చేస్తున్న నాగరాజు మహా పద్ముడి కుమార్తె ఈ ఉలూచీశ్వరి. నిను తనివి తీరా వీక్షింప నెంచి శ్వేత నాగుగా మారినది.”

అశ్వత్థామ చెప్పింది విని`

విస్మయం చెందాడు ధనుంజయుడు.

ఉలూచీశ్వరి ముగ్ధ మనోహర దివ్య రూపం మనసులో మెదులుతోంది. ఎంత పొరబాటు జరిగినది. అప్పుడే ఆమెను గుర్తించి పరిచయం చేసుకుంటే ఎంత బాగుండును. పాములతో మరో సమస్య ఎందుకని అప్పుడు తన దారిన వచ్చేసాడు. ఇప్పుడు కదా అసలు విషయం విశదమైనది. ఆమె దర్శన భాగ్యం తిరిగి లభిస్తుందో లేదో...

“చింతించకు నాయనా. ఆమె పరిచయం నీకు లభిస్తుందిలే.” మనసులో మాట గ్రహించినట్టు దరహాసంతో చెప్పాడు అశ్వత్థామ. తిరిగి తనే వివరించాడు.

“నీ రెండో సంశయము దివ్య నాగమణి గురించి. శ్రమ దమాదులకోర్చి నాగ లోకమును వెదుకుచూ బయలు దేరిన శ్రమ ఫలిస్తుందా! దివ్య నాగ మణిని తెచ్చి తండ్రిని కాపాడుకోగలవా లేదాని చింతింప పని లేదు నాయనా. కష్టే ఫలి అన్నారు. నీ శ్రమ వృధా పోదు. ఇంతకు మించి చెప్పవలసిన పని లేదు.”

“కృతజ్ఞుడను స్వామి. చివరిగా నేను సహ్యాద్రికి చేరు మార్గమును సూచించండి చాలును. నేను బయలుదేరు చున్నాను” అంటూ లేచాడు ధనుంజయుడు.

అశ్వత్థామ కూడ లేచి దగ్గర కొచ్చాడు.

ధనుంజయుని ముదమారజూస్తూ`

భుజాలమీద చేతులేసాడు.

“నిను జూడ నాటి అర్జునుడే కనుల ముందు సాక్షాత్కరించినట్టున్నది. గతము గురుతు చేస్తుంటివి నాయనా. రణ రంగమున శత్రువు గుండెలు అదిరేలా శంఖమును పూరించి గాండీవమును ఎక్కు పెట్టి ఇరు చేతులా శరము సంధించు గాండీవి ఆ వక్ర పరాక్రమం జ్ఞప్తి కొస్తున్నది నాయనా. యోగ కారకుడవు. చరిత్రను సృష్టిస్తావు. వెళ్ళి రమ్ము నాయనా.

ఇక్కడ నుండి ఉత్తర దిక్కుగా అయిదు యోజనాల దూరం వెళితే ఒక మహా పధాన్ని చేరుకుంటావు. నువ్వు రాజ మార్గన అటు ప్రయాణించి వుండవు. మీ రాజధాని రత్న గిరి నుండి బయలు దేరిన ఈ మహా పధం తీరం వెంట ఉత్తరంగా సాగి తర్వాత గతి మార్చుకొని చంపా పురం మీదుగా ఈశాన్యంగా వెళ్ళి సహాద్రి పర్వత శ్రేణిని చేరుకుంటుంది. అటనుండి సహ్యాద్రి నానుకొనే తూర్పుగా మాళవ రాజ్యం చేరి అక్కడి నుండి వింధ్యాటవి మీదుగా వింధ్య పర్వతాలను దాటి ఉత్తరంగా సాగుతుంది.

సహాద్రి శ్రేణిలో భీమ శంకరుడు వెసిన సహాద్రి శిఖరానికి భీమశంఖర శిఖరమని పేరు. రథచక్రాలను పోలి కొండలు వున్నందున రథాచలే అనీ అంటారు. అక్కడికి చేరుకోడానికి అటు చంపాపురం నుండి వస్తే ఒక మార్గం చీలి సహ్యాద్రి పర్వత శ్రేణి మీదుగా భీమ శంకర శిఖరానికి చేరుస్తుంది. మీ తండ్రి గారి వెంట సపరివారంగా నీవా మార్గాన గతంలో స్వామిని దర్శించి వుంటావు.

ఇప్పుడు నీవు చేరుకునే రాజ మార్గాన పశ్చిమంగా వెళ్ళితే రేపు సాయం కాలమునకు సహ్యాద్రి పర్వత శ్రేణిని చేరుకుంటావు. అక్కడ అంబాపురమని చిన్న గ్రామం వుంటుంది. రాత్రికి అక్కడ మజిలీ చేయుట మంచిది. అక్కడి నుండి భీమ శంకర శిఖరానికి

మరోమార్గం వుంది. రెండు దినములు పర్వత శ్రేణి మీది మార్గంలో ప్రయాణిస్తే గమ్యాన్ని చేరుకోగలవు’’ అంటూ వివరించాడు.

ఆ మాటలు శ్రద్ధగా విని గుర్తు పెట్టుకున్నాడు ధనుంజయుడు. అశ్వత్థామ చరణాలకు మరోసారి ప్రణమిల్లి అశీర్వచనం తీసుకుని బయలుదేరాడు. అతడ్ని సాగనంపుటకు మెట్ల మార్గం వరకు వచ్చాడు అశ్వత్థామ. చివరగా`

‘‘నాయనా ధనుంజయా. నీవు అడగకున్ననూ నీకు రెండు ముఖ్య విషయము తెలుపుచున్నాను. ప్రయాణమందు తారసిల్లిన నీ మిత్రుడు తిరిగి నిను చేరుకుంటాడు. జీవి తకాలం నీకు తోడుగా వుంటాడు. ఇక రెండవ విషయం ముఖ్యమైనది.

ఇది కలికాలం. స్వార్థపరులైన మానవులు కొందరు కుట్రలు కుతంత్రాలు సాగిస్తుంటారు. న్యాయ ధర్మాలు నీతి నియమాలకు తావుండదు. త్వరలోనే మీ రత్నగిరి ఒక మహా యుద్ధాన్ని చూడ బోతోంది. అప్రమత్తుడవై చరింపుము. విజయోస్తూ. పోయి రమ్ము నాయనా.’’ అంటూ దీవించాడు.

మరో సారి ప్రణమిల్లి`

చరచరా మెట్లు దిగి వచ్చేసాడు ధనుంజయుడు.

తన అశ్వాన్ని అధిరోహించాడు.

ఉత్తర దిక్కుగా పోనిస్తూ మెట్ల వైపు చూసాడు.

అప్పటికే సర్ప రూపంగా మారిన అశ్వత్థామ, తన అశ్రమంలోకి నిష్క్రమిస్తూ కన్పించాడు.

పొద్దు పడమట వాలుతోంది.

కళ్ళాలు బిగించి అశ్వాన్ని శరవేగంతో పరుగెత్తించాడు. అయితే చివరిగా అశ్వత్థామ చెప్పిన రెండు విషయాు పదే పదే గుర్తుకొస్తూనే వున్నాయి. ఒకటి సంతోషం కలిగించేదే. ప్రయాణంలో పరిచయమైన వాడంటే మిత్రుడు అపర్ణుడే. ఒక పూట పరిచయంలోనే మిత్రుడిగా తనకెంతో దగ్గరయ్యాడు. అతడు తిరిగి వస్తాడని జీవితకాలం తనతో వుంటాడంటే అంత కన్నా ఆనందం ఏముంటుంది? కాని... రత్నగిరి ఒక మహా యుద్ధాన్ని చూడబోతోందంటేనే ఆశ్చర్యంగాను మనసుకు వేదన గాను వుంది.

తన జనకుని పాలనలో రత్నగిరి ప్రజలు శాంతి సుభిక్షాలతో సుఖంగా వున్నారు. సైనిక పరంగా చాలా శక్తి వంతమైన రాజ్యం తమది. అలాంటి రత్నగిరి పై ముట్టడి జరిపేంత తెగువ, ధైర్యం గలిగిన శత్రురాజులు ఎవరున్నారు? అయితే`

ఒక్కటి మాత్రం నిజం. పరిస్థితులు శత్రువులకు అనుకూలంగా వున్నాయి. ప్రభువు పుట్ట వ్రణంతో శక్తి హీనుడై రాజ మందిరాన పాన్పుకు పరిమితమయ్యాడు. యువ రాజు రాజధానిలో లేడు. శత్రువులు ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మలుచుకునే అవకాశం లేక పోలేదు. ఆ శత్రువులు బయట వారా, అంతర్గతంగా వుంటూ వెన్ను పోటు పొడిచే వారాని తెలియాలి. ఏది ఏమైనప్పటికీ తను దివ్య నాగమణితో త్వరిత గతిని రాజధానికి చేరుకోవటం మంచిది. పరిస్థితులు విషమించ కూడదు.

ధనుంజయుని ఆలోచనలతో సంబంధం లేనట్టు అశ్వం గరుడ శర వేగంతో అడవిలో ఉత్తర దిక్కుగా దూసుకు పోతూనే వుంది.

***************************

భీమ శంకర క్షేత్రం.

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటగు ఈ క్షేత్రం గురించి శివ పురాణంలో వుంది. స్థల పురాణం కూడ అదే చెప్తుంది. భీమాసురుడనే రాక్షసుని సంహరించేందుకు శంకరుడు ఇక్కడ జ్యోతిర్లింగంగా ప్రకాశించాడు.

రావణ బ్రహ్మ సోదరుడైన కుంభ కర్ణునికి కర్కటి అనే రక్షసికి జన్మించిన వాడు భీమాసురుడు. అతడికి ఢాకిని, శాకిని అని ఇరువురు భార్యలు.

తన తండ్రి, పెదతండ్రులు, తాతలు, బంధు వర్గం అంతా రామరావణ యుద్ధంలో మరణించారని, శ్రీహరి అవతారమే

శ్రీరామచంద్రుడని తెలుసుకున్నాడు. శ్రీహరి మీద దేవతల మీద ప్రతీకారేచ్ఛతో అనేక సంవత్సరాలు బ్రహ్మను గూర్చి ఘోర తప్పసు చేసి అన్ని లోకాల్లోను తన కన్నా బలవంతుడు వుండ కూడదని వరం పొందుతాడు. ఆ వీర గర్వంతో దేవతలపైకి దండెత్తాడు. ముని వాటికను ధ్వంసం చేసాడు. పాతాళ రాజ దంపతుల్ని బంధించి చెరలో వుంచాడు. లోకాలను అల్లకల్లోలం చేసాడు.

అటు వంటి భీమాసురుని సంహరించేందుకు శంకరుడు సహ్యాద్రిపై జ్యోతిర్లింగంగా ఆవిర్భవించాడు. శివుని క్రోధానం భీమాసురుని భస్మం చేసింది. అంతే కాదు, అతడి అనుచర గణాల్ని కూడ దగ్ధం చేసి భస్మరాసులుగా చేసింది.

అప్పుడు భీమా సురుడి భార్యలయిన ఢాకినీ, శాకినీలు సదాశివుని శరణు వేడుకుని ఆయన కృపా కటాక్షంతో శేష జీవితాన్ని స్వామి సేవలో గడిపారు. ఆ విధంగా ఆ ప్రాంతం ఢాకినీ, శాకినీ వనంగా ప్రసిద్ధమై కాలక్రమంలో ఢాకినీ వనంగా స్థిర పడింది. ఇక బూదిద కుప్పలుగా మారిన రాక్షసుల దేహాల నుంచి ఎన్నో అరుదైన వనమూలికల నిచ్చే మొక్కలు, వృక్షాలు, తీగలు ఆవిర్భవించాయి. ఇది భీమ శంకరం జ్యోతిర్లింగమునకు సంబంధించిన పురాణ గాధ. దీనికి నిదర్శనంగా తర తరాలుగా ఆలయ ప్రాంతంలో అడవి నుండి అరుదైన వన మూలికల్ని తెచ్చి అమ్ముకునే ఆటవికులు ఆ ప్రాంతంలో కన్పిస్తారు. అయితే`

సహాద్రి పర్వత శ్రేణిని అనుకొని నాలుగు దిక్కులా వున్న అటవీ ప్రాంతాల్లో సింహ శార్ధులాది కౄర మృగాల సంచారం అధికంగా వుండేది. స్వామి దర్శనార్ధం వెళ్ళే భక్తుల మీద, రాజ మార్గన వెళ్ళే వాహనాల మీద అవి తరచూ దాడి చేసి ప్రాణ నష్టం కలిగించేవి.

రత్నగిరి తన ఏలుబడి లోకి రాగానే ప్రభువు ధర్మ తేజుడు ఈ క్షేత్రంపై దృష్టి పెట్టాడు. స్వామి దర్శనార్ధం వచ్చే భక్తులకు, యాత్రికులకు గాని ఇటు రాజ మార్గాన సాగే ప్రయాణికులకు గాని కౄర మృగాల బెడద లేకుండా సురక్షితంగా చేయటానికి ప్రతి ఆరు మాసములకు ఒకసారి సపరివారంగా ఈ ప్రాంతాలకు వేటకు వచ్చేవాడు. కౄరమృగాలను వేటాడి చంపే వారు. అంతే కాదు, ప్రతినెల డప్పు కొట్టి బాణా సంచా కాల్చి కౄరమృగాలను దూరంగా తరిమేందుకు ఢాకినీ అడవుల్లో నివశించే అట వికులకు బాధ్యత వప్పగించాడు. ఈ కారణాలచేత సహ్యాద్రి ప్రాంతాలు నిరపాయమయ్యాయి. కృం ారమృగాల సంచారం తగ్గి పోయింది. ధర్మ తేజుడు ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేసాడు. భక్తుల సౌకర్యార్థం ఎన్నో వసతి ఏర్పాట్లు చేసాడు.

అశ్వత్థామ వద్ద వీడ్కోలు తీసుకుని బయలుదేరిన యువరాజు ధనుంజయుడు మరునాడు సాయం కాలానికి తూర్పున సహ్యాద్రి పర్వత శ్రేణి ఆరంభ ప్రాంతం లోని అంబా పురం గ్రామం చేరుకున్నాడు.

రాత్రికి అంబా పురంలో విడిది చేసి, ఉదయం బయలు దేరి లోయలు, పర్వత సానువుల వెంట ప్రయాణం సాగించి మూడో రోజు

చీకటి పడుతూండగా సహ్యాద్రి మీది భీమ శంకరం పల్లెకు చేరుకున్నాడు.

ఇది స్వామి ఆలయానికి పక్కనే కాస్త దిగువున వుంది. అక్కడే యాత్రికుల సౌకర్యార్థం రాజ కుంటుంబం నిర్వహిస్తున్న అనేక గదులతో కూడిన పెద్ద విడిది గృహం వుంది. దాన్ని నిర్వహించు అధికారి అతడి మనుషులు ఎప్పుడూ అక్కడే వుంటారు. ఆ విడిది గృహం పక్కనే పల్లె వుంది. అక్కడ వేళ్ళ మీద లెక్కించగ గృహాలు మాత్రమే కన్పిస్తున్నాయి.

అక్కడ స్వామికి పూజ, అర్చనకు అవసరమైన పూలు పండ్లు సుగంధ ద్రవ్యాలు, పాలు వంటివి అర్చక స్వాములకు అందిస్తూ జీవిస్తున్న వారు కొందరు, అలాగే స్వామి దర్శనానికి వచ్చే యాత్రికుల కోసం ఆలయ ఆవరణలో పూలు, పండ్ల దుకాణాలు నిర్వహిస్తూ జీవించే వారింకొందరు. మరి కొందరు ఆయ ప్రాంతాల్లో పారిశధ్ధ్య పనులు నిర్వహిస్తుంటారు. ఇక మిగిలిన వారు ఆటవికులు సేకరించి తెచ్చే వనమూలికలను కొనుగోలు చేసి వాటి కోసం వచ్చే ఆయుర్వేద వైద్యులకు లాభానికి అమ్ముకొని జీవన యాత్ర సాగిస్తున్నారు. ఆ విధంగా భీమ శంకరం పల్లె వాసులు ఈ భీమశంకర క్షేత్రం మీద ఆధార పడి బ్రతుకుతున్నారు.

పోతే గతంలో`

రాజ పరివారంతో తన తండ్రి ధర్మతేజ మహారాజు, తల్లి మహారాణి కనకాంబిక వెంట ధనుంజయుడు చాలా సార్లు ఈ క్షేత్రానికి విచ్చేసి వున్నాడు. అలాగే తండ్రి వెంట ఢాకినీ అరణ్య ప్రాంతాల్లో వేటకూ వచ్చాడు. కాబట్టి ఇక్కడ చాలా మంది తనను గుర్తు పట్టే అవకాశం వుంది. ఒంటరిగా వస్తున్న తనకిప్పుడు ఇక్కడ ఎలాంటి హడావుడి ఆర్భాటాలు ఇష్టంలేదు. అందుకే ఎవరూ తనను చప్పున గుర్తించకుండా వుండేందుకు సగం ముఖాన్ని కప్పుతూ తెల్లని వస్త్ర భాగాన్ని కట్టుకున్నాడు.

అయినప్పటికీ`

కను చీకటి పడుతుండగా వచ్చి సత్రం ముందు అశ్వం దిగిన ధనుంజయుని చూడగానే గుర్తించిన అక్కడి అధికారి భయ భక్తులతో సాష్టాంగ పడి పోయాడు.

‘‘చూడు! నేనిప్పుడు ఒంటిగానే వచ్చినాను. ఎలాంటి రాచ మర్యాదలు అక్కర లేదు. నా రాకను రహస్యము గనే వుంచుము. అర్చక స్వాములకును తెలియ పరుచ వలదు. ఉదయం నేను మాట్లాడెదను. స్వామిని దర్శించి ఎల్లుండి ఉదయం వెళ్ళి పోయెదను గాక. నాకో ప్రత్యేక మగు గదిని ఏర్పాటు చేయించుము’’ అంటూ ఆజ్ఞాపించాడు ధనుంజయుడు.

క్షణాల్లో ఏర్పాట్లు జరిగి పోయాయి.

అశ్వ సంరక్షణకు దాన్ని అశ్వశాలకు తీసుకుపోయారు సేవకులు. అశ్వం మీది తోలు సంచులు, ఆయుధాలు అన్నీ గదిలోకి చేర్చబడ్డాయి. సుమారు పది దినముల పిమ్మట అలుపు తీరా వేడి నీట స్నానమాచరించి కడుపార మృష్టాన్న భోజనం ఆరగించాడు ధనుంజయుడు. అలసిపోయిన శరీరం గావటంతో పాన్పు మీద నడుం వాల్చగానే వెంటనే గాఢ నిద్రా వశుడయ్యాడు.

******************************

మరునాడు ఉదయం.

సూర్యోదయానికి ముందే లేవాలనుకున్నాడు గాని, సూర్యోదయమైన పిమ్మట గాని లేవ లేక పోయాడు యువరాజు ధనుంజయుడు.

కాలకృత్యాలు తీర్చుకుని భీమ శంకరుని దర్శనార్థం బయలు దేరాడు. ఎవరూ గుర్తించ కుండా సగం ముఖాన్ని కప్పుతూ తెల్లని వస్త్ర భాగాని చుట్టుకున్నాడు. సత్రం నుండి ఒక సేవకుని వెంట తీసుకెళ్ళాడు.

భీమ శంకర క్షేత్రం వెనక తట్టునే అర్చక స్వామి నివాస గృహాలున్నాయి. ఆలయం తూర్పు గోపురం ఎదురుగా విశాలమైన ప్రాంగణంలో చెట్లక్రింద పూలు, పండ్లు ఇతర అంగడులు వున్నాయి. ఆలయం సమీపంలోనే భీమకుండ్ అనే కోనేరు వుంది. నాలుగు పక్కలా రాతి మెట్ల నిర్మాణం వుంది. పాతిక మెట్లు దిగి ఆ సహజ జలాశయంలో పుణ్య తీర్థ మాచరించి స్వామి దర్శనానికి వెళతారు.

ఆ రోజు సోమవారం గావటంతో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు వుంటాయి. నిన్న రాత్రికే ఇక్కడికి చేరుకున్న భక్తులు ఉదయమే వచ్చి కొందరు పుణ్యస్నానాలు ఆచరిస్తుంటే, స్నానం చేసిన వారు దేవుని దర్శనానికి పోతున్నారు. అంగళ్ళ వద్దను, చెట్ల కిందను భక్తులు కన్పిస్తున్నారు.

ఏవీ పట్టించుకోకుండా సేవకునితో నేరుగా కోనేటి వద్దకు చేరుకున్నాడు యువరాజు ధనుంజయుడు. ఉదయపు చలి చలి గాలులతో ఆహ్లాద భరితంగా వుంది వాతావరణం. అక్కడి నుండి చూస్తుంటే తూర్పు పశ్చిమ దిక్కులకు వరుస తీరిన సహ్యాద్రి పర్వత శ్రేణులు, చుట్టూ డాకిని అరణ్యాల సోయగం కనువిందు చేస్తోంది. అంత వరకూ తూర్పు ఆకాశంలో ప్రకాశిస్తున్న ప్రభాకరుని చిన్న మబ్బు తెర ఒకటి మూసి వేసింది.

రాతి మెట్లు రెండు దిగిన ధనుంజయుడు.

ఉన్నట్టుండి ఆగిపోయాడు.

తనను ఎవరో గమనిస్తున్నారన్న భావ వీచిక ఒకటి ఎందుకో గుండెల్ని తాకింది. చాలా నిశితంగా గమనిస్తున్నారు. ఎవరై వుంటారు?




ఓసారి చుట్టూ అవలోకించాడు.

ఎవరి పనులు వారు చూసుకుంటున్నారు. వారిలో కొందరు యధాలాపంగా తనను చూస్తున్నారు, వాళ్ళుకాదు. ఇంకెవరో...

ఎవరది? తలతిప్పి కోనేటి వంక చూసాడు. అంతే`

కొద్దిక్షణాలు గుండె కొట్టుకోవటం ఆగి పోయిందనిపించింది. ఊపిరి తీసుకోవటం మర్చిపోయాడు. దిగువన`

నీటి వంచ నుండి పైకి మూడో మెట్టు మీద నిలబడుందామె. నిండా రెండు పదుల వయసు కూడ వుండని లేబ్రాయపు ముగ్ధ. అసాధారణ రూప లావణ్యవతి. విప్పారిన సోగ కళ్ళతో తన వంకే నిశితంగా చూస్తోంది. ఆమె ముఖారవిందంలో ఇదీ అని తెలియని ఆశ్చర్యం తొంగి చూస్తోంది. అప్పటికే ఆమె స్నానం ముగించి దుస్తులు మార్చుకున్నట్టుంది. రంగు రంగుల హరివిల్లు లాంటి దుస్తుల్లో చంద్ర వంకలా మెరిసి పోతుంది. ఆమెకు రెండు మెట్లు దిగువన ఒక బామ్మ వుంది. ఆమె తడి దుస్తుల్ని నీటిలో పిండుతోంది. వాళ్ళిద్దరే వచ్చినట్టున్నారు. ఇంకెవరూ లేరు పక్కన. అది కూడ కాదు`

తను ఆమెను చూసాడు. ఇంతకు ముందు ఎక్కడో చూసాడు. కాని ఎక్కడో ఎప్పుడో గుర్తు రావటం లేదు. కాని ఆ ముఖం... అవును. ఆ ముఖ వర్చస్సు చూస్తుంటే మిత్రుడు అపర్ణుడు గుర్తుకొస్తున్నాడు. ఈమె అపర్ణుడి సోదరి కాదు గదా!

ధనుంజయుడు ఆశ్చర్యం నుండి తేరుకునే లోపే ఆమె ముఖం తిప్పుకుని తన బామ్మతో ఏదో చెప్పి బయుదేరింది. చక చకా మెట్లెక్కి పైకి వస్తూ ఓర కంట ధనుంజయుని గమనిస్తూనే వుంది. పెదవుల మీద చిరు నవ్వు, బుగ్గల్లో సిగ్గు దాచుకొంటూ అతడి సమీపం నుంచే పైకి వచ్చి బిరబిరా ఆలయం వైపు వెళ్ళి పోసాగింది. అంత వరకూ ధనుంజయునే గమనిస్తున్న సేవకుడు ఉండ బట్టలేక`

"వాళ్ళనంతగా చూస్తున్నారు. ఏమైనది ప్రభూ?" అనడిగాడు.

"ఏమిరా. వాళ్ళు నీకు తెలుసునా?" వెళ్తున్న ఆ అందాల రాశినే చూస్తూ అడిగాడు ధనుంజయుడు.

"తెలుసు ప్రభు. ఆ బామ్మ పేరు నీలవేణి. ఇక్కడే నివశిస్తున్నది. చాలాకాలంగా ఉంటున్నది. వన మూలికలు కొనటం విక్రయించటం ద్వారా బాగానే సంపాదిస్తున్నది. ఆ వెళ్తున్న అమ్మాయి పేరు భద్రాదేవి."

"భద్రాదేవి?"

“అవును ప్రభూ. భద్రాదేవి ఇక్కడివారందరికీ తెలుసును.”

“ఆ యువతికి అన్నదమ్ములు ఎవరన్నా వుంటిరా?”

“నాకు తెలిసి ఎవరూ లేరు ప్రభు. ఈ అమ్మాయి కూడ ఇక్కడ వుండదు. చంపాపురం దగ్గరలో ఏదో వూరట. అక్కడ తన పిన్నమ్మ వద్ద వుంటుందని వింటిని. అప్పుడప్పుడూ యిలా బామ్మ నీలవేణిని చూచుటకు వచ్చి పోతూ వుంటుంది.”

సేవకుడి మాటలు ఒకింత ఆలోచనలో పడేసాయి యువరాజు ధనుంజయుడ్ని. కళ్ళ ముందు అపర్ణుడు మెదలుతున్నాడు. ఇప్పుడే గాంచిన భద్రాదేవి మెదలుతోంది. అపర్ణుడిలో బాలిక లక్షణాలు గమనించి తను పరిహసించినాడు కూడ. కాని పోలికల్లో సామ్యమున్న ఒకరే అనుకోడానికి పొంతన కుదరకున్నది. ఇరువురూ ఒకరేనా లేక వేరు వేరా... ఈ యువతి అపర్ణుడే అయితే తనను చూచి కూడ చూడనటు వెళ్ళగలడా? అయిననూ రక్త సంబంధం లేని ఇరువురు యువతీ యువకులందు ఒకే పోలికలుండుట సాధ్యమా... ఏమో... ధనుంజయుని మనసంతా గందరగోళమై పోయింది. చివరకు తన సందేహాలను బలవంతాన పక్కకు తోసి ఒక సారి స్వామి ఆలయ గోపురాన్ని వీక్షించాడు.

“హే ప్రభూ భీమ శంకరా. ఏమిటి స్వామీ నాకీ పరీక్ష. నా చంచల చిత్తమున నా అధీన మందుంచుకొను శక్తిని ప్రసాదించు. దీక్షా బద్ధుడనై దివ్య నాగమణి కోసం నాగ లోకమునకు బయలు దేరిన నాకు మార్గము చూపి విజయాన్ని అనుగ్రహింపుము.” అంటూ మనసు లోనే వేడుకున్నాడు.

ఒక సారి వెళ్ళి బామ్మతో మాట్లాడమని మనసు ఒత్తిడి చేసింది. అయినా కూడ` అనవసరమగు వ్యవహారమని వెళ్ళలేదు. ఈలోపల చూస్తుండగానే బామ్మ గారు కూడ పిండిన తడి దుస్తుల్ని భుజాన వేసుకుని మెట్లెక్కి తన దారిన వెళ్ళి పోయింది.

ఇక ఆలస్యం చేయలేదు ధనుంజయుడు.

చక చకా మెట్లు దిగాడు.

కొనేటి లోకి దూకి మూడు మునకలు వేసి తలార స్నానమాచరించాడు. మెట్ల పైకి వచ్చి పొడి దుస్తులు ధరించి తడి దుస్తుల్ని పిండి సేవకుడి చేతికి అందించి, విడిది గృహానికి పంపించేసాడు. తను స్వామి దర్శనానికి బయలుదేరాడు.

సగం ముఖానికి అడ్డంగా తెల్లటి వస్త్ర భాగం చుట్టు కోవటం, వెంట పరివారం లేక పోవటంతో స్థానికులెవరూ అతన్ని యువరాజుగా గుర్తించ లేదు. ఒక అంగడిలో పూలు, పండ్లు, టెంకాయి, పూజ ద్రవ్యాలతో కూడిన చిన్న బుట్ట తీసుకుని ఆలయంలోకి బయలుదేరాడు. అతడు గోపురం వైపు నడిచి పోతూండగా ఆరుజతల కళ్ళు తననే నిశితంగా పరిశీలిస్తున్న సంగతి ధనుంజయునికి తెలీదు.

గోపుర ద్వారం దాట గానే ఏటవాలుగా దిగువకు రాతి మెట్ల వరుస వుంది. వంద మెట్లు దిగితే గాని గర్భాలయ ప్రాంగణం లోకి అడుగు పెట్ట లేరు. చెదురు మదురుగా భక్తు వెళ్ళే వాళ్ళు వెళ్తున్నారు. వచ్చే వాళ్ళు వస్తున్నారు. నాలుగు మెట్లు దిగాడో లేదో` అంతే`

మరొక్క మారు విభ్రాంతికి గురయ్యాడు యువరాజు ధనుంజయుడు. అప్పటికే స్వామిని దర్శించి వెను తిరిగినట్టుంది అందాల భరిణి భద్రాదేవి. లేడిపిల్లలా చెంగు చెంగున మెట్ల మీద దూకుతూ ఎదురుగా వస్తూ కన్పించింది. కొద్ది సేపు మైమరచి పోయి అలా చూస్తుండి పోయాడు. పరిమళ భరితమగు వసంతపు సుడిగాలి ఒకటి తనను చుట్టేసి పోతున్నట్టనిపించింది. ఈసారి కూడ అతన్ని చూసి చూడనట్టే చకచకా మెట్లెక్కి గోపుర ద్వారం దాటి క్షణంలో కనుమరుగైందామె.

ఆమె వెళ్ళిన వైపే చూస్తూ కాసేపు అక్కడే ఆగి పోయాడు. భద్రా దేవి సౌందర్యం కన్నా ఆమెలో కన్పిస్తున్న అపర్ణుడి పోలికలే యువరాజుని చిత్త భ్రమకు గురి చేసి ఆశ్చర్య చకితుడ్ని చేస్తున్నాయి. అంత లోనే మనసును దృఢ పర్చుకుంటూ ఆ దివ్య సుందర రూపాన్ని మనసు నుంచి చెరిపేసాడు. తాత్కాలికంగా ఆమెను మర్చిపోతూ, చిత్తమును భీమశంకరుని మీద లగ్నం చేసి తిరిగి మెట్లు దిగడం ఆరంభించాడు.

''హర హర మహాదేవ ` శంభో శంకర'' అంటూ భక్తు నినాదాలు ఆలయ గంటల జయఘోష తనువును మనసును పనుకింజేస్తున్నాయి. భక్తి భావాన్ని రెట్టింపు చేస్తున్నాయి.

ఆలయ ప్రధాన అర్చక స్వామి పేరు శివ దాసు.

ఎందుకో ఆయన బయటకు వస్తూ మండపం వద్ద ఎదురయ్యాడు. వృద్ధుడైనప్పటికీ చూడగానే యువరాజు ధనుంజయుని గుర్తు పట్టేసాడు. వెంట రాచ పరివారం లేదు. ఆర్భాటం లేదు. ఒక సాధారణ భక్తుడిలా నడుచుకుంటూ వస్తున్న ధనుంజయుని గాంచి విస్తు పోయాడు. ధనుంజయుడు క్లుప్తంగా తను వచ్చిన పని చెప్పాడు. వెంటనే అతడి చేతిలోని పూలు, పండ్ల బుట్టను తను అందుకొని అతన్ని వెంట బెట్టుకొని గర్భ గుడి లోకి వెను తిరిగాడాయన.

పిమ్మట చకచకా ఆలయంలో పరిస్థితి మారి పోయింది. యువరాజు వేంచేసిన విషయం చెప్పకుండానే భక్తుల్ని గర్భ గుడి నుండి బయటికి పంపించేసారు ఆలయ సిబ్బంది. అర్ధ జాము వరకు దర్శనం నిలిపి వేస్తున్నట్టు ప్రకటించారు. ధనుంజయుని భీమ శంకర స్వామి ఎదురుగా కూచుండ జేసి ప్రత్యేక పూజలు ఆరంభించారు పూజారులు. ప్రభువు ధర్మ తేజుని ఆరోగ్యం కొరకు, ధనుంజయుని విజయం కొరకు స్వామికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

భీమ శంకరుని సన్నిధిలో జ్యోతిర్లింగాన్ని దర్శిస్తూ అలౌకికానందంలో అలాగే ఎదురుగా కూచున్నాడు ధనుంజయుడు. దరహాసంతో స్వామి తనను ఆశీర్వదిస్తున్నట్టుంది. భక్తితో స్వామికి ప్రణమిల్లాడు. ఆవిధంగా భీమ శంకరుని ఆశీస్సులు తీసుకుని ధనుంజయుడు బయటికి నడిచాకే తిరిగి భక్తుల్ని దైవ దర్శనానికి అనుమతించారు.

తనను తోసుకు వెళ్తున్న భక్తుల్ని కూడ పట్టించు కోకుండా మండపం దాటి మెట్ల మార్గంలో పైకి వచ్చేసాడు యువరాజు ధనుంజయుడు. గోపుర ద్వారం దాటాడు. ప్రభాకరుని మరి కొన్ని నల్ల మబ్బులు చేరి తమలో దాచేసు కోవటంతో ఆ రోజు ఎండ తెలిటం లేదు. కాని ఇప్పుడిప్పుడే గాలి వేడెక్కుతోంది.

గోపుర ద్వారం దాటి ఇలా బయటికి వచ్చాడో లేదో అలా మరో సంఘటన ధనుంజయుని ఉక్కిరి బిక్కిరి చేసి ఆశ్చర్య సంభ్రమాల్లో ముంచెత్తింది. ఎంత మాత్రం వూహించని సంఘటన. ఎదురుగా మిత్రుడు అపర్ణుడు వస్తూ కన్పించటమే అందుక్కారణం. కాళ్ళకు బంధం వేసినట్టు ఉన్న చోటే నిలబడిపోయాడు.

అంతలో సమీపం లోకి వచ్చిన అపర్ణుడు ధనుంజయుని చూసి గుర్తించి విస్మయం చెందుతూ ఎదురుగా వచ్చి నిలబడ్డాడు. వూహించని విధంగా అపర్ణుడి రాకతో ఇప్పుడు తను గాంచిన భద్రా దేవి పోలికల్ని అపర్ణుడిలో వెదు క్కోవలసి వచ్చింది. అందుకే చెంత కొచ్చిన అపర్ణుడిని పలకరించ లేదు. అచ్చు గుద్దినట్టున్న ఇరువురి పోలికలు. ఎంతగా ఆశ్చర్యమంటే తన సగం ముఖాన్ని కప్పి వుంచిన వస్త్ర భాగం జారి పోవటం కూడ ధనుంజయుడు గమనించ లేదు.

‘‘ప్రభూ! మీరేమిటి ఇచట నున్నారు? ఎప్పుడు వచ్చినారు? మీరు మాళవ రాజ్యం వైపు పోలేదా?’’ తనూ ఆశ్చర్యం నుండి తేరుకుంటూ అడిగాడు అపర్ణుడు.

‘‘అదో పెద్ద గాథ. పిమ్మట తెలిపెదను గాని. నీవేమి యిక్కడ వుంటివి. ఎప్పుడు వచ్చినావు? చంపా పురం పోలేదా? ఎలా వున్నావు?’’ అంటూ ఆదరంగా చేయి అందుకున్నాడు. ఆ చేయి మృదువుగా కుసుమకోమల సదృశంగా వుంది. వెంటనే చేయి వెనక్కి తీసుకున్నాడు అపర్ణుడు.

“చూస్తున్నారుగా ప్రభూ! నేను కుశలము గానే వుంటిని. చంపాపురం నుండి ఇటకు మూడు దినముల క్రితమే వచ్చినాను. కాని మీరు భీమ శంకరము వచ్చుట కడు ఆశ్చర్య జనకము. నమ్మలేకున్నాను.”

“ఆ దినమే చెప్పినావుగా. మన స్నేహములో బలమున్నచో తిరిగి కలుసుకొనెదమని. బలమున్నది మిత్రమా. అందుకే కలిసితిమి. నిను జూడ చాలా ఆనందముగనున్నది. నిన్న రాత్రి ఇచటికి వచ్చి విడిది గృహమున బస చేసితి. అన్నిటికి మించి ఇచట గొప్ప విచిత్రమును జూచినాను.”

“విచిత్రమా...?”

“అవును విచిత్రమే! ఎవరో భద్రా దేవియట. అన్ని విధములా నీ పోలికన నీ సోదరి వలె యున్నది....”

“ఏదీ... ఆ నీలవేణి బామ్మ గారి మనుమరాలా... తెలుసులే”

“తెలుసునా?”

“అవును ప్రభూ! తరచు స్వామి దర్శనార్థం వచ్చిపోతూంటాను గదా. అందుకే ఇచట చాలా మంది మీ యిద్దరూ కవల పిల్లలాయని నను అడుగుతుంటారు. నిజమునకు ఆమెకు నాకు ఏ సంబంధమును లేదు...”

“నిజము గనే లేదా?”

“లేదంటిని గదా....”

ఏదో చెప్పబోతూ మధ్యలోనే ఆగి పోయాడు అపర్ణుడు. కనుకొసల ఏదో కదలిక . అదిరి పడి` “ప్రభూ!” అంటూ చట్టున

ధనుంజయుని కరము పట్టి పక్కకు లాగాడు. అలా లాగడమే ఆ క్షణమున యువరాజు ప్రాణముకు శ్రీరామ రక్ష అయింది. అతని గుండెల్లో నాటుకోవలసిన పిడి బాకు ఒకటి గాలిని చీల్చుకొంటూ తుమ్మెదలా ఝుంకారం చేస్తూ సూటిగా దూసుకెళ్ళి గోపురం చెక్క తలుపునకు నాటుకొంది.

ధనుంజయుని తృటిలో ప్రాణాపాయం నుండి రక్షించడంతో ఆగ లేదు అపర్ణుడు. మరు క్షణమే అతడి చేతి నుండి వెలువడిన పిడి బాకు రివ్వున దూసు కెళ్ళి హత్యా ప్రయత్నానికి కారకుడైన వాడి గుండెల్లో పిడి వరకు దిగబడింది.

తప్పించుకునే అవకాశం లేక పోయింది వాడికి. కెవ్వున అరిచాడు. అపర్ణుడినే ఆశ్చర్యంగా చూస్తూ అలాగే నేలకు ఒరిగి పోయాడు. చూస్తుండగానే ఎగిరి పోయాయి వాడి ప్రాణాలు. వేడి రుధిరం వాడి ఛాతీ నుండి వరదలా పొంగింది. ధనుంజయుడికి ఏమి జరుగుతోందో అర్థం కాలేదు. అతడి చేయి అప్రయత్నంగా తన ఖడ్గం పిడి మీద పడింది. కాని ఖడ్గం ఒర నుంచి తీయాల్సిన అవసరం లేక పోయింది. ఎందు కంటే పిడి బాకు విసిరి ఒకడ్ని నేల కూర్చిన క్షణం లోనే అపర్ణుడు తన ఖడ్గం దూసి చిరుత గండులా ప్రత్యర్థు పైకి దూసుకు పోయాడు.

గోపురం నుండి ఇరవై ధనువుల దూరంలో ఒక చెట్టు క్రింద నిలబడున్నారు వాళ్ళంతా. మొత్తం అయిదుగురు. చూడ్డానికి కాషాయ దుస్తుల్లో సాధు సన్యాసుల్లా వున్నారు. వాళ్ళలో ఒకడు నేలకూలగా ఇంకా నలుగురున్నారు.

వాళ్ళందరికీ వూహించని పరిస్థితి యిది. తప్పించుకోడానికో, పారి పోడానికో అవకాశం లేదు. యువ రాజు కత్తి దూసి కదన రంగంలోకి దూకితే ఏం జరుగుతుందో అందరికీ తెలుసు. ఈ బాలకుడు ఎవడో సమయానికి పానకంలో పుడకలా అడ్డు పడకుంటే ఈపాటికి యువరాజు నేలకూలి వుండేవాడు. క్షణకాలం ఏం చేయాలో తోచ లేదు వాళ్ళకి. సుడి గాలిలా వచ్చి పడుతున్న అపర్ణుడిని చూస్తూ తమ కాషాయ దుస్తుల మాటు నుండి ఖడ్గాలను బయటకు తీసి పోరుకు సిద్ధమయ్యారు.

ఈలోపల గోపురం ఆవరణలో చావు కేక విని పరిసరాల్లోని భక్తులంతా ఒక్క సారిగా ఉలికిపడ్డారు. ‘‘యువరాజా వారు… యువరాజా వారు’’ అంటూ గుసగుసలు చెల రేగాయి. ముఖానికి ఆచ్ఛాదన తొలగటంతో అతడ్ని అక్కడ పౌరులు చాలా మంది గుర్తు పట్టేసారు. ఏం జరుగుతోందో తెలిక అయోమయంగా దూరంగా నిలబడి చూస్తున్నారు.

‘‘రేయ్ ద్రోహుల్లారా’’ అనరిచాడు సాధువుల్ని సమీపిస్తూనే అపర్ణుడు.

‘‘యువరాజా వారిని ఎదిరించు ధైర్యము లేక ఆదాటుగా దొంగ దెబ్బ తీయాలని చూస్తార్రా? లొంగి పొండు… వెంటనే లొంగి పోకున్న

మీకు వీడి గతే పడుతుంది'' అంటూ ఆవేశంగా హెచ్చరించాడు.

''ఒరే కుర్ర కుంకా. మేం లొంగి పోయిననూ చచ్చెదము. లొంగ కున్నను చచ్చెదము. యువ రాజు ఎలాగూ మమ్మల్ని క్షమింపడు'' కత్తి ఝుళిపిస్తూ అరిచాడొకడు.




''అవును. మా ప్రయత్నమునకు అడ్డుపడిన నిన్ను చంపిన తర్వాతనే యువరాజు చేతిలో హతమవుతాము. నిన్ను జంపిన తృప్తి అయినా మాకు మిగుగాక'' అన్నాడు మరొకడు.

మాటల్ని బట్టి వాళ్ళు లొంగరని అర్థంకాగానే ఖడ్గాన్ని ఝుళిపిస్తూ వాళ్ళ మధ్యకు దూకాడు అపర్ణుడు. వాళ్ళు నుగురూ నాుగు ప్రక్కలా అతడ్ని క్రమ్ముకున్నారు. దారుణమైన పోరాటం ఆరంభమైంది.

కత్తు కణేల్ కణేల్ మని మ్రోగుతున్నాయి. అపర్ణుడి హుంకరింపు ప్రత్యర్థు అరుపులతో గోపుర ప్రాంగణం హోరెత్తిపోతోంది. బొంగరంలా తిరుగుతూ పెద్దపులిలా దూకుతూ భీకరంగా పోరాడుతున్నాడు అపర్ణుడు. అతడి అరుపు చిరుతపులి ఘర్జనలా వున్నాయి. అతడి చేతిలో ఖడ్గం కంటికి కన్పించనంత వేగంగా తిరుగుతోంది. కుర్రకుంక అని తేలిగ్గా తీసుకున్న ప్రత్యర్థుకు క్షణాల్లో చెమటు పుట్టించాడు అపర్ణుడు.

పోరాటం ఆరంభమైన రెండో క్షణంలోనే అపర్ణుడికి సాయంగా తానూ వెళ్ళాలనుకున్నాడు ధనుంజయుడు. కాని, అపర్ణుడి ఖడ్గ చాలనం, పోరాడే తీరు, ఆ వేగం గమనించగానే అతడికి తన సాయం అక్కర లేదనిపించింది.

మీసాలు కూడ రాని ఈ కుర్రాడికి ఏవో కొన్ని మంత్రాలు మాత్రమే వచ్చు. ఖడ్గాన్ని అలంకార ప్రాయంగా, ఆత్మ రక్షణకే నడుంకి వుంచుకున్నాడనుకున్నాడు. కాని చూస్తుంటే ఇప్పుడర్థమవుతోంది. అతడు అసాధారణ వీరుడని. యుద్ధ విద్యల్లో ఆరి తేరిన యోధుడని. అపర్ణుడి యుద్ధ కౌశలానికి ముగ్ధుడవుతూ సమీపం లోకి పోయి వేడుక చూడనారంభించాడు.

జరుగుతున్న రణ క్రీడకు పద ఘట్టన నుండి నేల మీది ఎర్ర మన్ను సుడి గాలిలా లేస్తోంది. రెప్ప వాల్చటం మర్చి పోయి ఉత్కంఠ భరితులై చూస్తున్నారంతా. రెండు పదు కూడ దాటని యువకుడు నలుగురు వీరుల్ని ఎదిరించటం సాధారణ విషయం కాదు. అలాంటి అపర్ణుడు ప్రత్యర్థులతో యుద్ధం చేస్తున్నట్టు లేదు, ఆడుకొంటున్నట్టుంది. పోరాటం ఆరంభమైన అయిదో నిమిషంలోనే ఒకడి తర్వాత ఒకడు ఇద్దరి శిరస్సు తెగి పుచ్చకాయల్లా నేల మీద దొర్లాయి. మరో మూడు నిమిషాలకు మిగిలిన యిద్దరి శిరస్సులను కూడ నిర్దాక్షణ్యంగా తెగేసాడు అపర్ణుడు. ఇంత పోరాటం సాగినా అపర్ణుడి తలపాగా చెక్కు చెదరక పోవటం యువరాజునే కాదు, చూస్తున్న అందర్నీ ఆశ్చర్య పరిచింది. నేల మీద అయిదు శవాలు నెత్తుటి మడుగులో పడున్నాయి. అపర్ణుడు వాళ్ళని అంతం చేయటంతో ఆగలేదు. వీరావేశంతో అక్కడే శవాల మధ్య నిలబడి చుట్టూ పరీక్షిస్తున్నాడు. అప్పుడే`

''మిత్రమా... ఏమైనది? నీ చేతిలో అందరూ హతమైనారుగా.'' అంటూ ముందుకొచ్చాడు ధనుంజయడు.

''లేదు ప్రభు. హత్యా ప్రయత్నమున ప్రత్యక్షంగా పాల్గొనిన వారు అయిదుగురే. కాని పరోక్షంగా ఆరో వాడు ఇక్కడే వుంటాడు. వాడు వెనక్కి వెళ్ళి జరిగినది చెప్ప రాదు... వాడ్ని పట్టుకున్న చాలు. వీళ్ళ వెనకనున్నవాడు ఆ ద్రోహి ఎవడో తెలియగలదు'' అన్నాడు.

అపర్ణుడి సూక్ష్మబుద్ధికి, సమస్య పట్ల నిశిత పరిశీలనకి నివ్వెర పోయాడు ధనుంజయుడు. నిజమే! తనను అంతం చేయమని వీళ్ళను పంపించిన ద్రోహికి ఇక్కడ ఏమి జరిగినదో తెలికూడదు. తెలిసినచో మరో ప్రయత్నం చేస్తాడు. సందేహంతో తనూ చుట్టూ వున్న పౌర జనాల్ని పరిశీలించ నారంభించాడు. అంతలో`

ఒక గుంపు వెనక సాధారణ దుస్తుల్లో నిలబడిన బుర్ర మీసాల వ్యక్తి ఒకడు నెమ్మది నెమ్మదిగా వెనక్కి జరగటం యువరాజు కంట బడింది. వెంటనే బిర బిరా అటు అడుగులేసాడు. అది చూసి కంగారు పడి పారి పోవడానికి వెనక్కి తిరిగాడు. ''ఆగిపో... అక్కడే ఆగి పొమ్ము'' అంటూ అరిచాడు ధనుంజయుడు.

కాని ఆగి పట్టు బడే ఉద్దేశం వాడికి లేదు. తనను పట్టబోయిన కొందరు పౌరుల్ని విదిల్చి కొట్టి కత్తి దూసాడు. ప్రాణ భయంతో పరుగు ఆరంభించాడు. వాడ్ని వదులుకునే ఉద్దేశ్యం అపర్ణుడికి లేదు. వెంటనే చురిక తీసి పారి పోతున్న వాడ్ని గాయపర్చే ఉద్దేశంతో తొడ భాగానికి గురి చేసి విసిరాడు. అతడి గురి తప్పదు. శర వేగంగా దూసుకెళ్ళి వాడి తొడలో పిడి వరకు దిగబడింది. అంతే`|

ప్రాణం పోతున్నంత బాధతో విలవిల్లాడుతూ గింగిరాలు తిరిగి నేల మీద పడి పోయాడు. వాడు ప్రాణాలతో చిక్కటం అవసరం. అపర్ణుడు, ధనుంజయుడు వాడి వద్దకు పరుగెత్తారు. కాని ఆలస్యమై పోయింది. కింద పడగానే ఇక ప్రాణాలు మీద ఆశ వదులుకున్న వాడు. దుస్తుల్లోంచి ఒక విషపు గుళిక తీసి మ్రింగేసాడు. క్షణాల్లో ప్రాణం తీసుకున్నాడు. తమ ప్రయత్నం విఫలమైనందుకు కోపంతో మండి పడుతూ అపర్ణుడు` ‘‘ఛ... చచ్చి తప్పించు కొంటివి గదరా కుక్క!’’ అంటూ కసితో శవాన్ని బలంగా తన్నాడు.

అది చూసి నవ్వాడు ధనుంజయుడు.

‘‘మిత్రమా! చచ్చిన వాడ్ని ఏమి చేయ గలములే. ఇక విడు’’ అన్నాడు.

ఇంతలో`బయటి పరిస్థితి తెలిసినట్టుంది.ఆలయ ప్రధాన అర్చక స్వామి శివ దాసు, ఆలయ సిబ్బంది కొంత మందిని వెంట బెట్టుకుని బిర బిరా అక్కడికి చేరుకున్నాడు.

‘‘యువరాజా! తమరు క్షేమమే గదా. తమ కేమియు ప్రమాదము ఘటిల్ల లేదు గదా?’’ అనడిగాడు గాభరా పడుతూ.

‘‘నేను క్షేమమే స్వామి. చింతిల్ల పని లేదు’’ అన్నాడు ధనుంజయుడు.

‘‘అంతలో ఆ భీమ శంకరుని కరుణా కటాక్షము. మీరిచటనుండుట ఇక క్షేమ కరం కాదనుకొందును. మీరు బయలు దేరండి ప్రభు. ఈ నీచుల శవాల సంగతి మన సిబ్బంది చూసుకుంటారు. బయలు దేరండి’’ అన్నాడు హెచ్చరిగ్గా.

‘‘అలాగే స్వామీ.’’ అంటూ వెను తిరిగాడు యువరాజు ధనుంజయుడు.

“స్వామీ. ఈ ద్రోహులకు శవ సంస్కారము జరుపవలదు. సహ్యాద్రి లోయ లోనికి విసిరేయమనండి. వీళ్ళందరూ అడవి నక్కలకు ఆహారం గావలె.” రక్త సిక్తమైన ఖడ్గాన్ని ఒరలో వుంచి, ధనుంజయుని అనుసరిస్తూ ఆవేశంగా అరిచాడు అపర్ణుడు.

ఇద్దరూ విడిది గృహం వైపు దారి తీసారు. తనను చూసి నమస్కరిస్తున్న వాళ్ళని పట్టించుకోకుండా అపర్ణుడి వంక చూసాడు ధనుంజయుడు.

“మిత్రమా! నీవు నన్ను కాపాడుట ఇది మూడవ సారి. అవునా?” అనడిగాడు.

అవునన్నట్టు తల పంకించాడు అపర్ణుడు.

“నాదో సలహా ప్రభు. వెంట ఒక్క అంగ రక్షకుడయినా లేకుండ మీరిలా ఒంటరి ప్రయాణం చేయుట నిజముగా క్షేమ కరం కాదు” అన్నాడు.

“నీ మాట సత్యమే గాని ఇప్పటికిప్పుడు సమర్థుడైన అంగ రక్షకుడు ఎచట లభించగడు? అదేదో నీవే నా వెంట రావచ్చును గదా.”

“నేనా....”

“నీవేనయ్యా. నీకన్నా సమర్ధుడెవరు? నీకు వేరే పనులేమన్నా వున్నవా?”

“లేవు లేవు. మీతో వచ్చుట నాకు సంతోషమే.”

“అయితే ఆలస్యమేల. భోజనం గావించి ఇప్పుడే ఇట నుండి వెడలి పోవుదము. నీ అశ్వము ఢాకిని ఎచట నున్నది?”

‘‘అది ఇచటనే వున్నది ప్రభు. మీరు విడిది గృహము చేరి భోజనము గావించి సిద్ధముగా వుండండి. ఒక అర్ధ జాములోపే సిద్ధమై మీ చెంతకు వచ్చెదను’’ అని చెప్పి చరచరా ఒక వీధి వెంట లోనకు వెళ్ళి పోయాడు.

యువరాజు ధనుంజయుడు భోంచేసి తన అశ్వం గరుడను సిద్ధం చేసి అపర్ణుడి రాక కోసం ఎదురు చూసాడు. కొద్ది సేపటికి అపర్ణుడు కూడ తన మచ్చల గుర్రం ఢాకినిని అధిరోహించి వచ్చి చేరాడు. స్నానం చేసి దుస్తులు మార్చుకున్నాడు. ఇప్పుడు ఆకు పచ్చ రంగు తలపాగా ధరించాడు.

‘‘పొద్దు నడిమింటకు చేరనుంది. ఇక బయలు దేరుదము’’ అన్నాడు వస్తూనే.

‘‘కాని... ఒక సారి నీలవేణి బామ్మ గృహమునకేగి భద్రా దేవిని చూచి పోవుదామా?’’ అడిగాడు ధనుంజయుడు.

‘‘ఇది యేమి కోరిక ప్రభు. తను అందముగా వున్నదని మీరేమీ మనసు పారేసుకొనలేదు గదా?’’ అనడిగాడు పరిహాసంగా అపర్ణుడు.

‘‘అలాంటిదేమియు లేదులే’’ అన్నాడు చిరు నవ్వుతో ధనుంజయుడు.

‘‘లేనప్పుడు ఆమెతో పని యేమి ప్రభు. పోవుదము రండు’’ అంటూ అశ్వాన్ని అదిలించాడు అపర్ణుడు.

అంతటితో ఆ విషయాన్ని వదిలేసి ` తనూ బయలు దేరాడు ధనుంజయుడు.అశ్వాలు రెండూ తూర్పు దిక్కు సహ్యాద్రి శ్రేణి వెంట దౌడు ఆరంభించాయి.

**********************************

రాత్రి ప్రథమ యామం గడుస్తోంది.

నీలాకాశంలో చుక్కల నడుమ`

అర్ధ చంద్రుడు ఆరుకళలతో ప్రకాశిస్తున్నాడు.

సహ్యాద్రి కొండకోనలు మీదుగా ఇప్పుడిప్పుడే చలిగాలులు ఆరంభించాయి. దవ్వుల ఎటనుండో నక్కల వూళలు, గబ్బిలాయిల అరుపులు వినవస్తున్నాయి. దిగువన లోయ ప్రాంతాల నుండి కౄర మృగాల ఘర్జనలు విన్పిస్తున్నాయి.

అపరాణ్ణ వేళ భీమ శంకరం పల్లె నుండి బయలుదేరిన ధనుంజయ, అపర్ణులు ఎక్కడా ఆగకుండా తూర్పుగా పోతున్న సహ్యాద్రి కనుమ వెంట ప్రయాణించి కను చీకటి వేళకు ఒక కొండ గుట్ట పైకి చేరుకున్నారు. చెట్టు చేమలు లేని సమతల రాతి గుట్ట. వెళ్ళేటప్పుడు ఒక రాత్రికి యువ రాజు ఎక్కడ మజిలి చేసాడు అదే చోటు.

అశ్వాలను ఒక బండకు కట్టారు. ఎండు కట్టెలు పేర్చి నెగడు మండించారు. నెగడు పక్కనే చెరో కంబళి పరిచి కూచున్నారు. వెంట తెచ్చుకున్నవేవో తిని కబుర్లలో పడ్డారు.

‘‘ఇంతకూ నీ గురించి ఏమియు చెప్పవేమి మిత్రమా. నీవు చంపా పురము ఎందుకు వెళ్ళినావు? అట నుండి భీమ శంకర క్షేత్రానికి ఎందుకొచ్చినావు? చెప్పుకున్నటు మన మచట కలుసుకొనుట కడు విచిత్రమాయెనే’’ అడిగాడు ధనుంజయుడు.

‘‘ఇందులో విచిత్రమేమున్నది ప్రభు. చెప్పుకునేంత చరిత్ర గలవాడనేమియు కాదులే. మా బంధువుల యింట ఆరోగ్యము సరి లేదని తెలిసి చంపా పురం పోతిని. వారి ఆరోగ్యము కొరకు ప్రార్ధించుటకు భీమ శంకరుని దర్శనార్థం సహ్యాద్రి వచ్చితిని. నా సంగతులకేమిగాని, మీరు సహ్యాద్రికేతెంచుట మాత్రం నమ్మ శక్యం గాకున్నది. ఏం జరిగినది ప్రభు?’’ కుతూహలంగా అడిగాడు అపర్ణుడు.




ఇక ఏదీ దాచకుండా`

పూస గ్రుచ్చినట్టు తన అనుభవాన్నీ వివరించాడు ధనుంజయుడు. అది విని విస్మయ చిత్తుడయ్యాడు అపర్ణుడు.

‘‘దైవమా... ఇది యేమి సంభ్రమం? ఇది యేమి వింత అనుభవం. నమ్మలేకుంటినే. ఏమది? నాగరాజు తనయ ఉలూచిశ్వరిని కాపాడినావా! అశ్వత్థామ వారిని కలుసుకొంటివా...’’

‘‘మిత్రమా! నేను సత్యమే జెప్పినాను.’’ అంటూ అపర్ణుడి మాటల్ని మధ్యలోనే అడ్డుకున్నాడు ధనుంజయుడు.

‘‘జరిగినది ఆశ్చర్య జనకమే గాని వాస్తవము. ఇప్పటికీ నాగ రాకుమారి ఉలూచీశ్వరి రూప లావణ్యాలను మరువ లేకున్నాను’’ అన్నాడు.

“ఆహా... వలచినారని చెప్పండి. ఇప్పటికే నాగరాజు మీ మీద ఆగ్రహిం చెంది వున్నాడు. దివ్య నాగమణితో బాటు తన తనయను కూడ మీకు ఇచ్చునా యేమి?” పరిహాసంగా నవ్వాడు అపర్ణుడు.

“లేదు లేదు. వలపు నాది మాత్రమే. ఆమెది కాదు సుమా! ఆ కోమలి మనసున ఏమున్నదో ఎవరికెరుక?”

“బాగు బాగు. మరి ఆ భద్రా దేవిని కూడ మరు వలేకుంటినంటిరే. ఇరువురినీ....”

“నేను క్షత్రియుడను అపర్ణా. నులుగురు భామలను వివాహమాడవచ్చును తెలుసునా?”“అనగా, ఇంకో యిద్దరు కూడ ఎక్కడో వున్నారని అర్థమా యేమి? అయిననూ యిలా నచ్చిన ప్రతి పడతి మీదా మనసు పారేసుకొనుట మీ వంటి వీరునకి తగదని నా అభిప్రాయం. మీరు నాగకన్యను వరించుట సముచితమే గాని ఆ భద్రాదేవి మీకు తగదు. ఆ పేదరాలిని మర్చి పోవుట మంచిదని నా అభిప్రాయము.”

“పొర బడితివి మిత్రమా. ఆమె నను వరించిన పేదరాలు ఎటులగును? కాని ఆమె మనసున ఏమున్నదో ఎవరి కెరుక? రాసి పెట్టి వుంటే మాకు తప్పదు గదా.”

“కొన్ని తప్పించు కోవలె ప్రభు. భద్రా దేవి మీకు సరి తూగదు. ఆమెను మరిచి పోవుట మంచిది. మీరు కోరిన ఎందరు రాకుమార్తెలు లేరు?”

“ఉన్నారు. కాని మనసును దోచిన మగువ కావాలి గదా. భద్రాదేవి.... అది మరిచి పోవు సౌందర్యమా. నీకు చీర కడితే మీ యిరువురూ అందము నందు పోటీ పడగలరు తెలుసునా?”

“అయ్యో ప్రభు. పురుషుడను నాకు చీర కట్టాలని చూడవలదు.” అంటూ ఫక్కున నవ్వేసాడు అపర్ణుడు. అతడి నవ్వుతో తనూ శృతి కలిపాడు ధనుంజయుడు.

‘‘అది సరి మిత్రమా. ఈ నిశీధి వేళ కూడ నీ శిరమున ఆ తలపాగా అవసరమా? తీసేయ వచ్చు గదా!’’ నవ్వు ఆపి అడిగాడు.

‘‘వీలు కాదు ప్రభు. ఇది మా వంశాచారము.’’ వెంటనే బదులిచ్చాడు అపర్ణుడు.

‘‘ఓహో... అలాంటి వంశం గురించి మేము ఎన్నడూ విన్నది లేదు. తలపాగా వంశము. మంచిది. ఆచారాలను మన్నించ వలె. ఇంతకూ నీకు ఖడ్గ విద్య ఒక్కటేనా వేరే విద్యలు కూడ వచ్చునా?’’

‘‘మలు విద్య, కర్ర సాము వచ్చును. మల్ల యుద్ధం అని, కుస్తీని అడక్కండి. నాకవంటే చిరాకు.’’

‘‘ఓహో... నీ గురువు ఎవరు?’’

‘‘మా తండ్రి గారు’’

‘‘మీ తండ్రి గారా?’’

‘‘అవును ప్రభు. మా తండ్రిగారే... వారి వద్దే అభ్యసించినాను’’

‘‘ఇంతకూ మీ తండ్రి గారి నామ ధేయము....?’’

‘‘వారే లేరిపుడు. వారి పేరుతో పనేమిలే ప్రభు!’’

కొన్ని లిప్తల కాలం అపర్ణుని ముఖాన్ని గమనించాడు ధనుంజయుడు. వెన్నెల్లో ముఖ భావాలు తెలియ రాలేదు. కాని తను ఇంతగా అతడి సొంత విషయాలు అడగటం అతనికిష్టం లేదనిపించింది. వెంటనే విషయాన్ని మారుస్తూ`

“అవును గాని, చాలా సేపటిగా ఆలోచిస్తుంటి. నన్ను జంపవచ్చిన ద్రోహులు ఎవరి పనుపున వచ్చి వుంటారు? అర్థం గాకున్నది. శవము వద్ద ఆధారము కూడ ఏమి చిక్క లేదాయె” అన్నాడు.

“అవును ప్రభు. దొరక లేదు. ఆధారము లేక ఎవరి మీదనూ నిందారోపణలు చేయ రాదు గదా!” అన్నాడు నర్మ గర్భంగా అపర్ణుడు.ఆ మాటలు ధనుంజయుని ఆలోచింపజేసాయి. అపర్ణుడి మనసులో ఏదో సంశయం వుంది. చెప్పటం లేదు.

“నీ పలుకులకర్థము ఏమి? నీవు ఎవరినో అనుమానిస్తున్నావనేగా? సంశయింపక చెప్పుము. ఎవరు వాళ్ళు?”

“సంశయం కాదు ప్రభు. సత్యమే. కాని ఇప్పుడు ఆధారాలు చూప లేను”

“అర్థం గాకున్నది. నేను ఆధారము అడుగను. నీకు తెలిసినది చెప్పుము.”

కొద్ది సేపు మౌనంగా వుండి`

పిమ్మట నోరు విప్పాడు అపర్ణుడు.

“వాళ్లు గూఢచారులు. నమ్మకమైన వేగులు” అన్నాడు.

“ఎవరికి?”

“తమ ఉప సైన్యాధ్యక్షుడు బాహ్లీకునకు.”

“బాహ్లీకుడా!” విస్తు పోయాడు ధనుంజయుడు.

“అవును ప్రభు. బాహ్లీకుడే. ఇంత వరకు వానిని ప్రభవు గాని, మీ మహా మంత్రి వాసు దేవ నాయకుల వారు గాని, మీ సర్వ సైన్యాధ్యక్షుడు అర్కుల వారు గాని ఇసుమంతయు సంశయింపకున్నరు. బాహ్లీకుని కుచేష్టలు మీ చాయి కూడ కని పెట్ట లేకున్నారు.”

“కాని బాహ్లీకునికి సొంత వేగు ఎందుకు? ఆ అవసరం ఏమున్నది? అతడు చేస్తున్న కుచేష్టతము ఏమిటవి?”

“ప్రభూ. అవసరం ఏమిటో సహ్యాద్రి పై జరిగిన హత్యా ప్రయత్నం జూచినారుగా. ఇంకనూ అర్థము కాలేదా?”

అపర్ణుడు అంత నమ్మకంగా చెప్తూంటే యువరాజు ధనుంజయుడు నిశ్చేష్టుడయ్యాడు. బాహ్లీకుడి వినయ విధేయతలు శౌర్య పరాక్రమాలు తనకు తెలియనవి కావు. తన తండ్రి గారికి అతడి మీద భరోసా వున్నది. ఎవరూ అతడి రాజ భక్తిని అనుమానింపజాలరు. అలాంటి వాడిని ద్రోహి అంటే ఎలా నమ్మేది? అపర్ణుడు బాహ్లీకుని గురించి తెలిసి నిందారోపణ చేస్తున్నాడా? తెలీక చేస్తున్నాడా తెలీకున్నది.

“లేదు... లేదు మిత్రమా! నీవేదో పొరబడినట్టున్నావు. నీవు చెప్పినట్టు నిజము గనే ఆధారము లేక ఈ విషయమును నమ్మజాలను” అన్నాడు.

“ప్రభూ! మీరు నమ్మినా నమ్మకున్నా ఇది నిజము. ఇందుకే, మీరు నమ్మరని తెలిసే ఆధారము లేకుండా చెప్పనంటి. మీకు తెలుసునా? ఆ ద్రోహి తన చేతి కింద సైన్యం మొత్తాన్ని అవసరమగుచో తిరుగ బాటు చేయటానికి సర్వ సన్నద్ధంగా ఉంచుకున్నాడు. అంతర్యుద్ధానికి ఎంతో కాలం లేదు. పరిస్థితులను తనకు అనువుగా మలచు కొంటున్నాడు. రత్నగిరి గద్దె మీద కూచోవాలని కలలు కంటున్నాడు.”

కొద్దిరోజుల క్రితం గాంధార రేడు శతానీకుడు రహస్యముగ వర్తక నౌకలో రత్నగిరి సముద్ర జలాల్లోకి వచ్చాడని, బాహ్లీకుడు ఆ నౌకలోకి వెళ్ళి శతానీకుడ్ని కలిసి, ఆ రేయంతా మంతనాలు జరిపాడని తెలిసినది. ఖచ్చితముగా వారి మధ్య ఏదో సైనిక ఒప్పందము జరిగే వుంటుంది. ఆలోచించండి యువరాజ!

మహారాజు పుట్టు వ్రణముతో నిస్సహాయుడై రాజ మందిరాన వున్నాడు. మీరు రాజధానిలో లేరు. కుట్ర దారులకి ఇంతకు మించి చక్కని అవకాశము ఏమి కావలె? మీరు తిరిగి వచ్చిన తన ఆటలు సాగవన్న భయంతోనే మిమ్మును రాజధాని బయటే అంతం చేయుటకు తన సొంత వేగుల్ని పంపించినాడు. బహుశ మీరు వెళ్ళు మార్గమందు మరికొన్ని దళాలు మీ కొరకు ఎదురు చూస్తూండ వచ్చు'' అన్నాడు అపర్ణుడు.

ఆ మాటలకు విభ్రాంతి చెందాడు ధనుంజయుడు.

కుట్ర దారునకు ఇది అనుకూల సమయమే. అందులో ఎలాంటి సంశయమును లేదు. రత్నగిరి ఒక భయంకర యుద్ధాన్ని త్వరలో చూడనుందని అశ్వత్థామ వారు చెప్పనే చెప్పారు. కాని ఆ కుట్రదారు రాజ్యం బయటివాడు కాడు బాహ్లీకుడంటేనే నమ్మ శక్యం గాకుండా వుంది. ఇతడు చెప్పిన విషయము సత్యములైతే రానున్నది అంతర్యుద్ధము. బాహ్లీకునకు గాంధార రాజు శతానీకుని సైన్యం తోడయితే భయంకర వినాశనం తప్పదు. ఆ యుద్ధము ఎంత బీభత్సంగా వుంటుందో వూహించ లేము. అదలా వుంచితే`

ఒక సాధారణ రత్నగిరి వాసి అపర్ణుడు. అందునా బాలకుడు. ఇతడికి ఇన్ని విషయము ఎలా తెలిసినవి. తెలుసుకోవసిన అవసరం ఏమున్నది? ఒక వేళ ఇతడు గూఢచారి కాదు గదా... ఎవరి తరపున పని చేస్తున్నాడు. గూఢచారి అయితే గూఢచర్యం వదులు కొని తన వెంట ఎందుకుంటాడు.

తేనె తుట్ట కదిలినట్టు యువరాజు ధనుంజయుని అనేక ప్రశ్నలు చుట్టు ముట్టి ఒకే మారు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఆలోచిస్తూ ఉత్తర దిక్కుగా చూస్తున్న ధనుంజయుడు పెద్ద ఉల్క ఒకటి మలుగులు చిమ్ముతూ నేలకు రాలటం చూసాడు. ఉల్కాపాతం రాజ్యానికి త్వరలో కీడును సూచిస్తుందంటారు. ముందు ముందు ఏమి జరగనుంది?

ఉన్నట్టుండి యువరాజు మౌనం వహించటం అపర్ణుడికి నచ్చ లేదు. ''క్షమించండి ప్రభు. నేనూ మీకీ విషయము చెప్పి వుండ కూడదు. ఆధారము చూపకుండా విన్నవించిన మీరు నమ్మరని తెలిసి కూడ మనవి చేయుట నా తప్పిదమే. దీని వలన అనవసరముగా మీరు నన్ను గూఢచారినని సందేహించు పరిస్థితి ఏర్పడినది. నేను చారుడను గాను. వేగుడనూ గాను. రత్నగిరి పౌరుడను. రాజభక్తి, దేశభక్తి మెండుగా వున్న సామాన్యుడను. నేను ఏమి చేసినా అది రాజ్యం కోసం, మీ క్షేమం కోసం జేసినాను'' అన్నాడు.

''నీవు సామాన్యుడవు కావు. అంత కన్నా ఎక్కువే. చాలా ఎక్కువ. లేకున్న రాజ పరివారము, మంత్రుల, సైన్యాధికారుల గురించి ఇంత వివరముగా తెలియవు.''

‘‘అందుకే నను మీరు సందేహ పడుతున్నా రా?’’

‘‘నేను సందేహించుట లేదు మిత్రమా.’’

‘‘లేదు లేదు. మీరు సందేహించినారు. అందుకే ఆ మౌనం’’ అంటూ పడుకుని కంబళి ముసుగు తన్నేసాడు




ధనుంజయుడు ఒకింత చికాగ్గా చూసాడు.

“మిత్రమా! ఇది అన్యాయము గదూ. నన్ను ఒంటిగా వదిలి నీవు నిద్ర పోవుట?” అనడిగాడు.

“నిద్ర వచ్చుచున్నది ప్రభు.” ముసుగు లోంచే బదులిచ్చాడు అపర్ణుడు.

“నిద్ర కాదు. నాపై కోపము.”

“నేను సామాన్యుడను. నాకు కోపము రాదు ప్రభు. అర్ధ రాత్రి లేపండి నేను కాపలా వుంటాను. మీరు నిద్ర పోవచ్చును. ఇక ఉదయం మీ దారి మీది, నా దారి నాది.”

ఉలికి పడ్డాడు ధనుంజయుడు.

“మిత్రమా ఏమంటివి? ఎవరి దారి వారిదా! ఇది యేమి అలుక?” అడిగాడు.

“అలుక కాదు ప్రభు! ఆత్మాభిమానము. మీరు నను అనుమానించాక మీతో నేను రాలేను.”

“అయ్యో! అమ్మాయిలా ఈ కినుక ఏమిటయ్యా. ఆలోచించాను గాని, నిను అనుమానింప లేదు. నీవు వెళ్ళాల్సిన పని లేదు.”

“ఉదయమే వెళ్ళి పోతాను.”

నెత్తి కొట్టుకున్నాడు ధనుంజయుడు.

ఆ తర్వాత పిలిచినా అపర్ణుడు పలుక లేదు.

బళ్ళెం ఒకటి అందుకుని కాపలా కూచున్నాడు.

అర్ధ రాత్రి దాటే సరికి అర్ధ చంద్రుడు అస్తమించి అడవంతా చిమ్మ చీకట్లు అలుముకున్నాయి. కీచు రాళ్ళ రొద కర్ణ కఠోరంగా వుంది. డొంకల వెంట మిణుగురులు ఎగురుతున్నాయి. నెగడు మండిస్తూ అప్రమత్తంగా కాపలా వున్నాడు ధనుంజయుడు. అంతలో అపర్ణుడు లేచి కాపలా బాధ్యత తను తీసుకున్నాడు. ధనుంజయుడు నిద్ర పోయాడు.

రేయి గడిచే కొద్ది చలిగాలులు అధికరించాయి. అయితే ఎలాంటి ఉపద్రవాలు ఎదురు గాకుండానే తెల్లవారింది. అడవంతా ధవళవస్త్రాలు అర వేసినట్టు తెల్లటి మంచు పరదాలు దిగాయి. సూర్యోదయమైన కొద్ది సేపటికి ధనుంజయుని మెలకువ వచ్చింది. అప్పటికే నెగడు ఆరి పోయింది. తూర్పు నుంచి సూర్యకిరణాలు దూసుకొస్తున్నాయి. ఇటు చూస్తే పక్కన అపర్ణుడు లేడు. అతడి అశ్వం ఢాకీని కూడా లేదు.

********************************

ఉలికి పడి లేచి కూచున్నాడు ధనుంజయుడు.

అపర్ణుడు వెళ్ళి పోయాడని తెలిగానే ఎక్కడ లేని నిస్సత్తువ తనను ఆవహించినట్టుయింది. మనసుకు బాధనిపించింది. వెళ్ళి పోవటం ఏమిటి? తను ఏమన్నాడని? కనీసం మాట మాత్రమైనా చెప్పకుండా వెళ్ళి పోడమేనా? జీవితాంతం తనకు తోడు వుంటాడని అశ్వత్థామ వారు చెప్పిన పలుకు అసత్యమేనా?

వెళ్ళి పోయాడు.

అలిగి వెళ్ళి పోయాడు.

ఆడపిల్లలా వీడికి ఇంత అలుక ఏమిటి?

అయినా తన పిచ్చి గాని అపర్ణుడు పురుషుడు కాదు, స్త్రీయని భీమశంకర క్షేత్రంలో తను చూసిన జవ్వని భద్రాదేవి ఇతడేనని ఒక సంశయం మనసున కుమ్మరి పురుగులా తొలుస్తూనే వున్నదే. సత్యము తెలుసుకొను లోపలే జారుకున్నాడు. అవకాశము చేజారినది.

అసలు ఈ అపర్ణుడి మీద క్షణ క్షణానికి తనలో పెరిగి పోతున్న అభిమానానికి కారణం ఏమిటి? అతడిలో ఒక్కో కోణము బయట పడే కొద్ది అతడి గొప్ప తనం అర్థమవుతోంది.

అతడిలో ఒక క్షాత్రవ వీరుడున్నాడు. ఒక మంత్రావాది వున్నాడు. గూఢచారి వున్నాడు. వెంట వెంటనే స్పందించి నిర్ణయాలు గైకొనే ఒక మంత్రి వున్నాడు. ఇంకా ఎవరెవరున్నారో గదా. ఒక్క మనిషిలో ఇన్ని కళలు సాధ్యమేనా...? అతడ్ని పరిపూర్ణంగా తెలుసుకునే లోపలే వదిలి పోయాడే... ఎంత దూరంలో వున్నాడో, ఎటుకెళ్ళి పోయాడో గదా. అంతు లేని ఆలోచనలతో కాసేపు అలాగే కూచుండి పోయాడు.

పక్షుల కిలకిలా రావాలతో సందడి చేస్తున్నాయి. దిగువ లోయ లోతట్టు ప్రాంతాల నుండి శార్ధూలాల ఘర్జనలు వినవస్తున్నాయి. అడవంతా మేల్కొంది. తను ముందుగా మేల్కొని వుంటే ఇలా జరిగేది కాదేమో.

సూర్యకిరణాలు వెచ్చగా శరీరాన్ని తాకుతున్నాయి. చలి తగ్గు ముఖం పట్టింది. లేచి సొరకాయలో నీటితో ముఖ ప్రక్షాళనం గావించుకొని మంచి నీరు త్రాగాడు. ఇంతలో నెమ్మదిగా గుట్ట మీదికి వస్తున్న అశ్వం గిట్టల శబ్దం విన్పించింది.

ఉలికి పడి అటు చూసాడు.

అశ్వం ఢాకినీ గుట్ట పైకి వస్తూ కన్పించింది.

ఆ మచ్చల అశ్వం మీద అపర్ణుడు చిరునవ్వులో బాలభానునితో పోటీ పడుతున్నట్టున్నాడు. ఎక్కడికెళ్ళాడో గాని చక్కగా స్నానం చేసి దుస్తులు మార్చుకుని తాజాగా మరింత అందంగా కన్పిస్తున్నాడు. అపర్ణుడు తనను వదిలి పోలేదని తెలిగానే చాలా సంతోషం కలిగింది. కాని ఆ సంతోషాన్ని బయటికి చూపకుండా గంభీరంగా చూసాడు ధనుంజయుడు.

“వెడలిన వాడివి వెళ్ళి పోవచ్చును గదా. మరలి వచ్చుట ఎందుకో. ఇదేమి చోద్యము?” స్వగతంలా పైకి అన్నాడు.

“వెళ్ళి పోతానని చెప్పితినా ఏమి? ఎవరి మీద ప్రభూ ఈ అలుక?” అశ్వం దిగకుండానే ఓ కాలు రెండో వైపు వేసి కూచుని విలాసంగా నవ్వుతూ అడిగాడు అపర్ణుడు.

“నీ మీదనే అలుక. వేరే చెప్ప వలెనా? అనృతము వేరేనా? రాతిరి నీవు చెప్పినావుగా... ఎవరి దారి వారిదంటివి. ఆత్మాభిమానమంటివి. ఉదయమే వెళ్ళి పోతానంటివి. వెళ్ళినావుగా.” నిష్ఠూరంగా అడిగాడు.

ఫక్కున నవ్వాడు అపర్ణుడు.

“అయ్యో! నా మాటలు బాగుగనే గురుతున్నవి తమకు. కాని రాతిరి మాటలకు పగలు విలువనివ్వ రాదని తమకు తెలీదా ఏమి? అయినను మిమ్ము విడిచి ఎటు పోగలను? మీ అంగరక్షకునిగా ఉంటానని మాట ఇచ్చితిని గదా. మీకు తెలుసా? మాది మాట తప్పు వంశము గాదు.” అన్నాడు బింకంగా.

“ఓహో... బెదిరించే వంశమా....” వెక్కిరించాడు ధనుంజయుడు.

“కాదులే... భయపెట్టే వంశము.”

“భయమా... నన్నా....!”

ఇద్దరూ ఒకేసారి నవ్వుకున్నారు.

“క్షమించండి ప్రభు. గాఢ నిద్రలో వున్న మిమ్ము లేపుటకు ఇష్టం లేక నేనే వెళ్ళి స్నానాదుల ముగించుకొని వచ్చితి” అన్నాడు.

"స్నానమా... దవ్వుల నీటి చెలమ కూడ కనబడలేదు..."

"మీకు కనబడవు. కాని అడవులన్నీ నాకు కొట్టిన పిండి గదా. నాకు తెలుసు. రండు."

ఎలా తెలుసని అడగలేదు ధనుంజయుడు. అడవులన్నీ తనకు కొట్టిన పిండియని చెప్పనే చెప్పాడు గతంలో. తను అశ్వాన్ని అధిరోహించి అపర్ణుడిని అనుసరించాడు. గుట్ట దిగి కాస్త దూరం ముందుకెళ్ళగానే ఎడం పక్కగా లోనకు చిన్న జల పాతం ఒకటుంది. తెలిసిన వారికి తప్ప బాటసారులకు అది కనబడదు.

ధనుంజయుడు కాకృత్యాలు తీర్చుకొని స్నానమాచరించి సిద్ధమైన కొద్ది సేపటికి అపర్ణుడు అరటి పండ్లు, జామ, పనస పండ్లు తీసుకొచ్చాడు. ఇద్దరూ భుజించి వలసినవి సంచిలో వేసుకుని తిరిగి ప్రయాణమయ్యారు.

అశ్వాలు రెండూ ఒకదాని వెనక ఒకటిగా ముందుకు సాగాయి. అది శంఖు మార్గం. రాళ్ళు రప్పలతో కూడిన కొండ దారి. సముద్ర మట్టానికి చాలా ఎత్తయిన ప్రాంతం. అదీ లోయ వంచ వెంట సాగేప్పుడు బహు భద్రంగా వుండాలి. ఏ మాత్రం చిన్న పొరబాటు జరిగినా అశ్వాలతో సహా అఖాతం వంటి లోయల్లోకి జారి పోవలసిందే. అలాంటి చోట బాహు నెమ్మదిగా సాగాలి. విశాలమైన దారుల్లో పరుగు తీయాల్సిందే.

ఈ మార్గం కష్ట తరం గాబట్టి భక్తుల రాకపోకలు తక్కువే. దారిలో ఒకటి రెండు భక్త బృందాలు మాత్రం ఎదురయ్యాయి.

ఎక్కడా నిలవకుండా ప్రయాణం సాగించిన ధనుంజయ, అపర్ణులు సహ్యాద్రి కనుమ తూర్పు పాదం లోని అంబా పురం చేరుకునే సరికి కను చీకటి పడింది. సందె వెన్నెల గాబట్టి అక్కడ ఆగకుండా రాజ మార్గంలో సాగి పోదామనుకున్నప్పటికీ అశ్వాలు కొండ దారుల్లో బాగా అలసిపోయి వున్నాయి. వాటి విశ్రాంతి కోసమైనా అక్కడ మజిలీ చేయాలి.

ఆ రాత్రికి అక్కడే బస చేసారిరువురు.

తిరిగి మరునాడు సూర్యోదయం తోనే ప్రయాణం ఆరంభమైంది. అంబా పురం నుండి తూర్పుగా ఏడు రోజుల ప్రయాణ దూరంలో మాళవ రాజ్య సరిహద్దు వుంది. అక్కడ నుండి ఆగ్నేయంగా చీలిన మరో మార్గం రాజధాని అవంతికి చేరుస్తుంది. నేరుగా వెళ్ళు మార్గం క్రమంగా ఉత్తరానికి తిరిగి వింధ్యా పర్వతాలకు చేరుస్తుంది.

రెండు రోజుల ప్రయాణ దూరం వరకు దారి పొడవునా పల్లెలు, గ్రామాలు, చిన్న చిన్న పట్టణాలు అక్కడక్కడా పంట భూములు ఎదురయ్యాయి. మూడో రోజు నుండి తిరిగి దట్టమైన అటవీ ప్రాంతం గుండా ప్రయాణం. మార్గమందు క్రూరమృగాలకు తోడు దోపిడి దొంగ బెడద కూడ వుంటుంది గాబట్టి ఆ మహా పధంలో బాట సారులు గాని, బిడారులు గాని సమూహాలుగా కలిసి ప్రయాణం చేస్తారు. దారిలో ఎదురవుతున్న బిడారుల గుంపుల్ని చూస్తూ ముందుకు సాగిపోతున్నారు ఇద్దరూ. ఇలా ఉండగా`

అపర్ణుడిలోని మరో పార్శ్వాన్ని కూడ దర్శించే అవకాశం ధనుంజయునికి నాలుగో రోజున చిక్కింది. అపర్ణుడికి ఏవో కొన్ని మంత్రాలు, మహిమలు వచ్చునుకున్నాడు గాని అతడెంత మాంత్రవాదో కళ్ళారా చూసే వరకు తెలుసుకోలేక పోయాడు.

********************************

అది గోండ్వా జాతికి చెందిన ఒక సంచార తండా.

మహా పధంలో దట్టమైన అటవీ ప్రాంతంలో బాటకు కుడి పక్కన విశాలమైన మైదాన ప్రాంతాన దిగి వుంది. ఆ ప్రాంతం లోని పొదలు, మొక్కలు నరికి రాళ్ళు, రప్పలు ఏరి పారేసి తాత్కాలికంగా గుడారాలు లేపి విడిది చేసుంది.




గోండ్వాలు గిరిజన తెగకు చెందిన వారైనా మిగిలిన ఆటవిక జాతులతో ఎన్నడూ కలవరు. ఇంకా చెప్పాంటే, తామువాళ్ళే అయినా మరో గోండ్వా తండాల వారితో కూడ కలవరు. ఏ తండా దారి ఆ తండాదే అన్నట్టుంటారు. తమ తండాలోని యువతులను మరో తండాలోకి యివ్వరు. తమ తండాలోనే ఆమెకు నచ్చిన యువకునితో పెళ్ళి జరిపిస్తారు. అలా తమ తండానే వృద్ధి చేసుకుంటారు. ప్రతి తండాకు ఒక నాయకుడుంటాడు. నాయకుని మాటకు అంతా కట్టుబడి వుంటారు.

వీరి ప్రధాన వృత్తి వేట.

అడవుల వెంటే తిరుగుతారు.

ఎక్కడా స్థిర నివాసం వుండరు.

అడవిలో సేకరించిన దినుసులు, వస్తువుల్ని సమీప గ్రామంలోని సంతకు తీసుకెళ్ళి వస్తు మార్పిడి పద్ధతిలో తమకు అవసరమైనవి తెచ్చుకుంటారు. వీళ్ళ తండా కదిలిందంటే చిన్న పల్లె కదిలి పోతున్నట్టే వుంటుంది.

ఎడ్ల బండ్ల మీద, గాడిదల మీద సామాన్లు వేసుకుని గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులతో కదిలి పోతూంటారు. కొందరు కావళ్ళు

కట్టుకొని ఒక ప్రక్కగా పసిపిల్లల్ని రెండో పక్క వస్తువుల్ని వుంచి మోసుకు పోతూంటారు. కాలి నడకనే ఋతువులననుసరించి ఎక్కడ వేట పుష్కలంగా దొరుకుతుందో ఆయా ప్రాంతాలకు అడవులబడి తరలి పోతూంటారు. బాణాలు వేయటం, గురి తప్పకుండా బళ్ళాలు విసరటంలో వీళ్ళు నిపుణులు. ఒంటరిగా వేటకు వెళ్ళే అలవాటు వీళ్ళకు లేదు. తండాలోని యువకులు కనీసం పదిమందయినా కలిసి కట్టు వెళ్ళి వేట సాగిస్తారు. ఎక్కడి విడిది చేసినా ఏడాదిలో రెండు మాసాల వరకు అక్కడే వుంటారు. అడవుల్లోని లోయలు, మైదానాల వెంట నివశిస్తారు. కొండపై నివశించే అలవాటు వీళ్ళకు లేదు.

అటువంటి ఆ గోండ్వా తండా లోతట్టు అడవుల వైపు పోతూ వేట కోసం తాత్కాలికంగా బాట పక్కన విడిది చేసింది. వాళ్ళు అక్కడ దిగి ఇది మూడో రోజు. పడుచు వాళ్ళు ముసలి ముతకా పిల్లా పీచు అంతా చేరి మొత్తం యాభై కుటుంబాలకు చెందిన అయిద వందల జనాభా వుంది ఆ తండాలో.

ఆ రోజు ఎండ అధికంగా వుంది.

తండాలోని యువకులు భోజనాలు చేసి వేటకు వెళ్ళడానికి సిద్ధమవుతున్న వేళ. అంతలో ఉన్నట్టుండి ఏమైందోగాని ఒక్క సారిగా అక్కడ రోదనలు చెలరేగాయి. ఒక్క పెట్టున ఏడుస్తూ గుండెలు బాదుకొంటున్నారు. ఆకాశం విరిగి పడుతుందా అన్నంత పెద్దగా ఒక్క పెట్టున ఏడుస్తున్నారు.

సరిగ్గా అదే సమయంలో `

ఎగువ నుంచి ధనుంజయ, అపర్ణులు తమ అశ్వాల మీద శరవేగంతో దూసుకొస్తున్నారు. తండాలో చెల రేగిన రోదనల ధ్వనులు వారి చెవులకు సోకాయి.

‘‘మిత్రమా! ఏమా రోదనలు. ఏమి జరిగి వుంటుంది?’’ ఎగువకు దృష్టి సారిస్తూ అడిగాడు ధనుంజయుడు.

‘‘అదియే అర్థము గాకున్నది ప్రభు. వాళ్లు ఎవరో ఏమి కష్టము సంఘటిల్లినదో. రండి చూతము’’ అంటూ తన మచ్చల గుర్రాన్ని మరింతగా అదలించాడు అపర్ణుడు.

వాయు వేగంతో అశ్వాలు తండాను చేరుకున్నాయి. అశ్వాలను నెమ్మదించి జనం లోకి పోనిచ్చారు. తండా వాసులంతా ఒక్క పెట్టున రోదిస్తున్నారు. అశ్వాలు రెంటినీ చూసి పక్కకు తొలగి దారి వదిలారు.

‘‘ఏమి జరిగినది? మీకొచ్చిన కష్టమేమి?’’ అశ్వం పైనుండే ఒక తండా వాసిని ప్రశ్నించాడు ధనుంజయుడు.

‘‘ఏం చెప్పనయ్యా. అయ్యో దేవుడా... ఒక్కగా నొక్క బిడ్డడు. మా నాయకుని కొడుకును పాము కాటుతో చంపి తీసుకు పోతున్నావే. దేవుడా! ఇది నీకు న్యాయమా....’’ ఆకాశం వంక చూస్తూ అరిచాడా వ్యక్తి. అతడి మాటల్ని బట్టి తండా నాయకుడి కొడుకు పాము కాటుకు బయ్యాడని అర్ధమైంది.

అశ్వాలను ఇంకా ముందుకు పోనిచ్చారు.

ఎదురుగా కన్పించిన దృశ్యం చూసి నిశ్చేష్టితుయ్యారు. సుమారు పదిహేనేళ్ళు ప్రాయం కలిగిన బాలుడు ఒకడు నేల మీద పడి వున్నాడు. అతడి నోటి నుండి నుచ్చులు వస్తున్నాయి. కనులు తిరగబడుతున్నాయి. ఎర్రటి శరీరం ఇప్పుడిప్పుడే నలుపు రంగు తిరుగుతోంది. పాము కాటేసి ఎక్కువ సేపు కాలేదనిపించింది.

చేతికి అంది వచ్చిన ఒక్కగా నొక్క కొడుకు పరిస్థితికి తల్లడిల్లి పోతూ తండా నాయకుడు తల పట్టుకొని ఏడుస్తున్నాడు. అతడి భార్య కొడుకు పక్కనే చతికిల బడి శోకాలు తీస్తూ రోదిస్తోంది. తమ నాయక దంపతులకొచ్చిన కష్టాన్ని చూసి తట్టుకోలేక స్త్రీలు, బాలలు, వృద్ధులతో సహా అంతా కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆ బాలుడు మరి కొందరితో దూరంగా పొదల్లో కంద మూలాలు తవ్వుతుండగా పాము కాటేసి పోయిందట. మిగిలిన బాలురు ఆ బాలుడ్ని తండా లోకి తీసుకొచ్చారట. చూస్తుంటే హృదయ విదారకంగా వుంది అక్కడి పరిస్థితి.

‘‘పాపము... ఇంతటి కష్టము ఎవరికీ రాకూడదు. బ్రతకడనుకుంటాను’’ అన్నాడు బాలుడి తీరు చూసి జాలి పడుతూ ధనుంజయుడు.

‘‘లేదు ప్రభు. వాడు బ్రతుకుతాడు. వాడికి ఆయుష్షు వుంది.’’ అన్నాడు నిశితంగా బాలకుని పరిశీలిస్తున్న అపర్ణుడు. చెంగున అశ్వం దిగి బాలుడి వద్దకెళ్ళాడు.

నిర్ఘాంత పోయాడు ధనుంజయుడు.

విషం శరీరాన్ని ఆక్రమిస్తోంది.

నుచ్చలు గ్రక్కుతూ కొట్టుకుంటున్నాడు బాలుడు. అలాంటి వాడికి ఆయుష్షు వుందా! బ్రతుకుతాడా... ఏం చూసి ఈ అపర్ణుడు ఇంత ధీమాగా చెప్తున్నాడు. ఏం చేసి బ్రతికిస్తాడు. అనేక సందేహాలు చుట్టు ముడుతుండగా అశ్వంపై కూచునే కుతూహలంగా గమనించసాగాడు.

అపర్ణుడు బాలుని వద్దకెళ్ళి చేయి పట్టుకుని నాడి చూసాడు. కనురెప్పలు ఎత్తు చూసి పరిశీలించాడు. తండా వాసుల్ని చూస్తూ`

‘‘మీరు భయ పడకండి. బాలుడు బతుకుతాడు. మీరంతా నిశ్శబ్దంగా వుండండి’’ అంటూ వేగంగా అక్కడి నుండి పొదల్లోకి పరుగెత్తాడు.

తండా వాసుల్లో ఏదో ఆశ చిగురించింది. ఉన్నట్టుండి రోదనలు ఆగి పోయాయి. కాని కొందరు వెక్కి వెక్కి మౌనంగా రోదిస్తూనే వున్నారు. బాలుడు బతుకుతాడంటే చాలా మందికి నమ్మకం లేదు. అశ్వం మీది ధనుంజయుని పొదలవెంట గాలిస్తున్న అపర్ణుడిని ఉత్కంఠతో చూడ సాగాడు.

వెళ్ళిన ఒకింత సేపట్లోనే గుప్పెడు ఆకులతో తిరిగి వచ్చాడు అపర్ణుడు. అది ఏ మొక్కల ఆకులో, పొదుల ఆకులో గాని కొసలు ఎరుపు రంగు తిరిగి వున్నాయి. వాటిని అర చేతిలో బాగా నలిపాడు. బాలుడి నోరు తెరిపించి గొంతులో పది చుక్కలు పిండాడు. ఆ ఆకులు విషం శరీరమంతా వ్యాపించకుండా వున్న చోట ఆపటంలో అద్భుతంగా పని చేస్తాయి.

అపర్ణుడు కోరిన వెంటనే`

ఒక తొండను పట్టి తెచ్చారు తండా యువకులు.

అపర్ణుడు ఒక వెడల్పాటి పచ్చి ఆకును త్రుంచాడు. దాని పైన గోటితో ఏదో మంత్రం లిఖించాడు. దాన్ని తొండ మెడకు చుట్టి జారిపోకుండా తీగలో కట్టాడు. పిదప ఏవో మంత్రాలు చదివి తొండ ముఖాన మూడు సార్లు గాలి ఊదాడు. ‘‘నాగ మిత్రుడా. ఇక వేగిరం పొమ్ము. ఈ బాలుని కాటందుకున్న దుష్ట నాగము ఎందున్నను వేగమే ఇటుకు తోలుకొని రమ్ము. పొమ్ము.’’ అంటూ దాని వీపు మీద ముమ్మారు తట్టి నేలమీద వదిలేసాడు. అంతే`

తనకు అంతా తెలుసునన్నట్టు అపర్ణుని జూచి నిక్కి నిక్కి తల వూపి గిరుక్కున తిరిగి పొదలవైపు పరుగెత్తి కనుమరుగైంది. తండా వాసులంతా ఎక్కడి వాళ్ళక్కడ నిలబడి ఉత్కంఠ భరితులై అపర్ణుడి వంక చూస్తున్నారు. వాళ్ళకేమీ అర్థం గావటం లేదు. వాళ్ళకే కాదు, అశ్వం మీద కూచునున్న యువరాజు ధనుంజయుకీ అర్థం గావటం లేదు. లొండ వెళ్ళి కాటేసిన సర్పాన్ని తీసుకొస్తుందా? వచ్చి ఏమి చేస్తుంది? అసలా కుర్రాడు బతుకుతాడా లేదా? అందరిలోనూ ఇదే సంశయం. అపర్ణుడు అందరి వంకా చూస్తూ పెద్ద స్వరంతో చెప్పాడు.

''మీరంతా శ్రద్ధగా ఆలకించండి. ఈ బాలుడ్ని కాటందుకున్న పన్నగాన్ని ఇటకు రప్పిస్తున్నాను. మీలో ఏ ఒక్కడూ పాముకి హాని తల పెట్టకూడదు. నా మీద ఆన. మీరు కొలిచే దేవుళ్ళ మీద ఆన. ఆ దుష్ట భుజంగం ఎటు నుండయినా రావచ్చును. మీ కాళ్ళ సందు నుండి కూడా రావచ్చును. భయ పడి మీరు కదల కూడదు. అరవ కూడదు. మౌనంగా, ధైర్యముగా ఎక్కడి వాళ్ళక్కడ నిశ్శబ్ధంగా ఉండాలె. అంత ధైర్యం లేని వాళ్ళుంటే ఇప్పుడే అలా దూరంగా బాట మీదకు వెళ్ళి పోవచ్చును. ఇప్పుడు ఒక ముంతలో కాచి చల్లార్చిన పాలు, ఒక కోడి గ్రుడ్డు ఇక్కడ సిద్ధంగా వుంచండి. త్వరగా'' అన్నాడు.

వెంటనే పాలు, గ్రుడ్లు అక్కడ సిద్ధమయ్యాయి.

సర్ప ద్రష్టుడైన బాలుని సమీపంలో ఎవరూ లేకుండా కాస్త దూరంగా పంపించేసి తను మాత్రమే అక్కడి నిలుచున్నాడు అపర్ణుడు. పాము ఎటు నుంచి వస్తుందోనని ఆందోళనతో చుట్టూ చూస్తున్నారంతా.

అశ్వం మీది ధనుంజయుడు విభ్రాంతి నుండి తేరుకోలేకున్నాడు. కాటు వేసిన పాము నిజంగా వెనక్కి వస్తుందా? వచ్చి విషాన్ని తీసుకుంటుందా? అపర్ణుడిలో అంత మంత్ర శక్తి వుందా? మతి పోయినట్టు చూస్తున్నాడు. క్షణాలు భారంగా కరిగి పోతున్నాయి.

అంత క్రితం వరకు `

రోదనతో హోరెత్తిపోయిన ఆ ప్రాంతమంతా ఇప్పుడు చీమ చిటుక్కుమన్నా విన్పించేంత నిశ్వబ్ధం అలుముకుంది. ఎవరికి వారు ఇప్పుడు ఊపిరి తీయటం మర్చి పోయి ఉత్కంఠ భరితులై చుట్టూ చూస్తున్నారు. ఇంతలో జనం వెనక తట్టు నుంచి ఎవరో అరిచారు. ''అదిగో... అదిగదిగో పాము... వచ్చేస్తుంది వచ్చేస్తుంది.'' అంటూ.

''ష్.... నిశ్శబ్ధం'' అంటూ హెచ్చరించాడు అపర్ణుడు.

అందరి దృష్టి ఒక్కసారిగా అటు తిరిగింది.

తండా ఉన్న చోటుకు పశ్చిమ దిక్కుగా వున్న పొదల్లో బాలుడిని కాటందుకున్న సర్పం ఎప్పుడు వెళ్ళిందో ఎలా వెళ్ళిందో గాని ఇప్పుడు తండాకు తూర్పు భాగంగా వున్న పొదల వైపు నుండి వచ్చేస్తోంది. పడగ విప్పి అంత ఎత్తున లేచి ఆడుతూ ఆగమేఘాల మీద జరజరా బిరబిరా దూసుకొచ్చేస్తోంది.

అందర్నీ మరింత విస్మయానికి గురి చేసిన విషయం ఏమంటే` అపర్ణుడు మంత్రించి వదిలిన తొండ నిజంగానే ఆ పన్నగం పడగ మీద పడుకుని తోలుకొస్తున్నట్టే వుంది.




ఎప్పుడైతే సర్పం రాకడను గమనించారో మరు క్షణం అటు ప్రక్క జనం పక్కకు తొలగి దానికి దారి విడువ సాగారు. అది ఎటూ చూడకుండా జనం మధ్య నుంచే నేరుగా అపర్ణుడికి ఎదురుగా వచ్చి ఆగింది. మూడు మూరల పొడవున్న గోధుమ వన్నె కోడె వయసు త్రాచు పాము. ఎండ పొడకు మిలమిలా మెరిసి పోతోంది.

సర్పం ఆగిన వెంటనే`

అంతటితో తన బాధ్యత తీరి పోయిందన్నట్టు చెంగున నేల మీదకు దూకిన తొండ వేగంగా అక్కడి నుండి చెట్లలోకి పారి పోయింది.

తన ముందు పడగ విప్పి ఆడుతున్న సర్పాన్ని చూస్తూ, ఏదో మంత్రాన్ని చదివాడు అపర్ణుడు. ''ఏమయ్యా నాగేంద్రమా! ఏమిటయ్యా ఈ పని? పొరబాటున కాలో చెయ్యో తగిలితే కాటేసి ప్రాణం తీస్తావా? తప్పుగదా. పో... నువ్వు క్రక్కిన విషాన్ని నీవే గ్రహించాలి. అది నీ విషం. త్వరగా తీసేసుకో. పో.'' అంటూ అదలించాడు.

ఆజ్ఞా బద్ధమైనట్టు ఆ దుష్ట నాగం వెనక్కి వెనక్కి జరిగింది. బాలుడి పాదాల వద్దకెళ్ళి ఆగింది.

కను రెప్పలు వాల్చటం మర్చి పోయి చూస్తున్నారంతా. బాలుడి కుడి పాదం బొటన వ్రేలి పై భాగంలో రెండు నెత్తుటి చుక్కలు అతికించినట్టు రెండు గాట్లు కన్పిస్తున్నాయి.

ఉన్నట్టుండి పెద్ద బుస కొట్టి తలవిదిలించి కాటు వేసింది. సరిగ్గా అదే చోట గతంలో వేసిన కాటు పైనే తిరిగి కాటు వేసింది. అయితే కోరలు దించి పైకి లేవకుండా అలాగే పాదాన్ని అంటి పెట్టుకునుండి పోయింది.

క్షణాలు బరువుగా దొర్లి పోతున్నాయి.

పాములో చలనం లేదు.

ఊపిరి వదిలితే ఎక్కడ విన్పిస్తుందోనన్నంత ఉద్విగ్న భరితులై విషాన్ని వెనక్కు తీసుకుంటున్న భుజంగాన్ని చూస్తున్నారు. యువరాజు ధనుంజయుడు తను చూస్తున్నది కలో నిజమో అర్థం గానంత అయోమయంగా చూస్తున్నాడు. అపర్ణుడిలో ఇంత శక్తి వుందా. పాము మంత్రంలో ఇంత గొప్ప వాడా... ఆశ్చర్య పోతున్నాడు.

సుమారు యాభై లిప్తల కాలం కాటు వేసిన చోటు నుండి కదలకుండా అలాగే వుండి పోయింది సర్పం. అంత వరకు నీలి రంగు

తిరిగిన బాలుడి శరీరంలో మార్పు వచ్చింది. క్రమంగా నీలి రంగు అదృశ్యమై శరీరం యధా పూర్వ స్థితికి చేరుకుంది. నోటి నుండి నుచ్చులు గ్రక్కటం పూర్తిగా నిలిచి పోయింది. బాలుడి ముఖం కాంతి వంతమైంది. శరీరంలోని ఆఖరి విషపు శేషాన్ని కూడ వెనక్కు తీసుకోగానే అలసి పోయినట్టు పక్కకు ఒరిగి అచేతనంగా అలాగే వుండి పోయింది సర్పం.

అపర్ణుడి హెచ్చరికతో నేల పైనుండి లేపి కొంత దూరంలో ఒక నులక మంచం మీద పరుండ జేసాడు బాలుడ్ని. కొట్టి పడేసినట్టు అచేతనంగా వున్న ఆ గోధుమ వన్నె త్రాచు నెమ్మదిగా తెప్పరిల్లి లేచే సరికి అపర్ణుడు కోడి గ్రుడ్డు, పాల ముంతను దగ్గరకు జరిపాడు.

నెమ్మదిగా గ్రుడ్డు మ్రింగిన నాగం తర్వాత ముంత లోని పాలు మొత్తం త్రాగేసి పడగ విప్పి చుట్టూ చూసింది. అపర్ణుడు మృదువుగా నవ్వాడు.

"ఓ శేషమా. పిలవగానే వచ్చినందుకు కృతజ్ఞుడను. ఇకనయినా మనుషులకు హాని చేయకుండా దూరంగా సంచరించు. ఇక స్వేచ్ఛగా నీ దారిన వెడలుము. పొమ్ము." అంటూ వీడ్కోలు చెప్పాడు. ఎవరినీ సర్పం వెనక పోనీయలేదు. అపర్ణుడి వీడ్కోలు తీసుకుని నెమ్మదిగా కదిలిన పన్నగం తర్వాత వేగం అందుకుని కొంత దూరం వెళ్ళి డొంకల వెనక కనుమరుగైంది. అది వెళ్ళి పోయిందని గమనించాక తల తిప్పాడు అపర్ణుడు.

నాగ దోషం మహా దోషం.

విషం వెనక్కు తీసుకుని తన దారిన పోతుండగా కోపంలో అక్కడి వారు ఎవరయినా దానికి హాని చేస్తే ఆ దోషం మంత్ర వాదికి చుట్టుకుంటుంది. అందుకే అది స్వేచ్ఛగా వెళ్ళి పోయేవరకు జాగ్రత్తగా వుండటం.

ఇంతలో నులక మంచం మీది బాలుడు నిద్రలో కదిలినట్టు ఇటు నుంచి అటు దొర్లాడు. అది చూసి తండా జనం ఆనందంతో కేరింతలు కొడుతున్నారు. తండా నాయకుడు అతడి భార్య వచ్చి తన కాళ్ళకు నమస్కరిస్తుంటే వారించాడు అపర్ణుడు. వారి కళ్ళల్లో ఆనందం తొణికిసలాడుతోంది.

‘‘మీరు పెద్ద వాళ్ళు. నా కాళ్ళకు మొక్క కూడదు. మీ కొడుక్కి ఆయుష్షు వున్నది అందుకే సమయానికి మేమిటు రావటం జరిగినది. నా చేతనైన సాయము చేసి మీ బిడ్డను బ్రతికించ గలిగాను. వాడు కాసేపట్లో లేచి కూచుంటాడు. కాచిన జావ ఆహారముగా యివ్వండి. రాత్రికి కూడ అదే యివ్వండి. చీకటి పడే లోపు వాడు నిద్ర పోకూడదు. ప్రమాదం. వాడు నిద్రించకుండా కాపలా ఉండండి. ఇది చేస్తే చాలు. వాడికి తిరుగుండదు. లేచి కూచోగానే ఎర్ర నీళ్ళతో దిష్టి తీసి పోయండి. ఇక మేము బయలుదేరగలము.’’ అంటూ చర చరా వెనక్కి వచ్చి తన మచ్చల గుర్రం ఎక్కి కళ్ళాలు అందుకున్నాడు.

ఇంత సాయం చేసి కనీసం భోజనం కూడ చేయకుండా వెళ్ళి పోతున్నందుకు నాయకుడితో బాటు తండా వాసులంతా ఎంతో బాధ పడుతున్నారు. ఒక్క పూట ఆగి పొమ్మని అభ్యర్థించారు. వారి అభ్యర్థనను సున్నితంగా త్రోసి పుచ్చి, ధనుంజయునితో బాట మీదకు వచ్చేసాడు అపర్ణుడు. అశ్వాలు రెండూ తిరిగి రాజ మార్గం వెంట దుమ్ము తెరలు రేపుతూ దౌడు ఆరంభించాయి. అప్పటికి సంభ్రమాశ్చర్యాల నుంచి తేరుకున్నాడు ధనుంజయుడు. అపర్ణుడంటే ఏమిటో అర్థం గావటంతో ఇంకేమీ అడగ లేదు. మౌనం వహించాడు. కళ్ళ ముందు ఇంకా తండాలో జరిగిన సంఘటనే మెదలుతోంది. అతడేమన్నా అడుగుతాడేమోనని ఎదురు చూసాడు అపర్ణుడు. ధనుంజయుడు మాటాడక పోవటంతో తనూ మౌనంగానే వుండిపోయాడు. అశ్వాలు వాయు వేగంతో పరుగు తీస్తూనే వున్నాయి.

**********************************

రాజధాని రత్నగిరి నగరం.

రాత్రి సమయం.

ప్రధమ యామం జరుగుతోంది.

పశ్చిమ సముద్రం మీదుగా చల్లటి గాలులు వీచి నగర వాసుల్ని సేద తీరుస్తున్నాయి.

అది ఉప సైన్యాధ్యక్షుడైన బాహ్లీకుని నివాస గృహము. నగర మధ్యంలో ఎత్తయిన ప్రాంతంలో వుంది. సైనిక శిబిరాల నుండి అప్పుడప్పుడూ యిలా తన నిజ గృహానికి వచ్చి రెండు దినాలు వుండి వెళ్ళటం బాహ్లీకుని అలవాటు. మూడు అంతస్థులు కలిగిన ఆ నివాస గృహము ఉప్పరిగెమీద అర్ధ చంద్రుడి వెన్నెట్లో ప్రశాంతంగా కూచుని మధిర సేవిస్తున్నాడు బాహ్లీకుడు. మెత్తని

ఆసనం మీద అతడు ఆసీనుడై వుండగా, అతడి కాళ్ళ దగ్గర చిన్న బల్ల పక్కనే నేల మీద చతికిల బడి వున్నాడు కరోతి.

తీవ్రంగా ఆలోచిస్తూ మనోహరమగు నగర రేతిరి దృశ్యాన్ని వీక్షిస్తున్నాడు బాహ్లీకుడు. అతడి ముఖంలో ఎందుకో అసహనం దోబూచులాడుతోంది.

ఎదురుగా తీరం వెంట నగర భవంతులు వాటికి ఆవల వెన్నెల కాంతికి ప్రతిఫలిస్తూ పశ్చిమ సముద్ర జాలాలు లంగరు వేసున్న కొన్ని ఓడలు, చేపలు పడవలు కన్పిస్తున్నాయి. ఇటు వాయువ్యంగా రత్నగిరి కొండ, కోటను చుట్టి అగడ్త, కోటలో సైనికులు వెలిగించిన దివిటీల కాంతి స్పష్టంగా కన్పిస్తోంది. సముద్ర కెరటాల హోరు ఈ రోజు అధికంగా వినవస్తోంది. దిగువన వీధిలో జన సంచారం తాలూకు సందడి కర్ణా కర్ణిగా విన వస్తోంది.

బాహ్లీకుని దృష్టి ఇప్పుడు పూర్తిగా`

దూరంగా కన్పిస్తున్న కోటపైనే వుంది.

ఆ కోటలో పాగా వేసే రోజు తనకు ఇంకెన్ని రోజులకు వస్తుంది? రత్నగిరి గద్దె మీద తను పట్టాభిషిక్తుడు ఆయే ముహూర్తం ఎప్పుడు? అనుకున్న పనులు జర జరా జరుగుట లేదే! యువ రాజు ధనుంజయుడి చావుతో తన తొలి పాదం ఆరంభం కావాలనుకున్నాడు. తన గూఢచారుల్లో సమర్ధులను ఎంచి మూడు బృందాలుగా మూడు చోట్లకు పంపించాడు. ఏమి జరిగిందో గాని ఒక్క బృందం నుంచి కూడ ఇంత వరకు శుభ సమాచారం రాలేదు.

అటు చూస్తే శతానీకుడు ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయి. రత్నగిరిలో పరిస్థితి ఏమిటి? అంటూ పావురాల ద్వారా గాంధారం నుండి సందేశాలు పంపిస్తున్నాడు. యువ రాజును అంతం చేస్తే గాని తన అడుగు ముందుకు వేయ లేడు. అందుకే అసహనంగా ఉన్నాడతను. ఎప్పుడు రత్నగిరి తన వశమవుతుందా ఎప్పుడు సింహాసనం ఎక్కుతాడాని ఉవ్విళ్ళూరుతున్నాడు.

పక్కనే నేల మీద కూచున్న కరోతి కాళీ అయిన బంగారు లోటాను తిరిగి మధిరతో నింపుతూ బాహ్లీకుని నిశితంగా గమనిస్తున్నాడు.

పావు రాయిలకు తర్ఫీదునిచ్చే తన సేవకుడు కరోతిని గాంధార రాజు శతానీకుడు ఇక్కడ వదిలి పోయాక వాడు తన లౌక్యంతో బాహ్లీకునికి చాలా దగ్గరయ్యాడు. ఇప్పుడు వాడే బాహ్లీకుని అంతరంగ సేవకుడు. తన మనసులో ఆలోచనల్ని కరోతితో పంచుకొంటూ వుంటాడు. వాడి ఇచ్ఛకాలను శ్రద్ధగా వింటాడు. వాడ్ని పూర్తిగా నమ్ముతున్నాడు. ఇలా ఏకాంతంలో ఉన్నప్పుడు ఒక కరోతి మాత్రమే పక్కన వుంటాడు. ఇతర సేవకులుగాని సైనికులు లేదా సైన్యాధిపతులకు గాని ఎవరికీ అనుమతి వుండదు. ఎవరూ ఉప్పరిగె మీదకు రాకుండా దిగువనే ఇద్దరు సేవకులు వారిని ఆపేస్తుంటారు.

ఎంతటి గొప్ప వారైనా కొందరిలో ఇంతులు చెప్పెడి మాటలు వినటం, అందులో నిజానిజాలు గ్రహింపకనే నిర్ణయాలు తీసుకోవటం ఒక బలహీనతగా వుంటుంది. అలాగే స్వయం నిర్ణాయాధికారం వున్నా ఇతరుల సలహాలను పాటించే అలవాటు మరి కొందరిలో వుంటుంది. ప్రస్తుతం బాహ్లీకుడు కరోతి మాటకు అంత విలువ యివ్వటం అతడి అదృష్టమో దురదృష్టమో అతడికే తెలియాలి.

వెన్నెట్లో కూచుని మధిర సేవిస్తూ రత్నగిరి కోటనే తదేకంగా చూస్తున్న బాహ్లీకుని చూసి దరహాసం చేసాడు కరోతి.

‘‘ప్రభు! దీనికి ఇంతగా మీరు ఆలోచించాల్సిన పని లేదు. అతి త్వరిత గతిని ఆ కోట మీ వశము గాక తప్పదు. ఇలాగే ఆ కోట పైన మనం వెన్నెట్లో కూచుని మీరు మధిర సేవిస్తుంటే నేను గ్లాసు నింపకా తప్పదు.’’ అన్నాడు చలోక్తిగా.

కరోతి మాటలకు తనూ నవ్వాడు బాహ్లీకుడు.

‘‘మా ఆశ ఆశయము కూడ అదేనురా కరోతి. కాని ఇంకనూ మేము ఎన్ని దినములు వేచి వుండ వలెనో తెలికున్నది. యువరాజు మరణ వార్త ఇంకనూ మనకు చేరనే లేదు. వెళ్ళిన మూడు బృందాలూ ఏం చేస్తున్నావో, ఎచట నున్నవో అర్థము గాకున్నది. శతానీకుల వారితో జరిగిన ఒప్పందము ప్రకారము నాలుగు మాసముల వ్యవధిలో ఒక నెల జరిగి పోనున్నది. ఈ పరిస్థితులలో చింతింపకుండా వుండ గలనా?’’ అన్నాడు.

కరోతి వికవికా నవ్వాడు.

‘‘దీనికంత చింతయేలను ప్రభు. తమ చెంతనే ఉన్నాడుగా ఈ కరోతి.’’ అన్నాడు.

‘‘ఉండి. నీవు చెంత వుండి ఫలమేమిరా? అచట గాంధారమున మన కోసం శతానీకుల వారు సైనిక సమీకరణ గావించుచున్నారు. ఇక్కడ చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అచటనే వున్నది. యువ రాజు ధనుంజయుని అంతం చేసినారో లేదో తెలియకున్నది...’’

‘‘చేయకున్న ఏమాయె ప్రభూ. మన వాళ్ళు గాకున్న ఏ ప్రమాదమో ఆయన్ని బలి తీసుకొంటుంది. వెళ్ళినది ఎక్కడికి? నాగ లోకమునకు. మరలి వచ్చుట సంభవమా? కోటలో మహారాణి వారు రాజు గారి ఆరోగ్యం కోసమూ, కుమారుని క్షేమము కోసమూ నోములూ, వ్రతాలూ ఆచరిస్తున్నారట. కనిపించని దేవుళ్ళు వచ్చి కాపాడు వారా యేమి పిచ్చి గాని’’ అన్నాడు.

‘‘ఇంతకూ ని మనసులో ఏముందిరా?’ కుతూహలంగా అడిగాడు బాహ్లీకుడు.

‘‘ప్రభూ! మనకు కావలసినది యుద్ధము, విజయము. ఒక నెల సమయమిచ్చి యువ రాజా వారు మరణించినారని ఇక్కడ పుకారు పుట్టించి ఆ వెంటనే శతానీకుల వారిని ససైన్యంగా తరలి రమ్మని యువరాజు అంతమైనాడని పావు రాయి ద్వారా సందేశం పంపించేద్దాము. చాలు. యుద్ధం తథ్యం.’’ అన్నాడు కరోతి.

వాడి మాటలు బాహ్లీకునకు కొంత పూరట నిచ్చాయి. యుద్ధానికి ముందే యువ రాజు తిరిగి వస్తే కొంత ఇబ్బంది తప్పదు గాని ఆరంభమయ్యాక వస్తే ఏమీ చేయ లేడు. లేదా ఈలోపే తన మనుషులు అతడ్ని అంతం చేయ వచ్చు. కరోతి మాటలకు సమ్మతిస్తున్నట్టు తల వూపాడు బాహ్లీకుడు.

*************************************

నాగలోకం.

నాగ రాజు మహా పద్ముడి రాజ మందిరం.

మందిర అంతర్భాగం అంతటా మణి మయ రత్న కాంతులతో ధగ ధగాయ మానంగా మెరిసి పోతోంది. అది నాగ రేడు సభా మందిరానికి బయలుదేరు సమయం. ఆయన దేవేరి కీర్తి మతి కూడ పక్కన వుంది. ఆ సమయంలో `

యువ రాణి ఉలూచిశ్వరి బిర బిరా ఆ మందిరం లోనికి ప్రవేశించింది. హఠాత్తుగా తమ గారాల పట్టి రాక ఆ నాగ దంపతులకు విస్మయం కలిగిలించింది. ఆయిననూ `

‘‘రమ్ము పుత్రీ! తక్క సమయమున కేతెంచినావు’’ అంటూ దరహాసంతో పలికాడు నాగ ప్రభువు.

‘‘తక్క సమయమా! అది యేమి జనకా?’’ చెంతకు వస్తూ తన విస్మయాన్ని ప్రకటించింది ఉలూచిశ్వరి.

‘‘అవును తల్లీ. తక్క సమయమే. ఇప్పుడే... నీ వివాహము గూర్చి చర్చించుకొంటిమి. నీ కొరకు తగిన వరాన్వేషణ ఆరంభించనున్నాము’’

‘‘వరాన్వేషణా... నా కోసమా... క్షమించండి తండ్రీ. నా పరిణయమున కిది తరుణము గాదు. ఇప్పుడే నాకు వివాహేచ్ఛ లేదు. నేను వచ్చిన పని వేరే యున్నది.’’

ఆ మాటకు ముఖ ముఖాలు చూసుకుని మరిపెంగా నవ్వుకున్నారు రాజ దంపతులు. ‘‘నీ వయసు నీకు తెలియకున్నది పుత్రీ. నీ విపుడు బాలికవు గాదు. యుక్త వయస్కురాలివి. నీ వివాహము వైభవోపేతముగా జరిపించుట మా బాధ్యత గదా! ఒక వేళ నీ మనసుకు నచ్చిన నాగ కుమారుడుంటే సంశయింపక జెప్పుము. నీవు వరించిన ఆ అదృష్టవంతునికే యిచ్చి మీ పరిణయము గావించెద’’ అన్నాడు.

‘‘లేదు లేదు జనకా. నా మనసున ఎవరును లేరు’’ అంది వెంటనే. కాని ఆమె మనసున రత్నగిరి రాకుమారుడు మెదలుతున్నాడు. ఆ విషయం చెబితే తండ్రి తనను నాగ లోకము నుండి బయటకు పోనీయడని తెలుసు. తిరిగి తండ్రి మాటలతో ఆలోచనల నుంచి బయట పడి అటు చూసింది.

‘‘సంతోషము. నీ మనసున ఎవరును లేకున్న ఏమాయె. మేము ఎంపిక జేసిన వరుని వరింప వచ్చును. ఇంకను సమయమున్నదిలే. ఇంతకూ నీవు వచ్చిన పని యేమి?’’ నుదురు ముడుతలు పడుతూండగా సూటిగా చూస్తూ అడిగాడు నాగ రాజు.

‘‘జనకా! తమ అనుమతి కోరి వచ్చితి’’ మృదువుగా పలికింది ఉలూచీశ్వరి.

‘‘మా అనుమతియా? ఎందులకు?’’

‘‘వింధ్యాటవిలో వన విహారము జేయ మనసైనది జనకా. మీరు అనుమతిచ్చిన, చెలులతో పోయి వచ్చెదను’’

ఒకింత అసహనంగా కుమార్తెను చూసాడు నాగ ప్రభువు.

‘‘వలదు వలదు పుత్రీ. ఇందులకు సమ్మతించు వాడను గాను.’’ అన్నాడు వెంటనే.

తండ్రి అభ్యంతరము చెప్పటంతో`

ఒకింత నిరాశకు గురైంది యువ రాణి. అయినా వెంటనే తేరుకుని`

‘‘తండ్రీ! ఇందుకు అభ్యంతరమేమున్నది? మీరు అనుమతింప వలె’’ అంది ధైర్యం తెచ్చుకుంటూ.

‘‘ఎటుల అనుమతింప గలను? నీవా తరుణ వయస్కవు, చిన్న పిల్లవు గావు. ప్రమాదములతో కూడిన వన విహారములకు ఆడపిల్లలు మీరు పోనేల? అదియును గాక ఢాకిని వనముల విహరించి వచ్చి పది దినములు కాలేదు తిరిగి వింధ్యాటవికేల పోవలె. వలదు వలదు.’’ అన్నాడు అయిష్టంగా.

‘‘వింధ్యాటవి ఈ ఋతువున కడు రమ్యముగ ఉండునట. ఈసారికి అనుమతించరూ?’’ ఋంగ మూతిపెట్టి తల్లి కీర్తి మతిని చూస్తూ తండ్రిని అభ్యర్థించింది.

కుమార్తె అభిప్రాయము గ్రహించిన రాణి కీర్తి మతి భర్త భుజం మీద చేయి వేస్తూ` ‘‘ పోనిండు ప్రభు! వెళ్ళిన ప్రతి సారీ క్షేమము గనే వచ్చుచున్నారు గదా. వెంట చెలులుండనే వుంటారు. ఈ సారికి వెళ్ళి రానిండు. ఈలోపల మనము వరాన్వేషణ గావించి వరుని ఎంపిక జేసి ఉంచెదము గాక. ఏమందురు?’’

ఎంతయినా మహా రాణి మాట తోసి పుచ్చ లేడు గదా. ఆమె సలహా సబబు గానే తోచింది నాగ రేడుకి. తల పంకించి కుమార్తె వంక చూసాడు.

‘‘సరి. ఇంతగా వేడుకొంటున్నావు గాబట్టి ఈ సారికి కడు భద్రముగా పోయి రమ్ము. తుదపరి నీ వివాహమే.’’ అన్నాడు నవ్వుతూ.

తండ్రి అనుమతి లభించటంతో`

ఆనందంతో పొంగి పోయింది ఉలూచీశ్వరి.



‘‘కృతజ్ఞురాలిని జనకా. పోయి వత్తును’’ అంటూ తల్లి దండ్రుకు నమస్కరించి వెను తిరిగింది ఉలూచిశ్వరి. ఈ తూరి వెడునది వన విహారమునకు కాదని, తను వరించిన రత్నగిరి రాకుమారుడు ధనుంజయుని కలుసుకోవడానికని తెలిస్తే నాగరాజు ఎలా స్పందించే వాడో గాని, ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం యువ రాణి తన అంతరంగిక చెలికత్తెలు నలుగురితో నాగలోకము విడిచి ఆ పూటే మర్మ భూమికి చేరుకుంది.

అక్కడ సంపంగి వనము బయట ఆమె కోసం శంఖు పుత్రి ఎదురు చూస్తోంది. చెలికత్తెలు నలుగుర్ని సంపంగి వనమున తాను తిరిగి వచ్చు వరకు వేచి ఉండమని వుంచి తను వెళ్ళి శంఖు పుత్రిని కుసుకుంది. ఇరువురూ ధనుంజయుని కోసం వింధ్యాటవికి బయలుదేరారు.

ఈలోపల అక్కడ నాగ లోకంలో నాగరాజు మహా పద్ముడు తన రాజ మందిరం నుండి సభా మందిరానికి చేరుకునే సరికి ప్రతిహారి ఒకడు ఆయన దర్శనార్థం వేచి వున్నాడు.

‘‘ఏమైనది?’’ గంభీర స్వరముతో ప్రశ్నించాడు నాగరాజు.

‘‘అంతగా ఆశా జనకమగు వార్త కాదు ప్రభు’’ తల వంచుకొని సవినయంగా మనవి చేసాడు ప్రతిహారి.

‘‘కానున్న ఏమాయె? ఎంత దూరము రాగలడు ఆ రాకుమారుడు? అదియును జూచెదము గాక. సంశయింపక ఏమి వార్త తెలిసినది చెప్పుము’’

‘‘మనమిచట నుండి ప్రేరేపించిన ఎగిరే నాగములనేకము ఆ యువరాజు ఖడ్గమునకు బలి కాగా, అతడు తప్పించుకున్నాడట. అగ్ని సర్పమును సంహరింపగా రుచికునకు శాప విమోచనం జరిగి తన యక్ష లోకం వెళ్ళి పోయినాడట. సహ్యాద్రి వెళ్ళి భీమ శంకర క్షేత్రమును దర్శించి ధనుంజయుడు ప్రస్తుతం మాళవ సరిహద్దు వైపు సాగి పోతున్నటు తెలిసినది’’ అంటూ తనకు అందిన సమాచారమును విన్నవించాడు.

అంతా శ్రద్ధగా విని` తల పంకించాడు నాగరాజు.

ఒకింత కోపంతో కనులు ఎర్ర బారి శ్వాస బరువైంది. ఆవేశాన్ని అదుపు చేసుకుంటూ సాలోచనగా చూసాడు.

“ఆ మూర్ఖునకు అర్థము గాకున్నది! చచ్చుటకే వచ్చుచున్నాడు. ఎన్ని అడ్డంకులు కల్పించిననూ ప్రాణమును లేక్క చేయక మును ముందుకే వచ్చుచున్నాడు. రానిమ్ము వింధ్య సానువు దాటిన పిదప తగిన శాస్తి అనుభవింప గలడు. అంత వరకు ఓ కంట గమనింపుమని నా మాటగా నాగానాయకుడు నాగ కేసరికి కబురు చేయుము.” అంటూ ఆజ్ఞాపించి నేరుగా సభా మందిరంలోకి వెళ్ళి పోయాడు నాగరాజు.

*************************************************************

అది ఒక రమణీయ ప్రకృతి శోభ.

ధనుంజయ, అపర్ణలు అక్కడికి చేరుకునే సరికి సరిగ్గా మిట్ట మధ్యాహ్నపు వేళ అయింది. సూర్యుడి ప్రతాపం మరింత ధాటిగా వుందీ రోజు. ఎండ వేడిమి ఉక్క పోతకు శరీర తాపం అధికరించింది. అశ్వాలు కూడ డస్సి వున్నాయి. మాళవ రాజ్య సరిహద్దు అక్కడికి ఇంకో రోజు ప్రయాణ దూరంలో వుంది.

ప్రస్తుతం అశ్వాలు ఆగినది ఒక లోయ ప్రాంతం. మాళవం వైపు సాగే మహా పథం ఈ లోయ గుండా పోతోంది. బాటకి ఎడం పక్కన కొంత దూరంలో కొన్ని ఎత్తయిన పర్వత శ్రేణులున్నాయి. ఆ పర్వతాల మధ్యగా వస్తున్న కొండ వాగు ఒకటి ఒక ఎత్తయిన కొండ గుట్ట నుండి మూడు అంచులుగా జారి దిగువన ఒక మడుగు లోకి దూకుతోంది. అది తూర్పుగా కొన్ని యోజనాల దూరం ప్రవహించి క్షిప్రానదిలో కలుస్తుంది.

అన్ని ఋతువుల్లోనూ ప్రవహించే ఈ జల పాతపు నీరు మడుగును చుట్టి ఉన్న అటవీ ప్రాంతాన్ని ఎల్ల వేళలా పచ్చగా ఉంచుతుంది కాబట్టి అక్కడ అనేక ఫలవృక్షాలు, సౌరభాలు వెదజల్లే పుష్పాలతో కూడిన చెట్లు, మొక్కలు, తీగలు కనువిందు చేస్తున్నాయి. ఇక మూడు అంచులుగా జాలు వారుతున్న జలపాతాన్ని ఆ కొండ గుట్ట అందాలను చూడ వలసిందే గాని చెప్పనలవి కాదు.

శుక పిక శారికాలు ఆహ్వానం పలుకుతున్నాయి. పుష్పజాతులు కనువిందు చేస్తూ తమ సువాసనలతో మురిపిస్తున్నాయి. శీతల గాలులు సేద తీరుస్తున్నాయి. ఆ ప్రాంతం మనసుకు, శరీరానికి కూడ హాయినిస్తుండగా అశ్వాలు దిగకుండానే అక్కడి ప్రకృతి

శోభకు పులకింప సాగారు.

ధనుంజయ, అపర్ణులు అంబాపురములో బయలుదేరి ఇది ఆరవరోజు. ప్రతి దినము వేకువనే ముందుగా లేచిన అపర్ణుడు తాను వెళ్ళి స్నానాదికాలు ముగించు కొని వచ్చి ధనుంజయుని నిద్ర లేపుతున్నాడు. నాలుగు రోజుల తర్వాత అటవీ ప్రాంతంలో ఎక్కడా మార్గంలో నీటి వనరులున్న ప్రాంతాలు లేవు కాబట్టి రెండు దినముగా స్నానాదికాలు చేయక మహా ఇబ్బందిగా వుంది. అందుకే జలపాతాన్ని చూడగానే ప్రాణం లేచి వచ్చినట్టుంది ఇరువురికీ.

"అయ్యారే! కడు అద్భుతము. ఆశ్చర్యము. మా రాజ్యమున స్వర్గమును తలపించు ఇంతటి మనోహర ప్రదేశమొకటి కలదని మాకే తెలియదు సుమా. నన్నిటకు గొని వచ్చిన నీకు కృతజ్ఞుడను మిత్రమా." అన్నాడు పులకించి పోతూ ధనుంజయుడు.

ఫక్కున నవ్వాడు అపర్ణుడు.

"ప్రభు! ఇది తమ రాజ్యము. ఆ ప్రదేశము మీది. ఇందులో నాకు కృతజ్ఞతలు జెప్పు పని యేమున్నది? మీకు తెలియని సందర్శనా స్థలము మీ రాజ్యమున ఇంకనూ అనేకము గలవు" అన్నాడు.

"ఆహాఁ! అవన్నియు సందర్శింప వలసినదే. వెళుచున్న కార్యము జయ ప్రదమైన పిమ్మట మరొక్క సారి ఇరువురము రాజ్యమున పర్యటించక తప్పదు."

"అలాగే ప్రభూ." అంటూ అశ్వం దిగాడు అపర్ణుడు.

"ఇది యేమి? మనమింకను జలపాతమును చేరలేదు. ఆలస్యమేల పద. స్నానమాచరించెదము."

"స్నానమాచరించిన చాలునా ప్రభూ? భోజనము వేళయినది. మన వద్ద తినుటకు ఫలములు కాయలు నిండుకున్నవి. నేను అశ్వముకు తటాకమున నీరు తాపించి ఇచటనే వేచి వుండెదను. మీరు స్నానము గావించి రండు. ఈలోపల ఫలములు సేకరించి వుంచెదను."

‘‘నీవు స్నానము ఆచరింపవా?’’

‘‘మీరు వచ్చిన పిమ్మట నేను పోయి వచ్చెదను.’’

‘‘ఇది యేమి విడ్డూరము? ఇరువురము పురుషలమే గదా. నాతో వచ్చి స్నానమాచరించుటకు అభ్యంతరమేమి?’’

‘‘అవును ప్రభూ అభ్యంతరమే. ఏకాంతమున స్నానమాచరించుట మా వంశాచారము’’ అన్నాడు అపర్ణుడు.

‘‘ఓహో! మీ వంశమున పురుషులు కూడ స్త్రీల వలే ఏకాంతమునే స్నానమాచరింతురా! బాగు బాగు. ఇంకను మీ వంశమున ఏమేమి ఆచారములు కలవు?’’ కొంటెగా అడిగాడు.

అది వంశాచారము కాదని, తనతో కలిసి స్నానమాచరించిన తన గుట్టు బయట పడునను భయం లోనే ఆచారము సాకు చూపి అపర్ణుడు తప్పించుకొంటున్నాడని వూహించాడు ధనుంజయుడు. ఇప్పుడు కూడ తప్పించుకొంటున్నాడంటే భద్రా దేవి వేరు అపర్ణుడు వేరు కాదు. ఇరువురూ ఒకటేయను అభిప్రాయము అతనిలో స్థిర పడి పోయింది.

అపర్ణుడు ఒకింత అలిగినటు ధనుంజయుని గంభీరముగా చూస్తూ` ‘‘ప్రభువులు క్షమించాలి. మా వంశాచారము, కులాచారమును పాటించుట నా ధర్మము. అందుకు మీరు పరిహసింప పని లేదు’’ అన్నాడు.

‘‘అయ్యో..! నేను పరిహసించుట లేదు మిత్రమా. నిజముగనే తెలియ గోరి అడిగితిని. నీకు బాధ కలిగించి వుంటే క్షంతవ్యుడను’’ అంటూ అశ్వం దిగాడు ధనుంజయుడు.

అక్కడికి జలపాతం దిగువ ప్రాంతం అగుపించదు. చెట్ల పొదలు దట్టంగా అడ్డుగా వున్నాయి. తనకు అవసరమైన దుస్తులు తీసుకుని మడుగును చుట్టి జలపాతం వైపు వెళ్ళి పోయాడు యువ రాజు. అతడు అటు వెళ్ళగానే అశ్వాలు రెంటినీ మడుగులో నీరు తాపించి పచ్చిక మీద మేతకు వదిలాడు అపర్ణుడు. సమీప వృక్ష శాఖల నుండి మామిడి పండ్లు, పనస పండ్లు, అరటి, జామ ఫలాలను సేకరించి తెచ్చాడు. చక్కగా నీడనిస్తున్న వృక్ష ఛాయలో కంబళి పరిచి తెచ్చిన ఫలాలు దాని మీద వుంచి విశ్రాంతిగా కూచున్నాడు.

చాలా సేపటి తర్వాత తిరిగి వచ్చాడు ధనుంజయుడు. తడి దుస్తుల్ని డొంక మీద ఆరేసాడు. జలపాతం క్రింద అలుపు తీరా స్నానం చేయటంతో ఇప్పుడు మనసు, శరీరం కూడ అతనికి ప్రశాంతంగా వుంది. వచ్చి అపర్ణుడి సమీపంలో కూచున్నాడు.

‘‘నేను పోయి స్నానమాచరింతును’’ అంటూ లేచాడు అపర్ణుడు. సమ్మతముగా తలాడించాడు ధనుంజయుడు.

‘‘ప్రభూ! నేను తిరిగి వచ్చు వరకు మీరిచటనే వుండవలె. పొరబాటున కూడ అటు చూసి మా ఆచారమునకు భంగము కలిగించ రాదు’’ అన్నాడు.

‘‘అటులనే మిత్రమా. పోయి రమ్ము’’ అన్నాడు ధనుంజయుడు. అపర్ణుడు బయలుదేరి వెళ్ళాడు.వృక్ష ఛాయలో కూచుంటే చల్లటి గాలికి నిద్ర ముంచుకొస్తోంది. ఆకలి కన్నా నిద్రే ముఖ్యం అనిపిస్తోంది. కాని సందేహ నివృత్తి కోసం మనసు తహ తహ లాడుతోంది.

అపర్ణుడి గుట్టు తెలుసు కొనుటకు ఇది చక్కటి అవకాశము. రెండు దినములుగా స్నానమునకు అవకాశం లేనందున సాహసించి స్నానానికి పోతున్నాడు గాని లేకుంటే వెళ్ళే వాడు కాదు. అలాగని మరొక్క అవకాశము చిక్కునను నమ్మకమూ లేదు. పొదల వెనకనుండి చాటుగా జల పాతం వైపు చూడమని మనసు తొందర చేస్తోంది. అలాగని మాటిచ్చి తప్పుట క్షత్రియ ధర్మం కాదంటూ అంతరంగం సతాయిస్తోంది.

కొద్ది క్షణాలు గుంజాటన తర్వాత చివరకు గుట్టు తెలుసుకొనుటకు మరుగున వుండి వీక్షించుట తప్పు గాదని తోచినది. అంతే.... ఇక సందేహాలను పక్కన పెట్టి లేచాడు.

అశ్వాలు గరుడ, ఢాకినీ రెంటికీ చక్కని జోడి కుదిరింది. అవి జంటగా పక్క పక్కనే తిరుగుతూ పచ్చిక మేస్తున్నాయి. ధనుంజయుడు మడుగు వద్ద కెళ్ళాడు. పొదల వెనక ఆకుల కొమ్మల మాటు నుండి మడుగు అవలతున్న జల పాతం వైపు దృష్టి సారించాడు.

కొద్ది సేపటికి` ధనుంజయుడు చూస్తుండగానే

అపర్ణుడు జల పాతం వద్దకు చేరుకున్నాడు.

పొడి దుస్తుల్ని పక్కన బండ మీద వుంచి అవి గాలికి ఎగిరి పోకుండా బరువుకి ఒక రాతి ముక్కనుంచాడు. చుట్టూ పరికించి చూసాడు. ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక అప్పుడు`

అప్పుడు తలపాగా తీసి తల విదిలిస్తూ తల పాగాను జాగ్రత్తగా బండ మీద ఉంచాడు. చూస్తున్న ధనుంజయునికి కొద్ది క్షణాలు గుండె లయ తప్పింది. రెప్పవాల్చటం మర్చి పోయాడు. ఎందుకంటే` తలపాగా తీసిన మరు క్షణం`

అంత వరకు మడిచి తలపాగాలో బంధించి, బిగించి వుంచిన తలకురులు, తల విదిలించగానే జల పాతంలా ఒక్క సారిగా కిందకు జాలు వారాయి. తుమ్మెద రెక్కల్లా నిగ నిగ లాడుతున్న దట్టమైన నల్లటి కేశ సంపదకు ఒక్క సారిగా విడుదల లభించింది. మోకాళ్ళను తాకే నిడుపాటి కురులను చూడ గానే అర్థమై పోయింది. అపర్ణుడు పురుషుడు కాదు స్త్రీయని. ఆ స్త్రీ ఎవరో కాదు తను వలచిన భద్రా దేవి. ఇక చెప్పాలా... యువ రాజు హృదయం ఆనందంతో ఉరకలేసింది. తనను తాను అదుపు చేసుకున్నాడు. తను యువతి అయి వుండి కూడ ఇంతగా పురుషుడిగా నటించటం అపర్ణుడికే చెల్లింది. సందేహం తీరి పోయింది.

ఆరోజు సహ్యాద్రి పైన తను అనుమానించిందే నిజమైంది. నీలవేణి మనవరాలు భద్రా దేవిగా స్నాన ఘట్టం వద్ద కన్పించిన అపర్ణుడు తనను చూడగానే త్వరగా దైవ దర్శనం గావించుకొని ఇంటికి పోయి తిరిగి అపర్ణుడిగా తన ముందుకొచ్చాడు. భద్రాదేవి ఎంతటి చతుర? తలచుకుంటేనే విస్మయం కలుగుతోంది.

అక్కడ జలపాతం వద్ద భద్రాదేవి ఒక్కటొక్కటే తను మగ వేషం దుస్తులు తొలగించి నగ్నంగా ఉన్న వంటికి పల్చని వస్త్రం చుట్టు కుంటోంది. పసిడి బొమ్మలా మెరిసి పోతున్న ఆమె నగ్న సౌందర్యాన్ని చూస్తూ వివశుడై పోయాడు. అయితే వెంటనే తేరుకున్నాడు. నగ్న సౌందర్యాన్ని వీక్షించటం సభ్యత కాదని మనసు హెచ్చరించటంతో చూపులు తిప్పుకున్నాడు. ఏమీ తెలియనట్టే వెనక్కి వచ్చి కంబళి మీద మేను వాల్చాడు. కన్ను మూసినా తెరిచినా మెరుపు తీగ లాంటి భద్రాదేవి సౌందర్యమే కళ్ళ ముందు మెదులోంది. ఆలోచన మధ్య చల్ల గాలికి తనకు తెలియకుండానే నిద్ర పట్టేసింది.

అలా ఎంత సమయం గడిచిందో తెలిదు.

పక్కన అలికిడయితే తిరిగి మెలకువ వచ్చింది ధనుంజయుడికి. అయినా కూడ నిద్ర నటిస్తూ అలాగే వుండి పోయాడు.

గుట్టు తెలిసి కూడ ఇంకా ఉపేక్షించి మిన్న కుండుట ధనుంజయునికి ఇష్టం లేదు. వాస్తవంగా భద్రాదేవి ఎవరు? మగ వేషంలో ఎందుకు తిరుగుతోంది? ప్రయాణం ముందుకు సాగే కొలది తన గురించి తెలుసుకునే అవకాశం లభించక పోవచ్చు. కాబట్టి ఇప్పుడే ఆమె గురించి తెలుసుకోవాలని నిశ్చయానికొచ్చాడు. అలాగని తను మరుగున వుండి ఆమెను చూసిన విషయము బయట పడ కూడదు. అతడి ఆలోచనల్ని భగ్నం చేస్తూ` ''ప్రభూ! ఇక లేవండి'' అంటూ అపర్ణుడి పిలుపు విన వచ్చింది. ధనుంజయుడు ఉలక లేదు పలక లేదు.

చట్టున ఆ చేతిని అందుకున్నాడు ధనుంజయుడు. కుసుమ కోమలమగు ఆ చేతిని మృదువుగా తడుముతూ` ''ప్రియ సఖీ భద్రా... వచ్చితివా... భద్రాదేవి... కరుణించితివా!'' అంటూ కలవరించాడు.

''అయ్యో ప్రభు! నేను మీ భద్రా దేవిని గాను, అపర్ణుడను. దయతో కరము వదిలి లేవండి'' అంటూ చేతిని వెనక్కు తీసుకో బోయాడు. కాని చేయి విడువ లేదు ధనుంజయుడు.

''కనికరము జూపకున్న కరము విడువను భద్రా... కలలో సాక్షత్కరించి పారిపో జూచుట న్యాయమా!'' అన్నాడు.

అపర్ణుడిగా మగ వేషంలో వున్న భద్రా దేవికి ఏం చేయాలో అర్థం కాలేదు. ధనుంజయుడికి సత్యము తెలిసి పోయినదేమో తెలియకున్నది. ''ప్రభు! నిద్ర మేల్కొనండి. నేను భద్రా దేవిని గాను'' అంటూ చేతిని విడిపించుకో బోయింది కాని ధనుంజయుడు ఆమె చేతిని బలంగా మీదకు లాగటంతో ఒక్క సారిగా తూలి అతడి మీద పడి పోయింది. ఆ విసురుకు తలపాగా ఎగిరి అవతల పడగా ఆమె కేశ సంపద చెదరి ధనుంజయుని ముఖాన్ని కరి మబ్బులా కప్పేసింది.

తత్తర పడి లేవ బోతున్న భద్రా దేవిని తన ఆజానుబాహువులతో ఆమె ఛాతిని చుట్టేసి మీదకు లాక్కున్నాడు.

వూహించని సంఘటనకు కంగారు పడి తలపాగాను అందుకోబోయింది భద్రా దేవి. ఆమెకా అవకాశం యివ్వకుండా మరింతగా కౌగిలి బిగించి ముఖం మీది జుత్తును తప్పించి చిలిపిగా ఆమె సోగ కళ్ళ లోకి చూసాడు ధనుంజయుడు. సిగ్గుతో ఆమె బుగ్గలు కెంపులై కనురెప్పలు బరువై వాలి పోయాయి.

''ఇంకా ఎన్ని దినములు ఈ మగ వేష ధారణ?'' నిను వలచితినని తెలిసి కూడ నన్నిలా ఏమార్చుట న్యాయమా? నీ గుట్టు నాకు తెలిసి పోయె. ఇప్పుడేమి చేయ వలె?'' అనడిగాడు కొంటెగా.

ఓసారి కనురెప్పలు ఎత్తి అతడి కళ్ళలోకి చూసి వెంటనే సిగ్గిలి అతడి వక్ష స్థలమున మోము దాచుకుంది.

''ప్రభువులకిది తగునా? తమరింతటి చిలిపి వారు, కొంటె వారని తెలియక జలకమాడ బోతిని. మరుగున వుండి స్త్రీలను వీక్షించుట మీ వంటి మగ ధీరులకు తగదు గదా'' అంది చిన్నగా.

''నిజమే. నేను స్త్రీలను జూడ లేదు. నా ఇష్ట సఖిని మాత్రమే జూచినాను. నీవు మాత్రం కులాచారము వంశాచార మంటూ సాకు చెప్పి తప్పించు కొనుట పాడియా?'' గడుసుగా ఎదురు ప్రశ్నించాడు ధనుంజయుడు.

''మీ వలపునకు అర్హురాలను గాను. అందుకే అలా చెప్పితిని'' అంటూ చిన్నగా బుదులిచ్చింది భద్రా దేవి.

''ఆ విషయము నిర్ధారించుకో వలసినది మేము గదా... ఒక వేళ నీ మనసున మాపై వలపు లేకున్న ఒక్క మాట జెప్పుము చాలును. నిను విడుతును. ఇక మీదట నిను పురుషుని గానే భావింతును. నిస్సంకోచముగా తెలుపుము.''

ఆ మాటలకు నోటితో బదులు చెప్ప లేదు భద్రా దేవి. విశాలమగు ధనుంజయుని వక్షస్థలమున సుతారంగా తన పగడాల పెదవు లాన్చి గోముగా ముద్దాడింది.

భద్రా దేవి తన హృదిలో ధనుంజయుని ఎంతగా ఆరాధిస్తోందో తెలియడానికి ఆ ఒక్క ముద్దు చాలు. పులకించి పోతూ ఆమె బుగ్గను స్పృశించి దోలిసితో ముఖారవిందాన్ని పైకి లేపి తన వైపున తిప్పుకున్నాడు. కొన్ని లిప్తకాలం ఒకరి నొకరు ఆరాధనగా చూసుకున్నారు. నును సిగ్గున ఎర్ర బారిన చెక్కు టద్దాలు చూసాడు. అర మూతలయిన కను దోయిని చూసాడు. అదురుతున్న పగడాల పెదవుల్ని చూసాడు. అంతే`

ఇక తాళలేక ఆమెను మరింతగా పొదుపుకుని మీదకు లాక్కొంటూ మురిపెంగా అధరాలను ముద్దాడాడు.

''భద్రా దేవి! పంచ భూతాల సాక్షిగా, సూర్య చంద్రుల సాక్షిగా ప్రమాణము చేసి ప్రకటించుచున్నాడను. నీవే సఖివి. నా రాణివి. ఇందులో మార్పు లేదు. నీలో సందియమున్న నిరభ్యంతరముగా అడుగ వచ్చును'' అంటూ కురులు సవరించాడు.

“నాకు ఏ సంశయములు లేవు ప్రభు. అలాగునే మహారాణి కావలెనన్న ఆశ కూడ లేదు. నేను సాధారణ యువతిని. మీ దాసిని. మీ పాదముల చెంత ఒకింత చోటు చాలును” అంది భద్రా దేవి.

“మా మదిలో నీవు కొలువై ఉండ పాదముల చెంత పని యేమి మనోహరీ” అన్నాడు నవ్వుతూ ధనుంజయుడు.

“మీ హృదయ సింహాసనమున నాగ కన్య ఉలూచీశ్వరి కూడ కొలువై వున్నది మరచితిరా ప్రభూ?” అంది గడుసుగా భద్రాదేవి.

ఆమె తెలివి తేటలు ఎప్పటికప్పుడు ధనుంజయుని విస్తుపోయేలా చేస్తుంటాయి. అందుకే ఫక్కున నవ్వుతూ ` “చెరి ఒక వైపునా వున్నారు. సింహాసనము మనకు చాలదా?” అన్నాడు.

ఆ మాటలకు భద్రా దేవి కూడా నవ్వకుండా వుండ లేక పోయింది. లేచి మోకాళ్ళ మీద చుబుకం ఆన్చి కూచుని క్రీగంట ధనుంజయుని చూడసాగింది. తనూ లేచి ఆమె పక్కనే కూచున్నాడు ధనుంజయుడు. ఒక చేత ఆమె సన్నటి నడుంని చుట్టి రెండో చేత ఆమె చేయి అందుకుంటూ వంగి శంఖం లాంటి ఆమె మెడవం పు మీద ముద్దాడాడు.

“ప్రియా... నా మనసున మరులన్న చాలదు గదా. ఆ నాగ రాకుమారి మనస్సున ఏమున్నదో తెలియదు. ఇంత వరకు తిరిగి నా ముందుకు రానే లేదు. మనము నాగ లోకము చేరిన గాని ఆమె దర్శన భాగ్యము లభించదు. మనకా ఇంకను నాగ లోకము ఎచట వున్నదో, పోవు మార్గమెదియో తెలియకున్నది. గుడ్డిగా పయనించు చున్నారము. ఇంత లోనే ఆమె గురించి నీకెందు కింత అలక ? స్త్రీ సహజమైన అసూయ ఎందుకు? నీవు అసాధారణ యువతివని మరిచితివా?” అంటూ లాలనగా అడిగాడు.

“నాకెలాంటి అలుక గాని అసూయ గాని లేదు ప్రభూ” అంది వెంటనే భద్రా వతి.

“ఉంది... నీ మనసున అభద్రతా భావం వుంది. అది పోవలె. నీపై నా ప్రేమ శాశ్వతము. నా మదిలో నీ స్థానము సుస్థిరము. సంశయింప నక్కర లేదు. ముందుగా నాకో విషయము చెప్పు” అడిగాడు.

“ఏ విషయము ప్రభూ?”

“నీ విషయమే దేవి. నీవిటు పురుష వేషమున సంచరింప కారణమేమి? నీ జనని జనకులు ఎవరు? ఎక్కడుంటారు? నీవు రాజధాని రత్నగిరికి వచ్చి ఎంత కాలమైనది? బామ్మ నీలవేణికి నీకును గల సంబంధమేమి? నీ గురించి సర్వం వివరింప వలె.”

ఆ మాటలకు భారంగా నిట్టూర్చింది భద్రా దేవి.

“నా గురించి చెప్పుటకు చాలానే వున్నది ప్రభూ. కాని ఇది సమయము గాదు. పొద్దు వాలుచున్నది. భోజనము వేళ మించినది. తక్క సమయమున నేనే వివరించెదను. మనము ఫలములారగించి పయనము కొన సాగించుట మంచిది” అంటూ గుర్తు చేసింది.

“ఆ మాట నిజము. నిక్కముగ నీ గురించి సర్వము తెలిపెదవు గదా?”

“సత్యముగా ప్రభు. మీరేనా ప్రాణమై వుండగా మీకు గాక ఏరికి తెలుప గలను.”

“సరి. నాదో కోరిక!”

“ఆహా! ఏమా కోరిక?”

“ఈ మగ వేష ధారణలో నిన్ను చూడ లేకున్నాను. సహ్యాద్రి పై స్నాన ఘట్టమున దర్శనమిచ్చినటు అందాల భరిణెలా అమ్మాయిగా నిను గాంచ కోరిక.”

“ఊహు! ఈ కోరిక ఇప్పుడే తీరునది గాదులే. నా వద్ద అమ్మాయి వలువలు లేవు. వాటిని బామ్మ యింటనే వదిలితి. ఇప్పుడు కేవలము పురుష దుస్తులే వున్నవి” అంటూ ఒక ఫలము ధనుంజయుని కిచ్చి తను ఒకటి గ్రహించినది.




అంతటితో సంభాషణ నిలిపి ఇరువురూ ఫలములతోనే భోజనం ముగించారు. భద్రాదేవి తన తలపాగా ధరించి తిరిగి పురుష రూపంలోకి వచ్చినది. ఆమెనే చూస్తూ మందహాసం చేసాడు ధనుంజయుడు. "ప్రాణ సఖీ... ఇప్పుడు నిన్నేమని నేను పిలవాలి? అపర్ణుడనా... భద్రా దేవియనా?" అనడిగాడు.

"అది వేరే చెప్ప వలెనా ప్రభూ. ఏకాంతమున మీ భద్రా దేవిని, మిగిలిన సమయముందు మీ మిత్రుడు అపర్ణుడను." అని బదులిచ్చి అశ్వాలను తీసుకు వచ్చుటకు పచ్చిక వైపు బయలు దేరినది భద్రా దేవి.

సరిగ్గా అదే సమయమున దవ్వుల నుండి మేఘ ఘర్జనలా ఒక్కసారిగా విన వచ్చినది సింహ ఘర్జన ఒకటి. అదిరి పడి అటు చూసారు ఇరువురూ. కొన్ని లిప్తల కాలం వరకు కొండ కోనల వెంట ప్రతిధ్వనిస్తూనే వుందా సింహ ఘర్జన.

************

గోవిందా... గోపాలా...

రాధా రమణా... మురళీ ధరా.

గోపాలా... గోవిందా!

తప్పెట్లు తాళాలు మృదంగ వాద్య ఘోషతో తన్మయంతో చిందులేస్తూ భజన చేస్తూ భక్త బృందం ఒకటి బిడారు గుంపుతో కలిసి సాగి పోతోంది.

ఫెళ్ళున ఎండ కాస్తోంది.

దినకరుడు నడిమింట ప్రకాశిస్తున్నాడు.

మాళవ రాజ్యం నుండి వింధ్య సానువుల గుండా అవతలి విదేహ రాజ్యం లోకి సాగి పోతున్న మహా పథంలో తరలి పోతోందో పెద్ద బిడారు గుంపు ఒకటి.

బిడారు నాయకుడు కృపాణ ధారియై తన అశ్వాన్ని ముందు నడిపిస్తూండగా అతడి వెనక సుశిక్షితులైన అతడి మనుషులు మూడు వందల మంది అశ్వాల మీద రక్షణ కల్పించి వస్తూండగా మధ్యన భద్రంగా సాగుతోందా బిడారు. అందులో అశ్వ శకటాలున్నాయి. వృషభ శకటాలున్నాయి. బరువు మోస్తున్న కంచర గాడిదలు, నడిచి వస్తున్న యాత్రికులు, బిచ్చగాళ్ళు అలా కోలాహలంతో ఒక వూరే కదలి పోతున్నట్టుంది. అంత ఎత్తున ధూళి లేస్తోంది. అలాగే ఒక నాట్య బృందానికి చెందిన సొగసైన నట్టువరాండ్రతో కూడిన మూడు రథాలు కూడ ఆ బిడారు గుంపులో సాగి పోతున్నాయి.

బాట పక్కనే ఒక పెద్ద పూలపొదలో కూచుని సాగి పోతున్న బిడారును ఆసక్తిగా చూస్తున్నారు నాగేంద్రుని తనయ ఉలూచీశ్వరి, శంఖు పుత్రియని పిలువ బడే నాగస్త్రీ మధూలిక ఇరువురు.

వారీ ప్రాంతానికి చేరుకొని ఇది మూడవ దినము. అక్కడికి ఎడమ భాగమున సమున్నత శిఖరములతో కూడిన వింధ్యా పర్వత శ్రేణి కను విందు చేస్తోంది. కుడి భాగమున ఎటు చూసినా దట్టమగు వింధ్యాటవీ ప్రాంతం, దాని మధ్యగా గీత గీచినట్టు చీలుస్తూ ఉత్తరంగా సాగి పోతున్న మహా పథం గోచరిస్తోంది. వేసవి తాపం తీక్షణంగా ఉన్నప్పటికీ ధనుంజయుని రాక కోసం వేచి చూస్తున్నారు. బిడారు లోని ఆఖరు శకటం కూడ తమను దాటి పోగానే శంఖు పుత్రి వంక చూసింది ఉలూచీశ్వరి.

‘‘అత్తా! మహా పథాన ఎవరెవరో సాగి పోతుంటిరి. మరి నా మనోహరునికేమైనది ఇంకను రాకుండెను. ఆ వీర కుమారుని జూడ మనసు తొందరించుచున్నదే’’ అంది భారంగా నిట్టూర్చి.

‘‘ఆహాఁ! మనసైన మగడి కోసము ఇంత తొందరా?’’ అంటూ నవ్వింది శంఖుపుత్రి. తిరిగి తనే అంది.

‘‘ఏవమ్మా! ఈ వేగిర పాటు నాడు ఢాకినీ వనమున ఆ సుందరాకారుని గాంచినపుడే జూపిన, నాడే మీ పరిచయము, ప్రణయము జరిగి వుండును గదా. అప్పుడేమో మిన్నకుండి ఇప్పుడు మాత్రమీతొందరేలనో’’ అంది పరిహాసమున.

‘‘పో అత్తా! నీ చతురము లెందుకు లే గాని, ఒక వేళ ధనుంజయులవారు మన కన్నా ముందు గానే ఈ వింధ్యా సానువుల దాటి ముందు కెళ్లిపోయి వుందురా?’’ అనడిగింది ఉలూచీశ్వరి.

‘‘లేదు లేదు. అతడింకను వెనుకనే వున్నాడు’’ అంది శంఖు పుత్రి.

‘‘అయితే రాడేమి? అతడి సందర్శనాపేక్షతో కొండంత ఆశతో వచ్చినాను. ఎన్నడూ అసత్యము పలుకని దానను. అతడి కొరకు జనకునితో తొలి సారిగా అసత్యము జెప్పి వచ్చితి. నా మనసు గెలిచిన ధనుంజయుడు నా వలపునంగీకరించునో లేదో… నను స్వీకరించునో లేదో… నేను తనకు నచ్చెదనో లేదో… మనసు తత్తళించుచున్నదే అత్తా’’ అంది గొంతు తడుమారుచుండగా. ఆమె కను దోయిలో చిప్పిలిన కన్నీటిని జూచి జాలి పడి దగ్గరకు తీసుకుని ఆప్యాయంగా కనులు తుడిచింది మధూలిక.

‘‘ఛ! ఛ! నాగ రాకుమారి ఇంత బేలయని నాకు తెలియదు సుమీ’’ అంది వెక్కిరింపుగా.

‘‘పో అత్తా!’’ అంటూ ఫక్కున నవ్వేసింది ఉలూచీశ్వరి.

‘‘పోదునులే తల్లీ. మీ యిరువురిని కలిపిన పిమ్మట ఎలాగూ నా దారిన పోవు దానను. అయిననూ జగదేక సుందరివి, నాగ లోక యువ రాణివి నీకేమి తక్కువని ఆ సంశయము. నీ అంద చందము ధనుంజయుడు మెచ్చడేమోయను శంకయేల? అసలానాడు ఢాకినీ వనమున రెండవ తూరి నిను గానక అచట నీ కొరకు గాలించునపుడే అర్థము గాలేదా? అతడు నిను మెచ్చినాడని? శంకలు వలదుగాని మన మిచట వేచి వుండవలె. ఒకటి రెండు దినములోనే అతనిటకు తప్పక వచ్చును’’ అంటూ ధైర్యము చెప్పినది

శంఖుపుత్రి.

‘‘ఇంకనూ ఒకటి రెండు దినములా... తాళ లేను అత్తా. ఒక పని చేయుదమా? మనమే వింధ్యాసానువుల దాటి ఆ అంద గాడికి ఎదురు పోవుదమా?’’ అనడిగింది ఉలూచీశ్వరి ఉత్సాహంగా.

ఆ మాటలకు ఆశ్చర్యముగా`

బుగ్గన వేలుంచుకొని చూసింది శంఖుపుత్రి.

‘‘అయ్యారే! చూచితివా నీ ధైర్యము? ఇప్పుడే గదా జనకునకు అసత్యము జెప్పి అనుమతి పొందినందుకు నొచ్చుకుంటివి. ఇంత లోనే ఇంత సాహసమా? ఇదియే మరి వలపులో మహిమ. ప్రేమ కొరకు పరుగు లెత్తుట, అసత్యము పలుకుట, నిర్భయము, సాహసము ఇవన్నియు వలపులోని సహజ గుణములే గాని మనము ఎదురు పోవ పని లేదు. ఇదియే మనకు సురక్షిత ప్రాంతము.

అయిననూ నీవు రాకుమారుని కొరకు ఎదురు చూచుచుంటివి. నేను మాత్రం అదో... ఎగువన వృక్ష ఛాయలో గోతిని చుట్టి గుంట నక్కల్లా వున్న కొందరు మానవుల్ని గమనించుచున్నాను. గుర్తున్నదా? మన కన్నా ముందే మూడు దినముగా వాళ్ళచటనే వున్నారు. మనలాగే ఎవరికొరకో వేచి చూచుచున్నారు’’ అంది.

శంఖు పుత్రి మాటలకు తనూ సందేహిస్తూ`

దృష్టినటు సారించింది ఉలూచీశ్వరి.

సరిగ్గా అక్కడికి`

కూత వేటు దూరంలోనే వున్నారు వాళ్ళంతా. మొత్తం ఆరుగురు బలిష్టమైన మానవులు. చూడ్డానికి యాత్రికుల్లా దుస్తులు ధరించి వున్నారు. పర్వత పాదంలో బాట పక్కనే ఒక ఎత్తయిన శాఖోపశాఖుగా విస్తరించిన కరి మాను వృక్షఛాయలో గుండ్రంగా

వృత్తాకారంలో కూచుని ఏదో మాట్లాడుకొనుచున్నారు. వాళ్ళు నిజముగా యాత్రికులయితే ఓ పూట మజిలి చేసిన వెంటనే బయలుదేరి వెళ్ళి పోవాలిగా. మూడు దినములుగా ఇక్కడే తిష్ట వేసి ఎందుకున్నారు? ఎవరి కోసం నిరీక్షిస్తున్నారు? వాళ్ళ తీరు చూస్తే ఏదో సందేహమే కలిగిస్తున్నది.

అటవీ మార్గంలో ప్రయాణం గాబట్టి ఎవరూ నిరాయుధులుగా రారు. వాళ్ళ దగ్గర ఆయుధాలున్నాయి. వారి అశ్వాలు ఆరూ పక్కనే వరసగా కట్ట బడున్నాయి. వాళ్ళు కూడా మాటి మాటికీ కొండల్లోంచి వస్తున్న మార్గం వంకే చూస్తున్నారు.

“అత్తా! వాళ్ళు ఎవరయి వుందురు?” తనూ సందేహ దృక్కులతో శంఖు పుత్రిని అడిగింది.

“ఎవరనిన నాకు మాత్రం ఏమి తెలియు? పోయి చూడవలె” అంది అటే చూస్తూ శంఖు పుత్రి.

“నేను పోయి రానా?”

“నీవిచటనే వుండుము. నేను పోయి వారి మాటలు పొంచి విని వత్తును. వాళ్ళ వివరములు తెలుసుకొని వత్తును. పొరబాటున కూడ నీవీ పూపొద నుండి బయటకు రావలదు సుమా” అని హెచ్చరించి తక్షణం తన సహజ రూపమైన పూర్తి సర్పముగా మారి అగంతకుల వైపు మరుగున సాగి పోయింది శంఖు పుత్రి. ఆమె రాక కోసం ఎదురు చూస్తూ కూచుంది ఉలూచిశ్వరి.

సర్పంగా మారిన శంఖు పుత్రి అలికిడి లేకుండా పొదలు చెట్లు ఆకుల క్రిందుగా జర జరా ప్రాకుతూ కరి మాను వృక్షం వద్దకు చేరుకుంది.

అప్పటికి ఆగంతకులు ఆరుగురూ కాల్చిన కందమూలాలు పండ్లు మధ్యలో ఒక వస్త్రం మీద గుట్టగా వుంచారు. చుట్టూ కూచుని తీసుకు తింటూ కబుర్లలో పడ్డారు.

వృక్ష మానుకి వెనక భాగంలో ఎండుటాకు క్రింద తన సర్ప శరీరాన్ని దాచు కొని తల మాత్రం మానుకు చేర్చి వారి మాటల్ని అతి జాగ్రత్తగా విన సాగింది.

వాళ్ళంతా బలిష్టులు, యోధులు. చెంత మారుణాయుధాలు సిద్ధంగా వున్నాయి. మాటల్ని బట్టి వాళ్ళంతా రత్నగిరి పరిసర వాసులు, గూఢచారులని అర్థమైంది. సంభాషణంతా రత్నగిరి గురించీ, తాము ఇష్ట పడిన అమ్మాయిలతో సరససల్లాపాలమీద చతురోక్తులతో సాగుతోంది. ఎక్కడా రత్నగిరి యువ రాజు ధనుంజయుని ప్రస్తావన రాక పోవటంతో ఇక వెనక్కు వెళ్ళి పోదామని కదిలింది శంఖుపుత్రి. అప్పుడు…

సరిగ్గా అప్పుడు తొలి సారిగా ధనుంజయుని ప్రస్తావన వచ్చింది. అంతే` ఇక కదలకుండా ఉన్న చోటే ఆగి పోయింది.

‘‘ఏమిరా ఈ నిరీక్షణ? మనమింకనూ ఎన్ని దినములిచట కాపు వేయవలె? ఆ ధనుంజయుడు వచ్చు వాడయిన ఈ సరికే ఇటు రాడూ?’’ అనడిగాడు ఒకడు.

‘‘నాకును కూడ శంక గానే వున్నదిరా. యువ రాజుకు మన చేతుల జచ్చు యోగమున్నటు లేదు. సహ్యాద్రి మీదనే మన మొదటి బృందం అంత మొందించి యుండును’’ అన్నాడు.

ఆ మాటలు వినగానే`

ఒక్క సారిగా ఉలికి పడింది శంఖు పుత్రి.

చివరకు తన సంశయమే నిజమైనది.

వీళ్ళంతా తమ యువ రాజును మట్టు పెట్టుటకు ఇచట పొంచి వున్నారు. ఎందుకు? ఎవరి కుట్రయిది? వీళ్ళంతా ఎవరి తరపున పని చేయుచున్నారు. శంఖ పుత్రి ఆలోచలను పరి పరి విధాలా పోతున్నాయి. వీళ్ళనుకొంటున్నట్టు ధనుంజయునికి సహ్యాద్రిపై ఎలాంటి ప్రమాదము ఘటిల్ల లేదు. అతను మహా పథంలో మాళవ సరి హద్దు వైపు పయనించుట తన జ్ఞాన నేత్రమున సందర్శించినది. అసలు ధనుంజయుని జంపుటకు రత్నగిరి నుండి ఎన్ని బృందాలు బయలు దేరాయి..? తీవ్రంగా ఆలోచిస్తూ ఇంకా ఆలకింపనారంభించింది.

“ఒక వేళ సహ్యాద్రిపై తప్పించుకున్ననూ మన రెండో బృందము మాళవ సరి హద్దు వద్ద ఉండనే వున్నది. మలు జూచి పిడిబాకు దింపి ప్రాణాలు తీసెదరు. ఈ పాటికే పని ముగించి వుందురు.” అన్నాడు ఎదురుగా వున్న మరొకడు నమ్మకంగా.

“అనగా మనమిటుల ఈ దిక్కుమాలిన కొండ దారిన మాటు వేయుట వృథా అందువా?” అనడిగాడు నాలుగో వాడు.

ఆ మాటలకు ఫక్కున నవ్వుకున్నారంతా.

ఇంతలో వాళ్ళకి నాయకుడిలా వున్న బుర్రమీసాల వ్యక్తి కల్పించుకుంటూ` “ఏమిరా? మన ఇష్టానికి ఏవేవో వూహించుకుని పని జేసిన అవతల మనకు బాహ్లీకుల వారితో మాట వచ్చును. ఆ పైన యువరాజు ధనుంజయుడు సామాన్యుడు గాడు. అంతటి మహా వీరుని ఎంత ఏమరి పాటున వున్నను ప్రాణాములు దీయుట కష్టము. ఏమో! ఎవరు జూచినారు? రెండు చోట్లను తప్పించుకొని వచ్చుచున్నాడేమో. ఇక్కడ తప్పించు కొనరాదు. అతని రాకను చూడగానే ఎవరి స్థానమునకు వారు పోయి ఏక కాలమున ఆయుధములు విసరి అతడిని ఒక్క పెట్టున హతమార్చవలె. గురుతున్నది గదా మనకివ్వ బడిన ఆజ్ఞ ప్రకారము మనమిచటనే కనీసము ముప్పది దినములు ఎదురు జూచి అప్పటికీని రాకున్న జచ్చినాడని నిర్ధారించుకొని మనము బయలు దేరవలె.” అంటూ గంభీర స్వరంతో తన అనుచరులకు వివరించాడు.

అంత వరకే విన్నది శంఖు పుత్రి.

ఆపైన వినాల్సిన అవసరం లేక పోయింది.

బాహ్లీకుడు ఎవడో తనకు తెలీదు గాని రాజ్యం కోసం జరుగుతున్న ఏదో కుట్రలో ప్రధాన సూత్రధారి అయి వుండాలి. తన కొస్తున్న కోపానికి ఇప్పుడే వీళ్ళందరినీ చంపాలని వున్నప్పటికీ తమ యువ రాణికి చెప్పకుండా తొందర పడ రాదనిపించింది. అందుకే ఎలా వచ్చిందో అలాగే నిశ్శబ్దంగా వెను తిరిగింది.

“అత్తా! ఎవరు ఆ మానవులు? ఎవరి కొరకు నిరీక్షించుచున్నారు? వివరములు తెలిసినవా?” తిరిగి వచ్చిన శంఖు పుత్రిని ఆతృతగా ప్రశ్నించింది ఉూచిశ్వరి.

“నా సందియము వృథా పోలేదు నాగ కుమారీ. మన వలెనే ఆ మానవులును ధనుంజయుల వారి రాక కోసమే ఎదురు చూచు చున్నారు.” అంటూ వచ్చి పక్కన కూచుంది శంఖుపుత్రి.

“ఏమంటివి? వారి నిరీక్షణ ధనుంజయుల వారి కొరకా?” నమ్మ లేనట్టు అడిగింది ఉలుచీశ్వరి.

“అవును. వారి కోసమే ఆ ధూర్తుల నిరీక్షణ”

“ధూర్తులా...?”

“అవును. ధూర్తులు, ద్రోహులు. వారు ఎదురు చూచునది యువ రాజా వారిని కలుసుకొనుటకు కాదు. తమ ఉనికి తెలియకుండా అదాటున దాడి చేసి అంతము చేయ వలెనని.”

“అమంగళము శాంతించు గాక. అయ్యో అత్తా.. ఏమంటివి? నా మనోహరుని సంహరింప నెంచి మాటు వేసినారా?”

“అవును” అంటూ అక్కడ తను విన్నదంతా పూస గుచ్చినటు ఉలూచీశ్వరికి వివరించినది శంఖు పుత్రి.వింటున్న నాగ లోక యువ రాణి ఆగ్రహంతో బుసలు కొట్టినది. కనులు ఎర్రబారాయి. “అత్తా! వారిలో దురాలోచన తెలిసాక కూడ వాళ్ళను ఏమీ చేయక మరలి వచ్చితి వేమి?” అంది.

“నీకు చెప్పకుండా చేయుదునా?” అంది శంఖు పుత్రి.

“సరి. ఈ అల్పులు నా మనోహరుని కడ తేర్చువారా? అదియు వీళ్ళు ప్రాణముతో ఉన్న గదా! ఈ ద్రోహుల్ని వదల. వీళ్ళకు నూకలు నిండుకున్నవి.” అంటూ కనులు మూసుకుని భృకుటి ముడిచి తన నాగ శక్తిని ప్రయోగించి పరిసరాల్లోని విష నాగుల్ని ఆగంతకుల మీదికి ప్రేరేపించింది. అంతే`

ఎండ వేడిమికి చెట్ల తొర్ర ల్లోను బురియలు కలుగులందు కొండ గుట్టలందు నేల పగుళ్ళ యందు చలువ ప్రదేశాల్లో సేద

తిరుతున్న విష నాగులన్నీ ఎవరో అదిలించి ఆజ్ఞాపించినట్టుగా ఉలికి పడి తలవిదిలించి చివ్వున లేచాయి. తమ తమ తావులు వదిలి తలో పక్క నుంచి కరి మాను ప్రాంతాన్ని చుట్టు ముట్టడానికి బయలుదేరాయి. నేల మీద ఎటు చూసినా జర జరా ప్రాకి వస్తున్న పాములు. భయంకర విషసర్పాలు.

ముంచు కొస్తున్న ప్రమాదం తెలిని మూర్ఖ శిఖామణులైన ఆగంతకులు ఆరుగురూ కబుర్లలో మునిగి తేలుతూనే ధనుంజయుని కోసం బాట ఎగువకు చూస్తున్నారు. అతడ్ని చంపాలని కోరుకుంటూ తమ చావును తెలుసుకో లేక పోయారు. చివరి క్షణంలో ఒకడు అదిరి పడి దిగ్గున లేస్తూ` ''బాబోయ్... పా.... పా....పాము... పాము...'' అనరిచాడు.

వాడు అరిచి అరవక ముందే ఒక పాము వాడి చేతి మీద మరోటి పాదం మీద కసిగా కాటేసాయి. అంతే` కెవ్వున అరిచి విరుచుకు పడి పోయాడు వాడు. మిగిలిన వాళ్ళు భయ కంపితులై ఆయుధాలు అందుకునే లోపలే పాములన్నీ వాళ్ళని చుట్టు ముట్టేసాయి. దొరికిన వాడ్ని దొరికినట్టు కసిగా కాటందుకున్నాయి. పగ బట్టినట్టు ఇన్ని సర్పాలు ఏక కాలంలో తమపై దాడి చేయటం ఏమిటో వాళ్ళకి అర్థం కాలేదు. ఏం జరుగుతుందో అర్థమయ్యే లోపలే నోటి వెంట దారుణంగా నుచ్చులు గ్రక్కుతూ తలో పక్కకు విరుచుకు పడి గిలగిలా కొట్టుకున్నారు. అయినా వదలకుండా తలో కాటు పంచుకున్నాయి పాములు. విష ప్రభావంతో వాళ్ళ శరీరాలు మంటలో కాల్చినట్టు నల్లగా మారి పోతూండగా క్షణాల్లో ఎగిరి పోయాయి వాళ్ళ ప్రాణాలు.


ఆ విధంగా బాహ్లీకుని గూఢచార బృందం ఆరుగురూ విగత జీవులు కాగానే కూడ బలుక్కున్నట్టుగా ఎక్కడి పాములక్కడ వెను తిరిగి తమ తమ తావులకు శర వేగంతో నిష్క్రమించాయి.

కొద్ది క్షణాల క్రితం వరకు ఆగంతకుల నవ్వులు కేరింతలు చతురోక్తులతో సందడిగా వున్న కరి మాను ప్రాంతం ఇప్పుడు శవాలను చూస్తూ నిశ్శబ్ధమై పోయినది. ఇందులో ఆశ్చర్య కరమగు విషయం ఏమంటే`

ఆగంతకుల్ని అంతం చేసిన విష నాగుల్లో ఒక్కటి కూడ పొరబాటున కూడ వారి గుర్రాలను కాటేయక పోవటం. కొన్ని లిప్తల కాలంలోనే గూఢచార బృందం నశించింది. ఉలూచీశ్వరి కనులు అప్పటిగ్గాని శాంతించ లేదు.

అదృష్ట వంతుని చెడిపే వారు లేరు, దురదృష్ట వంతుని బాగు చేసే వారు లేరన్నది పెద్ద సామెత. అది నిజం కూడ. ఇంత వరకు రత్నగిరి యువరాజు ధనుంజయుని గాఢంగా అంటి పెట్టుకొని ఉన్నది అదృష్ట దేవత. అందుకే అతడ్ని అంతం చేయాలని కంకణ బద్ధులై ఎదురు చూస్తున్న శత్రు బృందం అతడికి తెలికుండానే అంతమైంది.

ఉలూచిశ్వరి, శంఖు పుత్రి ఇరువురూ ధనుంజయుని కొరకు ఎదురు తెన్నులు చూస్తూ ఆ పూలపొదలోనే ఉండి పోయారు. అయితే వారి నిరీక్షణ మరో మూడు దినము పిమ్మట గాని నెర వేర లేదు.




కొండకోనల వెంట ప్రతిధ్వనిస్తున్న సింహ గర్జన వింటూ వీరావేశంతో తన ఖడ్గం దూసాడు ధనుంజయుడు.

"భద్రా! సింహం మన హయము వైపు పోతున్నట్టున్నది. అది వాటి మీద దాడి చేయక ముందే దానిని నిర్జింప వలె. నీవిచటనే ఉండుము." అంటూ వేగంగా కదిలాడు. కాని వెంటనే అతడ్ని అడ్డుకుంది భద్రాదేవి.

''ప్రభూ! తొందర వలదు. ఒకింత శాంతించండి'' అంది.

విభ్రాంతి చెంది చూసాడు ధనుంజయుడు.

''ఏమంటివి భద్రా! శాంతించ వలెనా? మన అశ్వములు ప్రమాదముననున్నవి. సింహము వాటిని చంపి తినుటకు పోనున్నది. చూస్తూ శాంతముగా ఉండమందువా?'' అనడిగాడు ఆవేశమున.

''అయ్యో! నా ఉద్దేశము అది కాదు. నా మాట వినండి. అది హయము వైపు పోవుట లేదు'' అంది భద్రా దేవి. ధనుంజయుడు సందేహ నివృత్తికి ఏదో అడిగే లోనే మరోసారి విన వచ్చింది సింహ గర్జన.

''ఆలకించితిరా ప్రభూ! అది సింహ కిశోరమే గాని దాని గర్జనలో వేదన ధ్వనిస్తోంది. వేటాడే పరిస్థితిలో ఉన్నట్టు లేదు. బహుశ గాయపడి ఉండాలె. నేను పోయి జూచి వత్తును. మీరిచటనే వుండండి'' అంటూ అపర్ణుడిగా వున్న భద్రా దేవి వడి వడిగా గర్జన విన వచ్చిన వైపు అడుగులు సారించింది.

ధనుంజయునికి ఏమీ అర్థం గాక మతి పోయినట్టు చూస్తున్నాడు. ఏమి యీ అమ్మాయి సాహసము? గర్జనను బట్టి అది బాగున్నదా, అనారోగ్యముగా నున్నదా అని ఎలా తెలుస్తుంది? సింహము... అందులోనూ గాయ పడిన సింహమైతే మరీ ప్రమాదము గదా... దాన్ని ఎదిరించి పోరాడగలదా? ఈ భద్రాదేవిలో మొండి తనము పెంకి తనము కూడ కగలిపి ఉన్నట్టున్నవే? పరి పరి విధాలా ఆలోచిస్తూ ఆమెను ఒంటరిగా వదలకుండా వెనకే తనూ వెళ్ళాడు.

అలా కొంత దూరము ముందుకెళ్ళి చెట్ల గుబురును దాటగానే ఎదురుగా దృశ్యమును గాంచి ఆశ్చర్య సంభ్రమాలతో ఉన్న చోటే చిత్తరువులా నిలబడి పోయాడు.

భద్రా దేవి చెప్పింది అక్షర సత్యమై కళ్ళ ముందు సాక్షాత్కరించటమే అందుక్కారణం. అతడున్న చోటుకు వంద ధనువుల దూరంలోనే ఉన్నదా కేసరి. కోడె వయసు సింహ కిశోరం. అది ముందుకు రాకుండా వెనక కాళ్ళ మీద కూచునుంది. కుడి పంజాపైకి లేపి ఉంచటంతో గాయం స్పష్టంగా కన్పిస్తోంది.

ఎలా దిగిందో గాని కోసుగా వుండే సన్నటి కట్టె దాని పంజాను చీల్చుకుని ఇటు నుండి అటు దూసు కెళ్ళి విరిగింది. గాయం పుండై బాధ పెడుతూంటే తట్టుకో లేక గర్జిస్తోంది. కొండకి అవతల లోతట్టు అటవీ ప్రాంతంలో సంచరించే ఆ సింహానికి గాయం ఎలా తగిలిందో ఎప్పుడు తగిలిందో తెలీదు. వేటాడ లేని పరిస్థితిలో చిక్కి సగమై వుంది. దారి తప్పి కొండ దారుల్లో ఇటు వచ్చేసి వుంటుంది. అదలా ఉంచితే`

ఆకలితో నక నక లాడుతున్న సింహం వద్దకి చేతిలో ఆయుధం కూడ పట్టకుండా నిర్భయంగా వెళ్తున్న భద్రా దేవిని ఎలా అర్ధం చేసుకోవాలో తెలీక కళ్ళప్పగించి చూస్తూండి పోయాడు ధనుంజయుడు.

విచిత్రం ఏమంటే` మొదట తనను సమీపిస్తున్న భద్రా దేవిని కౄరంగా చూస్తూ లేవటానికి ప్రయత్నిస్తున్న సింహం ఆమె చేయెత్తి వారిస్తూ తనను సమీపించ గానే సాధు జంతువులా తోకాడిస్తూ జాలిగా చూడనారంభించింది.

ఆ సింహం పరిస్థితికి చాలా నొచ్చుకుంది భద్రాదేవి. ఇసుమంత కూడ జంకు లేకుండా నిర్భయంగా చెంత కెళ్ళింది. దాని తల మీద చేయి వేసి వాత్సల్యంగా జూలు నిమురుతూ పంజా గాయాన్ని పరిశీలించింది. ''అకటా... ఏమైనదిరా నీకు? ఎంతగా అడవికి రాజువయితే మాత్రం అంత చూసుకోకుండా పంజా విసిరితివా? కొద్ది సమయం ఓర్చుకొమ్ము. నీ గాయమును నేను గుణ పర్చెదనులే'' అంటూ ధైర్యం చెప్పింది.

సింహం ఆమె పట్ల కృతజ్ఞతగా చూసింది. అది గమనిస్తున్న ధనుంజయునికి ఒక విషయం గుర్తుకొచ్చింది. కొన్ని రోజుల క్రిందట అపర్ణుడు తనను కలిసిన రోజు... మడుగు చెంత విశ్రాంతి కోసం ఆగినపుడు అలాగే కౄరమైన ఎలుగ్గొడ్లతో పూబంతితో చిన్నపిల్లలా ఆటలాడుతూ ఆశ్చర్య పరిచింది. ఇప్పుడు చూస్తే మృగ రాజే ఆమె ముందు శునకంలా ప్రవరిస్తున్నాడు. సందేహం లేదు, ఈమెకు వశీకరణ విద్య ఏదో తెలిసి వుండాలి.

చూస్తూండగానే సమీప పొదల యందు గాలించి రెండు రకాల ఔషధి మొక్కల్ని పెకలించి తెచ్చింది భద్రా దేవి. చెంతకు రమ్మని ధనుంజయునికి సైగ చేసింది.

వెంటనే అటు నడిచాడు ధనుంజయుడు. సింహము తన పైకి దూకుతుందన్న సందేహంతో ఓ చేతిని ఖడ్గం పిడి మీదనే ఉంచి భద్రా దేవిని సమీపించాడు. కాని అతడ్ని చూసి కూడ మృగరాజు మునిలా మౌనం గానే ఉంది.. గాయమైన పంజాను ఎత్తి ఉంచి మూడు కాళ్ళ మీద కూచుని అలాగే వుంది. గాయాన్ని పరిశీలించాడు. ప్రమాదకరమైన గాయం. పంజాలో దిగ బడిన కొయ్య ముక్కను లాగి చికిత్స చేయాలి. గాయం నుండి చీమురసి ఓడుతూ ఈగలు ముసురుతున్నాయి.

“సింహము కౄర జంతువు. అందరికీ తెలిసిన విషయమే. ఎంత గాయ పడినా మనిషి కంట పడగానే పంజా విసిరి ప్రాణం తీయక మానదు. అలాంటి ఈ కిశోరము నిను గాంచగనే శునకము వలె విశ్వాసము ప్రకటించుచున్నదే. ఇది ఏమి మాయ? దీని మర్మమేమి? నీకు వశీకరణ విద్యు ఏమన్నా తెలుసునా?” ఆశ్చర్యం నుండి తేరుకుంటూ భద్రా దేవిని అడిగాడు ధనుంజయుడు.

అవునన్నట్టు తల ఊపింది భద్రా దేవి.

“ప్రభూ! తమకీ సందేహము స్ఫురించుట సహజమే. రాజవశ్యం, భూతవశ్యం, అస్త్రవశ్యం, మృగ సర్ప వశ్యమను పలురకముల వశీకరణ విద్యులున్నవి. నా తండ్రి గారు నా చిరు ప్రాయము నుండే నాకు ధైర్య సాహసములు నూరి పోసే వారు. ఒక్కతెనూ సంతానమగుట వలన కొడుకయినా కూతురయినా నేనే అని భావించి నను మగరాయునిగా పెంచారు. మీరు చూస్తున్న ఈ మగ వేషము ఇప్పుడు కొత్తగా ధరించినది కాదు. నా వూహ తెలిసినప్పటి నుండి ధరిస్తూనే వున్నాను.

నా తండ్రి గారు ఆయుర్వేద వైద్యులు అలాగే గొప్ప మంత్ర వేత్త కూడ. మూలికా సేకరణకు అడవులకు తోడుగా నన్ను మాత్రమే తీసుకెళ్ళెడి వారు. అడవులందు సంచరించు భూతములు గాని మృగ సర్పాదులు గాని నన్ను బాధింపకుండేందుకు నా చిరు ప్రాయమునే నాకు వశీకరణ మంత్ర విద్యలు కూడ నేర్పి సిద్ధంప జేసినారు. అందుకే అవి నన్నేమీ చేయ జాలవు. అలా పసి తనము నుండి అడవులు తిరిగిన అనుభవం గనుకనే ఈ అడవుల మృగ పక్ష్యాదుల గూర్చి సర్వం తెలియును. అయితే ఎలాంటి వశీ కరణము పని చేయని మృగ మొండు కలదు” అంటూ చెప్పటం ఆపింది భద్రా దేవి.

ఆసక్తిగా వింటున్న ధనుంజయుడికి ఆమె చివరి మాటలు ఆశ్చర్యం కలిగించాయి` “ఏమిటవి? వశ్యము గాని మృగమా… ఏమిటది?” అనడిగాడు.

“అది ఖడ్గ మృగము.”

“ఖడ్గ మృగమా…”

“అవును ప్రభూ! అది ఖడ్గ మృగమే. ఏ మంత్ర శక్తికీ అది వశం కాదు. ఉక్కు కవచాల్లాంటి దాని చర్మము, బలమైన దాని ముట్టె మీది కొమ్ము మంత్ర శక్తిని క్షణంలో హరిస్తాయి. దాన్ని సంహరించుట కూడ కష్ట సాధ్యమైన పని. ఖడ్గ మృగము ఎదురు పడిన తప్పించుకు పోవుట తప్ప తెగించి పోరాడి దాన్ని జయింప లేము.”

“మరి నీ మచ్చల గుర్రం ఎక్కడిది? విచిత్రమగు ఈ జాతి అశ్వాల గురించి నేను విన లేదు.”

“అవును ప్రభూ! విని వుండరు. సూదిలా కొన దేరిన కర్ణము, పెద్ద కనులు, పొడవు ముఖం, బక్కపల్చని దేహం… ఈ జాతి వారువము మంగోలు ఎడారు భూముల సంచరించు సంచార తండా వద్ద మాత్రమే లభించును. నాకు పదేళ్ళ ప్రాయమప్పుడనుకొందును, ఒక తండాకు చెందిన కొందరు మంగోలులు భరత ఖండమును దర్శింప వచ్చినారు. వారి వద్ద ఈ హయమును జూచినాను. అప్పటికి నా ఢాకిని వయసు ఆరు మాసముల కూన. దాని వంటి మీద మచ్చలు నాకు నచ్చినవి. చూచుటకు గార్ధభ కూన వలె నున్నది వద్దని నా తండ్రిగారు వారించినారు. కాని అదే కావలెనని పేచీ పెట్టడంతో నా కోసం అయిదు వరహాలిచ్చి కొన్నారు. అప్పటి నుండి నా సోదరి వలె నాతో బాటే మా యింట పెరిగినది. అందుకే అది నా ప్రాణమై వున్నది. చూచుటకు బక్కగా వున్నను పరుగులో వాయు దేవునితో పోటీ పడ గలదు.” అంటూ భద్రా దేవి వివరిస్తుంటే మరొక్క మారు విస్మయానికి లోనయ్యాడు యువరాజు ధనుంజయుడు. ఇంకా అనేక సందేహాలున్నప్పటికీ ఇది సమయము కాదు గాబట్టి వాటిని పక్కన పెట్టి` “సరి సరి భద్రా! అవతల పొద్దు వాలుచున్నది. ఇప్పుడేమి చేయ వలె?” అనడిగాడు.

“దీని గాయమును గాంచితిరిగా ప్రభూ!” అంటూ సింహం జూలు నిమురుతూ దాని పంజాను చూపించింది భద్రా దేవి.

“పాపము. వేటాడ లేక, ఆహారము లభించక చిక్కిశల్యయమైనది. నేను దీనికి చికిత్స నెరపెదను గాక, ఈలోపు మీరొక పని చేయవలె” అంది.

“ఏమి చేయ వలెను?”

“మీరు పోయి ఏదో ఒక మృగమును వేటాడి తేవలె.”

“బాగా బాగు. ఏదో ఒకటియన ఎయ్యది?” వెంటనే అడిగాడు ధనుంజయుడు.

“నీవు గజ రాజును వేటాడి ఈ మృగరాజుకి ఆహారముగా తెమ్మనిన నా వలను గాదు సుమా. ఏయిన` ఏనుగును చంప గలనుగాని ఇటకు మోసుకు రాలేను గదా.”

‘‘అంత శ్రమ వలదులే ప్రభూ’’ అంది నవ్వుతూ భద్రాదేవి.

‘‘ఏ కొండ గొర్రెనో మేకనో వేటాడి తెచ్చిన చాలును.’’ అంది తిరిగి తనే.

‘‘మిత్రమా అపర్ణా! ఇది మిక్కిలి అన్యాయము గదూ? చంద్ర వంశ క్షత్రియుడను. పాండు వంశజుడను... క్రూర మృగము నిర్దాక్షిణ్యముగా వేటాడి ప్రజా రక్షణ జేయు యువరాజును... అంతటి నన్ను ఒక క్రూర మృగమును కాపాడుటకు సాధు జంతువు జంపి తెమ్మనుట న్యాయమా? మాకు నియమ విరుద్ధము గదా?’’ ఒకింత హాస్యం మేళవించి అడిగాడు.

‘‘ప్రభూ! ఈ నియమములు ఆచారములు అదిలో ఎక్కడివి? అన్నియు అవసరార్థము మనము ఏర్పరచినట్టివే గదా. ఒక జీవి మరో జీవిపై ఆధార పడుటయే గదా ప్రకృతి ధర్మము? ఏ జీవిని అయిననూ ఆపదలో ఆదుకొనుట మానవ ధర్మము. మనము ఈ సింహమును కాపాడుటలో దోషము లేదు.’’ అంది భద్రా దేవి. ఇక రాజీ పడక తప్ప లేదు ధనుంజయునికి.‘‘సరి సరి. వాదులాటలో నిను జయించుట దుస్సాధ్యమని అర్థమైనది. పోయి వచ్చెద’’ అంటూ చర చరా అశ్వమున్న దిశగా వెళ్ళి పోయాడు.

కొద్ది సేపటికే అశ్వము పరుగెడుతున్న గిట్టల శబ్ధం విన వచ్చింది. చిన్నగా నవ్వు కొంటూ సింహము వంక చూసింది భద్రా దేవి.

‘‘ఏమిరా... నాతో నడువగలవా? రమ్ము...’’ అంటూ మడుగు వైపు దారి తీసింది. అంతే`

అంత వరకు మౌనంగా బుద్ధిగా కూచున్న సింహం లేచి మూడు కాళ్ళ మీద కుంటుతూ గుర్రు గుర్రున చప్పుడు చేస్తూ శునకము వలె అనుసరించింది.

మడుగు ఒడ్డున సింహాన్ని కూచుండ జేసింది భద్రా దేవి. ముందుగా తను తెచ్చిన రెండు రకాల ఔషధి మొక్కల్లో ఒక మొక్క నుండి కొన్ని ఆకులు కోసి అర చేతిలో బాగా నలిపింది. రసాన్ని పంజా గాయం మీద వెనక ముందు కూడ చక్కగా పిండింది. ఈ ఆకు పసరు పడిన శరీర భాగం తిమ్మిరెక్కి కొంత సమయం వరకు బాధ తెలీకుండా పోతుంది.

కొన్ని లిప్తల కాలం ఆగి`

జాగ్రత్తగా పంజాలో విరిగిన కొయ్యి ముక్కను పట్టి లాగింది. సులువుగా అది వూడి వచ్చేసింది. నొప్పి తెలిసినట్టుంది చిన్నగా అరుస్తూ పంజాను వెనక్కు లాక్కుంది. దాని జూలు నిమిరి కళ్ళ లోకి చూసింది భద్రా దేవి.

"ఓర్చుకోరా. అడవికి రాజువి ఆ మాత్రం బాధను ఓర్చుకోలేవా? ఇతర జంతువుల్ని వేటాడేప్పుడు ఈ నొప్పి నీకు తెలియదు కదూ." అంటూ మాట్లాడుతూనే మడుగు నీళ్ళతో గాయానికి ఏర్పడిన చీము నెత్తురు అంతా శుభ్రంగా కడిగింది. తర్వాత తన తల పాగా నుంచి కొంత వస్త్ర భాగం చించి గాయాన్ని శుభ్రంగా తుడిచింది.

ఇప్పుడు రెండో ఔషధి మొక్క ఆకులు త్రుంచి బాగా అర చేతిలో నలిపి గాయం మీద పిండింది. గాయాన్ని మాన్పటంలో అద్భుతంగా పని చేసే శతాగ్నియనే ఔషధి మొక్క ఆకులు అవి. తగినంత రసాన్ని గాయానికి బాగా పట్టించాక తన తలపాగా నుండి మరి కొంత వస్త్ర భాగాన్ని చించింది. ఇప్పుడు పిండిన రెండు ఔషధి మొక్కల ఆకుల ముద్దను పంజాకు అటు యిటు గాయం మీద వుంచి చక్కగా కట్టు కట్టింది.

ఎంత బుద్ధిగా అణకువగా గాయానికి కట్టు కట్టేంత వరకు ఆమెనే చూస్తూ కూచుంది సింహం. గాయం సలుపు తగ్గి వూరట లభించటంతో దాని కనులు చెమ్మగిల్లాయి. అది చూసి నవ్వుతూ కనులు తుడిచి ప్రేమగా జూలు నిమిరింది భద్రా దేవి.

"బాధ పడకు రాజా! నీవు అడవికి రాజువి. అందానికి మృగ రాజువి. జూలు విదిలించి ఎప్పటిలా సగర్వంగా తిరగ్గలవు. వారం తిరక్క ముందే గాయం నయమై పోతుంది చూడు. కాని నీ తావు వదలి ఇలా కొండలు దాటి రావటం ప్రమాదం సుమా. వేట గాళ్ళు నిను చూసిన వారి బాణము ప్రయోగించి నీ ఉసురు తీయుదురు. చీకటి పడక ముందే కొండలు దాటి ఘోరారణ్యంలోకి మరలి పోయి నీ వాళ్ళను కలుసుకో" అంటూ కర్తవ్యం బోధించింది.

అర్థమైనది అన్నట్టుగా చెవులు హోరెత్తేలా తన సహజమైన గొంతుతో ఉత్సాహంగా లేచి మెడ తిప్పి గర్జన చేసింది సింహం.

ఇంతలో ఒక కొండ గొర్రెను వేటాడి తెచ్చాడు ధనుంజయుడు. దాన్ని సింహం ముందు పడేసాడు. ఆకలితో బాధ పడుతోందేమో మొహ మాట పడకుండా గొర్రె శరీరం మీద పడి గుండెలు చీల్చి ఆవురావురుమంటూ ఆరగించ నారంభించింది.

ఇక ఆ సింహ కిశోరం గొర్రె మాంసాన్ని కడుపార తిని కొండ గుట్టలు దాటి లోతట్టు అడవి లోకి వెళ్ళి పోతుందని భద్రా దేవికి తెలుసు.

"ప్రభూ! సమయం మించినది. ఇక మనం బయలు దేరుట మంచిది. పోవుదము రండు" అంది తలపాగా సరి చేసుకుంటూ.

ఇక ఆలస్యం చేయకుండా`

తమ అశ్వాల మీద బయలుదేరారిరువురూ.

ఇదే సమయంలో`

రెండు అదృశ్య నేత్రములు చాలా సేపటిగా తమనే గమనిస్తున్నవన్న సంగతి వారికి తెలీదు. బాట మీదకు రాగానే అశ్వాలను శర వేగంతో పరుగెత్తించారు. చీకటి పడక ముందే అవి లోయ దాటి ఎగువకు వెళ్ళి పోయాయి.

*******************************************

రాత్రి రెండో జాము ఆరంభమైంది.

ఆకాశం నిర్మలంగా వుంది.

నెలరాజు మింటి నుండి వెన్నెల కురిస్తున్నాడు.

ఇంకో నాలుగు రోజుల్లో పౌర్ణమి రానుంది.

మహా పథంలో పోటీ పడి పరుగు తీస్తున్నాయి అశ్వాలు గరుడ, ఢాకినీ రెండూ. ప్రశాంతంగా ఉన్న అడవిలో అప్పుడప్పుడూ మృగాలు అరుపు విన వస్తున్నాయి. రివ్వున వీస్తున్న శీతలగాలులు ధనుంజయ, భద్రా దేవిలను సేద తీరుస్తున్నాయి. పగలు చాలా సమయం వృధా అయినందున రాత్రికి ఎక్కడా ఆగకుండా తెల్ల వారే సరికి మాళవ సరి హద్దుకు చేరుకోవాలని ఏక బిగిన రాత్రికి రాత్రి ప్రయాణం కొనసాగిస్తున్నారు.

మహా పథానికి సమీపంలో ఎక్కడో చెంచు గూడెం నుండి వేణు నాదం ఒకటి నిశిధిలో గాలి వాటున అలలు అలలుగా తేలుతూ

వినవస్తోంది. బాట మీద అశ్వాల గిట్టల శబ్దానికి వేణు నాదం తోడు కాగా ప్రయాణం ఉత్సాహంగా సాగుతోంది. నిర్మానుష్యంగా వున్న మహా పథంలో దూసుకు పోతున్నాయి అశ్వాలు. ఇంతలో `

ఎక్కడి నుండో విన వచ్చింది ఒక భీకరమైన అరుపు. ఆ శబ్దం వింటూనే ఉలికి పడి తన అశ్వం కళ్ళాలు బిగించి భద్రా దేవి ఎప్పుడైతే ఆగి పోయిందో వెంటనే తన గుర్రాన్ని కూడ ఆపి వెనక్కి వచ్చాడు ధనుంజయుడు. చాలా వికృతంతగా వున్న ఆ అరుపును యువరాజు ధనుంజయుడు కూడ విన్నాడు. అది ఏ మృగం అరుపో అర్థం కాలేదు.

"భద్రా! ఏ మృగమది అంత బీభత్సముగా అరిచినది?" అనడిగాడు వెన్నెట్లో చుట్టూ పరికిస్తూ.

"ప్రభూ! అది ఖడ్గ మృగము అరుపు" అంది జాగ్రత్తగా పరిసరాలను గమనిస్తూ భద్రాదేవి.

"ఏమంటివి? ఖడ్గ మృగమా..." నమ్మ లేనట్టు అడిగాడు.

"అవును."

"మన అడవులందు ఖడ్గ మృగము లెక్కడివి. అవి ఉన్నట్టు ఎన్నడూ వినలేదే!"

"అదియే అర్థము గాకున్నది ప్రభూ. కాని అది నిక్కముగా ఖడ్గ మృగము అరుపే."

భద్రా దేవి సవరిస్తున్నంతలోనే మరో సారి విన్పించిందా అరుపు. ఈసారి స్పష్టంగా తాము వచ్చిన మార్గం వెనక తట్టు నుండి విన్పించింది. నిశిధిలో కొన్ని లిప్తల పాటు ప్రతిధ్వనించిందా అరుపు. ఇద్దరూ తాము వచ్చిన మార్గం వైపు దృష్టి సారించారు. ఎందుకైనా మంచిదని తన ధనస్సు అందుకుని సిద్ధం చేసాడు ధనుంజయుడు.

"అయిననూ అది దూరమున ఎచటనో సంచరిస్తున్నట్టున్నది భద్రా! మనకేమి? మన దారిన మనం పోవుటయే మేలు గదా?" సందేహ నివృత్తి కోసం అడిగాడు.

వెంటనే బదులు చెప్ప లేదు భద్రాదేవి. ఆమె కనులు ఆందోళన చెందుతున్నాయి. అంత చలిలో కూడ ఆమె నుదుట శ్వేదాన్ని వెన్నెట్లో గమనించ గలిగాడు ధనుంజయుడు. ఇది అంత తేలిక విషయం కాదని అర్థమైంది. భద్రాదేవి తలతిప్పి ధనుంజయుని చూసింది.

"ఏమైనది ప్రియా! కలవరమేల?" అడిగాడు.

"లేదు ప్రభూ! ఆ దుష్ట శక్తి మనల్ని విడువదు" అంది.

"ఏమంటివి? దుష్ట శక్తి? ఎవరది? అది నిజంగా ఖడ్గ మృగం కాదందువా?"

"కాదు ప్రభూ! నా సందేహము వృధా పోదు. ఎక్కడో పొరబాటు జరిగినది. మనము ఏమరి ఉంటిమి. మనల్ని వాళ్ళు గమనించుచున్నారని తెలియనైతిమి. బాగుగా ఆలోచించండి. మనం సింహము చెంత వున్నప్పుడు సంభాషించితిమి గదా! ఏ వశీకర మంత్రమునకు లొంగని మృగము ఖడ్గ మృగమని వచించితిని గదా!"

"ఆ మాట నిజము. అయితే...?"

"ఇప్పటికిప్పుడు ఈ ప్రాంతమునకు ఖడ్గ మృగము ఎటు వచ్చినది? ఆ మాయావి ఎవడో ఆ మృగ రూపమున మన నిర్జింప వచ్చుచున్నాడు. వాడు ఖచ్చితముగా నాగ రాజు భృత్యుడై వుండవలె. అంతియు కాదు, ఇక్కడ జరుగుతున్నదంతయు తమ ఓజో మంత్ర విద్యతో నాగాలు చూచుచున్నారు, సందియము లేదు." అంటూ తన అభిప్రాయాన్ని వివరించింది భద్రాదేవి.

ఆ మాటలు వినగానే ధనుంజయుని ఛాతీ ఉప్పొంగింది. ఆవేశంతో ముక్కుపుటాలు అదిరాయి. కనులు ఎర్ర బారాయి.

"రానిమ్ము భద్రా. అది ఎలాంటి దుష్ట శక్తి అయినా గానిమ్ము, నా కరకు బాణము దెబ్బకు అది మట్టి కరువక తప్పదు." అంటూ ధనుష్టంకారం చేసాడు. అది యుద్ధానాదాలకి సంకేతం. వింటి నారి శబ్దం కొన్ని లిప్తల పాటు చెవుల్ని హోరెత్తించింది. అయితే అతడి క్రోధావేశాన్ని వెంటనే తన మాటలతో అదుపు చేసింది భద్రాదేవి.

‘‘ప్రభూ! మీరంతటి సమర్థుని నాకు తెలియు. కాని మాయను మాయతోనే జయింపవలె. బలమున నిర్జింప లేము. మీరు ధనుర్బాణములతో సిద్ధముగా ఉండండి. తక్క సమయము నేను తెలిపెదను. అప్పుడు శరమును సంధించి వదిలిన చాలును. ఈలోపల ముందు ఆ నాగాలకు బుద్ధి చెప్పవలె’’ అంటూ తన మచ్చల గుర్రం నుండి క్రిందకు దూకింది భద్రా దేవి. వంగి గుప్పెడు ఇసుక తీసుకొని అభి మంత్రించి ఈశాన్య దిక్కును చూస్తూ గాల్లోకి బలంగా ఊదింది. అంతే`

ఆమె చేతి నుండి ఇసుక రేణువులు నిప్పురవ్వలుగా మారి గాల్లోకి ఎగసి అదృశ్యమయ్యాయి.

సరిగ్గా ఇదే సమయంలో మార్గం ఎగువ నుండి మరొక్క మారు భీకరంగా విన వచ్చింది ఖడ్గ మృగం అరుపు. దాంతో బాటే భూకంపం వస్తున్నట్టు నే అదర నారంభించింది.

అదిరి పడి ఎగిరి తన అశ్వం మీద కూచుంది భద్రా దేవి. అటు చూసిన ధనుంజయ, భద్రాదేవిలకు వెన్నెల వెలుగులో బాట మీద ఒక బీభత్స దృశ్యం గోచరించింది.

ఓ మోస్తరు చిన్న కొండలా వున్న ఖడ్గ మృగం ఒకటి వికృతంగా అరుస్తూ మహా రౌద్రంగా ఎగువ నుంచి దూసుకొస్తోంది. విశృంఖలంగా ఎగ బడి దూసుకొస్తోంది. దాని పద ఘట్టన లోనే అదిరి పోతోంది. ముట్టె మీద బలమైన కొమ్ముతో చెట్లను కూలగొడుతూ తట్టలకొద్ది మట్టిని పెళ్ళగించి పోస్తూ అట్టహాసంగా వస్తోంది.

అది సహజమైన ఖడ్గ మృగం కాదని దాని భారీ ఆకారం చూస్తేనే అర్థమై పోతోంది. అది తమను వెంటాడి వేటాడేందుకే వస్తోందని కూడ గ్రహించారు. దాని ఆర్భాటానికి గొంతు తడారి పోతూండగా ధనుంజయ, భద్రా దేవిలు నిశ్చేష్టులై అలా చూస్తుండి పోయారు.

***********************************************

ఎక్కడో ఈశాన్య భారతంలో`

మర్మ భూమి అటవీ ప్రాంతంలో`




నాగుల దిబ్బ మీది నాగాల గూడెం.

సమయం రాత్రి రెండో యామం.

గూడెమంతా నిద్ర పోతున్నప్పటికీ నాయకుడు నాగ కేసరి ఇంటి ముందు నాగ కేసరితో బాటు అనేక మంది కూచునున్నారు. ఎప్పుడో సాయంకాలం ఆరంభించిన ఓజో తాంత్రిక క్షుద్ర విద్యా ప్రయోగం ఇంకా కొన సాగుతూనే వుంది. కుల గురువు, మత గురువు గణా చారి హోమ గుండాన్ని చుట్టి కూచుని ప్రయోగం నిర్వహిస్తున్నారు. విశాలమైన వాకిట్లో అవతల ధూమ నాళికలో మహా పథంలో వెన్నెట్లో ప్రయాణిస్తున్న యువ రాజు ధనుంజయుడు, అపర్ణుడు కన్పిస్తున్నారు.

వెన్నెట్లో గూడెం తడిసి ముద్దవుతోంది. చుట్టూ కాగడాలు వెలుగుతున్నాయి. చల్లటి గాలులు ఆగి ఆగి వీస్తున్నాయి.

మత గురువు చెంత వున్న డబ్బీ నుండి నల్లటి కాటుక తీసి కళ్ళకు కాటుక పెట్టుకుని కూచోడంతో అక్కడున్న వాళ్ళంతా ధూమ నాళికలోని దృశ్యాన్ని స్పష్టంగా చూడ గలుగుతున్నారు, విన గలుగుతున్నారు.

ఇది చాలా ప్రత్యేకమైన కార్యక్రమంగా ఏర్పాటు చేయ బడింది. అందుకు తగిన కారణం కూడ వుంది. రత్న గిరి యువరాజు ధనుంజయుడు దివ్య నాగ మణి కోసం ప్రాణాలకు లెక్క చేయక నాగ లోకం రావటానికే కృత నిశ్చయుడై వస్తూండటం నాగ రాజుకి ఇష్టం లేదు. కంటగింపుగా వుంది. బెదిరింపులకు లొంగడని అర్థం కాగానే అతడ్ని అంతం చేయ సమ కట్టి సర్ప శీర్షుడనే దుష్ట శక్తి మాయావిని ఏర్పాటు చేశాడు. వాడ్ని ముందుగా నాగాల గూడెం నాయకుని వద్దకు పంపించాడు. ఆ విధంగా సర్ప శీర్షుడికి ధనుంజయుని చూపించటం కోసం ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది. అయితే ఈసారి శంఖు పుత్రి మాత్రం ఇచట లేదు. ఇదే సమయంలో ఆమె యువరాణి ఉలూచీశ్వరి వెంట వింధ్యా పర్వత మార్గంలో ధనుంజయుని రాక కోసం నిరీక్షిస్తోంది. ఈ విషయం ఎవరికీ తెలిదు.

ఓజో క్షుద్ర విద్యతో ధూమ నాళికలో ధనుంజయుడు ఒక్కడే ఒంటరిగా కన్పిస్తాడని నాయకుడు నాగ కేసరితో సహా అంతా భావించారు. కాని వెంట మరో యువకుడితో సింహం వద్ద చూసి విస్తు పోయారు.

సాయంకాలం నుంచి వారిని చూస్తున్నారు. వారిని ధూమ నాళికలో వీక్షించిన వెంటనే సర్ప శీర్షుడు అక్కడ అదృశ్యమై ధనుంజయ, అపర్ణులున్న చోటుకు వెళ్ళి పోయి అదృశ్య రూపంలో గమనించసాగాడు. ఆ దుష్ట శక్తి ధనుంజయుని అంతం చేసే దృశ్యాన్ని వీక్షించాని అప్పటి నుండి ఎదురు చూస్తూనే వున్నారంతా.

అది కూడ కాదు`

క్రూర మృగమైన సింహ కిశోరాన్ని అపర్ణుడు వశం చేసుకొని చికిత్స నెరపిన విధం చూసి విభ్రాంతి చెందారు నాగాలు. నాయకుడు నాగ కేసరి ఏదో అనుమానం వచ్చి నాగానందుని చెంతకు పిలిచాడు.

''ఆ రోజు మొదటి సారి మీరు ధనుంజయుని ఓజో ప్రభావంతో కలిసినపుడు ఆరోజు మన ప్రయోగం విఫలమైనది గదా. అప్పుడు ఒక మచ్చల గుర్రం మీద ఎవరో రావటం చివరి సారిగా జూచితినంటివి. అది ఆ యువకుడేనా?'' అనడిగాడు.

''అవును నాయకా! అతడే సందేహము లేదు.'' అంటూ బుదులిచ్చాడు నాగానందుడు.

‘‘కాని... అతడు నిజముగా యువకుడేనా? హావ భావము తిలకింప పురుష వేషములోని స్త్రీ వలె తోచుచున్నాడే.’’ అంటూ సందేహించాడు నాగ కేసరి. ధూమ నాళిక లోని దృశ్యాన్ని, మాటలు వినుటతో కొద్ది సేపటి లోనే ఆ సందేహము కూడ తీరి పోయినది. ఆమె భద్రా దేవి యనే యువతి యని, పురుష వేషమున అపర్ణుడిగా సంచరిస్తోందని అర్థమైంది. ధనుంజయునికి రక్షణ వలయంగావున్న ఆమెలో అంతటి మంత్ర శక్తి ఎలా వచ్చిందో అర్థం గాక విస్మయం చెందాడు. తమ మొదటి ప్రయోగం విఫలమైన రోజు హోమ గుండం నుండి ఎగసిన నిప్పుల్ని ఆ బీభత్సాన్ని ఇంకా మర్చి పోలేదు ఎవరూ.

అయితే ఇప్పుడు ధనుంజయుని ప్రాణాలు తీయటానికి వెళ్ళిన వాడు సామాన్యుడు కాడు. నాగ లోక భృత్యుడు దుష్ట మాయావి అయిన సర్ప శీర్షుడు. కాబట్టి సర్ప శీర్షుడి చేతిలో ధనుంజయుడు ఆ యువతి కూడ చస్తారని నమ్మకంతో వున్నారంతా. ఆ దృశ్యాన్ని నయనానందంగా వీక్షించాలని ఉవ్విళ్ళూరుతూ పట్టుదలగా కూచున్నారంతా.

సింహానికి చికిత్స ముగిసాక`

పొద్దువాలుతూండగా జల పాతం మడుగు ప్రాంతం నుండి ధనుంజయ అపర్ణులు తమ అశ్వాల మీద బయలు దేరటం చూసారు. అదృశ్య రూపంలోని సర్ప శీర్షుడు వారి మీద ఎప్పుడు ఎలా దాడి చేస్తాడో అర్థం కాలేదు ఎవరికీ. కుతూహలంతో చీకటి పడినా కదలకుండా వూపిరి బిగించి చూస్తున్నారంతా. ఒక్క నాయకుడు నాగ కేసరి మాత్రం వూహించ గలిగాడు.

అపర్ణుడు చెప్పినట్టు ఖడ్గ మృగం మీద ఎలాంటి వశీ కరణ మంత్రం పని చేయదు. ఆ క్రూర మృగం వశం కాదన్న సంగతి తెలిసినదే. కాబట్టి సర్ప శీర్షుడు ఖడ్గ మృగంగా మారి దాడి జరుప వచ్చని వూహించాడు నాగ కేసరి. అదే నిజమైంది.

ఖడ్గ మృగం అరుపు విన్నారు.

అశ్వాలు బాట మీద నిలిచి పోవటం చూసాడు.

బీభత్సంగా దూసుకొస్తున్న ఖడ్గ మృగాన్ని గమనించారు. ఇంకేముంది ఖడ్గమృగంగా మృత్యువులా వచ్చి పడుతున్న సర్ప శీర్షుడి చేతిలో ఆ యిరువురికీ చావు తప్పదనుకున్నారు. ఆ క్షణం కోసం కళ్ళు పత్తికాయలు చేసుకుని ధూమ నాళికను వీక్షిస్తున్నారు. అంతలో అపర్ణుడిగా వున్న భద్రా దేవి క్రోధావేశంతో... ‘ముందుగా ఆ నాగాలకు బుద్ధి చెప్పవలె’ అంటూ అశ్వం నుంచి దూకి గుప్పెడు ఇసుక తీసి అభి మంత్రించటం చూసారు.

''చూడండిరా! ఆ పిల్లగాడు మనకు బుద్ధి చెబుతాడట'' అంటూ నాగాలు నవ్వుకో సాగారు. కాని గత అనుభవం వలన నాగాల నాయకుడు నాగ కేసరి నవ్వుకో లేక పోయాడు. గాభరాతో చివ్వున లేచి` ''ఆ కుర్రది ఏదో చేయ బోతున్నది. ఆపండిరా! దాన్ని ఆపండి'' అంటూ హోమం నిర్వహిస్తున్న వాళ్ళ నుద్దేశించి పెద్దగా అరిచాడు.

నిశీధిలో అతడి గొంతు మారు మ్రోగింది.

నాగాలు ఒక్క సారిగా ఉలికి పడ్డారు. నాగాల పెద్దలు జాగ్రత్త పడే లోపలే జరగాల్సింది కాస్తా జరిగి పోయింది. అపర్ణుడు మంత్రించిన ఇసుకను గాల్లోకి ఊపగానే నిప్పు రవ్వలు ఎగరటం మాత్రం కన్పించింది. ఆ మరు క్షణమే అంత వరకు కన్పిస్తున్న దృశ్యాలు ధూమ నాళికలో అదృశ్యమయ్యాయి. ఒక్క సారిగా ధూమ నాళిక చెదరి పోయి అందులో హోమ ధూపమంతా గాలి లోకి చెదిరి పో నారంభించింది.

హోమం నిర్వహిస్తున్న గురువు అదిరి పడి కంగారుగా లేచి పోయారు. అదే సమయంలో జరిగి పోయిందో విపరీతం. ఎవడో రాక్షసుడు హోమ గుండం లోంచి ఊదుతున్నట్టు హోమ గుండం నుండి ఒక్క సారిగా కణ కణ మండే నిప్పులు గాల్లోకి ఎగిరి చెల్లా చెదురుగా నాగాలమీద వర్షంలా కురవ నారంభించాయి. అంతటితో ఆగకుండా నాగాల నాయకుడి ఇంటితో బాటు సమీపం లోని కొన్ని యిళ్ళ మీద పడ్డాయి.

దయనీయంగా మారి పోయింది నాగాల పరిస్థితి. నిప్పు కణాల తాకిడికి వంటి మీద బొబ్బు లేస్తుండగా కాళ్ళు తొక్కుకుని చిందులేస్తూ గోలగోలగా పరుగు ఆరంభించారు. ఇంతలో ఇళ్ళకు నిప్పంటుకుని మంటలు లేచాయి.

తాటి, కొబ్బరి వంటి ఆకులతో కప్పిన యిళ్ళు అవి. గాలికి వెంట వెంటనే అంటుకున్నాయి యిళ్ళు. నిద్ర పోతున్న వాళ్ళని బయటకు తెచ్చే లోపు ఒక్కో ఇల్లు కాలి బూడిద కాసాగింది. నాగాల నాయకుడు నాగ కేసరికి ఒళ్ళంతా కాలింది. భగ భగ మంటలతో ఇళ్ళు తగల బడుతూంటే నిస్సహాయంగా చూస్తూండి పోయాడు.

మంటలు....

ఎటు చూసినా మంటలు.

గూడెం మొత్తం చూస్తూండగానే మంటల్లో చిక్కి దారుణంగా తగల బడి పోసాగింది. నాగాల ఏడుపులు పెడబొబ్బలు మిన్ను ముట్టాయి.

‘‘నిజం గానే ఆ కుర్రది తమకు బుద్ధి చెప్పింది.’’ అనుకున్నాడు నాగ కేసరి.

మిగిలిన రాత్రి నాగాల పాలిట కాళ రాత్రిగా మిగిలి పోయింది. అర్ధ రాత్రి దాటే సరికి ప్రాణ నష్టమంటూ ఏమీ జరగ లేదు. కాని నాగాలు తమ పశువుల తోను, కట్టు బట్టల తోను కాందిశీకులుగా మిగిలి పోయారు.

**************************

‘‘భద్రా! అది వచ్చి పడుచున్నది. ఇప్పుడేమి చేయాలె?’’ విల్లంబులను సిద్ధంగా పట్టుకుని అడిగాడు యువ రాజు ధనుంజయుడు. బాట వెంట మహా ప్రళయంగా ఉగ్ర రూపంతో దూసుకొచ్చేస్తోంది ఖడ్గ మృగం.

భద్రా దేవి తన అశ్వం మీది పండ్ల సంచి నుండి మూడు నిమ్మకాయలు తీసింది. వాటిని కొన్ని లిప్తల కాలం అభి మంత్రించి ముమ్మారు ఫూది చేతిలో సిద్ధంగా వుంచుకుంది. తన అశ్వం కళ్ళాలు అందుకుని సిద్ధం చేస్తూ ధనుంజయుని అశ్వం కళ్ళాలు కూడ తన చేతి లోకి తీసుకుంది.

‘‘ప్రభూ! అశ్వం మీద వెను తిరిగి కూచుని వస్తున్న ఖడ్గ మృగాన్నే గమనిస్తూండండి. నేను అశ్వాలను వేగంగా పోనిస్తాను. ఖడ్గ మృగం మన సమీపం లోనికి రాగానే ఒక నిమ్మ కాయను విసురుతాను. ఆ కాయను దాట గానే ఖడ్గ మృగం అదృశ్యమై ఆ స్థానంలో ఆ రూపం ధరించిన మాయావి కొద్ది లిప్తల కాలం కన్పిస్తాడు. అలా కన్పించిన వెంటనే బాణం వదిలి వాడ్ని పడగొట్టాలె. తిరిగి మృగంగా మారక ముందే వాడ్ని మట్టి కరిపించాలె. మనకి మూడు అవకాశములు మాత్రమే కలవు. తప్పితే ఆ మృగం మనల్ని బ్రతుక నివ్వదు.’’ అంటూ వివరించింది.

‘‘భయ పడకుము భద్రా! చెప్పినావుగా. ఇక నేను వాడి సంగతి చూసుకొందును. అశ్వమును పోనిమ్ము’’ అంటూ అశ్వం జీను మీద వెను తిరిగి కూచుని సిద్ధమయ్యాడు. అశ్వాలను అదలించింది భద్రా దేవి.

అశ్వాలు గరుడ, ఢాకినీలు ఒక్క సారిగా పరుగు అందుకున్నాయి. అప్పటికే వారికి నూరు ధనువుల దూరం లోకి వచ్చేసిందా ఖడ్గ

మృగం. ఎప్పుడైతే అశ్వాలు పరుగు అందుకున్నాయో ఇక అశ్వాలకు ఖడ్గ మృగానికి ఆరంభమైంది పరుగు పందెం.

అప్పటికి నూరు ధనువుల సమీపం లోకి వచ్చేసిందా మృగం. తనకు అందకుండా పారి పోతున్న అశ్వాలను చూస్తూ రెట్టించిన వేగంతో తరుమ నారంభించింది.

సహజంగా ఖడ్గ మృగం చాలా బరువైన జంతువు. అది అశ్వాలతో సమంగా పరుగెత్తటం అసంభవం. కాని ఇక్కడ తరుముతోంది మాయా ఖడ్గ మృగం. అందుకే ఎగిరి వస్తున్న కొండ గుట్టలా అమిత వేగంతో అశ్వాలను వెన్నంటి వస్తోంది. బుసలు కొడుతూ బీభత్సంగా తరుముతోంది. నిశీధిలో అశ్వాల గిట్టల శబ్దం, ఖడ్గ మృగం పద ఘట్టనతో అటవీ ప్రాంతం మారు మ్రోగుతోంది. క్షణం ఆగినా అది అశ్వాలతో సహా తమను కుమ్మి పాదాలతో మట్టగించి చంపేస్తుందని తెలుసు. అశ్వాలను వాయు వేగంతో పరుగెత్తిస్తున్నారు.

మచ్చల గుర్రం మీది భద్రా దేవి తల త్రిప్పి ఆ భయానక మృగం బీభత్సాన్ని గమనిస్తూనే వుంది. క్రమంగా అది తమకు యాభై ధనువుల సమీపం లోకి వచ్చేసింది. అప్పుడు`

ధనుంజయుని హెచ్చరిస్తూ తన తల మీదుగా మొదటి నిమ్మ కాయను వెనక్కు విసిరేసింది భద్రా దేవి. చూస్తూండగానే ఖడ్గ మృగం మంత్రించిన నిమ్మ కాయను దాటింది. దాటిన మరు క్షణం ఒక అద్భుత దృశ్యం కంట బడింది.

ఖడ్గ మృగం అదృశ్యమై`

ఆ స్థానంలో ఒక వింత ఆకారం ప్రత్యక్షమైంది.

ఆ ఆకారం రొప్పుతూ పరుగెత్తుకొస్తోంది.

వాడు బలిష్టంగా పదడుగుల ఎత్తుండే మనిషి రూపుడు. కాని వాడికి తల స్థానంలో పడగ విప్పిన పెద్ద సర్పం తల వుంది. చేటంత పడగ, ఎర్రని కళ్ళతో చూస్తూ ఆ సర్ప శిరస్కుడు భయానకంగా వున్నాడు. నల్లటి దేహం, ఎర్రటి పంచె దట్టీ బిగించి కట్టాడు. మెడలోను చేతులకు నాగాభరణాలున్నాయి. అటు ధనుంజయుడు ఇటు భద్రా దేవి కూడ ఆ విచిత్ర రూపం గాంచి

చకితులయ్యారు.

ధనుంజయుడు ఎంతగా విభ్రాంతుడయ్యాడంటే వాడి పైకి బాణం వేయటం కూడ మర్చి పోయాడు. దాంతో కొన్ని లిప్తల కాలం మెరుపులా మెరిసిన ఆ ఆకారం తిరిగి ఖడ్గ మృగంగా మారి పోయాడు. రెట్టించిన వేగంతో ఖడ్గ మృగం తిరిగి తరుముకొస్తోంది. క్రమంగా అది దగ్గరవుతోంది.

''క్షమించు భద్రా! ఆ విచిత్ర రూపమును గాంచి విభ్రాంతుడనై బాణము వేయ లేక పోతిని'' అన్నాడు భద్రా దేవితో ధనుంజయుడు.

''మనకు ఇంకను రెండు అవకాశములున్నవి ప్రభూ. ఈసారి ప్రయోగించండి. వాడిని ఎంత త్వరగా వధించిన అంత మంచిది.'' గుర్రాలను అదలిస్తూనే అరిచింది భద్రా దేవి.

చెట్టు పుట్టలు శర వేగంతో వెనక్కి పోతున్నాయి. వెన్నెట్లో వాయు వేగంతో పరుగు తీస్తున్నాయి అశ్వాలు. వాటి సందడికి ఏం జరుగుతోందో అర్థం గాక గూళ్ళ లోని అడవి పక్షులు కకావికలై గాల్లోకి ఎగురుతున్నాయి.

కొంత అవధి తర్వాత ధనుంజయుని హెచ్చరిస్తూ తన తల మీదుగా రెండో నిమ్మ కాయను వెనక్కి విసిరింది భద్రాదేవి.

ఈసారి ధనుంజయుడు అప్రమత్తంగానే వున్నాడు. రెండు బాణాలను వింటికి సంధించి సిద్ధంగా వున్నాడు. ఆ రెంటిలో ఒకటి అర్ధ చంద్రాకార బాణం.

ఖడ్గ మృగం నిమ్మ కాయను దాటింది.

అంతే` మరు క్షణమే ఖడ్గ మృగం అదృశ్యమై తిరిగి సర్ప శిరస్సు వాడు ప్రత్యక్షమై పరుగెత్తుకు రాసాగాడు. వాడు కనీ కనిపించగానే ఏక కాలంలో రెండు బాణాలనూ ప్రయోగించాడు ధనుంజయుడు. అతడి గురి తప్పదు.

ఒక బాణం సూటిగా పోయి ఆ మాయావి గుండెల్లో నాటుకుంది. వస్తున్న వాడు వస్తున్నట్టే ఆగి పోయి పెద్దగా అరిచాడు. ఆ అరుపు గొంతు దాటుతూండగానే అర్ధ చంద్రాకార బాణం రివ్వున వచ్చి వాడి సర్ప శిరస్సును ఖండించి దూరంగా పడేసింది. దాంతో వాడు

నెత్తురు ధారుగా పారుతుండగా అక్కడి కక్కడే విరుచుకు పడి పోయాడు. అది చూడ గానే అశ్వాలను నిలువరించి వెనక్కు తిప్పారు ధనుంజయ భద్రా దేవిలు.

ధనుంజయుడు తన అశ్వం మీద యధా ప్రకారం కూచుని భద్రా దేవితో వెనక్కి వచ్చాడు. అశ్వాలను ఆపి ఆ వింత మనిషిని చూసారు. కింద పడి ఇంకా కొట్టుకుంటున్నాడు వాడు. అంతలో దూరంగా తెగి పడిన అతడి సర్ప శిరస్సు నెమ్మదిగా గాల్లో లేచి రా నారంభించింది.

ముందుగా ఆ దృశ్యాన్ని చూసిన భద్రా దేవి ఉలికి పడింది. ఆ శిరస్సు వచ్చి మొండేనికి చేరితే తిరిగి ఆ మాయావి బ్రతుకుతాడు. కథ మళ్ళీ మొదటి కొస్తుంది. ‘‘ప్రభూ!’’ అంటూ ధనుంజయుని హెచ్చరించింది.

క్షణం కూడ ఆలస్యం చేయకుండా మరో బాణాన్ని సంధించి, గాల్లో తేలి మొండెం వద్ద కొస్తున్న పడగ మీదికి వదిలాడు. ఆ బాణం పడగ మధ్యలో దిగి రివ్వున వెళ్ళి వెనక వున్న మద్ది వృక్షం మానుకు నాటుకుంది. బాణానికి వేలాడుతూ చెట్టుకు నాటుకుని అలానే ఉండి పోయింది పాము తల. ఈ లోపల ధనుంజయుడు ఆ భీకరాకారుని మీద మరో రెండు బాణాలు వేసి మరింత గాయ పర్చాడు.

ఇద్దరూ అశ్వాలు దిగారు.

పెద్ద గండం గడిచినందుకు `

తేలిగ్గా ఊపిరి తీసుకున్నారు.

భద్రా దేవి చెట్టుకు నాటుకున్న సర్ప శిరస్సు సమీపం లోకి వెళ్ళి ఏవో మంత్రాలు చదివి శిరస్సు వంక చూసింది. ‘‘నువ్వింకా చావ లేదు. బ్రతికే వుంటివి. మాట్లాడ గలవు. చెప్పు! ఎవరు నువ్వు?’’ కోపంతో ఆ శిరస్సును గద్దించి అడిగింది.

ఎర్రని కళ్ళతో ఇద్దరినీ కౄరంగా చూస్తూ భద్రా దేవి ప్రశ్నకు బదులు చెప్పకుండా విషాన్ని కక్కిందా సర్ప శిరస్సు. ఆ విషం మీద పడితే క్షణాల్లో ప్రాణాలు ఎగిరి పోవలసిందే. కాని ముందు ప్రమాదాన్ని వూహించి దూరంగా నిలవటంతో ప్రమాదం తప్పింది.

‘‘చచ్చే ముందయినా నిజం చెప్పి చావరా మూర్ఖా! ఎవరు నీవు?’’ తిరిగి గద్దించింది భద్రా దేవి.

అప్పుడు నోరు విప్పిందా సర్ప శిరస్సు.

"నన్ను సర్ప శీర్షుడంటారు. నాగ లోక వాసిని. నాగ రాజు భృత్యుడ్ని" అంది.

"నిను నాగ రాజు పంపించినాడా?"

"అవును. ధనుంజయుని కడ తేర్చమని ఆనతిచ్చి పంపించినాడు."

"మా ఉనికి ఎలా తెలిసినది?"

"నాగాలు ఓజో ప్రయోగం చేసి చూపించినారు. నేరుగా అటు నుండి జల పాతం వద్ద కొచ్చితిని."

"అంటే... ఆదృశ్య రూపంలో మా మాటలు అక్కడ విన్నావు. అందుకే ఖడ్గ మృగంగా మారి మా మీదకు దాడి చేయ వచ్చినావు. అవునా?"

"అవును. కాని... నా నుంచి మీరు తప్పించుకోవచ్చు. దివ్య నాగ మణిని మాత్రం సంపాదింపజాలరు. ఈ లోపలే మీరును చచ్చెదరు... మీకును..." అంటూ ఉన్నట్టుండి తల వాల్చేసిందా శిరస్సు.


సర్ప శీర్షుడు మరణించాడని తెలిగానే ఇద్దరూ వెనక్కి వచ్చారు. అక్కడ సర్ప శీర్షుడి మొండెం కూడ రక్తపు మడుగులో అచేతనంగా పడుంది.

చుట్టూ కీచు రాళ్ళ రొద.

పక్షు లింకా ఆకాశంలో తారాడు తున్నాయి. అవి ఇంకా గూళ్ళకు చేరుకో లేదు. మబ్బులు లేని ఆకాశంలో చంద్రుడు పాల వెన్నెల

కురిపిస్తున్నాడు.

ధనుంజయునికి ఈ ఘన విజయం అమితానందాన్ని కలిగించింది. అయితే సర్ప శీర్షుడ్ని తను సంహరించి ఉండొచ్చు. కాని భద్రాదేవి పక్కన లేకుంటే ఈ విజయం సాధ్యమయ్యేది కాదు. మృగ రూపం లోని సర్ప శీర్షుడ్ని తను జయింప గలిగే వాడు కాదు.




భద్రా దేవితో పరిచయం ప్రేమ అంతా తన అదృష్టమే. ఆ వేణు గోపాలుడూ, సహ్యాద్రి భీమ శంకరుడు తనకు కటాక్షించిన వరమే ఈ సౌందర్య రాశి భద్రా దేవి.

ఉప్పొంగిన ప్రేమాతిశయంతో ముదమార భద్రా దేవిని కౌగిలించుకుని తన కృతజ్ఞత తెలిపాడు. భద్రా దేవి వలపు మీర కొసరి కొసరి ముద్దాడింది.

“ప్రభూ! నేను మీ హృదయేశ్వరినే కాదు. అంగ రక్షకుడిని కూడ. ఆ మృత్యువైనను మిము చేరాలంటే నను దాటే రావాలె. మీ కొరకు ప్రాణ త్యాగానికైనను వెరగు పడు దానను కాను” అంది భద్రా దేవి.

‘‘అంత మాటనకు దేవి. నీవు లేని లోకంలో ఈ ధనుంజయుడూ వుండడు’’ అంటూ ముద్దాడాడు.

‘‘ప్రభూ! ఈ మాటలు సత్యములేనా? నమ్మ వచ్చునా?’’ ధనుంజయుని ఛాతీకి బలంగా హత్తుకు పోతూ ఆర్తిగా అడిగింది భద్రా దేవి. ఆమె చుబుకాన్ని ఎత్తి కళ్ళ లోకి ఆత్మీయంగా చూసాడు ధనుంజయుడు. వెన్నెల కాంతిలో తామర పుష్పంలా మెరిసి పోతున్న ఆమె ముఖ సౌందర్యాన్ని కొద్ది సేపు ముగ్ధుడై తిలకించాడు.

‘‘ప్రియా... సందేహమా? అటు సూర్యుడు ఇటు ఉదయించినా ఉదయించు గాక కాని ఈ ధనుంజయుడు తన మనోహరికిచ్చిన మాట ఎన్నడూ తప్పడు’’ అన్నాడు.

ఆ మాటలతో పులకించి పోతూ ముద్దులతో అతడ్ని అభిషేకించింది భద్రా దేవి. వెన్నెల చల్ల దనంలో చుంబన ఆలింగనాదుల పరవశంతో మైమరచి పోయారిరువురూ. అంతలో కర్తవ్యాన్ని గుర్తు చేసుకుంటూ కౌగిలి విడిపించుకుని తన మచ్చల గుర్రం వైపు దారి తీసింది భద్రా దేవి.

ఆ విధంగా సర్ప శీర్షుడిని సంహరించాక ప్రేమికులిద్దరూ తిరిగి తమ అశ్వాల మీద బయలు దేరి రాత్రికి రాత్రి ప్రయాణాన్ని కొన సాగించారు. తెల్ల వారక ముందే వారు మాళవ సరి హద్దును సమీపించారు.

****************************

రాత్రి నాలుగో యామం కొంత సమయం గడిచే సరికి చంద్రుడు అస్తమించి లోకమంతా గాడాంధకారం అలుముకుంది. చుక్కలు ప్రకాశ వంతంగా కన్పిస్తున్నాయి. మహా పథం మీద పోటీ పడి పరుగులు తీస్తున్నాయి అశ్వాలు గరుడ, ఢాకినీలు.

‘‘మనము మాళవ సరి హద్దును సమీపిస్తున్నాం దేవీ.’’ అంటూ గుర్తు చేసాడు ధనుంజయుడు.

‘‘అవును ప్రభూ! రత్న గిరి సరి హద్దును దాటి పోనుంటిమి’’ అంది భద్రా దేవి. రెండూ ఒకటేనని ఇరువురికీ తెలుసు. అందుకే

పరిహాసంగా నవ్వుకున్నారు.

సర్పశీర్షుడి సంహారం పిమ్మట`

నిరాటంకంగా రాత్రంతా కొన సాగుతూనే వుంది వారి ప్రయాణం. ఇరు రాజ్యాల సరి హద్దు వద్ద మహా పథం మీద సరిహద్దు దళాల శిబిరాలుంటాయి. సరి హద్దు దళాలు నిరంతరంగా కాపలా వుంటారు. అక్కడి అధికారులు మహా పథంలో సాగే బిడారులు బాటసారుల నుండి సుంకాలు వసూలు చేస్తారు. ఆ విధంగా అటు మాళవం గాని ఇటు రత్న గిరి గాని రాజ్యం లోకి వచ్చే వారి చెంత మాత్రమే సుంకం విధిస్తారు. రాజ్యం నుండి వెళ్ళే వారి వద్ద వసూలు చేయరు. కాని వివరాలు అడుగుతారు. సందేహాస్పదమైన వ్యక్తులయితే సోదా చేసి గాని వదలరు.

సరి హద్దులకి చేరగానే`

తమ సైనిక శిబిరంలో తగినంత విశ్రాంతి తీసుకుని నిద్ర పోయి ఉదయం భోం చేసాక బయలు దేరే ఉద్దేశంలో వున్నాడు ధనుంజయుడు. నిద్ర లేమి అలసట నుండి బయట పడ వచ్చు. అశ్వాలకూ తగిన విశ్రాంతి లభిస్తుంది.

కాని ఇదే అభిప్రాయాన్ని చెప్పినప్పుడు భద్రా దేవి వెంటనే తిరస్కరించింది.

‘‘ప్రభూ! ఆ విధముగా చేయుట మనకి సురక్షితమందురా?’’ అనడిగింది, తిరిగి తనే చెప్పింది.

‘‘ఓ ప్రక్క రత్నగిరిలో పరిస్థితుల గురించి వింటూనే వున్నాం. బాహ్లీకుడు శతానీకునితో చేయి కలిపి అంతర్యుద్ధానికి సిద్ధ పడుతున్నాడు. ఉప సైన్యాధ్యక్షుడైన ఆ ద్రోహి తన ఆధీనం లోని సేనల్ని ఏవేవో ప్రలోభాలు చూపి తన వైపు తిప్పుకున్నాడు. చాప కింద నీరు వలె వాడి మనుషులు ఎక్కడి కక్కడ ఎంత దూరం వరకు వ్యాపించి వున్నారో తెలీదాయె. సరి హద్దు దళముందు అతడి మనుషులు లేరన్న నమ్మకం ఏమున్నది? ఈ పరిస్థితిలో మనం శిబిరంలో నిద్ర చేయటం ప్రమాదమే. మనకు విష ప్రయోగం జరగ వచ్చు లేదా నిద్రించునపుడు మన కుత్తుకు కోయ వచ్చు. మనను బ్రతక నివ్వరు. ఆలోచించండి ప్రభూ. నన్నడిగినచో అసలు మీరు సరి హద్దు దాటిన సంగతే ఇటు రత్న గిరి దళాలకు గాని అటు మాళవ రాజ్య దళాలకు గాని తెలియ కూడదు.’’ అంది.

భద్రా దేవి సలహా లోని వాస్తవాన్ని గ్రహించి అవునన్నట్టు తలూపాడు ధనుంజయుడు. అడవి కోళ్ళు కూసే వేళకి అశ్వాలు సరి హద్దును చేరుకున్నాయి. అక్కడికి కాస్త ఎగువనే భద్రా దేవి సలహా మేరకు తన వేషం మార్చుకున్నాడు ధనుంజయుడు. తలకు తలపాగా చుట్టుకున్నాడు. ముఖం తెలీకుండా వస్త్ర భాగాన్ని చుట్టుకున్నాడు. తన అశ్వాన్ని గుర్తు పట్టకుండా నల్లని జూలు మీద తెల్లటి వస్త్రం కప్పాడు.

ఆ విధంగా తగిన జాగ్రత్తలు తీసుకుని సైనిక శిబిరాన్ని సమీపించారు. వెంటనే సరి హద్దు దళానికి చెందిన కావలి భటులు వారిని ఆపారు.

ధనుంజయుడు మౌనం వహించాడు.

భద్రా దేవి వాళ్ళతో మాట్లాడింది అపర్ణుడిగా.

మగ వేషం లోని ఆమె వాక్చాతుర్యం పని చేసింది. కించిత్తు కూడ అనుమానించకుండా వారిని వదిలేసారు భటులు. అక్కడి నుండి రత్నగిరి భూ భాగం దాటి మాళవ రాజ్య భూ భాగం లోకి ప్రవేశింప గానే అక్కడి మాళవ శిబిరం వద్ద భటులు ఆపేసారు.

అక్కడ కూడ మౌనం వహించాడు ధనుంజయుడు. భద్రా దేవి తనను అపర్ణుడిగా పరిచయం చేసుకొని మాట్లాడింది. తామిద్దరూ మిత్రుని అవంతీ పురంలో (ఉజ్జయిని) బంధువు యింట శుభ కార్యానికి పోతున్నట్టు చెప్పి నమ్మించి ప్రయాణ సుంకాన్ని చెల్లించింది.

ఆ విధంగా యిరువురూ సరి హద్దు దాటి మహా పథంలో ముందుకు సాగే సరికి తూరుపు తెల్ల వారింది. చీకటి మాటున సరి హద్దు దాటి నందున ఎవరూ ధనుంజయుని గానీ అతని అశ్వాన్ని గానీ గుర్తు పట్ట లేదు. సరి హద్దు దాటిన కొద్ది సేపటికే అడవి తరిగి పోయి మాళవం లోని పంట భూములు కను విందు చేస్తూ కన్పించాయి. మనుషుల సంచారం కన్పించింది.

రాత్రంతా నిదుర లేనందున ఇరువురూ బాగా అలసి వున్నారు. కనులు ఎర్ర బారి మండుతున్నాయి. ఆకలి సంగతి ఎలా వున్నా ఎక్కడో చోట ఒక జాము నిద్ర పోవాలి. అనువైన చోటును గాలిస్తూ ముందుకు సాగుతున్నారు. ఒక చోట దారిలో అగుపించిన పంట కాలువ లో కర చరణాలు ముఖ ప్రక్షాళన చేసుకుని తిరిగి ముందుకు సాగారు. పొద్దు పొడిచిన కొద్ది సేపటికి ఒక ప్రాంతాన్ని చేరుకున్నారు. ఎగువన చిన్ని పల్లె కన్పిస్తోంది. సమీపంలో బాటకి ఎడంగా ఒక పెద్ద సత్రం వుంది. అక్కడ రాత్రి మజిలీ

చేసినట్టున్నారు ఒక పెద్ద బిడారు గుంపు కన్పిస్తోంది. ముందుకు పోయి పల్లెలో మజిలికి ఏదో ఒక అనువైన చోటు చూడాలనుకుంటూ అశ్వాలను అదలించారు.

అశ్వాలు సత్రం ను దాటి పోతున్నాయి. ఇంతలో ` ''ఇదిగో అబ్బాయ్! అపర్ణా... ఆగుము'' అంటూ పరిచయమున్న గొంతు ఒకటి బిగ్గరగా విన్పించటంతో వెంటనే కళ్ళాలు బిగించి అశ్వాన్ని ఆపింది భద్రా దేవి. అక్కడ విస్మయ పరిచే మరో సంఘటన జరగనుందని ఆ క్షణంలో ఇరువురికీ తెలీదు. తల తిప్పి చూసిన భద్రా దేవికి బిడారు గుంపు ముందు ఓ కాలు కొద్దిగా కుంటుతూ చేయి వూపుతున్న భల్లాతకుడు కన్పించాడు.

అతడే ఆ బిడారు నాయకుడు.

****************************************

భల్లాతకుడి బిడారు రత్న గిరి చేరిన మూడో రోజునే తిరిగి స్వస్థలమైన అవంతికి బయలుదేరింది. వాళ్ళంతా మొన్న సాయం కాలమే సరి హద్దు దాటి వచ్చి ఆ సత్రం వద్ద రాత్రికి మజిలి చేసారు. వాళ్ళంతా నిన్న ఉదయమే అవంతికి ప్రయాణం చేయాలి కాని ఆ రాత్రి జరిగిన వూహించని సంఘటన ఒకటి వాళ్ళని అక్కడి నుండి కదలకుండా చేసింది. ఏం చేయాలో తెలిని సంకట స్థితిలో భల్లాతకుడు కొట్టు మిట్టాడు తూండగా యువరాజు ధనుంజయుని వెంట బెట్టుకుని అపర్ణుడు కన్పించటం గొప్ప వరంగా తోచింది. అందుకే మచ్చల గుర్రాన్ని గుర్తు పట్టగానే అపర్ణుడిని పిలిచాడు. నిజానికి అపర్ణుడు పురుషుడు కాదని స్త్రీయని భల్లాతకుడికి తెలీదు. బాలుడనే అనుకుంటున్నాడు.

అసలా సత్రం వద్ద మొన్న రాత్రి ఏం జరిగింది? ఆ రాత్రి బిడారు లోని వర్తకులు ఇతర ప్రయాణీకులు అంతా భోజనాలు చేసి సత్రం ముందు ఆరు బయట వెన్నెట్లో పడుకున్నారు. పంట పొలాల మీదుగా వీస్తున్న పైర గాలికి ఎక్కడి వాళ్ళక్కడ గాఢ నిద్ర లోకి జారుకున్నారు. అతడి మనుషులు రక్షణగా కాపలా తిరుగుతున్నారు. కొందరు అశ్వాల మీద కంటి మీద కనుకు లేకుండా అప్రమత్తంగా వున్నారు.

అప్పటికే అంటే బిడారు గుంపు రావటానికి అయిదు రోజుల ముందే ఆరుగురు సభ్యులతో కూడిన ఒక బృందం అశ్వాల మీద వచ్చి ఆ సత్రంలో విడిది చేసింది. సాధారణ వ్యాపారుల్లా దుస్తులు ధరించి వున్నారు. కాని చెంత మారణాయుధాలున్నాయి. ఆ సత్రంలో ఉంటూ బాట మీద వచ్చే పోయే వాళ్ళ మీద నిఘా వుంచారు. జాముకు ఒకడు చొప్పున మారుతూ పగలు రేయి కాపు వేసి ఎవరి కోసమో చూస్తున్నారు. బిడారు అక్కడ విడిది చేసినప్పుడే వాళ్ళ తీరు భల్లాతకుడికి సందేహం కలిగించింది. వాళ్ళని

ఓ కంట కని పెట్టి విషయం ఏమిటో తెలుసుకోమని తన మనుషులిద్దర్ని నియమించాడు.

మనకు సంబంధం లేని విషయమైనప్పటికీ ఒక్కో సారి కుతూహలంతో అదేమిటో తెలుసుకో మంటుంది. దానివల్ల అప్పుడప్పుడూ కొన్ని చిక్కు సమస్యలూ ఎదురవుతూంటాయి. బిడారు నాయకుడు భల్లాతకుడి విషయంలో కూడ అదే జరిగింది.

ఆ రాత్రి మధిర సేవించి చక్కగా భోంచేసి వెన్నెట్లో ఆరు బయట నిద్రించిన కొద్ది సేపటికే అతడు నియమించిన మనుషులిద్దరూ వచ్చి తట్టి లేపారు. లో గొంతుతో వాళ్ళు చెప్పిన విషయాు వినగానే భల్లాతకునికి తాగిన మధిర మత్తు మొత్తం దిగి పోయింది.

ఆ ఆగంతకులు ఆరుగురూ ఖచ్చితంగా ఎవరి మనుషులో తెలిదు. కాని వాళ్ళు వేచి వున్నది ఎదురు చూస్తున్నది మాత్రం సాక్షాత్తూ రత్నగిరి యువ రాజు ధనుంజయుని కోసం. అతడు సరి హద్దు దాటి మాళవం లోకి రాగానే హఠాత్తుగా మూకుమ్మడిగా దాడి చేసి చంపటం లక్ష్యంగా అక్కడ కాపు కాసి కూచున్నారు.

ఈ విషయాలు తెలిగానే విభ్రాంతుడయ్యాడు భల్లాతకుడు. ఇది సాధారణ విషయం కాదు. ఒక రాజ్యానికి ఏకైక వారసుడయిన యువ రాజుని కడ తేర్చటమంటే రత్న గిరి లో ఏదో భయంకరమైన కుట్ర జరుగులోంది. ఆ కుట్రలో భాగం గానే వీళ్ళు వచ్చుండాలి. ఇది ప్రత్యర్థులు తల పెట్టిన అతి పెద్ద నేరం.

తనకు యువ రాజా వారితో పరిచయం లేదు. కాని అతన్ని చూసాడు. మహా అందగాడు, మహా వీరుడని విన్నాడు. ఎంతటి వీరుడైనా వెన్ను పోటు పొడిస్తే ఏమీ చేయ లేడు. ఈ ఘోరాన్ని తను ఆపి నేరస్తుల్ని పట్టి యువ రాజుకు వప్పగిస్తే రత్నగిరిలో తన పరపతి ఇనుమడిస్తుంది. వీళ్ళిక్కడ కాపు వేసారంటే ఖచ్చితంగా ధనుంజయుల వారు వస్తూ వుండాలి.

ఈ విధంగా ఆలోచించిన భల్లాతకుడు పుణ్యం పురుషార్థం కూడ కలిసి వస్తుందన్న ఉద్దేశంతో ఆ ద్రోహులు ఆరుగుర్ని బంధించి తన ముందుకు తేసుకు రమ్మని తన మనుషులకు ఆజ్ఞాపించాడు.

ఆ రాత్రి వేళ`

వూహించని విధంగా భల్లాతకుడి మనుషులు తమను చుట్టు ముట్ట గానే ఆగంతకులు కత్తులు దూసారు. లొంగి పొమ్మని

హెచ్చరించినా లెక్క చేయ లేదు. కొద్ది సేపు పోరాడి తప్పించుకు పారి పోవాలని చూసారు. అశ్వాల మీద తరిమి తరిమి వాళ్ళని పట్టుకున్నారు. అయితే చివరి క్షణంలో వాళ్ళలో నలుగురు విషపు గుళికలు మ్రింగి ప్రాణాలు తీసుకున్నారు. మిగిలిన యిద్దరూ కూడ అదే పని చేయ బోతుంటే, అడ్డుకుని విషపు గుళికలు లాక్కుని ఆ యిద్దర్నీ పెడ రెక్కలు విరిచి బంధించి భల్లాతకుడి ముందుకు తీసుకొచ్చారు.

వాళ్ళు ఆరుగురూ పట్టు బడితే పరిస్థితి వేరేగా వుండేది. నలుగురు చావటంతో భల్లాతకుని పరిస్థితి ఇరుకున పడింది. పట్టు బడిన వాళ్ళని ఎంత హింసించినా తాము వర్తకులమని తమ కేమీ తెలిదని బొంకారు. చచ్చిన వాళ్ళతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కాబట్టి కొత్వాలుకు వీళ్ళని వప్పగించి ప్రయోజనం లేదు. ఈ నేరం మొత్తం అనవసరంగా తన నెత్తిన పడే ప్రమాదం వుంది. ఏం చేయాలి?


పక్క పల్లెను దాటి ఎగువకు పోతే అవంతికి వెళ్ళే బాట కుడి పక్కగా చీలి పోతుంది. అక్కడికి ఎగువన గల పెద్ద గ్రామంలో ఉంటాడు కొత్వాలు. అసలే వాడు చండ శాసనుడు. మహా తిక్క మనిషి అంటారు. తను చూస్తే నాలుగు శవాలతో సత్రం వద్ద చిక్కు బడ్డాడు. కొత్వాలు వస్తే ఖచ్చితంగా తనను ఉరి తీయిస్తాడు. ఈ సమస్య నుంచి బయట పడాలంటే యువ రాజు ధనుంజయుడు రావాలి. అందుకే తనను కాపాడమని వేయి దేవుళ్ళకు మొక్కుకుంటూ సత్రం బయటే ఉన్నాడు భల్లాతకుడు. అటు వంటి సమయంలో యువరాజు ధనుంజయుడు అపర్ణుడు కన్పించటం అతడికి ప్రాణం లేచి వచ్చినట్టుంది. కాని అక్కడ ఆగటం ధనుంజయుడికి ఇష్టం లేదు.

''మన దారిన మనం వెళ్ళి పోవుట మంచిదనుకొందును భద్రా. ఇచట మన కేమి పని?'' అన్నాడు.

''ప్రభూ! అతను భల్లాతకుడు. ఆ బిడారు నాయకుడు. మీతో పరిచయము లేక పోవచ్చు గాని మీరు అతనికి తెలుసు. చాలా మంచి వాడు. మనము చక్కగా భోజనము చేసి కంటి నిండా నిద్ర పోవుటకు తగిన చోటు. మీరు రండి.'' అంటూ అశ్వాన్ని మళ్ళించింది భద్రా దేవి.

''ఏమిటి బాబాయ్! రత్న గిరి నుండి అప్పుడే తిరిగి వచ్చేసినారా?'' భల్లాతకుడి ముందు అశ్వం దిగుతూ అడిగాడు అపర్ణుడు.

''వచ్చి మూడు దినములైనది అపర్ణా. మీ కొరకే ఎదురు చూచుచుంటిని'' అంటూ వడి వడిగా ధనుంజయుని ముందు కెళ్ళి చేతులు జోడించాడు.




"యువరాజుల వారికి జయము జయము. ప్రభూ! అనుకోకుండా సంకటమున పడితి. మీరు నన్ను కాపాడాలి" అంటూ అర్థించాడు.

అతడి మాటలు అర్థం గాక ధనుంజయ భద్రాదేవిలు ముఖ ముఖాలు చూసుకున్నారు.

"ఏమంటివి బాబాయ్! నీకు సంకట స్థితియా? ఏమి జరిగినది?" అనడిగింది.

"నాతో రండి చూపెదను." అన్నాడు భల్లాతకుడు.

ధనుంజయుడు కూడ అశ్వం దిగాడు.

ఇరువుర్నీ వెంట బెట్టుకుని సత్రం వెనుక బాగానికి తీసుకెళ్ళాడు భల్లాతకుడు. అక్కడ చేతులు విరిచి చెట్లకు బంధింప బడున్నారు ఇద్దరు దృఢకాయులు.

“చూడండి ప్రభూ! వీళ్ళు మీకు తెలుసునా?” అనడిగాడు వాళ్ళని చూపిస్తూ భల్లాతకుడు.

ధనుంజయుని కేమీ అర్థం కాలేదు.

వాళ్ళని ఎన్నడూ చూసిన గుర్తు లేదు.

కాని భద్రా దేవికి ఏదో సందేహం ఏర్పడింది. చెట్టు వెనక్కి వెళ్ళి వాళ్ళ చేతుల్ని పరికించింది. ఆ యిద్దరికీ కుడి చేతి మణికట్టు మీద రెక్కలు విప్పి నిల బడిన డేగ బొమ్మ పచ్చ బొట్టు వుంది. అది బాహ్లీకుడి సొంత గూఢచార వ్యవస్థకి సంకేతం అది.

“వీళ్ళతో ఇంకో నలుగురు ఉండాలి బాబాయ్. వాళ్ళు ఏమయ్యారు?” అనడిగింది.

ఈ సారి భల్లాతకుడు విస్తు పోయాడు.

“అంటే... వీళ్ళ గురించి నీకు ముందే తెలిసుండాలె. వీళ్ళు మొత్తం ఆరు మంది. వీళ్ళలో నలుగురు విషపు గుళికలు మింగి చని పోయినారు. రండు...” అంటూ అక్కడికి కొంత దూరంలో చాప కింద వరుసగా ఉంచిన నాలుగు శవాలను చూపించాడు. తర్వాత జరిగినదంతా పూస గుచ్చినట్టు వివరించాడు.

అంతటిలో భల్లాతకుడి సంకట స్థితి ఏమిటో గ్రహించి నవ్వుకుంది భద్రా దేవి. ధనుంజయుని జూచి`

“ప్రభూ! వీళ్ళు బాహ్లీకుని మనుషులు. సందేహము లేదు. వీళ్ళ మణి కట్టు మీది డేగ గుర్తే అందుకు సాక్ష్యం. మిమ్ము కడ తేర్చుటకు తన గూఢచారి విభాగము నుండి ఎంపిక చేసి పంపిన మూడు బృందాలో ఇది రెండవది. మూడవ బృందం ఎగువన ఎచటనో కాపు వేసే వుంటుంది. మనము అప్రమత్తంగా పోవలె” అంది.

అవునన్నట్టు తల పంకించాడు ధనుంజయుడు.

"భల్లాతకా! మాకు శత్రువులని తెలిగానే మా క్షేమం కోరి ఈ ద్రోహుల్ని బంధించినందుకు కృతజ్ఞుడను. ఇక నుండి నీవు మాకు ఆప్తుడివి. మేము వచ్చినాము గావున నిన్నే సంకటము బాధింపదు. ఈ సారి రత్న గిరికి వచ్చినప్పుడు నా వద్దకు వచ్చుట మరువకుము. కొత్వాలుకు కబురు పంపుము. మిగిలిన విషయము మేము చూసుకొందుము" అన్నాడు.

"చిత్తము ప్రభూ!" అన్నాడు వినయంగా భల్లాతకుడు.

అంతలో అపర్ణుడు కల్పించుకొంటూ` "బాబాయ్! రాత్రంతా చేసిన ప్రయాణ బడలికతో మిక్కిలి అలసి వుంటిమి. ప్రభువులకు నిద్రించుటకు ఏర్పాటు చేయ గలవా?" అనడిగాడు.

"అయ్యో! ఎంత మాట అపర్ణా. మీ రాక మా అదృష్టము. రండి…" అంటూ సత్రం లోకి దారి తీసాడు భల్లాతకుడు.

ఆ విధంగా సత్రం లోని ఒక గదిలో మెత్తని దిండ్లతో వేసిన పక్క మీద పక్క పక్కనే పడుకుని నిద్ర పోయారు ధనుంజయ, భద్రా దేవిలు. వారి అశ్వాలను పరామర్శించుటకు తన మనుషుల్ని నియమించాడు భల్లాతకుడు. ఒక అశ్వికుడిని కొత్వాలు కోసం గ్రామానికి పంపించాడు. యువ రాజు కోసం చక్కటి విందు భోజనం తయారు చేయటానికి తగిన ఏర్పాట్లు చేయ సాగాడు.

గాఢ నిద్రలో ధనుంజయ అపర్ణులకు ఎంత సమయము గడిచిందో తెలిదు. ఈలోపల కొత్వాలు కోసం వెళ్ళిన అశ్వికుడికి అనుకోకుండా మాళవ యువ రాజు ఇంద్ర జిత్తు చిన్న అశ్విక దళంతో సరి హద్దు ప్రాంతానికి పోతూ దారిలో ఎదురయ్యాడు. రాచరికపు బంధుత్వాలు ఆ అశ్వికునికి తెలుసు. వెంటనే `

అశ్వం దిగి ఇంద్ర జిత్తు అశ్వానికి ఎదురు వెళ్ళి స వినయంగా నమస్కరించాడు. రత్నగిరి యువరాజు ధనుంజయుడు తన మిత్రుడు అపర్ణుడితో సత్రంలో నిద్రిస్తున్న విషయం మనవి చేసాడు. అలాగే జరిగిందంతా పూస గుచ్చినట్టు వివరించాడు.

తన బావ ధనుంజయుడి రాక తెలిగానే ఇంద్ర జిత్తు మహదానందం చెందాడు. కొత్వాలును తీసుకు రమ్మని ఇద్దరు భటుల్ని వెనక్కి పంపించి మిగిలిన అశ్విక దళంతో ఆగ మేఘాల మీద సత్రంకి చేరుకున్నాడు. సాక్షాత్తూ తమ యువ రాజే సత్రంకి

వేంచేయటంతో బిడారు నాయకుడు భల్లాతకుడి ఆనందానికి మేర లేదు. గతంలో తమ యువరాజుతో ముఖ పరిచయం ఉన్నప్పటికీ గాఢ పరిచయం లేదు. ఇప్పుడీ సంఘటనతో మాళవ రాజ కుటుంబానికీ రత్నగిరి రాజ కుటుంబానికీ కూడ దగ్గరవుతున్నాడు.

ఇంద్ర జిత్తు స్వయంగా భల్లాతకుడ్ని అభినందించి తన మెడలోని రత్నాల హారంతో సత్కరించాడు. బావ ధనుంజయుడు లేచే వరకు వేచి వున్నాడు. బంధువులిద్దర్ని, మరణించిన నలుగుర్ని చూసాడు. విషయం కొంత అర్థమైంది. ఈలోపల ఆ ప్రాంతపు కొత్వాలు తన మనుషులతో హుటా హుటిన అక్కడికి చేరుకున్నాడు.

బంధితులిరువురితో బాటు`

శవాల మణి కట్టు మీద డేగ పచ్చ బొట్టును గమనించాడు ఇంద్రజిత్తు. బంధితులు నిజం చెప్పరని అర్థమైంది. వాళ్ల అశ్వాలు ఆరింటినీ పరిశీలించినపుడు అవి రత్నగిరి సైన్యానికి చెందినవని అర్థమైంది. కాబట్టి ఇంద్రజిత్తు ఒక నిర్ణయం తీసుకుంటూ సాయంత్రం లోపు బంధితులిద్దరూ నిజం చెప్తే సరి. లేదంటే రేపు సూర్యోదయం తోనే శిరచ్ఛేదన అమలు చేయమని కొత్వాలును ఆజ్ఞాపించాడు. కొత్వాలు తన మనుషులతో బంధితులతో బాటు శవాలు నాలుగింటిని కూడ వెంట తీసుకు పోయాడు.

ఇదంతా జరిగిన చాలా సేపటికి`

అనగా పొద్దు పడమట వాలుతూండగా ధనుంజయ అపర్ణులు నిద్ర లేచారు. ప్రయాణ అలసటతో బాటు నిద్ర మత్తు కూడ తీరింది. ఇక వూహించని విధంగా బావ ఇంద్రజిత్తు కూడ వచ్చి ఉండటం ధనుంజయునికి అమితానందం కలిగించింది.

ధనుంజయ అపర్ణులు స్నానాదికాలు ముగించి దుస్తులు మార్చు కొని రాగానే ఇంద్ర జిత్తుతో కలిసి విందు భోజనం చేసారు. పిమ్మట ఇరు రాజ్యాల పరిస్థితులు, కుటుంబ యోగ క్షేమం గురించి ముచ్చటించుకున్నారు. బాహ్లీకుడు తెగించి అంతర్యుద్ధాన్ని మొదలు పెడితే సర్వ సన్నద్ధంగా వున్న మాళవ సేనలు రత్నగిరి సేనలకు అండగా వస్తాయని స్వయంగా తానే సేనల్ని నడిపిస్తానంటూ మాటిచ్చాడు ఇంద్రజిత్తు. కోటకు వచ్చి రెండ్రోజుండి వెళ్ళమని అర్థించాడు గాని ధనుంజయుడు సున్నితంగా తిరస్కరించాడు.‘‘బావా! చాలా సేపటిగా అడగానుకుంటున్నాను. ఈ బాల మిత్రుడు ఎక్కడ లభించాడు నీకు?’’ అనడిగాడు అపర్ణుడిని సందేహంగా చూస్తూ ఇంద్ర జిత్తు. అతడు పురుషుడు కాడు స్త్రీయేమోనని అనుమానం పీకుతోంది. కాని ధనుంజయుడు పరిహాసంగా నవ్వేసాడు.

“బావా! వీడు చూడ్డానికి బాలుడే గాని బాహు మేధావి. నాకు మిత్రుడే కాదు. ప్రస్తుతం అంగరక్షకుడు కూడ. దివ్య నాగ మణితో తిరిగి వచ్చు వరకు నా తోనే ఉంటాడు. మహా వీరుడు కూడాను. పరీక్షింప దలిచిన ఇతనితో ద్వంద్వ యుద్ధమునకు తల పడవచ్చు.” అన్నాడు.

“ఇప్పుడు కాదులే. మీరు మరలి వచ్చిన పిదప తప్పక పరీక్షింతును” అన్నాడు ఇంద్రజిత్తు.

అంతా వదని వారిస్తున్నా ఆగకుండా పొద్దు పడమట వాలుతూండగా అందరి వద్ద వీడ్కోలు తీసుకుని తమ అశ్వాల మీద మహా పథంలో సాగి పోయారు ధనుంజయ, అపర్ణులు. వారి అశ్వాలు కను మరుగు కాగానే ఇంద్రజిత్తు తన సిబ్బందితో సరి హద్దు వైపు కదిలి పోయాడు. ఆ విధంగా అంతా ఎవరి దారిన వారు వెళ్ళి పోగానే తేలిక పడ్డ మనసుతో తన బిడారును బయలుదేర దీసాడు భల్లాతకుడు.

**********************************

సత్రం నుండి బయలు దేరిన`

ధనుంజయ, అపర్ణులకు దూరంగా వింధ్యా పర్వత పంక్తుల శిఖరాలు కన్పిస్తున్నాయి. ఆకాశం నిర్మలంగా వుండి చల్లటి గాలులు వీస్తున్నాయి. ఈ రోజు ఎండ తీవ్రత తక్కువ గానే వుంది. వింధ్య పర్వతాలను చేరాంటే నాలుగు జాము అంటే ఒక పగటి ప్రయాణ దూరం ఉంటుందనిపించింది. రెండు జాముల్లోనే ఆ దూరాన్ని అధిగమించి చీకటి పడిన తొలి జాము వేళకి చేరుకోవాలని లక్ష్యంగా అశ్వాలను శర వేగంతో పరుగులు తీయిస్తున్నారు.

మార్గంలో కొద్ది సేపటికే కుడి పక్కగా చీలి పోతున్న అవంతీ మార్గాన్ని చూసారు. మహా పథం నేరుగా ఎగువకు పోతూ క్రమంగా ఉత్తరాభి ముఖంగా తిరిగి వింధ్యా సానువుల వైపు పోతోంది. బాట సాయి అశ్వికుల శకటాలు మార్గంలో ఎదురవుతున్నాయి. చిన్న చిన్న పల్లెల్లో జన పదాలు వెనక్కు పోతున్నాయి. క్రమంగా పంట భూములు తరిగి పోయి చిట్టడవి ఆరంభమైంది. అది ఎగువకు పోయే కొద్ది దట్టమైన అటవీ ప్రాంతంగా మారి పోతోంది. వింధ్య పర్వతాలను చేరుకుంటే అక్కడి నుండి ఆరంభమయ్యేది వింధ్యాటవి. ఆ పర్వత శ్రేణిని దాటితే అవతల హైహయ రాజ్య భూభాగం లోకి ప్రవేశిస్తారు.

చిట్టడవిలో బాటల మీద పరిసరాల వెంట కుందేళ్ళు, అడవి కుక్కలు, నక్కలు, పందుల సంచారం కన్పిస్తోంది. వాయు వేగంతో

దూసుకొస్తున్న అశ్వాల గిట్టల శబ్దానికి చెదిరి బాట వదిలి అవి దూరంగా పరుగులు తీస్తుంటే భద్రా దేవి హుషారుగా అరుస్తోంది. ఆకాశంలో కొంగల బారులు పశ్చిమంగా ఎగిరి పోతున్నాయి. పక్షుల గూళ్ళకు చేరుకొంటున్నాయి.

క్రమంగా సూర్యుడు అస్తమించాడు.

అడవంతా పుచ్చ పువ్వులా వెన్నెల పరుచుకుంది. చీకటి పడిన కొద్ది సేపటికే చిట్టడివి కూడ దాటి దట్టమైన అడవిలో ప్రవేశించారు. ఇప్పుడు వింధ్య పర్వతాలు స్పష్టం గాను దగ్గర గాను కన్పిస్తున్నాయి.

రాత్రి మొదటి జాము ముగిసే వేళకి మహా పథం రెండు ఎత్తయిన పర్వతాల నడుమ ముందుకు పోతూ వారిని వింధ్య పర్వతాల్లోకి తీసుకు పోయింది.

రాత్రివేళగాబట్టి ఎగువ నుంచి ప్రయాణీకులు ఎవరూ ఎదురు కావటం లేదు. తాము కూడ ఎక్కడో చోట రాత్రికి మజిలీ చేయాలి. అనువైన చోటు కోసం గాలిస్తూ అలా ముందుకు సాగి పోతూనే వున్నారు.

వింధ్య సానువులు దాటాలంటే`

కనీసం అయిదారు యోజనాల దూరం ప్రయాణించాలి. నిన్న రాత్రి నిద్ర లేకుండా ప్రయాణించటం చేత ఈ రాత్రికి అలా ప్రయాణం చేయుట కష్టం. రాత్రికి అనువైన చోట తాము మజిలీ చేయక తప్పదు. అలా కొంత దూరం వెళ్లగానే ఉన్నట్టుండి తన అశ్వాన్ని నిలువరించాడు ధనుంజయుడు.

‘‘ప్రభూ! ఏమైనది?’’ అంటూ తన అశ్వాన్ని మళ్లించింది భద్రా దేవి.

చేయెత్తి కుడి పక్క చిన్న గుట్టల మీదకు చూపించాడు ధనుంజయుడు.

‘‘అటు చూడుము భద్రా! ఆ గుట్ట పైన ఏదో శిధిల మండపమున్నది’’ అన్నాడు.

అటు చూసిన భద్రా దేవికి ఎత్తుగా ఉన్న మండపము అరుగు వెన్నెట్లో గోచరించింది. స్థంభాలు కూలి పోయి ఒకే ఒక స్థంభము మాత్రము పొడవుగా నిలబడి కన్పిస్తోంది.

"సందేహమేల ప్రభూ! పోయి చూచెదము గాక" అంటూ తన మచ్చల గుర్రాన్ని గుట్టల పైకి పరుగెత్తించింది. ఏటవాలుగా వున్న గుట్టల పైకి అశ్వాలు రెండూ చేరు కొనే సరికి అంత వరకూ అక్కడ తిష్ట వేసి చెలగాటమాడుతున్న అడవి పందులు గుట్ట దిగి పారి పోయాయి.

ఇద్దరూ అశ్వాలు దిగి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఒకప్పుడు ఏకాలంలో ఎవరు నిర్మించారో గాని బాటసారుల వసతి కోసం చక్కటి విశాలమైన రాతి మండపాన్నే నిర్మించారు. కాని కాల క్రమంలో స్థంబాలు, పై కప్పు శిథిలమై కొంత పక్కకు పడి పోగా, ఒకే ఒక స్థంభం మాత్రం నాటి వైభవానికి గుర్తుగా ఎత్తుగా నిల బడుంది. మండపానికి తూర్పు వైపున కాస్త దూరంలో శాఖలు విస్తరించిన పెద్ద వట వృక్షం వుంది.

సమీప కాలంలో ఆ మండపం మీద ఎవరూ మజిలీ చేసిన గుర్తులు లేవు. మండపం ఎత్తుగా సువిశాలంగా ఇప్పటికీ చెక్కు చెదరకుండా వుంది దూళి ధూసరితో.

"ఏం చేద్దాం?" అడిగాడు ధనుంజయుడు.

"ఇంత కన్నా అనువైన చోటు మనకు దొరుకుతుందనుకోను ప్రభూ!" అంది భద్రా దేవి.

అశ్వాలను మర్రి వృక్షం ఊడలకు బంధించారు. మండపం అరుగును తగినంత మేర శుభ్రం చేసుకుని కంబళి పరిచి కూచుని వెంట తెచ్చుకున్న రొట్టెలు తిని నీరు త్రాగారు. అరు బయట చంద్రుడి వెన్నెల చల్లటి కొండగాలి అన్నిటికీ మించి తమకు చక్కని ఏకాంత ప్రదేశం.

భద్రా దేవిని ఒడి లోకి లాక్కున్నాడు.

ప్రేమగా బుగ్గలు నిమిరి ముద్దాడాడు. "ఇప్పుడైనా నీ వివరములు చెప్ప వలె. నీ గురించి తెలియ గోరుచున్నాను." అనడిగాడు.

సున్నితంగా విడిపించుకుంది భద్రా దేవి.

‘‘భద్రా! ఏమైనది?’’ లాలనగా అడిగాడు.

‘‘ఇక్కడ ఎవరో వున్నారు ప్రభూ!’’ అంది భద్రా దేవి.

‘‘లేదే... ఎవరును లేరు.’’

‘‘ఉన్నారు. మనను గ్రుచ్చి చూస్తున్నట్టున్నాది.’’

‘‘ఎవరు?’’ అంటూ ఫక్కున నవ్వాడు ధనుంజయుడు.

‘‘ఓ అర్థమైనది ప్రియా. చంద్రుడు చూచుచున్నాడనియే గదా నీ సంశయము. ప్రేమికులకు ఆప్తుడే గదా జాబిలి.’’

‘‘కాదు ప్రభూ! నెల రాజు కాదు.’’

ఆకాశ మార్గాన పెద్ద మెరుపు.ఆ వెనకే దిక్కులు పిక్కటిల్ల జేస్తూ ఉరుముల శబ్దం. దాంతో బాటే చిట పట చినుకులు రాలటం ఆరంభమైంది. పరమ భాగవతోత్తముడైన ఆ పురుషోత్తముడు ఆకాశం వంక చూస్తూ` ‘‘ఆగవయ్యా వరుణ దేవా. ఏమా తొందర? ఇచట వ్యవహారమింకను చక్క బడ లేదు. మేము వెడలు వరకు ఒక్క వాన చినుకు రాలినా వూరుకోను సుమా’’ అంటూ మురళిని ఆకాశం వంక చూపుతూ హెచ్చరించాడు.

ఆశ్చర్యం... అద్భుతం.

ఆయన హెచ్చరించిన మరు క్షణం రాలుతున్న చినుకులు కూడ ఆగి పోయాయి. కుంభ వృష్టిగా పడుతుందనుకున్న వాన ఆగి పోయింది. కాని గగన తలాన నల్ల మబ్బులు కారాడుతూనే వున్నాయి.

ఇప్పుడు అతివలిరువురి వంక చూసి

మంద హాసం చేసాడా మురళీ ధరుడు.

“ఏమన్నావు తల్లీ... నేను ఎవరని గదూ అడిగినావు. అదేమిటో గాని లోకమున అందరూ నాకు తెలియు... కాని నేను కొందరికే తెలియు... విచిత్రము గదూ!

పసి ప్రాయమున నోరు తెరిచిన గాని నా బొజ్జలో ఏమున్నదో తెలియ లేదట. రోలును లాగి చెట్లను కూల్చినపుడు గాని నా బలమెంతో ఎరుంగరైతిరి. నను పశుల కాపరి యని కొందరు, అల్లరి వాడను తుంటరి వాడనని ఇచ్ఛకాలాడు వారు కొందరు, వెన్న దొంగనని నింద వేయు వారు కొందరు, కపటి యని, మోస గాడనని ఈసడించు వారు కొందరు` ఏమైతే నేమి గాని తల్లీ నను మాత్రం మాధవ స్వామి అంటారు. ఆ రాధా రమణుడు వేణు మాధవుని భక్తుడను” అన్నాడు.

మాధవ స్వామి మాటలు భద్రా దేవి, ఉలూచీశ్వరిలకు అంతు చిక్క లేదు గాని అక్కడే వున్న భూతం ఘృతాచికి అర్థమై పోయింది. నోరు కొట్టుకుంది, నెత్తి కొట్టుకుంది.

“అయ్యో పిచ్చి తల్లులూ ! ఈయన మాటలు నమ్మకండమ్మా. వేషము జూచి మోస పోవలదు. ఈ దివ్య పురుషుడు ఎవరనుకొనుచున్నారు? సాక్షాత్తూ ఆ పురుషోత్తముడేనమ్మా. లీలా మానుష రూపుడు, జగన్నాటక సూత్రధారి, ఆ వైకుంఠ వాసుడు, ఆ వేణు గోపాలుడే మిమ్ము కరుణించి వచ్చినాడు... మోస పోవలదు సుమా.” అంటూ ఇంత లావున నోరు తెరచి అతివలిరువురినీ హెచ్చరించానుకుంది. కాని ఆ మోహనాకారుని చూస్తున్న దివ్యానందంలో కన్నీరు ఉప్పొంగి గొంతు పెగలక ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దాని అవస్థ గ్రహించి మంద హాసం చేసాడు మాధవ స్వామి.

“ఘృతాచీ! త్వర లోనే నీ పాపము పరిపక్వత చెందనున్నది. నీ రుధిర దాహము తీరనుంది. పిమ్మట ఈ భూత జన్మ నుండి నీకు విముక్తి లభించి మరు జన్మమున కాశ్మీర రాజ తనయగా జన్మించగ యోగము. అంత దనుక నీవు చూచినది చూచినటు, విన్నది వినినటు మరచి పోవలె సుమా” అంటూ నర్మ గర్భంగా హెచ్చరించాడు.

“ధన్యు రాలను తండ్రీ” అంటూ భక్తితో నమస్కరించింది ఘృతాచి.

భద్రా దేవి, ఉలూచీశ్వరిలు`

చేష్టలు దక్కి చూస్తున్నారు.

వారి కేమీ అర్థం గావటం లేదు.

“అమ్మా భద్రా దేవి” పిలిచాడు మాధవ స్వామి.

ఉలికి పడి చూసింది భద్రా దేవి.

తన పేరు ఈ స్వామికి ఎలా తెలుసు?

ఆశ్చర్యం నుండి ఆమె తేరు కొనక ముందే మాధవ స్వామి దర హాసంతో పలికాడు` “నిను అపర్ణుడని పిలువనా... ఇప్పుడు పురుష వేషమున లేవు గాబట్టి భద్రా దేవి యనే పిలుతును” అన్నాడు.

భద్రా దేవి సిగ్గు పడింది.

ఉలూచీశ్వరి ఆసక్తిగా వింటోంది.

“మరీ ఆశ్చర్యయ పోవలదు సుమా. నీ గురించియే కాదు నీ చెల్లి యగు ఈ ఉలూచీశ్వరి గురించి తెలియు. నాగ లోక యువ రాణి, నాగ రాజు దంపతుల గారాల పట్టి, నాగ కుమారి. మీ వలపుల చెలి కాడు రత్నగిరి రాకుమారుడు ధనుంజయుడు. సరి గానే చెప్పితిని గదా? ఇది జ్యోతిషము కాదమ్మా, వాస్తవము. ధనుంజయుడు ఎవరో కాదు, నా నేస్తము, ప్రియ సఖుడు, ఆప్తుడు నాకు ఎంతో కావలసిన వాడు. నాకు తెలుసు అతడి గురించి తనకు తోచిందే గాని ఒకరు చెబితే వినుకోడు. మహా మొండి వాడు. లేకున్న మీరంతగా చెప్పినా వినకుండా శివయ్య దర్శనానికి వచ్చునా? వచ్చి అదృశ్యమై మిమ్మల్నిలా కడ గండ్లపాలు జేసే వాడా. వినడే....” అంటూ భారంగా నిట్టూర్చాడు.

‘‘కాని స్వామి....’’ అంటూ ఉలూచీశ్వరి ఏదో అడగ బోతుంటే చేయెత్తి వారించాడు మాధవ స్వామి.

‘‘నాకు తెలుసు నాగ రాజ పుత్రీ. నీకంతయు తెలియు. ధనుంజయుని అదృశ్యమున గొని పోయి పాతాళమున పడ వేసిన వాడు మీ నాగ లోక ప్రముఖుడు వక్ర దంతుడు. అవునా?’’ అడిగాడు.

తల వూపింది ఉలూచీశ్వరి.

‘‘మీకు తెలీని విషయం ఏమన, ధనుంజయుని గూర్చి మీకన్నను నాకే బాగుగా తెలియు. అంత దేనికి? గతంలో రాయ గిరి వేణు గోపాల స్వామి ఆలయాన కలిసినాము. చిలక్కి చెప్పినటుల జెపితి. నాయనా ఇది పద్ధతి కాదయ్యా. మీ ఇలవేలుపూ నీ తండ్రి గారి ఆరాధ్య దైవము ముందుగా నీవు సహ్యాద్రికి గదా పోవలె. ఆ భీమ శంకరుని ఆశీస్సులు పొంది బయలు దేరుము. శుభములొనగూరును అంటి. వింటేనా! ఆ శివయ్యకి అంత శక్తి వుంటే నా తండ్రి పుట్ట వ్రణము బారిన పడు వారేనా! ససేమిరా పోను పొమ్మన్నాడు. ఏమైనది. అలిగిన ఆ భీమ శంకరుడు గాలి వాన సృష్టించినాడు. పెను గాలి వానలో దారి తప్పి అడవులబడి దిక్కు తెలియక అష్ట కష్టములు అనుభవించినాడు. దారిలో చిరంజీవి యగు అశ్వద్ధామను కలిసి కొన్ని విషయము తెలుసుకున్నాడు. పిమ్మట ఢాకినీ వనం చేరాడు. అక్కడే గదూ ఈ నాగ పుత్రిని కాపాడి మనసు హరించినాడు. అంతేనా! మనసు మార్చుకుని బుద్ధిగా సహ్యాద్రి చేరి భీమ శంకరుని సేవించినాడు. ఆ శివయ్య కరుణతో ఈ భద్రా దేవి దర్శనమైనది. అపర్ణుడే భద్రా దేవియను సత్యమును తెలిసినది. అచ్చోటనే ద్రోహుల నుండి పెను ప్రమాదమును తప్పినది. చూచితిరా! దైవ కృపా కటాక్షం ఉన్నచో కీడులో కూడ మేలు ఎటుల ఒన గూడునో’’ అంటూ కాసేపు చెప్పటం ఆపాడు మాధవ స్వామి.

భద్రా దేవి, ఉలూచీశ్వరిలకు ఆయన మాటలు వింటూంటే గతం గుర్తుకొచ్చి దుఖ్ఖం పొంగుకొస్తోంది. తిరిగి తన సందేశం వినిపించాడు మాధవ స్వామి.

‘‘చూడండి లలనా మణులారా. ఆలయాన మీరు మీ ప్రియుని గానక విలపించినారు గదా. సమాధానము కావలెనని వేడు కొంటిరి గదా. ఇదో సమాధానము. మీరు అనాధలు గాదు, తల దాచుకొన గూడు లేని అభాగ్యులూ గాదు. సంపూర్ణ దైవానుగ్రహం కలిగిన అదృష్టవంతులు. మీ రక్షణ కొరకు ఆ కైలాస నాధుడు నందీశ్వరుని, భైరవుని పంపించినాడు. ఇదో... తన శివ గణాలనూ, మధ్యవర్తిగా నన్నూ పంపించినాడు. ఇంకేమి కావలె? రండమ్మా! ఆ స్వామి సన్నిధికి పోవుదము. మీకే కొరతా రాబోదు.’’ అంటూ వచ్చిన పని వివరించాడు.

అంతా విని బాధగా చూస్తూ`

కన్నీరు తుడుచుకుంది భద్రా దేవి.

‘‘క్షమించండి స్వామీ. మేము రాలేము’’ అంది.

‘‘ఏవమ్మా! ఈ రేయి గాలి వానలో ఈ శాలి వృక్షము చెంతనే చలికి గడ గడ వణకుచూ కష్ట పడుదురా. ఏమైనది?’’ మంద హాసంతో అడిగాడు స్వామి.

‘‘ఎలా రాగలము స్వామి. అచట పాతాళ లోకమున మా మనోవల్లభుడు ఎన్ని బాధలు కష్టములు పడుచున్నారో గదా. తనచట ఇడుముల గ్రుమ్మరుచుండ మేమెటుల ఇచట సుఖమున ఉండ గలము స్వామి. ఆయనను కాపాడుట వదలి మా కొరకు అక్కర చూపుట ఇది యేమి ధర్మము? ఆ గరళ కంఠునికి తెలియని ధర్మముండునా? మా ఎడబాటే ఆ స్వామికి ఆనందమా?’’ అంది కన్నీళ్ళతో భద్రా దేవి.

‘‘అవును స్వామీ. మా సఖుడు మరలి వచ్చువరకు మేమిచటనే ఉందుము.’’ అంటూ భద్రా దేవిని సమర్థించింది ఉలూచీశ్వరి.

‘‘హూహు! ఇది సరి యగు నిర్ణయము గాదు. మీరు పొరబడుచున్నారు. చూడు తల్లీ భద్రా దేవి, మహా మహులే శివ తత్త్వాన్ని అర్థము జేసు కొన జాలరు. బాలికలు మీవల్ల అగునా? కర్మ ఫలం అనుభవింపక తప్పదు. కర్మ చేయకనూ తప్పదు. సుత్తి దెబ్బలు తిన కుండ బంగారము అందమగు ఆభరణము అగునా? జీవితము గూడ అంతియే. కారణ జన్ములు ఎంత కష్ట పడిన అంతకంత కీర్తి ప్రతిష్టలను సుఖమును బడయ గలరు. చెప్పితిని గదా! కీడు లోనూ మేలు ఒన గూర్చునదే దైవ కృప. ఇచటను ధనుంజయునకు ఒక ప్రయోజనము గలదు. అతను మరలి రాగానే అది మీకు అర్థము కాగలదు.

ఒక ప్రక్క నాగ దండు ఉలూచీశ్వరి కోసము ప్రయత్నించు చుండ నీ విటుల భీష్మించి ఇచటయే ఉండుట క్షేమము గాదు. నా మాట వినండి. పదండి’’ అంటూ అనునయంగా నచ్చ చెప్పాడు.

తన కోసం గాకున్నా ఉలూచీశ్వరి క్షేమం కోరి అయినా ఈ దైవ ఆహ్వానాన్ని అంగీకరింపక తప్ప లేదు భద్రా దేవికి. ముందుగా

వృషభము కొండ గుట్ట దిశగా అడుగు లేసింది. ఆ వెనకే తమ అశ్వాలను నడిపించుకుంటూ భద్రా దేవి, ఉలూచీశ్వరిలు బయలు దేరారు. వారికి ముందు దివిటీలతో శివ గణాలు నడిచాయి. వెనక రక్షణగా శునక రూపంలోని భైరవుడు అనుసరించాడు. చివరిగా భూతం ఘృతాచి గాలిలో తేలుతూ బయలు దేరింది.

అతివలిద్దరి ముందు నడుస్తున్న మాధవ స్వామి తిరిగి మురళి అందుకుని కళ్యాణి రాగం అందుకున్నాడు.

చెంగు చెంగున దూకుతూ కాలి బాట మీద ముందుగా గుట్ట పైకి సాగి పోతోంది వృషభ రాజము. దాన్ని అనుసరించి మౌనంగా గుట్ట ఎక్కుతున్నారంతా. శివ గణాలు కూడ మురళీ రవం వింటూ మౌనంగా నడుస్తున్నారు. వాద్య ఘోష చేయటం లేదు. మురళి రవానికి ప్రకృతి పులకిస్తోంది.

''స్వామీ! తెలిక అడుగుచుంటి క్షమింపుడు. కళ్యాణి రాగం మీకు అంత యిష్టమా?'' దారిలో అడిగింది ఉలూచీశ్వరి.

''నాకు అత్యంత ప్రీతి కరమగునవి మోహన, కళ్యాణి రాగము. ఆ కైలాస నాధునికి ప్రీతి కరమగునవి శంకరాభరణము, భైరవి రాగము.'' అన్నాడు మాధవ స్వామి.

''అంత అద్భుతముగా వేణు గానమాలపిస్తున్నారు. మీ గురు దేవులు ఎవరు స్వామి?'' ఈసారి భద్రా దేవి అడిగింది.

''గురు దేవుడు... హహహ'' అంటూ ఫడాలున నవ్వాడు మాధవ స్వామి.

''తల్లీ... నా చదువుకు గురు దేవుడున్నాడు గాని వేణువుకి ఏ గురువులునూ లేడమ్మా. సాధారణ పశుల కాపరిని, గోపాలుడ్ని. ఏమియు తోచక మురళి వాయిస్తుంటే తానుగా అభ్యాసమై పోయినది'' అంటూ మరో ప్రశ్నకు అవకాశమివ్వకుండా వెంటనే మోహన రాగం అందుకున్నాడు.

సమ్మోహ పరిచే మోహన రాగ మాధుర్యానికి ప్రకృతే పులకించ సాగింది. చీకట్ల మాటున తెలీటం లేదు గాని చుట్టూ పొదల వెంట లతలు తీగలు సాగి పుష్పించి సౌరభాన్ని వెద జల్లుతున్నాయి. నడుస్తున్న మాధవ స్వామి పాద పద్మాల కింద పచ్చిక పరవశించి ఒత్తుగా పెరిగి పోతోంది. పొదల వెంట కుందేళ్ళు, ఉడుతలు మొదలైన చిరు ప్రాణులు, కొన్ని పక్షి జాతులు నిర్భయంగా తమ

తావులు వదిలి బయటికొచ్చి పరవశంతో చిందులేస్తున్నాయి. రస మయ వేణు గానంలో మోహన రాగ పరవశంలో కొండ గుట్ట పైకి ఎలా చేరుకున్నారో వారికి తెలియ లేదు. అంతా ప్రాకార గోపురం దాటి ముందుగా పదహారు స్తంభాల రాతి మండపాన్ని చేరుకున్నారు.

అశ్వాలను అచటనే వదిలి భద్రా దేవి, ఉలూచీశ్వరిలిరువురు ముందుగా మూసి వున్న ఆలయ ద్వారం ముందు కెళ్ళి సాష్టాంగ పడి ఆ దేవ దేవుడు సదా శివుని మనసారా ప్రార్థించారు. తిరిగి లేచే సరికి ఇప్పుడక్కడ వృషభము లేదు, శునకము లేదు, శివ చరణులు లేరు. మండపము అరుగు మీద కూచుని వేణువాలపిస్తున్నాడు మాధవ స్వామి.

మండపాన్ని చుట్టి అయిదు వరుసలతో కూడిన మెట్లున్నాయి. ఆ మండప నిర్మాణమే చుట్టూ బయటి పక్క ఎనిమిది స్థంభాలు, లోన దగ్గర దగ్గరగా ఎనిమిది స్థంభాలు కలిగి పైన దృఢమైన రాతి కప్పుతో కూడిన అద్భుత నిర్మాణము.

ఆ మండపం నైరుతిలో చివరి రెండు స్థంభాలకు అశ్వాలు బంధించ బడి పచ్చిక వేయ బడుంది. వాటి కోసం పక్కనే పెద్ద చెక్క తొట్టి నిండుగా నీరు ఉంచబడింది. ఈ చివర రెండు స్థంభాలకు రెండు దివిటీలు కట్టబడి మండప ప్రాంతం కాంతులినుతోంది. భూతం ఘృతాచి తమ తోలు సంచిలోంచి తడిసిన దుస్తులు తీసి బయట వరుస స్థంభాలకు చుట్టూ ఆర కడులోంది. ఎప్పుడో ఉదయం పుణ్య స్నానం చేసి పిండిన దుస్తులవి. ధనుంజయుని అదృశ్యంతో వాటి గురించి పట్టించుకో లేదు.

ఇక మధ్యలో ఎనిమిది స్థంభాల నడుమ ప్రదేశంలో చక్కగా నిద్ర పోవటానికి అనువుగా నేల మీద పట్టు బాలీసులతో కూడిన పరుపు వేయబడి వుంది. ఇవతలగా చిన్న బల్ల మీద మంచి నీటితో కూడిన బిందె, రెండు లోటాలు ఉంచబడ్డాయి. నేల మీద రెండు పీటలు ఉంచి వాటి మీద ఆహార పదార్థాలతో కూడిన పళ్ళెరము చక్కగా మూత ఉంచ బడున్నాయి. ఇంతలోనే ఇన్ని ఏర్పాట్లు ఎలా జరిగాయో అర్థం గాక యువతులిద్దరూ అయోమయంగా చూస్తూ మెట్లెక్కి పైకి వచ్చారు.

''రండమ్మా! మీకొరకే చూస్తున్నాను'' అంటూ మురళి వాయించటం ఆపి లేచాడు మాధవ స్వామి.

''మీ సఖుడు ధనుంజయుడు మరలి వచ్చు దనుక మీకిచట ఏ కొరత యును రాదు తల్లి. కాని ఇప్పుడు నేను నుడువు మాటలు జాగ్రత్తగా విని గురుతుంచుకోవలె. రాత్రి వేళ మండపమును చుట్టి శివ చరణులు అదృశ్య రూపమున మీకు కావలి యుందురు. చీమను కూడ మండపము లోనికి చేర నీయరు. కావున శత్రు భయము లేక మీరు ఇచట నిశ్చింతగా ఉండ వచ్చును. ఇక పగటి వేళ` సూర్యోదయము పిమ్మట మీరు ఎట తిరిగినను సూర్యాస్తమయమునకు ముందే మండపమునకు వచ్చి చేర వలె. సూర్యాస్తమయము తర్వాత తిరిగి సూర్యుడుదయించు లోన రాత్రి వేళ పొరబాటున కూడ మీరు ఈ మండపము వదలి

బయటకు పోవలదు. ఏలయన శివ రచరణులు కావలి యున్నను మిమ్ము ఆపరు. నాగ లోకము నుండి వచ్చిన నాగ రాజు భటు మిమ్ము అపహరించు అవకాశము కలదు. బహు జాగురూకులై హెచ్చరిక నుండ వలె. అర్థమైనది గదా'' అంటూ వివరించి చెప్పాడు.




ఎంత గొప్ప విద్యా వేత్త అయినా రాజాదరణ వుంటేనే రాణించగలడు. కాబట్టి తగు సమయం వచ్చినదని భార్య సలహా ననుసరించి బయలు దేరాడు.

అలా మండుటెండలో అడవి దారిన నడిచి పోతున్నాడు. సాయం కాలానికి గాని హస్తినకు చేర లేడు. ఇంతలో`

తన వెనక ఎవరో నడిచి వస్తున్న అలికిడయినది. తల త్రిప్పి చూసాడు. వస్తున్నతలని రూపు రేఖలు చూసి ఆశ్చర్య పడుతూ కొన్ని క్షణాలు అక్కడే ఆగి పోయాడు.

తనే ఎనిమిదడుగుల పొడగరి కాగా`

అతడు తనను మించి పదడుగుల పొడవున్నాడు. కృష్ణ వర్ణంలో సన్నగా రివటలా వున్నాడు. తన లాగే నడి వయసు వుంటుంది. బోడి గుండు వెనుక పొడవుగా పిలక గాలికి రెప రెప లాడుతోంది. ఎగుడు దిగుడు కను బొమలు కాస్త ఎత్తు పళ్ళు, ఛాతీకి అడ్డంగా జంధ్యం పోగు.

ఎరుపు పట్టు పంచె కట్టి భుజాన ఉత్తరీయం వేసుకున్నాడు. వేరే ఏ ఆచ్ఛాదనా లేదు. నుదుట, భుజాల మీద ఛాతీ మీద విభూది రేఖలున్నాయి. చేతి సంచి ఒకటి పుచ్చుకుని పాదుకలు టక టక లాడించు కొంటూ వేగంగా నడిచి వస్తున్నాడు.

అతడు ఎవరనేది అగ్ని భట్టారకుడికి అర్థం కాలేదు. కాని ఎవరో బ్రాహ్మణోత్తముడని వూహించుకున్నాడు. అతడు చాలా వేగంగా నడుస్తున్నాడు. చూస్తూండ గానే తనకు సమీపించేసాడు. దాటి పోబోతూ ఎందుకో అనుమానం వచ్చి అగ్ని భట్టారకుని వంక

చూసాడతడు.

“స్వామీ! ఇంత ఎండన బడి పోవు చుంటిరి. ఎవరు మీరు? ఎచటకు పోవు చుంటిరి?” అనడిగాడు.

“మీరును ఎండన బడే పోవుచుంటిరి గదా, ఎచటికి?” అంటూ ఎదురు ప్రశ్నించాడు అగ్ని భట్టారకుడు.

“నా పయనము హస్తినకు. పరీక్షిత్తు మహారాజును కాపాడవలె” అన్నాడతను.

“నేనును ఆ పని మీదే పోవుచుంటి” అన్నాడు అగ్ని భట్టారకుడు.

“బాగున్నది. నీవు మంత్ర వేత్తవా?”

“అవును మహాశయా.”

“తక్షకుని నుండి ప్రభువును కాపాడ గలవా?”

“తప్పక కాపాడగను.”

“నిజముగా కాపాడ గలవా?”

“నిక్కముగా.”

“ఓహో! నీ శక్తిని పరీక్షింప వలసినదే.”

“ఎందుకు మీకీ సందేహము. మీరును మంత్ర వేత్త అయి వుందురు, అందుకే ప్రభువును కాపాడుటకు బయలు దేరితిరి.”

“కాదు.” అంటూ వికటంగా నవ్వాడు ఆ వ్యక్తి.

“కాదా…!”

“అవునయ్యా! నేను బయలు దేరినది ప్రాణము కాపాడుటకు గాదు. పరీక్షిత్తు ప్రాణము తీయుటకు. నేనెవరో తెలుసా? హాలాహలముతో సమమగు అతి భయంకరమైన విషము గ్రక్కు సర్ప శ్రేష్ఠుడను, తక్షకుడను.”

“తక్షకుడవా…!” నివ్వెర పోయాడు అగ్ని బట్టారకుడు.

“అవును. నేనే తక్షకుడను. నా శక్తి నీకు ప్రదర్శించి చూపెద.” అంటూ తన సర్ప రూపాన్ని ధరించాడు తక్షకుడు.

సన్నగా పది బారల పొడవున చిక్కటి కాటుక రంగులో ఎండకు నిగ నిగా మెరిసి పోతోంది కృష్ణ సర్పం. సర్పం సన్నగా వున్నప్పటికీ పడగ చేటంత వుంది. అటు యిటు చూసి చరచరా బాట పక్కకు వెళ్ళాడు తక్షకుడు.

పెద్ద మోదుగ వృక్షం ఒకటి అక్కడ ఏపుగా పెరిగి వుంది. భీకరంగా బుసలు కొడుతూ వెళ్ళి ఆ చెట్టు మాను మీద కాటేసి విషం గ్రక్కాడు తక్షకుడు. అంతే`

పిడుగు పాటుకు గురైనట్టుగా జవ జవ లాడిందా మోదుగ వృక్షం. చూస్తూండగానే భగ భగ మంటలు వ్యాపించి కొద్ది సేపట్లోనే

పచ్చని చెట్టు కాస్తా భగ్గున కాలి బూడిదయినది. తిరిగి బ్రాహ్మణ రూపు ధరించి అగ్ని భట్టారకుడి ముందు నిలబడి తన ఎత్తు పళ్ళతో వికారంగా నవ్వాడు తక్షకుడు.

‘‘జూచితివి గదా నా విష ప్రభావము. ఇక చూపించు ని మంత్ర ప్రభావము. ఏదీ… కాలి బూడిదైన ఆ వృక్షమును తిరిగి సజీవముగా నిలుప గలవా?’’ అనడిగాడు.

‘‘తక్షకా…! ఓసారి వెను తిరిగి చూడుము’’ అన్నాడు నవ్వుతూ అగ్ని భట్టారకుడు.

చూసిన తక్షకుడు నివ్వెర పోయాడు.

తన కళ్ళను నమ్మ లేక పోయాడు.

కట్టెదుట ఎప్పటిలా సాక్షాత్కరించి వుంది మోదుగ వృక్షం. ఆకులు కూడ కాలిన గుర్తు లేదు. ఇంత వరకు తన విషానికి తిరుగు లేదని గర్వించే వాడు, అలాంటిది కాలి బూడిదైన పచ్చని చెట్టును యధా తథంగా నిలపటం సాధ్యమేనా? తను వెను తిరిగే లోపలే తన మంత్ర ప్రయోగంతో వృక్షాన్ని సజీవంగా యధా తథంగా నిలిపిన ఇతడి మంత్ర శక్తిని ఎంత పొగిడినా తక్కువే గదా. ఇలాంటి వాడు హస్తినకు వస్తే తను పరీక్షిత్తును వేటు వేయ గలడా? వేసి ప్రాణం తీయ గలడా? ఇతను తప్పక పరీక్షిత్తు మహా రాజును రక్షింప గల సమర్ధుడు. ఇతన్ని ఏదో విధంగా వెనక్కి పంపించకుంటే తన లక్ష్యం నెర వేరదు. ముని బాలకుని శాపాన్ని నిర్విఘ్నంగా నెర వేర్చ లేడు.

ఈ విధముగా యోచించిన తక్షకుడు అగ్ని భట్టారకుడి ముందు సాష్టాంగ పడి నమస్కరించి లేచాడు.

‘‘ఆహా… ఏమి నా అదృష్టము. తమ దర్శన భాగ్యముతో నా జన్మ తరించినది గదా. ఏమి మీ మంత్ర మహిమ! మీ విద్వత్తును గుర్తించ నేరని మీ ప్రభువు పరీక్షిత్తు మిక్కిలి దురదృష్టవంతుడు గదా. పేదరికమున యిట మండు టెండన కాలి నడకన పోవు దుస్థితి ఆయ్యెను గదా తమకు. భూ సరోత్తమా! పోనిండు, పరీక్షిత్తు గుర్తించ కున్న ఏమాయె. ఈ తక్షకుడు మీ శక్తిని గుర్తించినాడు.’’ అంటూ మోయ గలిగినంత రెండు గంపెడు సంచుల నిండుగా వెల కట్ట లేని మణి మాణిక్యాది నవ రత్నాలు, బంగారు నాణెములను అతడి ముందుంచాడు.

‘‘ఇవి నేను మీకిస్తున్న కానుక. విప్ర వర్యా! మీ దారిద్ర్యము తొలగి పోవుటకు ఈ సంపద చాలదా? మిము గుర్తించని పరీక్షిత్తును మీరు కాపాడనేల? యోచింపుము. ఈ సంపద తీసుకుని గృహము చేరుకొని నిశ్చింతగా వుండండి. నేను వెళ్ళి నా కార్యమును నెర వేర్చుకొని పోయెద… ఏమందురు? నా విన్నపము మన్నించి గృహమున కేగుట మంచిది. శ్రమదమాదుల కోర్చి హస్తిన పోనే? పరీక్షిత్తు ఇంత కన్నా అధిక సంపద నిచ్చునా?’’ అంటూ తెలివిగా వేడుకున్నాడు.

అంతటి అగ్నిభట్టారకుడు కూడ తక్షకుని ప్రలోభానికి లొంగి పోయి హాయిగా ఆ రెండు సంచులు తీసుకుని కొంప చేరుటే ఉచితమని బావించాడు. మారు మాటాడక కను చెదిరిన మణులతో కూడిన సంచుల్ని అందుకుని గృహోన్ముఖుడయ్యాడు. తక్షకుడు సంతోషంగా ముందుకు సాగి పోయాడు.

ఆ రోజు సాయం కాలానికే`

హస్తినకు చేరుకున్నాడు తక్షకుడు.

అది సూర్యుడస్తమించు వేళ.

బ్రాహ్మణ వేష ధారి యగు తక్షకుడు నిరాటంకముగా భద్రాతా ఏర్పాట్లను అగ్ని వలయాల్ని దాటు కొని పరీక్షిత్తు కొలువై వున్న ఒంటి స్థంభం మేడలో ప్రవేశించాడు. లోన విశాలమగు సభా మందిరంలో సింహాసనాన్నధిష్టించి వున్నాడు పరీక్షిత్తు మహారాజు. ఎటు చూసినా బ్రాహ్మణులే కన్పిస్తున్నారు.

ప్రభువు పరీక్షిత్తు క్షేమం కోరి ఋత్త్విక్కులు అక్కడ గొప్ప యాగం నిర్వహిస్తున్నారు. కొందరు తమ రేడును తక్షకుడి నుండి కాపాడమని ప్రత్యేకంగా రుద్ర పూజ చేస్తూ ప్రార్థిస్తున్నారు.

తక్షకుడు నేరుగా పరీక్షిత్తు మహారాజు ముందుకు వెళ్ళాడు. వినయంగా ప్రణామం చేసాడు పరీక్షిత్తు. తక్షకుడు స్వస్తి వాచకం పలికి ఆశీర్వదించి చక్కటి ఒక నిమ్మ పండును కానుకగా పరీక్షిత్తు చేతిలో వుంచాడు.

పసిమి రంగులో వూరిస్తున్న ఆ నిమ్మ పండును యధాలాపంగా వాసన చూసాడు పరీక్షిత్తు మహారాజు. అప్పుడు` సరిగ్గా అప్పుడు జరిగింది ఎవరూ వూహించని ఘోర సంఘటన. ఎప్పుడైతే మహారాజు నిమ్మ పండు ఆఘ్రాణించాడో ఆ మరు లిప్తలో అక్కడ బ్రాహ్మణుడు అదృశ్యమై నిమ్మ పండును చీల్చుకొని బయటి కొచ్చి పరీక్షిత్తు నాసిక మీద కాటు వేసాడు. తన పని పూర్తి గావటంతో అక్కడి నుండి అదృశ్య మయ్యాడు. పరీక్షిత్తు పొలి కేకతో ఆ ఒంటి స్తంభం మేడ మారు మ్రోగింది. అంతే` ఒక్క సారిగా హాహా కారాలు చెల రేగాయక్కడ. అటు సూర్యుడు అస్తమిస్తూండగా యిటు పరీక్షిత్తు కూడ తక్షకుని కాటుతో అస్తమించాడు. క్షణాల్లో ఈ ఘోర వార్త హస్తిన అంతటా ప్రాకి పోయింది. నగరాన్ని చీకట్లు మూసురుకునే సరికి నగర వాసులంతా శోక సముద్రంలో మునిగి పోయారు.

******************************

తమ ప్రభువును కాపాడ ఉదయం వెళ్ళిన తన భర్త అగ్ని భట్టారకుడు చీకటి పడక ముందే ఇంటికి చేరటం చూసి అతడి భార్య ఆశ్చర్య పోయింది. పిమ్మట జరిగింది తెలుసుకుని ఆగ్రహంతో మండిపడింది.

‘‘ఏమిది స్వామీ! మీరు చేసిన పని? సిరి సంపదలు కోరి ఎన్నడైననూ మిమ్ము సతాయించితినా? పేదరికము మనకు కొత్త కాదు గదా. ప్రభువును కాపాడిన సిరి సంపదలు కీర్తి ప్రతిష్ఠ లభించునని ఆశ పడితిని గాని యిలా ప్రలోభమునకు లోబడి పుచ్చుకున్న సంపత్తి కోసము గాదు. ఈ మాత్రపు సంపద మనకు పరీక్షిత్తు వారు యివ్వరా?

ప్రభు భక్తి దేశ భక్తి లేని ప్రజలు రాణించరు. అయ్యో... ప్రజలను కన్న బిడ్డల్లా పాలించు ధర్మ ప్రభువు పరీక్షిత్తు వారిని కాపాడిన కీర్తి ప్రతిష్టలు మీకు చెందకుండా పోయినవే. మీరు చాలా గొప్పవారు. అది నాకు తెలుసు. ఇంత కాలము గొప్ప గాను ధర్మ బద్ధం గానే జీవించినాము. ప్రభువును కాపాడ లేని మీ విద్వత్తు మంత్ర శక్తి నిరుపయోగము గదా... మనకీ సంపద వలదు. ఆ తక్షకుడు హస్తినకు పోయి ప్రభువును ఏమి చేయునో గదా... స్వామీ! ఆలస్యమేల. మరలి పొండు. హస్తినకు పోయి పరీక్షిత్తు వారిని కాపాడి రావలె. మీరా పని చేయకున్న భూదేవి ఆనగా పలుకు చుంటిని. జీవిత కాలం ఇక మీతో మాటలాడు దానను గాను.’’ అంటూ హెచ్చరించింది.

భార్య మాటలాలకించిన అగ్ని భట్టారకుడు ఖిన్నుడైనాడు. అప్పటి గ్గాని తను చేసిన పొర బాటు ఏమిటో అర్థం గాలేదు. ఆ చీకటి రేయి ఎలా వచ్చిన వాడు అలా తిరిగి హస్తినకు బయలు దేరాడు. ఈసారి తండ్రిని ఒంటరిగా రాత్రి వేళ పంపించటం ఇష్టం లేక కొడుకు లిద్దరూ తోడుగా వెంట నడిచారు.

అలా ఆ రేయంతా వారు అడవి దారుల్లో అష్టకష్టాలు పడి నడుచుకుంటూ తెల్ల వారే సరికి హస్తినకు ఆమడ దూరానికి చేరుకున్నారు. వారు హస్తినలో ప్రవేశించే సరికి పొద్దు చాలా పైకి వచ్చేసింది. నగరమే శోక సముద్రంలో వుంది.

ఆ ఉదయమే సూర్యోదయం లోనే చందన కట్టెల చితి పేర్చి ఆవు నెయ్యి సుగంధ ద్రవ్యాలు వేసి శాస్త్రోక్తంగా పరీక్షిత్తు మహా రాజు చితికి రాజ లాంఛనాలతో అగ్ని సంస్కారం చేయటం జరిగింది. అప్పటికి ఏడేళ్ళ పసివాడైన పరీక్షిత్తు కుమారుడు జనమేజయుని చేత చితికి నిప్పు ముట్టింప జేసారు. అగ్ని భట్టారకుడు స్మశాన వాటికకు చేరేప్పటికే పరీక్షిత్తు భౌతిక కాయం బూడిదయి పోయింది. అంతా అయి పోయినది.

తమ ప్రియతమ ప్రభువు అంతిమ యాత్రకు తరలి వచ్చిన హస్తినా పురి ప్రజలు పొగిలి పొగిలి రోదిస్తున్నారు. కొందరు నేల బడి దొర్లుతూ గుండెలు బాదుకుంటున్నారు. స్త్రీ పురుష వయో బేధం లేకుండా రాజ కుటుంబంతో బాటు ప్రజలూ శోక సముద్రంలో మునిగి వున్నారు. అదంతా చూస్తున్న అగ్ని భట్టారకుడు కనులు చెరువులై కన్నీరు ప్రవహిస్తుండగా కూల బడి పోయాడు.

అయి పోయింది.

ఇప్పుడు తను చేయ గలిగింది ఏమీ లేదు.

ఈ అనర్థాన్ని ఆపగల శక్తి వుండీ ఆప లేక పోయిన తన అసమర్థత మీద రోత పుట్టింది. ఏ ముఖం పెట్టుకుని ఇంటికి పోగలడు. తన భార్య తనను క్షమిస్తుందా? ఈ విషయం తెలిసిన రాజ్య ప్రజలు క్షమించ గలరా? ధన హీనుడైనా బాధ లేదు గాని ఈ విధముగా చరిత్ర హీనుడ నైతి నేలయని రోదించాడు అగ్ని భట్టారకుడు. ఎలాగో తండ్రికి నచ్చ జెప్పి ఆయన్ని వెంట బెట్టు కొని గృహోన్ముఖులయ్యారు కొడుకు లిద్దరూ.


******************************************

అంత వరకు చెప్పిన పిమ్మట`

కొద్ది సేపు మౌనం వహించింది భద్రా దేవి.

యువ రాజు ధనుంజయుడు ఆసక్తిగా విన్నాడు గాని ఆ అగ్ని భట్టారకునికి భద్రా దేవికి గల సంబంధం ఏమిటో అర్థం కాలేదు. అంతే కాదు`

ఇంటికి చేరిన అగ్ని భట్టారకునితో అతని భార్య మాట్లాడినదా? తక్షకుడు యిచ్చిన రెండు సంచుల మరకత మాణిక్యాది రత్నాలు పసిడి కానుకలు ఏమయ్యాయి? ఆ సంపత్తిని వారు వినియోగించుకుని ధనవంతులైనారా లేక పేదరికం లోనే వున్నారా? అగ్ని భట్టారకుడు ఇంటికి చేరాక ఏమి జరిగింది? ఏ విషయమూ తెలీదు. ఇవే సందేహాలను అడిగినప్పుడు ఒకింత విరామం తర్వాత తిరిగి మాట్లాడింది భద్రా దేవి.




వెన్నెట్లో దిగువన`

తాామున్న కొండను చుట్టి గాల్లో ఎగురుతూ కావలి తిరుగుతున్న భూతం ఘృతాచి కన్పిస్తోంది. ఒక చెట్టు ఎండు కొమ్మను గదలా భుజాన వేసుకొని మరీ తిరుగులోంది. కొండ పైకి చిన్న పురుగు వచ్చినా అది చంపేస్తుంది. సందేహం లేదు`

‘‘ప్రభూ! కలి యుగారంభం తర్వాత కురు సామ్రాజ్యానికి తొలి చక్రవర్తి పరీక్షిత్తు మహారాజు. అంతటి చక్రవర్తి మరణం అదో పెద్ద విషాద కర సంఘటన. అదలా వుంచిన` ఇటు అగ్ని భట్టారకుని గృహమున ఏమి జరిగినదో తొలుత చెప్పవలె.

అగ్ని భట్టారకుని భార్య దొడ్డ యిల్లాలు. మాటకు కట్టు బడు మనిషి. భూదేవి సాక్షిగా భర్తకు ప్రమాణము చేసినది గావున ఆ వాక్కునకు కట్టు బడే వున్నది. పరీక్షిత్తును కాపాడ లేక ఇంటి కొచ్చిన భర్తతో ఆమె మాట్లాడనే లేదు. ఆ దినమునే గాదు, మరణ కాలము దనుక మాట్లాడనే లేదు.

గృహ కృత్యాలు నెర వేర్చుకొని, భర్తకు కావసినవి సమ కూర్చుట అంతయు మౌనము గానే సాగించినది. అందరితో సంభాషించేది గాని సంసారములో భార్యా భర్తల మధ్యన మాటలు లేవు. ఇలా వుండగా`

కొడుకు లిరువురికీ వివాహములు జరిగినవి. కోడండ్రు వచ్చినారు. అప్పుడు గూడ తక్షకుడు యిచ్చిన సంపదను దాచి వుంచారు గాని ఖర్చు చేయ లేదు. తనకు తెలిసిన విద్యలన్నీ అగ్ని భట్టారకుడు కొడుకులకు భోధించి తనంత వాళ్ళుగా తీర్చి దిద్దాడు.

ఇలా వుండగా దాచిన రెండు సంచుల సంపదలోను ఒక సంచి లోని మణి మాణిక్యాలు బంగారం దొంగల పాలయ్యాయి. దొంగలు దోచుకుంటే రెండు సంచు తీసుకుపోయే వారు గాని ఒక సంచి వదిలేస్తారా? కోడళ్ళు వచ్చినారుగా` వాళ్ళే ఒక సంచి తీసి పంచుకుని తమ పుట్టిళ్ళకు తరలించారు. అందుకే వాళ్ళు ధనవంతులైనారు అని గ్రామ వాసులు గుసగుసలు పోయినారు. ఆ మాట నిజము కూడ. అయిననూ అగ్ని భట్టారకుడు ఎవరిని పల్లెత్తు మాట అనలేదు.

కాలం కరిగి పోతూనే వున్నది.

హస్తినలో పరీక్షిత్తు కుమారుడు జన మేజయుడు యుక్త వయస్కుడయినాడు. పట్టాభిషేకం జరిగి సింహాసనం అధిష్టించి కురు సామ్రాజ్యానికి చక్రవర్తి అయినాడు. తన తండ్రి మరణానికి తక్షకుడనే సర్పం కారణమని తెలిసి ఆగ్రహంతో మండి పడినాడు. పుడమి పై నాగ జాతే ఉండ రాదని సర్ప యాగం జరిపించినాడు.

ఆ యాగానికి అగ్ని భట్టారకుడూ వెళ్ళాడు. అక్కడే వ్యాసుల వారిని కలిశాడు. కారణం ఏమైనా గాని సర్ప యాగం మధ్యలో నిలిచి పోయినది. దీనంతటికీ కారణమైన తక్షకుడు మాత్రం ఇంద్రుడి సింహాసనాన్ని ఆశ్రయించి బ్రతికి పోయాడు. పేరు పేరున ఋత్విక్కులు పిలుస్తుండగా అనేక నాగజాతులు వచ్చి యాగాగ్నిలో బడి మరణించాయి.

ఆ విధముగా సర్ప యాగంతో నాగలకు క్షయం గావుట అప్పటి నాగ లోక ప్రభువైన పద్ముడికి ఎంతో మనః క్లేశం కలిగించినది. చెట్టు పుట్టల నాశ్రయించి బ్రతికే నాగుల నాశనానికి ఒక చంద్ర వంశ రాజు కారకుడయ్యాడు. నేటి నుండి తొంభై వత్సరముల పిమ్మట నుండి ఆ పైన తొమ్మిది వందల వత్సరముల వరకు సింహాసనం ఎక్కి పరిపాలించు చంద్ర వంశ రాజు పుట్ట వ్రణ వ్యాధి బారిన పడి మరణించెదరు గాక యని చంద్ర వంశాన్ని ఘోరంగా శపించాడు.'' అంటూ వివరించింది భద్రా దేవి.

''అనగా... నా జనకునికి ఏర్పడిన పుట్ట వ్రణమునకు కారణము నాటి నాగరాజు శాపమేనా?'' ఆసక్తిగా వింటున్న ధనుంజయుడు

ఆశ్చర్య సంభ్రమాలతో భద్రా దేవిని ప్రశ్నించాడు.

"అవును ప్రభూ. ఆ శాపమే కారణము." అంది భద్రా దేవి.

"పిమ్మట ఏమి జరిగినది?"

"ఈ శాప వృత్తాంతమును గూర్చి వ్యాస భగవానుడి శిష్యుని మూలముగా అగ్ని భట్టారకునికి తెలిసినది. మానసికంగా మరింతగా కృంగి పోయినాడాయన.

"ఔరా! ఆనాడు నేను జేసిన పొరబాటు ఎన్ని అనర్థముకు కారణంబైనది! తను తక్షకుని నిరోధించి పరీక్షిత్తును కాపాడి వుంటే నాగలకు క్షయము జరిగేనా...? నాగ రాజు వలన చంద్ర వంశ రాజుకీ శాపముండెడిదా? అన్యోన్యమగు తమ సంసార మందు భార్యా భర్తల మధ్య మాటలు కరువై ఎడ బాటు ఉండేదా? అయ్యో... ఎంతటి అనర్థము ఘటిల్లినవి" అంటూ వా పోయాడు.

సతీ పతుల నడుమ మాటలు లేకున్ననూ ఒకరి యెడల ఒకరికి గల ప్రేమానురాగము చెక్కు చెదర లేదు. ఇలా వుండగా కాలము ఎవరి కోసమూ ఆగదు.

అగ్ని భట్టారకుని భార్య ఈలోకము వదిలి పోయినది. మరణ ఆసన్న కాలమందునా తనతో మాటాడని భార్య మీద ఆయనలో మరింత ప్రేమ పెరిగినదే గాని తరుగ లేదు. ఆ విధముగా భార్య మీది బెంగ తోడనే అనతి కాలమందే అగ్ని భట్టారకుడూ కాలం చేసినాడు.

అవసాన కాలమందు కొడుకులిరువురినీ దగ్గర కూచుండ బెట్టుకుని మాట్లాడినాడు.

"నాయన లారా! మీ జనని ఉత్తమ యిల్లాలు. మహా సాధ్వి. ఆమె నా పట్ల చూపిన ప్రేమానురాగములు మరువ లేనివి. నే జేసిన తప్పునకు నాతో మాటలాడక జీవిత కాలము తను శిక్ష అనుభవించినది. ఇప్పుడు నేనును తన వద్దకు పోవు చుంటిని. పై లోకము నయిననూ నాతో మాటలాడునో లేదో తెలియదు. కాని నా ఆత్మ మాత్రము క్షోభిస్తూనే వుంటుంది. నా ఆత్మ శాంతించి ఉత్తమ గతులు పొందుట అనేది మీ చేతులందే యున్నది. ఇప్పుడు నేను జెప్పు విషయము కడు జాగరూకులై ఆలకించండి.

నా మూలమున జరిగిన తప్పుని నా వంశీకులే సరి దిద్దవలె. నేటి నుండి మన వంశమున తరాలు మారినా అంతా సిద్ధ వైద్యులు, గొప్ప పాము మంత్ర వాదులు గానే ఉండాలె. ప్రతి తరము తాము నేర్చిన విద్యల్ని ముందు తరాలకు బోధింప వలె. నా గాధను వినిపించ వలె. ఎందుకనగా, చంద్ర వంశ రాజుల్ని మన వంశీకులే కాపాడ వలె. నాగ రాజు శాపమునకు తిరుగు లేదు. అది ఫలించును. రానున్న వేయి సంవత్సరముల కాలమందు ఎందరు ఆ శాపమునకు బలి యగుదురో తెలియదు. వారిలో కొందరినయినా కాపాడితే నా ఆత్మ శాంతిస్తుంది.

పుట్ట వ్రణమునకు ఇంత వరకు సిద్ధ వైద్యమున మందు లేదు.

కాని ఎవడయినా చంద్ర వంశ వీరుడు సాహసముతో నాగ లోకము పోయి దివ్య నాగ మణిని తెచ్చిన అది పుట్ట వ్రణమును హరించును. నాగ రాజు శాపమున మరో కిటుకును గలదు. శాపము నుండి తప్పించు కొనుటకు గల ఏకైక మార్గము అదే. సింహాసనం అధిష్టించి పరి పాలించు చంద్ర వంశ రాజుకే నాగ రాజు శాపం వర్తించును. కావున తన పట్ట మహిషిని గద్దెనెక్కించి ఆమె తరఫున పరిపాలన సాగించిన చంద్ర వంశ రాజు శాపం నుండి తప్పించుకో వచ్చును. భవిష్య కాలమున కురు సామ్రాజ్యము వుండదు. జన మేజయుని వారసులు అధికరించి సామ్రాజ్యము ముక్కలై చిన్న చిన్న రాజ్యములగును. ఆయా రాజన్యులను మన వారసులే కాపాడ వలె. ఇది నా ఆన.'' అంటూ ఒట్టు పెట్టి మరీ కొడుకు లిరువురికీ వివరించాడు అగ్ని భట్టారకుడు.

''కాని జనకా! శక్తి మంతులగు రాజన్యులు ఈ శాప వృత్తాంతమును విశ్వసింతురా? మనము చెప్పినటుల నడచు కొందురా?'' కొడుకులు తమ సందేహమును అడిగినారు.

''నాయన లారా! బుద్ధి కర్మను సారిణి గదా. కర్మ బాగున్న వారు విని బ్రతికెదరు. వినని వారు చెడుదురు. వారికి తెలియ జెప్పుట మీ కర్తవ్యమని మరచి పోవలదు.

ఇకపోతే..

తక్షకుడు నాకిచ్చిన రెండు ధన రాసులున్న సంచులలో ఒక సంచిని మీ భార్యలు తస్కరించి, చెరి సగం పంచుకొని వారి పుట్టిళ్ళకు రహస్యముగా పంపించినారు. రెండో సంచిని దొంగలు దోచుకెళ్ళినారు.

మెట్టినిల్లు కడు పేదరికమున వున్న గ్రహింపక, అత్తా, మామలు, కట్టుకున్న భర్త, కడుపున పుట్టిన బిడ్డలు ఆర్థిక పరమైన ఇడుములు పడుచున్ననూ, పుట్టింటిని కాపాడే ప్రయత్నములు ఏ కోడళ్ళయితే చేయుదురో వారు రానున్న కాలములో బహు

రీతిన కష్టముల పాలవుదురు. వారికి నరక లోక ప్రాప్తి తథ్యము.

తమ కూతురు ఒక ఇంటికి కోడలై కూడా తన భర్తను, అత్తా మామల్ని నిర్లక్ష్యం చేస్తున్నా మందలించని ఆడపిల్లల తల్లిదండ్రులు, ఆమె తోడ బుట్టిన వాళ్ళు కూడా రోగ పీడితులై భయంకరమైన నరకం అనుభవింతురు.

ధర్మము మరచి అను క్షణము భర్తను కించ పరుచుచూ, తన తోడ బుట్టిన వారిని పొగుడుదురో వారు 84 జన్మములు ఎత్తి రవరవాది నరకము అనుభవింతురు. ఇదియే ఈ అగ్ని భట్టారకుడి శాపము…" అంటూ పక్క కున్న పాత్రలోని నీరు తీసుకుని మంత్రో చ్చారణ చేస్తూ గాల్లోకి వెద జల్లారు. తమ జనకుడిలో వెల్లువెత్తిన ఆగ్రహావేశాలను చూసి కొడుకులిద్దరూ విస్మయానికి లోనయ్యారు.

"అవును నాయనలారా… నా ఆగ్రహావేశాలు సబబయినవే. నా బిడ్డలయిన మీ కొరకు స్వధర్మం స్వార్థంతో కూడుకున్నదయినా పర ధర్మం కంటే గొప్పదని రాజ ద్రోహానికి పల్పడ్డాను.

ఫలితంగా అంది వచ్చిన రెండు సంచులలో రెండవది దొంగల పాలయినది. మొదటి సంచి మీ భార్యలు దొంగిలించారు. ఇదే నా ఆగ్రహానికి కారణం…

భర్త భరించినంత వరకే భార్య తన పుట్టింటి మీద మమకారం చూపించాలి. అది హద్దులు దాటితే అనర్థాలే జరుగుతాయి.

భర్తను, అత్తా మామల్ని నిరాదరణకు గురి చేసి, నింద లేసే కూతుర్ని మందలించి సరి దిద్దని ఆడపిల్లల తల్లిదండ్రులు, ఆమె సోదరీ మణులు సైతం నా శాపం నుండి తప్పించు కోలేరు.

ఇక ఈ చివరి ఘడియల్లో మీ కేమీ యివ్వలేని అశక్తుణ్ణి…" అంటూ కంట నీరు పెట్టుకున్న తమ జనకుడ్ని చూసి కుమారులిద్దరూ చలించి పోయారు.

అప్పటికే చివరి శ్వాసల్లో వున్న అగ్ని భట్టారకుడు ఏదో స్ఫురణ కొచ్చినట్లు తన కుడి చేతి వేళ్ళ వైపు చూసుకొని సంతృప్తిగా తల పంకించి, కుమారులను చెంతకు రమ్మని సంజ్ఞ చేసి, తన కుడి చేతి అనామిక వేలికున్న దివ్య నాగ లోక అంగుళీయాన్ని నెమ్మదిగా తీసి దాన్ని భక్తిగా కళ్ళ కద్దు కొని కుమారుల వైపు చూస్తూ`

‘‘పుత్రులారా…! తక్షకుడు రెండు బంగారు సంచులతో పాటు ఇది నా చేతికి తొడిగాడు. కాల గమనంలో దీని సంగతే నేను ఏమరిచితిని.

ఇది అత్యంత విలువైన, అపూర్వమైన, అనన్య సామాన్యమైన, అనితర సాధ్యమైన నాగ లోకపు దివ్య నాగ నీలమణి…

నా పుత్రులయిన మీకు చివరి దశలో ఏమి యివ్వ లేక పోయాననే వేదన లేకుండా చేయ గలిగింది ఈ దివ్య నాగ లోకపు నీలమణి.

మీరిద్దరూ ఒకే ఇంటిలో అన్యోన్యముగా జీవించాలి, విడి పోకూడదు.     మీ భార్యలు మిమ్మల్ని తప్పక విడ దీయగరు. వారి పట్ల కడు జాగరూకులై ఉండ వలె. ఈ దివ్య నాగ లోకపు నీలమణి మీ ఇద్దరి ఉమ్మడి సొత్తు. దీన్ని ప్రతి నిత్యము పూజించాలి… సేవించాలి.. దీనికున్న శక్తులు అనన్య సామాన్యమైనవి, అసాధారణమైనవి.

దీన్ని ఆసరాగా తీసుకుని మంత్రిస్తే ఎంతటి విషమైనా తక్షణం హరించి పోవల్సిందే. అంతే కాదు, ఎలాంటి జబ్బులనైనా చిటికలో మాయం చేయగల మహత్తర శక్తి దీనికుంది.

మీ భార్యల మాటలు విని దీన్ని విడ గొట్టి చెరి సగం చేసు కోవాలని ప్రయత్నిస్తే ఇది నిరుపయోగంగా మారి పోతుంది.

ముందుగా దీన్ని శ్రద్ధా భక్తులతో పూజించి, సేవించి, స్పర్శించి శివ లింగం ముందుంచి నేను మీకు నేర్పిన సర్ప మంత్రమును మీ ఉపాధిగా చేసుకొని నిజాయితీగా జీవించండి…’’ అని కొద్ది ఘడియలాగి… ఆ నాగ లోకపు దివ్య నీల మణిని ఇద్దరికీ అందించాడాయన.

పుత్రు లిద్దరూ తమ తమ హస్తాల్ని చాపి దాన్ని అందుకొని కళ్ళ కద్దుకున్నారు.

చిక్కటి నిశ్శబ్దం ఇప్పుడక్కడ…

చిన్నగా… అతి చిన్నగా… నెమ్మదిగా… అత్యంత నెమ్మదిగా అగ్ని భట్టారకుడు పెదాలు కదిలాయి…

‘‘ఓం నమో నారాయణనాయః’’ అంటూ అష్టాక్షరి మంత్రం జపించటం ఆరంభించారాయన.

తమ జనకునికి ఆఖరి ఘడియలు సమీపించాయని కుమారులకు అర్థమై పోయింది.

ఒకరు తులసాకు, మరొకరు కలశంలో మంచి నీరు తీసుకొచ్చారు వెంటనే. వణుకుతున్న జనకుని పెదాలమధ్య ఒక్కో చుక్కా పోయనారంభించారు. కొన్ని లిప్తల కాలం లోనే ఆ మహా మహుడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పోయాయి…

ఎన్నో ప్రశ్నలతో నిండి వున్న ధనుంజయుడ్ని చూస్తూ చెప్పటం ఆపింది.

భద్రా దేవి వినిపించిన విషయాల్ని అతి శ్రద్ధగా విన్నాడు యువరాజు ధనుంజయుడు. అయినప్పటికీ కొన్ని సందేహాలు ఇంకా మిగిలి పోయాయి.

"అనగా… మీ వంశ మూల పురుషుడు నాటి అగ్ని భట్టారకుడనేగా?" అనడిగాడు.

"అవును ప్రభూ!" అంది ప్రశాంతంగా భద్రా దేవి.

"మీ వంశమున ప్రతి తరము తమ విద్యలతో బాటు ఈ గాథను కూడ ముందు తరానికి బోధిస్తూనే వున్నారా?"

"అవును ప్రభూ"

"నీవు ఎన్నో తరము?"

"ఏడవ తరము."

"నీవు వచించిన ప్రకారము జూడ నా జనకునకు మారుగ నా జనని సింహాసన మందుండిన నా జనకునకు పుట్ట వ్రణము సంభవించెడిది కాదందువా?"

"నేను అనటం కాదు ప్రభూ, ఆనాడు నా జనకుని మాటలు ధర్మ తేజుల వారు ఆలకించి వున్న నేడు వారికీ వ్రణ బాధ మరణ యాతన వుండేడివి కాదు."

"నీ తండ్రి గారా... అంటే....?"




"అవును. ధర్మతేజుల వారు రత్నగిరి గద్దెనెక్కు సమయమునకు నా తండ్రి అరుణ భట్టారకుడు ఆస్థాన వైద్యుడు.

"అరుణ భట్టారకుడా....!"

"అవును. అరుణ భట్టారకుడే. ఇదే విషయమున హెచ్చరించినందుకు ఆస్థానమున హేళన జేసినారు. అవమానింప బడ్డారు. అవన్నీ గాలి వార్తలని కొట్టి పారేసినారు. ఆ అవమాన భారమును తట్టుకో లేక ఆస్థాన వైద్యునిగా తన పదవిని వదులుకొని మా స్వస్థలమగు సహ్యాద్రి మీది భీమ శంకర పల్లెకు వచ్చేసినారు."

"ఎప్పుడో నా చిన్న వయసు నాటి మాట. అరుణ భట్టారకుల వారి పేరు వింటిని గాని చూడ లేదు. పల్లె లోని బామ్మ నీలవేణి..."

"నా జనకుని తల్లి గారు..."

“ఇంతకీ నీ జననీ జనకులు ఎక్కడ?”

“వారిపుడు లేరు ప్రభూ. అయిదేండ్ల క్రిందట ఒక పర్వ దినాన భీమా నదికి పుణ్య స్నానమునకు వెళ్ళిన వారు తిరిగి రానే లేదు. అకస్మాత్తుగా ఏర్పడిన వరదలకు నదిలో కొట్టుకు పోయినారు. వారి శరీరములు కూడ లభించలేదు.” రుద్ధ కంఠంతో పలికింది భద్రా దేవి.

“అరరే... ఎంత పని జరిగినది. గతము గుర్తు చేసి నిను బాధ పెట్టితిని. క్షమించు భద్రా.” అన్నాడు ఆమె చేయి అందుకుంటూ ధనుంజయుడు.

“అంతయు ముగిసి పోయినది. తలచుకొని బాధ పడిన ప్రయోజన మేమి? మూడు సంవత్సరముల క్రితం రాజ కుటుంబం సహ్యాద్రికి వచ్చినప్పుడు తొలి సారిగా మీ దర్శనమైనది. మిమ్ము జూచినది మొదలు నాలో మీ మీద ప్రేమ అంకురించినది. మిమ్ము జూడ మనసు తహ తహ లాడెడిది. మిమ్ము చూచుటకే తరచూ రత్న గిరికి వచ్చెడి దానను.

చంపా పురము సమీపమున మా తల్లి గారి సోదరి కుటుంబమున్నది. పిన్నమ్మ యింటికని బామ్మతో చెప్పివ వచ్చెడి దానను. పురుష వేషమున ఉందును గనుక రత్న గిరిలో నిరాటంకముగా సంచరిస్తూ మీరు రాజ వీధిన బోవునపుడు మిమ్ము గాంచి మురిసి పోయే దానిని. అలా సంచరించుట లోనే మీకు తెలియని అనేక విషయము నాకు తెలిసెడివి. బాహ్లీకుని కుట్రను గూర్చియు అటులనే తెలిసినది. చివరిగా రత్న గిరి వచ్చినప్పుడు మీరు దివ్య నాగ మణి కోసం బయలు దేరిన రహస్య సమాచారము తెలిసినది. మిమ్ము వెనక్కు రప్పించుటకు అశ్విక దళాన్ని పంపిన సమాచారము తెలిసి మీ కోసం మీ వెనకే ఆనాడు వచ్చితిని. నాడు దారిలో మిమ్ము వదిలి చంపా పురము పోయి అనారోగ్యముగా నున్న మా పిన్నమ్మను జూచి మందు లిచ్చి అట నుండి సహ్యాద్రికి వచ్చితి. మీ కొరకు తిరిగి బయలు దేరనుండగా మీరే అటు వచ్చుట సంతోషము కలిగించినది. మిగిలిన విషయము మీకు తెలిసినదే” అంటూ ముగించింది భద్రా దేవి.

“ఆ దివ్య నాగ లోకపు నీలమణి అంగుళికము ఏమైనది?”

“తెలియదు...” అంది భద్రా దేవి.

“మీ వంశీయులు ఇంకను ఎచటెచట వున్నారు? ఎవరినయినా వారు కాపాడ గలిగినారా?” ఒకింత విరామం తరువాత అడిగాడు ధనుంజయుడు.

భద్రా దేవి భారంగా నిట్టూర్చింది.

“ప్రస్తుతం చంద్ర వంశ రాజు పాలించు చాలా రాజ్యములందు మా వంశీకులు విస్తరించి వున్నారు ప్రభూ. వారిలో కొందరితో ఇప్పటికీ మాకు సంబంధములున్నవి. ఇక కాపాడు విషయమందురా` మా జనకునకు ఏర్పడిన అనుభవమే చాలా మందికి ఏర్పడినది. విన్న రాజన్యులు సురక్షితులు, వినని వారు నాగ రాజు శాపానికి గురై పుట్ట వ్రణంతో మరణించినారు. మరొక్క విషయం ఏమనగా మా వారి లోను అందరూ సమర్ధులుగారు. సమర్ధులు కొంత మందే. మిగిలిన వారు అరకొర విద్యలో మిగిలి పోయినారు. జాతకుని గ్రహబలం బాగున్నంత వరకు ఏ శాపము అతన్ని బాధించదు. గ్రహ దృష్టి వక్ర గతిని పట్టినప్పుడు శాపం బారిన పడక తప్పదు.

అయితే ఏ రాకుమారుడూ ఇంత వరకు నాగ లోకము పోయి దివ్య నాగ మణిని సంపాదించి తెచ్చిన సమాచారము లేదు. ఆ

ప్రయత్నములో వున్న మీకు నేను సహకరించుట నా విధి కర్తవ్యము గూడ. మీరు విజయులయితే మా పూర్వ జేజి తాత గారు అగ్ని భట్టారకుల వారి ఆత్మ శాంతిస్తుంది. నా ప్రాణాధికమగు మీకును గొప్ప కీర్తి ప్రతిష్టలు ఒన గూడును. ఇందుకు నేను గర్వ పడుతున్నాను.'' అంది.

''అవును దేవి. నేనును గర్వ పడుచుంటిని. నీ వంటి మేధావి యగు సౌందర్య వతి నాకు తోడు దొరికినందుకు సతతము నేనును గర్వ పడుచునే వుందును.'' అంటూ భద్రా దేవిని తిరిగి ఒడి చేర్చు కొని ముద్దాడాడు ధనుంజయుడు.

అదే సమయంలో`

ఉన్నట్టుండి ఒక్కసారిగా`

గుట్ట దిగువ నుండి వినవచ్చింది అలజడి ఒకటి. కేకలు అరుపులు. బండలు దొర్లుతున్నాయి. రాళ్ళు ఎగురుతున్నాయి. భూకంపం వచ్చినట్టు నేల అదురుతోంది. ఏమి జరుగుతుందో అర్థం గాక ఉలికి పడి లేచిన ధనుంజయ భద్రాదేవిలకు వెన్నెల కాంతిలో గుట్ట దిగువన మొదట ఏమీ కన్పించ లేదు.

*******************************************

ఎండు కొమ్మ ఒకటి భుజాన వేసుకుని గాలిలో ఎగురుతూ కొండ గుట్టలను చుట్టి అప్రమత్తంగా కావలి తిరుగుతోంది భూతం ఘృతాచి.

భద్రా దేవికి వశమయ్యాక ఇక ఆమె ఆజ్ఞా బద్ధురాలు అది. గుట్ట పైకి ఏ ప్రాణి పోకుండా వేయి కళ్ళతో శోధించి గాలిస్తోంది.

రేయి రెండవ యామం నడుస్తోంది.

వెన్నెల కాంతిలో అడవి పులకిస్తోంది. ఎటు చూసినా నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. చల్లటి గాలి తెరలు వీస్తూ ప్రశాంతంగా వుంది అంతటా. మండపం లోని ఇరువురూ ఇంకా నిద్ర పోకుండా ఏవో విషయాు ముచ్చటించు కొంటున్నారు. అటువంటి సమయంలో`

గుట్ట ముందు భాగాన`

పెద్ద కరి నాగమొకటి జర జర పాకుతూ గుట్ట పైకి పోతూండటం ఘృతాచి కంట బడింది.

ఏ మాత్రం మెరుపు లేని చిక్కటి కాటుక వంటి దేహంతో భీకరంగా వుందా కరి నాగు. తను కావలి ఉండ గానే ఏ మాత్రం లక్ష్య పెట్టకుండా గుట్ట పైకి పోతున్న భుజంగాన్ని పసి గట్టగానే కోపంతో భగ్గు మంది భూతం ఘృతాచి.

''ఆహాఁ... దుష్ట నాగమా! ఏమి నీ సాహసము. ఎట నుండి నీ రాక, ఎటకు నీ పోక! ఈ ఘృతాచి కావలి ఉండగానే కన్ను గప్పి గుట్ట పైకి పోదువా? నీ ఆగడమునకు కఠిన శిక్ష తప్పదు. నీ ఎముకలు చూర్ణము జేసెద. నీ శిరస్సు చిదిమి సంహరించెద. ఆగుము... అక్కడే ఆగుము..'' అని హెచ్చరిస్తూ రివ్వున వెళ్ళి ఎండు కొమ్మతో ఆ పన్నగమును ఒక్క బాదు బాదింది. అయితే`

చివరి క్షణంలో ఘృతాచి రాకను గమనించిన ఆ ఫణి తృటిలో తప్పించుకుని పెద్ద పెద్ద బండల సందు లోకి దూరింది. అది చూసి మరింత మండి పడింది ఘృతాచి.

“ఓహో… నా ముందరే నీ కుప్పి గంతులా ధూర్తుడా… ఎచటకు పోయెదవు? తప్పించుకు పోగలవా? చూచెద గాక…” అంటూ బండలను పక్కకు దొర్లించింది. అవి దడ దడ లాడుతూ పెద్దగా శబ్దం చేస్తూ గుట్ట దిగువకు దొర్లాయి.

కాని అప్పుడు కూడ తప్పించుకుని ఎగువన పొదల్లోకి జారుకుందా పాము. దాంతో వళ్ళు మండి ఎండు కట్టెతో పొదని చిందర వందరగా బాదటం ఆరంభించింది ఘృతాచి. దాని తాకిడికి పొదలు చెదరి రాళ్ళు రప్ప గాల్లోకి ఎగర సాగాయి. అయినా తప్పించుకొని గుట్ట పైకి సాగి పోతూనే వుందా పాము. మరింత పైకి పాకక ముందే దాని తోకను దొరక పుచ్చుకుని వెనక్కి లాగింది భూతం. అంతే`

కస్సున పడగ విప్పి తలతిప్పి భూతాన్ని చూసిందా నాగం. నాల్కలు తోడుతూ భీకరంగా బుసలు కొట్టి ఎగిరి భూతం మీద పడి దాని ఒంటికి చుట్టుకుంది. రెండో చేత్తో దాని తలను ఒడిసి పట్టుకుంది భూతం. పెద్ద బంతిలా దొర్లుకుంటూ కొంత దూరం దిగువకు వెళ్ళాయి. ఇదే సమయంలో అలజడి గమనించిన ధనుంజయుడు, భద్రా దేవి లేచి నిలబడి గుట్ట దిగువకు చూసారు.

మొదట వారి కేమీ కనబడ లేదు.

కొన్ని క్షణాల తర్వాత`

ఘృతాచి కొండ దిగువన ఎవరి తోనో పెనుగు లాడుతున్నట్టు గుర్తించారు. వాటి పోరాటానికి బండలు దొర్లుతున్నాయి. రాళ్ళు ఎగురుతున్నాయి. దుమ్ము ధూళి గాలిలో వ్యాపిస్తోంది. సాధారణ పాము అయితే తన చేతిలో ఎప్పుడో చచ్చేది. తను పట్టింది సాధారణ పాము గాదని శక్తి వంతమైన నాగమని గుర్తించింది భూతం ఘృతాచి. ఎలాగైనా దాన్ని అంతం చేయాలని శక్తివంచన లేకుండా పోరాడుతోంది. సర్పం తన శరీరాన్ని పెంచి తోకతో భూతాన్ని చుట్టి నేలకేసి కొడుతుంటే భూతం దాని తోక పట్టి తప్పించు కొని కసిగా గిర గిరా తిప్పుతోంది. అంతలో`

“ఘృతాచి… ఎవరితో ఆ పోరాటము. పట్టి ఇటకు గొని రమ్ము.” అంటూ గుట్ట పై నుంచి భద్రా దేవి అరుపు వినబడింది. అంతే`

ఒక చేత్తో తోకను రెండో చేత్తో తను ఒడిసి పట్టి గాల్లో ఎగురుతూ గుట్ట పైకి వచ్చింది ఘృతాచి. దాని చేతుల్లో గింజు కొంటున్న భీకర సర్పాన్ని చూసి విభ్రాంతులయ్యారు ధనుంజయ, భద్రాదేవిలు.

“ఈ దుష్ట సర్పము నా ఎరుక లేకయే గుట్ట పైకి వచ్చుచున్నది ఏలికా. దీనిని సంహరించుటకు అనుమతి ఒసంగుము. దీని తల త్రుంచి నెత్తురు త్రాగెద.” అంది ఘృతాచి.

అది సాధారణ సర్పము గాదని, ధనుంజయుని ప్రాణము హరించుటకు మరో ఘోర సర్పాన్ని నాగ రాజు అంపకం చేసి వుంటాడని గ్రహించింది భద్రా దేవి. ఆ సర్పం వికార రూపం జూస్తుంటే ధనుంజయుని ఒడలు జలదరిస్తోంది.

“వలదు వలదు ఘృతాచి! దాన్ని సంహరింపవలదు. దాని విషయము నేను జూచుకొందును. దాన్ని ఇక్కడే విడిచి నీవు ఎప్పటి వలె కావలికి పొమ్ము” అంది.

వెంటనే సర్పాన్ని నేల మీద వదిలి గాల్లో ఎగురుతూ గుట్ట దిగువకు వెళ్ళి పోయింది ఘృతాచి. నేల బడిన మరు క్షణమే ఆ సర్పం అదృశ్యమై అక్కడ నల్లగా వికార రూపుడయిన ఒక ఆజాను బాహుడు ప్రత్యక్ష మయ్యాడు. నల్లటి దేహంతో సుమారు పధ్నాలుగు అడుగుల ఎత్తున్నాడు.

ఈలోపల సర్పం నేల బడిన మరు క్షణమే భద్రా దేవి అది ఎటూ బెసక్కుండా మంత్ర కట్టు కట్టింది. ఆమె అలా చేయటమే ఆ క్షణం ధనుంజయుని ప్రాణాలు కాపాడింది. లేకుంటే ఘృతాచి విడిచిన మరు క్షణమే అది ఎగిరి ధనుంజయుని మీద పడి కాటేసి వుండేది. మంత్ర ప్రభావంతో ఎటూ కదల లేక మనిషి రూపం ధరించిందా నాగం.

"ఎవరు నీవు?" మండపం అరుగు మీదే నిల బడి సూటిగా ఆ వ్యక్తిని ప్రశ్నించింది భద్రా దేవి.

"ఎవరా..! నన్నెవరని అడుగు చుంటివా... నీ దరినున్న ఆ రాకుమారుడు ధనుంజయుని ప్రాణము ఒక్క కాటుతో హరింప వచ్చిన వాడను. నా కరాళ దంష్ట్రము గ్రక్కు విషాగ్నికి ఎలాంటి జీవి గాని ఒక లిప్త కాలమందే ప్రాణము విడువక తప్పదు. నా శక్తి నీకు తెలియదు."

"ఓ నాగ లోక వాసీ! నీ బెదిరింపులకు భయ పడు వారిచట ఎవరును లేరు. బీరము పలుకుట ఆపుము. మహా వీరుడగు ధనుంజయుని జంపుట అంత సులువను కొంటివా? నీకు ముందు వచ్చిన అగ్ని సర్పము ఏమాయె? మాయావి సర్ప శీర్షుడు ఏమైనాడు? నీకును వారి గతి పట్టక ముందే నీ వివరము తెలుప వలె."

"బీరములా... నావి బీరములా..." హుంకరించాడా వ్యక్తి.

"శుష్క వాగ్దానము ` లబ్ద ప్రసంగము బీరములనెడు అనవసరపు గొప్పు పోవు నైజము నాది కాదు. నేను మిత భాషిని. అయినను... ఒక ఆడపిల్లను అడ్డు పెట్టు కొని నాగ లోకము దనుక రానెంచిన ఈ రాకుమారుడు సిగ్గివలె. వీరుడికి తోడు అవసరమా..." రెచ్చ గొట్టే విధంగా మాట్లాడాడతను. అతడి ఉద్దేశం అర్థమై చిన్నగా నవ్వింది భద్రా దేవి.

"నీవు మిత భాషివి గదా. అధిక ప్రసంగమేల? చాటున కాటు వేయ వచ్చిన నీకు లేని సిగ్గు మాకేల? నీ వివరము తెలుప భయమేల?"

"బాలికా... తెలియదు, నా గురించి మీకు తెలియదు."

"తెలియ జెప్పమనే అడుగు చుంటిని గదా."

"నీవు నాపై మంత్ర కట్టును విప్పి జూడుము. అప్పుడు జెప్పెద... త్రుటిలో మీ యిరువురి ప్రాణములు తీసెద."

"నీవంతటి సమర్థుడవని నాకు తెలుసు గాని ఆలస్యమదియేల? నీ నామ ధేయ మేమి? నీకసలు నామ ధేయమున్నదా లేక నాగ రాజుకి ఎవరూ దొరకక నాగ లోక మందలి అనామకుడి వైన నిన్ను పంపించినాడా?" రెచ్చ గొట్టింది. దాంతో రోషం ముంచు కొచ్చి హుంకరించాడా వ్యక్తి.

"ఆయ్... ఎంత మాటంటివి బాలికా... నేను అనామకుడినా. నన్నెవరనుకొంటివి? పేరు లేని బీరువు ననుకొంటివా? నేను నాగలోక ప్రముఖుండ, మాత కద్రువ తనయుండ, తక్షక సోదరుండ, కర్కోటక నామధేయుండ." అనరిచాడు.

అంత వరకు ప్రేక్షకునిలా చూస్తూ నిచున్న ధనుంజయునికి కోపం హద్దు దాటింది. వెంటనే వింటిని సంధిస్తూ ` "నీవు ఏ కుండవైన మాకేమిరా దూర్తా. ఈ క్షణమే నీ శిరమును ఖండించి మీ నాగ రేడుకి కానుక జేసెద." అనరిచాడు.

ప్రమాదం గ్రహించి వెంటనే అతన్ని వారించింది భద్రా దేవి ` "ప్రభూ! ఆవేశము వలదు. వచ్చినది శత్రువైనను వారి పెద్దరికాన్ని

మనం గౌరవించ వలె. కురు సంగ్రామమున కురు పెద్దలు శత్రు పక్షాన వున్నను వారిని నమస్కార బాణముతో అర్జునులవారు గౌరవించ లేదా? వచ్చిన వాడు సామాన్యుడు గాదు. తక్షకుని సోదరుడు కర్కోటకుడు'' అంటూ హెచ్చరించి, కర్కోటకుని జూచి వినయంగా` ''పూజ్యా, పురాణ ప్రసిద్ధులు, మాతృవాక్య పరిపాకులు, మహా శక్తివంతులగు కర్కోటకుల వారికి సవినయంగా భద్రా దేవి ప్రణమిల్లుచున్నది'' అంటూ మోకాళ్ళ మీద కూచుని ప్రణామం చేసింది. అంతే`

అంతటి కర్కోటకుడు కూడ`

భద్రా దేవి బుద్ధి చాతుర్యానికి వినయ విధేయతలకు పులకించి పోయాడు. ప్రసన్నుడయ్యాడు. వెనక ముందు ఆలోచించకుండా వెంటనే` ''ధీర్ఘాయుష్మాన్ భవ. మనో భీష్ట సిద్ధిరస్తు. కళ్యాణ మస్తు. లెమ్మ బాలికా. నీ యెడల ప్రసన్నుడనైతి'' అంటూ ఆశీర్వదించేసాడు.




''కృతజ్ఞురాలిను స్వామీ'' అంటూ లేచి నిలబడింది భద్రా దేవి.

''అయితే ఆస్యమేల? నను బంధించి వుంచిన మంత్ర కట్టు విప్పుము. వచ్చిన పని ముగించు కొని పొయెద. మా రేడుకి మాటిచ్చి వచ్చితి ఈ యువ రాజుని కడ తేర్చి వత్తునని.'' అనడిగాడు కర్కోటకుడు.

''అదేమి మహాశయా... మా పట్ల ప్రసన్నుడవైతివి గదా!''

‘‘అవును. నీ పట్ల మాత్రమే ప్రసన్నుడనైతి. యువ రాజు పట్ల గాదు.’’

‘‘బాగు బాగు. మీ గురించి తెలిసీ మిమ్ము నమ్ముట నా తప్పు.’’

‘‘ఆహాఁ! నా గురించి తెలియునా? ఏమి తెలియు?’’

‘‘ఇచ్చిన మాట తప్పు వారు, మోస కారి, కపటియని తెలియు.’’

‘‘ఏమంటివి? మాట తప్పితినా... కపటినా? ఈ నిందాలాపములేల?’’

‘‘నింద కాదు, సత్యమే. ఉత్తమురాలయిన సవతి వినతను ఓడించి తనను దాసిని చేసు కొనుటకు మీ తల్లి కద్రువకు తక్షకుండు నీవును సహకరించ లేదా? తల్లి దాస్య విముక్తికి గరుడుడు దేవతలతో పోరాడి అమృతము తెచ్చినది నిజము కాదా? తన మాట వినని తన సంతతి నాగులను గరుడులకు ఆహారం కమ్మని మీ తల్లి కద్రువ శపించినది నిజము కాదా? మీ తల్లి వారసత్వమే మీకును వచ్చినది. అందుకే ఇచ్చిన మాటను ఆశీర్వచనమును ఇంత లోనే మరచి మాటాడుచున్నారు.’’

‘‘వనితా... ఒక నాటి విషయము ఇప్పుడేల? అనవసరముగా నామీద నిందలేయకుము. ఇంతకూ నీవేమందువు? నేనేమి కపటము జేసినాను? నేనేమి మాట తప్పితిని?’’

‘‘ఇప్పుడే గదా నను మనసారా ఆశీర్వదించినారు. మనోభీష్ట సిద్ధిరస్తు`కళ్యాణమస్తుయని. ఇంత లోనే మరచితిరా?’’

‘‘లేదు బాలికా! నా వచనము వృధా కాదు.’’

‘‘కాక ఏమగును? నా పక్కన యువరాజు ధనుంజయుల వారు లేకున్న మీ ఆశీర్వచనము ఎటుల ఫలించు?’’

‘‘అర్థము గాకున్నదే… ఏమి మీ సంబంధము?’’

‘‘ప్రణయ బంధము. నా మనోభీష్టము వీరిని పెండ్లియాడుట. వీరే నా ప్రియుడు, సఖుడు, నా ప్రాణము, నా సర్వస్వము. మా ప్రేమ ఫలించి వివాహము గాకున్న మీ వాక్కు ఎటుల ఫలియించు? వీరిని కడ తేర్చుటయన్న అది మీరు మాట తప్పుటయే గదా?’’

ఆ మాటలు విని ఒక్క సారిగా విభ్రాంతి చెందాడు కర్కోటకుడు. అప్పటి గ్గాని వారిద్దరూ ప్రేమికులని అర్థం గాలేదు. ఈ విషయం తెలిక ఆశీర్వదించేసాడు. తనను పొగిడి ముందు గానే ఆశీర్వాదం పొంది ఇరుకున బెట్టింది. ఇప్పుడు ధనుంజయుని కడ తేర్చుట యెట్లు?

తనను మాటలతో మభ్య పెట్టి ముందు కాళ్ళకు బంధం వేసిన భద్రా దేవి చాతుర్యమునకు ఒక ప్రక్క కోపము, మరో వంక నవ్వు కూడ వచ్చాయి. తీరా ఆశీర్వదించేసాడు. ఇప్పుడేమి చేయగలడు? ఆశీర్వదించాడు గాబట్టి ఆమె ప్రియ సఖుని అంతము చేయ జాలడు.

‘‘ఓహో… గొప్ప చిక్కే వచ్చినది గదా… నీ మంత్రం తోనే కాదు, మాటల తోనూ నను బంధించి నిస్సహాయుని జేసితివమ్మా. అయిననూ నిను మెచ్చితి. నీ వంటి శక్తి వంతురాలయిన ధీర వనిత పక్కనుండ ఈ అదృష్టవంతుడగు పూర్ణాయుష్కుని ఏ ఆపదా బాధింపదు. ధనుంజయా! నిను కడ తేర్చ వచ్చిన నన్ను మన్నించు.’’ అన్నాడు.

‘‘అంత మాట వలదు. మీరు పెద్దలు. ఇవే నా ప్రణామములు.’’ అంటూ అప్పుడు నమస్కరించాడు ధనుంజయుడు. ఇరువురినీ కలిపి దీవించి` ‘‘మీరు మీ లక్ష్యమున విజయులై సంతోషమున ఉందురు గాక… నేను పోయి వచ్చెద… కాని…’’ అంటూ ఆగి పోయాడు కర్కోటకుడు.

‘‘కాని… సందేహమేల? చెప్పండి’’ అంది భద్రా దేవి.

‘‘మా ప్రభువులకి మాట యిచ్చి వచ్చితి గాని ఇచట విఫలమైనది. ఏదో ఒక దానిని కాటు వేసి పోవలె… ఎచట కాటందుకోవలె వచింపుము.’’ అనడిగాడు కర్కోటకుడు.

‘‘దాని కింత ఆలోచనెందుకు? మంత్ర కట్టు విప్పెదను, ఈ గుట్ట వంచన నీటి చెలమ వద్ద రంభా వృక్షములున్నవి, ఒక దానిని

కాటందు కొని పో వచ్చును.'' అంటూ సూచించింది భద్రా దేవి.

''రంభా వృక్షమా...?'' అంటూ ఖిన్నుడై చూసాడు కర్కోటకుడు.

రంభా వృక్షమంటే అరటి చెట్టు.

రంభము అంటేనే అరటి. అరటి బోదె వంటి ఊరువు కలిగినది కాబట్టి అప్సర భామల్లో ఒకామెను రంభ అన్నారు. అలాగే నర నారాయణుల్లో సాక్షాత్తూ నారాయణుని ఊరువు నుంచి ఉద్భవించిన మహా సౌందర్యావతి కాబట్టి మరో అప్సర భామను ఊర్వశి అన్నారు. కావున`

భద్రా దేవి సూచించినట్టు తను అరటి చెట్టును కాటేస్తే ఏమవుతుందో కర్కోటకునికి తెలుసు. అరటి పీచులో తన కోరలు చిక్కు బడి తల వెనక్కు తీసుకో లేడు. ఈ లోన తన విషాగ్నికి అరటితో బాటు తనూ కాలి బూడిదయ్యే ప్రమాదం వుంది. భద్రా దేవి ముందు చూపును మెచ్చుకుంటూ`

''తరుణీ! అభయ మిచ్చితి గదా. ఇంకనూ భయమేల? నా నుంచి మీకు ఏ ప్రమాదమూ ఘటిల్లదు. నను నమ్ము. నీ సూచన సరి కాదు. నా పెద్దరికమును గౌరవించి మరో మార్గము జెప్పుము.'' అన్నాడు.

''సరి... మంత్ర కట్టు విప్పుచున్నాను. ఈ గుట్ట దిగిన పిమ్మట మార్గమున ముందుగా నీకు ఏ మృగము ఎదురైన దానిని కాటందుకొని నాగ లోకము పోవచ్చును.'' అంది భద్రా దేవి.

ఏదో మంత్రం పఠించి గాలిలో రెండు సార్లు వూదింది అంతే` అంత వరకు కర్కోటకుని బంధించి వుంచిన మంత్ర బంధం విడి పోయి స్వేచ్ఛ లభించింది.

కర్కోటకుడు చిరు నవ్వుతో ముందు కొచ్చి చేయెత్తి ఇరువురినీ ఆశీర్వదించాడు. పిమ్మట సర్ప రూపంగా మారి వేగంగా గుట్ట దిగువకు వెళ్లి పోయాడు.

ఆ విధంగా కర్కోటకుడు నిష్క్రమించాక భూతం ఘృతాచి కావలి తిరుగుతూండగా మిగిలిన రాత్రి ధనుంజయ భద్రా దేవిలు నిశ్చింతగా మండపం మీద నిద్ర పోయారు.

************************************

అది నాగ లోక రాజ మందిరం.

నాగ రాజు మహా పద్మడి అంత రంగిక సమావేశ మందిరం. అక్కడ నాగ రాజు ముందు తల వంచుకు నిల బడి వున్నాడు కర్కోటకుడు. రత్న గిరి యువ రాజు ధనుంజయుని జంపుటకు పోయి ఆ పని చేయ లేక మరలి వచ్చి తన అశక్తతను తెలియ జేసి తల వంచుకున్నాడు.

వింధ్యా సానువుల నుండి అంత క్రితమే నాగ లోకం చేరుకున్న కర్కోటకుడు నేరుగా రాజ దర్శనార్థం వచ్చాడు. ఆ సమయంలో కర్కోటకుని సోదరుడు తక్షకుడు అక్కడ వున్నాడు. ఇంకా నాగలకు పెద్ద వాసుకి, శంఖు పుత్రి తండ్రి శంఖచూడుడు, ఇంకా శంకుడు, మహా శంకుడు, గుళికుడు జిత్తుల మారిగా పేరు పొందిన మాయావి మహా గుళికుడు మొదలగు నాగ లోక ప్రముఖులంతా అక్కడే ఆసీనులయి వున్నారు.

నాగ రాజు వదనం గంభీరంగా వుంది.

అటు యిటు పచార్లు చేస్తున్నాడు.

కర్కోటకుడు కూడ విఫలుడై మరలి వచ్చుట అతనికి నమ్మ శక్యం గాకుండా వుంది. దివ్య నాగ మణి కోసం ధనుంజయుడు నాగ లోకం వరకు రాక ముందే అంతం చేయాలన్న తన లక్ష్యం నెర వేరేట్టు కన్పించటం లేదు. ఉన్నట్టుండి ఆగి అందరి వంక నిశితంగా చూసాడు.

''ఇది యేమి విపరీతమో తెలియ కున్నది. ఒక మానవుని జంపు వీరుడే మన నాగ లోకమున కరవైనాడా? ఒకరు కాదు యిద్దరు కాదు, పోయిన వారు తిరిగి రాలేదు. కర్కోటకుడంతటి వాడే చేత గాక యిదో... రిక్త హస్తముల మరలి వచ్చి మన ముందు శిరము వంచి నిలుచున్నాడు. ఏమి చేయ వలె. ఇక ఉపేక్షించి లాభము లేదు. స్వయముగ నేనే వెడలి ఆ మానవాధముని మట్టు బెట్టి వచ్చెద.'' అన్నాడు ఆవేశంగా.

“తప్పు మహా పద్మా!” అంటూ నాగ రాజు మాటల్ని వెంటనే ఖండించాడు వృద్ధుడైన వాసుకి.

“నీ అభిప్రాయము తప్పు. నీ పలుకులు సరి గాదు.” అన్నాడు తిరిగి తనే.నాగ లోకం లోని వృద్ధులలో ఒకడు, ప్రముఖుడైన వాసుకి మాటలను గురు వాక్యంగా భావిస్తారంతా. ఎదిరించే సాహసం చేయరు. అయితే తను నాగ లోకాధి పతి గాబట్టి వాసుకి తనను తప్పు బట్టడం మహా పద్ముడికి నచ్చ లేదు.

“ఏమంటిరి వాసుకి దేవా! నా అభిప్రాయము తప్పందురా? నా పలుకులు సరి కావా?” అనడిగాడు వెంటనే.

“ముమ్మాటికీ కాదు మహా పద్మా. మానవుల పై ఈ తేలిక అభిప్రాయము ఏలాగున ఏర్పడినది నీకు? మానవాధమునిగ నీవు పరిగణించుట సరియా? మానవులలో మహనీయు ఎందరు లేరు? నాడు ఉలూచి వరించి బభ్రు వాహనునికి జన్మ నిచ్చినది మానవ శ్రేష్టుడైన అర్జునుని వలన గాదా? వీరులను గౌరవించుట మన నాగ లోక సాంప్రదాయమే గదా. గతమున మన నాగ లోకమును దర్శించిన మానవ వీరుల గురించి మరచితివా? ధనుంజయుని రాక నీకు నచ్చనంత మాత్రమున అతడిని మానవాధముడని నిందించుట పాడి గాదు.” అంటూ హితోపదేశం చేసాడు వాసుకి.

ఆ హితవు నాగ రాజుకు రుచించ లేదు. అయిష్టంగా ముఖం ముడుచుకున్నాడు.

“గతము గూర్చి చర్చ ఏటికి మహోదయా! మన చర్చ వర్త మానమును గూర్చి గదా!” అన్నాడు.

“అయిన నేమి? వర్త మానమున సాంప్రదాయము మారినవా లేక చరిత్ర మాసి పోవునా. ఒక వీరుని చులకన జేసి వెడలి నీవునూ భంగ పడిన అది నీకు ఎంత అవమానమో వూహించితివా? అదియును గాక`

ధనుంజయుని వెంట అతని మిత్రుడైన బాలకుడు ఎవరో రక్షణగా వచ్చుచున్నాడని, అతడు శక్తివంతుడైన మంత్ర గాడని వింటి...”

“క్షమించండి మహోదయా” అంటూ వాసుకి మాటకు అడ్డు వచ్చాడు కర్కోటకుడు. ఏమిటన్నట్టు చూసాడు వాసుకి.

“ధనుంజయుని మిత్రుడు బాలకుడు కాదు, పురుష వేషము లోని బాలిక. యుక్త వయస్సు తరుణి. అమిత సౌందర్య వతి. నేనామెను దగ్గరగా జూచితి, సంభాషించితి. మహా తెలివైనది.” అంటూ వివరించాడు. కర్కోటకుని మాటలకు ఒక్క సారిగా నివ్వెర పోయారంతా.

నాగ రాజు ఆశ్చర్యానికి అంతు లేదు.

నాగాల ఓజో క్షుద్ర విద్యా ప్రయోగాన్ని తిప్పి కొట్టినది ఒక యువతియా! అతివలకు అంతటి శక్తి ఎలా అబ్బినది? నాగ రాజే కాదు, అచటి ప్రముఖులందరి మది లోను ఇవే ఆలోచనలు సుడి తిరుగుతున్నాయి.

“ఏమంటివి కర్కోటకా! అతడు అతడు కాదా? ఆమెయా? నిజముగా ఆమె యేనా?” నమ్మ లేనట్టు అడిగాడు నాగ రాజు.

“నేను చెప్పునది నిజము ప్రభు. ఆ బాలిక పేరు భద్రా దేవి. మహా మేధావి, చురుకైనది. ఆమె మంత్ర శక్తికి తిరుగు లేదు. అగ్నికి వాయువు తోడైనట్టు భద్రా దేవి ధనుంజయుని చెంత ఉండగా అతడిని ఎవరూ ఏమీ చేయ జాలరు. ఆపైన వారిరువురు ప్రేమికులు. ఇది చాలదన్నట్టు వారికి రక్షణగా ఒక భూతము కావలి కాయు చున్నది. దాని పేరు ఘృతాచి. ఆ భూతం గుట్ట పైకి పోకుండా నన్ను నిరోధించునపుడు జరిగిన యుద్ధంలో నాకు తగిలిన గాయములు ఇంకను బాధించు చున్నవి.” అంటూ తెలిపాడు కర్కోటకుడు.

ఆ మాటలు వింటూ ఒక్క సారిగా నిశ్శబ్దమై పోయారంతా. ఒక ఆడపిల్లకు ఇంతటి మంత్ర శక్తి ఎలా సిద్ధించినది? తీవ్రంగా ఆలోచిస్తున్నాడు తక్షకుడు. ఏదో సందేహం ఏర్పడి ఒక్క సారి కనులు మూసు కొని అంతర్ దృష్టిలో భద్రా దేవి గురించి అవలోకించాడు. తిరిగి కళ్ళు తెరవ గానే` “ఇప్పుడు తెలిసినది. ఆమె సామాన్యురాలు కాదు” అన్నాడు.

“అనగా అర్థమేమి?” వెంటనే అడిగాడు నాగ రాజు.

“ఒకప్పుడు మహా మంత్ర వేత్త యగు అగ్ని భట్టారకుని వంశమున జన్మించినది ఆమె. తండ్రి అరుణ భట్టారకుడు” అంటూ భద్రాదేవి గురించిన వివరములు చెప్పాడు తక్షకుడు. అంతే కాదు, తన వంశ మూలమగు అగ్ని భట్టారకుని ఆశయ సాధన కోసం కంకణ బద్ధు రాలయి ధనుంజయుని వెన్నంటి వస్తున్నదని కూడ తెలియ జేసాడు.

సాలోచనగా తల పంకించాడు నాగ రాజు. ఆ చర్చ ఇంకా కొన సాగేదేమో గాని ఇంతలో నాగ రాణి కీర్తిమతి హడా వుడిగా ఆ మందిరంలో అడుగు పెట్టడంతో చర్చ అంతటితో ఆగి పోయింది.

రాణి కీర్తి మతి వస్తూనే కళ వళ పడుతూ భర్త నాగ రాజు వంక చూసింది` ''ప్రభూ! మీ రాచ కార్యము పక్కన బెట్టి ఒక పరి గృహ విషయము జూచుట మంచిది'' అంది.

''ఏమంటివి దేవీ... గృహమున ఏమి జరిగినది?'' వెంటనే అడిగాడు నాగ రాజు.

''తమకు తెలియదా ప్రభూ? మన గారాల పట్టి ఉలూచీశ్వరి పది దినముల క్రిందట వింధ్యాటవికి విహారమునకు వెళ్ళినది. ఇంత వరకు తిరిగి రాలేదు. వెంట వెళ్ళిన చెలి కత్తియు నలుగురూ సంపంగి వన మందు సంచరిస్తున్నారని ఇప్పుడే తెలిసినది. వారితో యువరాణి లేదట. ఏమి జరిగినదో తెలియక కలవర పడుచుంటిని.'' అంది కీర్తి మతి.

''కలవరమేల దేవీ. మన ముద్దుల తనయ మదీయ వారసత్వమును, గుణమును పుణికి పుచ్చుకున్నది. ధైర్య సాహసములు ఆమె సొంతము. మానవుల వైపు కన్నెత్తి జూడదు.

అయిననూ ఆనాడే వన విహారమునకు వలదని వారించితిని. నీవే గదా ఈ తూరికి అనుమతించమని కోరితివి. ఇప్పుడీ ఆందోళన యేమిటి? ఏమి జరిగినదో చెలి కత్తెను బిలిపించి విచారించెదము గాక.'' అంటూ అంత వరకు చర్చలో పాల్గొన్న పెద్దలందరినీ పంపించేసాడు నాగ రాజు.

అప్పటి కప్పుడు` ఉలూచీశ్వరి చెలికత్తియను బిలుచుకు రమ్మని కొందరు రాజ భటులను సంపంగి వనానికి పంపించాడు.




తూర్పున బాల భానుడు తొంగి చూసే సమయానికి అశ్వాలు గరుడ, డాకినీలు వింధ్యా సానువుల్లోని మహా పథంలో ఉత్తరంగా చాలా దూరం వచ్చేసాయి. మరో యోజన దూరం ముందుకు పోతే వింధ్య పర్వతాలు దాటి హైహియ రాజ్య భూభాగంలో ప్రవేశిస్తాయి.

వేకువనే లేవగానే ముఖాలు కడుక్కొని మండపం నుండి బయలు దేరునపుడు భూతం ఘృతాచి విషయం వచ్చింది. భద్రా దేవి భూతాన్ని పిలిచి అడిగింది` ‘‘ఏమి! నీవు యిచటనే వుందువా? మాతో వత్తువా?’’ అని.

‘‘నేనిప్పుడు నీ యాజ్ఞా బద్ధు రాలిని తల్లీ. నేను మీ తోనే వత్తును. మీ ఆనతి నెర వేర్తును. కాని... నాకు రుధిరము.. మానవ రుధిరము కావలె.’’ అంది వినయంగా భూతం.

‘‘మాతో వచ్చిన నీకు కడుపార మానవ రుధిరము లభించదు. కాని అతి త్వరలోనే ఒక మహా సంగ్రామము ఘటిల్లనున్నది. ఆ సంగ్రామమందు నరుక్కు చచ్చే వీరుల రుధిరముతో నీకు గొప్ప విందు భోజనమే లభించ గలదు. అంత దనుక నీవు మృగముల రుధిరము త్రాగి మాతో ఉండ గలిగితే నా అభ్యంతరము లేదు. నీవును మాతో రావచ్చును’’ అంటూ సూచించింది భద్రా దేవి.

‘‘అటులనే తల్లీ. మీకు సాయ పడినటుల నుండు, అటులనే మహా సంగ్రామమున నా రుధిర దాహమును తీర గలదు. నేనును మీ

వెంట వత్తును.'' అంది భూతం.

ఆ భూతం తెచ్చిన చక్కటి ఫలములను ఆరగించి అశ్వాలనధిరోహించారు ధనుంజయ, భద్రాదేవిలు. భూతం ఘృతాచి అదృశ్య రూపాన మచ్చల గుర్రం మీది తోలు సంచిలో విశ్రాంతిగా పడుకుంది. అశ్వాలు గుట్ట దిగి పరుగు ఆరంభించాయి.

ఆ విధంగా సూర్యోదయ పూర్వమే ప్రయాణంలో వున్న ధనుంజయ భద్రాదేమలు సూర్యుడు తొంగి చూసే సమయానికి చాలా దూరం వింధ్య పర్వతాలను దాటేసారు. ఈ లోపల అటు నుంచి వస్తున్న వర్తకుల గుంపు ఒకటి ఎదురైంది. బాట సారులు కొందరు ఏవో శవాల గురించి ఆశ్చర్యంగా చర్చించు కొంటూ పోతూండటం కూడ విన్పించింది. ఆ శవాలు ఏమిటో ఎక్కడున్నాయో కూడ వివరాలు తెలీదు.

దిన కరుని అరుణ కిరణాల కాంతి వింధ్యాటవి అంతటా పరుచుకుంది. పక్షుల కిలకిలా రావాలు మృగాల అరుపులతో అడవంతా సందడిగా వుంది. పర్వత సానువులో ఎక్కడి నుంచో ఏనుగు ఘీంకార రావం విన వస్తోంది. శీతల గాలులు ఆహ్లాద కరంగా వీస్తున్నాయి.

క్రమంగా`

వింధ్య సానువు చివరి పర్వత పంక్తిని కూడ దాటుతున్నాయి అశ్వాలు. అలా దాటు తూండగా ఎగువన కొంత దూరంలో బాట సారుల గుంపు ఒకటి ముక్కు మూసుకుని ఎడమ ప్రక్కగ చెట్టు కిందకు భయం భయంగా చూస్తూ బెదరి వడి వడిగా పరుగు తీసి వస్తూండటం చూసి ధనుంజయ భద్రా దేమలు ఆశ్చర్య పోయారు.

అంతకు ముందే ఎగువన వస్తూండగా శవాల గురించి విని వున్నారు గాబట్టి బాహుశ ఆ చెట్టు కిందే శవాలు ఉండొచ్చని వూహించారు. ఆ వృక్షాన్ని సమీపించగానే అశ్వాలను నెమ్మదించారు. ఒకటి కాదు రెండు కాదు`

ఆరుగురు వ్యక్తుల శవాలు అక్కడ అడ్డ దిడ్డంగా పడి ఉబ్బి వున్నాయి. అక్కడ ఎలాంటి యుద్ధం గాని పోరాటం గాని జరిగిన గుర్తులు లేవు. వారి ఆయుధాలు ఒరల్లోనే వున్నాయి. శవాల వంటి మీద చిన్న గాయం కూడ కన్పించటం లేదు. కాని కాలి పోయినట్టు శవాన్నీ నల్లగా మాడి పోయి వున్నాయి. ఆశ్చర్య కరమగు విషయం ఏమంటే` అటవీ ప్రాంతం గాబట్టి శవం దొరికితే చాలు మృగాలు, పక్షులు పీక్కు తినేస్తాయి. అలాంటిది ఒక్క ప్రాణి కూడ శవాలను ముట్టక పోవటం విస్మయం గొలుపుతోంది. ఇదే

విషయం భద్రా దేవిని అడిగినపుడు ఆమె చెప్పిన సమాధానం ధనుంజయుని విస్మయానికి గురి చేసింది.

''సందేహం లేదు ప్రభూ! వీరందరూ పాము కాటుతో మరణించారు. ఒకటి కాదు రెండు కాదు, అనేక విషనాగులు మూకుమ్మడిగా వీళ్ళ మీద దాడి చేసి వుండాలి. మృత దేహాలు భయంకర విష తుల్యం అయి పోయాయి. అందుకే పక్షులు గాని మృగాలు గాని శవాల జోలికి పోలేదు.'' అంది.

తన మచ్చల గుర్రం దిగింది భద్రా దేవి. తనూ అశ్వం దిగాడు ధనుంజయుడు. శవాలు కుళ్ళటం మొదలై దుర్వాసన ఆరంభమైంది. బహుశ రెండు లేదా మూడు రోజుల క్రిందట వీళ్ళంతా మరణించి వుండాలనుకుంది భద్రా దేవి.

ముక్కుకు గుడ్డ చుట్టు కొని దుర్వాసన తగలకుండా గాలి వాటుకు ఎగువన నిల బడి శవాల్ని పరిశీలించారు. లెక్క పెట్టి నట్టు ఆరుగురు వున్నారు వాళ్ళు. భద్రా దేవి తీవ్రంగా ఆలోచిస్తోంది. సహ్యాద్రి మీద దాడి చేసింది ఆరుగురు, మాళవ సరి హద్దు వద్ద కాపు వేసి భల్లాతకుడికి చిక్కిన వాళ్ళు ఆరుగురు. ఇప్పుడిక్కడ చచ్చి పడున్న వాళ్ళు ఆరుగురు. వీళ్ళు మూడో బృందం కాదు గదా!

భద్రా దేవి ఒక పొడవాటి కొయ్య ముక్కను అందుకొని శవాలకు మరింత దగ్గరగా వెళ్ళింది. కొయ్యతో లేపి వాళ్ళ చేతి మణి కట్టును పరిశీలించింది. శవాలు నల్లగా మాడి పోయినా మణి కట్టు మీది రెక్కలు విప్పిన డేగ గుర్తును గమనించగానే భద్రా దేవి సందేహం తీరి పోయింది. ధనుంజయుడు కూడ చూసాడు. అనుమానంతో చుట్టూ చూసింది భద్రా దేవి. బాటసాయి ఎవరో మేతలేక చస్తాయని జాలి పడి హతుల తాలూకు అశ్వాల బంధనాలు త్రించినట్టున్నారు. అవి సమీపం లోనే తిరుగాడుతూ పచ్చిక మేస్తున్నాయి. అవి రత్నగిరి రాజ చిహ్నాం కలిగి వున్నందున వాటిని తీసుకు పోవటానికి భయ పడి వుంటారు. అదియును గాక ఆ ప్రదేశం సర్ప భూమి గావచ్చునన్న భయంతో వేగిరం ముందుకు సాగి పోయి వుంటారు.

హతులంతా ఉప సైన్యాధక్షుడు బాహ్లీకుని సొంత గూఢచార విభాగానికి చెందిన వారు. సందేహమే లేదు. వీళ్ళు వింధ్యాటవిలో ఎక్కడో ధనుంజయుని కోసం కాపు వేసి వుంటారని ముందుగా వూహించిందే. అయినప్పటికీ వాళ్ళు ఇక్కడే ఎదురు చూస్తుండటం విష సర్పాలు దాడి చేసి వీళ్ళని హత మార్చటం అర్థం గాకుండా వుంది. అవి ఎందుకీ పని చేసాయి? ఏమి జరిగి వుంటుందని ఆలోచిస్తున్న భద్రా దేవి పెదవుల మీద ఉన్నట్టుండి నెల వంకలా మెరిసింది ఒక చిరు నవ్వు.

''ఏమైనది భద్రా! ఆ దరహాసమేటికి? వీరంతా బాహ్లీకుని మనుషుని అర్థమైనది గాని వీళ్ళ మరణము కడు విచిత్రముగ నున్నది.'' అనడిగాడు ధనుంజయుడు.

భద్రా దేవి ముసి ముసిగా నవ్వింది.

“ఇందులో విచిత్రమేమియు లేదులే ప్రభూ!” అంటూ తన అశ్వం వైపు దారి తీసింది.

“ఇది విచిత్రము కాదందువా?” ఆమెను అనుసరిస్తూ అడిగాడు.

“కాదంటిని గదా. మీకు కావలసిన వారే మీ మేలు కోరి మీ శత్రువును హత మార్చి వుందురు.”

“ఏమి ఈ వింత! ఇచట నాకు కావలసిన వారు ఎవరున్నారని?”

“ఉండియే వుంటారు. తిన బోతూ రుచి అడుగనేల? బయలు దేరండి.” అంటూ తన మచ్చల గుర్రాన్ని అధిరోహించి కళ్ళాలు అందుకుంది భద్రా దేవి.

ధనుంజయుడు తన శ్వేతాశ్వం గరుడ నధిరోహించి కళ్ళాలు అందుకుని అశ్వాన్ని అదిలించాడు. ఎంత యోచించినా భద్రా దేవి మాటలు అతనికి అర్థం కావటం లేదు. ఈ లోప సుమారు పది దినాలుగా ఎవరి కోసమైతే అచట బాట పక్కన పూ పొదలో ఎదురు చూస్తున్నారో ఆ ధనుంజయుని దూరంగా వుండగానే గుర్తించారు నాగ లోక యువ రాణి ఉలూచీశ్వరి, శంఖు పుత్రి యిరువురూ. చెట్టు వద్ద ఆగటం కూడ చూసారు. ఉలూచీశ్వరి ఆనందానికి హద్దు లేదు.

ధనుంజయుని గుర్తించారు గాని పక్కన మచ్చల గుర్రం మీది పురుష వేషంలో భద్రా దేవి ఎవరో అర్థం కాలేదు. అతడెవరో బాలకుడనుకున్నారు. ధనుంజయుడు ఒంటరిగా ఉంటేనే ఉలూచీశ్వరి అతన్ని కలుసుకో గలదు. పక్కన మరో పురుషుడుండగా ఎలా ముందుకెళ్ళేది.

“అత్తా! ఇప్పుడేమి చేయ వలె?” అంటూ బేలగా తనను అడుగుతున్న ఉూచీశ్వరిని చూసి నవ్వింది శంఖు పుత్రి.

“ఈ సంకోచమేలనమ్మ ఉలూచి. ప్రేమికులకు సిగ్గు భయము ఉండవంటారు గదా. అవి నిన్ను వదిలినట్టు లేదే. ఎదురు చూసిన శుభ ఘడియలు రాగానే ఇలా బెదురు యేల?” అంది

“ఇది బెదురు కాదులే అత్తా. ధనుంజయుల వారి పక్కన మరో పురుషుడున్నాడు. వారి ముందుకెలా పోగలను?” అంది ఉలూచిశ్వరి.

“నీవు పోనవసరము లేదు. జగదేక సుందరివి నిన్ను వెతుకుచూ తనే వచ్చును. ఏదో విధముగ ఆ బాలకుడ్ని నేను ఆపెదను. నీవు త్వరితముగ కొంత దూరము ఎగవకు పొమ్ము. బాట పక్కనున్న పొన్న చెట్టు క్రింద అతడి రాక కోసం ఎదురు చూడుము. పొమ్ము.” అంది శంఖు పుత్రి. వెంటనే ఉలూచిశ్వరి తన సహజ రూపమైన శ్వేత నాగుగా మారి బిర బిరా ఎగువకు వెళ్ళి పోయింది. ఇక ధనుంజయునికి ఎదురు వెళ్ళుటకు ఇటు బయలు దేరింది శంఖు పుత్రి.

****************************

అశ్వాలు జముగా పరుగు తీస్తున్నాయి.

తన సంశయం తీరక ఉక్కిరి బిక్కిరవుతున్న ధనుంజయుడు భద్రా దేవి వంక చూసాడు. “దేవీ! యోచన యందు నీయంత చురుకు దనము నాకు లేదు గాని ఆ శవాల గుట్టు విప్పవా? నాకు కావలసిన వారే ఆ పని జేసి నారన? ఎవరు వారు?” అనడిగాడు.

ముసి ముసిగా నవ్వింది భద్రా దేవి.

దిన కరుని పసిడి కిరణాలకు మరింత శోభాయమానంగా ప్రకాశిస్తోంది ఆమె ముఖారవిందం. ఆమె పగడాల అధరాల మీద మురిపించే దర హాసమునకు మరింత ఉడుక్కున్నాడు ధనుంజయుడు.

“ఆ నవ్వునకర్థమేమి? నాకు చెప్ప కూడదా?” అనడిగాడు.

‘‘చెప్పుటకేమున్నది ప్రభూ! మీ హృదయ రాణి ఉలూచీశ్వరిని మరచితిరా?’’ అంది.

‘‘అది యేమి పరిహాసము. నీవు మాత్రము నా హృదయ రాణివి గాదా? అయినను పరిచయమే లేని ఆమె ప్రస్తావన ఇప్పుడేల?’’

‘‘ఇప్పుడు పరిచయమగునులే.’’

‘‘ఇప్పుడా... అసంభవము గదా. ఎక్కడో డాకినీ వనమున ఆమెను గాంచితి. ఆమె ఈ వింధ్యాటవికేల వచ్చును.’’

‘‘ఏమి? రాకూడదా? నేను రాలేదా? వలచిన వనిత జంట కోరి ఎంతటి దూరమైనను రాగలదు. ఎంతటి సాహసమైనను వెను దీయదు. నా అంచనా తప్పదు ప్రభు. ఆమె మనకు సమీపం లోనే వున్నది...’’

అప్పటి గ్గాని భద్రా దేవి అభిప్రాయం ఏమిటో ధనుంజయునికి అర్థం కాలేదు. సంభ్రమాశ్చర్యాలకు గురై పరిసరాల మీద దృష్టి సారించాడు. ‘‘అంటే... ఆ గూఢ చార బృందం ఆరుగుర్నీ ఉలూచీశ్వరి పరి మార్చి వుంటుందంటావా?’’ అనడిగాడు.

‘‘అవును ప్రభు. మీ రాక కోసం ఆమె కూడ ఈ పరిసరాలలోనే నిరీక్షిస్తుండగా ఆ ముష్కరుల్ని గమనించి ఉంటుంది. వారు మీకు శత్రువులని గ్రహించి అంతం జేసి వుండును.’’

‘‘నీ మాటలు నిక్కమైనచో ఏదీ... ఎక్కడా ఆమె కనబడదే.’’ అంటూ ఎద్దేవా చేసాడు ధనుంజయుడు. ఇంతలో `

ఎగువన తమకు ఎదురు వస్తున్న ఒక వృద్ధు రాలిని చూసారు ఇరువురూ. చూడ గానే విస్మయం చెందారు. ఎందుకంటే` కొన్ని లిప్తల క్రితం వరకు నిర్మానుష్యంగా వున్న బాట మీదకు ఇప్పటి కప్పుడు ఆ పండు ముసలి ఎప్పుడు ఎలా వచ్చిందో అర్థం కాలేదు. క్రమంగా ఆమె తమను సమీపిస్తోంది.

శతాధిక వృద్ధురాలామె. తను ముగ్గు బుట్టలా పండి పోయింది.

నడుం వంగి పోయింది.

చేతి కర్ర ఆధారంగా వంగి నడుస్తోంది.

అయినా చక్కని ముదురాకు పచ్చ చీర ధరించింది. నుదుట కుంకుమ బొట్టు, చేతులకు గాజులు, వంటి మీద నగలు ఆమెకు వింత కళను ఆపాదిస్తున్నాయి. బోసి నోరు తాటిస్తూ కళ్ళకు చేయి అడ్డం పెట్టుకుని అశ్వాల మీది ఇరువురినీ చూస్తోంది.

ఎవరా ముదుసలి?

ఆమెకు భయమే లేదా?

వంటి మీద మణి మయ ఆ భూషణాదులతో ఒక చేయి నడుం మీద ఉంచు కుని ఒక చేత్తో కర్ర తాటిస్తూ నిర్భయంగా బాట మీద వస్తోంది. వెంట ఎవరూ లేరు. తమ కళ్ళను తామే నమ్మ లేనట్టు ఆమెనే చూస్తున్నారు. కాని ఆ వృద్ధు రాలి చూపు పురుష వేషంలోని భద్రా దేవి మీదే వున్నాయి. అలాగే ధనుంజయుని చూస్తోంది.

ఎక్కడో ` నాగాల ఓజో క్షుద్ర విద్యా ప్రయోగ మందు ధూమ నాళికలో ధనుంజయుని జూసింది. ఇప్పుడు ఎదురుగా ప్రత్యక్షంగా చూస్తోంది. ద్వి శతాధిక వయస్కురాలయిన తనకే మరులూరిస్తున్న సుందరాకారుడు ధనుంజయుడు. ఇక ఉలూచీశ్వరి తొలి చూపు లోనే ఇతడ్ని వరించుటలో ఆశ్చర్యం ఏమున్నది? అనుకుంది వృద్ధ నారి రూపం లోని శంఖు పుత్రి.

అశ్వాలు తనను సమీపించటంతో `

ఉన్నట్టుంటి తన చేతి కర్రను `

మచ్చల గుర్రానికి అడ్డంగా చాస్తూ`

బాట మధ్యకు వచ్చేసింది.

''ఇదిగో మనవడా! ఆగుమురా తండ్రీ. నీ కొరకు నేను వచ్చుచుండ నీవేమిరా నను జూడనట్టు పోతుంటివి. ఆగుము.'' అంటూ బోసి నోరు తాటిస్తూ అరిచింది.

కళ్ళాలు బిగించి`

అశ్వాలు నిలిపారు ధనుంజయ, భద్రా దేవిలు. నిజం గానే అపర్ణుడిగా తిరిగే భద్రా దేవికి ఆ వృద్ధురాలు తెలుసేమో అనుకున్నాడు ధనుంజయుడు. మొదట భద్రా దేవికీ అర్థం కాలేదు. తర్వాత ఏదో సందేహం వచ్చి ధనుంజయుని వంక చూసింది.

''అపర్ణా! ఈమె నీకు పరియస్థు రాలేనా?'' అనడిగాడు ధనుంజయుడు.

''అవును ప్రభూ! ఎవరో అనుకుంటిగాని ఈమె నాకు బాగుగా పరిచయమున్న బామ్మ గారే'' అంది భద్రా దేవి.




''అవున్నాయనా. యువరాజా వారు మీరు ఆగుటెందుకు పదండి. మనవడితో కాసేపు ముచ్చటించి, మీ వెనకే పంపించెదను.'' అంది శంఖు పుత్రి.

''అవును ప్రభు. ఈ బామ్మ యోగ క్షేమములరసి మీ వెనకే వచ్చి చేరుకొందును. మీరు ముందుకు సాగండి.'' అంది వృద్ధు రాలి మాటల్ని సమర్థిస్తూ భద్రా దేవి.

''కాని భద్రా... నీవే కాదు, నేను యువ రాజునని కూడ ఈమెకు తెలిసింది. ఇంతకూ ఎవరీమె?'' సందేహిస్తూ అడిగాడు ధనుంజయుడు.

''నేను వచ్చి తెలిపెదనులే ప్రభు. సంశయ మొందక మీరు సాగండి.'' అంది భద్రా దేవి.

ఇక ఏం మాట్లాడాలో తెలీక`

ఓ సారి యిద్దరి వంక జూచి` కళ్ళాలు బిగించి అశ్వాన్ని అదలించాడు. ధనుంజయుని అశ్వం దూరం కాగానే మచ్చల గుర్రం మీది భద్రా దేవి వంక చూసింది వృద్ధు రాలు.

"ఊఁ!     చెప్పవే ముసలి దానా. నీవు నా బామ్మవా... నేను నీ మనవడినా... ఏనాటి బంధము మనది?" పరిహాసంగా అడిగింది భద్రా దేవి.

"మనది ఈనాటి బంధమే లేవే గడుగ్గాయి. పురుష వేషం లోని పరువాల బొమ్మవి. ఓ సారి అశ్వం దిగి నీ వివరములు వినిపించ రాదూ?" అనడిగింది ముసలి వేషం లోని శంఖు పుత్రి.

"ఆహాఁ! వృద్ధ నారిగా దర్శన మిచ్చిన నాగ వనితవు. ముందుగా నీవే నిజ రూపం చూపించ వచ్చు గదా!" అంటూ అశ్వం దిగింది భద్రా దేవి.

ఆ పలుకులకు ఉలికి పడింది శంఖు పుత్రి.

ఎదురుగా వున్నది సామాన్య బాలిక కాదని ఆవులిస్తే ప్రేవు లెక్కించగల సమర్థు రాలని గ్రహించింది. వెంటనే తన వృద్ధ రూపం వదిలి శంఖు పుత్రిగా మారి పోయింది. ఆమె అసలు రూపం గాంచి విభ్రాంతు రాలయింది భద్రా దేవి. ఆమె అశ్వం బెదరి నాలుగడుగులు వెనక్కి వేసింది.

ఆమె నడుం పై వరకు సుందర మైన ప్రౌఢ స్త్రీ రూపం, నడుం నుండి క్రింది శరీరం సర్ప రూపం. బాట మీద చుట్ట చుట్టు కొని పైకి లేచి భద్రా దేవిని చిరునవ్వుతో చూసింది శంఖు పుత్రి. భద్రా దేవి ఆ విచిత్ర రూపాన్ని వింతగా జూచింది.

"నను జూచినావు గదా. నాగ లోక స్త్రీని. నన్ను శంఖు పుత్రి అంటారు. అసలు నామ ధేయం మధూలిక. ఇక చెప్పు! నీ సంగతేమి? ధనుంజయునితో నీ సంబంధమేమి? పురుష వేషంలో అతన్ని వెన్నంటి రానేల?" అనడిగింది.

ఆమె ప్రశ్నల్లో ఒక్క దానికీ సమాధానం చెప్పకుండా భద్రా దేవి అడిగిన ప్రశ్న ` ‘‘మీ యువ రాణి నాగ కుమారి ఉలూచీశ్వరి ఎక్కడ వున్నది?’’ అని.

ఆ ప్రశ్న శంఖు పుత్రిని మరో సారి విస్మయ పరచింది. ఉలూచీశ్వరి గురించి ఈమెకు ఎలా తెలుసు? అంటే... తెలుసు గాబట్టే తన పథకం గ్రహించి తన మాటలు సమర్థించి ధనుంజయుని ముందుకు సాగమని ప్రోత్సహించి వుండాలి. అసలు ధనుంజయుని అంతరంగిక విషయాలు ఈ అమ్మాయికి ఎలా తెలుసు? ఎవరీమె?

‘‘అతిగా ఆలోచించకు శంఖు పుత్రి. ఉలూచీశ్వరి తప్పక వచ్చునను నమ్మిక మాకున్నది. ధనుంజయుని జంపుటకు కాపు వేసిన వైరి వర్గం ఆరుగురినీ తుద ముట్టించటం చూడ గానే అనుమానించితి. యువ రాణి ఈ సమీపమందే ఉండునని. మా వూహ నిజమైనది. నీవు ఎవరు? ఉలూచీశ్వరి చెలి కత్తెవా?’ అనడిగింది భద్రా దేవి.

‘‘నీ నామ ధేయమేమి?’’ అడిగింది శంఖు పుత్రి.

‘‘నను భద్రా దేవి అంటారు. పురుష వేషమున అపర్ణుడని పిలిచెదరు.’’

‘‘చూడుము భద్రా దేవి. నేను యువ రాణి చెలి కత్తియను గాను. ఆమెకు వరుసకు అత్తయగుదును. నా వయసు రెండు వంద యాభై వత్సరముల పై మాటే ’’ అంటూ జరిగిందంతా వివరించింది శంఖు పుత్రి.

‘‘నీవు సందేహింప పనిలేదు. నీ వివరములు తెలిపిన సంతసించెద ’’ అంది.

ఇక ఏదీ దాచకుండా తన గురించి`

శంఖు పుత్రికి వివరిస్తూ బాట పక్కన వృక్ష ఛాయ లోకి దారి తీసింది భద్రా దేవి. ఆమెననుసరించింది శంఖు పుత్రి.

******************************

నాగ లోకం!

అది నేరస్తులను బంధించి శిక్షలు అమలు చేయు కారాగారం. అనేక మంది అక్కడ చెరసాలలో మ్రగ్గుతున్నారు. ఆ శిక్షా విభాగం మొత్తం రాతి కట్టడం. చాలా పొడవుగా విశాలంగా వుండి అటు యిటు కట కటాలతో అనేక గదులున్నాయి. మధ్యలో వరుసగా వున్న రాతి స్థంబాలకు కొందరిని గొలుసులతో బంధించి ఉంచారు. బలిష్టులైన భటులు వారిని కొరడాలతో బాదుతున్నారు. నేరస్తుల ఆక్రందనలతో ఆ ప్రాంతం మారు మ్రోగుతోంది.

గోడకు తగిలించిన కాగడాలు అక్కడి చీకట్లను పారద్రోలుతున్నాయి. అక్కడి కారాగారాల్లో మ్రగ్గుచున్న వారంతా నాగ లోక వాసులే గావటం విశేషం. అందునా వారంతా పురుషులే. వారిలో ఎక్కువ శాతం మంది మానవులతో సంబంధాలు కలిగి వుండటమే వారు చేసిన నేరం. మానవ స్ర్తీతో సంబంధం కలిగి వుండటం మహా నేరం. కొరడా దెబ్బలు తింటున్న పురుషులంతా మానవ స్త్రీలను ప్రేమించి పట్టు బడి కారాగారానికి తేబడిన వారే.

అదే స్త్రీలయితే వారు ప్రేమించిన మానవులని అంతం చేసి ఆ స్త్రీని నాగ లోకం నుండి బహిష్కరిస్తారు. ఆ విధంగా వెలి వేయ బడినదే శంఖు పుత్రి. తనకు సమీప బంధువు, ఆప్తుడని కూడ చూడకుండా శంఖు చూడుని కుమార్తె మధూలికయను శంఖు పుత్రిని తమ లోకం నుండి ఏనాడో బహిష్కరించాడు నాగ రేడు మహా పద్ముడు. ఇతని తండ్రి పద్ముడు నాగ రాజుగా వున్న కాలంలో శిక్షలు ఇంత కఠినంగా లేవు. మానవ ద్వేషి అయిన మహా పద్ముడి హయాం ఆరంభమయ్యాకే ఇలా పరిస్థితులు మారాయి.

మహా పద్ముడు ప్రస్తుతం ఆ కారాగారంలో శిక్షలు ఎలా అమలు జరుగుతున్నాయో పరిశీలిస్తున్నాడు. ఆ సమయంలో సంపంగి వనానికి వెళ్ళిన భటులు తిరిగి వచ్చి మహా పద్ముడ్ని దర్శించారు. పరి చారికలు నలుగుర్నీ తెచ్చి విచారణ మందిరంలో ఉంచినట్టు తెలియ పర్చారు. వెంటనే అక్కడికి బయలు దేరాడు మహా పద్ముడు.

నాగ లోకమునకు పైన`

ఎక్కడో మర్మ భూమి యందుగ సంపంగి వనానికి పోయి వచ్చుటకు ఒక పూట పడుతుంది. కాబట్టి ఈ లోపల రాచ కార్యాలు జూచుకొని కారాగార పరిశీలనకు వచ్చాడు నాగ రాజు. అంతలో ఉలూచీశ్వరి చెలికత్తియలు నలుగురూ గొని రాబడిన వార్త విని

సరాసరి అచటికి బయలుదేరాడు.

అనేక కక్ష్యలను దాటు కొంటూ `

తన రాజ మందిరాన్ని అనుకొని వున్న `

విచారణ మందిరానికి చేరుకున్నాడు.

అప్పటికే అచట మహా రాణి కీర్తి మతి అతడి రాక కోసం ఎదురు చూస్తోంది. మహా పద్మడు లోనకు రాగానే విచారణ మందిర కవాటాలు మూయ బడ్డాయి.

విశాలమైన ఆ మందిరంలో సుఖాశీనురాలై వుంది రాణి కీర్తి మతి. ఎదురుగా ఒక పక్కన శిరస్సు వంచుకొని నేల చూపులు చూస్తూ వరుసగా నిలబడున్నారు యువ రాణి చెలి కత్తియలు నలుగురూ.

ఆ మందిరం నాలుగు మూలలా నలుగురు స్త్రీలు చేతుల యందు ధరించి వున్న మణుల కాంతులతో పట్ట పగల్లా ఉందక్కడ. ఆ స్త్రీలు నడుం వరకు సర్ప రూపం పైన మానవ స్త్రీ రూపంతో వున్నారు. నరులతో క్రీడించినందు గ్గాను వారిని బహిష్కరించకుండా దాసీలు గా విధింప బడిన శిక్షలు అనుభవిస్తున్నారు ఆ అభాగినులు.

పెద్ద పెద్ద అంగలతో గంభీరంగా లోనకు వచ్చిన నాగ రేడు తన రాణిని కూడ పలకరించకుండా చెలి కత్తియలు నలుగుర్నీ నిశితంగా చూసాడు.

వారంతా భయ కంపితులై `

గజ గజ వణుకుతూ `

నేల చూపులు చూస్తున్నారు. యువ రాణి ఉలూచీశ్వరి చెలికత్తెలు నలుగురూ. ఇప్పుడు వారి ముందున్న ప్రధాన సమస్య తమ గారాల పుత్రిక ఉలూచీశ్వరి ఒంటిగా ఎక్కడికి పోయినది? ఎచట వున్నది?

రాణి కీర్తి మతి తమ గారాల తనయ గురించి చాలా ఆందోళన చెందుతోంది. భర్త వున్న మూలంగా సమస్య ఆయనకు వదలి మౌనంగా చూస్తోంది.

వచ్చిన వెంటనే చెలి కత్తియల్ని ప్రశ్నించ లేదు నాగ రేడు. అందుక్కారణం కోపం... ఆగ్రహం ముంచుకొస్తోంది. ఇలాంటి సమయంలో కోపం సహజం. కాని కోపం బుద్ధిని మందగింప జేసి ఆలోచనల్ని పక్క దారి పట్టిస్తుంది. అందుకే కోపాన్ని అదుపు జేసుకునేందుకు కొన్ని లిప్తల కాలం అటు యిటు పచార్లు చేసాడు. పిమ్మట ఆగి నిశితంగా ఆ నలుగురు యువతుల్ని వీక్షించాడు. బహుశ అసలు విషయం వీళ్ళకీ తెలిసి ఉండక పోవచ్చు. వీళ్ళను శిక్షించి ప్రయోజనం లేదు. శాంతంగా అడిగి జరిగిన దేమిటో తెలుసు కోవాలి.

''అమ్మాయిలూ! మీరు అనవసరంగా భయ పడుచున్నారనుకొందును. ఇందులో మీ దోష మెంతయో మాకు తెలియదు. ఇప్పుడు మాకు తెలియాల్సింది మా తనూజ జాడ. చెప్పండి, ఏమి జరిగినది? తను ఒంటిగా ఎచటకు పోయినది? ఎప్పుడు వచ్చును?'' అంటూ శాంత గంభీర స్వరంతో ప్రశ్నించాడు.

నాగ రాజు మాటలు చెలి కత్తె భయాన్ని కొంత పోగొట్టాయి. అయినా పెదవి విప్పేంతగా ధైర్యం చాల్లేదు ఎవరికీ.

''ఇంకనూ భయమేల? మీరుగా యువ రాణిని విడిచి ఉండరని మాకు తెలుసు. తనే మిమ్మల్ని సంపంగి వనమున వేచి వుండమని వెడలి వుండ వచ్చు. అభయ మిచ్చితిని గదా. మాటలాడవలె. ఏమి జరిగె?'' తిరిగి అడిగాడు.

అప్పుడు`

ఒక చెలి కత్తియ ధైర్యం చెంది ముందుకొచ్చింది. ''క్షమించండి ప్రభూ! ఏమి జరిగినదో నిక్కముగా మాకును తెలియదు. వింధ్యాటవికనే మేము బయల్వెడలితిమి. మార్గమున కొంత తడవు సంపంగి వనమున ఆగితిమి. అప్పుడు తను తిరిగి వచ్చు వరకు అచటనే వేచి వుండమని ఆజ్ఞాపించి యువ రాణి వారు మేము ఎంతగా వేడు కున్నా వినక ఒంటిగా ఎటకో వెళ్ళినారు.

ఒకటి కాదు రెండు కాదు వెడలి పది దినము లైనను తిరిగి రాలేదు. మాకు ఏమి చేయ వలెనో దిక్కు తోచక సంపంగి వనమందే గ్రుమ్మరు చుంటిమి.'' అని సవినయంగా మనవి చేసింది.

తను వూహించిందే జరిగింది.

నాగ రేడు భృకుడి ముడిచి`

తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

''తన ప్రయాణ మెచటికో మీతో చెప్పనే లేదా?'' అడిగాడు.

''లేదు ప్రభూ! చెప్పనేలేదు... కాని...'' అంటూ అర్ధోక్తి లోనే ఆగి పోయింది మరో యువతి.

''ఊఁ...! కాని...? మీరిక దాచ పని లేదు. చెప్పుము బాలికా ఏమైనది?''

''మేము క్రిందటి సారి ఢాకినీ వన విహారము చేయునపుడు ఒక విశేషము జరిగినది.''

''విశేషమా... ఏమది? దానికిని ఇప్పుడు మా పుత్రిక ఒంటిగ ఏగుటకు సంబంధమేమి? తను ఢాకినీ వనమునకే పోయి వుండునా?''

''ఇప్పుడు పోయినది ఎటకో మాకును తెలియదు ప్రభు. కాని నాటి సంఘటనకు ఇప్పుడు యువరాణి వారు వెళ్ళుటకు సంబంధముండునని మా సందేహము ప్రభు.''

''నాడు ఏమి సంఘటిల్లినది? ముందుగా ఆ విశేషము చెప్పండి.''

“నాడు యువ రాణీ వారిని ఓ గరుడ పక్షి తరుమగా అప్పుడు సుందరాకారుడైన ఓ యువకుడు బాణమేసి ఆ పక్షిని సంహరించి కాపాడినాడు. మన్మధాకారుడైన ఆ వీరుని గాంచినది మొదలు యువ రాణి వారి మనసు అతడి యందు లగ్న మైనది. అతడు వెడలి పోయినాడు. కాని తన మనసు అతడి యందు లగ్నమై యువ రాణి వారు వ్యధనొందినారు. వారి బాధ చూడ లేక మేము సంపంగి వన మందే ఆగితిమి.”

ఆ మాటలు విని`

రాజ దంపతులు ముఖ ముఖాలు చూసుకున్నారు. తమకు ఇంత వరకు తెలియని విషయమిది.

“ఇంతకూ ఎవరా యువ వీరుడు? గంధర్వుడా? కిన్నెరుడా? లేక ఇంద్రాది దేవతలు వశించు స్వర్గ లోకమునకు చెందిన వాడా?” అడిగాడు.

“అతడు దివిజుడు గాడు ప్రభు. భూమికి చెందినవాడు. మానవ వీరుడు.”

“ఏమంటివి? మానవ వీరుడా!” ముఖం మాడ్చుకుని చిదరించుకొంటూ ఈసడింపుగా చూసాడు నాగ రాజు.

“అవును ప్రభూ! నిక్కముగా అతడు మానవుడే. కాని దివిజును సైతం ధిక్కరించు మేటి అంద గాడు.”

“చాలు నీ అధిక ప్రసంగము.” అంటూ కోపోద్రక్తుడై అరిచాడు నాగ రాజు.

“మాకు మానవుల పొడ గిట్టదని తెలిసి కూడ పొగడుటకు నీకు ఎంత ధైర్యం?” హుంకరించాడు.

గజ గజ వణికి పోయిందా చెలి కత్తె.




“క్షమించండి ప్రభూ. పొర బాటున నోరు జారితి.” అంటూ చేతులు జోడించి ప్రార్థించింది.

“సరి సరి. పిదప ఏమి జరిగినది? ఆ మానవుడు మా తనయను వీక్షించినాడా?” అడిగాడు.

“అవును ప్రభూ.”

“ఉలూచీశ్వరి అతన్ని జూచినదా?”

“అవును ప్రభూ.”

“ఇరువురూ సంభాషించినారా?”

“లేదు ప్రభూ లేదు. వెంటనే శ్వేత నాగు గా మారిన యువ రాణి వారిని గుర్తించ నేరక తన దారిన వెడలి పోయినాడు అతడు.”

‘‘పిమ్మట ఏమైనది?’’

‘‘మేము నాగ లోకమునకు మరలితిమి. కాని యువ రాణీ వారు మన లోకమునకు రాక` సంపంగి వనమునే తన ప్రియుని కొరకు విరహమున పొగిలిరి. వారికి అనేక ఉప చర్య లొనర్చి సేద తీర్చితిమి.’’

‘‘ఇంతకూ ఎవరా మానవుడు? తెలిసినదా?’’

‘‘లేదు ప్రభూ! కాని శంఖు పుత్రి కి తెలుసని మా సంశయము.’’

‘‘శంఖు పుత్రి...? తను మా తనయను కలిసినదా?’’ అవునన్నట్టు తలూపారంతా.‘‘సంపంగి వనమున ఉండగా ఆమె మా చెంత కొచ్చి ఏకాంతమున యువ రాణీ వారితో చాలా సేపు ముచ్చటించినది. ఆమె వెళ్ళిన తర్వాత యువ రాణీ వారు ఉత్సాహమున మా వెంట యిటకు వచ్చినారు. మాకు ఆ వీరుని వివరములు తెలియవు గాని అతడి అశ్వము శ్వేత వర్ణమున ఇంద్రుని ఉఛ్చైశ్వర తురగము వలె నున్నది. కాని దాని జూలు, తోక భాగము కాటుక వలె చిక్కని నలుపు... ’’

‘‘ఆగాగు.... ఆగుము.’’ అంటూ ఆమెను వారించాడు నాగ రాజు.

ఆమె మాటలకు మహా పద్మునికి రాకూడని అనుమానమే వచ్చింది. ఆ అశ్వము ధనుంజయుని అశ్వముగా తను విని వున్నాడు. అతడు రత్న గిరి యువ రాజు ధనుంజయుడు కాదు గదా. అతడు ఢాకినీ వనమున కన్పట్టి నాడంటే ఖచ్చితముగా అతడిప్పుడు వింధ్యాటవిలో వస్తుండాలి. అతడి కొరకే ఉలూచీశ్వరి ఒంటరిగా వింధ్యాటవికి పోయి వుండునా? అది యును గాక `

శంఖు పుత్రికి నాగుల దిబ్బ మీద నాగా ఆటవికులతో విస్తృత పరిచయాలున్నాయి. ఆమెకు ధనుంజయుని గూర్చి తెలిసి వుండాలి. తనను దెబ్బ తీసేందుకే ఉలూచీశ్వరికి ధనుంజయుని వివరములు చెప్పి వుండాలి. అయిననూ `

తన గారాల పట్టి ఒక మానవుని వరించుటయా! ఇక్కడ ఆమె కొరకు వరుని ఎంపిక చేసి వుండగా ఆమె ఇలాంటి ఒక నీచ కార్యము జేయుట నమ్మ శక్యం గాకుంది. పరి పరి విధాలా ఆలోచిస్తున్న నాగ రాజుని భార్య కీర్తి మతి పిలుపు ఉలికి పడేలా చేసింది.

“ఏమైనది ప్రభూ! ఎవ రతగాడు?” ఆతృతగా అడుగుతోంది.

“ఎవరని చెప్పను! ఏమని చెప్పను దేవీ. అల్లారు ముద్దుగా పెంచినందుకు మన ఘన కీర్తికి మాయని మచ్చ తెచ్చినది. మన నాగ లోకము నుండి సువర్లోకము వరకు అతల సుతల తలా తళ పాతాళము వరకు మనల నవ్వుల పాలు జేసినది. ఒక మానవ మాత్రుడ్ని ప్రేమించినది.

అదీ ఎవరిని? దివ్య నాగ మణి కొరకు మన నాగ లోకమునకు ప్రయాణమై వచ్చుచున్న రత్న గిరి రాకుమారుడు యువ రాజు ధనుంజయుడ్ని. నా శత్రువుని. నా ఆనతి ధిక్కరించి చావును వెతుక్కొనుచూ వచ్చుచున్న మూర్ఖ శిఖా మణిని ఏమని చెప్పుదును? మానవులతో సంబంధము కఠిన శిక్షలకు గురి కావటమని తెలిసీ యిలా జేసినది. ఏమి చేయ వలె?” అంటూ కాన గ్రుమ్మరు మత్తేభము ఘీంకరించునట్టు వ్యథతో అరిచాడు నాగ రాజు.

“అవును ప్రభూ! మీరే గదా, మన తనయ నా వారసత్వము పుణికి పుచ్చుకున్నది. మనుజుల కన్నెత్తి జూడదని పొగడితిరి. తనకు మిమ్ముల ధిక్కరించు ఇంత తెలివి ధైర్యం ఎటుల వచ్చినవో తెలియ కున్నది. ముందు తను ఎచట ఉన్నదో తెలుసుకుని ఇటకు గొని రావలె. గాలించి తెచ్చుటకు వెంటనే కొందరు భటులను వింధ్యాటవికి పంపించండి ప్రభూ.” అంది రాణి కీర్తి మతి.

“ఊహుఁ! ఇది భటుల వలన ఆగు కార్యము గాదు దేవి. స్వయముగ నేనే పోయి వచ్చెద.” అంటూ చర చరా ఆ మందిరం నుండి బయటకు వెళ్ళి పోయాడు నాగ రాజు.

****************************

శ్వేతాశ్వం బాట మీద ముందుకు సాగు తున్నదే గాని ధనుంజయుని ఆలోచలను వెనక్కు పరుగు తీస్తున్నాయి. భద్రా దేవి కోసం వెను దిరిగి చూస్తూనే వున్నాడు. ఎవరా వృద్ధు రాలు? నిజముగా ఆమె భద్రా దేవికి తెలుసునా? ఏమి జరుగుతోందక్కడ? పరి పరి విధాల ఆలోచిస్తున్నాడు. అప్పటికే అశ్వం బాట మలుపు తిరిగింది. అంతలో `

ఒక్క సారిగా వీచిన సంపంగి పూల సౌరభానికి ఉలికి పడి అశ్వం కళ్ళాలు బిగించాడు. ఇదే సువాసన` ఆనాడు డాకినీ వనములో

శ్వేత నాగుగా దర్శన మిచ్చినపుడు ఉలూచీశ్వరి నుండి వీచిన మధుర సువాసన. ఇక్కడ ఎచట నుండి వీస్తున్నది? సమీపమున సంపంగి చెట్లు వున్నవా? లేక... సందేహిస్తూ అశ్వాన్ని నిలువరించి` చుట్టూ పరికించి చూడ సాగాడు ధనుంజయుడు. ఇంతలో వెనక నుంచి విన వచ్చింది పాము బుస. చివ్వున త తిప్పి వెనక్కి చూసాడు. తనకి ఎడం పక్కగా బాట సమీపం లోనే వుంది పెద్ద పొన్న వృక్షం ఒకటి. దాని ఛాయలో ఒక బండ మీద చుట్ట చుట్టు కొని లేచి పడగ విప్పి ఆనంద పారవశ్యంతో ఆడుతూ తననే చూస్తోంది ఒక శ్వేత నాగం.

మల్లె పూవు కన్నా తెల్లని శ్వేత వర్ణంలో అద్భుతంగా మెరిసి పోతూ అందమే తానుగా పడగ విప్పి ఆడుతున్న నాగును ఆశ్చర్య సంభ్రమాలతో కొద్ది సేపు అలా చూస్తుండి పోయాడు. ఎవరీ శ్వేత నాగం. ఉలూచీశ్వరి కాదు గదా! గాకున్న ఇలా బహిరంగమున తన ఎదుటకు వచ్చునా... పరిస్థితులు జూడ ఆమె నాగ కుమారి లానే తోచు చున్నది. భద్రా దేవి రాక కోసం తిరిగి తిరిగి చూడ్డంలో పొన్న చెట్టును గమనించకుండా దాటి వచ్చేసాడు. అశ్వాన్ని వెనక్కు మళ్లించాడు. బాట ఇరు వంకలా నిర్మానుష్యంగా వుంది. అడవంతా సందడిగా వుంది. ఇప్పుడిప్పుడే గాలిలో వేడిమి తెలుస్తోంది.

అశ్వాన్ని పొన్న చెట్టు ఛాయ లోకి పోనిచ్చి తాను కిందకు దిగాడు. అప్పుడు కూడ బండ మీదే ఉంది శ్వేత నాగు. వెళ్ళి పోలేదు. తననే చూస్తోంది. సంపంగి సువాసనలు ఇప్పుడు మరింత గాఢంగా వీచి మనసును పరశింప జేస్తున్నాయి. వేయి నాద స్వరాలు ఒక్క సారిగా మోహన రాగం ఆలపిస్తున్నట్టు కోటి వీణలు ఒక్క పెట్టున ప్రణయ గీతికలు ఆలపిస్తున్నట్టు ధనుంజయుని మనసు పులకిస్తోంది. అది ఉలూచీశ్వరియే యను నమ్మిక బల పడ సాగింది. తెలియని పరవశం కలుగుతోంది.

‘‘నాకు తెలుసు దేవీ! నీవు నాగ రాజ తనయ ఉలూచీశ్వరివి. అటుల గాకున్న నను చూచి కూడ వెడల కుండా ఇచ్చటే ఆగవు. ఆనాడు ఢాకినీ వనమున మెరుపులా దర్శన మిచ్చి మాయమైన శ్వేత నాగు నీవని గుర్తించ నేరక మంద భాగ్యుడనై వెడలితి. ఇప్పుడిక తామద మేల? నీ దివ్య సుందర రూపమును ప్రకాశింప జేస్తూ దర్శన మియ వచ్చును గదా!’’ ఎదురుగా నిలబడి సూటిగా చూస్తూ అడిగాడు. శ్వేత నాగులో చలనం లేదు. నిటారుగా లేచి బుస కొడుతూ`

పడగ విప్పి ఆడుతోంది. ధనుంజయనే చూస్తోంది. భారంగా నిట్టూర్చాడు ధనుంజయుడు.‘‘ఒక లక్ష్యంతో నాగ లోకమును వెదుకుచూ బయలు దేరిన నాకు మార్గమున నీవే కన్పించ వలె? కన్పడితివి పో` నీ వివరములు నాకు తెలియనేల? తెలిసినది పో... నా మది నీ యందు లగ్నము గా నేల? లగ్నమైనది పో... నీ దివ్య సుందర రూపమును ప్రకటింప వేల? నీవు ఉలూచీశ్వరివి కాదను కొందునా? వేరెవరో యను కొందునా? నా దారిన పోవచ్చునా? నిను మరిచి పోదునా?’’ అడిగాడు. అప్పుడు`

సరిగ్గా అప్పుడు ఉన్నట్టుండి కదిలింది శ్వేత నాగం. చుట్టలు విప్పుకొని బండ పై నుండి నేలకు దిగి వచ్చింది. ధనుంజయుడు నిర్భయంగా అలాగే నిలబడి నాగాన్ని చూస్తున్నాడు. అది అటో యిటో వెళ్ళి పోలేదు. నేరుగా అతడి పాదాల వద్ద కొచ్చింది.

పాదాభి వందనం జేస్తున్నట్టు శిరస్సును కొన్ని లిప్తల పాటు పాదాల మీద వుంచింది. తిరిగి లేచి అతడి మోకాళ్ళ వద్ద నుండి వలయంగా చుట్టు కొంటూ శరీరం మీదికి ప్రాకింది. వీపు భాగం నుండి ఛాతీ మీదుగా భుజాల వైపు వస్తుంటే సందేహాలు వీడి అనుమానంగా శ్వేతనాగు శరీరాన్ని తాకి నిమిరాడు ధనుంజయుడు.

అలా ఛాతీ మీదుగా పైకి వచ్చిన శ్వేత నాగు అతని భుజం మీద తలాన్చుకొని మిగిలిన శరీరాన్ని నిటారుగా నేకు వదిలి అలాగే వుండి పోయింది.

‘‘ఇంకనూ ఈ సంకోచమేల? నిను జూడ కను కాయలు కాచి వున్నవి. నీ దివ్య సౌందర్యాన్ని ప్రకటింపవా?’’ అనడిగాడు.

అంతే` ఉన్నట్టుండి శ్వేత నాగు అదృశ్యమై ఆ స్థానంలో మోహనాంగి ఉలూచిశ్వరి ప్రత్యక్షమైంది.

తామర తూండ్ల వంటి ఆమె కరములు అతడి ఛాతిని పూల చెండ్లలా చుట్టేసాయి. ఆమె ఎద భారాలు అతడి విశాల మగు ఛాతిని గాఢంగా హత్తుకున్నాయి. ఆమె శిరస్సు అతడి భుజం మీద వుంది. సకలా భరణ శోభితు రాలై తనను బిగియార కౌగిలించి ప్రత్యక్షమైన ఉలూచిశ్వరిని తడవు చేయకుండా తన చేతులతో బంధించి పసిమి ఛాయలో శంఖంలా మెరుస్తున్న ఆమె మెడ వంపు మీద ముద్దాడాడు. పులకింతతో మరింత గాఢంగా కౌగిలి బిగించింది ఉలూచిశ్వరి.

‘‘దేవీ... నీ సుందర ముఖార విందాన్ని దాచ నేల? నీ మోము జూపవా?’’ అంటూ తన వైపు ముఖాన్ని తిప్పుకో బోయాడు. కాని ఆమె అలాగే ఉండి పోయి చిన్నగా ఏడ్చింది. ఉలికి పడ్డాడు ధనుంజయుడు.

‘‘దేవీ... ఈ శుభ తరుణంలో ఈ దుఃఖం ఎందుకు?’’ లాలనగా వీపు నిమురుతూ అడిగాడు.

‘‘అలసితిని ప్రభూ! మీ కోసం నిరీక్షించి అలసితి. ఒకటి కాదు రెండు కాదు పది దినములుగా మీ రాక కోసం వేయి కనులతో నిరీక్షించితి. కాసేపు మీ కౌగిట సేద దీరవలె ’’ అంది. ఆమె పలుకులు విని` ఉలికి పడ్డాడు ధనుంజయుడు. ‘‘దేవీ ఏమంటివి...! పది దినములా...?’’ అడిగాడు.

‘‘అవును. మీరిటు వత్తురని అత్త శంఖు పుత్రి చెప్పినది. ఇరువురము ఇచటనే ఎదురు చూచు చుంటిమి.’’

“శంఖు పుత్రి ఎవరు?”

“మార్గమున మీకు ఎదురు పడిన అవ్వ రూపము లోని నాగస్త్రీ.” నమ్మ లేనట్టు కౌగిలి వీడి

ఆమె ముఖార విందాన్ని తన వైపు తిప్పు కొని కళ్ళ లోకి చూసాడు. “ఆమె నిజముగ అవ్వ కాదా?” అడిగాడు.

“కాదు ప్రభూ.”

“మరి నీవే మా ముందుకు రాకుంటివి?”

“ఎటుల వచ్చుట? మీ పక్కన ఎవరో బాలకు డగు పురుషు డున్నా డుగా... అతన్ని ఆపి మిమ్ము పనుచుటకే శంఖు పుత్రి అవ్వ రూపమున మీ ఎదుట కొచ్చినది.”

అప్పటి గ్గాని ధనుంజయునికి విషయం అర్థం కాలేదు. చిన్న గా నవ్వుతూ, బండ మీద కూచున్నా డు. ఆమె కరము పట్టి దగ్గరకు తీసుకున్నా డు. “అది పురుషుడు కాదు, ఆ వేషం లోని యువతి.”

“అది యేమి? తను పురుషుడు గాదా?” విభ్రాంతు రాలయింది ఉలూచీశ్వరి.

“కాదంటిని గదా. ఆమె భద్రా దేవి యను సుందరాంగి... దేవీ! ముందుగా నీకో నిజము చెప్పవలె సుమా...”

“చెప్పండి యువ రాజా! నాడు ఢాకినీ వనమున నా జీవము కాపాడినారు. ఆ క్షణమున మీరెవరో నాకు తెలియదు. కాని నా మది మీ చూపు దగులు కొని మరలి రానంది. మీ దివ్య సుందర రూపమును కను లారా దర్శింప నెంచి శ్వేత నాగుగా మారితి. నా దురదృష్ట వశమున మీరు నన్ను గుర్తించక అట నుండి వెడలి నారు. నాగ లోకము జేరి విరహమున కుందుచున్న నను ఓదార్చి

అత్త శంఖు పుత్రి మీ వివరము తెలిపినది.''

''దేవి! నీ ప్రేమకు పాత్రుడగుట అది నా అదృష్టము. కాని ఇంతకు ముందే నా హృదయ పీఠమున మరో వనిత వున్నది. ఈ విషయములో నీవు నను క్షమించ వలె.''

''ఇందులో క్షమించున దేమున్నది ప్రభూ. మీ వంటి రాజన్యులకు ఒకరి కన్న ఎక్కువ భార్య లుండుట సహజమే గదా. ఇంతకూ ఎవరా అదృష్టవంతు రాలు? ఎవరా అన్నుల మిన్న?'' అంది విషయాన్ని తేలిగ్గా త్రోసి పుచ్చుతూ ఉలూచీశ్వరి. భద్రా దేవి కూడ ఇలాగే మాట్లాడింది. పైగా ఉలూచీశ్వరి విషయంలో తనను ప్రోత్సహించింది.

''ఎవరో కాదులే దేవి. నీవు నా పక్కన మచ్చల గుర్రం మీద గాంచిన బాలకుడను పురుషుడు. అది పురుషుడు కాదు పడతి. పేరు భద్రా దేవి.'' అంటూ ఏదీ దాచ కుండా తమ గురించి వివరించాడు.

అతడి ఎత్తు భుజ స్కంధాల పైన కోమలమగు తన చేతులుంచి మీదకు వాలుతూ కళ్ళ లోకి నేరుగా చూసింది ఉలూచీశ్వరి. హిమ పూరిత మగు ఆ చూపుల వేడిమికి వివశుండై తిరిగి బిగి యార ఆమెను సందిట బంధించాడు. భువనైక రూపసి యగు ఆమె సోగ కనుల మీద ముద్దాడాడు.

తేనె లూరు ఆమె పగడాల అధరాలు కంపిస్తూ తొలి అధర చుంబనం కోరి ఆహ్వానిస్తున్నాయి. కాని ఆమె నాగ కన్య. ముద్దు తీసుకోవాలా వద్దాని ధనుంజయుడు సంశయిస్తుండగా తనే అతడి మెడ వంచి అతడి అధరాలను అలుపు తీరా ముద్దాడింది. ''అధర చుంబనానికి అభ్యంతరమేల ప్రభూ? నాగ రూపమున ఉన్నప్పుడే నా కోరల విషముండును. పడతి రూపంలో ఏ విషము వుండదు. మీరు నా ప్రాణమై వుండగా మీకు హాని కలిగింతునా?'' అని ఉలూచీశ్వరి వివరిస్తుంటే పరవశుడై తిరిగి గాఢంగా ఆమె అధరామృతాన్ని ఆస్వాదించాడు.

''కాని ఒక్క సందియము దేవి!'' అన్నాడు కళ్ళ లోకి చూస్తూ.

''చెప్పండి ప్రభూ! ఏమా సంశయము?'' అడిగింది ఉలూచీశ్వరి.

“దివ్య నాగమణి కోసం నాగ లోకమునకు పయనమైన నన్ను ఆది నుండీ నీ జనకుడు నాగ రాజు ఒక శత్రువు గానే భావించి అడ్డుకుంటున్నాడు.      హత మార్చాలని ప్రయత్నిస్తున్నాడు. అలాంటప్పుడు నిను నాకు ఇచ్చునా? మన ప్రేమను అంగీకరించునా?” అడిగాడు.

“నిక్కముగా వారు అంగీకరించరు.” అంది నవ్వుతూ ఉలూచీశ్వరి.

“మా నాగ లోకమున నా కొరకు వరాన్వేషణ జరుగు చున్నది. నాకు మీరు తెలుసు నని గాని, నా మది మీ యందు లగ్నమైన సంగతి గాని వారికి తెలియదు. ఇప్పుడు కూడ వింధ్యాటవిలో వన విహారమునకని సాకు జెప్పి చెలి కత్తెను సంపంగి వన మందే వేచి వుండమని ఆనతిచ్చి శంఖు పుత్రి వెంట మీ దర్శనార్థం వచ్చితి.” అంది.

“అయిన ఇక నేమి? నాతో నీ జనకుని శత్రుత్వము ద్విగుణీకృతము అయినట్టే” అన్నాడు దర హాసంతో ధనుంజయుడు.

“అగు గాక. ఇక నుండి మీరే నా లోకము, నా సర్వస్వము.”

“ఇంతకూ నాకు మీ నాగ లోకము చేరు మార్గమేది?”



“నేనే మీ చెంత నుండ అంత శ్రమ మీకేల ప్రభూ. మీకు శ్రమ కలుగనిత్తునా. దివ్య నాగ మణులు మా తండ్రి గారి మందిరమున ఒక స్వర్ణ పేటికలో ఉన్నవి. సదా నాగ బంధముతో బిగము వేయ బడి యుండును. ఎలాగో ఆ బిగము తెరిచి మీ కొరకు ఒక దివ్య నాగ మణి ని గొని వచ్చెదను. ఇట నుండే రత్న గిరికి పోవుదము.”

“అది సరి కాదు సఖీ. అలా చేయ తగదు.” అన్నాడు వెంటనే ధనుంజయుడు. “ఇప్పుడు నీవు నా హృదయేశ్వరివి. నా మూలముగా నీవు నీ తండ్రి శాపమునకు గురవుట అంగీకరించను. నీతో బాటు దివ్య నాగ మణి ని కూడ నీ తండ్రి గారిని మెప్పించి ఒప్పించి వారి అనుమతి తోనే రత్న గిరి గొని పోయెద. నాగ లోకము పోవునుపాయము తెలిపిన చాలును.”

“అటులయిన వేరే ఉపాయమే. నేనే మీ వెంట వచ్చి మార్గము చూపెదను.”

“అనగా నేమి? నీవు వెనక్కు వెళ్ళవా?”

“వెళ్ళను. మీతోనే నేను.”

“మాతో నీవెందుకు ప్రియా. అడువుల శ్రమ పడుట...”

“చెప్పితిని గదా. మీ శ్రమ నాది కాదా. లోకము తల్ల క్రిందులయినను, నా తండ్రి వచ్చి బిలిచినను నేను మిమ్ము విడిచి వెళ్ళను.” అంటున్న ఉలూచీశ్వరిని మరో సారి కౌగిట బంధించాడు ధనుంజయుడు.

“నా జనకుని బాధ చూడ లేక వారి పుట్ట వ్రణమును బాపుటకై రాజ వైద్యుల సలహా మేరకు దివ్య నాగ మణి కోసం దారే తెలియని నాగ లోకమునకు ఒంటరిగ బయల్వెడలితిని. అటు వంటి నాకు మార్గమున ముందుగా రెండు ఆణి ముత్యములు లభించినవి. ఒకటి భద్రా దేవి, రెండు నీవు. ఇక దివ్య నాగమణి లభించిన చాలును. మనము రత్న గిరి వెళ్ళి పోవచ్చును.” అన్నాడు.

“తప్పక లభించ గలదు సఖా. నను ఆదరించిన మీ సహృదయానికి కానుకగా దివ్య నాగ మణి తప్పక లభించగదు. నా జనకుని

మెప్పించ గల సమర్థత తమకున్నది.'' అంటూ బిగియార కౌగిలించి ముద్దాడింది.

బిగి కౌగిట పరవశంలో`

కొద్ది సేపు అలానే వుండి పోయారు.

అంతలో ఎవరో వస్తున్న అలికిడి విని అటు చూసారు. తన మచ్చల గుర్రాన్ని కళ్ళాలు పట్టి నడిపించు కొంటూ భద్రా దేవి, ఆమె పక్కనే స్త్రీ రూపము పాము శరీరంతో జర జరా ప్రాకుతూ శంఖు పుత్రి ఇరువురూ కబుర్లు చెప్పు కొంటూ తమ దిశగా నడిచి రావటం కన్పించింది.

వెంటనే కౌగిలి విడిపించుకొని` పక్కకు జరిగింది ఉలూచీశ్వరి. శంఖు పుత్రిని గాంచి ధనుంజయుడు అచ్చెరువొందు చుండగా భద్రా దేవి ని నిశితంగా చూస్తూ ఉలూచీశ్వరి ఉద్విగ్నురాలయింది.

మీస కట్టు లేకుండా పెద్ద తల పాగా ధరించి గంభీరంగా ఉన్నందున ఆమెను చూసి ఇప్పుడే వయసు కొచ్చిన బాలకుడనుకుంది. ఆమెను చూసి భద్రా దేవి అంటే నమ్మ లేక పోయింది. కాని ఇప్పుడు అర్థమవుతోంది. ఆ హంస నడక, వయ్యారము ఎచటకు పోవును. మానవ స్త్రీలో మణి పూస వంటి అద్భుత సౌందర్య రాశి.

''ఏవమ్మా ఉలూచీశ్వరి. ఇన్ని దినముల వలపు చెలి కాని కోసరం కలవరించితివి గదా. నీ కల ఫలించినదా? నీ మనోహరుని అనుగ్రహము లభించినదా? మా రాక ఏకాంతమునకు భంగము కాదు గదా!'' అంటూ వస్తూనే చతురులాడిన శంఖు పుత్రి మాటలకు సిగ్గిలి`

''పో అత్తా!'' అంటూ ధనుంజయుని వెనక్కు చేరి ముఖం దాచుకుంది ఉలూచీశ్వరి.

''ఎటు పోదును? నీవును రావలె గదా'' అంది శంఖు పుత్రి.

“లేదు లేదు. నేను వచ్చుట లేదు. వీరి తోనే వత్తును.” అంటూ ధనుంజయుని వదిలి ఇవతలి కొచ్చింది ఉలూచీశ్వరి. భద్రా దేవి ని ఉత్సాహంగా చూస్తూ చేతులు అందుకుంది.

“అక్కా! నీ గురించి మన ప్రాణేశ్వరుడు చెప్పు వరకు నాకు తెలియ లేదు. నను క్షమించు. ఇక నుండి నను నీ సోదరిగా ఆదరించుము.” అంది.

“ఏకాకి నగు నాకు నీవంటి భువనైక మోహనాంగి సోదరి యగుట నా అదృష్టము.” అంటూ అప్యాయంగా ఉలూచీశ్వరిని కౌగిలించు కుంది భద్రా దేవి.

ఇంతలో మచ్చల గుర్రం మీది తోలు సంచిలో విశ్రమించిన భూతం ఘృతాచి లేచింది. లేస్తూనే` “ఆకలి... ఆకలి.” అంటూ వచ్చి భద్రా దేవి ఎదుట నిబడింది. విచిత్ర మగు ఆ నల్లటి వికార రూపాన్ని జూచి విభ్రాంతి చెందారు శంఖు పుత్రి, ఉలూచీశ్వరిలు. దాని గురించి వారికి వివరించింది భద్రా దేవి. అప్పటికి ఎలాగూ భోజన వేళ సమీపిస్తోంది.

“ఘృతాచి పొమ్ము. వనమునకు పోయి నీకు నచ్చిన మృగమును వధించి నీ ఆకలి బాపు కొని రమ్ము. అలాగునే మాకు వలసిన చక్కని పండ్లను కూడ సేకరించి తెమ్ము” అంటూ ఆనతిచ్చింది. వెంటనే అక్కడి నుండి అదృశ్యమైంది ఘృతాచి.

ఘృతాచి వెళ్ళగానే నలుగురూ అక్కడే వృక్ష చాయలో కూచుని చర్చలో మునిగి పోయారు.

*********************

ఆ రోజు ఉదయం రాజధాని రత్న గిరి లో`

కార్చిచ్చులా ఒక వదంతి వ్యాపించింది. దాని సారాంశం... దివ్య నాగ మణి కోసం వెళ్ళిన యువ రాజు ధనుంజయుడు ఎక్కడో మత్స్య దేశ ప్రాంతంలో ప్రమాదవ శాత్తు కొండపై నుండి లోయలో పడి మరణించాడని. దీన్నే చిలవలు పలవలు జేసి అనేక విధాలుగా చెప్పుకో సాగారు. ఈ వార్త నిజం గానే రత్నగిరి నగర ప్రజా జివనాన్ని అతలా కుతలం చేసింది.

ప్రజ భయ భ్రాంతులయ్యారు.

ఏం జరగ బోతోంది?

తమ ప్రియతమ నాయకుడు మహా రాజు అశ్వస్థుడై వున్నాడు. యువ రాజు మరణిస్తే ఇక ఈ దేశం ఏమి కానుంది? ఈ వార్తకు తోడు త్వర లోనే శత్రు రాజు రత్న గిరి రాజ్యం మీద దాడి చేయనున్నారని కూడ వదంతులు నగరంలో షికారు చేస్తున్నాయి. నగరమే ఒక్క సారిగా విషాద సాగరంలో మునిగి పోయింది. ఒక్క పెట్టున విలపించసాగారు.

అయితే పుట్ట వ్రణంతో బాధ పడుతున్న ప్రభువు ధర్మ తేజునికి గాని ఆయన పట్టపు రాణి కనకాంబికకు గాని ఈ దుర్వార్త తెలికుండా ప్రధానామాత్యుడు వాసు దేవ నాయకుడు, సర్వ సైన్యాధ్యక్షుడైన అర్కుల వారు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. అంతే కాదు ` వెంటనే మంత్రి వర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఆ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అమాత్యులతో బాటు ఉప సైనాధ్యక్షుడు బాహ్లీకుడు కూడ పిలువ బడ్డాడు.

సమీపంగా అర్కునికి బాహ్లీకుని మీద కొన్ని సందేహాలు ఏర్పడ్డాయి. తెర వెనుక ఏదో కుట్రకు పల్పడుతున్నాడని అనుమానం కూడ వుంది కాని సరైన ఆధారాలు లభించక ఉపేక్షిస్తూ వస్తున్నాడు. ప్రధానామాత్యునికి కూడ ఇంత వరకు చెప్ప లేదు. ఇపుడీ వదంతుల విషయంలో కూడ అతడి హస్తం వుండొచ్చని ఆలోచనలో అనుమానం వుంది. అది నిజం కూడ.

తన వద్ద పడున్న గాంధార వాసి కరోతి సలహా మేరకు తన సొంత గూఢ చారుల ద్వారా నగరంలో ఈ వదంతుల్ని వ్యాపింప జేసాడు. ఎందుకంటే `

యువ రాజుని అంతం చేయమని సమర్థులగు తన గూఢ చారుల్ని ఆరుగురు చొప్పున మూడు బృందాలుగా పంపించాడు. వెళ్ళిన వాళ్ళ నుండి ఇంత వరకు ఏమి జరిగిందనే సమాచారం లేదు. అవతల యువ రాజు వెళ్ళి నెల రోజు దాటింది. అటు చూస్తే గాంధారం నుండి రాజు శతానీకుడు ఏం జరిగింది యువ రాజుని అంతం చేసారా లేదా అంటూ పావురాల ద్వారా లేఖలు సంధిస్తున్నాడు.

ఈ పరిస్థితుల్లో కరోతి ఒక సలహా చెప్పాడు. నిజానికి ఒకటి కాదు రెండు సలహాలు. అందులో మొదటిది సర్వ సైన్యాధ్యక్షుడైన అర్కుడిని ముందుగా అంతం చేయటం. దీని వలన అర్కుని మరణంతో ఉప సైన్యాధ్యక్షుడైన బాహ్లీకుడు సర్వ సైనాధ్యక్షుడిగా ఆ స్థానంలో పదోన్నతి పొందుతాడు. అందు వల్ల సైన్యం మొత్తం అతడి ఆధీనం లోకి వస్తుంది గాబట్టి అంతర్యుద్ధం అంతగా వుండదు. చెదురు మదురుగా ఎదురు తిరిగిన సైన్యాన్ని సులువుగా తుద ముట్టింప వచ్చు. ఈ లోపల శతానీకుని సాయం ఎలాగూ ఉండనే వుంది. ఇక రెండో సలహా`

యువ రాజు ధనుంజయుడు మరణించి నట్టు నగరంలో వదంతి వ్యాపింప జేయటం. దీనివల్ల సైన్యంలో మనో బలం సన్నగిల్లుతుంది. సులువుగా బాహ్లీకుని పక్షానికి వచ్చేస్తారు. అదే సమయంలో ఇక్కడి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వెంటనే సైన్య సమేతంగా బయలు దేరమని సందేశం పంపించటం.

గాంధారం నుండి మిత్ర పక్ష సేన ను కూడ గట్టు కొని గాంధార సేనలు సముద్ర మార్గంగా రత్న గిరి చేరటానికి ఎలాగూ నెల రోజులు పడుతుంది. ఈలోపల పరిస్థితుల్ని పూర్తిగా తమ అదుపు లోకి తెచ్చుకో వచ్చు.

ఈ ఆలోచన నచ్చటంతో ముందుగా బాహ్లీకుడు సర్వ సైన్యాధ్యక్షుడు అర్కుని హత మార్చేందుకు వారం రోజుల క్రిందట మెరిక ల్లాంటి తన మనుషులు ఇరవై మందిని ఏర్పాటు చేసాడు.

అయితే ఆ రోజు ఆర్కుని అదృష్టం బాగుంది. నగరం మలుపలి ప్రాంతం లోని సైనిక విడిది నుండి రాత్రి మొదటి జాములో ఒంటి గానే నగరం లోని తన నివాసానికి రావటం అర్కుని అలవాటు. ఆయన నివాసం ఎగువన బాహ్లీకుని నివాసం మూడు వీధుల అవతల కోట గోడ సమీపం లోనే వుంది. వెంట అంగ రక్షకుల్ని కూడ తెచ్చుకునే అలవాటు ఆయనకు లేదు. మూడు దినాల క్రిందట ఎప్పటి లానే తన అశ్వం మీద తొలి జాము ముగిసే వేళలో గృహోన్ముఖుడై వస్తున్నాడాయన. ఆ సమయంలో ప్రయోగించారు. ముందుగా వచ్చిన బల్లెం అదృష్ట వశాన చెవి పక్కగా దూసుకు పోటంతో అప్రమత్తుడై సర్రున ఖడ్గం దూసి అశ్వాన్ని వెనక్కి మళ్ళించాడు అర్కుడు. తన మీదకు వస్తున్న ఆయుధాల్ని గాల్లోనే చెదర గొడుతూ అశ్వాన్ని చెట్ల వెనక్కి పోనిచ్చాడు. దాంతో దుండగులు ఆయన్ని చుట్టు ముట్టారు. అప్పుడు జరిగిన పోరాటంలో అర్కునికి కొద్ది పాటి గాయాలయ్యాయి. ఈలోపల కోట గోడ పైన పహారా తిరుగుతున్న సైనికుల కత్తుల శబ్దం విని కేకలు వేసారు. వెనకే కొందరు సైనికులు కూడ అటు అర్కునికి సాయంగా దూసుకు రావటంతో దుండగులు చీకట్ల మాటున తప్పించు కొని పారి పోయారు. ఆ విధంగా అర్కుని హత్యా ప్రయత్నం విఫలం గావటం బాహ్లీకుని కలవర పరచింది.

కాని అర్కుని ఇప్పుడు గాకున్న తర్వాతయినా అంతం చేయొచ్చునని భావించి రెండో సలహాను అమలు చేసాడు. దాని ప్రకారం అతడి సొంత గూఢ చారులు రంగం లోకి దిగి యువ రాజు గురించిన వదంతుల్ని నగరంలో వ్యాపింప జేయటం ఆరంభించారు.

ముందుగా రత్నగిరి ఓడ రేవు ప్రాంతం నుండి ఆ వదంతులు వ్యాపించాయి. అర్కుడు మీద హత్యా ప్రయత్నం జరగటంతో ఇప్పుడతన్ని రేయింబవళ్ళు పది మంది అంగ రక్షకులు వెన్నంటి వస్తున్నారు. మూడు రోజులుగా తన జాగ్రత్తలో తనుండగా పిడుగు పాటులా యువ రాజు మరణ వార్త గురించిన వదంతులు నగరంలో షికారు చేయటం అర్కునే కాదు మహా మాత్యుడు వాసు దేవ నాయకుడిని కూడ కల వర పరుస్తున్నాయి. అందుకే ఈ ప్రత్యేక సమావేశం.

సమావేశాని కొస్తూనే` ''ఇది దారుణం. సహింప రాని దుశ్చర్య. యువ రాజా వారి గురించి ఇలాంటి వదంతులు వ్యాపించుట నిజముగా దుర దృష్ట కరం. వారు ఎవరైనా గానీ దుండగుల్ని పట్టు కుంటాం. వారికి తగిన శిక్ష తప్పదు'' అంటూ ఆవేశంగా మాట్లాడాడు బాహ్లీకుడు.

అతడి ఆవేశం చూసి కొన్ని లిప్తలకాలం అక్కడి పెద్దలంతా మౌనంగా వుండి పోయారు.

''నిజమే బాహ్లీకా! పట్టుకుంటాం... శిక్షించెదము... కాని ఎప్పుడు?'' అంటూ సూటిగా అడిగాడు అర్కుడు.


''కోట పరి రక్షణ విభాగము నా అధీనమందున్నది. నగర పరి రక్షణ విభాగము నీ ఆధీనమందున్నది. నా మీదనే తెగ బడి హత మార్చ జూచి నారు శత్రువు. హత్యా ప్రయత్నము జరిగి యిది నాలుగవ దినము. మీ వాళ్ళంతా ఏమి జేయు చున్నారు? దుండగుల గురించిన చిన్న ఆచూకీ కూడ ఇంత దనుక తెలుసుకో లేక పోయిరి. ఇప్పుడీ వదంతుల వెనక ఎవరి హస్తము వున్నదో ఎప్పటికి తెలుసుకో గలరు?'' అనడిగాడు.

అర్కుని మాటలు బాహ్లీకునికి ఆగ్రహం కలిగించాయి. అయినా నిగ్రహించుకున్నాడు. ''అర్కుల వారు క్షమించ వలె. మీ ఉద్దేశము మేము చేత కాని వారమనా లేక అసమర్థులమనా తెలియకున్నది. మేము ఆ ప్రయత్నము లోనే వుంటిమి.'' అన్నాడు.

అప్పుడు ప్రధానా మాత్యుడు వాసు దేవ నాయకుడు కల్పించు కొంటూ` ''బాహ్లీకా! ఇప్పుడు సమస్య సమర్థత అసమర్థత గురించి కాదు. శత్రు జాడ కోసం ఎంత వేగముగా పని చేయుచున్నా మన్నదే ముఖ్యం. అర్కుని మాటలు అసత్యము కాదు గదా. నీకు తెలిసిన సమాచారం ఏమన్నా వుంటే చెప్ప వచ్చును'' అంటూ సూచించాడు.

''అమాత్యా! శత్రు గూఢచారులు నగరంలో తిష్ట వేసినట్టు సమాచారమున్నది. అర్కుల వారి మీద హత్యా ప్రయత్నం గాని ఇపుడీ వదంతులు గాని ఇదంతయు వారి దుశ్చర్యే. మన రత్న గిరి లోని పరిస్థితుల్ని అవకాశంగా తీసుకొని శత్రు దేశ పాలకుడు ఎవడో

కుట్రకు పాల్పడుతున్నాడు. మనల్ని బల హీనుల్ని చేసేందుకే అర్కుల వారి మీద హత్యా ప్రయత్నం జరిగింది. రేపు నా మీదనూ జరగ వచ్చును. అందుకే శత్రు గూఢ చారుల ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం.'' అన్నాడ బాహ్లీకుడు.




'' నీ వద్ద సమాచారము సరైనదే అనుకుందాము. వూహ మాత్రం గా నయినా మన శత్రువు ఎవరో తెలియాలి గదా. మన మీద దాడి చేయు ధైర్యం ఏ దేశానికున్నది? కుట్ర దారుడు ఏ దేశాధీశుడు?'' అనడిగాడు అర్కుడు.

''వదంతులు మున్ముందుగా ఓడ రేవు ప్రాంతమందు మొదలయినవి. సముద్ర మార్గముగా వచ్చిన గూఢచారుల పని యిది....'' బాహ్లీకుని మాటల్ని మధ్య లోనే ఖండించాడు అర్కుడు.

''మనం పశ్చిమ సముద్ర తీరాన వున్న సంగతి బాహ్లీకుల వారు మరచినట్టున్నారు. మనకు పశ్చిమంగా సముద్రము తప్ప రాజ్యము లేవు.

పశ్చిమోత్తరంగా ఎగువన ఎక్కడో కరూర దేశము, పారశీకలో ఇరాను, ఘరాను, పఠాను మొదలగు పాలకులన్నను వారివి చిన్న దేశములు. సముద్ర మార్గముగా మన రాజ్యముపై దండెత్తు తెగువ ధైర్యం వారికెక్కడివి? ఇలాంటి అర్థం లేని సమాచారములు ఎందుకూ కొరగావు. శత్రువు రాజ్యం బయట లేడు. లోపలే వున్నాడు. మన మధ్యే వున్నాడని సందేహము. ప్రస్తుతం ప్రభుత్వ

చారులు అది తెలుసుకునే ప్రయత్నం లోనే వున్నారు. మీరు ఆవేశ పడి ఫలితము శూన్యం. మీరు కూచోండి.'' అన్నాడు నిర్మొహమాటంగా సర్వ సైన్యాధ్యక్షుడు అర్కుడు.

అతడి మాటలు బాహ్లీకునికి చెంప పెట్టు లాంటిది. తన గురించి అర్కుని వద్ద సమాచారం ఉండొచ్చన్న సందేహం ఏర్పడింది. అదే నిజమైతే తను తొందరగా పావులు కదిపి ఈ దొంగాటను త్వరగా ముగించాలి అనుకున్నాడు. అందుకే ఇక మాట్లాడక మౌనంగా వుండి పోయాడు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం` ''యువ రాజా వారు క్షేమంగా వున్నారు. త్వరలో నగరానికి రానున్నారు. ప్రజలు వదంతులు నమ్మి మోస పోవద్దు. వదంతులు వ్యాపింప జేస్తున్న వారిని త్వరలో పట్టుకుంటాం. వారికి కఠిన దండన తప్పదు.'' అంటూ ఆ రోజే నగర మంతటా దండోరా వేయబడింది. ఆ రోజే కాదు, వరుసగా మూడు రోజుల పాటు కొన సాగిందా దండోరా.

***************************************

గాఢ నిద్రలో వున్నాడు యువ రాజు ధనుంజయుడు. అతనికి అటు భద్రా దేవి ఇటు నాగరాజ తనయ ఉలూచీశ్వరి వున్నారు. వారి అశ్వాలు గరుడ, ఢాకినీలు రెండు పక్కనే ఒక శాలి వృక్షానికి బంధింప బడున్నాయి.

అప్పుడు సమయం`

రాత్రి మూడవ మాయం.

ఆకాశం మేఘావృతమైంది.

నలు దిశలా చిక్కటి చీకటి అలుముకునుంది. కాని వర్షం పడే సూచనల్లేవు. చల్లటి గాలి వీస్తోంది. ప్రకృతి ప్రశాంతంగా వుంది. అడవి నుండి కౄరమృగాల సద్దు కూడ విన్పించటం లేదు.

అది హైహియ రాజ్య భూ భాగం.

అక్కడికి మత్స్య దేశ సరి హద్దు ప్రాంతం ఒక పూట ప్రయాణ దూరంలో వుంది. మహా పధానికి కాస్త ఎడంగా సువిశాలమైన మైదానంలో రాతి గుట్టల మీద నిద్ర పోతున్నారంతా. వారికి భూతం ఘృతాచి వేయి కళ్ళతో రేయంతా కావలి తిరుగు తోంది.

మూడు దినముల క్రిందట`

వింధ్యా పర్వత శ్రేణి ప్రాంతం నుండి వారు బయలు దేరారు. ఆ దినమున శంఖు పుత్రితో సహా నలుగురూ సాయం సమయం వరకు అచ్చటనే గడిపారు. వాస్తవానికి ఉలూచీశ్వరి, ధనుంజయలను కలిపాక, ఉలూచీశ్వరిని తిరిగి తమ నాగ లోకం చేర్చే ఉద్దేశంలో వుంది శంఖు పుత్రి. కాని ఉలూచీశ్వరి ఎప్పుడైతే ధనుంజయుని విడిచి రానందో శంఖు పుత్రి ఇరకాటాన పడింది.

అప్పటికే ఆలస్యమైంది గాబట్టి ఈ పాటికి తను ఎక్కడ వున్నదీ నాగ రాజుకు తెలిసి పోయి వుంటుంది. వెనక్కు వెళితే తను కదలకుండా రాజ మందిరం లోనే నిర్బంధిస్తారన్న భయం తోను, ధనుంజయుని విడిచి పోలేక ఉలూచీశ్వరి ఆ నిర్ణయం తీసుకుంది. అయితే`

శంఖు పుత్రిది వారితో ఉండ లేని వెనక్కు పోలేని సంకట పరిస్థితి. ధనుంజయ, ఊచీశ్వరుల్ని కలపటంలో తన పాత్ర వుందని తెలిస్తే నాగ రాజు ఆగ్రహానికి గురి కావలసి వస్తుంది. ఇంతకాలం తర్వాత మరో సారి శిక్షకు గురి కాలేదు. కాబట్టి వారి వెంట పయనించ లేదు. తనకే సంబంధం లేనట్టు వెనక్కు వెళ్ళి పోవటం మంచిది. అందుకే`

సాయం కాలం వేళ వారిని విడిచి ఆమె వెళ్ళి పోయింది. వెళ్లే ముందు మర్మ భూమిలో వారి రాక కోసం ఎదురు చూస్తానంటూ చెప్పింది.

నాగులకు ఆకాశ గమనం తెలుసు.

పగటి వేళ గరుడ పక్షులకు వెరచి`

ఆకాశ యానం చేయరు.

చీకటి పడుతూండగా ఆకాశ మార్గన వేగంగా వెళ్ళి పోతారు. శంఖు పుత్రి కూడ అదే విధంగా ఆ రాత్రికే ఆకాశ గమనం ద్వారా మర్మ భూమికి చేరుకుంది.

ఆ విధంగా శంఖు పుత్రి నిష్క్రమించాక ధనుంజయుడు తన సఖియ లిరువురితో హైహియ రాజ్యంలో ముందుకు సాగి పోతూనే వున్నాడు. యువ రాణి ఉలూచీశ్వరి ఎవరికీ కనబడకుండా పగలు శ్వేత నాగుగా మారి గరుడాశ్వం మీది తోలు సంచిలో విశ్రమిస్తోంది. భద్రా దేవి అశ్వం మీద ఆమెతో బాటు తోలు సంచిలో భూతం ఘృతాచి ప్రయాణం చేస్తోంది. హైహియ రాజ్యం చిన్న రాజ్యం. రాజధాని జయంతీ పురం మహా పథానికి ఎడంగా లోపలికి వుంది. బాట నగరానికి చీలి పోతుంది. అటు పోకుండా పట్టణాలు పల్లెల్లో కొండ కోనలు దాటుకొంటూ అక్కడికొచ్చేసరికి చీకటి పడింది. దాంతో మైదానం లోని ఆ రాతి గుట్ట మీద ముగ్గురూ రాత్రికి మజిలీ చేసారు.

వారి ప్రయాణ మార్గంలో ఎగువన మత్స్య దేశం వుంది. అది దాటితే అంగ రాజ్యం వస్తుంది. అంగ రాజ్యం నుండి ఈశాన్యంగా ప్రాగ్ జ్యోతిష పురం రాజధానిగా ఒకప్పటి నరకాసురుడి రాజ్యం వుంది. అక్కడి ప్రజలను అసోము అంటారు. ఆ రాజ్యాన్ని ఆనుకొని అవతల వున్నదే సువిశాలమైన మర్మ భూమి అటవీ ప్రాంతం.

ఆ సమయంలో`

గాఢ నిద్రావశుడైన ధనుంజయుడు ఒక కల గంటున్నాడు. కలలో అది ఏ ప్రాంతమో, తను ఎక్కడున్నాడో తెలీదు. చెట్టు చేమలు చెదురు మదురుగా వున్నాయి. వాటి మధ్య తను నిరాయుధుడిగా ఒంటరిగా పరుగు తీస్తున్నాడు. అతడి వెనక ఒకటి కాదు రెండు కాదు అనేక సర్పాలు పగ బట్టినట్టు పోటీ పడి తరుము తున్నాయి. తన ఆయుధాలయిన విల్లంబులు, కృపాణము, శూలము,

బరిసె మొదలయినవి ఏమైనవో తెలియదు. చెంత ఒక్క ఆయుధమూ లేదు. ప్రాణ సఖియగు భద్రా దేవి గాని ఉలూచీశ్వరి గాని లేరు. ఎక్కడున్నారో తెలీదు. అసలు ఏమైనదో ఏమి జరిగినదో కూడ తెలియదు. పరుగు... ఒకటే అలుపెరుగని పరుగు. పాముల బారిన పడకుండా తప్పించుకు పోతూనే వున్నాడు. అలా ఎంత దూరం వచ్చేసాడో తెలీదు.

ఇంతలో`

ఒక్క సారిగా`

కాళ్ళ కింద భూమి రెండుగా చీలింది.

ఆ చీలిక లోకి జారి పోయాడు.

చిమ్మ చీకటి కంటి కేమీ కన్పించటం లేదు. పట్టుకుందామంటే చేతి కేమీ దొరకటం లేదు. చీకటిలో శర వేగంగా ఎక్కడికో జారి పోతున్నాడు. కొంత సేపటికి అలా జారి జారి ఇసుక మీద పడి పోయాడు. పడి లేచి చుట్టూ చూసాడు. అదేదో ఎడారి భూమిలా వుంది. చిరు చీకటి అలము కొని వుంది. నిర్మానుష్యంగా వుంది. సమీపంలో ఎక్కడా ఇళ్ళు గాని కట్టడాలు గాని చెట్టు చేమలు గాని లేవు. పైన నక్షత్రాలూ లేవు. అసలది ఏ లోకమో, తను ఎక్కడి కొచ్చి పడ్డాడో బయటి కెలా వెళ్ళ గలడో ఏమీ అర్థం గాని అయోమయంతో దిక్కు తోచక మోకాళ్ళ మీద ఇసుకలో కూల బడి పోయాడు. పుట్ట వ్రణంతో నరక యాతన అనుభవిస్తున్న తండ్రి ధర్మ తేజుడు గుర్తు కొచ్చాడు. తననే నమ్ముకున్న ప్రాణ సఖియలు భద్రా దేవి, ఉలూచీశ్వరి గుర్తుకొస్తున్నారు.

‘‘అయ్యో భగవంతుడా! ఏమి ఈ దురవస్థ. తండ్రి బాధను పోగొట్టి కన్న రుణం తీర్చుకో లేని అ ప్రయోజకుడనైతినే. ప్రియా భద్రా, మనోహరీ ఉలూచీ... ఎచట వున్నారు. మీరు ఏమి దురవస్థ పాలైతిరో గదా. మీ ప్రేమకు దూరమైతి. మీ ఆశలు వమ్ము జేసితి. నా వంటి నిర్భాగ్యుని వరించి కష్టముల పాలైతిరి గదా. విధి యిలా వంచన జేసిన దేమి? నాకా ఈ దురవస్థ. ఇది యేమి ప్రారబ్ధ కర్మ...’’ అని దుఃఖిస్తూ బిగ్గరగా అరిచి రోదిస్తున్నాడు. ఆ మరు భూమిలో అతడి రోదన ప్రతిధ్వనిస్తోంది.

అలా ఎంత సేపు గడిచిందో తెలీదు.

తర్వాత ఏమి జరిగేదో గాని ఇంతలో`

బిగ్గరగా అరుస్తున్న భూతం ఘృతాచి అరుపు ఒక్కసారిగా ధనుంజయుని ఉలికి పడి లేచేలా చేసాయి. దిగ్గున లేచాడు. కొన్ని లిప్తలకాలం ఏమీ అర్థం కాలేదు. ఇప్పుడు ఎడారి లేదు, చీకటి లేదు. ఇంత సేపు తను గాంచినది స్వప్నమని గ్రహించాడు. దానికి అర్థం ఏమిటో తెలీక తల విదిలించి చూసాడు. అతనికి ముందే నిద్ర లేచిన భద్రా దేవి, ఉలూచీశ్వరిలు కూడ విభ్రాంతులై చుట్టూ

చూస్తున్నారు.

తామంతా రాత్రి ఎచట నిద్రించారో అదే రాతి గుట్ట మీద వున్నారు. సమయం తెల్లవారు జాము సమీపిస్తున్నట్టు పశ్చిమాకాశంలో ప్రకాశిస్తున్న శుక్ర గ్రహం సూచిస్తోంది. తామున్న రాతి గుట్టను చుట్టి చక్ర బంధంలా ఎటు చూసినా అనేక దివిటీలు గాలికి రెప రెప లాడుతూ ఆ ప్రాంతాన్ని పట్ట పగలు చేస్తున్నాయి.

ఇది కల కాదు వాస్తవం. ముగ్గురూ లేచి నిల బడి` ముఖ ముఖాలు చూస్తున్నారు.

రాతి గుట్టను ఎవరో ముట్టడించ బోతున్నట్టు ఎటు చూసినా ఒకటి కాదు రెండు కాదు` వందలాది దివిటీలు కదలి వస్తున్నాయి. వాటి వెలుగులో పరిసరాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

ముందు వరుసలో సర్పాలు అనేకం బారులు తీరి వేగంగా కదలి వస్తున్నాయి. కోకొల్లలుగా సర్పాలు. ఎర్ర త్రాచు, నల్ల త్రాచు, గోధుమ వన్నె త్రాచు, మిన్నాగు, రక్త పింజేరులు యిలా అన్నీ భయంకరమైన విషాన్ని గ్రక్కే క్రూరసర్పాలు. బుసలు కొడుతూ పడగలు విప్పి ఆడుతూ ఒక దాన్ని ఒకటి త్రోసుకుంటూ గుట్ట సమీపం లోకి వచ్చేస్తున్నాయి.

ఆ సర్పాల మధ్యలో`

నాగ లోకానికి చెందిన అనేక మంది భటులు కాగడాలు చేత బట్టి వస్తున్నారు. వాళ్ళంతా సగం సర్ప రూపంలోను పైన రెండు చేతులు, శిరస్సుతో మానవాకారం గాను వున్నారు. నాగాభరణాలు ధరించి వున్నారు. ఒక చేత శూలం, బరిసె మొదలైన ఆయుధాలు కలిగి వున్నారు.

ఆ నాగ పటాలానికి వెనగ్గా వస్తున్నారు నాగా జాతి వీరులు. వారంతా మర్మ భూమి (నాగా లాండ్) అటవీ ప్రాంతం లోని నాగుల దిబ్బ పరిసర నాగా ప్రజలకు చెందిన నాగా వీరులు. విల్లంబులు, కృపాణాలు, ఈటెలు, బరిసెలు మొదలయిన ఆయుధాలు ధరించి యుద్ధానికి సన్నద్ధులై వీరావేశంతో వస్తున్నారు. వారి వెంట నాగా నాయకుడు నాగ కేసరి, వృద్ధ నాగానందుడు ఇంకా వారి మత గురువు గణాచారిలు కూడ తరలి వస్తున్నారు.

వారంతా రాతి గుట్టను చుట్టి నలు వైపులా ముట్టడికి వస్తుండగా ఉత్తర దిక్కున వారందరికీ వెనగ్గా చిరు చీకట్లలో వస్తున్నాడు నాగ రాజు మహా పద్మూడు. సర్ప రూపంలో పది శిరస్సులను గొడుగులా పడగ విప్పి నాలుకలు తోడుతూ ఉగ్ర రూపంతో జర జరా ప్రాకుతూ వస్తున్నాడు.

ఆకులతో కూడిన పచ్చి కొమ్మ ఒకటి పుచ్చుకుని ఎగిరెగిరి గంతు లేస్తూ అప్పటికే గుట్టను సమీపిస్తున్న పాముల్ని దబ దబ బాది వెనక్కి తోసి పడేస్తూ పెద్దగా భద్రా దేవి బృందాన్ని లేవమని అరుస్తోంది భూతం ఘృతాచి. అప్పటి కింకా ధనుంజయుని కంట పడలేదు నాగ రాజు. కాని తన కూతురు ఉలూచీశ్వరి కోసం అతడే తరలి వస్తున్నాడని ధనుంజయుడు గ్రహించి సఖియలిద్దర్ని ఆశ్చర్య సంభ్రమాలతో చూసాడు.

“భద్రా...! ఏం జరుగులోంది?” అనడిగాడు యుధాలాపంగా.

అతడి ప్రశ్నకు ఉలూచీశ్వరి బదులిచ్చింది.

“నా కోసము స్వయముగా నా జనకుడే తరలి వచ్చినట్టున్నాడు” అంది గాభరాతో ధనుంజయుని భుజం మీద చేయి వేసి.

“వారి వెంట మీ లోకమునకు పోదువా?” అడిగాడు.

“లేదు సఖా. మీ పాదాల చెంతనే నా ప్రాణము పోయిననూ పోవు గాక, నేను మాత్రం మిమ్ము విడిచి పోజాల” అంటూ ప్రేమాతిశయంతో ధనుంజయుని గాఢంగా హత్తు కొని అతడి అధరాలను వలపు మీరా చుంబించింది ఉలూచీశ్వరి.

“భయ పడకు. అవసరమైతే మన కోసం నీ తండ్రితో యుద్ధం చేసెద. దివ్య నాగమణి కొరకు మీ నాగ లోకం వరకు తరుము కెళ్తాను.” అన్నాడు ఆవేశంగా ధనుంజయుడు.

అతడి మాటలకు భద్రా దేవి`

"ప్రియా! తొందర పడ వలదు. ఇలాంటి సమయమున మనకు ఆవేశకావేషములు లాభం చేకూర్చవు. పగలు శత్రుత్వాలను పెంచుకొనుట మంచిది కాదు. వచ్చింది ఎవరు? సాక్షాత్తూ నాగ లోక ప్రభువు. మన ఉలూచీశ్వరి జనకుడు. రేపు మీ పాద ప్రక్షాళనము జేసి కన్యా దాన మొనర్చు మామ గారు. నాకును వారు పితృ సమానులు. వారితో కయ్యమున పనులు కావు. నెయ్యమున సాధించు కొవలె" అంది సాలోచనగా.




"దేవీ! నీ అభిప్రాయమేమి? ఈ గండము గడచుట ఎట్లు?" అనడిగాడు ధనుంజయుడు.

"చూచెదము గాక. పొర బాటున కూడ మీరు ఆయుధము ప్రయోగింప వలదు ప్రభూ. గుట్ట దిగ రాదు. ఇప్పుడే వచ్చెద." అంటూ భద్రా దేవి పొడవాటి ఒక ఎండు కొమ్మ అందు కొని వేగంగా గుట్ట దిగింది.

ధనుంజయ ఉలూచీశ్వరిలు చుట్టూ చూస్తున్నారు. వారికి నాగ రాజు జాడ ఇంకా తెలీ లేదు. ఎటు చూసినా దివి టీలు, వందలు, వేలాది పాములు. అవి గుట్ట సమీపం లోకి వచ్చేస్తున్నాయి.

గుట్ట దిగిన భద్రా దేవి ఏవో మంత్రాలు పఠిస్తూ ఎండు కొమ్మతో నేల మీద గుట్టను చుట్టి గీత గీస్తూ పరుగెత్తింది. వృత్తం పూర్తి కాగానే వెళ్ళినంత వేగం గానూ వెనక్కి వచ్చేసింది భద్రా దేవి. ఆమె ఏమి చేయ బోతోందో అర్థం గాక ధనుంజయ ఉలూచీశ్వరిలు ఉత్కంఠ భరితులై చూస్తున్నారు. అవతల చూస్తే నాగ దండు గుట్ట సమీపం లోకి వచ్చేస్తోంది. పోరాటం తప్పదనిపిస్తోంది ధనుంజయునికి. ఎందుకైనా మంచిదని విల్లు అందుకుని అల్లె తాడు బిగించి దాన్ని సిద్ధంగా వుంచాడు. వారిని చేరు కున్న భద్రా దేవి ముందు హెచ్చరికగా`

‘‘ప్రభూ! ఈ గుట్టను చుట్టి అగ్ని రేఖ గీచితి. ఆ గీతను దాటి పాములే కాదు, ఎవరూ గుట్ట పైకి రాలేరు.’’ అంది.

ఆమె మాట్లాడుతూండగానే`

ఘృతాచి దెబ్బ నుంచి తప్పించుకున్న అయిదు సర్పాలు తొందర పడి గుట్ట పైకి రావాలని ప్రయత్నించాయి. అవి భద్రా దేవి గీచిన గీతను దాటుతుండగా ఒక్క సారిగా ఆ గీత నుండి భగ్గున అగ్ని కీలలు ఎగసి తృటిలో ఆ పాముల్ని భస్మీ పటలం చేసాయి. అది చూసి నాగ లోకం వీరులు ఘొల్లున అరిచారు.

అవేమీ పట్టించు కోకుండా`

ఘృతాచి కోసం చూసింది భద్రా దేవి.

అప్పటి కింకా ఆ భూతం గుట్ట దిగువన గాల్లో ఎగురుతూ పాములు రాతి గుట్టను సమీపించకుండా పచ్చికొమ్మలతో బాది వెనక్కి విసురుతూ ఎగిరెగిరి చిందులేస్తోంది.

‘‘ఘృతాచి... ఇటు రమ్మ’’ అంటూ ఎలుగెత్తి పిలిచింది భద్రా దేవి.

ఆమె పిలుపు వినగానే`

పచ్చికొమ్మ అక్కడ పడేసి`

రివ్వున వచ్చి గుట్ట మీద వాలింది భూతం.

తన తోలు సంచి లోంచి ఒక నాగ స్వరం బుర్ర తీసి ఘృతాచి కిచ్చింది భద్రా దేవి.

ప్రతి సమయం లోను భద్రా దేవి సమయ స్పూర్తి, శక్తి సామర్థ్యాలు, తెలివి తేటలు ధనుంజయునికి కొత్త గాను ఆశ్చర్య జనకం గాను వుంటున్నాయి. ఇప్పుడీ క్లిష్ట సమయంలో ఆమె ఏమి చేయ బోతుందాయని ఉత్కంఠ భరితుడై చూస్తున్నాడు. అంతకు మించి ఉత్కంఠ భరితురాలై నాగ స్వరం బుర్రను చూస్తోంది ఉలూచిశ్వరి.

పొడవు పీకతో కూడిన ఎండిన సొర కాయ బుర్రకు కింద రంధ్రాలు కలిగిన రెండు సన్నటి వెదురు గొట్టాలు కలిగి వుండి, పీక పైన రంధ్రం నుండి గాలి వూదుతూ వాయించేదే నాగ స్వరం బుర్ర. పాములాడించే వాళ్ళు దీన్ని ఊదుతుంటే ఎలాంటి సర్పమైనా ఆనందంతో పడగ విప్పి ఆడుతుంది. భద్రా దేవి ఆ బుర్రను ఘృతాచి కిచ్చి చెబుతోంది`

‘‘నా పలుకులు శ్రద్ధగా వినుము. మాకును నాగ రేడుకును నడుమ అమాయక ప్రాణులైన ఈ సర్పములు బలి యగుట పాడి గాదు. ఇక నీవు వాటిని తరుమ పని లేదు.

శక్తి వంతమగు ఈ నాగ స్వరం నా తండ్రి గారిది. దీని నాగ స్వర గానమునకు ఇచటి సర్పములన్నియు మై మరచి నీ వెంట పడగలవు. నీవు కొంత ఎత్తులో గాలిలో తేలుతూ గుట్ట దిగువనకు పోయి దీన్ని వూదుకొంటూ అలా దక్షిణ దిశగా పొమ్ము. ఇటకు దవ్వులనే ఒక లోయ గలదు. గుడ్డిగా నిన్ను అనుసరించిన పాములు లోయను చేరగానే ఆ లోయ లోకి పడి పోగలవు. ఆఖరి పాము కూడ లోయలో పడు వరకు నీవు నాగ స్వరము ఆప వలదు.

ఆ పాము లోయ పైకి చేరు సరికి తెల్ల వారుతుంది. అప్పటికి నాగ రాజు ప్రేరణ శక్తి తొలగి అవన్నీ తలో దారిన తమ తావులకు పోగలవు. నీవు మరలి వచ్చి దీనిని తిరిగి నాకు యివ్వ వలెను. పొమ్ము. వేగిరమే ఈ కార్యము సాధించు కొని రమ్ము'' అంది భద్రా దేవి.

''చిత్తము. తమ ఆన. మీరు చెప్పినటు చేసెద'' అంటూ రివ్వున గుట్ట దిగువకు ఎగిరి వెళ్ళింది ఘృతాచి.

ఈ లోపల కొన్ని సర్పాలు బుసలు కొడుతూ రాతిగుట్ట మీదికి వచ్చే ప్రయత్నంలో అగ్నిరేఖను దాటాయి. అంతే` ఫెళ్ళున ఎగసిన అగ్నికీలు తృటిలో వాటిని బూడిద చేసాయి. అది చూసిన నాగ లోక భటులు ఎక్కడి వాళ్ళక్కడ ఆగి పోయారు. ఇంతలో `

ఉత్తరం దిక్కులో కాగడాలకు వెనక చిన్న కలకలం. అటు నుంచి అనేక మంది కదిలి రావటం ధనుంజయుడు, భద్రా దేవి, ఉలూచిశ్వరిలు గమనించారు.

వారి వెనక పరివారంతో చీకట్ల నుండి అప్పుడే కాగడాల వెలుగు లోకి వస్తూ కన్పించాడు నాగ రాజు. అతనిపుడు సర్ప రూపంలో వున్నాడు.

అంత ఎత్తున పడగ విప్పిన పది శిరస్సులు, ప్రతి శిరస్సు మీద నీలి రంగులో దివ్య కాంతులు చిందుతున్న నీలి మణులు కలిగి వున్నాడు. పది శిరస్సులతో గొడుగులా విప్పిన పడగలతో ఉగ్ర రూపంగా బిర బిరా ముందుకొస్తున్నాడు. ఆయన రాక గమనించి పక్కకు తొలగి గుట్ట వైపు దారి వదులుతున్నారు నాగ భటులు. వారంతా సగం సర్పం, సగం పురుషాకారంతో ఆయుధ దారులై వున్నారు. నాగ జాతి వీరులు వారితో సిద్ధంగా వున్నారు. నాగ రాజు వెంట నాగా నాయకుడు కుల గురువు అంతా వస్తున్నారు. గుట్టకు వంద ధనువుల దూరంలో కొచ్చి ఆగాడు నాగ రాజు.

సరిగ్గా అదే సమయంలో`

భూతం ఘృతాచి నాగ స్వరం ఊదటం ఆరంభించింది. అంతే` ఒక్క సారిగా అక్కడి నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ గాలిలో అలలు అలలుగా మధుర నాగ స్వర నాదం ఆ ప్రాంతమంతటా మారు మ్రోగ నారంభించింది.

అంతటి నాగ రాజే ఆ స్వరానికి ఉలికి పడ్డాడు. ఇక గుట్టను చుట్టి పడగలు విప్పి ఆడుతున్న సర్పాలన్నీ ఆ గానానికి మై మరచి ఒక్క సారిగా తలలు అటు తిప్పాయి. నెమ్మదిగా వెను తిరిగి ఘృతాచి దిశగా కదలనారంభించాయి.

ధనుంజయునికి తను చూస్తున్నది కలో నిజమో అర్థం గావటం లేదు. పాములన్నీ గానం విన వస్తున్న దక్షిణ దిశగా కదలి పో నారంభించాయి. యువ రాణి ఉలూచీశ్వరి కూడా నాగ స్వరానికి తన్మయురాలై మై మరచి వెంటనే శ్వేత నాగుగా మారి పోయింది. వేగంగా గుట్ట దిగి వెళ్ళే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదం గ్రహించి వెంటనే ఆ పామును పట్టు కొని ధనుంజయుని కిచ్చింది భద్రా దేవి. ఎందు కంటే గుట్ట దిగి వెళ్ళాలన్నా అగ్ని రేఖను దాటాలి. అది తృటిలో భగ్నం చేసి ప్రాణం తీస్తుంది. ధనుంజయుడు బుజ్జగించిన కొద్ది సేపటికి తనను తాను అదుపు చేసుకుంటూ తిరిగి స్త్రీ రూపం ధరించిన ఉలూచీశ్వరి ధనుంజయని చేతిని గట్టిగా పట్టుకుంది.

ఇదే సమయంలో అక్కడ ఎదురుగా నాగ రాజు పరిస్థితీ అలానే వుంది. రాతి గుట్టను చుట్టి మైదాన ప్రాంతమంతటా నాగ స్వర నాదం సమ్మోహనాస్త్రంలా మారు మ్రోగుతూ రా రమ్మని పిలుస్తున్నట్టుంది. మనసును సంపెంగ పరిమళంలా మురిపించేస్తోంది. నాగ లోకం నుండి వచ్చిన భటులు పరివారంలో చాలా మంది పూర్తిగా సర్ప రూపం లోకి మారి పోతూ తన్మయంతో ఘృతాచి దిశగా కదలి పో నారంభించారు.

నాగ రేడుకు పరిస్థితి అర్థమై పోయింది.

ఇలా సర్ప రూపం లోనే వుంటే`

తను కూడ ఆ గాన వశంలో అదుపు తప్పి అటు వెళ్ళి పోక తప్పదనిపించింది. వెంటనే సర్ప రూపం విడిచి ఎప్పటిలా తన పురుషాకృతిని ధరించాడు. ఆయన నిజ రూపం గాంచి ధనుంజయ, భద్రా దేవిలు మరో సారి విభ్రాంతి చెందారు.

సుమారు పన్నెండడుగుల ఎత్తున `

దివ్య తేజస్సులో ప్రకాశిస్తున్నాడు.

పట్టు పీతాంబరాలు ధరించాడు. గుబురు మీసాలు, శిరస్సున ధగ ధగాయ మానంగా ప్రకాశిస్తోంది మణి మయ రత్న కిరీటం. ఆయన ధరించిన పాదుకలు కూడ మణులతో ప్రకాశిస్తున్నాయి. ఆచ్ఛాదన లేని ఛాతీకి అడ్డంగా స్వర్ణ యజ్ఞోపవీతం మెరుస్తోంది. సకలాభరణ శోభితుడై గంభీరంగా విరాజిల్లుతున్నాడు. ఒక చేత గధాయుధం, రెండో చేతిలో నాగ పాశం కలిగి వున్నాడు.

పురుషాకృతి దాల్చగానే` ''ఆపండి! ఆ నాగ స్వర నాదమును తక్షణం నిలుపు చేయండి.'' అంటూ హుంకరించాడు. వెంటనే స్పందించిన నాగ వీరులు నాగ లోకం భటులు అంతా ఆకాశం వంక చూసారు. చీకటిలో చీకటిగా కలిసి పోతున్న భూతం ఎవరికీ కన్పించటం లేదు. అయినా నాగ స్వరం వినవస్తున్న దిశగా ఆకాశం లోకి బాణాలు వదల సాగారు. కాని అప్పటికే ఘృతాచి దక్షిణంగా వెళ్ళి పోతోంది. నేలమీద గుట్టలు గుట్టలుగా సర్పాలన్నీ ఒకదాన్నొకటి త్రోసుకొంటూ నాగ స్వర తన్మయంలో అవి కూడ దక్షిణంగా వెళ్ళి పో సాగాయి.

ఎప్పుడైతే సర్పాలన్నీ దక్షిణంగా తరలి పోయాయో ఇప్పుడా మైదాన ప్రాంతం బోసిగా కన్పిస్తోంది. అప్పటికీ దివిటీలు పట్టిన అనేక మంది ఇంకా గుట్టను చుట్టి వున్నారు.

గుట్ట పైన ధనుంజయ, భద్రా దేవిలతో యువ రాణి ఉలూచీశ్వరి లేకుంటే ఈ పాటికి అక్కడ ఘోర సంగ్రామ జరుగుతూండేది. రాగానే ఆంప వర్షం కురిపించే వారు నాగ వీరులు. కాని తన కుమారి క్షేమం కోరి యుద్ధానికి అనుమతి యివ్వ లేక పోతున్నాడు నాగ రాజు. నాగాల నాయకుడు నాగ కేసరిని పిలిచి ఏదో చెబుతున్నాడు.

అదే సమయంలో`

ధనుంజయుడు నారి సవరించి వింటికి బాణం సంధించి వదిలాడు. అది నమస్కార బాణం. గాలిని చీల్చుకొంటూ నేరుగా దూసు కెళ్ళి నాగ రాజు పాదాల వద్ద నేలలో దిగ బడింది. ఉలికి పడి తలెత్తి గుట్ట పైకి చూసాడు నాగ రాజు.

తన వినయాన్ని ప్రకటిస్తూ మోకాలి మీద వంగి కూచుని నమస్కరించాడు ధనుంజయుడు. చేతిలో విల్లు అలాగే వుంది. అతడి పక్కనే మోకాళ్ళ మీద కూచుని తనూ భక్తితో నమస్కరించింది భద్రా దేవి. వారి వెనక నిలబడిన యువ రాణి ఉలూచీశ్వరి కూడ తండ్రికి సవినయంగా ప్రణామం చేసింది.

వారి వినయ విధేయతకు నాగ రాజు అంతరంగం ఒక్క సారిగా పులకించింది. తనకు తెలీకుండానే రెండు చేతులు ఎత్తి అశీర్వదించ బోయాడు. కాని లిప్త కాలం లోనే మనసు మార్చుకున్నాడు. పులకింత నుండి తేరుకుని హుంకరించాడు. నాగ కేసరితో ఏదో చెప్పి గుట్ట వద్దకు పంపించాడు. ఆ నాగ జాతి నాయకుడు ఏ సందేశమో రాయ బారమో తెస్తున్నాడని గ్రహించి ధనుంజయునితో బాటు అతివలిరువురూ గుట్ట వంచ కొచ్చి నిలుచున్నారు. ఓ చేత్తో కాగడా పుచ్చుకొని రెండో చేత్తో ఈటె అందుకొని వూపుకొంటూ పెద్ద

పెద్ద అంగలతో గుట్ట కిందికొస్తున్నాడు నాగ కేసరి.

“ప్రభూ! వచ్చు వాడు మర్మ భూమి అటవీ భాగం లోని నాగా జాతి ప్రజ నాయకుడు. అతడి నామధేయము నాగ కేసరి. నాగాలంతా మా జనకునికి వీర భక్తులు” అంది ధనుంజయునితో ఉలూచీశ్వరి.

తల పంకించాడు ధనుంజయుడు.

నాగ కేసరి గుట్ట దిగువకు వస్తూండగా` “ఇక ముందుకు రావలదు” అనరిచింది భద్రా దేవి.

“అచట అగ్ని రేఖ వున్నది, ప్రమాదం. మీరు చెప్పదలుచుకున్నది ఎద్దియో అచటి నుండియే చెప్ప వచ్చును.” అంటూ హెచ్చరించింది. వెంటనే అక్కడే నిలిచి పోయి తలెత్తి గుట్ట పైకి చూసాడు నాగ కేసరి.

“రత్న గిరి యువరాజులుం గారికి జయము జయము. నేను నాగా నాయకుడను నాగ కేసరి యను వాడను. మా దైవం నాగ రాజులుం గారి పనుపున వచ్చితి. మీతో మాటలాడవలె.” అనరిచాడు.

“ఏమి మాటలాడెదవు?” వెంటనే అడిగాడు ధనుంజయుడు.

“యువ రాణి ఉలూచీశ్వరిని వప్పగించుము. లేకున్న పోరు తప్పదని మా దైవం తరఫున హెచ్చరింప వచ్చితిని”

“ఇంత దనుక వచ్చిన మీ దైవం నా ముందు కొచ్చుట కేమి? మధ్య వర్తితో మాటలాడు వాడను గాను. స్వయముగా వారినే ఇటకు వచ్చి మాటలాడమని పోయి వారితో నా మాటగా చెప్పుము” అన్నాడు.

నాగ కేసరి తన జాతి జనంలో ఎన్నో చిక్కు సమస్యలు గట్టి తగవులు తీర్చిన అనుభవ శాలి. వయసులో పెద్ద వాడు. అలాంటి వాడే ధనుంజయుని మాటలకు ఖంగు తిన్నాడు.

బహుశ దివ్య నాగ మణి ని యిస్తే మీ యువ రాణిని పంపిస్తానంటూ ధనుంజయుడు మెలిక పెట్ట వచ్చని వస్తూ వస్తూ వూహించాడు. నాయనా పసి వాడివి ఎంతో భవిష్యత్తు కల వాడివి. పెద్దలతో వైరము క్షేమం కాదు. నా మాట విని యువ రాణీ వారిని వప్పగించుము అంటూ హితవు చెప్పాలని కూడ అనుకున్నాడు. కాని ధనుంజయుని ఖచ్చితమైన సమాధానం అతడి ఆలోచనల్ని తలక్రిందులు చేసింది. చూస్తుంటే ఈ సమస్య అంత సులువుగా తేలేది కాదని అర్థమై పోతోంది. హితవు చెప్పే ఉద్దేశాన్ని విరమించుకుని గిరుక్కున వెను తిరిగి చర చరా నాగ రాజు ముందుకెళ్ళి వివరించాడు.

ఆ మాటలు వినగానే`

నాగ రాజు ముఖం జేగురించింది. కళ్ళెర్ర జేసి హుంకరించాడు. గదాయుధాన్ని లేపి భుజాన వేసుకుని ఆగ్రహావేశాలతో విస విసా గుట్ట దిగువకు వచ్చేసాడు. అగ్ని రేఖకు మూడడుగులు ఇవతలే ఆగి పోయి తలెత్తి గుట్ట పైకి చూసాడు. మంద హాసంతో వినమృడై మరో సారి నమస్కరించాడు ధనుంజయుడు. భద్రా దేవి కూడా ప్రణామం చేసింది. ఉలూచీశ్వరి మాత్రం వారికి వెనగ్గా నిలబడి తండ్రి వంక చూడ లేక మౌనంగా తల దించుకుంది. వారి విధేయతకు మరింత ఉడికి పోయాడు నాగ రాజు.



“ఆపండి మీ వినయము” అనరిచాడు.

“ఏమి ధైర్యము? ఏమి ఈ దుస్సాహసము. కేవలము మానవ మాత్రులు మాతో సరియా? ధనుంజయా... నీవు మా తనూజను చేపట్టునంతటి గొప్పవాడివా? నీకు నాగ లోకపు దివ్య నాగమణి కావలెనా? ఈ మాయలాడి మంత్ర గత్తెను నమ్ముకొని మిడిసి పడుచున్నావా... నీకు ప్రాణము మీద ఆశ వున్నచో తక్షణమే మా పుత్రికను మాకు వప్పగించి మీ రాజ్యమునకు మరలి పొమ్ము. లేకున్న తగిన శాస్తి అనుభవించగలవు. ఇదియే నా చివరి హెచ్చరిక” అనరిచాడు.

ఆ మాటలకు ధనుంజయుడు ఆవేశ పడలేదు. ఎందుకంటే భద్రా దేవి అతడ్ని ముందే హెచ్చరించింది ఆవేశకావేశము వలదని. దరహాసంతో శాంత గంభీర స్వరంతో యిలా అడిగాడు.

“నాగ రాజా! తమరు పెద్దలు, సర్వం      తెలిసిన వారు. మేము కేవలం మానవులమా... అల్పులమా. మీలో ఇలాంటి అల్ప అభిప్రాయము మా పట్ల కలుగుటకు కారణమేమి? మానవులందు మహనీయులు గలరన్న సత్యము మీరు ఎరుంగనిదా? నేనేమీ అనామకుడనుగానే.

పాండు వంశజుడను, అర్జున అభిమన్య పరీక్షిత్తు జనమేజయాది వీరపురుషుల వారసుడను. వారి రక్తమే నాలోనూ ప్రవహించు చున్నది. చంద్ర వంశము గురించి మీకు తెలియదా లేక గతమును మరచితిరా.

నా ప్రాణ సఖి భద్రా దేవి ఒక మాయలేడా, మంత్రగత్తెయా? ఎవరికి హాని జేసినది? నోటి నిండా విషం పెట్టుకొని మీ జాతివారు మానవులకు హాని జేస్తుంటే తన మంత్ర శక్తితో వారిని కాపాడుతుంది. ఈమె శక్తి మీకు తెలియాలంటే అదో... మీ ముందున్న అగ్నిరేఖను దాటి గుట్ట పైకి రండు. చూచెదము గాక” అంటూ సవాల్ విసిరాడు.

నాగ రాజుకి ఏం చెప్పాలో అర్థం గాక గింజుకొంటున్నాడు. అంతలో భద్రా దేవి అందుకుంది.

“స్వామీ! మీరు నా తండ్రి లాంటి వారు. దయ జూపవలసిన మీలో ఈ కాఠిన్యమేల? మేం మానవులమే. మీ నాగ జాతి పట్ల మాకు చెప్ప రాని గౌరవం`భక్తి. అందుకే నాగుల చవితి యని ఒక పర్వ దినమే ఏర్పరచి మీకు పూజలు చేస్తుంటాం. ధనుంజయుడు నా ప్రాణ సఖుడు. అతని కోసం నా శక్తిని యుక్తిని వెచ్చించుట దోషమెలా అవుతుంది?

నా సఖుడు మీ తనయ యువ రాణి ఉలూచీశ్వరిని బలిమిని గొని రాలేదు. ఈమె తానుగా వలచి వరించి మా వద్ద కొచ్చి మాలో ఒకటైనది. ఇందులో వీరి దోషమేమున్నది?” అనడిగింది సూటిగా.

“అధిక ప్రసంగము” అనరిచాడు అసహనంగా నాగరాజు.

“ఇప్పుడు సమస్య దోషములెన్నుట గాదు. మా ప్రియ పుత్రికను మాకు వప్పగించ వలె. లేకున్న పోరు తప్పదు” హెచ్చరించాడు.

“ఎవరు వప్పగించవలె? నేనా? ఉలూచీశ్వరి ఇప్పుడు నా మనోహరి. నా ప్రాణములో ప్రాణం. వలచి వచ్చిన కన్యను నేనుగా పొమ్మని జెప్పు కఠినాత్ముడను గాను. తను వచ్చిన నిరంభ్యంతరముగా మీతో గొని పో వచ్చును. రాకున్న వెను దిరిగి పోవలె. కాకున్న పోరు తప్పదందురా. వియ్యానికయినా, నెయ్యానికయినా, కయ్యానికయినా నేను సిద్ధమే. నిర్ణయం మీది. తను వస్తుందేమో అడిగి చూడండి. నా ధనస్సు శక్తి మీకు తెలియదు” అంటూ చట్టున విల్లు లేపి ధనుష్టంకారం జేసాడు. అంతే`

ఒక్క పెట్టున వేలాది తుమ్మెదలు మైదానమున జేరి ఝుంకార నాదము సలుపు తున్నట్టు గాలిలో చెల రేగిన రొదకు తట్టుకో లేక చెవులు మూసుకున్నారంతా. నిలువెత్తున వున్న ధనుంజయుని వింటి నారి నుంచి పుట్టిన టంకార నాదం కొన్ని లిప్తల కాలం వరకు ఆ ప్రాంత మంతటా మారు మ్రోగుతూనే వుంది. ఆ శబ్దం నాగా ఆటవిక వీరుల గుండెల్లోనే కాదు, నాగ భటుల గుండెల్లోనూ దడ పుట్టించింది. బహుశ గుట్టను చుట్టి భద్రా దేవి గీచిన అగ్ని వలయం లేకుంటే స్వయంగా నాగ రాజే గుట్ట పైకి వచ్చి తన తనయను బలవంతంగా వెంట తీసుకు పోయే వాడేమో. ముఖా ముఖిని సమస్య ఎటూ తేలేట్టు లేదు. యుద్ధం ప్రస్తుతం అవాంఛ నీయం. ఆలోచిస్తున్న నాగ రాజు సహనం కోల్పోతూ` “చాలు... ఇక చాలును” అనరిచాడు.

“జరిగినది చాలును. నీ వీరము బీరము వినుటకు రాలేదు. అమ్మా ఉలూచీశ్వరి... నా కొమరితగా పరువు నిలపాల్సిన బాధ్యత నీ మీద వున్నది. అయినదేదో అయినది నీ కొరకు వరుని అన్వేషించి ఉంచితిమి. ఈ తరుణంలో నీవిలా జేసి మమ్ము ఏడేడు పదునాలుగు లోకములందు నగు బాటు చేయ తగదు. నీ జనని నీ కొరకు బెంగటిల్లి ఎదురు చూచుచున్నది. జరిగినది మరిచి పొమ్ము. రమ్ము. మన లోకమునకు పోవుదము” అంటూ ఉలూచీశ్వరిని పిలిచాడు.

ఉలూచీశ్వరి తన అయిష్టతను వ్యక్తం చేస్తూ బదులు చెప్పకుండా ధనుంజయుని వెనక్కు జరిగింది.

“నీ మౌనమునకర్థమేమి? వచ్చు ఉద్దేశమున్నదా లేదా? బదులు చెప్ప వలె” గర్జించాడు నాగ రాజు.

“హూహు! ఈ మౌనము తగదు దేవి. నిర్భయముగ నీ నిర్ణయమును మీ జనకునకు తెలియ జెప్పుము” అంటూ ధనుంజయుడు ఉలూచీశ్వరిని ముందుకు లాగాడు.

వంచిన శిరస్సు ఎత్తకుండానే`

బదులిచ్చింది ఉలూచీశ్వరి.

“క్షమించు జనకా. నేను తప్పు జేసితినో ఒప్పు జేసితినో నాకే తెలియదు. మీరు నా అభీష్టము నెన్నడును కాదన లేదు. నా మనసు ఈ రాకుమారుని వరించినది. మా ప్రేమ స్థిరమైనది, శాశ్వతమైనది. నా ప్రాణము సర్వస్వము ఇతడే. వీరిని విడిచి మన జాలను. నేను వీరి తోనే మన లోకమునకు వత్తును. ఇప్పుడు మీ వెంట రాజాలను. జనకా... మీరు మాయందు కరుణ జూపి మన నాగ లోకపు ఒక్క దివ్య నాగ మణిని నొసంగిన చాలును. మేము రత్న గిరికి పోయెదము.” అంటూ చేతులు జోడించి తండ్రిని కన్నీళ్ళతో అర్థించింది.

అంత స్పష్టంగా ఉలూచీశ్వరి తన నిర్ణయాన్ని చెప్పాక ఇక ఏం మాట్లాడాలో ఏం చేయాలో అర్థం కాలేదు నాగ రాజుకి. యుద్ధమంటూ ఆరంభిస్తే ఆ యిద్దరే కాదు, తన కుమార్తెకూ హాని తప్పదు. ఆ యువతి భద్రా దేవి వద్ద ఇంకా ఎన్ని మంత్ర శక్తులున్నాయో తెలిదు. ప్రస్తుతానికి ఆశ వదులుకొని మరలి పోవుటే మంచిది. నేరుగా జయింప సాధ్యము గానపుడు యుక్తితో జయింప వలె. చూచెద గాక అనుకుంటూ`

ఓ సారి గుట్ట పైన ముగ్గురినీ క్రోధావేశంతో చూసాడు. అంతే` ఇంకేమీ మాట్లాడ కుండా గదాయుధాన్ని భుజాన వేసుకొని గిరుక్కున వెను తిరిగి చర చరా తన పరివారం వైపు వెళ్ళి పోయాడు. వాళ్ళతో ఏదో చెప్పి చీకట్లలో ముందుకు సాగాడు.

క్షణాల్లో ఆయన ఆనతి`

మైదానమంతటా ప్రాకి పోయింది.

వచ్చిన నాగా జాతి వీరులు నాగ లోక భటులు అంతా ఎలా వచ్చిన వాళ్ళు అలాగే మైదానం వదిలి వెళ్ళి పో సాగారు. చూస్తూండ గానే మైదాన మంతా ఖాళీ అయింది. కాగడాలు మూడు వరుసల్లో క్రమంగా దూరమవుతూ అదృశ్యమయ్యాయి.

ధనుంజయ, భద్రాదేవి, ఉలూచీశ్వరి మాత్రం గుట్టపైన బొమ్మల్లా అలాగే నిలబడున్నారు. దుఖిస్తున్న ఉలూచీశ్వరిని భద్రా దేవి ఓదార్చినది.

''నా జనకుడు ఎందుకింత మానవ ద్వేషిగా మారినారో తెలియకున్నది. నను అర్ధము జేసు కొని మన నాశీర్వదింతురని భావించితి. క్రోధమున వెడలినారు'' అంటూ బాధ పడుతోంది.

''బాధ పడకుము సోదరీ. ఇప్పుడేమైనది. ఇవాళ గాకున్న రేపు అర్థము జేసు కొని మననాశీర్వదించెదరు'' అంది అనునయంగా భద్రా దేవి.

సరిగ్గా ఇదే సమయంలో`

భూతం ఘృతాచి రివ్వున గాలిలో ఎగురుతూ వచ్చి భద్రా దేవి ఎదుట నిబడింది. నాగ స్వరము బుర్రను అందించి చేతు కట్టు కుంది వినయంగా.

''తల్లీ! మీరు చెప్పినటులేజేసితి. ఒక్క సర్పమును మిగుల లేదు. అన్నియు లోయలో పడినవి'' అంది ఉత్సాహంగా.

ఇంతలో భద్రా దేవి భుజం తట్టి` ''అక్కా! అటు చూడుము'' అంటూ చేయెత్తి పశ్చిమంగా చూపించింది ఉలూచీశ్వరి. అంతా అటు చూసారు.

అక్కడ నేలకు ఎత్తుగా`

ఒక దివిటీ గాలికి రెప రెప లాడుతూ మండుతోంది. బహుశ నేలకు గుచ్చిన ఈటెకు అది కట్టబడి వుండాలి. ఆ ఒక్కటీ తప్ప గుట్టను చుట్టి వేరెక్కడా మరో దివిటీ లేదు.

ఆ ఒక్క దివిటీ ని వాళ్ళు`

ఎందుకు వదిలి వెళ్లినట్టు?

ఇందులో ఏదన్నా మోసం వున్నదా?

సందేహం రానే కూడదు.

వస్తే తక్షణమే సందేహ నివృత్తి చేసు కోవాలి. లేదంటే సమస్యలు తప్పవు. ''ఘృతాచి వెళ్ళుము. ఆ దివిటీ సంగతేమిటో చూసి రమ్ము.

దాన్ని ఆశ్రయించు కొని ఎవరు వున్నను వదలకుము. పట్టి నా ఎదుటకు తెమ్ము'' అంది భద్రా దేవి.

''చిత్తము. ఇప్పుడే పోయి జూచి వచ్చెద'' అంటూ ఎలా వచ్చిందో అలాగే రివ్వున గాలిలో ఎగురుతూ మండుతున్న దివిటీ వైపు వెళ్ళి పోయింది ఘృతాచి.

అది తిరిగి వచ్చు లోపల ఏవో మంత్రాలు పఠిస్తూ తను రాతి గుట్టను చుట్టి గీచిన అగ్ని రేఖను ఉపసంహరించింది భద్రా దేవి. అప్పటికి పశ్చిమాకాశాన` శుక్రుడు అస్తమించాడు.తూర్పు ఆకాశం తెల్లబడుతోంది.

తెల్లవారడానికి అట్టే సమయం లేదు.

"ఆ దివిటీ వద్ద ఎవరో వుండి వుంటారా?" అటే చూస్తూ అడిగాడు ధనుంజయుడు.

"ఏమో... వుండే వుంటారు. లేకున్న ఆ ఒక్క దివిటీని వాళ్ళు విడిచిపోనేల?" అంది భద్రా దేవి.

ఈలోపల భూతం ఘృతాచి దివిటీ వద్దకు చేరు కొని చూసింది. ఒక ఈటెను నేలలో గ్రుచ్చి దాని పై భాగన దివిటీ కట్టబడుంది. దాని పరిసరాల్లో పురుగు కూడ కదులుతున్నట్టు లేదు. 'ఏమున్నదిచట?' అనుకొంటూ వెను తిరిగ బోయి ఏదో అనుమానం వచ్చి మరోసారి ఈటెను

పరికించి చూసింది. అది అసహజంగా వుంది. ఒకటి కాదు రెండు ఈటెలు నిలబెట్టినట్టుంది. అసలివి ఈటెలేనా లేక వేరే ఏమన్నానా? అనుమానంతో ఈటెను పట్టి చూసింది. నిజంగానే అవి ఒకటి కాదు, రెండు. ఒక ఈటె గట్టిగా వుంది. రెండోది మెత్తగా తగిలింది. ఆ ఈటెను నిలువునా ఏదో సర్పం ఆశ్రయించు కొని ఈటెలా భ్రమ కలిగిస్తూ మోసం చేస్తోందని అర్థం కాగానే ఘృతాచికి పట్ట రాని కోపం వచ్చింది.

"ఆహా! పాములన్నిటిని తీసుకెళ్ళి లోయలో పారవైచితి. నీవు మాత్రం తప్పించు కొని నన్నే ఏమార్చెదవా? వదల... నిను వదల" అంటూ దాని నడుం పుచ్చుకుని ఈటె నుండి బలంగా లాగింది.

అది రక్త పింజేరిలా ఎర్రగా వుంది. కాని అంత కన్నా బలంగా పొడవుగా వుంది. ఇవతలకు లాగిన వెంటనే వికటాట్టహాసం చేస్తూ ఘృతాచి చేతికి తన తోక భాగాన్ని చుట్టేసింది. తల భాగాన్ని పైకి లేపింది. ఆశ్చర్యం `

దాని శరీరం పాము శరీరమే గాని త పాము తల కాదు, ఒక పురుషుని తల. ఎర్రటి ముఖ వర్చస్సు, పెద్ద కళ్ళు ఆ వింత పాము భూతం ఘృతాచి చేతికి చిక్కింది గాబట్టి సరి పోయింది. అదే మనిషయితే అదిరి పడి ప్రాణాలు వదిలేసే వాడు. ఆ సర్ప శరీరుడైన పురుషుడు వికృతంగా నవ్వుతూనే తల లేపి ఘృతాచి ముఖంలో ముఖం పెట్టి చూస్తూ ` "ఏయ్ భూతమా. నీవు నన్నేమీ చేయ గలవు? విడిచి పెట్టుము. లేకున్న నా శరీరంతో నిను చుట్టి, బంధించి దారుణముగా హింసించెద" అనరిచాడు.

ఆ మాటలకు వళ్ళు మండిన ఘృతాచి వాడి తల మీద ఒక్క దెబ్బ వేసింది. "నేను మామూలు భూతాన్ని కాదురా నీవు

హింసించుటకు. నిను వదల. నా నుంచి తప్పించుకో లేవు'' అంటూ దివిటీని లాగి వాడి శరీరానికి తాకించింది. అంతే`

ఒళ్ళు కాలిన బాధతో కెవ్వున అరిచాడా నాగ లోక వాసి. భూతం చేతిని వది లేసి వేలాడుతూ` ''వద్దు... నను కాల్చకు. వదిలెయ్'' అంటూ అర్థించాడు.

''వదులుతా కాని ఇక్కడ కాదు సుమా. నీ సంగతేమిటో వాళ్ళు చూచు కొనెదరు గాక'' అంటూ ఓ చేత్తో ఆ వింత పాముని రెండో చేత్తో ఈటెతో సహా దవిటీని పుచ్చుకొని ఎలా వెళ్ళిందో అలాగే గాలిలో రివ్వున ఎగురుతూ వచ్చి భద్రాదేవి ఎదుట నిలిచింది. ఈటెను నేలలో గుచ్చగానే దివిటీ వెలుగులో ఇప్పుడు ముఖాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

ఘృతాచి తెచ్చిన వింత పామును జూచి ధనుంజయ, భద్రా దేవిలు విభ్రాంతి చెందగా యువ రాణి ఉలూచీశ్వరి మాత్రం వాడ్ని చూసి` ''నువ్వా?'' అనరిచింది.

''వీడు నీకు ముందే తెలుసునా?'' అడిగింది భద్రా దేవి.

''అవును అక్కా. వీడు మా నాగ లోక వాసి. అందునా మా జనకుని మంత్రి వర్గ మందు ఒక మంత్రి కుమారుడు. వీడు బహు మాయావి, టక్కరి. కుయుక్తులు పన్నుట లోను మోసము చేయుట లోను నేర్పరి. వీడి నామ ధేయము వక్ర దంతుడు. అంతా ఇచ్చోటు వదలి వెడలి పోయినా వీడు మాత్రము ఎందుకు ఇచట వుండి పోయినాడో అర్థము గాకున్నది'' అంది ఉలూచీశ్వరి.

''గాదు... నీకు అర్థము గాదు యువ రాణీ. నీవు తెలుసు కొన వలసిన విషయము అనేకమున్నవి.'' అంటూ తన వంకర పళ్ళు బయట పెట్టి మళ్ళీ వెకిలిగా నవ్వాడు వక్ర దంతుడు.

''ఏమా విషయము?'' వాడి చూపులో వేడిగా అడిగింది ఉలూచీశ్వరి. భూతం ఘృతాచి చేతిని చుట్టు కొనే అలా గర్వంగా తల పైకెత్తి యువ రాణి వంక చూసాడు వాడు.

''ఏమందువా? నా జనకుడు నీ కొరకు ఎంపిక జేసిన వరుడు ఎవరో నీకు తెలుసునా? నీకు తెలియదు. హ...హ...హ... అది నేనే'' అన్నాడు.




“నిన్ను ఎంపిక జేసి నారా!” అంటూ విస్తు పోయింది యువ రాణి. ధనుంజయ, భద్రా దేవిలు ముఖ ముఖాలు చూసుకుని వస్తున్న నవ్వుని బల వంతంగా ఆపుకున్నారు.

“అవును నన్నే” అన్నాడు వక్ర దంతుడు సగర్వంగా.

“నాకేమి తక్కువ? మరీ ఆశ్చర్య పోవలదు. మన జోడి అద్భుతమని మన వారంతా మెచ్చిరి. నాగ రేడుకు కాబోవు అల్లుడ. ఒకే కుమార్తెవు గావున ఆయన తర్వాత సింహాసనమునకు నేనే వారసుడనని, తదుపరి నాగ రేడు నేనేయని ఎంతో ఆశతో వుంటిని, ఎన్నో కలలు గంటిని. కాని నీవు జాతి తప్పి ఒక మానవుని వరించి ఘోర తప్పిదము జేసి తల వంపు దెస్తివి. నా ఆశలన్నియు నిరాశ జేసినావు” అనరిచాడు.

ఇప్పుడు భద్రా దేవి కల్పించు కొంటూ` “బాగు బాగు. నీ గురించి తెలిసినది సరి. అందరితో వెడలి పోక కాగడాను ఆశ్రయించు కొని మాటున ఇచటనే ఉండుటకు కారణ మేమి?” నిల దీసింది.

‘‘చెప్పు... అది మాత్రం చెప్పజాల’’ అరిచాడు వాడు.

‘‘చెప్ప వలె’’

‘‘చెప్ప నంటిని గదా. ఈ భూతాన్ని అండగా జూచు కొని నను బెదిరింప బని లేదు. నేను తలచిన ఇప్పుడే వెడలి పో గలను’’ అన్నాడు వక్ర దంతుడు.

‘‘అలాగునా. మంచిది. పొమ్ము చూచెదము గాక. ఘృతాచి, వాడ్ని వదులుము’’ అంది భద్రా దేవి.

మౌనంగా చూస్తూ నిలుచున్నాడు ధనుంజయుడు. ఈ విషయంలో తను కల్పించు కోవలసిన పని లేదు. ఏం చేయాలో భద్రా దేవికి తెలుసు.

భూతం ఘృతాచి తృటిలో ఆ సర్ప శరీరుడ్ని చేతి నుండి లాగి కోపంతో నేలకు విసిరి కొట్టింది. వాడు చుట్ట చుట్టు కొని శిరస్సు పైకి లేపే లోన మంత్రంతో వాడికి కట్టు కట్టింది భద్రా దేవి. దాంతో వాడు శిరస్సు పైకి లేపి బొమ్మలా అలాగే వుండి పోయాడు.

‘‘వెడలి పోగలవా? ప్రయత్నించు’’ అంది వ్యంగ్యంగా భద్రాదేవి.

వక్ర దంతుడు కదిలే ప్రయత్నం చేసాడు.

కాని అతడి వల్ల కాలేదు.

‘‘సోదరీ! ఇదియే వీడి అసలు రూపమా లేక పూర్తిగా పురుషాకృతి వున్నదా?’’ ఉలూచిశ్వరిని అడిగింది.

‘‘ఉన్నది’’ అంది ఉలూచిశ్వరి.

‘‘అంటే ఈ వింత రూపమున వీడు మనల మోసగించు చున్నాడు. చూడు వక్ర దంతా! నీ నిజ రూపు ప్రదర్శించి, నీవిచట ఎందుకు ఉంటివో చెప్ప వలె. చెప్పకున్న నిన్నిలా వదిలి పోయెదము. అప్పుడు ఆకలి దప్పులతో శుష్కించి మరణించెదవు గాక. చావో బ్రతుకో నీవే నిశ్చయించు కొమ్ము. అవతల ఉషోదయ వేళ సమీపించు చున్నది. మేము బయలు దేర వలె’’ అంటూ కదిలింది భద్రా దేవి.

వక్ర దంతుడు గుటకలు మ్రింగాడు.

మిర్రి మిర్రి చూసాడు.

నిజం గానే తనని లాగే వదలి పోతారేమో నని భయం పట్టు కుంది. భద్రా దేవి మంత్ర శక్తిని అంచనా వేయ లేక సరిగ్గా చిక్కు బడ్డాడు. తన శక్తి యుక్తులన్నీ ప్రయోగించి బయట పడాలని చూసాడు. ప్రయోజనం లేక పోయింది.

సాధారణంగా మంత్ర గాడు ఎవడైనా పామును మంత్రంతో కట్టు కడితే అలా వదిలి పోడు. కట్టు విప్పి ఆ పాము నిరపాయంగా ఆవలకు పోయేలా చూసి అప్పుడు వెళతాడు. ఎందు కంటే నాగ దోషం మహా దోషమని వాళ్ళకు తెలుసు. కాని ఇక్కడ భద్రా దేవి వక్ర దంతుడ్ని అలాగే వదిలి పోతాననడంలో తంత్రం వుంది, బెదిరింపు వుంది. ఆమె తంత్రం ఫలించింది. నిజం గానే వెళ్ళి పోతారేమో నని కంగారు పడ్డాడు వక్ర దంతుడు. వాడు ఆలోచించే లోపలే`

తమ వస్తు సామాగ్రిని తిరిగి ఎప్పటిలా అశ్వాల మీద సర్దేసారు ముగ్గురూ. భద్రా దేవి తన మచ్చల గుర్రాన్ని ధనుంజయుడు తన శ్వేతాశ్వాన్ని కళ్ళాలు అందుకొని నడిపించు కొంటూ గట్టు దిగేందుకు బయలు దేరారు. అప్పుడు అరిచాడు వక్రదంతుడు` ‘‘ఆగండి. మీరు చెప్పినట్టు చేసెద’’ అంటూ.

భద్రా దేవితో బాటు అంతా అతడ్ని చూసారు.

‘‘సరి. నిజ రూపం ప్రదర్శింపుము’’ అంది భద్రా దేవి.

వెంటనే అక్కడ సర్ప రూపుడు అదృశ్యుడై ఆ స్థానంలో ఆజాను బాహుడైన ఒక పురుషుడు ప్రత్యక్షమయ్యాడు. పన్నెండు అడుగుల ఎత్తున ఎర్రటి దేహంతో బలిష్టంగా వున్నాడు. నీలం రంగు పట్టు పంచె దట్టీ బిగించి కట్టి మెడ లోను శరీరం మీద మణి మయ ఆభూషణాలు ధరించి వున్నాడు. అప్పుడు కూడ చలనం లేనట్టు శిలా విగ్రహంలా నిల బడి వున్నాడు. ఎందుకంటే` భద్రా దేవి మంత్ర కట్టు ఉప సంహరించ లేదు. అది అలాగే బంధించి వుంచింది వాడిని.

‘‘చెప్పుము వక్ర దంతా. అంతా వెడలి నారు. నీవే ఇచ్చోటనే వుంటివి?’’ అడిగింది భద్రాదేవి.

వక్ర దంతుడు భారంగా నిట్టూర్చి కారణం వివరించాడు.

‘‘అది మా నాగ రేడు ఆనతి. మరుగున మీ మాటలు విని మీ ఆలోచనలు తెలుసు కొనుట, మీ ప్రయాణ మార్గమును గోప్యముగా అనుసరించుట, సమయము జూచి యువ రాణి ఉలూచీశ్వరిని అపహరించి మా నాగ లోకమునకు ఎత్తుకు పోవుట. ఈ కార్యము సాధించుకు రమ్మని మా ప్రభువు ఉత్తరువిచ్చి నన్నిచట విడిచి వెళ్ళినారు. అలా చేసినచో తక్షణం యువ రాణిని నాకును వివాహము జరిపించెద యని నాకు మాట యిచ్చినారు. అందుకే నేనిచట నిలిచితి’’ అంటూ అసలు విషయం బయట పెట్టాడు.

ఆ మాటలు వినగానే`

దండ తాడిత భుజంగంలా బుసలు కొట్టి వక్ర దంతుని రక్త వీక్షణాలతో చూసింది యువ రాణి ఉలూచీశ్వరి.

‘‘చూచితివా అక్కా ఈ అన్యాయము? నా జనకుడే అనతిచ్చినాడో లేక ఈ గుంటనక్కే స్వయమున నిర్ణయించు కున్నాడో తెలిదు గాని నన్నపహరించుటకే వేచి వుండె. వీడి మంత్ర కట్టు విప్పకుము. ఈ ధూర్తుడు అన్నాహారము లేక ఆకలి దప్పులలో మాడి కృంగి కృశించి నశింప వలె. వీడిని వదలకుము’’ అంది ఆవేశంగా. ఆ మాటు విని ` ‘‘ఇదన్యాయము, ఘోరము’’ అనరిచాడు గాభరాతో వక్ర దంతుడు.

‘‘ఇందున నా దోషమిసుమంతయు లేదు. ఇది నీ జనకుని నిర్ణయము. నా స్వీయ నిర్ణయము గాదు. నను విడిచి పెట్టిన చాలును, నా దారిన బోయెద. బుద్ధి వచ్చినది. ఇక మీ వంక కన్నెత్తి యైన జూచు వాడను గాను. నా యందు దయ జూపి విడిచి పెట్టండి. యువ రాజా ధనుంజయా! కరుణా హృదయుడవు. నీవైన చెప్పుము’’ అంటూ దీనంగా అర్థించాడు.

“వలదు వలదు. వీడి మాటలు నమ్మ వలదు. ఈ కపటి మనల విడువడు” అంటూ హెచ్చరించింది ఉలూచీశ్వరి.

“వదలక ఏమి చేయ గలడు?” దర హాసంతో అడిగాడు ధనుంజయుడు.

“నేను చెంత నుండ నిను అపహరింప గలడా? ఇక మన వెంట పడనంటున్నాడు. ప్రాధేయ పడు చున్నాడు. విడిచెదము గాక. భద్రా వీడిని త్వరగా పొమ్మనుము. మనము బయలు దేర వలె” అన్నాడు. అంతే కాదు, తన అశ్వాన్ని అధిరోహించి కళ్ళాలు అందుకున్నాడు.

“సరి వక్ర దంతా. మా ప్రభువు ఆనతి శిరసావహించి నిను వదిలెద. ఈ తూరి మా కంట బడిన నీకు మరణము తప్పదు. పొమ్ము, యధేచ్ఛగా పొమ్ము” అని హెచ్చరించి ఏదో ఉచ్చరిస్తూ మంత్ర కట్టు విప్పింది. అంతే`

ఎప్పుడైతే విముక్తి కలిగిందో తక్షణమే కాలు చేతు విదిలించాడు. కనీసం తను వెళ్తున్నట్టు కూడ చెప్పలేదు వారితో. ఓసారి యువ రాణి ఉలూచీశ్వరి వంక వంకరగా నవ్వుతూ జూచి వేగంగా గుట్ట దిగి చీకట్ల మాటున ఎటో నడుచుకుంటూ వెళ్ళి పోయాడు వక్ర దంతుడు.

వక్ర దంతుడు కను మరుగు కాగానే ఎప్పటిలా భూతం ఘృతాచి మచ్చల గుర్రం మీది తోలు సంచిలో ప్రవేశించి విశ్రాంతిగా పడుకుంది. ఉలూచీశ్వరి మాత్రం సూర్యోదయం వరకు నీతో ఉంటానంటూ ధనుంజయుని అశ్వం మీద అతడి ముందు కూచుంది. అశ్వాలు రెండూ గుట్ట దిగి మత్స్య దేశం సరి హద్దు దిశగా దౌడు ఆరంభించాయి. అప్పుడే తూర్పు దిక్కు తెల్ల బడుతోంది. ఇప్పుడు ఆ గుట్ట మీద ఘృతాచి వదిలిన ఈటె చివర దివిటీ మాత్రం గాలికి రెప రెప లాడుతూ ఒంటిగా మిగిలి పోయింది.

*****************************************

గాంధార రాజ్యం.

రాజ ధాని గాంధార నగరం.

ఉదయపు సూర్య కిరణాలకు శతానీకుని కోట అద్భుతంగా ప్రకాశిస్తోంది. కష్ట జీవులైన నగర వాసులు ఎవరి పనులు వారు దిన చర్యలలో భాగంగా చేసుకు పోతున్నారు. కోట లోని తన రాజ మందిరంలో చాలా ఉత్సాహంగా వున్నాడు గాంధార ప్రభువు శతానీకుడు.

అంత క్రితమే రత్న గిరి నుండి అచటి ఉప సైన్యాధ్యక్షుడైన బాహ్లీకుని లేఖను తీసుకొని వచ్చి చేరింది ఒక కపోతం. ఆ పావురం నుండి లేఖ తీసుకొని చదివి ఆనంద భరితుడై పసిడి లోటా లోని మధిరను పూర్తిగా తాగే సాడు.

ఆ లేఖ సారాంశం....

తన మనుషులు హైహియ రాజ్య భూ భాగం లోని పర్వత ప్రాంతాల్లో రత్న గిరి యువ రాజు ధనుంజయుని హత మార్చారు. ఆ విషయం తెలిసిన రత్న గిరి ప్రజలు కూడ భయాందోళనల మధ్య వూగిసలాడుతున్నారు. నా ఆధీనం లోని సైన్యం తిరుగు బాటుకు ఉవ్విళ్ళురుతున్నారు. రత్న గిరి సైన్యంలో ధనుంజయుని మరణ వార్త కలకలం రేపింది. ధైర్యం సన్నగిల్లి వున్నారు. కావున యుద్ధానికి ఇది అనుకూలమైన సమయం. మీరు ససైన్యంగా ఎప్పటికి రత్నగిరి చేర గలరో తెలియ జేస్తే ఆ రోజుకి కాస్త ముందుగా ఇచట మేము తిరుగు బాటు ఆరంభించుటకు అనుకూలంగా వుంటుంది. మీ లేఖ కోసం నిరీక్షిస్తూంటాను. అని పేర్కొన బడి వుంది.

తన చిరకాల వాంఛ నేర వేరు సమయము ఆసన్నమైనందుకు మహదానంద భరితుడై వున్నాడు శతానీకుడు. ఇప్పటికే మిత్ర రాజ్యాలను సంప్రదించి సైన్య సమీకరణ గావించటం జరిగింది. అలాగే పాంచాల దేశాన్ని అనేక నావలను, దిగువ తీర రాజ్యమైన కరూర దేశాన్ని పదివేల యుద్ధనౌకలను సిద్ధంగా ఉంచమని కోరడమైనది. ఆ పనులు అచట ఆగ మేఘాల మీద జరుగుతున్నాయి. ఇక మిగిలింది తన మంత్రులతో సంప్రదించి యుద్ధ వ్యూహాన్ని రూపొందించుట, అలాగే సమరానికి బయలు దేరేందుకు ఆస్థాన పురోహితులచే మంచి ముహూర్తము నిర్ణయించుట, బాహ్లీకునికి వర్తమానము పంపించుట మిగిలి వున్నవి. తాము రత్న గిరి సముద్ర జలాల్లో ప్రవేశించుటకు కనీసం ఇరువది దినములు అగును.

ఈ దినము మరిచి పోలేనిది.

కాబట్టి ముఖ్యమైన పనులన్నీ `

ఈ దినము జరిగి పోవలె.

అందుకే తెల్లవారి తొలి జాము జరక్క ముందే తన మంత్ర వర్గ సమావేశం ఏర్పాటు జేయ కబురు పంపించాడు. వారంతా వచ్చి ఉండాలె.

ఆలోచిస్తూనే త్వర త్వరగా తయారయ్యాడు. పట్టు పీతాంబరాలు కట్టి కశ్మీరు సుగంధ లేపనం పూసుకున్నాడు. మణి మయ ఆభూషణాదులు ధరించి శిరస్సున రత్న కిరీటం ధరించాడు. బంగారు జరీ అంచుతో కూడిన ఉత్తరీయం భుజాన వేసుకుని కోర మీసం తిప్పుతూ మణులు పొదిగిన పసిడి పాదరక్షలు ధరించి ఆడంబరంగా సమావేశ మందిరానికి బయలు దేరాడు.

ఇది అంతరంగిక సమావేశం కాబట్టి వెంట వింజామరు వీచు దాసీలను గాని దాస దాసీలను గాని పిలువ లేదు. ఒంటి గానే అనేక కక్ష్యలు దాటి తన సభా మందిరానికి వెనక వున్న అంతరంగిక సమావేశ మందిరంలో హుందాగా ప్రవేశించాడు. వెంటనే మందిర కవాటాలు మూయ బడ్డాయి.

అప్పటికే మంత్రులు పది మందీ వచ్చి వున్నారు. తన అంతరంగిక సలహా దాయి వచ్చారు. తన సైన్యాధ్యక్షుడు ఇద్దరు ఉప సైన్యాధ్యక్షులు, నలుగురు సేనా పతులు వచ్చి వున్నారు. ఇంకా ముగ్గురు ఆస్థాన పురోహితులూ వచ్చి అంతా ఉచితాసనాల్లో కూచునున్నారు. ప్రభువు శతానీకుని రాక గమనించి గౌరవ సూచకంగా వారంతా లేచి నిలబడ్డారు.

వస్తూనే వేదిక మీది తన రత్న ఖచిత స్వర్ణ సింహాసనాన్ని అలంకరించి అందర్నీ కూచోవలసిందిగా సైగ చేసాడు. అసు ఈ అత్యవసర సమావేశం దేని గురించో అర్థం గాక ముఖ ముఖాలు చూసుకుంటూ నిశ్శబ్దంగా కూచున్నారంతా.

రాజ శతానీకుడు ఓసారి గొంతు సవరించుకుని తన అంతరంగాన్ని అందరి ముందు బయట పెట్టాడు. రత్నగిరి పరిస్థితుల్ని వివరించాడు. సరైన వ్యూహంతో సముద్ర మార్గంగా వెళ్ళి తమ అసంఖ్యాక సైనిక బంతో రత్న గిరి మీద విరుచుకు పడి జయించాలన్నాడు. బాహ్లీకున్ని విజయం వరించాలన్నాడు.

త్వరలో సమరానికి సన్నద్ధం కావాలని సైనిక ముఖ్యులకు ముందే తెలుసు గాబట్టి వారు మౌనంగా వింటూ కూచున్నారు. ఆశ్చర్య పోలేదు. పెదవి విప్పి మాట్లాడ లేదు. సైనిక వ్యూహం గురించి చర్చ ఆరంభమైనపుడు గాని వారు పెదవి విప్పి మాట్లాడరు. అయితే శతానీకుని ప్రసంగం మధ్య లోనే ఒక గొంతు గంభీరంగా విన్పించింది. ‘‘ఇప్పుడీ యుద్ధం మనకి అవసరమా?’’ అంటూ.

ఆ గొంతు ఎవరిదో అందరికీ తెలుసు.

అది శతానీకుని అంతరంగిక సహోదారుల్లో ఒకడైన సచ్చీలుడిది. అక్కడున్న వారిలో కుండ బ్రద్దలు కొట్టినట్టు నిజాయితీగా ప్రభువు నెదిరించి హితవు పలికే వాడు ఎవడన్నా వున్నాడూ అంటే అది సచ్చీలుడు ఒక్కడే. ఇతడు స్వయానా శతానీకుని పిన తండ్రి. తండ్రి తరపు బంధువుల్లో మిగిలి వుంది కూడ అతడొక్కడే. ఈ కారణం చేత కూడ అప్పుడప్పుడు శతానీకుని యిలా నిల దీస్తూంటాడు సచ్చీలుడు. పిన తండ్రి గాబట్టి అతడి పైన ఎన్నడూ ఆగ్రహించడు శతానీకుడు. వృద్ధుడైన సచ్చీలుడు తన ఆసనం నుండి లేచి సూటిగా ప్రశ్నిస్తుంటే దరహాసం చేసాడు శతానీకుడు. అంతడింకా యిలా అడుగు తున్నాడు.




‘‘ఇప్పుడు మనకు ఏమి కొరవ? ఎందుకీ యుద్ధము? నీ పరిపాలనలో మన గాంధారము సుభిక్షముగనే యున్నది గదా. ప్రజానీకము శాంతి సౌఖ్యాలతో జీవించుచున్నారు. కోశాగారమున కొల్లలుగగ ధనమున్నది. పసిడికి కొరత లేదు. రత్న రాసులకు

కొదువ లేదు. ఐశ్వర్యమునకు లోటు లేదు. ఆహార కొరతయును లేదు. పంటలు పుష్కలముగ పండుచున్నవి. ఇక రాజ్యమందువా? ఉన్న రాజ్యము మనకు చాలదా? మనిషికి ఆశ మంచిదే గాని దురాశ మంచిది గాదు. పేరాశ పతనమునకు దారి తీయును.రత్నగిరి మన శత్రు రాజ్యమూ కాదు. అలాగని మన పొరుగు రాజ్యమూ గాదు. దక్షిణాన ఎచటో సు దూరమున వున్నది. ఎవని మాటలో నమ్మి నిష్కారణమున సైన్యమును నర మేథమునకు నడిపించుట న్యాయ సమ్మతమా? ఆ బాహ్లీకుడు నీకు మిత్రుడైన అగు గాక. వాడు స్వామి ద్రోహి, రాజ ద్రోహి. అలాంటి నీచునికి నీవు సాయం వెడలుట` ఇది నీ వివేకమనుకొందునా అవివేకమనుకొందునా?'' అంటూ వాస్తవాన్ని ఆవేశంగా నిదీసాడు సచ్ఛిలుడు.

ఆ మాటలను శ్రద్ధగా ఆలకించి`

గంభీరంగా చూసాడు శతానీకుడు.

''గౌరవనీయులు, హితాభిలాషియగు పిన తండ్రి గారూ! మా హితవు కోరి మీరు చేసిన హిత బోధకు శతాభివందనము. కృతజ్ఞుడను'' అన్నాడు.

''మీరొక విషయమును మరచినారు. రాజ్యము వీర భోజ్యమను ఆర్యోక్తి మీరు విన లేదా? చరిత్ర మీకు తెలియనిదా! అంది వచ్చిన సదవకాశమును వదలుకొనుట వివేకమా అవివేకమా? గుట్టలుగా సంపద వున్నను ఇంకనూ సంపాదించని పురుషుని లోకమున ఒక్కడి నైనను చూపించ గలరా? అటు మీరు చూపించిన ఈ యుద్ధమును విరమింతును'' అన్నాడు.

ఆ మాటకు గుంభనగా నవ్వాడు సచ్ఛిలుడు.

''నాయనా శతానీకా! చరిత్ర నేను మరువ లేదు సుమా. మన మూల పురుషుడైన శకుని మాటలు నమ్మి రాజ్యము వీర భోజ్యమని విర్ర వీగి పాండు కుమారులతో వైరమును పెంచుకొని పరిస్థితిని కురు క్షేత్రము వరకు తీసుకెళ్ళాడు సుయోధన సార్వభౌముడు. ఏమైనది? ఆ యుద్ధ ఫలితం నీకు తెలియనిది కాదు. బుద్ధి మంతుడు ఎన్నడూ తొందర చూపడు. అవకాశం అనుకుని ఆపదలు కొని తెచ్చుకోడు. రత్నగిరిని తక్కువగా అంచనా వేయుట మంచిది కాదు. నీ నిర్ణయమును పునరాలోచింపుము'' అన్నాడు.

''పిన తండ్రి గారూ! ఇంతగా మీరు అడుగుచున్నారు గావున మీకో నిజము చెప్ప వలె. బాహ్లీకుడు నా మిత్రుడే గాని ఇప్పుడు నా యుద్ధ తంత్రమున వాడొక బలి పశువు. నేను విజయము కొరకు అతడిని పావుగా వాడుకొనుచున్నా నంతే...''

‘‘అది నమ్మక ద్రోహము కాదా?’’

‘‘ఇంతకు మునుపే గదా తమరు శలవిచ్చితిరి ఆ బాహ్లీకుడు ఒక స్వామి ద్రోహి, రాజ ద్రోహియని. అలాంటి ద్రోహికి నేను నమ్మక ద్రోహ మొనర్చుటలో అన్యాయ మేమున్నది? అది న్యాయ సమ్మతమే గదా?’’

‘‘కావచ్చును. కాని వాడు నీకు మాత్రం ద్రోహం చేయడనుటకు హామీ ఏమి వున్నది?’’ సూటిగా అడిగాడు సచ్చీలుడు.

‘‘నీలాగే తగు జాగ్రత్తలో ఉన్నాడేమో ఎవరికి తెలియు? అంత దేనికి, మహా రాజు ధర్మ తేజుడు రోగ పీడితుడైనందున యుద్ధ గళమునకు రాక పోవచ్చును. కాని యువ రాజు ధనుంజయుడు రాకుండునా?’’ అడిగాడు.

ఆ మాటలకు అసహనంగా`

ముఖం చిట్లించాడు శతానీకుడు.

‘‘పిన తండ్రిగారూ! మీకు అర్థము గాకున్నది. బాహ్లీకుని మనుషులు ధనుంజయుని అంత మొందించినారు. ఆ విషయము లేఖలో స్పష్టముగ నున్నది’’ అన్నాడు.

‘‘బాహ్లీకుని లేఖను ఎంత వరకు నమ్మ వచ్చును? ఆ లేఖ గాక యువ రాజు ధనుంజయుని మరణాన్ని ధృవీకరించే మరో ఆధారం వున్నదా? ఆలోచించితివా?’’ సూటిగా అడిగిన సచ్చీలుని ప్రశ్నకు ఏం బదులు చెప్పాలో అర్థం కాలేదు మహారాజు శతానీకునికి. బాహ్లీకుడు లేఖలో అసత్యము వ్రాసినాడని అనుకో లేడు. ఆ లేఖను తను పూర్తిగా విశ్వసిస్తున్నాడు. అందుకే తన అభిప్రాయాన్ని స్థిరంగా యిలా పలికాడు.

‘‘దక్షిణ పథాన రాజ్య స్థాపన మదీయ చిరకాల వాంఛ. మా కుమారుడు విజయేంద్రుడు యుక్త వయస్కుడగు చున్నాడు. నేనింకను వయసు లోనే ఉంటిని. పదవీ కాంక్ష తీర లేదు గనుక వానికి నా రాజ్యమును ప్రస్తుతం పంచి యివ్వజాల. కావున రత్నగిరి జయించి

అచట నా కుమారునికి పట్టాభిషేక మొనర్చి నా ప్రతి నిధిగా రత్న గిరి సింహాసనమున కూచుండ జేసెద. సమస్యను అన్ని కోణములు పరిశీలించి ఆలోచించి ఈ నిర్ణయం గైకొనుట జరిగినది. కావున సమరము అనివార్యము. ఈ విషయమున ఇక వాదోపవాదములకు తావు లేదు. మీరు కూచో వచ్చును'' అన్నాడు నిర్మోహమాటంగా.

ఆ విధంగా మహా రాజు అంతర్యం పూర్తిగా తెలిసాక ఇక ఇంకా తాను వాదించిన కంఠ శోష తప్ప ఎలాంటి ప్రయోజనము లేదని సచ్ఛీలునికి అర్థమైంది.

''సంతోషము ప్రభూ! మీకు విజయము చేకూర గలదని ఆశిస్తున్నాను. మీ నిర్ణయము శిరో ధార్యమైనప్పటికీ నేను యుద్ధ విముఖుడను గావున క్షమించండి. నేను నిష్క్రమించుచున్నాను....'' అంటూ సమావేశం నుండి బయటికెళ్ళి పోయాడు సచ్ఛీలుడు. అతన్ని ఆపే ప్రయత్నం ఎవరూ చేయలేదు గాని చివరిగా అతడు పలికిన పలుకు శతానీకునికే కాదు, అచట ఎవరికీ విన బడ లేదు. ఆ పలుకు ఏమంటే` ''వినాశ కాలే విపరీత బుద్ధిః'' అని.

ఆ విధంగా సమావేశం నుండి సచ్ఛీలుడు నిష్క్రమించాక శతానీకుడు ఇక ఆలస్యం లేకుండా మంతనాలు సాగించాడు. రణ తంత్రం గురించి సైన్యాధిపతులతో చర్చించాడు. ఆస్థాన పురోహితులు లెక్కలు గణించి పేరు బలం చూసి సరిగ్గా నాటికి పదో రోజున సైన్యం కదులుటకు ప్రయాణ ముహూర్తం నిర్ణయించారు. ఆ సాయంకాలమే శతానీకుని సందేశాన్ని తీసుకొని కపోతం ఒకటి గాంధారం నుండి రత్న గిరికి ఎగిరి పోయింది.

ఇలా ఇక్కడ గాంధారంలో ధనుంజయుని మరణం మీద చర్చ సాగుతున్న తరుణం లోనే అక్కడికి దక్షిణ ఆగ్నేయంగా సు దూరంలో వున్న నాగ లోకంలో యువ రాజు ధనుంజయుని ఎలా అంతం చేయాలాని ఆసక్తి కరమైన చర్చ సాగుతోంది.

************************************************

అది మర్మ భూమి అటవీ ప్రాంతం.

అచట భూమి లోపల ఎచటనో వున్న నాగ లోకం. అచట రాజ మందిరంలో నాగ రేడు మహా పద్మడు కొలువు దీరి వున్నాడు. వేదిక మీది మణి మయ సింహాసనాన్ని అధిష్టించి వున్నాడు. వేదిక ఎదురుగా దిగువన రెండు వరుస ల్లోని ఉచితాసనాలను అలంకరించి వున్నారు అతడి మంత్రులు, హితులు, బంధువులు. అందరి ముందు ఎదురుగా తల దించుకొని చేతులు కట్టుకొని

వినమ్రుడై నిలుచుని వున్నాడు వక్ర దంతుడు. తను వప్పగించిన పని నెర వేర్చకుండా తమ వెనకే రిక్త హస్తములతో వచ్చిన వక్ర దంతుని మీద ఆగ్రహించి వున్నాడు నాగ రేడు.

"శిరము వంచి నిలుచుట కాదు వక్ర దంతా. సమాధానము కావలె." ఉరుము లాంటి గొంతుతో గద్దించాడు.

"నిను నమ్మితి. కడు సమర్ధుడవనుకొంటి. అందుకే నా కొమరితలనిచ్చి నీకు బెండ్లి జేసి మా అల్లుని జేయ నెంచితి. నీకు వప్పగించిన కార్యము గూడ చిన్నది. నీవు మా తనయ నింటికి జేర్చిన, ఆ పగతురుడు ధనుంజయుని సంగతి తర్వాత చూడ వచ్చునను కొంటి. అందుకే మరుగున వారిని అనుసరించి సమయము జూచి ఉలూచిశ్వరిని ఎత్తుకు రమ్మంటి. కాని నీవు ఏమి జేసితివి? అసమర్ధుడవని నిరూపించుచూ మా వెనకే పారి వచ్చినావు. నిన్నే మన వలె?" అంటూ గద్దించాడు.

అప్పుడు తలెత్తి ఓసారి అందర్నీ చూసాడు వక్ర దంతుడు` "క్షమించండి ప్రభూ. ఇది చిన్న విషయమని మీరనుకొంటున్నది వాస్తవము గాదు. స్వయముగా మీరే వచ్చిన కాని పని నా వల్ల అవునని ఎటుల వూహించినారు? ధనుంజయుని వెంట వున్నది సామాన్యులు గారు. మంత్ర శక్తిలో అజేయమైన కన్యా మణి ఆ భద్రా దేవి. వారికి రక్షణగా వున్న భూతం ఘృతాచి అసామాన్యమైనది. ఇక వారితో వున్న ఉలూచిశ్వరి శక్తి సామార్ధ్యములు మీకు తెలియనివి గావు.

ఆ ఘృతాచి నను పసి గట్టి పట్టి కాగడాతో ఒళ్ళు కాల్చినది. అది కొట్టిన దెబ్బలింకను బాధించుచున్నవి. ధనుంజయుని దయా గుణంతో నేను బ్రతికి వచ్చితి గాని లేకున్న ఆ భద్రా దేవి నను మంత్ర కట్టుతో బంధీని చేసి పోయేది. ఆకలి దప్పులతో మరణించి వుండెడి వాడిని" అంటూ వివరించాడు.

"అవును ప్రభూ! ఆ భూతం ఘృతాచి ఉండగా వారి నేమీ చేయ జాలము. నాడు అది కొట్టిన దెబ్బలు ఇంకనూ నను బాధించు చున్నవి" అంటూ వక్ర దంతుని మాటలను సమర్ధించాడు కర్కోటకుడు గతం గుర్తు చేసుకుంటూ.

"అలాగని చేతులు ముడుచుకుని ఉందుమా? ఏదో ఒకటి జేసి నా కుమార్తెను తేవలె. ఇప్పుడైననూ తగు ఉపాయము చెప్పండి" అడిగాడు నాగ రాజు.

"ఉపాయము వున్నది" అన్నాడు అక్కడే వున్న తక్షకుడు.

‘‘చెప్పండి మహోదయా. మా పెద్దలు పూజ్యులు మీరు. మీ ఉపాయము అనుకూలమైనచో తప్పక ఆచరించెదము’’ అన్నాడు అటు చూస్తూ నాగ రాజు.

తక్షకుడు గొంతు సవరించుకున్నాడు.

‘‘ధనుంజయుడు లేకున్న ఉలూచిశ్వరి అచట ఉండునా?’’ అడిగాడు.

‘‘ఉండదు. మన వద్దకు తప్పక మరలి వచ్చును. కాని ఆ రాకుమారుని అంతము జేయు వీరుడే మనలో కరువైనాడే’’ అన్నాడు వ్యథతో నాగ రేడు.

‘‘ప్రస్తుతము నీ సమస్య ధనుంజయుడు గాదు. నీ తనూజ ఉలూచిశ్వరి. అవునా?’’

‘‘ఆ మాట నిక్కము. కాని…’’

‘‘మహా పద్మా! ధనుంజయుని మరణంతో నీ సమస్య పరిష్కారమగునని తలంప వలదు. ఏలయిన ధనుంజయుని కాటేసి విషం గ్రక్కినను ఆ భద్రా దేవి అతన్ని పునర్జీవితుడ్ని చేయగల సమర్థురాలు. వంశ పారంపర్యంగా వచ్చిన దివ్య మంత్ర శక్తులామెవి. కాబట్టి ధనుంజయుని జంపు ఆలోచన విరమించి అతన్ని అదృశ్యము గావించిన ఎటులుండునో ఆలోచింపుము’’ అంటూ సూచించాడు తక్షకుడు.

‘‘అదృశ్యము… అది ఎటుల సంభవము?’’

‘‘సంభవమే. ధనుంజయుడు మానవుడు. అతను మహా వీరుడే గాని అతని వద్ద దివ్య శక్తు లేమియును లేవు. ఆ పైన భూ లోకము దక్క వేరే లోకమూ తెలియదు. అతను నిద్రించు సమయమున భూలోకము నుండి గొని పోయి మరో లోకమున విడిచి వచ్చిన అతడు తిరిగి భూ లోకమునకు రా గలడా?’’

‘‘రాలేదు...’’

‘‘అపుడు అతడి జాడ తెలియక విసిగి వేసారి చివరకు ఆశ వదులు కొని మన ఉలూచీశ్వరి పితృ సదనమును వెదుకుకొనుచూ యిచటికి రాగలదు’’

‘‘మరి ఆ మానవ వనిత భద్రా దేవి...?’’

‘‘ఆమెయును ఆశ వదులుకొని స్వ గృహమున కేగును. ఆమె కూడ మానవ మాత్రురాలే గదా’’

‘‘ఆహా... యోచనయనిన యిది. అద్భుతం. అమోఘము’’ అంటూ తక్షకుని సలహాకు ఆనంద భరితుడయ్యాడు నాగ రాజు. కాని అంతలోనే మరో సందేహం కలిగింది.

‘‘యోచన బాగున్నది కాని ఈ కార్యమును సాధించు వారు ఎవరు?’’ అనడిగాడు.

‘‘ప్రభూ! నేను సాధించెద. ఈ తూరి విఫలము చెందు వాడను గాను’’ అన్నాడు వెంటనే వక్ర దంతుడు.

‘‘బాగు బాగు. కాని ఉలూచీశ్వరి ధనుంజయుని జాడరయ సమర్థు రాలే గదా. తిరిగి ధనుంజయుని భూ లోకమునకు రప్పించు ప్రయత్నము జేయ కుండునా?’’ అంత వరకు వింటూ వున్న అనంతుడను కుల పెద్ద మరో సందేహాన్ని బయట పెట్టాడు.

‘‘అసంభవము’’ అన్నాడు వెంటనే నాగరాజు.

‘‘ఉలూచీశ్వరికి ఇంత దనుక మరో లోకము మేము జూప లేదు. భూ లోకమున ఎచట వున్నను అరయు దివ్య దృష్టి మాత్రమే ఆమె కున్నది. ఇతర లోకము గాలించు మహా దృష్టి ఆమెకు లేదు’’ అంటూ అసలు విషయాన్ని బయట పెట్టాడు.

‘‘అటులయిన ఈ యోచన దివ్యముగ నున్నది’’ అన్నాడు అనంతుడు.

“యోచన దివ్యము గనే యున్నది. కాని అది నీచమని మీరు ఎరుంగరా?” అంత వరకు మౌనంగా వింటున్న వాసుకి యను కుల పెద్ద ఇక సహింప లేక గట్టిగా అడిగాడు.

“ఒక నాగ కన్య మానవ వీరుని వరించుట కన్ననూ యిలా వక్ర మార్గమున నీతి బాహ్యమైన కుతంత్రము జేసిన మన నాగలకు ప్రతిష్ట ఇనుమడించునా? ఇక మానవ వీరుని ఏమియు జేయ లేక, మరో లోకమున మోసమున విడిచి వచ్చుటయా! ఇంత కన్ననూ సిగ్గిల కార్యమొండు గదా? నాగలకు న్యాయ ధర్మము నీతి సూత్రము గాదని ఇటు అక్రమ మార్గమును నీవే పురిగొల్పుట ఇది యేమి దురాగతము? ఇంత కన్ననూ, ఆ రాకుమారునికి పాద ప్రక్షాళనము జేసి కన్యా దానము గావించి దివ్య నాగ మణిని కానుక జేసి సగౌరవముగ రత్న గిరికి పంపించి మన పరువును కాపాడు కొనుట ఉత్తమ మార్గము గదా” అంటూ హితవు పలికాడు.

“హుఁ...! ఏమంటిరి? బూజు పట్టిన మన న్యాయ ధర్మము నీతి సూత్రము ఎవరికి గావలె? వర్ణ సంకరము జాతి సంకరమును సమ్మతించుటకు నేను మా తండ్రి గారు పద్ముడను గాను. కలి కాలమున మానవులకే గాదు పుడమిపై సమస్త జీవుకు వక్ర మార్గములు తప్పవు. మా తనయ తెచ్చిన తల వంపు ఎన్నటికీ మరువ జాల. అది సరి దిద్దుటకు ఏ వక్ర మార్గమైననూ అనుసరించెద. నా ఈ నిర్ణయమున మార్పు లేదు. తక్షకుల వారి యోచన అద్భుతముగ నున్నది. ఉలూచీశ్వరి స్వగృహము చేరుటకు ధనుంజయుని మరో లోకమున పడవైచుటే ఉత్తమ మార్గము. అటులే చేయవలె” అంటూ తన కఠోర నిర్ణయాన్ని తెలియ జేసాడు.ఆ మాటలు వినగానే`

వాసుకితో బాటు మరి కొందరు నాగలకు పెద్దలు దిగ్గున లేచారు.




"మంచిది మహాపద్మా. నీవిటుల ఏక పక్ష నిర్ణయము గైకొనునపుడు ఇక మా వంటి పెద్దల సూచనలు సలహాలతో పని యేమున్నది? మమ్ము పిలిచి ఉండ కూడదు. నీ యభిమతము ప్రకారము గానిమ్ము. మేము వెడలుచున్నాము." అంటూ మరో మాటకు అవకాశం యివ్వకుండా ఆగ్రహంతో సభా మందిరం నుండి వెళ్ళి పోయారు వాళ్ళు. వారి వెనకే మరి కొందరూ వెళ్ళి పోయారు. వారిని ఆపే ప్రయత్నమూ చేయలేదు నాగ రాజు. ఇక అక్కడ మిగిలింది తక్షక కర్కోటక అనంతాది కొందరు పెద్దలే మిగిలారు.

"ఎవరికిష్టమున్నను లేకున్నను నా నిర్ణయము మారదు. తక్షక మహోదయా శలవీయండి. ఆ ధనుంజయుని ఏ లోకమున పడ వేయుట ఉత్తమము?" అనడిగాడు తక్షకుడిని.

"మనకు దిగువన అతల, వితల, సుతల, తలా తలాది లోకములున్నవి. వాటిలో చివరిదైన పాతాళ లోకము శ్రేయ స్కరము.

అన్ని లోకములు దాటి అతడు భూ లోకము చేరుట దుర్లభము. మరణ సమము. పాతాళ ప్రభువు బలి చక్రవర్తి అన్యుల చొర బాటును ఆయన క్షమించడు'' అంటూ నవ్వాడు తక్షకుడు.

''యోచన అద్భుతము గనే యున్నది. కాని ఇది సాధించు కొచ్చు వారు ఎవరు? వక్ర దంతుని నమ్మ వచ్చునా?''

''నమ్మ వచ్చును నాగ రాజా. భేషుగ్గా నమ్మ వచ్చును. ఏదో అతడి చెడు కాలమున వారికి చిక్కి ఎలాగో బయట పడి వచ్చినాడు గాని ఇలాంటి మాయలు జేయుటలో వక్ర దంతుడే సమర్థుడు.''

''అవును ప్రభూ. నాకు మరో అవకాశము దయ చేయండి. విజయుడనై మరలి వచ్చెద'' అన్నాడు నమ్మకంగా వక్ర దంతుడు.

''మంచిది. నీ ఒక్కని వలన ఈ కార్యము అగునా? తోడు కావలెనా?'' అడిగాడు నాగ రాజు.

''కావలెను ప్రభూ. ఇచట రెండు కార్యములున్నవి. ఒకటి ధనుంజయుని గొనిపోయి పాతాళమున పడ వైచి వచ్చుట. ఇక రెండవ కార్యము ధనుంజయుడి అదృశ్యం పిమ్మట కూడ ఉలూచీశ్వరి మరలి వచ్చునను నమ్మిక నాకు లేదు. కొద్ది దినములు జూచి అటుల మరలి రాకున్న ఆ భద్రా దేవి ఉలూచీశ్వరికిని మయకము కల్పించి అశ్వ శకటమున రయమున వారి నిచటకు గొని రావలె. అందుకు కొందరు మన నాగ భటులతో బాటు ఒక అశ్వ శకటమును తమరు అనుగ్రహింప వలె'' అంటూ వివరించాడు వక్ర దంతుడు.

''మరి ఆ భూతం సంగతి ఏమి జేసెదవు? భద్రా దేవి నిచటకు గొని రావలదు సుమా!''

''చిత్తము. భద్రా దేవిని విడుతము. ఇక భూతమును ఏమార్చుటకు మన మాయా శృంగుడు చాలును'' అన్నాడు వక్ర దంతుడు.

''మంచిది. వలసిన వారిని దోడ్కొని అశ్వ శకటమున తక్షణమే బయలు దేరుము. ధనుంజయుడు ప్రస్తుతము మత్స్య దేశ భూ భాగమున పయనించు చుండును. ఎందుకైనా మంచిది మీరు మత్స్య దేశము వైపు వారికి ఎదురు వెళ్ళండి. వారి కంట పడకుండా కార్యము సాధించు కొని రండి. వెళ్ళండి.'' అంటూ అనుజ్ఞ యిచ్చాడు నాగ రేడు. అంతే`

మరో జాము లోనే వక్ర దంతుని బృందం బలిష్టమైన అశ్వములు పూన్చిన ఒక అశ్వ శకటం మీద అంగ రాజ్యం వైపు సాగి పోయింది.

*********************************************

ఆ రోజు రాత్రికి`

హైహియ రాజ్యం లోని మైదాన ప్రాంతంలో గుట్ట మీద ధనుంజయ బృందం మజిలీ చేసింది. ఆ రాత్రి వూహించని విషయాలు చాలానే జరిగాయి. స్వయంగా నాగ రాజు తన కుమార్తె ఉలూచీశ్వరిని వెనక్కు తీసుకెళ్ళేందుకు స పరివారంగా ఆర్భాటంగా వచ్చాడు కాని ఏమీ చేయ లేక రిక్త హస్తాలతో మరలి పోయాడు. అంతే కాదు, వక్ర దంతుని గర్వ మణచి దయ దలచి విడిచి పెట్టాక, సూర్యోదయానికి పూర్వమే అక్కడి నుండి అంతా అశ్వాల మీద బయలు దేరారు.

వాతావరణం బాగుండటంతో సూర్యుడు నడిమింటికి చేరే లోపలే వారు సరి హద్దులు దాటి మత్స్య రాజ్య భూభాగంలో ప్రవేశించారు.

మత్స్య రాజ్యం.

ఒకప్పటి విరాటుని రాజ్యం.

అజ్ఞాత వాస కాలంలో పాండు పుత్రులకు ఆశ్రయమిచ్చిన దేశం. వలునిగా వంటలు చేస్తున్న భీమ సేనుడు సైరంధ్రి వేషం లోని ద్రౌపదీ దేవి కోసం వచ్చిన కీచకుని అంతం చేసిన రాజ్యం. అంతేనా`

ఉత్తర గోగ్రహణమున సుయోధనుడి గర్వమణచి అర్జునుడు గోవును మళ్ళించిన దేశం. తమ మూల పురుషుడైన పరీక్షిత్తుకు జన్మనిచ్చిన అభిమన్యు భార్య ఉత్తర పుట్టి పెరిగిన రాజ్యం. అందుకే మత్స్య దేశంలో కాలు పెట్టగానే తమ పూర్వీకులను తలచుకొని ఒడలు పులకరించగా అశ్వం దిగి నేలకు శిరస్సు ఆన్చి భక్తితో నమస్కరించాడు ధనుంజయుడు.

విరాటుని కాలం నాటి మత్స్య దేశం నాటికి నేటికి అలాగే వుంది. పెరగ లేదు తరగ లేదు. శత్రు రహితమైన రాజ్యం. విరాటుని కుమారుడైన ఉత్తర కుమారుని సంతతి వారే నేటికీ మత్స్య దేశ పాలకులు. తర్వాతి తరాలు కూడా రాజ్యం పంచుకో లేదు. ఏ తరంలో అయినా పెద్ద కొడుక్కి పట్టాభిషేకం చేసి తమ్ముళ్లు రాజ్య భారాన్ని వహిస్తూ సంరక్షిస్తుంటారు. పటిష్టమైన సైనిక వ్యవస్థ వుంది. ధర్మ పరిపాలన గావటంతో ప్రజ సుఖ శాంతులతో వున్నారు.

ఇప్పటికీ మత్స్య దేశ ప్రజలు వ్యవసాయం, గోసంపద మీదే ఆధార పడి జీవిస్తున్నారు. వర్తక వ్యాపారాలు కూడ జరుగుతున్నాయి. ప్రజలు గోసంపదను తమ జీవ నాడిగా భావిస్తారు.

రాజ్యంలో పైరు పచ్చల తో బాటు అడవులు గుట్టల వెంట మందలు మందలుగా గోవులు తిరుగుతూంటాయి. తోకలు లేపి చెంగు చెంగున దూకే తువ్వాయిల సందడి, తమ లేగలకు ప్రేమగా పాలిచ్చే గోమాతలు కను విందు చేస్తూంటాయి. దారిలో చెట్ల నీడన చేరి మురళి వాయించే గోప బాలురులు, కోతి కొమ్మచ్చి, చెడుగుడు మొదయిన ఆటలాడుకొంటున్న పశు కాపరుల సందడి ముందుకు పయనించే కొద్ది నయన మనోహరంగా వుంది ప్రకృతి.

సరి హద్దు దాటి కొంత దూరం వెళ్ళగానే`

బాట సారుల సౌకర్యార్థం మత్స్య ప్రభువు నిర్వహింప జేస్తున్న సత్రం ఒకటి వుంది. ధనుంజయ బృందం చాలా రోజు తర్వాత షడ్రుచులతో అక్కడ విందు భోజనం చేసారు. కొద్ది సేపు విశ్రాంతి గైకొని పొద్దు పడమర వాలుతూండగా తిరిగి ప్రయాణం ఆరంభించారు. ఎగువన సరి హద్దు అశ్వాల మీద పక్షం దినాల ప్రయాణ దూరం లోనే వుంది. ఆ దూరాన్ని ఇంకా ముందుగానే అధిగమించు ఉద్దేశంతో అశ్వాలను శర వేగంతో ప్రయాణిస్తున్నారు. మత్స్య దేశ రాజధాని నగరం విరాట పురం దిశగా పోకుండా నేరుగా సరి హద్దు మార్గం లోనే సాగుతోంది వారి ప్రయాణం.

ఒక వారం దినములు నిర్విరామంగా సాగింది వారి ప్రయాణం. ఏ విధమైన ఆటంకములు ఎదురు కాలేదు. అయితే ఇంతటితో తమ ప్రయత్నము ఆపి మౌనంగా వుంటారని అనుకోవటం లేదు. నాగ రాజు మరో కుటిల ప్రయ్నతం ఏదో చేయకుండా వుండడని విశ్వసిస్తున్నారు. కాబట్టి ప్రయాణం పొడవునా కడు జాగరూకులై సాగుతున్నారు.

ఇదే వేగమున మరి కొన్ని దినములు ప్రయాణిస్తే చాలును. ప్రాగ్ జ్యోతిష పురము (ఒకప్పటి నరకాసురుడి రాజధాని) దాటి మర్మ భూమి అటవీ ప్రాంతంలో అడుగు పెట్టగలరు. తమ నాగ లోకమునకు మార్గము ఎలాగూ ఉలూచీశ్వరికి తెలుసు. అచటికి చేరగానే సమస్యను నాగరాజుతో ముఖాముఖి తేల్చుకో వచ్చును.

ఇలా ఉండగా`

ఎనిమిదవ దినము ఉదయమునకు దారిలో వున్న శివ నాగ పురమను చిన్న పట్టణమును సమీపించారు వారు. ఎగువన కొంత దూరంలో పట్టణం ఉందనగా ఇవతలగా బాట ప్రక్కనే చిట్టడివిలో కొంత దూరాన చిన్న కొండ మీద ఏ నాటిదో అద్భుతమైన ఒక శివాలయం కన్పిస్తోంది. ఆ గుట్ట పక్క నుంచే కొండ వాగు ఒకటి ప్రవహిస్తోంది. ఈ శివాలయాన్ని బట్టే ఆ వూరికి శివ నాగ పురమను పేరు వచ్చినది.

ఆ రోజు అచట ఏదో పర్వ దినము అగుటచే శివ నాగ పురముతో బాటు చుట్టు ప్రక్కల వూళ్ళ ప్రజలంతా అక్కడే వున్నారు.

అశ్వ శకటాలు, వృషభ శకటాలు అనేకం కన్పిస్తున్నాయి. కొందరు రంగు రంగుల వస్త్ర భాగములతో ఎత్తుగా ప్రభలు కట్టుకుని మ్రొక్కు తీర్చుకోవడానికొచ్చారు. వాగులో పుణ్య స్నానాలు గావించి దైవ దర్శనానికి కొండ పైకి వెళ్ళే వాళ్ళు వెళ్తున్నారు. శివ దర్శనం చేసుకుని తిరిగి వచ్చే వాళ్ళు వస్తున్నారు.

ఆలయం వున్న గుట్టను చుట్టి`

ఎటు చూసినా జన సందోహం.

''హర హర మహా దేవ శంభో హర శంకర'' అంటూ భక్త జనం చేస్తున్న శివ నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మారు మ్రోగుతోంది. వింటున్న వారికి ఒడలు పులకరిస్తోంది.

''ప్రియ భామలారా! పర్వ దినము అన్నప్పుడును రావు. వచ్చినప్పుడే మనమును పుణ్య స్నానములాచరించి స్వామి దర్శనం చేసుకుని సేవించి ముందుకు సాగుట శుభ దాయకం. పదండి'' అంటూ అశ్వాన్ని అటు మళ్ళించాడు. భద్రా దేవి ఉత్సాహంగానే వుంది. అశ్వాలు బాటను వదలి చిట్టడివి లోకి దారి తీసాయి.

ధనుంజయుని మాటల్ని నిద్ర మొద్దు భూతం ఘృతాచి విన లేదు గాని ధనుంజయుని తోలు సంచిలో వున్న శ్వేత నాగు రూపంలోని ఉలూచీశ్వరి వింది. తల బయటకు పెట్టి చూసింది. గగనంలో ఎక్కడా గరుడ పక్షుల జాడ లేదు. నెమ్మదిగా అశ్వం పైకి

ప్రాకి ధనుంజయుని వెనక ఉలూచీశ్వరిగా రూపం మార్చుకుని కూచుంది. క్రమంగా గుట్టను సమీపిస్తుండగా ఎందుకో ఆమె మనసు కీడును శంకించనారంభించి ధనుంజయుని భుజ స్కంధాలను అదిమింది.

“మనకిపుడు దైవ దర్శనం అవసరమా ప్రభూ? నాకిది ఉచితముగా తోచుట లేదు. శివ దేవుడు సర్వాంతర్యామి గదా. పిదప ఎప్పుడైనను దర్శింప వచ్చును. అశ్వమును మళ్ళించండి. నేరుగా పోవుదము” అంది.

“లేదు లేదు సఖీ. ఆ స్వామి ఆశీస్సులు పొందే వెళ్ళెదము గాక” అన్నాడు కృత నిశ్చయంతో ధనుంజయుడు.

“అయ్యో! మీకు అర్థము గాకున్నదే మా వాళ్ళ గురించి మీకు తెలియదు. ఇలాంటి చోట కాపు వేయ అవకాశము కలదు. ఆ పైన నా మనసు భీతిల్లుచున్నది. వాళ్ళిచట ఏ రూపమున తిరిగెదరో తెలియదు.

అక్కా! నీవైనను చెప్పుము” అంది భద్రా దేవితో.

“అవును ప్రభూ! ఉలూచి మాటలు మన్నించి మన దారిన మనం ముందుకు పోవుదము. మన లక్ష్యం చేరువలో వున్నది. త్వరిత గతిని నాగ లోకము చేరుట గదా మనకి ముఖ్యము.” అంది భద్రా దేవి. అయితే చెడు కాలము దాపురించు నపుడు మంచి మాటలు చెవి కెక్కవు. యువతుల భీతి జూచి ఫక్కున నవ్వాడు ధనుంజయుడు.

“అయ్యారే... మీరేల యిటుల బెదరు చున్నారో తెలియ కున్నదే. ఎన్నో యిడుముల కోర్చి ఇంత వరకు వచ్చినాము. శివ దర్శనము చేసుకొని వెడలి పోగలము. ఇంతకు ఇంతలో అదియును ఇంత జన సందోహమున ఎవరేమి చేయ గలరు? అంతకూ ఎవరేని తెగ బడి వచ్చిన ఈ సారి ఎవరినీ వదల. అందరినీ తుద ముట్టించెద. భయము వలదు. రండి” అన్నాడు.

అంత బింకముగా ధనుంజయుడు చెప్పిన పిమ్మట ఇక పట్టు బట్టి అతడ్ని వెనక్కు మరలించుట యుక్తము గాదనిపించింది. అందుకే అతివలిరువురూ ఇక మాట్లాడ లేదు. కాని ఎందుకైనా మంచిదని దారి పొడవునా భక్త జనం మీద ఓ కన్నేసి వుంచారు.

క్రమంగా అశ్వాలు గుట్టను సమీపించాయి.

ఎక్కడా నిలువకుండా జనం మధ్యగా అశ్వాల్ని పోనిస్తూ నేరుగా కొండ వాగు వద్ద స్నాన ఘట్టానికి సమీపం లోకి వెళ్ళి పోయారు. అక్కడే టెంకాయలు, పూలు, పండ్లు, శివ ప్రీత్యర్థం సమర్పించ వలసిన పూజా ద్రవ్యములు విక్రయించే అంగళ్ళు అనేకం వరుస దీరి వున్నాయి. అక్కడున్న ఒక శాలి వృక్షానికి అశ్వాల్ని బంధించారు. సరిగ్గా అక్కడికి ఎదురుగా వున్న అంగడికి వెళ్ళాడు ధనుంజయుడు. ఒక వృద్ధుడు అతడి కొడుకు ఆ అంగడి నడుపుతున్నారు. తాము తిరిగి వచ్చే వరకు అశ్వాలను వాటి మీద సంచులను భద్రంగా చూడమని రెండు వరహాలిచ్చాడు. వెళ్ళేప్పుడు ఇంకో రెండు వరహాలు యిస్తాననగానే వాళ్ళు ఆనందంగా ఒప్పుకున్నారు.

అయితే వ్యాపారం మాని వాళ్ళు అశ్వాలనే చూస్తూ వుండరు. ఇలాంటి చోట చోరుల భయం ఉండనే వుంది. అందుకని భద్రా దేవి భూతం ఘృతాచిని లేపి అదృశ్య రూపమున అచట కావలి ఉండమని ఆదేశించిన పిమ్మట ముగ్గురూ స్నానానికి బయలు దేరారు.

శ్రద్ధగా పుణ్య స్నానమాచరించారు.

పొడి దుస్తులు ధరించారు.

తడి దుస్తుల్ని పిండి తర్వాత ఆర బెట్టేందుకు తోలు సంచిలో వుంచారు. వెనక్కి వచ్చి ఆ సంచిని అశ్వానికి తగిలించారు. అదే అంగడిలో పూజా ద్రవ్యాలను ఒక బుట్ట లోకి తీసుకుని కాలి నడకన గుట్ట పైకి బయలు దేరారు.

ముందుగా ధనుంజయుడు, అతడి వెనకే బుట్టతో భద్రా దేవి చివరిగా ఉలూచీశ్వరి వరుసగా విశాలమైన బాట మీద ప్రవేశించారు. వారికి ముందు వెనక వరుసు తీరిన భక్త జన సందోహం వస్తోంది.

దారిలో తన వెనక నుంచి కొందరు అతివలు గుస గుస శబ్దాలు చివరిగా వస్తున్న ఉలూచీశ్వరి చెవుల బడి నవ్వు పుట్టించాయి. ఓర కంట చూస్తే ఒకరు కాదు యిద్దరు కాదు, సీతా కోక చిలుకల్లా సింగారించుకున్న ఇరవై మంది కన్నె పిల్లలు గుంపుగా వస్తున్నారు. వారంతా పోటీ పడి ముందు పోతున్న ధనుంజయనే చూస్తూ వేడి నిట్టూర్పులు విడుస్తున్నారు. వారంతా సమీపం లోని శివ నాగ పురం అమ్మాయిలు.

''ఎవడే వీడు ఇంత సొగసుగా వున్నాడు. కంతుడా... జయంతుడా, భుమికి వచ్చిన చంద్రుడా. మనసును లాగేస్తున్నాడు. ఎవరయి వుంటాడు?'' ఒక యువతి అడుగుతోంది.

''అతడెవరైనా గానీ అతని వెంట అప్సర భామల్ని మించి యిద్దరు ముద్దుగుమ్మలున్నారు. మన వంక కన్నెత్తి చూడడు గాని

పదండే" అంటోంది పక్క యువతి.

"అక్కా! వింటున్నావా ఆ మాటలు?" అంది చిన్నగా భద్రా దేవితో.

"నీవు వెనక సంగతి వింటున్నావ్. ఇటు ముందు చూడుము. పాపం ఎందరు భామలు మన సఖుని గాంచి మనసు పారేసుకుంటున్నారో. ఒడలు వేడెక్కి పూపిరి తీసుకో లేక విలవిల్లాడి పోవు చున్నారు" అంది నవ్వుతూ భద్రా దేవి.

"ఇంతకూ మన ప్రభువుల వారి చూపు ఎటు వున్నదో" అంది కొంటెగా ఉలూచిశ్వరి.

"ఎందరి వలపు చూపులు నాపై వున్నను నా చూపు మాత్రము మీ మీదనే సుమా" అన్నాడు వెను తిరిగి కొంటెగా చూస్తూ ధనుంజయుడు.




దైవ దర్శనం గావించి గుట్ట దిగుతున్న అతివలు దారిలో నిలిచి పోయి మరీ ధనుంజయుని రూపు రేఖా విలాసాలను తనివి తీరా చూస్తున్నారు.

అవేమీ పట్టించు కోకుండా`

క్రమంగా గుట్ట పైకి చేరుకుని ఆలయ ప్రాంగణంలో ప్రవేశించారంతా. ఎదురుగా ఏనాటిదో పదహారు స్తంభాలతో కూడిన విశాలమైన రాతి సభా మండపం వుంది. దాని శిల్ప సంపద అపురూపంగా వుంది. దాన్ని దాట గానే ఎత్తయిన ధ్వజ స్తంభము దాని ముందు గర్భ గుడి లోని శివుని చూస్తూ అర మోడ్పు కనులతో ధ్యానిస్తూ కూచున్నట్టు నందీశ్వరుని అద్భుతమైన రాతి విగ్రహం వుంది. అక్కడి నుండే ఆలయ ప్రవేశ ద్వారం వుంది. చాలా పెద్ద ద్వారం. బయటి నుండే స్త్రీలకు రెండు వరుసలు, పురుషులకు రెండు వరుసలుగా ఏర్పరచి దర్శనానికి పంపించుటలో భక్తులు త్వరగా శివ దర్శనం గావించుకొని బయటకు రాగలుగుతున్నారు.

పురుషుల వరుసలో ధనుంజయుడు, స్త్రీ వరుసలో భద్రా దేవి, ఉలూచీశ్వరిలు నిలుచుని వరుసలో ముందుకు సాగుతున్నారు. అలా ఆ ముగ్గురూ స్త్రీ, పురుషులంటూ విడి పోవటమే అతి పెద్ద ప్రమాదానికి దారి తీసింది. వాళ్ళు క్రమంగా గర్భాలయ సమీపం లోకి వచ్చేసారు. అద్భుతమైన శివ లింగం కను విందు చేస్తోంది. పూజలు, అర్చనలు నిర్వహిస్తూ అర్చక స్వాములు క్షణం తీరిక లేకుండా వున్నారు. శివ నామ స్మరణతో గర్భాలయం పులకిస్తోంది. ఆ సమయంలో`

ఎవరో తన భుజం తట్టి పిలిచినట్టయింది యువ రాజు ధనుంజయుడికి. తిరిగి చూస్తే తన వెనక ఒక పొట్టి వాడు కన్పించాడు. తల మీద శంఖం బోర్లించినట్టు ఒక కొమ్ము వుంది వాడికి. వాడు ఇంతకు ముందు తన వెనక లేడు. ఎందుకు పిలిచాడో తెలిదు. కాని వాడికి పక్కనే పరిచయమున్న పొడుగు వాడ్ని చూసి ఉలికి పడ్డాడు. వంకర పళ్ళతో నవ్వుతున్నాడు వాడు. వాడు వక్ర దంతుడు. ఏదో జరగబోతోందని గ్రహించి జాగ్రత్త పడే లోపే మాయ శృంగుడనే పొట్టి వాడు ధనుంజయుని ముఖం మీద చేతిని ఆడించాడు. అంతే` ఉన్నట్టుండి తెలివి తప్పాడు ధనుంజయుడు.

అతడు కింద పడే లోపే లాగి భుజం మీద వేసుకుని ధనుంజయునితో సహా అదృశ్యమయ్యాడు వక్ర దంతుడు. వాడితో బాటే ఎటు పోయాడో కన్పించ కుండా పోయాడు మాయా శృంగుడు.

ఎప్పుడైతే అక్కడ అంతా చూస్తుండగానే ధనుంజయుడు అదృశ్యమయ్యాడో మరుక్షణం అలజడి చెల రేగిందక్కడ. అప్పటికి స్త్రీ వరుసలో కొంత దూరం ముందున్న భద్రా దేవి, ఉలూచీశ్వరిలు అలజడి విని తిరిగి చూసారు. పురుషుల వరుసలో ధనుంజయుడు వారికి కన్పించ లేదు. అదృశ్యమైంది తమ ప్రాణ వల్లభుడు ధనుంజయుడని తెలిసి నిశ్చేష్టులై అలాగే నిల బడి పోయారు.

*******************************************

వక్ర దంతుని ఆనందానికి అవధి లేదు.

స్పృహ లేని ధనుంజయుని తీసుకుని అధో లోకాలు ఒకటొకటే దాటు కొంటూ అనేక గుహా మార్గాలు బిల మార్గాలననుసరించి రివ్వున సాగి పోతున్నాడు.

ఒడుపుగా ధనుంజయుడు తనకు చిక్కటం కోతికి కొబ్బరి కాయ దొరికిన చందంగా వుంది వాడికి` ''నరాధమా.. నీఛ మానవా... మా నాగ జాతి తోనే పంతములా నీకు? ఈ జన్మలో నీవు తిరిగి భూ లోకము జూడ జాలవు. ఆనతి లేదు గాని లేకున్న నిన్నిచటనే కడ తేర్చెద'' అంటూ కోపము తీరా దారిలో ధనుంజయుని శరీరాన్ని రాతి గోడకు గుద్దు తున్నాడు. వాడు అలా చేయటమే మంచిదయింది. కొద్ది కొద్దిగా ధనుంజయునికి స్పృహ రానారంభించింది.

మూడు దినముల క్రితమే అంగ రాజ్యం మీదుగా వక్ర దంతుడి బృందం అశ్వ శకటంలో శివ నాగ పురం చేరుకుంది. అక్కడ ప్రసిద్ధమైన బాల శివ నాగ దేవునికి మూడు నాళ్ళు తిరునాళ్ళు ఆరంభమైంది. ఇవాళో రేపో ధనుంజయ బృందం అక్కడికి చేరుకొంటుందని శివ దర్శనార్థం ఆగుతుందనే నమ్మకంతో తమ మనుషులతో కాపు వేసాడు. అది చక్కగా ఫలించింది. ఆఖరి రోజైన మూడో దినము ధనుంజయ బృందం అక్కడికి వచ్చి ఆగింది. వాళ్ళకి ఏ మాత్రం చివరి క్షణం వరకు సందేహం కలక్కుండా జాగ్రత్త పడి కార్యం సాధించాడు. తన అదృష్టం బాగుండి భద్రా దేవి చూడ లేదు గాని చూస్తే గుడి లోనే తనను భస్మం చేసి ఉండేది. భద్రా దేవి స్త్రీ వరుసలో లేకుండా ధనుంజయుడి ప్రక్కనే వున్నా తన పని నెర వేరేది కాదు.

ఇప్పుడా యువతుల ముఖాలు చూడాలి. ప్రియ సఖుని కోసం బోరున విపిస్తుంటారు. ఆహా! విజయం తనదే. ధనుంజయుని అడ్డంకి తొలగటంతో ఇక యువ రాణి ఉలూచీశ్వరి తనదే. నాగ రాజు అల్లుడు తను. భవిష్యత్తులో కాబోవు నాగ లోక ప్రభువు తను. ఇక తనకు ఎదురు లేదు. ఈ ఆలోచనే వక్ర దంతునికి మహదానందాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తోంది.

భూ లోకం వదల గానే అదృశ్య రూపం వదలటం వన ఇప్పుడు ఇరువురూ యధా రూపంలోనే వున్నారు. కాని చిక్కటి కాటుక లాంటి చీకటిలో తన సర్ప దృష్టితో వక్ రదంతుడు చూడ గలడు గాని ధనుంజయుడు చూడ లేడు. ఆ పైన దారిలో రాతి బండకు గుద్ద బడిన గాయాల బాధలో ధనుంజయునికి కొద్ది కొద్దిగా స్పృహ వస్తోంది. ఎవరో తనను భుజం మీద వేసుకుని చీకటి మార్గంలో ఎచటికో మోసుకు పోతున్నారు.

కన్ను తెరిస్తే చిమ్మ చీకటి.

తలంతా దిమ్ముగా వుంది.

కాసేపు ఏం జరిగిందీ ఏదీ`

గుర్తు లేకుండా పోయింది.

క్రమంగా గుడిలో సంఘటనలు ఒకటొకటిగా గుర్తు రా సాగాయి. ఇది వక్ర దంతుని అకృత్యమని అర్థం కాగానే ధనుంజయుని రక్తం సలసల మరగ నారంభించింది. ఈ దుష్టుడు తనను ఎచటకు తీసుకు పోతున్నాడో తెలిదు. అచట తన ప్రియ బామలిరువురూ తనను గానక ఎంతగా రోదిస్తున్నారో గదా.

ఇదే క్షణంలో ఒక విషయం గుర్తొచ్చి ధనుంజయుని మేని జలధరించింది. అదేమంటే, కొద్ది రోజుల క్రిందట తను ఒక భయంకరమైన కలగన్నాడు. సర్పాలు... అనేక కౄర సర్పాలు తనను వెంట బడి తరమటం కలలో చూసాడు. వాటి నుంచి తప్పించు కోడానికి తను పరుగెత్తి పరుగెత్తి ఒక బిల మార్గంలో పడి పోయాడు. ఆ బిల మార్గం వెంట ఎక్కడికో జారి పోయి ఒక మరు భూమిలో పడి రోధించాడు. నాటి ఆ స్వప్నం నేడు యధార్థం కాబోతోందా. నాడు కరుణతో ఈ వక్ర దంతుని క్షమించి విడిచి ఎంత తప్పయినదో ఇప్పుడు గదా అర్థమవుతోంది.

ధనుంజయుని ఆలోచనలు ఒక కొలిక్కి రాక ముందే భూమి పొరల్లో... చాలా లోతుల్లో ఎక్కడో ఒక బిల ముఖ ద్వారం వద్ద ఆగాడు వక్ర దంతుడు.

దిగువ ఎక్కడి నుండో నెల వంక వెన్నె వంటి మసక వెలుగు ఆ బిల మార్గంగా పైకి వ్యాపిస్తోంది. ఏట వాలుగా దిగువకు పోతోంది ఆ మార్గం.

భుజం మీది ధనుంజయుడు కదలటం గమనించి వికటాట్టహాసం చేసాడు వక్ర దంతుడు. ''ఓరి మూర్ఖ మానవా. పొమ్మురా. నీ కొరకు మరు భూమి ఎదురు చూచుచున్నది. ఇదియే నీకు నా వీడ్కోలు. ఇక ఇచటనే నీవు కృశించి కృశించి నశించి పొమ్ము. యువ రాణి ఉలూచీశ్వరి నాది. హహహ'' అంటూ ధనుంజయుని గిర గిరా తిప్పి బిల మార్గం లోకి విసిరేసాడు. ఎదిరించ టానికో

ప్రతిఘటించేందుకో అవకాశమే లేక పోయింది ధనుంజయునికి.

గింగిరాలు తిరుగుతూ పోయి దబ్బున బిల మార్గంలో పడిన ధనుంజయుని శరీరం ఏటవాలుగా దిగవకు జారి పో సాగింది. పై నుంచి వక్ర దంతుని వికటాట్టహాసం చాలా దూరం వరకు ధనుంజయునికి విన్పిస్తూనే వుంది.

**********************************

ప్రొద్దు పడమట అస్తమిస్తోంది.

ఉత్తర దిక్కు నుండి`

నల్లటి మబ్బులు క్రమ్ముకొస్తున్నాయి.

ఇటు తూర్పు దిశగా ముసురు కొస్తున్నాయి చిమ్మ చీకట్లు.

ఇప్పుడు ఆ చిట్టడివిలో ఎక్కడా జన సంచారం లేదు. అశ్వాలను కట్టిన అదే శాలి వృక్షం క్రింద పుట్టెడు దుఖ్ఖంతో దిగాలు పడి కూచునున్నారు అతివలు భద్రా దేవి, ఉలూచీశ్వరిలు.మధ్యాహ్నం గుడి లోనే ధనుంజయుడు అదృశ్యం గావటంతో ఏం చేయాలో తోచ లేదు వారికి.

"అక్కా! మన ప్రభువుని తన సన్నిధి లోనే మాయం జేస్తుంటే మౌనముగా వేడుక జూచిన ఆ శివ స్వామి ని మనం దర్శనం చేయ రాదు. పదక్కా వెడలి పోవుదము" అంది కన్నీళ్ళతో ఉలూచీశ్వరి.

"లేదు లేదు. మనము అంతగా వారించినా కూడ వినుకోకుండా తన దర్శనాని కొచ్చిన మన స్వామిని అదృశ్యం జేయు చుండగా ఆ శివ స్వామి ఏమి చేస్తున్నటు? మనకి సమాధానము కావలె. అంత దనుక మనం వేచి వుండాలె. పద. ధనుంజయుని క్షేమం కోరి ఆయన పేర మనమే అర్చన చేయించెదము" అంటూ కర్తవ్యం బోధించింది భద్రా దేవి.

అదే విధంగా లోనికి పోయి అర్చన చేయించి కాపాడమని కన్నీళ్ళతో వేడు కొని బయటి కొచ్చి అక్కడే రాతి మండపంలో కూచున్నారు.

పొద్దు పడమర వాలే వేళకి భక్త జనం తగ్గి పో నారంభించారు. అప్పటి గ్గాని అది స్వామి తిరు నాళ్ళు మూడవది ఆఖరి దినమని అతివలిరువురికీ తెలి లేదు. అర్చక స్వాములు శివ దర్శనం నిలిపి వేసారు. ఆలయాన్ని శుద్ధి చేసే పనిలో అందర్నీ గుట్ట దిగువకు వెళ్ళి పొమ్మంటున్నారు. రాత్రిళ్ళు గుట్ట పైన ఎవరినీ ఉండ నీయరట. ఆలయాన్ని తిరిగి అమావాస్య వెళ్ళిన శుద్ధ విదియ నాడు మాత్రమే తెరుస్తారు. కనీసం అక్కడ ఉండేందు క్కూడ వీలు లేదు. ఏమి చేయాలో పాలు పోక దుఃఖాన్ని దిగ మ్రింగుతూ గుట్ట దిగి వచ్చేసారు.

అప్పటికే చిట్టడవిలో జన సంచారం పల్చ బడింది. మూడు దినాలుగా అమ్మకాలు సాగించిన పూలు, పండ్ల వ్యాపారులు, తిను బండారాలు, ఆట బొమ్మలు, గృహోప కరణాలు ఒక్కటేమిటి, వ్యాపారులంతా అంగళ్ళు తీసేసి వృషభ శకటాలకు ఎక్కించి వెళ్ళి పోతున్నారు.

నేరుగా తమ అశ్వాలను బంధించిన శాలి వృక్షం వద్దకొచ్చారు. అశ్వాలను తమ వస్తువుల్ని భద్రంగా చూసినందుకు రెండు వరహాలు అదనంగా యిస్తానని అంగడి వానికి మాట యిచ్చాడు ధనుంజయుడు. అప్పుడే బయలుదేరుతున్న అంగడి వృద్ధుడ్ని పిలిచి రెండు వరహాలు యిచ్చి పంపించింది భద్రా దేవి.

ధనుంజయుడి అశ్వం గరుడ తన యజమాని కన బడక దిక్కులు చూస్తోంది. భూతం ఘృతాచికి ఏం జరిగిందీ అర్థం గాక ఈసారి పిలవ కుండానే దగ్గర కొచ్చింది. భద్రా దేవి జరిగింది క్లుప్తంగా చెప్పి ` ''ఘృతాచి! చాలా కష్టాల్లో వున్నాము. నాగ దండు ఎంత మంది వచ్చారో తెలీదు గాని ఈ పరిసరములందే ఎచటనో మరుగున ఉండెదరు. పొమ్ము. వారి జాడు తెలుసుకొని రమ్ము'' అంది.

''నుడిలో పోయి వచ్చెద తల్లీ. మీకింత ఘాతుకము సల్పిన ఆ నీచుల వదల'' అంటూ అదృశ్యమైంది ఘృతాచి.

అశ్వాల ప్రక్కనే నేల మీద కూచున్నారు.

దుఃఖం పొంగుకొస్తోంది.

ఉలూచీశ్వరి అయితే భద్రా దేవి ఒడిలో తల పెట్టుకుని చిన్నగా రోదిస్తోంది. తన పరిస్థితీ అదే కాదంటే తనిప్పుడు ఒంటరి కాదు. ఉలూచీశ్వరి బాధ్యత తన మీద వుంది. కష్టాలు కన్నీళ్ళు తనకు కొత్త కాదు. భీమా నది తన జననీ జనకుల్ని మింగేసినపుడు

దుఃఖించింది. మళ్ళీ ఇప్పుడు దుఃఖిస్తోంది. తన పరిస్థితి వేరు. కాని ఉలూచీశ్వరి అలా కాదు. నాగ లోక యువ రాణి. వలచిన ప్రియుని కోసం తన రాజ భోగాలు సుఖాలు వదులుకొని వచ్చి తమ వెంట ఉండి తమ కష్టాలు తనూ అనుభవిస్తోంది. ఇప్పుడీ విపత్కర పరిస్థితిలో తనూ రోదిస్తే కష్టాలు తీర్చే వారు లేక పోగా శతృవు కు అవకాశం ఇచ్చినట్టవుతుంది. అవతల నాగ లోకం నుంచి దుండగులు ఎంత మంది వచ్చారో తెలిదు. ఎచట మకాం వేసి మాటు వేసి గమనిస్తున్నారో తెలిదు. ఇప్పటికే ధనుంజయుని తమకు దూరం చేసారు. ఇప్పుడు ఉలూచిని కూడ తనకు దూరం చేసే ప్రయత్నంలో వుంటారు. వారి ప్రయత్నాల్ని తిప్పి కొట్టి ప్రతీ కారం తీర్చు కోవాలి. ముఖ్యంగా ఆ వంకర పళ్ళ వెధవ వక్ర దంతుని పని పట్టాలి. గుండె రాయి చేసుకుని ఈ కష్టాన్ని అధిగమించాలి. కన్నీళ్ళు తుడుచుకుని ఉలూచీశ్వరి జుత్తు నిమిరింది. లేపి కన్నీళ్ళు తుడిచింది.

“ఛఛ! ఏమి ఈ బేల తనము సోదరీ. కన్నీరు మన కష్టాలు తీర్చదు. అసలు మనకు కన్నీరు రాకూడదు” అంది.

“అక్కా...” అంటూ బేలగా చూసింది ఉలూచీశ్వరి.

“అవును. మనము ఎవరము? మరచితివా? మహా వీరుడు ధనుంజయుని ప్రియ సఖియలము. ఆయన ధైర్య సాహసములు సగమైనను మనకు ఉండ వలదా? మన ప్రభువుకి ఏమీ కాదు. ఇవాళ గాకున్న రేపు క్షేమముగా వచ్చి చేరెదరు. దానికి ముందు మనము చేయ వలసిన పనులు చాలానే వున్నవి. మనకు ఎడబాటు కల్పించి ఇంతోటి కష్టమున కెర జేసిన శత్రువు మీద పగ ప్రతీకారము కోపం లేవా? పగ సాధించాలి. దెబ్బకు దెబ్బ తీయాలి....”“కాని అక్కా....!”

“ఇంకేమియును జెప్పకు. నాకు దివ్య దృష్టి, జ్ఞాన దృష్టి ఇలాంటివి లేవు. మీ నాగ శక్తితో ఆ దృష్టి నీకున్నది ఆ ధూర్తుడు వక్ర దంతుడు మన ప్రాణ వల్లభుని ఎటకు గొని పోయినాడో అవలోకించి చెప్పుము” అంది.

“మనము గుట్ట పైన గుడి మండపమందున్నప్పుడే ఆ పని జేసితి. మన సఖుడు భూలోకమున లేరు” అంది ఉలూచీశ్వరి.

“లేరా....”

“అవును. లేరు”

"మరో లోకమునకు గోని పోయి వుండునా?"

"కాని... భూ లోకము తక్క ఇతర లోకము గాలించు మహా దృష్టి నాకు లేదక్కా."


"సరి. ఇపుడు ఇంకో పరి అవలోకించుము. మన వల్లలభుని జాడ తెలియకున్న ఆ నీచుడు వక్ర దంతుని జాడయిన అరయుము."

"సరి..."

వెంటనే బాసిం పట్టు వేసి కూచుని`

అర్ధ నిమీలిత నేత్రాలతో`

జ్ఞాన దృష్టి లోకి వెళ్ళి పోయింది ఉలూచిశ్వరి.



ధనుంజయుని కోసం ఎదురు చూస్తూ తన వంక గమనిస్తున్న అశ్వం గరుడ జూలు నిమిరి నుదురు ముద్దాడింది భద్రాదేవి` ‘‘బాధ పడకుమురా గరుడా. నీ యజమాని త్వరలోనే రాగలరు’’ అంటూ వెన్ను తట్టింది. తన మచ్చల గుర్రం ఢాకినికి, గరుడకు మరింత పచ్చిక వేసింది. అంగడి వృద్ధుడు అశ్వాల కోసం పచ్చిక వేయించి వుంచాడు. ఆ విధంగా తను తీసుకున్న రూకకు న్యాయం చేసాడు.

అప్పటికి సూర్యుడు పూర్తిగా అస్తమించాడు.

రాత్రికి ఎక్కడ గడపటం?

ఇది తమ ముందున్న ప్రధాన సమస్య. ఆ పైన ధనుంజయుని జాడ తెలిక ఆ బాధలో ఏమీ తిన లేదు. తనకు ఉలూచీశ్వరికి సంచిలో పండో కాయో ఏమన్నా మిగిలాయో లేదో తెలీదు. గుట్ట పైన గుడి మండపం తమ మజిలీకి చాలా అనువైన చోటు కాని అక్కడ వుండనీయరు. అటు చూస్తే ఉత్తరం నుండి ఉరుములు మెరుపులతో నల్ల మబ్బులు పోటీ పడి దూసుకొస్తున్నాయి. పోనీ అలా వూళ్ళోకి పోయి ఏదన్నా సత్రం వుందేమో లేదా ఎవరన్నా ఆతిథ్యం ఇస్తారేమో అడిగి చూద్దా మన్నా తామిద్దరూ యువతులు. రాత్రి వేళ ఎక్కడని తిరగ్గలరు? ఘృతాచి త్వరగా వస్తే బాగుండును. ఏదో ఒకటి త్వరగా ఆలోచించాలి.

భద్రా దేవి ఆలోచనలు ఓ కొలిక్కి రాక ముందే కళ్ళు తెరిచింది ఉలూచీశ్వరి. వెంటనే పక్కన కూచుంటూ` ‘‘ఏమైనది? మన సఖుని జాడలేవైనా తెలిసినవా?’’ అనడిగింది.

‘‘లేదక్కా. ఎంతో గాలించితి. ఏమియు తెలియ లేదు. విచిత్రం ఏమన ఆ వక్ర దంతుని జాడును తెలియ లేదు. అనగా వాడింకనూ భూ లోకమునకు మరలి రాలేదని యర్థము’’ అంది ఉలూచీశ్వరి.

‘‘అనగా... మన ప్రాణ సఖుని భూ లోకము నుండి వేరే లోకమునకు గొని పోయి వుండునా? అదియే సత్యమైనచో అది ఏ లోకము? ఊర్థ్వ లోకముకా...’’

‘‘లేదు లేదు. ఊర్థ్వ లోకము దేవ లోకము. వారు మానవులకు సాయ పడుదురు. నా సందేహము అది కాదు. అధో లోకము రాక్షస లోకము. ఖచ్చితముగా అటే ఏదో లోకమునకు గొని పోయి ఉండును’’

కాసేపు మౌనంగా ఉండి పోయింది భద్రా దేవి.

అంతలో నాగ దండును గాలిస్తూ వెళ్ళిన ఘృతాచి తిరిగి వచ్చింది.

‘‘ఏమైనది? జాడ లేవైన తెలిసినవా?’’ అడిగింది భద్రా దేవి.

“లేదు తల్లీ. ఇట నుండి బయలు దేరి ఈ గుట్టను చుట్టి గాలించినాను. అవతల చిట్టడివి. ఎగువన దట్టమైన అడవి గుట్టు లోయలు అన్నీ వెదికినాను ఎక్కడా నాగుల సంచారం జాడ లేదు. కాని... ఇంతకు ముందే ఒక విచిత్రమును గాంచితి” అంది ఘృతాచి.

“విచిత్రమా... ఏమైనది?”

“ఈ కొండ వాగు ఆవల ఎగువన దట్టమగు అటవీ ప్రాంతమున్నది. అచట ఒక అశ్వ శకటమును గాంచితి. నల్లని అశ్వాలు నల్లని రథము. అక్కడే మరో యాభై అశ్వాలనూ గాంచితి. కాని అచట ఎవరును లేరు. అవి నరుల అశ్వాలా లేక నాగ లోకం నుంచి వచ్చిన నాగ భటుల అశ్వాలా ఏమీ తెలియకున్నది. అచట ఎవరినీ గానక విసిగి మరల వచ్చితి” అంటూ అసు సంగతి చెప్పింది ఘృతాచి.

“అక్కా సందేహము లేదు. వాళ్ళే... నల్లటి అశ్వము పూన్చిన నల్లటి రథము... అవి మా నాగ లోకమునకు చెందినవే.” అంది వెంటనే ఉలూచీశ్వరి.

“కావచ్చును. కాని వాటిని అచటనే వదలి వారందరు ఎటు పోయినటు?” అంది సాలోచనగా భద్రా దేవి.

“నాకును అదియే అంతు బట్టకున్నది. కాని...” అంటూ కొండ వాగు ఆవలకు చూస్తూ మాటలు మ్రింగేసింది ఉలూచీశ్వరి.

అప్పటికి బాగా చీకటి పడి పోయింది.

వాగు అవతల దూరంగా`

వరుసలు తీరిన అనేక దివిటీలు కొరివి దయ్యాల్లా కదులుతూ ఇటే వస్తూ కన్పిస్తున్నాయి. భద్రా దేవి కూడ అటు చూసి ఆశ్చర్య చకిత అయింది.

“వాళ్ళేనా?” అంది అనుమానంగా.

“అవును. వక్ర దంతుడు తిరిగి రాకుండా వాళ్ళు మకాము నుండి కదిలే అవకాశము లేదు.”

“ఏమో... వచ్చినాడేమో. ఎందుకైన మంచిది మరొక పరి వాడి జాడలు అవలోకింపుము” అంటూ హెచ్చరించింది భద్రా దేవి.

ఈ సారి జ్ఞాన దృష్టి నుండి`

త్వర గానే బయటి కొచ్చింది ఉలూచీశ్వరి.

“వచ్చినాడక్కా. ఇంత క్రితము వచ్చినట్టుండె. వాడి పక్కనే మాయా శృంగుడును ఉండె” అంది గాభరాగా.

“మాయా శృంగుడెవడు?” అర్థం గాక అడిగింది భద్రా దేవి.

“వాడో పొట్టి వెధవ. నెత్తిన కొమ్ము ఉండును. మహా మాయావి. వాళ్ళ మాటల్ని బట్టి వక్ర దంతుడు మన ప్రభువును పాతాళమునకు పోవు బిల మార్గమున పారవైచి వచ్చినాడు” అంటూ దుఃఖంతో గొంతు పెగలక ఏడ్చేసింది.

‘‘బాధ పడకు సోదరీ. ఎన్ని కష్టములైనను భరించి మన స్వామి మన కోసం క్షేమంగా మరలి వత్తురు. ప్రస్తుతము మనమీ కష్టము నుండి బయట పడవలె. ఆ దివిటీలు మీ నాగ దండే కదూ?’’

‘‘అవును. ధనుంజయుని మన నుంచి దూరము జేసి వచ్చిన వక్ర దంతుడు ఉత్సాహముగ వున్నాడు. ఈ రాత్రికే నను అపహరింప కుతూహల పడుచున్నాడు.’’

‘‘రానిమ్ము. ఆ నీచుల సంగతి నేను జూచెద. రాత్రికి వారితో పెను పోరాటము తప్పదు. కాని ఈ లోపల మనము తల దాచుకొనుటకు తావు లేకుండా జేసినాడే ఆ శివయ్య. అదే బాధగున్నది. మరి కొద్ది సేపట్లో ఈ ప్రాంతమును గాలి వాన ముంచెత్తనుంది’’ అంది ఆకాశం వంక జూస్తూ భద్రా దేవి.

సరిగ్గా అదే సమయంలో`

తొలి సారిగా ఒక విచిత్రము ఆవిష్కృతమైంది అక్కడ.

శివాలయం వున్న కొండ గుట్ట వైపు నుండి భీకరంగా విన వచ్చింది ఒక ఎద్దు రంకె. నిశీధిలో ఆ ప్రాంతమంతటా మారు మ్రోగిందా రంకె.

ఉలికి పడి అటు చూసిన ఇరువురికీ`

చీకటి మాటున కూడ తెల్లగా మెరిసి పోతున్న పోతరించిన వృషభం ఒకటి తోక పైకి లేపి బుసలు కొడుతూ శర వేగంతో గుట్ట దిగి వస్తూ కన్పించింది. దాని అట్టహాసం చూస్తే గుండె చెదిరి పోయేలా వుంది. అది నేరుగా తమ వైపే దుమ్ము తెరలు రేపుతూ దూసుకొస్తోంది. దాని మెడ లోని గంటల శబ్దం మారు మ్రోగుతోంది.

ఎవరిదా వృషభము? ఎవరి పైకి అంత ఉగ్ర రూపమున వస్తోంది. ఉలూచీశ్వరి కంగారుగా భద్రా దేవి వంక చూసింది. పక్కనున్న భూతం ఘృతాచి కూడ విభ్రాంతి చెందింది. ‘‘అమ్మా! చూడనది చాలా పొగరు బోతు గిత్త వలెనున్నది వెళ్ళి దారి మళ్ళించమందురా?’’ అనడిగింది.

‘‘వలదు వలదు. రానిమ్ము. దాని సంగతేమిటో చూతము గాక’’ అంది భద్రా దేవి.

వచ్చునది సాధారణ వృషభము కాదనిపిస్తోంది భద్రా దేవికి. శివుని వాహనం నందీశ్వరుడు. ఈ నంది కూడ గుట్ట పై నుండే దిగి వచ్చినది. సందేహం లేదు. అందుకే ఘృతాచిని వారించింది.

చూస్తూండగానే మరో సారి రంకె వేసింది వృషభం.

అది దుమ్ము తెరలు రేపుతూ సుడి గాలిలా వారి సమీపం నుండే నేరుగా కొండ వాగు వంచ వరకు దూసుకెళ్ళి ఆగింది. కాలు దువ్వుతూ మోర చాపి వాగు అవతల దివిటీ దిశగా చూస్తూ దిక్కు మారు మ్రోగేలా రంకె వేసింది. అక్కడి నుండి బయలు దేరి శాలి వృక్షం దక్షిణం వైపు వెళ్ళి రంకె వేసింది. అలా వృక్షాన్ని చుట్టి అన్ని దిక్కులకు రంకెలు వేసి పిమ్మట శాంతిస్తూ తోక దింపి సూటిగా వచ్చి భద్రా దేవి, ఉలూచీశ్వరి సమీపంలో చక్కగా కాళ్ళు ముడుచుకుని పడుకుంది గుడిలో నందిలా.

ఇంతలో గుట్ట వైపు నుండి ‘‘భౌ భౌ’ మంటూ శునక మొకటి అరుచుకొంటూ దిగి వస్తున్న జాడ తెలిసింది. ఆ శునకం కూడ మహా

ఉగ్రంగా దూసుకొస్తోంది. నలుపులో నలుపుగా చీకట్లలో కలిసి పోయి సమీపం లోకి వచ్చే వరకూ దాని జాడ తెలీ లేదు. చేయెత్తు బలిష్టమైన శునకం. అది కూడ నేరుగా వాగు తీరానికి దూసుకెళ్ళి దివిటీలను చూస్తూ బిగ్గరగా కాసేపు మొరుగు తూనే వుంది. తర్వాత మొరుగుతూ శాలి వృక్షాన్ని చుట్టి వచ్చింది. వృషభం సమీపం లోకి వస్తూనే శాంతించి వెనక్కాళ్ళు ముడుచుకుని కూచుంది.

తల తిప్పి చూసిన భద్రా దేవి, ఉలూచీశ్వరిలకు వాగు అవతల దివిటీలు క్రమంగా వెనక్కి తగ్గటం స్పష్టంగా కన్పిస్తోంది. భద్రా దేవికి ఇపుడిపుడే కొంచెం కొంచెం బోధ పడుతోంది.

ఆ శివయ్య వాహనమైన నందీశ్వరుడు, సదా ఆయన్ని అనుసరించి తిరిగే శునక రూపుడైన భైరవేశ్వరుడు తమకు రక్షణ కోసం కొండ దిగి వచ్చారు. ఇంత కన్నా ఏం కావాలి. వీరి ఆర్భాటం తమ కోసం కదలి వస్తున్న నాగ దండుకి దడ పుట్టించి ఉండాలి. వెనక్కి వెళ్ళి పోతున్నారు. ''హే ప్రభూ శంకరా... ఈ విధంగా దయ చూపించావా కరుణామయా భక్త వత్సలా....'' అని శంకరుని ప్రార్థిస్తూ ఉలూచీశ్వరితో సహా తమ ముందున్న నందికి, భైరవుడికి సాష్టాంగ నమస్కారం చేసింది భద్రా దేవి.

సరిగా అప్పుడే`

మరో విచిత్రం కూడ ఆవిష్కృతమైంది.

అది మృదు మధురమైన ఒక వేణు నాదం.

సమ్మోహ పరిచే రసమయ మురళీ రవం ఒకటి చల్లటి గాలి అలల మీద తేలి యాడుతూ కర్ణ పేయంగా విన వస్తోంది.

ఈ నిర్జన ప్రదేశంలో ఇంత చీకటి వేళ మురళీ గానం చేస్తూ ఇటు వచ్చినది ఎవరు? పశుల కాపరులా... వారు మును మాపు వేళకే పశుల మళ్ళించు కొని పోదురే... భద్రా దేవి, ఉలూచీశ్వరిలు ముఖ ముఖాలు చూసుకున్నారు.

వీనుల విందు చేస్తూ మురళీ గానం సోక గానే ఇటు వృషభము, అటు శునకము కూడ లేచి తోకలు వూపుతూ ఆనందంగా అటే వీక్షింప సాగాయి. భూతం ఘృతాచి అయితే తన్మయంతో చిందులేయనారంభించింది. ఇంతలో`

ఒక అద్భుత దృశ్యం వారి కంట బడింది.

శివాయం వున్న కొండ గుట్ట, పక్కన కొండ వాగు మధ్య ప్రాంతంలో స్నాన ఘట్టం వద్ద అప్పుడే మలుపు తిరిగిన భక్త బృందం ఒకటి ఇటే వస్తోంది.

ఒంటి నిండా విభూది పూసుకున్న జడ ధారులైన వ్యక్తులు యిద్దరు అటు యిటు దివిటీలు పుచ్చుకుని ముందుగా నడిచి వస్తున్నారు. వారి వెనక మురళి వాయిస్తూ తన్మయంతో నాట్యం చేస్తూ శతాధిక వృద్ధుడు ఒకడు వస్తున్నాడు. వారి వెనక సుమారు పాతిక మంది అనుసరించి వస్తున్నారు. కాగడాల వెలుగులో వారంతా స్పష్టంగా కనబడుతున్నారు. ఒడలంతా విభూది పూసుకున్న జడధారులు వాళ్ళంతా. వారిలో కొందరు మురళీ గానానికి వంతగా డోలు మృదంగం తాళాలు వాయిస్తున్నారు. మిగిలిన వారు త్రిశూలాలు ఆయుధాలుగా ధరించి వున్నారు.

అయితే ఇచట విచిత్రం ఏమంటే` వేణు గాన లోలుడైన శతాధిక వృద్ధుడు ఆ భక్త బృందంలో భిన్నంగా కన్పిస్తున్నాడు. వారంతా శివ భక్తుని చూడ గానే చెప్పొచ్చు. కాని వారి మధ్యన మురళీ ధారుడు మాత్రం విభూది పూసుకోలేదు. లలాట ఫలకాన కస్తూరీ

తిలకం ధరించాడు. శిఖి పింఛం లేదు గాని నీల మేఘ శ్యాముడు నీలి రంగు జరీ పట్టు పంచె కట్టాడు. వంటి మీద వేరే ఆచ్ఛాదనా లేదు. నెరిసిన గిరజాల జుత్తు భుజాల మీద పడుతోంది. శతాధిక వృద్ధుడైనా బహు సుందరాకారుడు. ఎంతో ఉత్సాహంగా నాట్యం చేస్తూ వేణు గానమాలపిస్తున్నాడు. అతడి చేతి వ్రేళ్ళ నుండి రసఝరీ ప్రవాహంలా పొంగి ప్రకృతిని పరవశింప చేస్తోంది మురళీ రవం.

అతడి మెడలో తులసీ దళాలు పారిజాత పుష్పాలతో కూర్చిన నిడుపాటి పూమాల వేలాడుతోంది. ఆయన కర్ణాభరణాల రత్న కాంతులు దివిటీల కాంతులకు తళుకులీనుతున్నాయి. ఆ భక్త బృందం నెమ్మదిగా కదులుతూ యిటే వస్తోంది. లేచి నిల బడి ఆశ్చర్య సంభ్రమాలతో వారినే గమనిస్తున్నారు భద్రా దేవి, ఉలూచీశ్వరిలు.

శివ చరణు మధ్యన హరి భక్తుడా!

కడు విచిత్రము.

వారంతా ఎవరు? ఎచటకు వచ్చుచున్నారు.

వేణు గాన పరవశంలో పులకిస్తూనే ఆలోచిస్తున్నారు. అంతలో ఆ బృందం వారి ముందుకు రానే వచ్చింది. అప్పటికి ఆకాశం పూర్తిగా మేఘావృతమై పోయింది. ఉరుములు మెరుపులతో వాతావరణం పెళ్ళి సందడిలా వుంది. చలి గాలి జివ్వున వీస్తోంది. ఏ క్షణమైనా కుండ పోతగా వర్షం పడే సూచనలు కన్పిస్తున్నాయి. ఆశ్చర్య పరచిన విషయం ఏమంటే, వృషభము, శునకము రెండూ కూడ ముందు కాళ్ళ మీద వంగి ఆ శతాధిక మురళీధరుని పాదాలను భక్తితో తాకటం. ఇక భూతం ఘృతాచి ఆయన ముందు సాష్టాంగ పడి నమస్కరిస్తూ కన్నీరు విడుస్తోంది.


తమకు ఏమీ అర్థం గాక పోయినా భక్తి భావంతో మోకాళ్ళ మీద కూచుని ప్రణామం చేసారు భద్రాదేవి, ఊూచీశ్వరిలు.

మురళి వాయించటం ఆపి చిరు నవ్వుతో అందర్ని చూస్తూ చెయెత్తి ''శుభమస్తు'' అంటూ ఆశీర్వదించాడాయన.

''స్వామీ! అంధకారములో కొట్టుమిట్టాడుచున్న మాకు సమయానికి దైవంలా వచ్చినారు. మాకేమియు అర్థము గాకున్నది స్వామీ. ఈ వృషభ రాజము, ఈ శునకము, ఇప్పుడు మీరంతా... ఇది మా అదృష్టమే అనుకోవలె. కాని మీకు నమస్కరించుట తప్ప ఏ అతిథి సత్కారము ఆచరింప లేని అభాగ్యులం. మమ్మల్ని క్షమించి తమరు ఎవరో తెలియ జేసి మాకు దారి చూపండి'' అంటూ వేడుకుంది భద్రా దేవి.

ఆ మురళీ ధరుడు మందహాసం చేసాడు.

అదే సమయంలో................................




ఆకాశ మార్గాన పెద్ద మెరుపు.

ఆ వెనకే దిక్కులు పిక్కటిల్ల జేస్తూ ఉరుముల శబ్దం. దాంతో బాటే చిట పట చినుకులు రాలటం ఆరంభమైంది. పరమ బాగవతోత్తముడైన ఆ పురుషోత్తముడు ఆకాశం వంక చూస్తూ` ''ఆగవయ్యా వరుణ దేవా. ఏమా తొందర? ఇచట వ్యవహారమింకను చక్క బడ లేదు. మేము వెడలు వరకు ఒక్క వాన చినుకు రాలినా వూరుకోను సుమా'' అంటూ మురళిని ఆకాశం వంక చూపుతూ హెచ్చరించాడు.

ఆశ్చర్యం... అద్భుతం.

ఆయన హెచ్చరించిన మరు క్షణం రాలుతున్న చినుకులు కూడ ఆగి పోయాయి. కుంభ వృష్టిగా పడుతుందనుకున్న వాన ఆగి పోయింది. కాని గగన తలాన నల్ల మబ్బులు కారాడుతూనే వున్నాయి.

ఇప్పుడు అతివలిరువురి వంక చూసి

మంద హాసం చేసాడా మురళీ ధరుడు.

“ఏమన్నావు తల్లీ... నేను ఎవరని గదూ అడిగినావు. అదేమిటో గాని లోకమున అందరూ నాకు తెలియు... కాని నేను కొందరికే తెలియు... విచిత్రము గదూ!

పసి ప్రాయమున నోరు తెరిచిన గాని నా బొజ్జలో ఏమున్నదో తెలియ లేదట. రోలును లాగి చెట్లను కూల్చినపుడు గాని నా బలమెంతో ఎరుంగరైతిరి. నను పశుల కాపరి యని కొందరు, అల్లరి వాడను తుంటరి వాడనని ఇచ్చకాలాడు వారు కొందరు, వెన్న దొంగనని నింద వేయు వారు కొందరు, కపటి యని, మోస గాడనని ఈసడించు వారు కొందరు` ఏమైతే నేమి గాని తల్లీ నను మాత్రం మాధవ స్వామి అంటారు. ఆ రాధా రమణుడు వేణు మాధవుని భక్తుడను” అన్నాడు.

మాధవ స్వామి మాటలు భద్రా దేవి, ఉలూచీశ్వరిలకు అంతు చిక్క లేదు గాని అక్కడే వున్న భూతం ఘృతాచికి అర్థమై పోయింది. నోరు కొట్టుకుంది, నెత్తి కొట్టుకుంది.

“అయ్యో పిచ్చి తల్లులూ ! ఈయన మాటలు నమ్మకండమ్మా. వేషము జూచి మోస పోవలదు. ఈ దివ్య పురుషుడు ఎవరనుకొనుచున్నారు? సాక్షాత్తూ ఆ పురుషోత్తముడేనమ్మా. లీలా మానుష రూపుడు, జగన్నాటక సూత్రధారి, ఆ వైకుంఠ వాసుడు, ఆ వేణు గోపాలుడే మిమ్ము కరుణించి వచ్చినాడు... మోస పోవలదు సుమా.” అంటూ ఇంత లావున నోరు తెరచి అతివలిరువురినీ హెచ్చరించానుకుంది. కాని ఆ మోహనాకారుని చూస్తున్న దివ్యానందంలో కన్నీరు ఉప్పొంగి గొంతు పెగలక ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దాని అవస్థ గ్రహించి మంద హాసం చేసాడు మాధవ స్వామి.

“ఘృతాచీ! త్వర లోనే నీ పాపము పరిపక్వత చెందనున్నది. నీ రుధిర దాహము తీరనుంది. పిమ్మట ఈ భూత జన్మ నుండి నీకు విముక్తి లభించి మరు జన్మమున కాశ్మీర రాజ తనయగా జన్మించగ యోగము. అంత దనుక నీవు చూచినది చూచినటు, విన్నది వినినటు మరచి పోవలె సుమా” అంటూ నర్మ గర్భంగా హెచ్చరించాడు.

“ధన్యు రాలను తండ్రీ” అంటూ భక్తితో నమస్కరించింది ఘృతాచి.

భద్రా దేవి, ఉలూచీశ్వరిలు` చేష్టలు దక్కి చూస్తున్నారు.వారి కేమీ అర్థం గావటం లేదు.

‘‘అమ్మా భద్రా దేవి’’ పిలిచాడు మాధవ స్వామి. ఉలికి పడి చూసింది భద్రా దేవి.

తన పేరు ఈ స్వామికి ఎలా తెలుసు?

ఆశ్చర్యం నుండి ఆమె తేరు కొనక ముందే మాధవ స్వామి దర హాసంతో పలికాడు` ‘‘నిను అపర్ణుడని పిలువనా... ఇప్పుడు పురుష వేషమున లేవు గాబట్టి భద్రా దేవి యనే పిలుతును’’ అన్నాడు.

భద్రా దేవి సిగ్గు పడింది.

ఉలూచీశ్వరి ఆసక్తిగా వింటోంది.

‘‘మరీ ఆశ్చర్య పోవలదు సుమా. ని గురించియే కాదు నీ చెల్లి యగు ఈ ఉలూచీశ్వరి గురించి తెలియు. నాగ లోక యువ రాణి, నాగ రాజు దంపతుల గారాల పట్టి, నాగ కుమారి. మీ వలపుల చెలి కాడు రత్నగిరి రాకుమారుడు ధనుంజయుడు. సరి గానే చెప్పితిని గదా? ఇది జ్యోతిషము కాదమ్మా, వాస్తవము. ధనుంజయుడు ఎవరో కాదు, నా నేస్తము, ప్రియ సఖుడు, ఆప్తుడు నాకు ఎంతో కావలసిన వాడు. నాకు తెలుసు అతడి గురించి తనకు తోచిందే గాని ఒకరు చెబితే వినుకోడు. మహా మొండి వాడు. లేకున్న మీరంతగా చెప్పినా వినకుండా శివయ్య దర్శనానికి వచ్చునా? వచ్చి అదృశ్యమై మిమ్మల్నిలా కడ గండ్లపాలు జేసే వాడా. వినడే....’’ అంటూ భారంగా నిట్టూర్చాడు.

‘‘కాని స్వామీ....’’ అంటూ ఉలూచీశ్వరి ఏదో అడగ బోతుంటే చేయెత్తి వారించాడు మాధవ స్వామి.

‘‘నాకు తెలుసు నాగ రాజ పుత్రీ. నీకంతయు తెలియు. ధనుంజయుని అదృశ్యమున గొని పోయి పాతాళమున పడ వేసిన వాడు మీ నాగ లోక ప్రముఖుడు వక్ర దంతుడు. అవునా?’’ అడిగాడు.

తల వూపింది ఉలూచీశ్వరి.

“మీకు తెలిని విషయం ఏమన, ధనుంజయుని గూర్చి మీకన్నను నాకే బాగుగా తెలియు. అంత దేనికి? గతంలో రాయ గిరి వేణు గోపాల స్వామి ఆలయాన కలిసినాము. చిలక్కి చెప్పినటుల జెపితి. నాయనా ఇది పద్ధతి కాదయ్యా. మీ ఇలవేలుపూ నీ తండ్రి గారి ఆరాధ్య దైవము ముందుగా నీవు సహ్యాద్రికి గదా పోవలె. ఆ భీమ శంకరుని ఆశీస్సులు పొంది బయలు దేరుము. శుభములొనగూరును అంటి. వింటేనా! ఆ శివయ్యకి అంత శక్తి వుంటే నా తండ్రి పుట్ట వ్రణము బారిన పడు వారేనా! ససేమిరా పోను పొమ్మన్నాడు. ఏమైనది. అలిగిన ఆ భీమ శంకరుడు గాలి వాన సృష్టించినాడు. పెను గాలి వానలో దారి తప్పి అడవులబడి దిక్కు తెలియక అష్ట కష్టములు అనుభవించినాడు. దారిలో చిరంజీవి యగు అశ్వద్ధామను కలిసి కొన్ని విషయము తెలుసుకున్నాడు. పిమ్మట ఢాకినీ వనం చేరాడు. అక్కడే గదూ ఈ నాగ పుత్రిని కాపాడి మనసు హరించినాడు. అంతేనా! మనసు మార్చుకుని బుద్ధిగా సహ్యాద్రి చేరి భీమ శంకరుని సేవించినాడు. ఆ శివయ్య కరుణతో ఈ భద్రా దేవి దర్శనమైనది. అపర్ణుడే భద్రా దేవియను సత్యమును తెలిసినది. అచ్చోటనే ద్రోహుల నుండి పెను ప్రమాదమును తప్పినది. చూచితిరా! దైవ కృపా కటాక్షం ఉన్నచో కీడులో కూడ మేలు ఎటుల ఒన గూడునో” అంటూ కాసేపు చెప్పటం ఆపాడు మాధవ స్వామి.

భద్రా దేవి, ఉలూచీశ్వరిలకు ఆయన మాటలు వింటూంటే గతం గుర్తుకొచ్చి దుఃఖం పొంగుకొస్తోంది. తిరిగి తన సందేశం వినిపించాడు మాధవ స్వామి.

“చూడండి లలనా మణులారా. ఆలయాన మీరు మీ ప్రియుని గానక విలపించినారు గదా. సమాధానము కావలెనని వేడు కొంటిరి గదా. ఇదో సమాధానము. మీరు అనాధలు గాదు, తల దాచుకొన గూడు లేని అభాగ్యులూ గాదు. సంపూర్ణ దైవానుగ్రహం కలిగిన అదృష్టవంతులు. మీ రక్షణ కొరకు ఆ కైలాస నాధుడు నందీశ్వరుని, భైరవుని పంపించినాడు. ఇదో… తన శివ గణాలనూ, మధ్యవర్తిగా నన్నూ పంపించినాడు. ఇంకేమి కావలె? రండమ్మా! ఆ స్వామి సన్నిధికి పోవుదము. మీకే కొరతా రాబోదు.” అంటూ వచ్చిన పని వివరించాడు.

అంతా విని బాధగా చూస్తూ` కన్నీరు తుడుచుకుంది భద్రా దేవి.

“క్షమించండి స్వామీ. మేము రాలేము” అంది.

“ఏవమ్మా! ఈ రేయి గాలి వానలో ఈ శాలి వృక్షము చెంతనే చలికి గడ గడ వణకుచూ కష్ట పడుదురా. ఏమైనది?” మంద హాసంతో అడిగాడు స్వామి.

"ఎలా రాగలము స్వామి. అచట పాతాళ లోకమున మా మనోవల్లభుడు ఎన్ని బాధలు కష్టములు పడుచున్నారో గదా. తనచట ఇడుముల గ్రుమ్మరుచుండ మేమెటుల ఇచట సుఖమున ఉండ గలము స్వామి. ఆయనను కాపాడుట వదలి మా కొరకు అక్కర చూపుట ఇది యేమి ధర్మము? ఆ గరళ కంఠునికి తెలియని ధర్మముండునా? మా ఎడబాటే ఆ స్వామికి ఆనందమా?" అంది కన్నీళ్ళతో భద్రా దేవి.

"అవును స్వామి. మా సఖుడు మరలి వచ్చువరకు మేమిచటనే ఉందుము." అంటూ భద్రా దేవిని సమర్థించింది ఉలూచీశ్వరి.

"వూహు! ఇది సరి యగు నిర్ణయము గాదు. మీరు పొరబడుచున్నారు. చూడు తల్లీ భద్రా దేవి, మహా మహులే శివ తత్త్వాన్ని అర్థము జేసు కొన జాలరు. బాలికలు మీవల్ల అగునా? కర్మ ఫలం అనుభవింపక తప్పదు. కర్మ చేయకనూ తప్పదు. సుత్తి దెబ్బలు తిన కుండ బంగారము అందమగు ఆభరణము అగునా? జీవితము గూడ అంతియే. కారణ జన్ములు ఎంత కష్ట పడిన అంతకంత కీర్తి ప్రతిష్టలను సుఖమును బడయ గలరు. చెప్పితిని గదా! కీడు లోనూ మేలు ఒన గూర్చునదే దైవ కృప. ఇచటను ధనుంజయునకు ఒక ప్రయోజనము గలదు. అతను మరలి రాగానే అది మీకు అర్థము కాగలదు.

ఒక ప్రక్క నాగ దండు ఉలూచీశ్వరి కోసము ప్రయత్నించు చుండ నీ విటుల భీష్మించి ఇచటయే ఉండుట క్షేమము గాదు. నా మాట వినండి. పదండి" అంటూ అనునయంగా నచ్చ చెప్పాడు.

తన కోసం గాకున్నా ఉలూచీశ్వరి క్షేమం కోరి అయినా ఈ దైవ ఆహ్వానాన్ని అంగీకరింపక తప్ప లేదు భద్రా దేవికి. ముందుగా వృషభము కొండ గుట్ట దిశగా అడుగు లేసింది. ఆ వెనకే తమ అశ్వాలను నడిపించుకుంటూ భద్రా దేవి, ఉలూచీశ్వరిలు బయలు దేరారు. వారికి ముందు దివిటీలతో శివ గణాలు నడిచాయి. వెనక రక్షణగా శునక రూపంలోని భైరవుడు అనుసరించాడు. చివరిగా భూతం ఘృతాచి గాలిలో తేలుతూ బయలు దేరింది.

అతివలిద్దరి ముందు నడుస్తున్న మాధవ స్వామి తిరిగి మురళి అందుకుని కళ్యాణి రాగం అందుకున్నాడు. చెంగు చెంగున దూకుతూ కాలి బాట మీద ముందుగా గుట్ట పైకి సాగి పోతోంది వృషభ రాజము. దాన్ని అనుసరించి మౌనంగా గుట్ట ఎక్కుతున్నారంతా. శివ గణాలు కూడ మురళి రవం వింటూ మౌనంగా నడుస్తున్నారు. వాద్య ఘోష చేయటం లేదు. మురళి రవానికి ప్రకృతి పులకిస్తోంది.

"స్వామీ! తెలిక అడుగుచుంటి క్షమింపుడు. కళ్యాణి రాగం మీకు అంత యిష్టమా?" దారిలో అడిగింది ఉలూచీశ్వరి.

“నాకు అత్యంత ప్రీతి కరమగునవి మోహన, కళ్యాణి రాగము. ఆ కైలాస నాధునికి ప్రీతి కరమగునవి శంకరాభరణము, భైరవి రాగము.” అన్నాడు మాధవ స్వామి.

“అంత అద్భుతముగా వేణు గానమాలపిస్తున్నారు. మీ గురు దేవులు ఎవరు స్వామి?” ఈసారి భద్రా దేవి అడిగింది.

“గురు దేవుడు... హహహ” అంటూ ఫడాలున నవ్వాడు మాధవ స్వామి.

“తల్లీ... నా చదువుకు గురు దేవుడున్నాడు గాని వేణువుకి ఏ గురువులునూ లేడమ్మా. సాధారణ పశుల కాపరిని, గోపాలుడ్ని. ఏమియు తోచక మురళి వాయిస్తుంటే తానుగా అభ్యాసమై పోయినది” అంటూ మరో ప్రశ్నకు అవకాశమివ్వకుండా వెంటనే మోహన రాగం అందుకున్నాడు.

సమ్మోహ పరిచే మోహన రాగ మాధుర్యానికి ప్రకృతే పులకించ సాగింది. చీకట్ల మాటున తెలిటం లేదు గాని చుట్టూ పొదల వెంట లతలు తీగలు సాగి పుష్పించి సౌరభాన్ని వెద జల్లుతున్నాయి. నడుస్తున్న మాధవ స్వామి పాద పద్మాల కింద పచ్చిక పరవశించి ఒత్తుగా పెరిగి పోతోంది. పొదల వెంట కుందేళ్ళు, ఉడుతలు మొదలైన చిరు ప్రాణులు, కొన్ని పక్షి జాతులు నిర్భయంగా తమ తావులు వదిలి బయటికొచ్చి పరవశంతో చిందులేస్తున్నాయి. రస మయ వేణు గానంలో మోహన రాగ పరవశంలో కొండ గుట్ట పైకి ఎలా చేరుకున్నారో వారికి తెలియ లేదు. అంతా ప్రాకార గోపురం దాటి ముందుగా పదహారు స్తంభాల రాతి మండపాన్ని చేరుకున్నారు.

అశ్వాలను అచటనే వదిలి భద్రా దేవి, ఉలూచీశ్వరిలిరువురు ముందుగా మూసి వున్న ఆలయ ద్వారం ముందు కెళ్ళి సాష్టాంగ పడి ఆ దేవ దేవుడు సదా శివుని మనసారా ప్రార్థించారు. తిరిగి లేచే సరికి ఇప్పుడక్కడ వృషభము లేదు, శునకము లేదు, శివ చరణులు లేరు. మండపము అరుగు మీద కూచుని వేణువాలపిస్తున్నాడు మాధవ స్వామి.


మండపాన్ని చుట్టి అయిదు వరుసలలో కూడిన మెట్లున్నాయి. ఆ మండప నిర్మాణమే చుట్టూ బయటి పక్క ఎనిమిది స్థంబాలు, లోన దగ్గర దగ్గరగా ఎనిమిది స్థంబాలు కలిగి పైన దృఢమైన రాతి కప్పులో కూడిన అద్భుత నిర్మాణము.

ఆ మండపం నైరుతిలో చివరి రెండు స్థంభాలకు అశ్వాలు బంధించ బడి పచ్చిక వేయ బడుంది. వాటి కోసం పక్కనే పెద్ద చెక్క తొట్టి నిండుగా నీరు ఉంచబడింది. ఈ చివర రెండు స్థంభాలకు రెండు దివిటీలు కట్టబడి మండప ప్రాంతం కాంతులీనుతోంది. భూతం ఘృతాచి తమ తోలు సంచిలోంచి తడిసిన దుస్తులు తీసి బయట వరుస స్థంభాలకు చుట్టూ ఆర కడుతోంది. ఎప్పుడో ఉదయం పుణ్య స్నానం చేసి పిండిన దుస్తులవి. ధనుంజయుని అదృశ్యంతో వాటి గురించి పట్టించుకో లేదు.

ఇక మధ్యలో ఎనిమిది స్థంభాల నడుమ ప్రదేశంలో చక్కగా నిద్ర పోవటానికి అనువుగా నేల మీద పట్టు బాలీసులతో కూడిన పరుపు వేయబడి వుంది. ఇవతలగా చిన్న బల్ల మీద మంచి నీటితో కూడిన బిందె, రెండు లోటాలు ఉంచబడ్డాయి. నేల మీద రెండు పీటలు ఉంచి వాటి మీద ఆహార పదార్థాలతో కూడిన పళ్ళెరము చక్కగా మూత ఉంచ బడున్నాయి. ఇంతలోనే ఇన్ని ఏర్పాట్లు ఎలా జరిగాయో అర్థం గాక యువతులిద్దరూ అయోమయంగా చూస్తూ మెట్లెక్కి పైకి వచ్చారు.

''రండమ్మా! మీకొరకే చూస్తున్నాను'' అంటూ మురళి వాయించటం ఆపి లేచాడు మాధవ స్వామి.

''మీ సఖుడు ధనుంజయుడు మరలి వచ్చు దనుక మీకిచట ఏ కొరత యును రాదు తల్లీ. కాని ఇప్పుడు నేను నుడువు మాటలు జాగ్రత్తగా విని గురుతుంచుకోవలె. రాత్రి వేళ మండపమును చుట్టి శివ చరణులు అదృశ్య రూపమున మీకు కావలి యుందురు. చీమను కూడ మండపము లోనికి చేర నీయరు. కావున శత్రు భయము లేక మీరు ఇచట నిశ్చింతగా ఉండ వచ్చును. ఇక పగటి వేళ` సూర్యోదయము పిమ్మట మీరు ఎట తిరిగినను సూర్యాస్తమయమునకు ముందే మండపమునకు వచ్చి చేర వలె. సూర్యాస్తమయము తర్వాత తిరిగి సూర్యుడుదయించు లోన రాత్రి వేళ పొరబాటున కూడ మీరు ఈ మండపము వదలి బయటకు పోవలదు. ఏలయన శివ రచరణులు కావలి యున్నను మిమ్ము ఆపరు. నాగ లోకము నుండి వచ్చిన నాగ రాజు భటు మిమ్ము అపహరించు అవకాశము కలదు. బహు జాగురూకులై హెచ్చరిక నుండ వలె. అర్థమైనది గదా'' అంటూ వివరించి చెప్పాడు.




‘‘చిత్తము స్వామి. ఇది తమ ఆనతిగా భావించి ఆచరింతుము గాక’’ అంటూ భద్రా దేవి, ఉలూచీశ్వరి ఇరువురు భక్తితో ఆయనకు పాదాభివందనం చేసి ఆశీస్సు తీసుకున్నారు.

‘‘ఇక నేను పోయివత్తునా?’’ అన్నాడు మాధవ స్వామి.

‘‘చిత్తము స్వామి. కాని నాదొక్క సందియము. తెలిక అడుగు చుంటి. అన్యధా భావించ వలదు’’ అంది ఉలూచీశ్వరి.

‘‘ఎంత మాట సుదతీ. అన్నుల మిన్నవు, నాగ రాజ తనయవు. నీ జనకుడు మా హరి భక్తుడే గదా. నీ సందియము తీర్చుట నా కర్తవ్యమై యున్నది. అడుగుము బాలికా. ఏమా సందియము?’’ దరహాసంతో అడిగాడు మాధవ స్వామి.

‘‘స్వామీ! హరి హరులు వేరు వేరు గదా. ఆ హరుని తరఫున మా కొరకు హరి భక్తులగు తమరు విచ్చేసి మాకింతటి ఉపకార

మొనర్చుట కడు ఆశ్చర్యమునమున్నది. దీని మర్మ మేమి స్వామీ'' అంటూ అంత వరకు మనసును తొలుస్తున్న సంశయాన్ని బయట పెట్టింది ఉలూచిశ్వరి.

ఆ మాటలు వింటున్న భూతం ఘృతాచి ఉలికి పడి చేస్తున్న పని ఆపి పరుగు పరుగున వచ్చింది. ఆ మాటలు విన్న మాధవ స్వామి కూడ ఆమె అమాయకత్వానికి ముచ్చట పడుతూ ఫక్కున నవ్వేసాడు. భద్రా దేవి కూడ ఆయన ఏం చెప్తాడాని ఆసక్తిగా చూస్తోంది.

''అహో.... ఎంతటి అమాయకురాలివమ్మా. రూప భేదమే గాని వారిరువురికిని భేదము లేదన్న సత్యమును నీ జనకుడు నీకెన్నడును చెప్పనే లేదా? భేద భావము మనలోనే గాని ఆ శివ కేశవులకు లేవమ్మా. తాము వేరు వేరనిపిస్తారు కాని ఇరువురును ఒకటే... తోడు దొంగలు. ఒకరిలో ఒకరుంటారు. హహహ'' అని పెద్దగా నవ్వుతూ రెండు మెట్లు దిగి ఆకాశం వంక చూసాడు మాధవ స్వామి.

అర్థమయ్యీ అర్థం గానట్టున్న ఆయన మాటల సారాంశాన్ని జీర్ణించుకో లేక చేష్టలు దక్కి అలా చూస్తుండి పోయారు భద్రా దేవి, ఉలూచిశ్వరిలు.

మాధవ స్వామి ఆకాశం వంక చూసి మురళితో సైగ చేస్తూ` ''వరుణ దేవా` ఎంత సేపని నీ జల ధారను పగ్గము పట్టి బిగించి ఉంచెదవయ్యా. ఇక చాలును వాటిని విడువుము. వచ్చిన కార్యము ముగిసినది. నేను నిష్క్రమించు తరుణమాసన్నమైనది. కానిమ్ము'' అన్నాడు. అంతే`

ఒక్క సారిగా కుంభ వృష్టిగా మొదలయింది వాన. మెట్లు దిగి మురళి వాయించుకుంటూ ఆలయ ద్వారం వైపు అడుగులు సారించాడు మాధవ స్వామి. వర్షం హోరును మించి మురళి రవం మనసును కొల్లగొడుతోంది. వెళుతున్న మాధవ స్వామిని ఆశ్చర్య సంభ్రమాలతో మండపంలో నిలబడి అలా చూస్తుండి పోయారు భద్రా దేవి, ఉలూచిశ్వరిలు. కారణం` అంత వర్షం పడుతున్నా ఒక్క వాన చినుకు కూడ మాధవ స్వామి మీద రాలటం లేదు. ఎవరో గొడుగు పడుతున్నట్టు ఆయన్ని చుట్టి వాన పడుతోంది గాని ఆయన్ని తడపటం లేదు. అంతే కాదు, ఆయన పాదాలను తాకి పులకిస్తూ వెనక్కి జారుతోంది వాన నీరు. ఆవరణ దాటి ప్రవేశ ద్వారం వరకూ వెళ్ళాడాయన. ద్వారానికి బిగాలు వేసున్నాయి. అయినా చూస్తుండగానే ఆయన ఎటు వెళ్ళాడో కన్పించ లేదు. చీకట్ల మాటున గోచరం కాలేదునుకున్నారు యువతులిరువురూ.

ఇంతలో భూతం ఘృతాచి నేలకు పడి పడి దండాలు పెడుతూ చిన్నగా రోదిస్తుంటే అచ్చెరు వొంది అటు చూసారు. ఇంత క్రితం

ఎక్కడ మాధవస్వామి నిలబడున్నాడో అక్కడ ఆయన పాదాలు తాకిన చోటును భక్తితో మొక్కుతోంది ఘృతాచి.

"ఘృతాచి... ఏమైనది నీకు?" అనడిగింది భద్రా దేవి.

"నాకేమియు కాలేదమ్మా. మీకే అర్థము గాకున్నది" అంది ఘృతాచి.

"ఆ స్వామి మాటల మర్మాన్ని తెలుసుకో లేక పోతిరి గదా. ఆయన హరి భక్తుడు కాదమ్మా. సాక్షాత్తూ ఆ శ్రీహరే. ఆయనే కేశవుడు, మాధవుడు, అవతార పురుషుడు, పురుషోత్తముడు సాక్షాత్తూ ఆ వేణు గోపాలుడు" అంది.

ఆ మాటలు వింటూనే` పడతులిరువురూ కొయ్యబారి పోయారు.

మాధవ స్వామి మాటల మర్మం ఏమిటో కొద్ది కొద్దిగా అవగతం కాసాగింది. కట్టెదుట ఉన్న స్వామి అసలు రూపాన్ని గుర్తించ లేక పోయిన తమ అవివేకానికి ఖిన్నులయ్యారు.

ఆ పురుషోత్తముని పాదాలు తాకిన చోటును ఇప్పుడు ఘృతాచి తో బాటు భద్రా దేవి, ఉలూచీశ్వరిలు కూడ తాకి భక్తి ప్రపత్తులతో ఆయన్ని స్మరిస్తూ ప్రణమిల్లారు.

బయట కుండ పోతగా వర్షం పడుతూనే వుంది.

*****************************************************

బిల మార్గంలో పడి ఏటవాలుగా జారి పోతున్నాడు ధనుంజయుడు. దిగువకు... ఇంకా దిగువకు... ఎన్నో మెలికలు, మలుపులు తిరుగుతూ చాలా దూరం వెళ్ళి పోయాడు. బిల మార్గం మలుపుల్లో ఇరుకు గోడకు గుద్దుకొని శరీరం హూనమై పోతోంది. తనను తాను నిలదొక్కుకునే అవకాశమే లేక పోయింది. అలా చాలా దూరం సాగిన ఆ బిల మార్గం చివరకు ధనుంజయుని ఉన్నట్టుండి బయటకు విసిరేసింది.

శర వేగంతో దూసుకొచ్చిన ధనుంజయుని శరీరం కొద్ది సేపు గాలిలో గిరికీలు కొట్టి కొంత దూరం వెళ్ళి దబ్బున క్రింద పడి పోయింది. పడ్డ చోటు దట్టమైన ఇసుక ప్రదేశం గావటంతో బలమైన దెబ్బలేమి తగల్లేదు గాని దూసుకొచ్చిన వేగానికి వెంటనే తెలివి తప్పి అచేతనంగా అలాగే ఉండి పోయాడు.

అలా ఎంతసేపు గడిచిందో అతడికి తెలిదు. ఎప్పటికో నెమ్మదిగా స్పృహలో కొచ్చాడు. కాని తను ఎవరు, ఏం జరిగింది ఏదీ గుర్తు లేకుండా పోయింది. నాలుక పిడచ కట్టుకు పోయి విపరీతమైన దాహం వేస్తోంది.

నెమ్మదిగా శక్తి కూడ దీసుకుని` లేచి కూచున్నాడు.

కను మూసుకుని తదేకంగా ఆలోచించాక అప్పుడు క్రమంగా ఒక్కటొక్కటిగా జరిగిన సంఘటనలు గుర్తుకు రానారంభించాయి. ఎప్పుడైతే గతం గుర్తుకొచ్చిందో చట్టున కనులు తెరిచి పరిసరాల మీద దృష్టి సారించాడు.

అది ఏ ప్రాంతం?

తను ఎక్కడున్నాడు?

పైన సూర్యుడు గాని చంద్రుడు గాని తారకులు గాని కాన రావటం లేదు. చిమ్మ చీకటి. కాని ఎచటి నుండో నక్షత్రాల వెలుగుల వంటి నీలి రంగు కాంతి రేఖలు చీకటి కల గలిసి పరిసరములన్తటా వ్యాపించి ఉంది. కనులు చికిలించి కొద్ది సేపు ఆ వెలుతురుకి అలవాటు పడ్డాక కొంత మేర వీక్షింప గలుగుతున్నాడు.

చూడ్డానికి అదేదో ఎడారి ప్రాంతంలా వుంది.

ఎక్కడా చెట్టు చేమ జాడ లేదు.

తన వెనుక తట్టున చాలా ఎత్తు వరకు వరుసగా పేర్చినటుల అనేక రాతి పొరలు దర్శనమిస్తున్నాయి. వాటిలో ఎక్కడో పైన బిల మార్గం గుండా వచ్చి తనిక్కడ పడ్డాడు. వెలుగు అతి తక్కువగా వున్నా గాలి మాత్రం ధారాళంగా వీస్తోంది. చల్లటి శీతల గాలులు సేద తీరుస్తున్నాయి. కాని దాహం తీర్చుకునేందుకు ఎక్కడా నీటి జాడలు కన్పించటం లేదు.

కొంత సమయం తర్వాత`

తనకు ఎడం పక్కగా సుదూరంలో అనేక దీప కాంతులతో కూడిన సౌధాలు గోచరమయ్యాయి. అక్కడేదో నగరం వుంది. తను అక్కడికి చేరుకో గలిగితే ఇది ఏ ప్రాంతమో తెలిసే అవకాశం వుంది. అలాగే ఇక్కడి నుండి బయట పడేందుకు సాయం లభించవచ్చు. ఖచ్చితంగా ఇది భూలోకం మాత్రం కాదు. ఆ ధూర్తుడు వక్ర దంతుడు తిరిగి తను భూ లోకం చేరకుండా నిరోధించేందుకు తెచ్చి అధో లోకాల్లో ఎక్కడో పడేసి పోయాడు.

శివాలయమున ఏమి జరిగినదో ఇప్పుడిప్పుడే గుర్తుకొస్తోంది. దైవ సన్నిధి లోనే వాళ్ళు ఇంతకు తెగించెదరని తను వూహించ లేక పోయాడు. ముందుగా పొట్టి వాడొకడు తన వెనక నుంచి పిలిచాడు. వాడి నెత్తిన శంఖం బోర్లించినట్టు విచిత్రమైన కొమ్ము వుంది. వాడే తన ముఖం మీద చేయి ఆడించి తెలివి తప్పించాడు. చివరి క్షణంలో తనను భుజాన వేసుకుంటున్న వక్ర దంతుని గుర్తించాడు. కాని తను వాళ్ళని ఏమీ చేయ లేని నిస్సహాయుడయ్యాడు. భద్రా దేవి తన పక్కనుంటే యిలా జరిగేది కాదేమో. కాని వాళ్ళిద్దరూ స్త్రీ వరుసలో ముందుండి తనను గమనించ లేదు.

వదులు వదలని ప్రియసఖిలిరువురూ వారించినా వినక శివ దర్శనార్థం వచ్చినందుకు తనకు యిలా జరిగినదేమిటి? ఆ నీల కంఠుని దయ తప్పినదా. ఇంత జరుగుతున్నా మిన్నకుండినాడు? ఆలయాన తనను గానక భద్రా దేవి, ఉలూచిశ్వరిలు ఎంతగా దుఖించారో గదా. ఎంతగా తత్తరిల్లుచున్నారో. ఏమైనదో గదా. అహో...

తనకు కొద్ది దినముల కిందట ఏర్పడిన దుస్స్వప్నము ఇంతగా యదార్థము గావలెనా! ఇప్పుడేమిటి తనకు దారి? వలచి వలపించుకొని తననే నమ్ముకున్న ప్రాణ సఖియలకు దూరమైతినే... దివ్య నాగమణి కోసం బయలు దేరిన తను ఈ తెరంగున భ్రష్టుడ నైతి నేమి?

పుట్ట వ్రణ బాధ నుండి జనకుని విముక్తుని గావించి కన్న రుణము తీర్చుకోలేని అ శక్తుడనైతినే. దైవమా... నిరంతరము పూజలు సలుపుచూ క్షణమొక యుగంగా తన కొరకు ఎదురు చూచు కన్న తల్లిని తిరిగి దర్శించ లేని అభాగ్యుడ నైతినే. హతవిధీ! ఇప్పుడు నాకు దారేది? ఏ తెరంగున తిరిగి భూలోకము చేర గలను? హే శంకరా ఎందుకిలా జేసినావు. హే ప్రభూ మాధవా

మధుసూధనా వేణుగోపాలా... సదా నిను ఆరాధించు వాడనే... నేనేం కావాలని మౌనం వహించితివి'' అంటూ అందరినీ తలచుకొని చాలా సేపు పరిపరి విధాలా రోధించాడు.

కాని ఎంత ఏడ్చినా ఏమి ప్రయోజనం లేదు.

కన్నీళ్ళు కష్టాలను తీర్చవు.

త్వరితమున ఇట నుండి బయట పడు మార్గము చూడ వలె. అయిననూ మేరు నగ సమాన ధీరుడగు తనేమిటి ఇలా భీరువులా తల్లడిల్లుట ఏమి? మహా వీరుడనిపించుకున్న ధనుంజయుని కంట కన్నీరా! అంతా మన మంచికే అనుకుంటే ఏ కష్టము బాధించదు గదా. ఏమో! ఆ జగన్నాటక సూత్ర ధారి మురళీ మోహనుడు ఏ ప్రయోజనము నాశించి తన చేయి విడిచినాడో... చూచెదను గాక. ముందు ఈ దాహార్తి తీరవలె...

తనకు తానే ధైర్యం చెప్పుకొంటూ` కన్నీరు తుడుచుకున్నాడు.

చిన్నగా శక్తి కూడదీసుకుని లేచి నిల బడ్డాడు. ఒడంతా హీనమై శక్తి హీనుడుగా వున్నాడు. ఆ పైన క్షుద్బాధతో బాటు దాహార్తి. అలానే పడుతూ లేస్తూ దూరంగా గోచరిస్తున్న దీప కాంతులతో కూడిన నగరం దిశగా బయలు దేరాడు.

ఇప్పుడు తను నిరాయుధుడు.

ఉదయం దైవ దర్శనార్ధం పోతూ కృపాణంతో సహా ఆయుధాన్నీ తన అశ్వం గరుడ చెంతనే ఉంచేసాడు. రానున్నది ప్రమాదమైనా, ప్రమోదమైనా ఎదుర్కొనక తప్పదు. అసలిచట పగలు రాత్రియను బేధమున్నదా? అలాంటి సూచనలే అగు పట్టకున్నవే... ఆలోచిస్తూ ముందుకు సాగి పోతూనే వున్నాడు. ఆ చిరు చీకట్ల లోనే సుమారు వేయి ధనువుల దూరం వచ్చేసాడు.


ఇంతలో దవ్వుల అలికిడి విన్పించి ఆగి పోయి చుట్టూ చూసాడు. తనకు ఎడం పక్కగా రెండు అశ్వాలు దుమ్ము తెరలు రేపుతూ తన వైపు దూసుకు రావటం కన్పించింది. బాహుశ అక్కడి భద్రతా దళాలకు చెందిన అశ్వికు కావచ్చనుకున్నాడు. వారిని అడిగితే వివరాలు తెలుస్తాయి. ఆ పైన దాహార్తికి మంచి నీరు లభిస్తుందన్న ఆశతో అలా నిలబడి చూడ సాగాడు.

క్రమంగా అశ్వాలు సమీపిస్తున్నాయి.

చిరు చీకట్లు నీలి రంగు కాంతి కలగలిసిన వెలుగులో అవి సమీపించే వరకు స్పష్టంగా చూడ లేక పోయాడు. చూడ గానే ఆశ్చర్య సంభ్రమాలతో నిశ్చేష్టుడై కను రెప్పలు మూయటం కాసేపు మరిచి పోయాడు.

అవి రెండూ అశ్వాలే. కాని వాటి మీద అశ్వికులు విడిగా లేరు. అశ్వ శిరస్సులకు బదులు ఆ స్థానంలో పురుషాకృతి కన్పిస్తోంది. అంటే` అశ్వం జూలు భాగం నుండి పైన నడుం వరకు పురుష రూపం వుంది. శిరస్సు మెడ భుజాలు రెండు చేతు ఛాతీ భాగాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. అసలిది ఏ లోకము? వీళ్ళని ఏమనాలి? అశ్వాలు అనాలా పురుషులు అనాలా లేక అశ్వ పురుషులని పిలవాలా. విచిత్రమైన రూపాలు. అబ్బుర పడి వీక్షిస్తున్నంత లోనే ధనుంజయుని సమీపం లోకి వచ్చేసాయి అవి. వాళ్ళ తల పైన తల పాగా చుట్టుకున్నారు. ఆ తల పాగా మీద బంగారు నక్షత్రం బిళ్ళ గుచ్చ బడి తళతళ మెరుస్తోంది. ఒక చేతిలో కొరడా రెండో చేతిలో బరిసె ఆయుధాలుగా ధరించి వున్నారు. ఇరువురికీ మెడలో సొర కాయ బుర్ర లాంటి వెండి పాత్ర వేలాడుతోంది. బహుశ త్రాగేందుకు వెంట నీరు తెచ్చుకొనుండాలి. ఆ అశ్వ పురుషు ముఖాలు వికృతంగా వున్నాయి. చూపు కౄరంగా వున్నాయి. వస్తూనే కొరడాలు ఝుళిపిస్తూ ధనుంజయుని చుట్టూ వృత్తాకారంలో మూడు సార్లు పరుగెత్తి పరిశీలిస్తూ చెరో పక్క ఆగి గ్రుచ్చి చూసారు. ఒక అశ్వ పురుషుడు ఏదో అడిగాడు. డబ్బాలో గులక రాళ్ళు పోసి ఆడిస్తున్నట్టు కంఠ స్వరం వికారంగా వుంది.

ధనుంజయుడు తనకు తెలిసిన నాలుగయిదు భాషల్లో చెప్పి చూసాడు. వాళ్ళకి అర్థం కాలేదు. వాళ్ళ భాష ధనుంజయునికి అర్థం కాలేదు. తనకు దాహంగా వుందని మంచి నీరు కావాలని సైగలతో సూచించాడు. వాళ్ళు మంచి నీరు యివ్వటానికి బదు కొరడాలు లేపారు. వూహించని పరిణామం. కొరడా వంటిని చుట్టి వచ్చే సరికి చుర్రు మంది ఒళ్ళు. భగ్గున మండింది ధనుంజయుని ఆగ్రహం. రెండో వాడి కొరడా మీది కొస్తుంటే దాన్ని ఒడిసి పట్టుకున్నాడు. దాన్ని అలానే పట్టుకుని ముందుగా తనను కొట్టిన వాడి అశ్వ శరీరం కాళ్ళ మీద ఎగిరి తన్నాడు. అంతే` ప్రాణం పోతున్నంత బాధతో విరుచుకు పడి నాలుగు కాళ్ళు తన్నుకుంటూ పెడ బొబ్బలు పెట్టాడు వాడు.




అంతటితో ఆగ లేదు ధనుంజయుడు. తను కొరడా తోలు ఒడిసి పట్టిన రెండో అశ్వ పురుషుడి నుంచి కొరడాను లాక్కుని దాంతో వాడిని చితగ్గొట్టాడు. వాడు కొరడా దెబ్బలు తిని వెర్రి కేకలు వేస్తూ నగరం దిశగా పారి పోయాడు. అప్పటికింకా మొదటి అశ్వ పురుషుడు మోకాలి బాధతో లేచి నిలువ లేక అవస్థ పడుతున్నాడు. వాడి మెడ లోని వెండి నీటి బుర్రను లాక్కున్నాడు. మూత తీసి కొద్దిగా తాగి చూసాడు. కొబ్బరి నీళ్ళలా తియ్యగా వుంది నీరు. సందేహించకుండా దాహం తీరేలా సగం నీరు తాగేసాడు. దాన్ని అక్కడే పారేసి వాడి బరిసెను ఆయుధంగా అందుకుని తిరిగి నడక ఆరంభించాడు.

దాహం తీరగానే శరీరానికి కొత్తగా శక్తి ఏర్పడినట్టుంది. ఓ చేత బరిసె, ఓ చేత కొరడా ఆయుధాలుగా వున్నాయి. ఇక నిర్భయంగా నగరం వైపు చర చరా అడుగులు సారించాడు.

అయితే ఎక్కువ దూరం పోక ముందే`

గుంపుగా అనేక మంది అశ్వ పురుష భటులు తన వైపు శర వేగంతో దూసుకు రావటం కన్పించింది. తన చేతిలో దెబ్బలు తిని పారి పోయిన వాడు వాళ్ళందరిని వెంట బెట్టుకొస్తూ ఏదో అరిచి చెప్తున్నాడు. అరుపులు కేకలతో మహా అట్టహాసంగా వచ్చి

పడుతున్నారు వాళ్ళంతా.

వాళ్ళని చూడ గానే ధనుంజయుని కోపం మిన్ను ముట్టింది. ఆవేశంతో కండరాలు బిగుసుకున్నాయి. ఆగ్రహంతో వూగి పోయాడు. తనకు సాయం చేయక పోగా వాళ్ళు తననొక అపరాధిని చేసి దండెత్తి రావటం పుండు మీద కారం చల్లినట్టుంది. యాభైకి పైగా వున్నారు వాళ్ళు. వాళ్ళను తీక్షణంగా చూస్తూ కొరడాను నడుంకి చుట్టుకున్నాడు. ''రండిరా మూర్ఖ శిఖామణులారా. మీ అంతు చూచెద గాక'' అనరుస్తూ బరిసెను గిరగిరా తిప్పుతూ నిర్భయంగా వాళ్ళకి ఎదురు పరుగెత్తాడు.

వచ్చి రావటమే ఆ విచిత్రమైన అశ్వపురుషులు ధనుంజయుని పడ గొట్టాలని బరిసెలు విసరనారంభించారు. వాటిని గాల్లోనే తిప్పి కొడుతూ వీరావేశంతో అశ్వాల మధ్యకు దూసుకు పోయాడు. వాళ్ళ ఆయుధాలకు చిక్కకుండా గిరికీలు కొడుతూ దొరికిన అశ్వ పురుషుని దొరికినట్టు బరిసె తిప్పి కాళ్ళ మీద మోదసాగాడు. కాళ్ళు విరిగినంత బాధతో వెర్రి కేకలు వేస్తూ విరుచుకు పడుతున్నారు వాళ్ళు. కొందరిని బరిసెతో గాయపరుస్తున్నాడు. భయంకర పోరాటం. అరుపు కేకలు ఆర్తనాదాలతో ఆ ప్రాంతం హోరెత్త సాగింది. ఇసుకతో కూడిన ధూళి గాల్లోకి సుడి గాలిలా లేస్తోంది. చూస్తూండగానే పది మంది అశ్వ పురుషుల్ని కూల్చాడు ధనుంజయుడు. అంత ఆర్భాటంగా వచ్చి చుట్టు ముట్టినా ధనుంజయుని వేగాన్ని ఆపటం వాళ్ళ వల్ల కాలేదు.

ఆ పోరు అలాగే కొన సాగితే ఏమి జరిగేదో గాని ఇంతలో ఒక అశ్వం మీద ఆజాను బాహుడైన వ్యక్తి ఒకడు శర వేగంతో దూసుకొచ్చాడు. అతడి వెనకే పాతిక అశ్వాల మీద కృపాణాలు ధరించిన రాక్షస వీరులున్నారు. వారిలో చాలా మందికి నెత్తిన ఒకటి లేదా రెండు కొమ్ములున్నాయి. మెడలో పూసల దండలు, వికార రూపాలు, నల్లటి దుస్తులు ధరించి వున్నారు. వారికి నాయకుడిలా వున్న వ్యక్తి వస్తూనే తన అశ్వాన్ని నిలువరిస్తూ` ''ఆపండి. పోరు ఆపండి'' అని తమ భాషలో అరిచాడు.

అతడి హెచ్చరిక వింటూనే అశ్వ పురుషులైన వీరులు వెనక్కి తగ్గారు. వాళ్ళందరి మధ్య ఒంటరిగా నిలబడి దెబ్బ తిన్న బెబ్బులిలా చూస్తున్నాడు ధనుంజయుడు. అతడి శరీరం మీద గాయాలు తొలుస్తున్నాయి. ఈ అశ్వ పురుషులెవరో తెలీదు. వచ్చిన వాళ్ళెవరో తెలీదు. కాని వాళ్ళంతా రాక్షస జాతికి చెందిన వాళ్ళని మాత్రం గ్రహించాడు.

ఇప్పుడూ అదే సమస్య`

భాషా సమస్య.

బరిసె నేలకు ఆన్చి అవసరమైతే మరో సారి పోరుకు సిద్ధంగా వున్నాడు ధనుంజయుడు. అశ్వం మీద వచ్చిన అధికారి ఏదో అడుగుతున్నాడు. ధనుంజయునికి అర్థం గావటం లేదు. ధనుంజయుని భాష వాళ్ళకి అర్థం గావటం లేదు. ముఖ ముఖాలు చూసుకుంటున్నారు. ముందీ భాషా సమస్య పరిష్కారం గాకుంటే వీళ్ళు తనను దోషి గానే చూస్తారు. ఏం చేయాలి?

ఒకింత తీవ్రంగా ఆలోచించిన ధనుంజయుడు ప్రాచీన ప్రాకృత భాషలో` ‘‘మీరంతా ఎవరు? ఇది ఏ ప్రాంతము? ఏ లోకము?’’ అనడిగాడు.

విచిత్రంగా ఆ భాష వాళ్ళకి అర్థమైంది.

అశ్వం మీది అధికారి సంభ్రమాశ్చర్యాలతో చూసాడు.

‘‘ఇది ఏ ప్రాంతమో తెలికనే మా లోకములోనికి చొర బడితివా?’’ అని ప్రాకృత భాషలో ప్రశ్నించాడు. ఈ విధంగా భాషా సమస్య తొలగినందుకు ధనుంజయుడు ఆనందించాడు.

‘‘క్షమించాలి. నేను చొరబాటు దారుడ్ని కాను. నాకు శత్రువైన నాగ లోక వాసి ఒకడు మోస పూరితమున నను గొనివచ్చి ఒక బిల మార్గన పడ వేసినాడు. ఆ మార్గము నన్నిటకు చేర్చినది. నేను కావాలని మీ భూమి మీద కాలు మోప లేదు. క్షుద్బాధ దాహార్తి నను నిలువ నీయుట లేదు. నను అతిధిగా భావించి ఆదరించటానికి మారుగా చొరబాటు దారునిగా నింద వేయుట తగదు’’ అన్నాడు ధనుంజయుడు.

‘‘కాని నీవు మా గస్తీ దళ సభ్యులిరువురిని గాయ పరిచినావు. ఇచట ఇంత మందిని కొట్టినావు. సాయం అడిగే పద్ధతి ఇదియేనా?’’ గంభీరంగా ప్రశ్నించాడతడు.

‘‘లేదు. మీ వాళ్ళు మీకు తప్పుడు సమాచారమిచ్చినారు. దాహార్తికి నీరు అడిగితే కొరడాతో హింసించారు. ఆత్మ రక్షణ కోసం పోరాడుట నేరము కాదని మీకు తెలియదా?’’ అనడిగాడు ధనుంజయుడు.

‘‘నీ నామ ధేయమేమి?’’ ఒకింత ఆలోచించి అడిగాడతడు.

“నను ధనుంజయుడందురు” బదులిచ్చాడు. కాని అంతకు మించి వివరాలేమీ చెప్పలేదు.

“ఏ లోకము నీది?” మరో ప్రశ్న.

“భూలోకము.”

“ఓ... నరుడవా?”

“అవును. మానవుడను. మానధనుడను. స్నేహానికి ప్రాణమిచ్చుట, శత్రువయితే అంతు చూచుట మా వీర లక్షణము.”

“భళా! మానవుల్లో ఇంత సాహసాన్ని సమీపకాలమున జూచి ఎరుగను. ఓ అపరిచితుడా! ఇది పాతాళ లోకము. మా యొక్క ప్రభువు మహా దాత, ధర్మ గుణ సంపన్నుడు, ఆడిన మాట తప్పని వారగు బలి చక్రవర్తు వారు. నీవు దుస్సాహసమున మా భటులను ఎదిరించి ప్రయోజనము లేదు. అనధికారికముగా ఎవరు మా లోకమున ప్రవేశించినను చోరబాటు దారుని గాను మాకు శత్రువు గానే పరిగణించి నిర్బంధించ వలసి వున్నది. అది రాజ శాసనము. కావున ఆయుధము వదిలి నీవు లొంగి పోవుట మంచిది. నీవు చెప్ప దలచుకున్నది రాజ సభలో చెప్పుకున్న తగిన సాయము లభించ గలదు.” అంటూ సూచించాడా సైనికాధికారి. కొన్ని లిప్తలకాలం ఆలోచించాడు ధనుంజయుడు.

అతడు చెప్పినదీ సమంజసం గానే వుంది.

లొంగి పోతే తనను బలి చక్రవర్తి ముందు ప్రవేశ పెడతారు. చెప్ప దలచినది ఆయన తోనే చెప్పుకొని తగిన సాయం పొంద వచ్చును. ఈ విధంగా ఆలోచించిన ధనుంజయుడు బరిసె పారేసాడు.

అది ఎంత పొరబాటో`

ఆ మరు క్షణమే తెలిసి వచ్చింది.

బిల బిలా అశ్వాలు దిగిన రాక్షస భటులు ధనుంజయుని చుట్టు ముట్టి కాళ్ళకు చేతులకు సంకెళ్ళు బిగించేసారు. చేతుల నుంచి పొడవుగా మిగిలిన రెండు గొలుసు చివర్లను నలుగురు భటులు పట్టుకున్నారు. కన్ను మూసి తెరిచే లోన బంధితుడై పోయాడు ధనుంజయుడు. కొందరు రాక్షస భటులు ధనుంజయుని శరీరాన్ని వాసన చూస్తూ` ''ఆహా... వాసన... నర వాసన... కమ్మటి నర వాసన. ఇతడు నరుడే'' అంటూ గుస గుసలు పోసాగారు. ఆగ్రహావేశంతో వాళ్ళందర్నీ విదిల్చి కొట్టాడు ధనుంజయుడు.

''ఏమిటీ మోసము? ఏమిటీ దారుణము? నేనుగా మీ వెంట వచ్చు వాడినే... నాకీ సంకెళ్ళు అవసరమా? మీ లోకము నుండి పారి పోగలనా?'' అశ్వం మీది అధికారిని గద్దించాడు.

''పారి పోలేవు ధనుంజయా. కాని మేము అపరాధులను, నేరస్తులను రాజ సభకు గొని పోవు విధము ఇదే. ఇది రాజ శాసనము. ఆచారము'' అన్నాడతడు.

''ఆచారము కాదు, అవమానము. ఘోర పరాభవము. సహింప రాని అనైతిక చర్య. నేను అపరాధిని కానని అరిచి చెప్పినను మీ మట్టి బుర్రకు అవగతము కాదా? ఈ అవమానమును సహింపజాల'' అంటూ తనను నడవ మని గొలుసు లాగుతున్న రాక్షసుల్ని ఉరిమి చూసాడు. ఆ గొలుసుల్ని ఒడిసి పట్టి తన వైపు బలంగా గుంజాడు. అంతే`

వాటిని పట్టుకున్న నలుగురూ పిల్లి మొగ్గలు వేస్తూ వచ్చి ధనుంజయుని కాళ్ళ దగ్గర పడ్డారు. పడ్డ వాళ్ళని పాదాలతో దారుణంగా మర్ధిస్తూ గొలుసుల్ని కొంత మేర చేతులకు చుట్టుకున్నాడు. మిగిలిన కొసలతో వీర భద్రుడిలా చెల రేగి దొరికిన వాడ్ని దొరికినట్టు గొలుసులతో మొదనారంభించాడు. గొలుసు శబ్దాలు రాక్షసుల కేకలతో మరొక మారు మారు మ్రోగిందా ప్రాంతం. తలకాయలు పగిలిన వాళ్ళు కొందరు, కాలు చేతులు విరిగిన వాళ్ళు కొందరు కొద్ది సేపు యుద్ధ రంగంగా మారి పోయిందా ప్రాంతం. అదే వూపులో వాళ్ళ నాయకుడి అశ్వాన్ని గొలుసులతో బలంగా మోదగానే అది పెద్దగా సకిలించి నాయకుని కింద పడేసి ఎటో పారి పోయింది. పరిస్థితి విషమిస్తోందని గ్రహించిన నాయకుడు క్రింద పడి లేస్తూనే దుమ్ము దులుపుకొంటూ`

''ఆగుము ధనుంజయా ఆగుము. ఆవేశం తగ్గించుము.'' అనరిచాడు.

''ఇంత అవమానము జరిగిన పిమ్మట ఇంకనూ అవేశము తగ్గించుటా! పద. ఈ వ్యవహారమును రాజ సభలోనే తేల్చుకొందును.

అదియు ఈ బంధనాలను తొలగిస్తేనే" అనరిచాడు ధనుంజయుడు.

"లేదు లేదు. రాజ శాసనాన్ని మేము ధిక్కరించ లేము. కావాలంటే నిన్నెవరూ గొలుసులు పట్టి నడిపించరు. గొలుసులతో అలాగే మా వెంట వస్తే చాలు." అంటూ సంధికి సిద్ధమయ్యాడు నాయకుడు.

"సరి. అటులనే వత్తును. నీవు నా ముందు నడువ వలె. మీలో ఎవరును అశ్వము నధిరోహించి నా వెంట రాకూడదు. కాలి నడకన నా వెనక రావలె" అంటూ షరతు విధించాడు ధనుంజయుడు.

గొలుసు దెబ్బలు తినే కన్నా `

అతడి షరతునంగీకరించుటే మంచిదనిపించింది నాయకుడికి. అతడి ఆజ్ఞతో అంతా అశ్వాలు దిగి పోగా కొందరు వాటిని తమ వెంట తీసుకు పోయారు. ముందు నాయకుడు నడుస్తుంటే అతడి వెనకే సంకెళ్ళతో భారంగా నడుస్తూ ధనుంజయుడు అనుసరించాడు. వాళ్ళకి ఎడంగా వెనక రాక్షస భటులు ఆయుధాలు వూపుకుంటూ ధనుంజయుని వెంట నడక సాగించారు.

ఆ విధంగా రాక్షస భటుల వెంట బయలు దేరిన ధనుంజయుడు చాలా దూరం నడుస్తూనే వున్నాడు. గాయాల బాధ, ఆకలి బాధ, దాహార్తికి తిరిగి నాలుక పిడచ కట్టుకు పోతోంది. ఇసుక భూమిలో నడక వేగంగా సాగటం లేదు. ఆ పైన సంకెళ్ళ బరువు. దారిలో నాయకుడ్ని అడగగా అతడు జాలి పడి మంచి నీరు తాగటానికిచ్చాడు. క్రమంగా నగరం దగ్గర పడుతోంది.

అక్కడ దీపాలంటూ విడిగా ఏమీ లేవు.

మణి మయ రత్న కాంతులతో నగర సౌధాలన్నీ ధగధగాయమానంగా మెరిసి పోతున్నాయి. అప్పటికే చోరబాటు దారునిగా ధనుంజయుని గురించి నగరంలో తెలిసి పోయినట్టుంది. వీధు ల్లోను, సౌధాల మీద నగర ప్రజలు చేరి ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. క్రమంగా ధనుంజయుడు నగర ప్రధాన వీధిలో ప్రవేశించాడు. అతన్ని వాళ్ళంతా చోద్యం చూస్తున్నారు. ధనుంజయుడు కూడ అచటి పౌరుల్ని ఆసక్తిగా గమనిస్తున్నాడు.

వారిలో కొందరు స్త్రీ, పురుషులు చక్కగా మనుషుల్లాగే వున్నారు. కొందరు మాత్రం వికార రూపాలు, అస్తవ్యస్తంగా దుస్తులు,

తల మీద ఒకటి లేదా రెండు కొమ్ములు కలిగి కోర పళ్ళతో మెడలో చిత్ర విచిత్రమైన హారాలతో వికృతంగా వున్నారు. స్త్రీపురుష బేధం లేకుండా కొమ్ములు మొలిచి వున్నాయి. వీధుల్లో ఆడుకొంటున్న బాలబాలికల్లోనూ కొందరు అందం గానూ కొందరు తలమీద కొమ్ముతో వికృతం గానూ కన్పిస్తున్నారు. వాళ్ళందరూ రాక్షస జాతేనా లేక ఇతర జాతులు కూడ వీళ్ళతో కల గలిసి వున్నారాని ధనుంజయునికి బోధ పడ లేదు.

సౌధాల ఉప్పరిగె మీద గవాక్షాల చెంత, అరుగు మీద గుంపులు గుంపులుగా చేరి ధనుంజయుని విభ్రాంతి చెంది చూస్తున్నారంతా. అసలు వీళ్ళంతా ఈ చీకటి రాజ్యంలో ఏం తిని బ్రతుకుతారో, పంటలు పండిస్తున్నారో లేదో. ఇక్కడి జీవన విధానం ఏమిటో ధనుంజయునికి అంతు చిక్కటం లేదు. వీధుల్లో అక్కడక్కడా అశ్వారూఢులైన సైనికులు, అశ్వ పురుషులు, కొన్ని శునకాలు దర్శనమిస్తున్నాయి. అంతకు మించి మరో ప్రాణి జాడ లేదు. చూద్దామన్నా పశువుల జాడ లేదు. కాని సుసంపన్న లోకం. ఎటు చూసినా వెల కట్ట లేని రత్న మాణిక్యాలు, వజ్రాలు కాంతులు విర జిమ్ముతూ కన్పిస్తున్నాయి.

అవన్నీ చూసుకొంటూ కొన్ని వీధులు దాటాక నగర నడి బొడ్డున వున్న కోట సింహ ద్వారం దాటి లోన ప్రవేశించాడు. ధనుంజయుని ఆ అధికారి, భటులు కోట లోకి నడిపించారు. అనేక కక్ష్యలు నడవాలు దాటి ముందుకు తీసుకు పోతున్నారు. ఎటు చూసినా కోటలో పసిడి తాపడాలు, వజ్ర వైఢూర్యాలతో కూడిన అద్భుత దృశ్యాలే కన్పిస్తున్నాయి. వాటి కాంతులే దారి చూపిస్తున్నాయి. గొలుసుల చప్పుడు చేస్తుండగా భారంగా అడుగులు సారిస్తున్న ధనుంజయుడు ఉన్నట్టుండి ఉలికి పడ్డాడు.

ఎవరో తనను గమనిస్తున్నారు.


చాలా నిశితంగా పరిశీలిస్తున్నారు.

ఆత్ర పడి చూస్తున్నారు.

ఆ విషయం తనకు స్పష్టంగా తెలుస్తోంది.

ఎవరది?

చుట్టూ చూసాడు.




''వలదు ఆచార్యా. అసలు శిక్షే కూడదన్నది నా వాదన. మీరు జాలి పడి తగ్గించు శిక్ష నాకు అక్కర లేదు. స్త్రీ యందు వివాహ మందు ధన మాన ప్రాణ విత్త హాని యందు బొంక వచ్చు అది తప్పు గాదన్నది శుక్ర నీతి గదా. తమరు చెప్పినదే. కాని ఏ స్థితి యందును నేను సత్యమునే పలికితి. అనృతములాడలేదు. సత్య వాక్కునకు మీ పాతాళ లోకమున మరణ దండనే శిక్ష అనునేని అదియే విధింప వచ్చును. ప్రాణము కొరకు ప్రాధేయ పడు అల్పుడు కాడీ ధనుంజయుడు'' అన్నాడు.

ధనుంజయుని మాటలు మరొక్క మారు సభికులను ఉలికి పడేలా చేసాయి. సభలో గుస గుసలు ఆరంభమయ్యాయి. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటో ఎవరికీ అంతు చిక్కటం లేదు. చట్టమా, ధనుంజయుడా... రెంటిలో ఏది న్యాయమో ఎవరూ నిర్ధారించుకోలేక పోతున్నారు. ఈలోపల`

కొంత సమయం శుక్రా చార్యులు బలి చక్రవర్తితో తగ్గు స్వరమున మంతనాలు సాగించారు. చివరికి ఒక నిర్ణయానికొస్తూ బలి చక్రవర్తి గుబురు మీసంత దువ్వి ధనుంజయుని వంక చూసాడు.

“ధనుంజయ నామ ధేయా... నీకు శిక్ష లేకుండా ఒక మధ్యే మార్గమును సూచించెద. ఎత్తెరంగున నీవు మా పాతాళమునకు వచ్చితివో అదే విధముగ తిరిగి భూ లోకమునకు మరలి పొమ్ము. ఈ అవకాశమునుపయోగించు కొనినచో నీకు దోషిగా ఎలాంటి శిక్షా విధింప బడదు.” అన్నాడు.

ఆ మాటకు నవ్వాడు ధనుంజయుడు.

అతడి సంకెళ్ళు కణకణా ధ్వనించాయి.

“బాగున్నది మహా బలి. ఏమంటివి? ఎటుల వచ్చితినో అటులనే మరలి పోవలెనా! ఎటు? మరలి పోవు మార్గము తెలిసిన అప్పుడే మరలి పోయేడి వాడిని గదా. మీ భటుల కంట బడు వాడనా. అది తెలియకనే గదా మీ ముందు సంకెళ్ళతో బంధీగా నిలిచితి. మీరు మార్గము చూపండి. నేనటులనే వెడలి పోయెద” అన్నాడు.

“అసంభవం.” అన్నాడు బలి.

“మార్గము మేము చూపిన తిరిగి తిరిగి వచ్చి పోవుటకా? మార్గము అడిగి అతి తెలివి చూపకుము. ఎటుల మరలి పోవుటయో అది నీ సమస్య” అంటూ భటుల వైపు చూసి`

“ఇతడిని విడిది గృహమునకు గొనిపోయి సంకెళ్ళు తొలగించండి. భోజనాది వసతులు కల్పించండి. ఎనిమిది జాముల పర్యంతం అవకాశం ఇవ్వండి. ఈ సమయమును ఉపయోగించు కొని ఇతడు తన లోకమునకు పోవలె. అటుల పోకున్న తొమ్మిదవ జామున తిరిగి సంకెళ్ళతో బంధించి మన కారాగారమున చెర వాసమున ఉంచ వలె” అంటూ ఆజ్ఞాపించాడు.

“ఇది అసంభవము... శిక్ష అన్యాయము” అనరిచాడు ధనుంజయుడు.

“ఇది మాకు న్యాయ సమ్మతమే మానవా. ఈ అవకాశమును నీవు సద్వినియోగ పరుచుకో వలె. లేని పక్షమున నీకు ఇచట

కారాగార వాసము తప్పదు. ఆమరణ పర్యంతము... ఆం’’ అంటూ హుంకరించాడు బలి చక్రవర్తి. వెంటనే సభ చాలిస్తున్నట్టు ప్రకటించి లేచి గదా యుధాన్ని భుజాన వేసుకొని సింహాసనం వెనుక పరదా వెనక్కు వెళ్ళి పోయాడు.ఇంత జరిగినా`

శుక్ర చార్యుల పెదవుల మీద దరహాసమెందుకో, తననే ఆ మహనీయుడు ఎందుకు చూస్తున్నాడో ధనుంజయునికి అర్థం కాలేదు. తల ఎత్తి పై నడవా పరదా వెనక్కు చూసాడు. ఆమె పరదా వెనక నీడలా అలాగే నిల బడుంది. మాట మాటకీ కన్నీరు తుడుచుకుంటోంది. తన గురించి కన్నీరు కార్చటమా. ఎవరా లతాంగి? ఆమె వివరాలు తనకు ఎవరు చెప్తారు?

ధనుంజయుని ఆలోచనలు ఓ కొలిక్కి రాక ముందే రాక్షస భటులు అతడిని సంకెళ్ళతో సభా మందిరం నుండి బయటకు నడిపించారు.

***************************************

విడిది గృహము.

అది అంతఃపుర ఉద్యానవన సమీపమున గల ఒక సుందర మందిరము. అచట గవాక్షము నుండి వీక్షించిన, అద్భుత మగు ఉద్యాన వనము కనుల పండువుగా దర్శనమిస్తుంది. వనాంతర్భాగమున అందముగ తీర్చి దిద్ద బడిన అనేక పొదలు లతలు, తీగలు, వృక్షములు చిరు చీకట్లలో కూడ కాన వస్తున్నాయి.

ఉద్యాన వనమంతటా అచటచట పొదగ బడిన రత్న కాంతుల వెలుగు జిలుగులతో బాటు అచటి వృక్షములే కొన్ని స్వయం ప్రకాశముగా శోభిల్లుచున్నవి. చిత్ర విచిత్రములగు పుష్ప జాతులు, ఫల వృక్షములు, సూర్య కాంతి లేకయే అవి బ్రతుకుట, పుష్పించుట, ఫలించి ఫలము నొసంగుట అది అంతు చిక్కని విషయమే. ఉద్యాన వన సుమ సౌరభాలతో ఆ ప్రాంతమంతా గుబాళిస్తోంది.

అంతే కాదు`

విడిది గృహంలో ఉద్యాన వన అభి ముఖంగా కొంత మేర గోడ లేదు. అచట గృహ పై భాగాన ఎచటి నుండో స్వచ్ఛమైన జల ధార

గోడ లేని భాగం పొడవునా బయటకు అద్దంలా జాలు వారుతోంది. ఆ నీరు దిగువ నుండి ఉద్యాన వనం లోకి ప్రవహిస్తూ విడిది గృహాన్ని చల్లగా ఉంచుతోంది. ఉద్యాన వన కాంతులు ఆ జల ధార మీద ప్రతిఫలించి వింత అనుభూతిని కలిగిస్తున్నాయి.

ధనుంజయుని అచటికి నడిపించుకొచ్చిన రాక్షస భటులు అతడి సంకెళ్ళు తొలగించారు. జల ధార సమీపంలో ఒక పట్టు పరుపులు రెండు తల దిండ్లు వేసారు. పక్కనే ఒక పీట మీద బంగారు పళ్ళెరంలో ఆహార పదార్థములుంచి మూత పెట్ట బడింది. ఒక కూజా నిండుగా మంచి నీరు, తాగడానికి లోటా ఉంచ బడ్డాయి. మరో కుజాలో మధిర ఉంచ బడింది. ఏర్పాట్లు పూర్తి చేయగానే ధనుంజయుని స్వేచ్ఛగా వదిలి మందిరం బయటకు పోయి కాపలా కూచున్నారు.

బంధనాలు తొలగినప్పటికీ`

ధనుంజయుని మనసు వికలమై`

అస్తవ్యస్తంగా వుంది.

కిం కర్తవ్యం?

తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఇప్పుడు తను ఏం చేయాలి?

తనకు ఎనిమిది జాముల గడువు యివ్వ బడింది. అంటే రాత్రి నాలుగు జాములు పగలు నాలుగు జాములు కలిపి ఒక రోజు సమయమది. ఈ సమయమును ఉపయోగించుకొని తను భూ లోకమునకు మరలి పోవలెనా? ఎటుల? ఏది మార్గము? ఎలా పోగలడు?

గోడనానుకొని నిలబడి జల ధారను చూస్తూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఎంత ఆలోచించినా తనకు మార్గము కన్పించటం లేదు. ఎవరో ఒకరు తనకు సాయం చేయాలి. ఎవరు చేస్తారు? అలాంటి వారున్నారా..? గుండె లోతుల్లో ఎక్కడి నుంచో వున్నారని

సమాధానం వస్తోంది. ఉంటే ఎవరది...? గుర్తుకు రావటం లేదు.

అదే సమయంలో`

తన ప్రాణ సఖియు భద్రా దేవి, ఉలూచీశ్వరిలు గుర్తుకొచ్చి మనసు వేదన పడుతోంది. కళ్ళలో నీరు సుడి తిరుగుతోంది. ఆలయంలో తనను గానక, ఏమి జరిగిందో తెలియక ఆ అబల లిరువురూ ఎంతగా తల్లడిల్లుతున్నారో గదా. తను వచ్చు వరకు ఆయం వద్దే ఎదురు చూస్తుంటారో లేక తనను గాలిస్తూ ముందుకు సాగి పోతారో తెలీదు.

భద్రా దేవి సాటి లేని వీర వనిత. ఆపైన ఆమె మంత్ర శక్తికి తిరుగు లేదు. గాబట్టి వక్ర దంతుడు ఉలూచీశ్వరిని నాగ లోకానికి అపహరించుకు పోతాడన్న భయం లేదు. కాని... ఏమో! ఆ నీచుడు భద్రా దేవిని మోస పుచ్చి ఉలూచీశ్వరిని అపహరించినాడేమో... తనను వాళ్ళకు దూరం చేయుటలో ఆ ధూర్తుడి ఉద్దేశం అదే గదా. ఉలూచీశ్వరిని తీసుకెళ్ళి నాగ రాజు ఆశీస్సులతో వివాహం చేసుకోవాలన్నది వాడి దురాశ.

ఈ విధంగా ఆలోచనలు సాగుతూండగానే`

చట్టున ధనుంజయుని కళ్ల ముందు మెదిలాడో యక్షుడు. శాప వశంగా అగ్ని సర్పంగా మారి నాగ లోకంలో దాస్యుడిగా వున్న అతడికి తన మూలంగా శాప వియోచన కలిగింది. ఆ సందర్భంగా యక్షుడు తనకు మిత్రుడైనాడు. ఎప్పుడు అవసరమైనా తనను తలచుకొని తన పేరును బిగ్గరగా పిలిస్తే చాలు తక్షణం వచ్చి సాయ పడదునని ఆనాడు మాటిచ్చాడు. కాని... కాని... అతని పేరు... అదో విచిత్రమైన పేరు. ఎంత ఆలోచించినా యక్షుని పేరు గుర్తుకు రావటం లేదు. ఈ ఎనిమిది జాము సమయంలో గుర్తుకు రాకుండా ఉంటుందా? చూద్దాం అనుకున్నాడు. అంత లోనే అతడి ఆలోచనలు తను పాతాళ లోక కోటలో ప్రవేశించినప్పట్నుంచి తనను వెంటాడుతున్న అజ్ఞాత సుందరి వైపు మళ్ళాయి.

ఆమె తన కోసం చాలా ఆత్ర పడింది. అక్కర చూపింది. దుఖించింది. ఆ విషయం తను గ్రహించాడు. కాని ఎవరా సుందరి? ఆమెకు తనకు ఏమి సంబంధం? ఆమె ఎవరో తెలుసు కోవాలని మనసు తొందరిస్తున్నా ఎవరినడిగి తెలుసుకోగలడు. కనీసం ఆమె నామ ధేయం కూడ తనకు తెలీదు. తను పాతాళ లోకం విడిచి వెళ్ళే వరకు ఆమె తనకు ఓ ప్రశ్నగానే మిగిలి పోతుందేమో.

ధనుంజయుని మనసుకి బాధగా వుంది.

ఆ బాధలో భోజనం చేయాలనిపించటం లేదు. అసలు ఆ పళ్ళెరంలో ఏ విధమైన భోజ్య పదార్థాలున్నాయో కూడ చూడ లేదు. మనసున వ్యధ, శరీర గాయాల బాధ అతడ్ని ఎక్కువ సేపు నిలువనీయటం లేదు. ఇంత వరకు దివ్య నాగ మణిని సంపాదించ లేక పోయానే అనే వేదన మరో పక్క బాధిస్తోంది. వచ్చి పరుపు మీద కూచున్నాడు. ఆకలి వేస్తున్నా భోజనం మీదికి మనసు పోలేదు. కొద్దిగా మంచి నీరు తాగాడు. పిమ్మట రెండు లోటాల మధిర సేవించాడు.

నర నరాన మధిర మత్తు ఆవహించగానే ఇక సకల బాధలు, వ్యధలు అన్నీ మర్చి పోయి పరుపు మీద వెల్లికిలా పడుకుని గాఢ నిద్ర లోకి జారుకున్నాడు. తర్వాత ఏం జరిగిందో అతడికి తెలీదు.

ధనుంజయుడు నిద్రా వశుడైన అర్ధ జాము తర్వాత, పద మంజీరాలు ఘల్లు ఘల్లున సద్దు చేస్తుండగా, కర కంకణాలు మృదు శబ్దాలు ఆలపించగా సకలా భరణ భూషితమై మేలి ముసుగు వేసుకుని, మెరుపు తీగ లాంటి లతాంగి ఒకామె చేతిలో బంగారు పళ్ళెరంతో అంతఃపుర దిశ నుండి విడిది గృహ ప్రవేశ ద్వారం వైపు వచ్చింది.

అప్సర భామను ధిక్కరించు అతి లోక సౌందర్య వతి, కుసుమ కోమలి. ఆమె రాకను గమనించిన కావలి రాక్షసులు నలుగురూ అదిరి పడి లేచి నిలుచుని వంగి వంగి ప్రణామాలు చేసారు. ఆమె వారితో ఏదో చెప్పింది. నలుగురూ భయ భక్తులతో తల వూపి అక్కడి నుండి దూరంగా వెళ్ళి పోయారు.,

ఆ సుందరాంగి సరా సరి`

విడిది గృహంలో ప్రవేశించింది.

నేరుగా ఆమె ధనుంజయుని వద్దకొచ్చింది. ఎదురుగా నిలబడి కొన్ని లిప్తల పాటు కనులార అతడినే చూస్తూ నిలబడింది. గాయాలతో డస్సి పోయి అలసటతో గాఢ నిద్రా వశుడైన ధనుంజయుని చూస్తుంటే ఆమె కనులు జల పాతాలే అయ్యాయి. అతడు భోం చేయ లేదని గ్రహించింది.

మేలి ముసుగు తొలగించింది.

పళ్ళెరాన్ని పక్కన వుంచింది.

ముందుగా వంగి అతడి పాదాలకు నమస్కరించింది. పిమ్మట వచ్చి పరుపు మీద ధనుంజయుని పక్కనే ఆసీనురాలయింది. తను తెచ్చిన పళ్ళెరం మీది పట్టు వస్త్రాన్ని తొలగించింది. అందులో ఘుమ ఘుమ లాడే వంటకాలతో కూడిన అద్భుత భోజ్య పదార్థాలున్నాయి. వాటి పక్కనే చిన్న పసిడి గిన్నెలో వెన్నె పూస లాంటి తెల్లని మెత్తని పదార్థం వుంది. ఆ గిన్నెను అందుకుందా సుందరి. దాన్ని పక్కన ఉంచింది. పట్టు వస్త్రాన్ని కూజా లోని నీటితో తడిపి పిండి ఆ వస్త్రంతో ముందుగా ధనుంజయుని వంటి మీది రక్తపు మరకల్ని గాయాల్ని చక్కగా తుడిచింది.




ధనుంజయుని ఛాతీ మీద అంగీని విప్పి పక్కకు తొలగించింది. పిమ్మట పసిడి గిన్నెలోని తెల్లటి పదార్థాన్ని అతడి గాయాలకు పూయటం ఆరంభించింది. అది ఏ దివ్య ఔషధమో గాని పూసిన వెంటనే గాయం మటు మాయమై పోతోంది. ఆమె పక్కన కూచుని అంతగా సేవలు చేస్తున్నా ధనుంజయునికి వెంటనే మెలకువ రాలేదు. ఆమె వెచ్చని కన్నీరు నాలుగు చుక్కలు ఛాతీ మీద స్వాతి చినుకుల్లా రాలగానే దిగ్గున మెలకువ వచ్చింది.

ఏం జరుగుతోందీ అర్థం కాలేదు.

చిన్నగా కళ్ళు తెరిచి చూసాడు.

ఆశ్చర్యంతో అతడి కళ్ళు విశాలమయ్యాయి.

సోయగాల హరివిల్లులా వున్న లేబ్రాయపు సౌందర్య రాశి తన పక్కన కూచుని సేవలు చేస్తోంది. కన్నీరు విడుస్తోంది. అప్పటికే తన వంటి మీది గాయాలన్నీ మటు మాయమై శరీరానికి కొత్త శక్తి ఏర్పడినట్టుంది. మధిర తాగిన మత్తులో తను చూస్తున్నది స్వప్నమో, భ్రాంతియో అర్థం గాక ఆమె ముఖారవిందాన్ని అలాగే చూస్తుండి పోయాడు.

అందంలో తన ప్రియ భామలు భద్రా దేవి, ఉలూచీశ్వరిలతో పోటీ పడే అద్భుత సౌందర్య రాశి. ఇరువది వత్సరాల లేబ్రాయపు చిగురు బోణి. తాకితే కందిపోతుందనిపించే మేలిమి బంగారు దేహ ఛాయ, శంఖం లాంటి పొడవగు మెడ భాగం, ఆ కర్ణాయత నేత్రాలు, తామర తూండ్ల వంటి చేతులు, వుందా లేదా అన్పించే సన్నటి నడుము, పగడాలను పొడుము చేసి అద్దినట్టున్న పెదవులు, యవ్వనాన్ని ప్రతిఫలించే బుగ్గలు, సకలాభరణ శోభిత యగు ఆమెను చూస్తుంటే ఖచ్చితంగా ఆమె ఒక యువ రాణి అయి వుండాలని తోచింది ధనుంజయునికి. అంతే కాదు, కోటలో అడుగిడినప్పటి నుండి తనను వెంటాడిన అజ్ఞాత సుందరి కూడ ఆమేనని గ్రహించాడు. ఆమె ముఖారవిందం ఎంత చూసినా తనివి తీరదనిపించింది. అంతే కాదు, ఈ సుందరాంగిని తను ఇంతకు మునుపెన్నడూ ఎక్కడా చూసిన గుర్తే లేదు. అలాంటి అపరిచిత యగు భామా మణి తన పట్ల ఇంత అక్కర ఆపేక్ష కన పర్చటం, ఎంతో కావలసిన యువతిలా యిలా నేరుగా తన పక్క కొచ్చి కూచుని సేవలు చేయటం ధనుంజయునికి వింత గానూ ఆశ్చర్యం గాను వుంది.

కొన్ని లిప్తల కాలం తర్వాత గాని`

ధనుంజయుడు కనులు తెరిచి తననే గమనిస్తున్న సంగతి ఆమె గమనించ లేదు. వెంటనే ఆమె పసిడి బుగ్గలు సిగ్గున కెంపులు పూచాయి. తత్తర పాటుతో దిగ్గున లేవ బోయింది. చట్టున ఆమె కరము అందుకుని కూచుండ జేసాడు.

‘‘వెడలి పోకుము సుందరీ... ఇప్పుడైనను నీ వివరములు తెలియకున్న జీవితాంతము నీవు నాకు అజ్ఞాత సుందరి గానే మిగిలి పోదువు’’ అన్నాడు.

మృదువు గా చేయి విడిపించుకుందామె.

“లేదు ప్రభూ. మీ పాద దాసిని, ఎలా వెళ్ళ గలను? మీ తోనే ఉంటాను.” అంది. వీణ మీటినట్టు మధురంగా వుంది ఆమె స్వరం.

ఆమె మాటలు ధనుంజయుని ఆశ్చర్యాన్ని మరో మెట్టు పైకి చేర్చాయి.

“పరదా మాటు నుండి అక్కరగా నను వీక్షించినది నీవే కదూ?” అడిగాడు.

అవునన్నట్టు తల వూపింది.

“ఎవరు నీవు? ఇచటందరూ నను దోషి అంటుంటే నీవు మాత్రము నను వేరుగా భావించుట వింతగా యున్నది. చూచుటకు యువ రాణి వలె ఉంటివి. పాద దాసినంటూ నను కించ పరచకు.”

“లేదు ప్రభూ. కించ పరుచుట లేదు. వాస్తవమే వచించితి. మీరు నాకు ముందే తెలియు. మీరు రత్నగిరి యువ రాజు ధనుంజయులని తెలియు. మీరే నా ప్రాణము... నా సర్వస్వముగ భావించితి” అంది.

ధనుంజయుడు ఉత్కంఠ భరితుడై పోయాడు. తను ఈ అంగనా మణికి తెలుసునా? ఎలా? ఆ పైన తన వివరములు కూడ చెబుతున్నదే. చూస్తుంటే తనను వరించినటు అర్థమగుచున్నది. ఏమిటీ మాయ?

“అయ్యో దేవీ. నీ పలుకులు అర్థము గాకున్నవి. ఎవరు నీవు? నీ నామ ధేయమేమి?” లేచి తల దిండ్లను అనుకొని కూచుంటూ అడిగాడు.

ఆమె బదులు యివ్వ లేదు.

మౌనంగా లేచి వెళ్ళి జల ధారలో చేతులు శుభ్ర పరుచు కొని వచ్చి ధనుంజయుని సరసనే కూచుంది. పళ్ళెరం అందుకుంది.

''మీరు ఏమియు భుజింప లేదు. ముందు భోజనము చేయండి. పిమ్మట మీ సందేహములన్నియు తీర్చ గలను'' అంది.

''నాకు ఆకలి లేదు. నీ గురించి తెలియాలె'' అన్నాడు పట్టుదలగా.

''ఆకలి ఎందుకు లేదు? ఉంది. తిన వలె'' అంది తనూ పట్టుదలగా.

''నా భోజనము పక్కన సిద్ధముగ వున్నది. చూడ నీవింకను భుజించి నటు లేదు. సుందరమగు నీ ముఖారవిందము ఒకింత వాడినది నీవు భుజింపుము.''

''అది బంధీలకు ఒసగు నాసి రకము భోజనము. మీరు తినలేరు. కాదనకండి'' అంటూ చనువుగా ముద్ద కలిపి తనే అతడి నోటికి అందించింది. వారించ లేక పోయాడు.

అది ఏ తృణ ధ్యాముతో చేసిన వంటకమో ఏమి దినుసులు కలిపి వండి వార్చినారో గాని జీవితంలో ఎన్నడూ తిని ఎరుంగని ఓ సరి కొత్త కమ్మటి రుచితో అద్భుతంగా వుంది. ఆశ్చర్యం ఏమంటే ధనుంజయుడికి తినిపిస్తున్న అదే చేత్తో తనూ భుజించింది. అతడి ఎంగిలిని ఆస్వాదించింది. ఆ విధంగా ఆరంభమే ఇరువరి మధ్య ఓ బంధం ఏర్పడి పోయింది.

''ఇప్పుడయినా నీ వివరాలు చెబుతావా?'' భోజనానంతరం అడిగాడు.

ఆమె అతడి చేయి అందుకుని గోముగా ముద్దాడింది.

''నేను బలి చక్రవర్తి దంపతుల దత్త పుత్రికను. యువ రాణి మణిమేఖలను'' అంది. అంతే`

అదిరి పడ్డాడు ధనుంజయుడు.

"ఏమంటివి? దత్త పుత్రికవా... యువ రాణివా!" అనడిగాడు ఉత్కంఠత భరించ లేక.

"అవును. అలాగని రాక్షస వంశం కాదు నాది. నేనూ మానవినే. వైశ్య కన్యను. ప్రతి సంవత్సరము మలబారు ప్రజలు మహా బలి ఆశీస్సులు కోరి ప్రార్థనలు చేయుట మీకు తెలిసియే వుంటుంది. ఆ దినమున బలి చక్రవర్తుల వారు అదృశ్య రూపమున భూలోక సంచారము జేసి ప్రజల కష్ట సుఖములు గమనించి వలసిన వారికి తగు సాయమొనర్చి వచ్చుట పరిపాటి.

ఓసారి అలా వెళ్ళినపుడు అటవీ మార్గాన తల్లి దండ్రుల శవము వద్ద సంవత్సరం నిండని పసి బిడ్డనైన నేను ఏడ్చుచున్నానట. ధనవంతులైన వైశ్య దంపతులు నా జననీ జనకులు తమ సిబ్బందితో ఆ మార్గమున నగరమునకు పయనించగా బంది పోటు దొంగలు మా సిబ్బందిని అడ్డు పడిన నా తల్లిదండ్రులను హతమార్చి దోపిడి చేసినారట. పసి బిడ్డనని జాలి పడి నను చంపక వదిలి పోయిరట. ఆ విషయం గ్రహించిన మహా బలి నను చూచి ముచ్చట పడి జాలి గొని తన వెంట పాతాళమునకు తెచ్చి మహా రాణికి ఇచ్చినారట. అప్పటి నుండి వారే నా తల్లిదండ్రులైనారు. నను దత్తత తీసుకుని సొంత బిడ్డ వలె అల్లారు ముద్దుగా పెంచి యువ రాణిని జేసి నారు. శుక్రా చార్యుల వారి శిష్యురాలినై సకల విద్యలు అభ్యసించితి. వారి దయ వలన దైవిక శక్తులును సిద్ధించినవి.

యుక్త వయస్కురాలినయిన నా కొరకు నా జనకుడు బలి చక్రవర్తు వారు తగిన వరుని కోసం లోకాన్నీ గాలిస్తున్నారు. నాకు ఎవరును నచ్చ లేదు. నేను శివ కేశవుల భక్తు రాలను. హరుని హరిని కూడ నిత్యము ఆరాధించుదానను. నా బాధ్యతను వారికే వదిలి సరియగు పతిని చూపమని వేడుకునే దాన్ని.

ఇలా ఉండగా ఓ రాత్రి స్వప్నమందు శతాధిక వృద్ధుడైన వేణు గాన ప్రియుడగు ఓ హరి భక్తుని దర్శించితి. చింతిల్లకు బాలిక. భూలోకమున రత్నగిరి రాజ్యానికి యువరాజు మహా వీరుడు ధనుంజయ నామధేయుడు నీకు పతి కాగల అన్ని అర్హతలు వున్న వాడు. త్వరలోనే మీ పాతాళ మరు భూమిపై కాలుమోప గలడు. అతండే నీకు తగిన వరుడు. అని జెప్పి అదృశ్యమైనాడు. పిమ్మట మరు భూమిలో గ్రుమ్మరుచున్న మిమ్ము స్వప్నమున దర్శించితి. అప్పటి నుండి మీ రాక కొరకు ఎదురు తెన్నులు చూసితి. ఇటుండ మా భటులు మిమ్ము నిందితుని జేసి సంకెళ్ళ బంధించి నడిపించుట జూచి ఆత్ర పడితి, దుఖించితి" అంటూ చెమర్చిన కనులు పైట చెంగుతో వత్తుకుంది మణి మేఖల.

ఆమె చెప్పిన స్వప్న వృత్తాంతము విని ధనుంజయుడు మరింత ఉత్కంఠ భరితుడై పోయాడు.

“నీ స్వప్నమందు సాక్షాత్కరించిన ఆ హరి భక్తుడు ఎటుండె? శతాధిక వృద్ధుడా... చేతిలో మురళి వున్నదా? నీల మేఘ శ్యాముడు, ఉత్సాహ వంతుడు గదూ. మెడలో పారిజాత సుమాలతో కూడిన తులసి మాల ధరించినాడు గదూ?” అడిగాడు.

ఈసారి మణి మేఖల అచ్చెరువొందింది.

“అవును ప్రభూ... ఆయనే... మీరు ఆయన్ని దర్శించినారా?” అంది విభ్రాంతురాలై.

“నీకు బాగా గురుతున్నాదా? ఆ స్వామి తన నామ ధేయము మాధవ స్వామియని, హరి భక్తుడనని వచించినాడా?”

“అవును. ఆయన మాధవ స్వామియట హరి భక్తుడననే చెప్పినాడు.”

ఆ మాటలు వినగానే ధనుంజయునికి ఒకటొకటిగా అర్థం గాసాగింది. ఆలయంలో దైవ సన్నిధి లోనే ఆ ధూర్తుడు వక్ర దంతుడు తనను అపహరిస్తున్నా ఆ శివయ్య గాని ఈ వేణు మాధవుడు గాని ఎందుకు మిన్నకున్నారో ఇప్పుడు తెలిసి వస్తోంది. తనను పతాళమునకు మణి మేఖల కోసం పంపించుటకే మిన్నకున్నారు. దీనికి వక్ర దంతుడు తనకో సాధనమైనాడు. విషయం తెలిగానే ఆశ్చర్య సంభ్రమాలతో ఉక్కిరి బిక్కిరవుతూ ` “అయ్యో... అయ్యో...” అంటూ నుదురు కొట్టుకున్నాడు ధనుంజయుడు.

“హే జగన్నాటక సూత్రధారి... ఏమిటయ్యా నీ లీల. నన్నిలా ఇరికించినావేమి? అష్ట భార్యల బహు కుటుంబీకుడవని నాకును ఇటు వరుస బెట్టి వధువులను ఎంపిక జేసి వేడుక చూస్తుంటివా. ఇది యేమి చోద్యము. ఉన్న కష్టములు నాకు చాలవా?” అంటూ అంగలార్చాడు. నీ మాటలు వినుచున్నానులే అన్నట్టు సుదూరంలో ఎచటి నుండో మోహన రాగంలో మధురంగా విన రాసాగింది వేణు గానం.

“ప్రభూ! ఏమైనది?” తత్తర పడుతూ అడిగింది మణి మేఖల.

‘‘ఇంకా ఏమి కావలె. స్వప్న మందు నీవు దర్శించిన స్వామి నిజముగా హరి భక్తుడు కాడు. సాక్షాత్తూ ఆ హరియే. మా ఇల వేలుపు, సదా నేను ఆరాధించు నా గురువు, దైవం, సఖుడు అతడే. ఆయనే సాక్షాత్తూ ఆ వేణు మాధవుడు. ఆ స్వామి సంకల్పం ఇప్పుడు గదా అర్థమైనది.’’ అన్నాడు. అంతే కాదు, శుక్రా చార్యుల వారి దరహాసమెందుకో, తననే నిశితంగా చూచుట ఎందుకో తెలిసి వచ్చినది. తన జాతకము ఆ పురాణాల పురుషునికి తెలియకుండునా!

మణి మేఖల ముగ్ధ రాలవుతూ`

మరింత దగ్గరగా జరిగింది.

అతడి ఛాతీ మీద వాలుతూ`

తన సోగ కనులలతో అతడిని చూసింది.

‘‘చెప్పండి ప్రభూ! ఆ స్వామియే మనల కలిపినాడు. ఇక మీరే నా సర్వస్వం, నా ప్రాణం. ఈ దీనురాలిని మీ పాద దాసిగా స్వీకరిస్తారా?’’ అంటూ ఆర్తిగా అడిగింది.

ఆ ముద్ధరాలికి ఏమి సమాధానం చెప్పాలో ధనుంజయునికి అర్థం కాలేదు. ఆలోచిస్తున్నాడు. అతడి మౌనం మణి మేఖలకు బాధ కలిగించింది. ‘‘చెప్పండి ప్రభూ! నేను మీకు సరి జోడి కాదని ఒక్క మాట చెప్పండి. ఇచటనే ప్రాయోపవేశం చేసి ప్రాణ త్యాగమొనర్చెద’’ అంది కన్నీళ్ళలో.

చట్టున ఆమెను బిగి కౌగిట బంధించి`

కన్నీరు తుడిచాడు.




"దేవీ! నీవు నన్ను అపార్థం చేసుకున్నావు. ఈ మౌనం నీవు నాకు నచ్చక గాదు. పాతాళ లోక యువ రాణివి, బలి చక్రవర్తి ప్రియ దత్త పుత్రికవు, కుసుమ కోమలివి, సాటి లేని సౌందర్య రాశివి. నీ ప్రేమకు పాత్రుడ నగుట నా అదృష్టమే. కాని...."

"ఊఁ...! అయితే అభ్యంతర మేమి ప్రభూ?"

"ఇప్పటికే నా హృదయ పీఠమున ఇరువురు బామలు అధివశించి వున్నారు. నీవు మూడవ స్థానమును కోరుచున్నావు...."

"దీని కింత చింతయే? సు క్షత్రియ రాకుమారుడు నలుగురు కన్యలను వివాహమాడ వచ్చునని శాస్త్రము చెబుతున్నది. మూడవ స్థానము నా కొసంగినను నాల్గవ స్థానము కాళీ గానే ఉన్నది గదా" అంటూ నవ్వింది.

"అయ్యో! నా సంకటము నీకు అర్థము గాకున్నది."

‘‘నాకు అర్థమైనది ప్రభూ. ఈ చెర వాసము తొలగి పాతాళము నుండి భూ లోకము చేరుట ఎటులని గదూ మీ చింత? నేను మీ చెంత నుండ ఆ చింత మీకేల. మీరు సమ్మతించిన చాలును. ఈ క్షణమే మిమ్ము భూ లోకమునకు గొని పోగలను. ఇక మీరే నా ప్రాణము మీతో వచ్చెదను’’ అంది మణి మేఖల.

ఆమె దృఢ సంకల్పం విని`

విభ్రాంతి చెందాడు ధనుంజయుడు.

‘‘దేవీ! ఇది పద్ధతి యనుకోను. నిను పెంచి పెద్ద జేసిన ఆ పుణ్య దంపతులకు మాట మాత్రమైనా చెప్పకుండా నా వెంట వచ్చుట సరి కాదు. ఆ పైన నిను గొని పోయిన నేను మహా బలి ఎదుట నిజము గనే దోషినగుదును. ఆలోచింపుము’’ అన్నాడు సాలోచనగా.

‘‘అవును. కాని మనకు వేరు మార్గమెయ్యది? మిము దోషిగా చూస్తున్న జనకుడు నను మీకిచ్చి వివాహము జేయునా? వేరే వరునితో వివాహము జేయ నిశ్చయింతురు. ప్రాణము విడుతును గాని అందుకు అంగీకరింప జాల. పిమ్మట ఎటులనో వారికి నచ్చజెప్పుకొన వచ్చును. ప్రస్తుతము మనము భూ లోకమునకు వెళ్ళి పోవుటయే ఇందుకు పరిష్కారము’’ అంది మణి మేఖల. భారంగా నిట్టూర్చాడు ధనుంజయుడు.

‘‘నీవు పొరబడుచున్నావు దేవీ. నీకు చాలా విషయములు తెలియవు. భద్రా దేవి విషయంగా నాకు ఎలాంటి సమస్యా లేదు. కాని నాగ లోక యువ రాణి ఉలూచీశ్వరి నను వలచి నా చెంతకు వచ్చుటతో నాగ రాజుకి శత్రువునైతి. ఇప్పుడు నిను గొని పోయి మహాబలితో కూడ వైరము తెచ్చుకొనుట మనకు క్షేమమా?’’ అంటూ తన జనకుడు ధర్మతేజునికి ఏర్పడిన పుట్టు వణ్రము మాన్పుటకు దివ్య నాగ మణి కోసం బయలు దేరిన మొదలు జరిగిందంతా మణి మేఖలకు వివరించాడు ధనుంజయుడు.

అంతా విని బేలగా చూసింది మణి మేఖల.

‘‘అటులయిన మన సమస్యకు పరిష్కారము ఏమి ప్రభూ? ఈ ఎనిమిది జాముల సమయమున భూలోకము చేరుట ఎటుల? గడువు దాటిన ఆమరణాంతము చెరసాల వాసము గదా’’ అంది రుద్ధ కంఠంతో.

“ఆ భయము నీకు వలదు హృదయేశ్వరి. అలాగున జరుగదు. ఆ మాధవుడు ఇట నుండి వెడలుటకు ఏదో మార్గము నాకు చూపక పోడు. నీవు మాత్రము ఇచటనే ఉండవలె. నిర్భయముగ ని మనసులో మాట ని తల్లిదండ్రులకు చెప్పవలె. వారు అంగీకరించినను నిరాకరించినను వారికి తెలియ పర్చుట ని ధర్మము.

ఈ లోపల నేను భూ లోకమున నా బాధ్యతలు ముగించిన పిమ్మట ని కొరకు ఈ పాతాళ లోకమునకు మరలి వత్తును. అప్పుడు నేనే మీ పెద్దలతో మాట్లాడి ఒప్పించి నిను చేపట్ట గలను. నా మాట నమ్ము. నిను కూడా నా వెంట రత్న గిరికి చేరిన పిమ్మట మీ ముపురునూ ఒకే సారి పరిణయ మాడెద. నీవు దుఖింప పని లేదు.” అంటూ లాలనగా కన్నీరు తుడిచాడు.

ధనుంజయుని విశాలమగు ఛాతీని కౌగిలించుకుని చాలా సేపు మౌనంగా ఉండి పోయింది మణి మేఖల. ఆమె కన్నీరు అతడి ఛాతీని తడుపు తూనే వుంది. కరి మబ్బులా దట్టంగా పొడవుగా తుమ్మెద రెక్కల్లా వుండి సుగంధ భరితంగా వున్న నిడు పాటి ఆమె కేశాలను సవరిస్తూ అనునయించాడు ధనుంజయుడు. ఆమె కన్నె పరువాలు ఎద భారాలు చాతీని అదిమేస్తుంటే ధనుంజయుని వలపు కోటలో అలజడి.

ముదమార ఆమె ముఖారవిందాన్ని తన వైపు తిప్పుకొని కన్నీరు తుడిచాడు. అంతే` ఒక్క సారిగా మీదకు ఎగ బ్రాకి అతని అధరాలను చుంబించింది. ఆమె సుందర దేహం అతడి కౌగిట బంధీ అయింది. తొలి కౌగిలి సుఖాన్ని ముద్దు మాధుర్యాన్ని అనుభవిస్తూ కాసేపు సర్వం మర్చి పోయారు.

“దేవీ...” పిలిచాడు.

“ఊఁ...” అంది.

“నీవు వచ్చి సమయము గడిచినది. ఇక నీవు అంతఃపురమున ని మందిరమున కేగుట మంచిది. ఎవరైనా గమనించిన ఇప్పుడే మన గుట్టు రట్టు కాగలదు” అంటూ గుర్తు చేసాడు.

ఇష్టం లేకున్నా మణిమేఖలకు`

బయల్లు దేరక తప్ప లేదు.

ఆమెను సాగనంపుటకు మందిర ద్వారం వరకు వచ్చాడు ధనుంజయుడు. గడప దాటక ముందే గిరుక్కున వచ్చి మరోసారి ధనుంజయుని గాఢంగా కౌగిలించుకుని అధర చుంబనాందించింది మణి మేఖల.

''నను మరువరు గదా. మీ కోసం ఎదురు తెన్నులు చూస్తూనే వుంటాను'' అంది.

మరో సారి ధనుంజయుడు మాట ఇచ్చాక`

అతడిని వదిలి పోలేక పోతూ`

వడి వడిగా అంతఃపురం వైపు వెళ్ళి పోయింది మణి మేఖల. ధనుంజయుడు వెనక్కి వచ్చి కూచున్నాడు. మణి మేఖల నిష్క్రమించటం గమనించాక కావలి రాక్షస భటులు నలుగురూ వచ్చి తిరిగి బయట కాపలా కూచున్నారు.

ధనుంజయుడి మనసు చంచలంగా వుంది. పడుకున్నా నిద్ర పట్టేట్టు లేదు. తిరిగి మరి కొంత మధిర సేవించి పడుకున్నాడు. తనిక్కడ నుండి బయటకు పోవడానికి తనుకున్న ఒకే ఒక మార్గం తన మిత్రుడైన యక్షుడు. కాని ఎంత ఆలోచించినా అతన్ని పిలిచేందుకు అతడి పేరు గుర్తుకు రావటం లేదు. ఎడ తెగని ఆలోచనల మధ్య ఎప్పుడు నిద్ర పట్టిందో ఆ పైన ధనుంజయునికి గుర్తు లేదు.

************************************

ఆ రాత్రి`

మాధవ స్వామి ఆహ్వానం మేరకు, ఆ సదా శివుని ఆశీస్సులతో భద్రా దేవి, ఉలూచిశ్వరిలు గుట్ట మీది శివాలయ మండపంలో తల దాచుకున్నారు...

ఆ రాత్రి కుంభ వృష్టిగా ఆరంభమైన వాన రెండు రాత్రులు రెండు పగళ్ళు విడవ కుండా కురుస్తూనే వుంది. వాగులు వంకలు ఏకమపోయాయి. చిట్టటవి ప్రాంతమంతా జల మయమై పోయింది. అశ్వాలతో సహా భూతం ఘృతాచితో బాటు భద్రా దేవి, ఉలూచిశ్వరి లిరువురూ మండపం లోనే శివ గణాలకు అతిధులుగా ఏ లోటు లేకుండా ఉండిపోయారు. వారు ధనుంజయుని రాక కోసం క్షణ మొక యుగంగా ఎదురు చూస్తున్నారు.

ఇలా ఉండగా `

ఆ రోజు వెదుకుతూ వెళ్ళిన భూతం ఘృతాచికి నల్లటి అశ్వాలు, నల్లటి రధము మాత్రం కన్పించాయి. నిజానికి సర్ప రూపంలో నాగ లోకం నుంచి వచ్చిన వాళ్ళంతా అక్కడే వున్నారు. ఆ విధంగా వక్ర దంతుని బృందం కొండ వాగు అవతల దూరంగా దట్టమైన అటవీ ప్రాంతంలో విడిసి వున్నారు. చీకటి పడిన కొద్ది సేపటికి పాతాళ బిలం నుండి తిరిగి వచ్చిన వక్ర దంతుడు చాలా ఉత్సాహంగా వున్నాడు. భద్రా దేవి, ఉూచిశ్వరిలు శివాలయం వున్న కొండ గుట్ట వద్దే ఉంటారని తెలుసు. పనిలో పని ఆ రాత్రికే ఉలూచిశ్వరిని కూడ నాగ లోకం ఎత్తుకు పోవాలని తన బృందాన్ని బయలుదేర దీసి కాగడాలతో కాలి నడకన సాగాడు.

వక్ర దంతుడు ధనుంజయుని అదృశ్యం చేయటం లోనే తొందర పడ్డాడని చెప్పాలి. ఆ తొందరలో ఘోరమైన తప్పు చేసాడు. ఒక తప్పు మరిన్ని తప్పిదాలకు దారి తీస్తుంది. నాగ రాజు ఆనతి వేరు వక్ర దంతుడు చేసింది వేరు. ధనుంజయ బృందం ఏదో ఒక చోట రాత్రికి మజిలీ చేసినపుడు అంతా గాఢ నిద్రలో వుండగా ధనుంజయుని పాతాళ లోకాన వదిలి రమ్మన్నాడు. తెల్ల వారి భద్రా దేవి, ఉలూచిశ్వరిలకు ధనుంజయుడు ఏమయ్యాడో అంతు చిక్క కూడదని అప్పుడు నిరాశలో ఉలూచిశ్వరి తమ నాగ లోకానికి తిరిగి వస్తుందని నాగ రాజు ఉద్దేశం.

కాని అత్యుత్సాహం చూపిన వక్ర దంతుడు నాగ రాజు ఆనతిని కాదని, పట్ట పగలే శివ సన్నిధి నుండి ధనుంజయుని అపహరించటంతో ఆ పని చేసింది వక్ర దంతుడని భద్రా దేవి, ఉలూచిశ్వరిలకు తెలిసి పోయింది. ఇక అదే క్రమంలో ఆ రాత్రికే ఉలూచిశ్వరిని కూడ ఎత్తుకు పోతే వచ్చిన పని ముగుస్తుందని, పాతాళం నుండి తిరిగి వస్తూనే తన నాగ దండులో దివిటీల కాంతిలో ఆలయానికి బయలు దేరాడు. కాని కొండ వాగును చేరక ముందే నందీశ్వరుని రంకులు, శునక రూపం లోని భైరవుని అరుపులు నాగ దండుని కంగారు పెట్టి వారి ప్రయత్నాన్ని భంగ పరిచాయి. ఆ పైన కుండ పోత వర్షం, పెను గాలి ఆరంభం గావటంతో పొంగి పొర్లుతున్న వాగును దాటే సాహసం చేయ లేక పోయారు. తిరిగి సర్ప రూపాలు ధరించి పొదలు, బొరియలు, కొండ రాళ్ళ పగుళ్ళలో తల దాచుకున్నారు.

మూడవ దినము వర్షము తెరిపిచ్చి సూర్యుడు కన్పించినా, వాగులు వంకలు పొంగి పొర్లుతూ అటవీ ప్రాంతం జల మయం గానే వుంది. అవతల శివ నాగ పురం జన జీవనం అస్త వ్యస్థమైంది. ఊరు సగం జల మయం గావటంతో అనేక గృహాలు కూలి పోయాయి.

పగటి వేళ నాగ లోక వాసులు`

బహిరంగంగా తిరగ లేరు.

మానవ రూపంలో సంచరించినా గరుడ పక్షులు వారిని పసి గట్టేస్తాయి. వేటాడి చంపి తినేస్తాయి. తమ మంత్ర శక్తులేవీ ఆ పక్షుల మీద పని చేయవు కాబట్టి ఏం చేసినా రాత్రి వేళే చేయాలి. ఉలూచీశ్వరిని అపహరించేందుకు వాళ్ళంతా అదను కోసం ఎదురు చూడ సాగారు. ఆ అవకాశం నాలుగవ రోజు తెల్ల వారు జామున కలిసి వచ్చింది వాళ్ళకు.

***********************************

బలి చక్రవర్తి ఇచ్చిన ఎనిమిది జాముల గడువు సమయం గడిచి పోయింది. అది పగలు రాత్రికి బేధం లేని చీకటి రాజ్యం గాబట్టి జాముల్ని సూచిస్తూ ప్రతి జాముకి ఒక సారి కోట పైభాగం నుండి నగారా మ్రోగుతుంది. ఆ భేరీ నాదం పాతాళ నగర మంతటా విన్పిస్తుంది.

ధనుంజయుడు నిద్ర లేచినప్పటి నుండి` తీవ్రాతి తీవ్రంగా ఆలోచిస్తూనే వున్నాడు.

తనను ఈ విపత్కర పరిస్థితుల నుండి కాపాడ గల సమర్థుడు ఏకైక మిత్రుడు యక్షుడు. కాని మస్తిష్కం వేడెక్కి పోతోంది గాని ఎంతగా తరచి ఆలోచించినా అతడి పేరు గుర్తుకు రావటం లేదు. లేచి జల ధారలో స్నానం చేసి తిరిగి అవే దుస్తులు ధరించాడు. కాస్త అలసట నెమ్మదించింది. అంతలో రాక్షస భటులు పది మంది రానే వచ్చారు. ఇనుప సంకెళ్ళతో తిరిగి ధనుంజయుని బంధించారు. ఆమరణాంతం చెర వాసం తప్పదని ధనుంజయుని పరిహాసంగా చూడ సాగారు. విడిది గృహం నుండి బయటకు నడిపించారు.

అంతఃపుర గవాక్షం నుండి తిరిగి బంధితుడైన ధనుంజయుని వీక్షిస్తూ దుఃఖితు రాలై కన్నీరు విడిచింది యువ రాణి మణి మేఖల. భటులు వెంట భారంగా నడుస్తున్న ధనుంజయుని వేదనతో చూస్తుండి పోయింది.

విడిది గృహం అంతఃపురం ఉద్యాన వనాన్ని ఆనుకునే వుంది. కాని చెరసాల అలా కాదు. కోట వెనక తట్టున మరు భూమిలో విడిగా నిర్మించిన సువిశాలమైన రాతి కట్టడం అది. ప్రవేశ ద్వారం నుండి పొడవుగా ఇరు వంకలా రాతి స్తంభాలు వున్నాయి. వాటికి అటు యిటు ఉక్కు వూచలతో కూడిన అనేక కటకటాల గదులున్నాయి. గది వెనక దృఢమైన వూచలతో కూడిన కిటికీ వెనక నుండి మరు భూమి మీదుగా ఎప్పుడూ శీతల గాలులు వీస్తూంటాయి.




అక్కడ మరో విశేషం కూడ గమనించాడు ధనుంజయుడు. ఆ రాతి కట్టడంలో ఎక్కడా కాంతులు చిందే మణులు నిక్షిప్తం చేయ బడ లేదు. చీకట్లను పొగొట్టేందుకు స్తంభాలకు తగిలించిన కాగడాలు సదా మండుతూంటాయి. అక్కడ కొన్ని గదుల్లో బంధీలున్నారు. వాళ్ళలో కొందరు రాక్షసులు మిగిలిన వారెవరో తెలీదు. కాని చాలా గదులు కాళీగానే వున్నాయి.

ఆ చెరసాలకు ఒక రాక్షసాంగన అధికారిణి గావటం విశేషం. ప్రవేశ ద్వారం పక్కనే ఆమె అధికారిక కార్యాలయం వుంది. ధనుంజయుని తీసుకొచ్చిన సమయానికి ఆమె అచట లేదు. గొని వచ్చిన రాజ భటులు ధనుంజయుని చెర సాల భటులకు వప్పగించి వివరాలు చెప్పి వెళ్ళి పోయారు. చెరసాల రాక్షస భటులు ధనుంజయుని ఒక గది లోకి నెట్టి తలుపులు మూసారు. లోన ఎత్తుగా వున్న ఒక తిన్నె మీద నడుం వాల్చాడు ధనుంజయుడు. ఆలోచనల్లో సమయం తెలి లేదు. చాలా సేపటి తర్వాత చెర సాల అధికారిణి అయిన రాక్షస కన్య అక్కడి కొచ్చింది. అశ్వం దిగి నేరుగా తన కార్యాలయంలో కూచుంది. ధనుంజయుని గురించి తెలీగానే అతడ్ని తన ముందుకు తీసుకు రమ్మని ఆజ్ఞాపించింది.

ఆ అధికారణి పేరు చిత్రిక.

తల మీద గుప్పెడు ఎత్తున పెరిగిన రెండు కొమ్ములను బట్టి ఆమె రాక్షస యువతి అనుకోవాలి గాని చూడ్డానికి అందమైన యువతి లాగే వుంది. వీర విద్యల్లో ఆరితేరిన కన్య అగుట చేత ఆ చెరసాలను నిర్వహించు బాధ్యత ఆమెకు వప్పగించబడింది. మిగిలిన రాక్షస యువతుల్లా వికారంగా లేదామె. ఎప్పుడూ సైనిక దుస్తులే ధరిస్తుంది. కాని సదా మధిర సేవిస్తుంది. నడుంకి ఒరలో కృపాణం చేతిలో కొరడాతో సంచరించటం ఆమె అలవాటు. యువతి అయినా ఆమెను చూస్తే చాలు రాజ భటులు కూడ జంకుతారు. అంతకు ముందే ధనుంజయుని గురించి కొంత విని వుంది. అందుకే తక్షణం అతడ్ని చూడాలని భటుల్ని పంపించింది. కాని వాళ్ళు రిక్తహస్తాలతో తిరిగి వచ్చారు.

‘‘ఏమైనది? బందీ ఎక్కడ?’’ కోపంతో గద్దించింది.

‘‘తను రానంటున్నాడమ్మా. తనతో మాట్లాడాంటే మీరు అక్కడికి రావాలట’’ అన్నారు భటులు.

ఆ మాటలకు చిత్రిక కోపంతో మండి పడింది. వెంటనే కొరడా అందుకుని విస విసా ధనుంజయుని గది ముందుకు వెళ్ళింది. అక్కడ ఏమి రభస చేస్తుందోనన్న జంకుతో భటులు ఆమె వెంట వెళ్ళ లేదు.

గది లోన తిన్నె మీద`

నిర్లక్ష్యంగా కూచున్న ధనుంజయుని చూడగానే చిత్రిక కోపం ఒక్క సారిగా ఆవిరై పోయింది. మదన తాపం ఆరంభమైంది. ధనుంజయుని రూపు రేఖా విలాసాలకు, రాజసానికి ముగ్ధురాలవుతూ తాళం తీసి గది లోకి నడిచింది. తన డాంబికాన్ని వదులు కోకుండా` ‘‘ఏమి నీ ధైర్యం? ఇచట నీవు బందీవని మరిచితివా? నా సమక్షమునకు రమ్మని కబురంపిన రానంటివట? అంత తెంపరి తనమా?’’ అంటూ గద్దించింది.

‘‘నీ నామ ధేయమేమి?’’ ఆమె మాటల్ని పట్టించు కోకుండా సూటిగా చూస్తూ ప్రశ్నించాడు ధనుంజయుడు.

“చిత్రిక” చెప్పింది.

“రాక్షస యువతివా?”

“రాక్షస కన్యను.”

“ఇచట స్త్రీలు కూడ సైన్యమున పని చేతురా?”

“అవును. అనేక మంది యువతులు సైన్యంలో విధులు నిర్వహిస్తుంటారు”

గొలుసు శబ్దం చేస్తుండగా`

తిన్నె దిగి నిలబడ్డాడు ధనుంజయుడు.

“చూడు చిత్రికా. సేవ గొనుటే గాని సేవించు అలవాటు లేని సుక్షత్రియ వంశం మాది. నను ఎవరూ శాసింప జాలరు. నీవు నా ముందు అధికార దర్పము చూప కుండుట మంచిది. వెళ్ళుము” అన్నాడు.

చిత్రిక మందహాసం చేసింది. ఆమె ఎద భారాలు బిగువై కంచుకం పిట పిట లాడింది. కళ్ళలో యువ్వనపు మెరుపు మెరిసింది.

“ఆహా! నరుడవైన నేమి. ఆ అనంగుని తపించు సుందర పురుషుండవు. జూడగానే నా మనసున మరులు రేపి కామ పీడితు రాలిని జేసినావే..., ఏ దేశ రాకుమారుండవు?” అంది చిత్రిక.

“అది నీకు అవసరమా?” గంభీరంగా అడిగాడు ధనుంజయుడు.

“అవసరమే గదా… నా మది దోచిన వాడివి. ఎలాగూ యిచట నీకు చెర వాసము తప్పదు. నను వివాహము చేసుకొనుము. ఈ చెర వాసము తప్పించి నిను మా గృహమునకు గొని పోదును. మనము సురత క్రీడ దేలి యవ్వన మధుర్యాన్ని చవి చూడ వచ్చును.”

ధనుంజయుడు చిత్రిక మాటలకు చిన్నగా నవ్వాడు.

“అసంభవము చిత్రికా… జరగని వాటికి ఆశ పడకుము. నీవు రాక్షస కన్యవు, నేను మానవుడను…”

“అయిన నేమి?” అంటూ అతడి మాటలకు అడ్డు వచ్చింది చిత్రిక.

“సద్బ్రాహ్మణుడు, బ్రహ్మ మానస పుత్రుడగు పులస్త్య బ్రహ్మ తన కుమారునికి మా రాక్షస కన్య  కైకసి నిచ్చి వివాహము చేయ లేదా? ఆ దంపతులు రావణ బ్రహ్మకు జన్మ నీయ లేదా? అంత దేనికి, పాండవ ద్వితీయుడు భీమ సేనుడు మా రాక్షస కన్య హిడింబను వివాహ మాడి ఘటోత్కచునికి జన్మ నీయ లేదా? నీవు నన్ను వరించుట లో తప్పే మున్నది? నా పొందు నీకు విందు సుమా” అంటూ నవ్వింది.

“చిత్రికా… మనకు పొసగదు. నీ కోరిక తీరనిది. ఇక నీవు వెళ్ళ వచ్చును” అన్నాడు ధనుంజయుడు.

ఆమె వెళ్ళ లేదు.

చిన్నగా అతడి ముందు కొచ్చి నిల బడింది.

భుజాల మీద చేతు లేసి కుడి కాలు లేపి అతడి నడుంని చుట్టేస్తూ హత్తు కొని కళ్ళ లోకి ఆకలిగా చూసింది.

“వివాహమున కిచ్ఛ లేకున్న ఏమాయె. ఒక పరి నా కోరిక తీర్చుము. నా కామ దాహమును పోద్రోలుము. నిను గాంచ గనే నా ఎదలో రగిలిన యవ్వన చిచ్చును చల్లార్చుము. నీ బిగి కౌగిట స్వర్గమును తలపించుము. అది చాలును” అంటూ తన ఎద బారాలను ధనుంజయుని ఛాతీకి అది మేస్తూ కౌగిలి బిగించి అధర చుంబనానికి తల పడింది.

అదిరి పడుతూ ధనుంజయుడు ఒక్క తోపులో చిత్రికను వెనక్కి నెట్టేసాడు. ఆ విసురుకు చిత్రిక తూలుతూ వెళ్ళి గుమ్మం ముందు పడింది. అంతే`

నిప్పులు కురిసే కళ్ళతో భుజంగంలా చివ్వున లేచి నిలబడింది చిత్రిక` ''ఏమిరా మానవా... కోరి వచ్చితినని ఇంత చులకనా? నా కోరిక తిరస్కరించి నను అవమానించి ఘోర తప్పిదము జేసినావు. నా కోరిక తీర్చకున్న ఇప్పుడే నిను సంహరించెద'' అంటూ బెదిరించింది.

''ఆహా(! చంప గలవేమో ప్రయత్నించు చూడము'' అన్నాడు ధరహాసంతో ధనుంజయుడు.

''నరుడివి... మానవుడివి నీకింత అహంకారము, తల పొగరు పనికి రాదు. నను తిరస్కరించి నందుకు పై లోకమున చింతించెదవు గాక. నర మాంస భక్షణ జేసి చాలా దినము లాయె. నిను జంపి నీ రక్త మాంసములతో విందారగించెద. ఆ విధముగా నిను నాలో ఐక్యము గావించెద'' అంటూ సర్రున ఖడ్గాన్ని దూసి రాక్షస బలంతో ధనుంజయుని తల నరకడానికి వేగంగా మీదకు వచ్చేసింది.

ధనుంజయుడు ఆమె ఖడ్గ ప్రహారాన్ని తన చేతి గొలుసులతో తిప్పికొట్టి అదే వేగంతో బలంగా ఆమె ముఖం మీద కొట్టాడు. గొలుసుల దెబ్బకు దిమ్మ తిరిగి గింగిరాలు తిరుగుతూ పోయి గుమ్మంలో పడింది.

''స్త్రీల, బాలల, వృద్ధుల్ని హింసింప రాదు, చంప రాదను నియమము గల వాడిని గాబట్టి బ్రతికి పోయావ్. ఇకనయినా నీ అహంకారము విడిచి ఆవలకు పొమ్ము'' అంటూ హెచ్చరించాడు.

ఆమెకు వెళ్ళే ఉద్దేశం లేదు.

చివ్వున లేచి రౌద్రంగా చూసింది.

''నన్నే కొట్టిన నీ ఆగడానికి శిక్ష తప్పదు. చావు తప్పదు'' అంటూ పెద్దగా అరిచి తన రాక్షస సిబ్బందిని పిలిచింది. అక్కడ ఏం

జరిగిందో అర్థం గాక పోయినా ఈటులు, బల్లాల వంటి తమ మారణాయుధాల్ని ఎక్కు పెట్టి బిల బిలా పరుగు లెత్తు కొచ్చే సారు ఇరవై మంది రాక్షస భటులు. చిత్రిక లేచి నిల బడి కౄరంగా చూసింది.''ఇక నీకు చావు తప్పదురా నరుడా. సుక్షత్రియుడవు గదా. నీ రక్త మాంసము బహు రుచి కర ముగ ఉండును'' అంటూ తన భటుల్ని చూసింది.ఆమె మాటలకు ఉలికి పడ్డాడు ధనుంజయుడు.

''రుచి... రుచి కర ముగ... తన మిత్రుడు యక్షుని పేరు ఇలాంటిదే గదా... అవును... రుచికుడు'' ఆహో మిత్రమా గుర్తు వచ్చినది. నీ పేరు గుర్తు కొచ్చినది'' అనుకుంటూ ఆనంద పడి పోయాడు. ఈ లోపల`

''ఈ నరుడ్ని కౄరంగా వధించండి'' అంటూ తన భటులకు ఆజ్ఞాపించింది చిత్రిక. ''ఈ దినమున నర మాంస భక్షణతో విందారగించెదము గాక. పొగరు తేలిన వీడి మాంసము అమిత రుచి కరముగ వుండును. ఊఁ... చంపండి'' అనరిచి ఆజ్ఞాపించింది భటులకు.

తన మీద కొస్తున్న రాక్షస భటుల్ని అటు యిటు బాది చెదర గొడుతూ చిత్రికను చూసాడు ధనుంజయుడు` ''చిత్రికా! నాకు శత్రువుగా మారినను మహోపకారమే జేసినావు. కృతజ్ఞుడను...'' అంటూ పైకి చూసి` ''హే యక్ష ప్రముఖా... మిత్రమా రుచికా... ఎక్కడున్నావయ్యా. బిరాన వచ్చి నాకీ పాతాళ చెర వాసము తప్పించి భూ లోకము చేర్చుము'' అంటూ బిగ్గరగా అరిచాడు.

అంతే`

పెద్ద మెరుపు మెరిసింది.

కనులు మిరుమిట్లు గొలిపే ఆ కాంతిని చూడ లేక వెర్రి కేకలు వేస్తూ విరుచుకు పడి పోయారు రాక్షస భటులు. రాక్షస కన్య చిత్రిక భయంతో గోడలకు ఒదిగి కళ్ళు గట్టిగా మూసుకుంది. ఆ మెరుపుల వెంబడే అక్కడ ప్రత్యక్షమయ్యాడు యక్షుడు రుచికుడు.

''ఆహాఁ! మిత్రామా. ఎన్ని దినములకు నేను గురుతుకు వచ్చితిని. మిక్కిలి ఆనందముగ నున్నది.'' అంటూ వచ్చి ధనుంజయుని కౌగిలించుకున్నాడు. అప్పుడే అతడి సంకెళ్ళను చూసి ఆశ్చర్య చకితు డయ్యాడు. అక్కడి భటులను కారా గారాన్ని చూసి కోపోద్రుక్తుడయ్యాడు.

‘‘ఏమిది… ఏమి చూస్తుంటి? మహా వీరుడవి. నిను సంకెళ్ళతో బంధించిన శత్రువు లెవరు? అసలు ఈ పాతాళ లోకమునకు, ఈ కారాగారమునకు ఎటుల వచ్చితివి?’’ అని ప్రశ్నిస్తూ తృటిలో ధనుంజయుని సంకెళ్ళను గడ్డి పోచలను త్రెంచినట్టు త్రెంచి అవతల పడేసాడు.

‘‘అదంతయూ పిమ్మట వివరించెద గాని మిత్రమా. ముందు నను భూ లోకమున మత్స్య దేశ మందలి శివ నాగ పురమున గల గుట్ట మీది శివాలయమునకు చేర్చుము’’ అంటూ అర్థించాడు ధనుంజయుడు.

‘‘అది ఎంత పని మిత్రమా. కాని నిన్నీ తెరంగున బంధించిన వారికి బుద్ధి చెప్ప వలె గదా’’ అంటూ గది లోకి వెళ్ళి వెనక గోడను బలంగా తన్నాడు. అంతే` ఆ రాతి గోడ తునాతునకలుగా పగిలి పోయి అవతల ఎడారి లోకి మార్గం ఏర్పడింది.

‘‘రమ్ము మిత్రమా. కొద్ది సేపు అలా నిల బడి చూడుము.’’ అంటూ ధనుంజయుని బయటికి పంపించి లోపలి కెళ్ళాడు. అప్పటికే చిత్రికతో సహా రాక్షస భటులు ప్రాణ భయంతో చెర సాల ముఖ ద్వారం వైపు పరుగెత్తారు. రుచికుడు మిగిలిన గదుల తలుపు పగల గొట్టి బంధీలను బయటకు తరిమాడు. పిమ్మట తన శరీరాన్ని అనూహ్యంగా పెంచేస్తూ కారా గారం పై కప్పును బలంగా మోదటంతో ఆ భాగం పిడుగు పాటుకు గురైనట్టుగా కిర కిర లాడుతూ కూలి పోయింది.




చిత్రికతో సహా అచటి కావలి భటులు బంధీలు హాహాకారాలు చేస్తూ దూరంగా పరుగులెత్తారు. భయ భ్రాంతులై చూడ సాగారు. కొండలా పెంచిన తన భారీ శరీరంతో కారాగారపు దృఢమైన రాతి కట్టడాన్ని కాళ్ళతో తన్ని చేతులతో పెకలించి కూల్చేసాడు రుచికుడు. చూస్తుండ గానే కట్టడం మొత్తం రాళ్ళ కుప్పగా మారి తగలబడి పోసాగింది.

రాక్షస కన్య చిత్రిక వూహించని పరిణామం యిది. ఆమె కళ్ళలో కన్నీరు కాదు, నెత్తురు ప్రవహిస్తోంది. ఇంత ఘోరం జరుగుతుందని ఏమాత్రం తెలిసినా నరుడని చులకనగా చూసి ధనుంజయుని పట్ల అలా అనుచితంగా ప్రవర్తించేది కాదేమో.

పని పూర్తి కాగానే తన శరీరాన్ని సాధారణ స్థితికి తగ్గించు కుంటూ ధనుంజయుని ముందుకొచ్చాడు రుచికుడు. 'మిత్రమా! ఈ పాతాళ వాసులు నీకు నెరపిన అపరాధముకు ఈ శిక్ష చాలనుకొందును. ఇక రమ్ము. తృటిలో భూ లోకమున నీవు కోరిన చోటుకి నిను చేర్చగలను'' అంటూ ధనుంజయుని ఎత్తి తన భుజాల మీద కూచోబెట్టుకున్నాడు. ధనుంజయుని కళ్ళ ముందు యువ రాణి మణి మేఖల మెదిలింది. ఒక సారి ఆమెను చూడాలనుకున్నా వెంటనే ఆ ఉద్దేశాన్ని విరమించుకున్నాడు. రుచికుడు ధనుంజయునితో సహా గాల్లోకి ఎగిరాడు. అంతే` అంతా చూస్తూండ గానే క్షణంలో అదృశ్య మయ్యాడు.

ఈ సంఘటన జరుగుతున్న సమయానికి అక్కడ తన రాజ సభలో బలి చక్రవర్తి కొలువు తీరి వున్నాడు. ధ్వంసమైన కారాగారం నుండి పరుగులెత్తుకొచ్చిన కావలి భటులైన రాక్షసులు సరాసరి సభ లోకి దూసుకొచ్చేసారు. వస్తూనే` ''ప్రభూ... ఘోరం... విపరీతం జరిగి పోయినది'' అనరిచారు.

వంటినిండా గాయాలతో తన ముందు కొచ్చిన కారాగార కావలి భటుల్ని చూడగానే ఆశ్చర్య పడుతూ చట్టున సింహాసనం నుండి లేచి తన గదాయుధాన్ని భుజాన వేసుకుంటూ ఉగ్రుడై చూసాడు బలి చక్రవర్తి.

''ఏమిరా... ఎవరు మిమ్ము తరుముకొచ్చినది? మీపై దాడికి తెగ బడిన ధూర్తు లెవరు?'' అంటూ హుంకరించాడు.

''ఎవరూ దాడి చేయ లేదు. తరుమనూ లేదు ప్రభూ.'' అంటూ ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థం గాక తలలు వంచు కున్నారు భటులు.

''ఏమీ జరుగ కుండా మీకీ గాయములు ఎటు ఏర్పడినవి? ఎందుకు పారి వచ్చితిరి?'' గద్దించాడు.

''క్షమించాలి ప్రభూ. యక్షుడు రుచికుడు వచ్చి ఆ మానవ వీరుడు ధనుంజయుని బంధీని చేసినందుకు అగ్రహోదగ్రుడై అందర్నీ బయటకు తరిమి మన కారాగార కట్టడ సముదాయం మొత్తం ధ్వంస మొనర్చి రాళ్ళ కుప్పల జేసి తగుల బెట్టినాడు. పిమ్మట బంధనాలు తొలగించి ధనుంజయుని భుజాల మీద కూచో బెట్టుకొని భూలోకం గొని పోయాడు'' అంటూ తడ బడుతూ వివరించాడు ఒక భటుడు.

ఇది జరుగుతున్న సమయంలో యువ రాణి మణి మేఖల రాణి వాసపు స్త్రీల నడుమ పైన పరదాల వెనకనే వుంది. భటులు తెచ్చిన వర్తమానం వింటూనే ఖిన్నురాలయింది. ధనుంజయుడు భూ లోకం వెళ్ళి పోయాడని తెలిగానే సర్వం పోగొట్టుకున్నట్టు బాధా తప్త హృదయంతో దుఃఖం అతి శయింపగా ''హా.. ప్రియ సఖా! నను వదిలి పోతివా'' అంటూ ఒక్క సారిగా తెలివి తప్పి ఆ సుకుమారి సొమ్మసిల్లి పోయింది. దాంతో ఏం జరిగిందీ అర్థం గాక రాణి వాసపు  స్త్రీలంతా మణి మేఖలను చుట్టు ముట్టేసారు. అనూహ్యంగా గందర గోళ పరిస్థితి ఏర్పడిందక్కడ. ఈ విషయం సభ లోని బలి చక్రవర్తికి తెలీదు. భటులు తెచ్చిన వర్తమానం విని విభ్రాంతి చెందాడు.

''ఏమిరా! మతి చెడినదా? పొరబడితిరా? రుచికుడేమి వచ్చుటేమి? అతగాడు శాప వశాన అగ్ని సర్పముగా మారి నాగ లోకమున భృత్యుడిగా పడి వున్నటుల వింటిమి!'' అని గద్దించాడు.

అంత వరకూ మౌనంగా వున్న రాక్షస గురువు శుక్రా చార్యుల వారు అప్పుడు కల్పించు కొంటూ` ''మహా బలి! అదంతయును గతము. ఈ ధనుంజయుని మూలమున శాప విముక్తి పొందిన రుచికుడు ధనుంజయుని మిత్రుడైనాడు'' అన్నాడు.

''అవును ప్రభూ. మిత్రమా రుచికా అంటూ పిలవ గానే రుచికుడు ధనుంజయుని ఎదుట ప్రత్యక్షమైనాడు. అసలీ అనర్థమునకు కారకురాలు మా అధికారిణి చిత్రిక'' అన్నాడొక భటుడు.

''చిత్రిక... ఏమి జేసినది?'' నమ్మ లేనట్టు ప్రశ్నించాడు బలి.

''ఆమె ఆ మానవుని మోహించి అనుచితముగా ప్రవర్తించినది. అతడు తిరస్కరించ గానే అగ్రహించి అతడ్ని జంపి నర మాంస భక్షణ చేయనెంచి కత్తి దూసినది...'' అంటూ చెరసాలలో చూసింది చూసినట్టు, జరిగింది జరిగినట్టు విశదీకరించాడా భటుడు.

ఆగ్రహోదగ్దుడవుతున్న బలి చక్రవర్తిని శుక్రాచార్యుడు శాంతింప జేస్తూ` ''ప్రభూ! తమకు తెలీదు. యువ రాణి ఆ నరుని వలచి వలపించు కోగా లేనిది చిత్రిక అతడి పట్ల మోహితురాలయి అనుచితంగా ప్రవర్తించుటలో వింత యేమున్నది? ఈ విషయమును పక్కన బెట్టి ఒక పరి తమ గారాల దత్త పుత్రిక యువ రాణి మణి మేఖల గురించి ఆలోచించండి. ధనుంజయుడు భూ లోకానికి వెళ్ళి పోయాడని తెలిగానే ఆ బాలిక సొమ్మసిల్లినటున్నది. పోయి విచారించిన ఆమెయే చెప్ప గలదు'' అంటూ సలహా యిచ్చాడు.

ఇది బలికి సరి కొత్త విషయము.

మణి మేఖల ధనుంజయుని వలచినదా!

నమ్మ లేక పోతున్నాడు. వెంటనే` ''గురు దేవా! మీరును నాతో రావలె'' అని కోరుతూ వెంటనే సభ చాలించి పెద్ద పెద్ద అంగలతో మణి మేఖల వద్దకు బయలు దేరాడు. ఆయన వెంట శుక్రా చార్యులూ బయలు దేరారు.

***************************

శివాలయ మండపం.

నాలుగో రోజు రాత్రి సమయం.

భద్రా దేవి, ఉలూచీశ్వరిలు`

గాఢ నిద్రలో వున్నారు.

రెండు దినాలు కుంభ వృష్టిగా కురిసిన వర్షం నిలిచినా మూడో దినము ఉదయానికి గాని వాగులు వంకలు నీరు తీసి యథా స్థితికి రాలేదు. చిట్టడివిలో నీరు ఇంకి దట్టంగా పచ్చిక మొలవ నారంభించింది. ఈలోపల ధనుంజయుని అశ్వం గరుడ ఉలూచీశ్వరికి బాగా మచ్చిక అయింది.

మూడో రోజు ఉదయం తన మచ్చల గుర్రం ఢాకిని మీద భద్రా దేవి, దనుంజయుని అశ్వం మీద ఉలూచీశ్వరి బయలు దేరి కొండ దిగారు. భద్రా దేవి చెంత ఉండగా గరుడ పక్షులు దాడి చేస్తాయని భయం లేదు. అలాగే బహిరంగంగా పగటి వేళ నాగ దండు వస్తే గరుడ పక్షులు దాడి చేసి వేటాడేస్తాయి గాబట్టి వాళ్ళు రారు. ఆ భయం లేదు.

పడతలిరువురూ అశ్వాలమీద కొండ వాగు వరకు వెళ్ళి కాల కృత్యాలు తీర్చుకున్నారు. స్నానాదికాలు చేసి పొడి దుస్తులు ధరించి తడి దుస్తుల్ని పిండి అవి ఆరే వరకు అక్కడ వున్నారు. తర్వాత తిరిగి ఆలయ మండపానికి వచ్చేసారు. దైవ సన్నిధిలో వారికి ఏ లోటు లేదు. ధనుంజయుని రాక కోసం క్షణమొక యుగంగా ఎదురు చూస్తూ ఆ సదా శివుని, వేణు మాధవుని ప్రార్థిస్తూ నిష్టగా ధ్యానించసాగారు. ఈలోపల`

వాన నిలిచి పోయింది గాబట్టి`

మూడో రోజు రాత్రే వక్ర దంతుడి బృందం ఉలూచీశ్వరిని అపహరించేందుకు అర్ధ రాత్రి దాటాక కొండ గుట్ట ఎక్కింది. కాని మండపంలో అడుగు పెట్ట లేక పోయారు. అదృశ్య రూపం లోని శివ గణాలు వాళ్ళని కొండ గుట్ట దిగువకు తరిమి కొట్టాయి. ఈ విషయం భద్రా దేవికి గాని, ఉలూచీశ్వరికి గాని తెలీదు.

వెనక్కి వచ్చిన వక్ర దంతుడు ఇక ఆ రాత్రికి ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. నాలుగో రోజు రాత్రికి కొత్త మార్గాన్ని ఎంచుకున్నాడు.

తాము మండపంలో అడుగు పెట్ట లేరు గాబట్టి యువరాణి ఉలూచీశ్వరినే బయటకు రప్పించటం ఒక్కటే మార్గం. అందుకు తగిన ఎత్తుగడతో నాలుగో రోజున అర్ధ రాత్రి దాటాక చిట్టడివి గుండా కొండ గుట్ట దిగువకు చేరుకున్నారు. చీకట్లో చీకటిగా కలిసి పోతూ నల్లటి అశ్వాలు పూన్చిన నల్లటి రధము, నల్లటి అశ్వాల మీద నాగ దండు చీకట్లో చడీ చప్పుడు లేకుండా వచ్చారు. అర్ధ రాత్రి తర్వాత రావటం చేత వాళ్ళ గురించి భద్రా దేవికి గాని, ఉలూచీశ్వరికి గాని తెలీదు. ఇక భూతం ఘృతాచిది మొద్దు నిద్ర. దానికీ తెలీదు. అందరినీ గుట్ట దిగువనే వుంచి వక్రదంతుడు, మాయా శృంగుడు ఇరువురూ సర్ప రూపాలతో కొండ గుట్ట పైకి ప్రాకుతూ వెళ్ళారు.

అప్పటికి తెల్లవారు జాము ఆరంభమైంది.

భద్రా దేవి ఉలూచీశ్వరిలు గాఢ నిద్రలో వున్నారు. ఆ సమయంలో ఉన్నట్టుండి ధనుంజయుని గొంతు తనను పిలిచే సరికి ఉలికి పడి కళ్ళు తెరిచింది ఉలూచీశ్వరి.

"హా..! ప్రియ సఖీ ఉలూచీశ్వరీ. ఎక్కడున్నావ్ దేవీ. త్వరగా రమ్ము. గాయాల బాధతో గుట్ట ఎక్క లేకున్నాను. బిరాన వచ్చి చేయి అందించవా. రా మనోహరీ... త్వరితముగ వచ్చి నను కాపాడుము." అంటూ ధనుంజయుని గొంతు నిద్ర లోకి విన్పించింది, నిద్ర లేచాకా విన వచ్చింది.

మొదట ఉలూచీశ్వరి కేమీ అర్థం కాలేదు. కాని ఆ గొంతు తన మనోహరునిదే. సందేహం లేదు. ఏమైనది? తను పాతాళ లోకం నుండి వచ్చినారా? అతడు వచ్చాడన్న ఆనందంలో ఆమె ఉక్కిరి బిక్కిరవుతూ దుస్తులు సరి చేసుకుంది. నిడుపాటి తన కురులను లాగి ముడి వేసుకుంది. ప్రియుని చూడాలన్న ఆత్రంలో పక్కనే నిద్రిస్తున్న భద్రా దేవిని లేపాలన్న ఆలోచన కూడ రాలేదు. వేగంగా మండపం దిగి ఆ చీకట్ల లోనే గోపుర ద్వారం గుండా కొండ వంచకు పరుగెత్తింది.

నిజానికి అది శత్రువు పన్నాగమని ఆ క్షణంలో గ్రహించ లేక పోయింది ఉలూచీశ్వరి. మాయా శృంగుడు గుట్ట వంచన కూచుని ఉలూచీశ్వరి కర్ణ పుటాలకు మాత్రం చేరేట్టు ధనుంజయుని గొంతును అనుకరించి పిలిచాడు. అతడి తంత్రం ఫలించింది. కావలి వున్న శివ గణాలు బయటి కొస్తున్న ఉలూచీశ్వరిని ఆప లేదు.

“ప్రాణ సఖా ధనుంజయా. ఇదో వచ్చు చుంటిని” అనరిచింది.

గుట్ట వంచ కొచ్చి కళ్ళు చికిలించి ధనుంజయుని కోసం గాలిస్తున్న ఉలూచీశ్వరి ముందు మాయా శృంగుడు ప్రత్యక్షమయ్యాడు. చేతిని ఆమె ముఖం మీద ఆడించాడు. అంతే`

ఏం జరుగు తుందో అర్ధమయ్యే లోపే`

తృటిలో తెలివి తప్పింది ఉలూచీశ్వరి.

వెనకే వచ్చిన వక్ర దంతుడు ఆమెను లాగి భుజాన వేసుకున్నాడు. తక్షణమే గాల్లో ఎగురుతూ ఉలూచీశ్వరిని గుట్ట దిగువకు తీసుకు పోయారు. నిజానికి ఇది శత్రువు పన్నాగమని ఉలూచీశ్వరి ఏమాత్రం ముందుగా వూహించినా తన నాగ శక్తితో మాయా శృంగుడి ప్రయత్నాన్ని భంగ పరిచి వాళ్ళ భరతం పట్టి వుండేది. వెంటనే భద్రా దేవిని పిలిచి ఉండేది. చాలా వేగంగా జరిగి పోయిన ఆ సంఘటనలో ఆమెకా అవకాశమే లేకుండా పోయింది.


ఇక్కడో మరో విశేషం ఏమంటే` భూతం ఘృతాచికి ఎందుకో మెలకువ వచ్చే సరికి ఉలూచీశ్వరి లేచి బయటకు పోతూండటం కన్పించింది. ఎందుకు వెళుతుందో అర్థం గాక వెనకే తనూ బయట కొచ్చింది. కాని అప్పటికే వాళ్ళు ఉలూచీశ్వరిని గుట్ట దిగువకు తీసుకు పోతూ కన్పించారు. గాల్లో ఎగురుతూ తనూ గుట్ట దిగిన ఘృతాచికి అక్కడ నల్లటి రథము, అనేక మంది నాగ దండు అశ్వికులు కన్పించారు. ఉలూచీశ్వరిని రథంలో పడుండ జేసి అశ్వాలను అదిలించారు. వాళ్ళంతా వెళ్లి పోతున్నారు. వాళ్ళు చాలా మంది వున్నారు. తను వాళ్ళని ఆపటం సాధ్యం కాదనిపించింది. చూస్తూండ గానే అశ్వాలు చాలా దూరం వెళ్ళి పోయాయి.

నాగ దండును కొంత దూరం వరకు అనుసరించిన ఘృతాచి, యువ రాణిని కాపాడటం తన ఒక్క దాని వలన జరిగే పని కాదని గ్రహించింది. దాంతో వెళ్ళినంత వేగం గానూ మండపానికి తిరిగి వచ్చి భద్రా దేవి ని నిద్ర లేపింది.

భద్రా దేవికి నిద్ర మత్తులో`

మొదట ఏమీ అర్థం కాలేదు.

చూస్తే పక్కన ఉలూచీశ్వరి లేదు.




"ఘోరం జరిగి పోయిందమ్మా!" అంటూ భూతం ఘృతాచి జరిగింది వివరించ గానే కోపోద్రేకంతో అగ్ని శిఖలా మండి పడింది.

"కుత్సితులు... సిగ్గు ఎగ్గు లేని జడలు, పిరికిపందలు. మోసం చేసి ఎంత దూరము గొని పో గలరు. అసలు ఉలూచీశ్వరి బయటి కెందు కెళ్ళినది?"

వెంటనే నిద్ర మత్తు వదిలేలా నీటిని పుక్కిలించి ముఖ ప్రక్షాళన గావిస్తూ అడిగింది భద్రా దేవి. ఘృతాచి తను చూసింది వివరించింది` "ధనుంజయుల వారి గొంతు అనుకరించినట్లున్నారమ్మా! ప్రాణ సఖా... ధనుంజయా... ఇదో వచ్చుచుంటి" అని

అరవటం వినిపించినది'' అంది.

ఏమి జరిగి వుంటుందో వూహించింది భద్రా దేవి. ఏమైనప్పటికీ ఇలా జరిగి వుండ కూడదు. తమ మనోహరుడు తిరిగి వస్తే ఏమి బదులు చెప్ప వలె? ''పద... ఆ నీచులను విడిచి పెట్ట'' అని తర్కించుకొంటూనే ముడి జారకుండా కేశాలను బంధించి పోరుకు అనుకూలమైన దుస్తుల్ని ధరించి ఒరతో సహా ఖడ్గాన్ని నడుంకి బిగించింది. తన మచ్చల గుర్రానికి జీను బిగించి పక్కన అడ్డంగా రెండు బరిసెలు, రెండు ఈటెలను కట్టింది.

''ఘృతాచి! మన ధనము, దుస్తులు, ఇతర సామాగ్రి సహా సంచులన్నీ ఇచటనే వున్నవి. జాగ్రత్త! ఇచటనే వుండుము. యువ రాజా వారు వచ్చిన జరిగినది మనవి చేయుము. నేను పోయి ఉలూచీశ్వరిని విడిపించి తెచ్చెదను'' అంటూ హెచ్చరించి చెంగున ఎగిరి జీను మీద కూచుంది.

''నాగ దండు ఎటు పయనించిందీ గమనించితివా?'' కళ్ళాలు అందుకుని అశ్వాన్ని అదిలిస్తూ అడిగింది.

''వాళ్ళు శివ నాగ పురం మీదుగా అంగ రాజ్యం వైపు పోతున్నారమ్మా'' అంది భూతం ఘృతాచి.

క్షణం కూడ ఆలస్యం చేయకుండా అశ్వాన్ని దూకించింది భద్రా దేవి. మండపం దిగి కాలి బాటన గుట్ట దిగిన అశ్వం ఢాకిని చిట్టడవిలో కాలు మోపగానే శర వేగంతో పరుగు ఆరంభించింది. భద్రా దేవి వీరావేశంతో అశ్వాన్ని దౌడు తీయిస్తూ శివ నాగ పురం దాట గానే నాగ దండును అన్వేషిస్తూ సుడి గాలి వేగంతో దూసుకు పోసాగింది.

ఈ లోపల`

సరిగ్గా భద్రా దేవి వెళ్ళిన కొద్ది సేపటికే పాతాళ లోకం నుండి ధనుంజయుని తెచ్చిన యక్షుడు రుచికుడు శివాలయ మండపంలో ప్రత్యక్షమై ధనుంజయుని క్రిందికి దించాడు. ధనుంజయుని చూడ గానే భూతం ఘృతాచికి దుఃఖం ఆగ లేదు. బోరున ఏడ్చేసింది. చూస్తే అక్కడ భద్రా దేవి లేదు, ఉలూచీశ్వరీ లేదు. తన అశ్వం గురుడ మాత్రం వుంది. యజమానిని చూడగానే అది ఆనందంతో పెద్దగా సకిలించి చిందులేసింది.

పరిస్థితి చూడగానే`

ఏదో విపరీతం జరిగిందని`

ధనుంజయునికి అర్థమై పోయింది.

“ఘృతాచి! ఏమి జరిగినది?” అడిగాడు.

“ఏమి చెప్పను ప్రభూ! ఆ నాగ లోక వాసులు మోసము జేసినారు.” అంటూ దుఃఖం ఆపుకుని జరిగినది చక చకా వివరించినది.

“మిత్రమా! వాళ్ళు ఎంత దూరము పోగలరు. నిన్ను అచటికే గొని పోయెద రమ్ము!” అన్నాడు అంతా వింటున్న రుచికుడు.

“లేదు మిత్రమా! ఇప్పటికే నీకు కడు శ్రమ యిచ్చితి. భద్రా దేవికి సాయముగా నేను వెడుచున్నాను. వాళ్ళు ఉలూచీశ్వరిని నాగ లోకమునకు తీసుకు పోలేరు. ప్రతీకారము తప్పదు. ఆ వక్ర దంతునికి తగిన బుద్ధి చెప్ప వలె” అన్నాడు ధనుంజయుడు.

“సరి. నీవు రమ్ము. పోరాటమున నేను కల్పించుకోను గాక. కాని అదృశ్యమున ఆ పోరాటము జూడ నిచ్ఛగలుగుచున్నది. అనుమతినిమ్ము” అడిగాడు రుచికుడు.

“నీ ఇచ్ఛను కాదందునా మిత్రమా! బయలుదేరుము. వెనకే వచ్చుచున్నాను.” అని ధనుంజయుడు చెప్పగానే వెంటనే అదృశ్యమయ్యాడు రుచికుడు.

ధనుంజయుడు క్షణం కూడ ఆస్యం చేయ లేదు. నాలుగు దినములుగా వేసుకున్న దుస్తులే వంటి మీద ఉన్నాయి. అయినా దుస్తులు మార్చుకో లేదు. అక్కడ భద్రా దేవి ఒక్కతే అంత మంది నాగులతో పోరాడుతోంది. పరిస్థితి ఏమిటో తెలీదు. ఉలూచీశ్వరి ఎలా వుందో తెలీదు. ప్రత్యర్థుల మీద పగతో అతడి గుండె భగ్గున మండుతోంది. ముఖ్యంగా వక్ర దంతుడి మీద.

తన ఆయుధాలు అందుకున్నాడు.

కృపాణం ఒరలో సహా నడుంకి బిగించాడు. తన ధనుస్సు అందుకుని అల్లె తాడు బిగించి కట్టాడు. అంబుల పొది వీపున కట్టుకున్నాడు. ఆశ్వం గరుడను బుజ్జగించి, దాని వీపున జీను వేసి బిగించాడు. ఈటె, బరిసెను అటు యిటు అడ్డంగా కట్టాడు. ఓ పక్కన చకచకా సిద్ధమవుతూనే ఘృతాచిని తరచి తరచి అడిగి జరిగిన వివరాలు తెలుసుకున్నాడు. అశ్వాన్ని అధిరోహించే ముందు ఓసారి ఆ సదాశివుని, వేణు గోపాలుని మనసున స్మరించి, ఘృతాచిని అక్కడే వుండమని ఆదేశించి చెంగున అశ్వాన్నధిరోహించి కళ్ళాలు అందుకున్నాడు. కొండ గుట్ట దిగుతూనే అశ్వాన్ని సమరోత్సాహంతో శర వేగంగా పరుగెత్తించాడు. అప్పటికి తెల్లవారడానికి అర్ధ జాము కూడ సమయం లేదు. అప్పుడప్పుడే తూర్పు గగనం తెల్లబడుతోంది. శివ నాగ పురం దాటగానే గాలితో పోటీ పడుతూ మహా పథంలో దూసుకు పోనారంభించింది అశ్వం గరుడ.

**********************************************

వక్రదంతుడికి ఇప్పుడు చాలా సంతోషంగా వుంది. ఉలూచీశ్వరి చిక్కటం తన అదృష్టంగా భావిస్తున్నాడు. ఆమెను నాగ లోకం చేర్చగానే ప్రభువు నాగరేడు వద్ద తన ప్రతిష్ట ఇనుమడిస్తుంది. వెంటనే ఉలూచీశ్వరితో తన వివాహం జరిగి పోతుంది. పాతాళ లోకము నుండి ధనుంజయుడు తిరిగి వచ్చుట కల్ల. అచటి చట్టములు, శాసనములు తనకు తెలుసు. అక్రమంగా తన పాతాళ లోకంలో అడుగిడిన ఎవరినీ బలి చక్రర్తి క్షమించడు. కాబట్టి ధనుంజయునికి అచట చెర వాసము తప్పదు. అతడు భూలోకము చేరుట అసంభవం.

ఇక భద్రా దేవి`

పాపం ఆ సౌందర్య వతి జంట బాసిన ఒంటరి అయినది. ధనుంజయుడు లేకున్న ఆ పడతికి నాగ లోకముతో పని లేదు. ఒక వేళ ఉలూచీశ్వరి కోసం రావాలనుకున్ననూ ఆమెకు నాగ లోకమునకు మార్గము గాని, ప్రవేశము గాని తెలీదు. ఉలూచీశ్వరి అదృశ్యమైన సంగతి ఉదయము నిద్ర లేచాక గాని ఆమెకు తెలీదు. అప్పటికి తాము చాలా దూరము వెళ్ళి పోతారు. అశ్వికులు పగటి వేళ గరుడ పక్షులు తమ మీద దాటి చేయకుండా బాణము ఎక్కు పెట్టి ఉంటారు గాబట్టి వాటిని తరిమి తాము నిరాటంకంగా ప్రయాణం చేస్తూ అంగరాజ్య సరి హద్దుకు వెళ్ళి పోగలరు. కాబట్టి ఏకాకి అయిన భద్రా దేవి దుఖ్ఖమున కృంగి నిరాశతో స్వస్థమునకు మరలి పోక తప్పదు. ఇక తను నాగ రాజునకు అల్లుడగుటకు మార్గము సుగమమైనట్టే… అందుకే ఆనందంతో అశ్వాన్ని ఉత్సాహంగా దౌడు తీయిస్తున్నాడు వక్రదంతుడు.

నాగ దండుకి అగ్ర భాగంలో వక్ర దంతుడు, మాయా శృంగుడి అశ్వాలు ముందుగా దౌడు తీస్తున్నాయి. ఆ వెనకే రెండు వరుసల్లో పాతిక అశ్వాల మీద నాగ దండు అశ్వికులు, వాటి వెనక వస్తోంది నల్లటి రథము. ఆ రథములో తెలివి తప్పి పడున్నది యువ రాణి ఉలూచీశ్వరి. ఆ రథం వెనక మరో పాతిక అశ్వాల మీద రెండు వరుసల్లో రథమునకు రక్షణగా వస్తోంది నాగ దండు. వాళ్ళంతా

మహా పథంలో మహా ఆర్భాటంగా అమిత వేగంగా ప్రయాణం చేస్తున్నారు.

అవి వస్తున్న వేగం చూసి`

తెల్ల వారు జామునే ప్రయాణం సాగిస్తున్న బాట సారులు భయంతో పక్కకు పరుగు తీసి దారి వదులుతున్నారు. బాట మీదకు వస్తున్న అడవి మృగాలు కూడ భయంతో కకా వికలై లోతట్టు అరణ్యం వైపు పారి పో సాగాయి. ఇదే సమయంలో తమ వెనకే భద్రా దేవి ఉగ్ర రూపంతో తన అశ్వం మీద దూసుకొస్తోందని నాగ దండుకు తెలిదు.

శివ నాగ పురం నుండి సుమారు అయిదు యోజనాల దూరం వెళ్ళాక గాని ఎగువన సాగి పోతున్న నాగ దండు భద్రా దేవి కంట బడ లేదు.

అప్పటికి తెలతెలవారుతోంది.

అశ్వాలు పరుగెడుతున్న వేగానికి వాటి గిట్టల చప్పుడుతో అటవీ ప్రాంతం మారుమ్రోగుతోంది. సుడి గాలిలా పైకి లేస్తోంది ధూళి. నాగ దండు కంట పడ గానే మరింత వేగంగా దూసుకు పో సాగింది భద్రా దేవి. అంతలో`

తమ వెనకే వచ్చి పడుతున్న భద్రా దేవిని చిట్ట చివరి అశ్వికుడొకడు గమనించి, అదిరి పడుతూ` ‘‘వచ్చేస్తున్నది! ఆ భద్రా దేవి వచ్చేస్తున్నది.’’ అనరిచాడు. అయితే గుర్రాల గిట్టల శబ్దం హోరులో వాడి అరుపు సమీపంలో వాళ్ళకే విన్పించాయి. చిన్న పాటి కలకలం రేగింది. అదేమిటో అర్థం గాక తిరిగి చూసిన వక్రదంతుడికి అప్పుడు కన్పించింది భద్రా దేవి. ఖడ్గం దూసి వీరావేశంతో వచ్చేస్తోందామె. ఇప్పుడో కాసేపటికో తమను చేరుకునే అవకాశం వుంది. ఆమెను చూసిన కంగారులో కళవళపడిపోయాడు. తన అంచనా తారుమారైంది. భూతం ఘృతాచి సంగతి తను మర్చి పోయిన సంగతి అప్పటిగ్గాని గుర్తు రాలేదు.

‘‘మాయా శృంగా! ఏమిరా యిటుల జరిగినది? నీవే ఏదో ఒకటి జేసి ఆమెను ఆప వలె. లేకున్న పడిన శ్రమ బూడిదలో పోసిన పన్నీరు చందమగును.’’ అన్నాడు.

‘‘ఇంకనూ ఏమి చేయునది? ఆమె మహా మంత్రగత్తె యని మరచితివా? సాధారణ యువతియా ఏదో ఒకటి చేయుటకు. ఆమె చూస్తూండగా మన మాయ లేవీ పని చేయవు. రానిమ్ము! ఆమె ఒంటరిది. మనం ఇంత మంది ఉంటిమి. పోరాడి మూకుమ్మడిగా

దాడి నెరపి ఆమెను అంతం చేయటే మార్గము. సాధ్యమైనంత వరకు ముందుకే సాగి పోవుదము.'' అంటూ సలహా యిచ్చాడు మాయా శృంగుడు. అశ్వాల వేగాన్ని మరింత పెంచింది నాగదండు.

భూకంపం వచ్చినట్టు అశ్వాల వేగానికి నే అదురుతోంది. ఇంత జరుగుతున్నా రథం లోని ఉలూచీశ్వరికి ఏమీ తెలీదు. వాళ్ళు తనను గమనించారని గ్రహించ గానే తన మచ్చల గుర్రాన్ని మరింత అదిలించింది భద్రా దేవి.

ఇంతలో నాగదండుకి ఎగువన`

మహా పథానికి ఇరువంకలా వున్న మహా వృక్షాలు రెంటిలో ఒకటి ఫెళ ఫెళార్భాటాలతో భయంకర శబ్దం చేస్తూ వ్రేళ్ళతో సహా లేచి బాటకు అడ్డంగా కూలి పోయింది. దాని వెనకే రెండో పక్క వృక్ష రాజం కూడ అదే విధంగా కూలి మహా పథ మార్గాన్ని మూసేసాయి. అది చూసి నాగ దండు అదిరి పడింది. వక్ర దంతుడికి నోట మాట రాలేదు.

ఎక్కడా గాలి విసురు గాని సుడి గాలి జాడ గాని లేదు. ఉన్నట్టుండి ఆ మహా వృక్షాలు ఎలా కూలి పోయాయో అర్థం కాలేదు గాని, వాటిని తప్పించుకుని ముందుకు పోయే అవకాశం తమకు లేదు. ఎందుకంటే అది చాలా దట్టమైన అటవీ ప్రాంతం. ఏం చేయాలో అర్థం గాక అగ్ర భాగాన ఉన్న వక్ర దంతుడు మాయా శృంగుడు కూడ అశ్వాల వేగాన్ని తగ్గించారు. నాగ దండు వేగం ఎప్పుడైతే మందగించిందో భద్రా దేవి వాళ్ళకి మరింత చేరువ కాసాగింది.

నిజానికి ఆ వృక్షాలను కూల్చి నాగ దండును ముందుకు పోకుండా నిరోధించింది యక్షుడు రుచికుడు. అప్పటికే చాలా దూరం నుంచి అదృశ్య రూపంలో గాలిలో తేలుతూ వాళ్ళని అనుసరించి వస్తున్నాడు. పాతాళ లోకం నుంచి వస్తూండగా ధనుంజయుడు భద్రాదేవి, ఉలూచీశ్వరి గురించి క్లుప్తంగా చెప్పగా విన్నాడు. ఇప్పుడు మార్గంలో నాగదండును కసిగా వెంబడిస్తున్న భద్రా దేవిని చూసాడు. చూస్తూంటే సూర్యోదయమైన చాలా సేపటి వరకూ నాగదండు భద్రా దేవికి చిక్కేట్టు లేదు. తను పోరాటంలో పాల్గొనని మాటిచ్చాడు గాని సాయం చేయనని మాటివ్వ లేదుగా. అందుకే మహా వృక్షాలను నేల కూల్చి నాగ దండు పారి పోకుండా నిలువరించేసాడు. అసలు ధనుంజయుడు కోర లేదు గాని కోరితే తనే రథం లోని ఉలూచీశ్వరిని తిరిగి మండపానికి చేర్చి వుండే వాడు. కాని ధనుంజయుడు కోర లేదు. ఆ నిజాయితీయే ధనుంజయునితో స్నేహ బంధాన్ని మరింత పెంచింది. పగ ప్రతీకారాలు తమవి గాబట్టి ఉలూచీశ్వరిని విడిపించే బాధ్యత తమదే అనుకున్నాడు . ధనుంజయుడు. కాని ఇక్కడ వక్ర దంతుడి బృందం తన మంత్ర శక్తితో భద్రా దేవే ఆ వృక్షాలను కూల్చి వుంటుందనుకుంది.




ముందుకు పోవడానికి` మరో మార్గం కన్పించ లేదు వక్ర దంతుడికి. కూలిన వృక్షాల సమీపంలో అశ్వాలు ఆగి పోయాయి.

అవతల ప్రచండ వేగంతో ఉగ్ర రూపంతో తన మచ్చల గుర్రం మీద దూసుకొచ్చేస్తోంది భద్రా దేవి. ఇక పోరు తప్పని పరిస్థితి. ధనుంజయుని పాతాళ లోకానికి పంపించినట్టు ఎవరూ గమనించక ముందే ఉలూచీశ్వరిని నాగ లోకానికి చేర్చాలనుకున్న పథకం ఇంత దారుణంగా బెడిసి కొట్టడంతో వక్ర దంతుడికి మతి పోయినట్టయింది. దాంతో `

‘‘వెళ్ళండిరా... పొండి... వేగిరం ఆ పిశాచి ఇక్కడికి రాక ముందే బాణాలు వేసి అశ్వంతో సహా నేల కూల్చండి. త్వరగా...’’ అంటూ పిచ్చి పట్టినట్టు అరిచాడు.

అతడి అరుపులో నాగ దండు చైతన్య వంతమైంది.. అశ్వికులు యాభై మందీ రథాన్ని అక్కడే వదిలి తమ అశ్వాలను వెనక్కు మళ్ళించారు. వస్తున్న భద్రా దేవికి ఎదురు వెళుతూ బాణాలను ప్రయోగించ నారంభించారు.

వాళ్ళ ఉద్దేశాన్ని దూరం నుండే గమనించింది భద్రా దేవి. వెంటనే ఖడ్గాన్ని ఒరలో వుంచి, ఒక చేత్తో ఈటె, ఒక చేత్తో బరిసె అందుకుంది. అశ్వం కళ్ళాలు వదిలేసింది. దాన్ని కాళ్ళ తోనే అదుపు చేస్తూ, ఈటెను, బరిసెను ఇరు వంకలా చక్ర వ్యూహంలా తిప్పుతూ వస్తున్న బాణాల్ని వస్తున్నట్టే గాల్లోనే ఎగర గొడుతూ ముందుకు సాగింది. బరిసె తిప్పటంలో ఆమె నేర్పు చూసి నాగ దండే కాదు, అదృశ్య రూపంలో గమనిస్తున్న యక్షుడు రుచికుడు కూడ ఆశ్చర్య పోయాడు. ఎంత వేగమంటే ఆమె చేతిలో విష్ణు చక్రాల్లా తిరుగుతున్న ఈటెను, బరిసెను దాటి ఆమెను గాని అశ్వాన్నిగాని ఒక్క బాణం కూడ తాక లేక పోతోంది. మచ్చల గుర్రం ఢాకిని నేరుగా వేగంగా భద్రా దేవిని నాగ దండు అశ్వాల మధ్యకు తీసుకొచ్చేసింది. వస్తూనే, వీరావేశంతో` ‘‘రేయ్ నీచులారా! మోసం చేసి ఉలూచిని తీసుకు పోతార్రా. మీ అంతు చూసెద. పిరికి పందలారా…’’ అని చిరుతలా రంకె లేస్తూ బరిసెతో కొందరి ధనస్సుల్ని ధ్వంసం చేసింది. కొందరిని పొడిచి అశ్వాల నుంచి కూల్చింది. అరుపులు, కేకలు, ఆర్తనాదాలతో సంకుల సమరం ఆరంభమైంది. ఇంత జరుగుతున్నా పొరబాటున కూడ వక్ర దంతుడు యుద్ధ గళంలో ప్రవేశించ లేదు. భద్రా దేవి దావానలంలా విరుచుకు పడి దొరికిన వాడ్ని దొరికినట్టు చీల్చి చెండాడుతోంది.

అదే సమయంలో`

రథం వెనక అశ్వం మీద కూచుని మిర్రి మిర్రి చూస్తున్న వక్ర దంతుడి మీద పడింది భద్రా దేవి దృష్టి. తమ మనోహరుని తమకు దూరం చేసాడు. ఇప్పుడు ఉలూచీశ్వరిని మోసంతో గొనిపోవ సిద్ధమైనాడు. నిప్పులు కురుస్తున్న కళ్ళతో` ‘‘నాగ లోక నీచ నికృష్ఠుడా! ఎక్కడికి పోయెదవురా…’’ అనరుస్తూ చేతిలో ఈటెను సూటిగా వాడి గొంతుకి గురి చూసి విసిరింది భద్రా దేవి.

అదిరి పడ్డాడు వక్ర దంతుడు.

తృటిలో అశ్వాన్ని పక్కకు దూకించి తప్పించుకున్నాడు గాని లేకుంటే ఆ క్షణమే ఈటె నాటుకుని వాడి ప్రాణాలు పోయేవి.

ఈటెను అటు విసర గానే ఆ చేత్తోనే తన ఖడ్గాన్ని ఒర నుంచి సర్రున దూసింది భద్రా దేవి. ప్రత్యర్థులకు చిక్కకుండా ఒక పక్క బరిసెతో మరో పక్క ఖడ్గంతో దొరికిన వాడ్ని దొరికినట్టు దయా దాక్షిణ్యం లేకుండా అడ్డంగా నరికేస్తూ తన అశ్వం మీద వీర విహారం చేయనారంభించింది.

ఇక్కడ వక్ర దంతుడి ఆలోచన వేరుగా వుంది. అక్కడ భద్రా దేవి నాగదండుతో పోరాటంలో మునిగి వుండగానే తను రథంలోని ఉలూచీశ్వరిని తన అశ్వం మీద వేసుకుని అడవిన బడి తన దారిన నాగ లోకం వెళ్లి పోవటం మంచిదనిపించింది. లేకున్న భద్రా దేవిని ఆపటం కష్టం. తను అడవి లోకి వెళ్ళి పోతే ఇక భద్రా దేవికి తన జాడ తెలిసే అవకాశమే లేదు. ఈ ఆలోచన యిచ్చింది పక్కనున్న మాయా శృంగుడు.

‘‘వక్ర దంతా ఏమి ఆలస్యం... త్వరగా’’ అంటూ పక్క అశ్వం మీదున్న మాయా శృంగుడు హెచ్చరిస్తున్నాడు.

వక్ర దంతుడు అశ్వం దిగి `

ఉలూచీశ్వరి కోసం రథం ఎక్కాడు.

పోరాటంలో మునిగి వున్న భద్రా దేవి వాడి ఉద్దేశం గమనించ లేదు గాని యక్షుడు రుచికుడు గమనించాడు. ఉలూచీశ్వరిని వాడు ఎత్తుకు పోతే వాడి జాడ భద్రా దేవికి గాని, ధనుంజయునికి గాని తెలీదు. పడిన శ్రమ వృధా అవుతుంది. చూస్తూ వూరుకో లేక పోయాడు. అదృశ్య రూపంలో మరో సారి కల్పించుకున్నాడు.

ఉలూచీశ్వరి కోసం రథం ఎక్కిన వక్ర దంతుడు ఆమెను తాకుటకు ముందే ఎవరో తనను ఎత్తి విసిరేసినట్టు గింగిరాలు తిరుగుతూ గాల్లోకి ఎగిరి చివ్వున వచ్చి తన అశ్వం కాళ్ళ దగ్గర పడ్డాడు. అంతలో రథ చోదకుడు కూడ ఎవరిదో అదృశ్య హస్తం తనను తాకినట్టు కెవ్వున అరిచి తన స్థానం లోంచి ఎగిరి అవతల పడ్డాడు.

రథ అశ్వాల కళ్ళాలు తాముగా గాల్లోకి లేచాయి. ఎవరో అదిలించినట్టు అశ్వాలు కదిలాయి. అర్ధ చంద్రాకారంలో రథం వెనక్కి తిరిగి వచ్చిన దారినే పరుగు ఆరంభించింది. ఈ మాయ ఏమిటో అర్థం గాక లేచి కూచుంటూ తెల్లబోయాడు వక్ర దంతుడు. అదే సమయంలో ఎగువ నుంచి తమ వైపు వాయు వేగంతో దూసుకొస్తున్న శ్వేతాశ్వాన్ని, ఆ అశ్వం మీది ధనుంజయుని ముందుగా చూసిన మాయా శృంగుడి కళ్ళు పెద్దవయ్యాయి. అది కలో నిజమో అర్థం గాక కళ్ళు నులుముకుని చూసాడు. ధనుంజయుని గుర్తు పట్టగానే భయంతో కెవ్వున అరిచాడు.

‘‘వక్ర దంతా! నీ జాతకం యిలా తగలడిందేమిరా... లే... లేచి త్వరగా అశ్వం ఎక్కు. వాడు వచ్చేస్తున్నాడు.’’ అనరిచాడు.

‘‘ఇక్కడ ఎవడో అదృశ్య రూపంలో ఉన్నాడు.. ఎవడు వాడు? ఆ సంగతి చూడుము’’ అనరుస్తూ లేచాడు వక్ర దంతుడు.

‘‘వాడి సంగతి తర్వాత... అటు చూడుము. ధనుంజయుడు ధనుష్టంకారం గావిస్తూ కాల యముడిలా వచ్చుచున్నాడు. మనం వెంటనే పారి పోవుట మంచిదనుకొందును.’’ అంటూ హెచ్చరించాడు.

అప్పుడు చూసాడు వక్ర దంతుడు ధనుంజయుని. అప్పటికి తెల్ల వారి సూర్యోదయం గావటంతో స్పష్టంగా చూడ గలుగుతున్నారు. పాతాళ లోకం నుండి ఎలా ధనుంజయుడు తప్పించు కొచ్చాడో బుర్ర చించుకున్నా వక్ర దంతుడికి అర్థం గాక పిచ్చి పట్టినట్టు చూసాడు. ధనుంజయుడు రంగ ప్రవేశం చేస్తే ఇక పరిస్థితి తమ చేయి దాటి పోయినట్టేనని గ్రహించాడు. ప్రాణాలు దక్కించుకోవాలంటే మాయా శృంగుడు చెప్పినట్టు తోక ముడిచి పారి పోక తప్పదనిపించింది. అప్పటికే మాయా శృంగుడు తన అశ్వాన్ని వెనక్కి తిప్పేసాడు.

ఇక క్షణం కూడ ఆలస్యం చేయకుండా ఎగిరి తన అశ్వం మీద కూచుని కళ్ళాలు అందుకున్నాడు వక్ర దంతుడు. మరు క్షణమే ఎవరూ చూడక ముందే వక్ర దంతుడు, మాయా శృంగుడి అశ్వాలు అడవి లోకి అదృశ్యమయ్యాయి.

ఈలోపల`

నాగ దండుతో తను ఒక్కతే పది మంది పెట్టుగా హోరా హోరీ పోరాటంలో మునిగి వున్న భద్రా దేవి చివరి క్షణంలో గాని రథం తమ పక్క నుంచే వెళ్ళటం గమనించ లేదు. రథ చోదకుడు లేడు. అటు చూస్తే వక్ర దంతుడు, మాయా శృంగుడి జాడ లేదు. రథంలో ఉలూచిశ్వరి ఉందో వాళ్ళు తీసుకు పోయారో తెలిక కంగారు పడుతూ అడ్డు వచ్చిన రెండు అశ్వాల్ని, నాగ సైనికుల్ని తెగటార్చి తన అశ్వాన్ని రథం వైపు దూకించ బోయింది. ఎగువ నుంచి వచ్చేస్తున్న శ్వేతాశ్వాన్ని, ధనుంజయుని అప్పుడు చూసింది. చూడగానే ఆ ప్రయత్నం విరమించుకుంది. ఆమె ముఖారవిందం సూర్యుని గాంచిన కలువలా ఆనందంతో విచ్చుకుంది. అంతే` రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రత్యర్థుల మీద విరుచుకు పడింది. కొద్ది దూరం వెళ్ళిన రథం అక్కడే ఆగింది. వస్తున్న ధనుంజయుడికి రథం లోని ఉలూచిశ్వరిని చూసాక గాని మనసు కుదట పడ లేదు. ఇక అక్కడి నుండే నాగ సైనికుల మీద అంప వర్షం కురిపిస్తూ దూసుకు వచ్చేసాడు.

చావగా మిగిలిన నాగ దండు సైనికులకు దిక్కు తోచ లేదు. అటు చూస్తే వక్ర దంతుడు, మాయా శృంగుల జాడ లేదు. ఇటు చూస్తే ఇప్పటికే పది అశ్వాలను, ఇరవై మందికి పైగా తమ సైనికులను తెగటార్చింది భద్రా దేవి. ఇప్పుడు ధనుంజయుని బాణాలకు అశ్వాలు, భటులు కూడ నేల కూలుతున్నారు. ఇక తాము ఎవరి కోసం పోరాడాలి? ప్రాణాలు అర చేత పట్టుకు పారి పోవటం మంచిదనిపించింది. అంతే` ఒకరి కొకరు కూడ బలుక్కుని అశ్వాల్ని మళ్ళించి చావగా మిగిలిన వాళ్ళు అడవి లోకి పారి పోయారు. ఆ పోరాటం మొత్తంలో పది మంది మాత్రమే తప్పించుకు పోయి వుంటారు.

భద్రా దేవి చేతిలో పాతిక మంది, ధనుంజయుని బాణాలకు పదిహేను మంది, మొత్తం నలభై మంది హతులు కాగా ముప్పై అశ్వాల వరకు నేలకొరిగాయి. పది అశ్వాలు గాయాలతో అడవి లోకి పారి పోయాయి.

క్కడ మరో విశేషమేమంటే`

నాగ లోక భటులు ప్రాణాలు కోల్పో గానే వారి శరీరాలు పురుషాకృతిని కోల్పోయి తమ నిజ రూపమగు సర్పాలుగా మారి పోవటం. ఎటు చూసినా నెత్తుటి మడుగులు ఖండిత సర్ప శరీరాలే కన్పిస్తున్నాయి. పోరు జరిగిన చోట మహా పథం రక్త సిక్తమైంది. అప్పటికీ కోపం తీరక భద్రా దేవి ఇంకా కొన ప్రాణాంతో మూలుగుతున్న నలుగురైదుగుర్ని తన బరిసెతో గుచ్చి ప్రాణాలు తీసింది. ఆమె చేతుల్లోని బరిసెలు, ఖడ్గం నెత్తురోడుతున్నాయి. దుస్తులు రక్తాభిషేకం చేసినట్టు ఎర్ర బడి పోయాయి. అదే సమయంలో గగన తలంలో గరుడ పక్షులు సర్ప శరీరాల కోసం కారాడటం కన్పించింది. ఇప్పుడో కాసేపటికో అవి నేలకు వాలే అవకాశం వుంది.

ఇంతలో ధనుంజయుడి శ్వేతాశ్వం భద్రా దేవి సమీపం లోకి వచ్చి ఆగింది. కొన్ని లిప్తల కాలం పాటు ఒకరి నొకరు ఆరాధనగా చూసుకుంటూ వుండి పోయారు. ఇరువురి కళ్ళ లోనూ నీరు చిప్పిల్లుతోంది.

ధనుంజయుడు అశ్వం దిగి తన ధనస్సును అశ్వం జీనుకు తగిలించి భద్రా దేవి కోసం చేతులు చాపాడు. అంతే`

ఒక్క దూకులో తన అశ్వం దిగిన భద్రా దేవి బరిసెను, ఖడ్గాన్ని నేలకు గుచ్చింది. రివ్వున వచ్చి ధనుంజయుని కౌగిట వాలి పోయింది. ఆమెను ప్రేమగా గుండెకు హత్తుకున్నాడతడు. దుఖ్ఖం ఆపుకో లేక ఏడ్చేసింది. కొద్ది సేపు మాటలు పెగల్లేదు ఇరువురికీ. నాలుగు రోజుల ఎడబాటు నాలుగు యుగాలుగా వుంది. బిగి కౌగిట కొద్ది సేపు సేద దీరారు.

''భయ పడితి ప్రభూ! ఈ జన్మలో తమ దర్శనం లభించ దేమో నని భయమందితి. ఆ శంకర స్వామి, వేణు గోపాల స్వామి మమ్ము కరుణించి నారు. ఆ ధూర్తుడు వక్ర దంతుడు వంచనతో ఉలూచిని అపహరింప జూచినాడు. తృటిలో తప్పించ కొనె, లేకున్న వాడిచటనే అంతమై వుండేవాడు...'' అంటూ ఆ పైన మాటలు పెగక వెక్కి వెక్కి ఏడ్చింది భద్రా దేవి.

ధనుంజయుడు ఆమె ముఖం పైకెత్తి ప్రేమతో కన్నీరు తుడిచాడు.

''నాకంతయు తెలిసె సఖీ. భూతం ఘృతాచి చెప్పినది. ఇక నీ వీరోచిత పోరాటము, ఆవేశము, ఉలూచీశ్వరిని కాపాడిన తీరు కడు శ్లాఘ నీయము భద్రా. నిన్నెలా అభినందించాలో తెలియుట లేదు'' అంటూ ముదమార గాఢంగా హత్తుకుని నుదుట ముద్దాడాడు. పులకించింది భద్రా దేవి.

ఇద్దరూ అశ్వాలను వదిలి` రథం వైపు నడిచారు. ఉన్నట్టుండి ఏదో గుర్తుకొచ్చినట్టు విభ్రాంతి చెంది ధనుంజయుని వంక చూసింది భద్రా దేవి.

"ప్రభూ! ఇచటెవరో అదృశ్యమున మనకు సాయ పడినారు. అదో... ఆ పెను వృక్షాలను కూల్చి నాగ దండును ఆడ్డుకున్నారు. చోదకుడు లేకుండానే రథము వెనక్కి వచ్చి ఇచట ఆగినది. లేకున్న వక్ర దంతుడు ఉలూచిని తన అశ్వం మీద గొని పోయి ఉండే వాడు" అంది.

అలా సాయ పడినది ఎవరో` ధనుంజయునికి తెలుసు.

తను రంగ ప్రవేశం చేయకుండా పరోక్షంగా భద్రా దేవికి సాయం చేసాడు. ఇప్పుడు కూడ ఇచటనే ఎక్కడో అదృశ్యంగా వున్నాడు.

"ఆ శక్తి ఎవరో నాకు తెలుసులే దేవీ. అది నా మిత్రుడు యక్షుడు రుచికుడు. నను పాతాళమున చెర వాసము నుండి రక్షించి తక్క సమయమున ఇటకు చేర్చింది అతడే" అంటూ క్లుప్తంగా చెప్పాడు.




తను రథం ఎక్కి, స్పృహ లేకుండా పడున్న ఉలూచీశ్వరి పక్కన కూచుని ఆమె తను ఒడిలో పెట్టుకుని తెలివి రప్పించే

ప్రయత్నం చేసాడు.

భద్రా దేవి కూడా రథంలో కొచ్చింది.

ఉలూచీశ్వరి పక్కన కూచుని ముఖాన నీరు చిలకరించింది. బుగ్గలు తట్టి పిలిచింది. కొంత సేపటికి స్పృహలో కొచ్చిన ఉలూచీశ్వరి ఉలికి పడి లేచి కూచుంది, పిచ్చి చూపులు చూసింది. ఏం జరిగిందీ ఆమెకు అర్థం కాలేదు.

అప్పటికి బాగా తెల్ల వారి పోయింది.

తూర్పు ఆకాశంలో బాల భానుడు తొంగి చూస్తున్నాడు. తన ఎదురుగా వున్న భద్రా దేవిని చూసింది ఉలూచీశ్వరి తన వెనక వున్న ధనుంజయుని గమనించ లేదు. రక్త సిక్తమైన దుస్తులలతో బీభత్సంగా వున్న భద్రా దేవిని చూడ గానే కొద్ది కొద్దిగా జరిగింది గుర్తు రాసాగింది.

''అక్కా! నా కొరకు పోరాడితివా... ఆ నీచులు ఏమైనారు?'' అనడిగింది, గొంతు పెకల్చి రుద్ధ కంఠంతో.

''వక్ర దంతుడు, మాయా శృంగుడు తప్పించుకు పోయినారు. నాగ దండును నాశనమొనర్చినాము. వెను తిరిగి చూడుము ఎవరు వచ్చినారో!'' అంది నవ్వుతో భద్రా దేవి.

తన వెనకే కూచున్న ధనుంజయుని చూడగానే చంద్రుని గాంచిన తామరలా ఆమె ముఖారవిందం వికసించింది. ఇది కలో నిజమో అర్థం కాలేదు. ఒక్క సారిగా ఎద పొంగిన సంతోషం, విరహం దుఃఖం ముప్పిరి గొని ఉక్కిరి బిక్కిరి చేయగా` ''హా... ప్రాణ సఖా. వచ్చినారా...'' అంటూ ఎగసి ధనుంజయుని మెడను కావిలించుకొని ఏడ్చేసింది. ఆమెను ముదమార గుండెకు హత్తుకొని జుత్తు నిమిరి ప్రేమగా ముద్దాడి ఓదార్చాడు.

ముగ్గురూ రథం దిగే సరికి`

ఎదురుగా యక్షుడు రుచికుడు చిరు నవ్వుతో ప్రత్యక్షమయ్యాడు. పదిహేనడుగుల ఎత్తున పోత పోసిన విగ్రహంలా వున్న యక్షుని రూపాన్ని చూసి విభ్రాంతులయ్యారు భద్రా దేవి, ఉలూచీశ్వరిలు. ధనుంజయుడు పరిచయం చేయగానే తనకు సాయ పడిన అదృశ్య శక్తి ఎవరో భద్రా దేవికి అర్థమైంది. కృతజ్ఞతగా భామలిరువురూ రుచికుడికి నమస్కరించారు.

''సుఖీభవ... అభీష్ట సిద్ధిరస్తు...'' అంటూ అశీర్వదించాడు రుచికుడు. అలాగే భద్రా దేవి వీరోచిత పోరాటాన్ని ఘనంగా అభినందించాడు. ధనుంజయుని జూచి`

''మిత్రమా! ఇక నేను పోయి వత్తునా..? మార్గమునకు అడ్డంకి లేకుండా ఆ పెను వృక్షాలను తొలగించి వెడలెదను గాక. ఇకనయినా నా పేరు రుచికుడని మరువకు సుమా! పిలిచినంతనే ఎన్ని పనులున్ననూ విడిచి తృటిలో నీ చెంగట వాలెద. వలసిన సాయము జేసెద.'' అంటూ మాటిచ్చాడు.

''అటులనే మిత్రమా! ఇప్పుడు నీవు జేసిన సాయము గూడ మరువ లేనిది. కృతజ్ఞుడను.'' అన్నాడు ధనుంజయుడు.

''మనలో మనకు కృతజ్ఞత లేమి గాని ఇప్పుడు మీ పయన మెటు?''

''శివ నాగ పురము పోవలె. తప్పదు గదా. మా సంచులు, భూతం ఘృతాచి అచట మండపమందే వున్నవి. ఆపైన వక్రదంతుని కారణంగా నాడు శివ దర్శనం చేయనే లేదు. ఆ పనులు ముగించుకొని తిరిగి ఇదే మార్గమున అంగ రాజ్యము వైపు పయనించెదము.'' అన్నాడు ధనుంజయుడు.

భద్రా దేవి ధనుంజయుని చెవిలో ఏదో చెప్పింది.

''ఏమి సంశయము? నేను చేయ వలసిన పనులేమైనా వున్నవా?'' అడిగాడు రుచికుడు.

''ఏమీ పని గాదు గాని, నీవు పోవు మార్గమున భూతం ఘృతాచితో ఓ మాట చెప్పి పోవలె. అక్కడ మా సంచులు తీసుకుని కొండ వాగు వద్దకొచ్చి శాలి వృక్షం క్రింద మా కొరకు ఎదురు చూడమని చెప్పిన చాలును. కొండ వాగులో స్నానాదికాలు ముగించు కుని పొడి దుస్తులు మార్చుకొని దైవ దర్శనానికి పోవలె.''

“అవశ్యము మిత్రమా! ఘృతాచితో ఓ మాట చెప్పి వెడలెద గాక. నీ వంటి మహా వీరుడు మిత్రుడు గావటం నాకు గర్వ కారణం ధనుంజయా. మన స్నేహ బంధము చిర కాలముండాలె. త్వరిత గతిని మూవురు రాణులతో నీవు రత్నగిరి సింహాసనమున ప్రకాశింప వలె. అది వీక్షించి నేను ఆనందించ వలె. ఇక పోయి వత్తునా సఖుడా! శలవు గైకొనెద.” అంటూ అదృశ్య మయ్యాడు రుచికుడు.

చివరిగా రుచికుని మాటలు`

ధనుంజయుని ఉలికి పడేలా చేసాయి.

పాతాళ లోక యువ రాణి మణిమేఖల గురించి ఇప్పుడే భద్రా దేవి, ఉలూచీశ్వరిలకు తెలియ కూడదనుకున్నాడు. కాని తను పొరబాటున చెప్పినాడో కావాలనే చెప్పినాడో గాని రుచికుడు నోరు జారి కొంప ముంచాడు. “ఇదేమి పని మిత్రమా! పోతూ పోతూ పొగ బెట్టి పోతివే. వీళ్ళకి ఏంచెప్పాలి?” అంటూ మనసు లోనే కళ వళ పడి పోయాడు. చివరకు ధనుంజయుడు భయ పడి నట్టే జరిగింది. భద్రా దేవి, ఉలూచీశ్వరిలు అచ్చెరు వొంది ముఖ ముఖాలు చూసుకున్నారు.

“అక్కా! మనం ఇరువురమే గదా. మరి ఆ యక్ష మిత్రుడేమి అటుల జెప్పినాడు. మూవురు రాణలతో సింహాస మధిష్టింప మని. ఆ మూడవ రాణి ఎవరు?” అనడిగింది అమాయకంగా.

“ఏమో... నాకేమి తెలియు? ఆ గుట్టు విప్ప వలసినది మన స్వామియే గదా.” అంటూ దీర్ఘం తీసింది భద్రా దేవి.

ఇక ధనుంజయుడు కల్పించు కొనక తప్ప లేదు.

“వేరెవరున్నారు దేవి! మీ ఇరువురే గదా. రుచికుడు మూవురు రాణులని పొరబాటున నుడివినాడు” అంటూ నవ్వాడు.

“ఊహుఁ... ఆర్య పుత్రులు అనృతములాడుట శోభించదు.” అంది ఊచీశ్వరి.

అదే సమయంలో`

ఎవరో పట్టి లాగినట్టు ఎగువన బాటకు అడ్డంగా పడున్న మహా వృక్ష్వా రెండూ ఒక దాని తర్వాత ఒకటిగా పక్కకు తొలగి మార్గం సుగమమైంది. యక్షుడు వాటిని తొలగించి వెళ్ళి పోతున్నాడని అర్థమైంది. అవతల కొందరు అశ్వికు బాటసారులు నిలిచి పోయి వున్నారు. అడ్డంకి తొలగ గానే వాళ్ళంతా సంభ్రమాశ్చర్యాలకు లోనవుతూ ముందుకు బయలు దేరారు. ఇక ఎక్కువ సేపు తాము అక్కడ వుండటం మంచిది కాదని గ్రహించాడు ధనుంజయుడు.

''ప్రియ సఖియు! మీరు నన్ను క్షమించాలి. ఆమె పేరు మణి మేఖల. బలి చక్రవర్తుల వారి దత్త పుత్రిక. తప్పని పరిస్థితిలో యువరానణి మణి మేఖలతో వలపు బంధాన చిక్కితి. వివరములు పిమ్మట తెలిపెద గాక. మనము బయలు దేర వలె'' అంటూ ధనుస్సు భుజాన వేసుకొని తన శ్వేతాశ్వాన్ని అధిరోహించాడు.

భద్రా దేవి ఉలూచీశ్వరిలు`

ముసి ముసిగా నవ్వుకున్నారు.

భద్రా దేవి వెళ్ళి నేలకు గుచ్చిన తన ఖడ్గాన్ని, బరిసెను అందుకుని యథా స్థానాల్లో వుంచి మచ్చల గుర్రాన్ని అధిరోహించింది. ధనుంజయుని ముందు శ్వేతాశ్వం మీద కూచుంది ఉలూచీశ్వరి. అంతే` అశ్వాలు రెండూ పోటీ పడుతూ శివ నాగ పురం వైపు దౌడు తీసాయి.

******************************

''ఏమిరా వక్ర దంతా! ఇటుల తగల బడిన దేమిరా నీ జాతకము. నీకన్నీ అపజయములే గాని జయములు లేవా? పరాభవములే గాని గౌరవము లేవా? తొలి ప్రయత్నమున విఫలమైతివి. సరి... కాబోయే అల్లుడవని రెండో అవకాశమునూ నీకే ఒసంగినారు ప్రభువు. నేను వెంట వచ్చి సాయ పడితి. యాభై మంది మన నాగ దండు పటాలము ఆర్భాటముగ మనతో వున్నది.

ధనుంజయుని పాతాళ లోకంలో పడవేసినావు. ఏమైనది! నాలుగవ దినమునకే నిక్షేపముగా తిరిగి వచ్చె. యువరాణి ఉలూచీశ్వరిని మోసగించి అపహరించినాము. ఏమాయె! ఆ భద్రా దేవి రుద్రుని సోదరి వలె మన వెనకే వచ్చి మన నాగ దండును ఛిన్నాభిన్నము గావించె. ఇంతటి సాహస నారిని నేనెచటనూ గాంచ లేదు. ధనుంజయుడు శర పరంపరతో కొందరిని కూల్చినాడు.

ఆఖరికి రథము నుండి ఉలూచీశ్వరిని అశ్వం మీద దోడ్కొని పొమ్మంటి. ఆ ప్రయత్నమును బెడిసి కొట్టినది. అశ్వాలు జచ్చె, సైనికులు జచ్చె. కనీసం అయిదారుగురు సైనికులయినా నాగ దండులో మిగిలారో లేదో తెలీదు. ఏమీ సాధించ లేదు. సర్వం పోగొట్టుకొంటిమి.

ఇంతటి పరాభవమును, ఇంతటి అపజయమును మూట గట్టుకొని రిక్త హస్తములతో ఏ ముఖం బెట్టుకుని మనము నాగ లోకము పోవలె... ప్రభువు నాగ రేడును ఎటుల దర్శింప వలె'' అంటూ అంగలార్చాడు మాయా శృంగుడు.

అప్పటికి బాగా తెల్లవారి పోయినది.

దిన కరుడు బారెడు ఎత్తున గగనతం నుండి కారడవి లోకి తొంగి చూస్తున్నాడు. అశ్వాలు రెండూ దారి తెన్ను లేని కీకార్యణం గుండా ఈశాన్య దిక్కుగా అంగ రాజ్యం సరిహద్దు వైపు పరుగు తీస్తున్నాయి. వక్ర దంతుడు దీర్ఘాలోచనలో వున్నాడు.

''ఏమిరా... నా ఆవేదన విన బడుట లేదా? నీ కర్ణములు వినికిడి శక్తిని కోల్పోయినవా... ఇప్పుడేమి చేయ వలె?'' అరిచాడు మాయా శృంగుడు.

అప్పుడు పెదవి విప్పాడు వక్ర దంతుడు.

''నేను నాగ లోకము వచ్చుట లేదు.'' అన్నాడు స్థిరంగా.

''ఏమంటివి? మన లోకమునకు వచ్చుట లేదా?'' ఒకింత అచ్చెరు వొందుతూ అడిగాడు మాయా శృంగుడు.

''అవును. వచ్చుట లేదు.''

‘‘రాక ఎచటికి పోయెదవు?’’

‘‘ప్రాగ్ జ్యోతిష పురము పోవలె. వచ్చిన నీవును నాతో రావచ్చును. లేదా నీవు నాగ లోకమున కేగి జరిగినది నాగ రేడుకు తెలియ పర్చుము.’’ వక్ర దంతుడి నిర్ణయం మాయా శృంగుని విస్మయ పరిచినది.

‘‘ఏమిరా! మతి తప్పినదా నీ గతి మారినది. ఏమంటివి. ప్రాగ్ జ్యోతిష పురమునకా? ఆ అసోము రాజధానిలో పిశాచమును మించిన మంత్ర గాళ్ళు ఉందురని వింటి. అచటి ప్రజలు వెదకి వెదకి మరీ మన నాగ జాతిని జంపి భక్షింతురట. ప్రమాద కరమగు ఆ నగరమునకు నీవు పోనేల? ఏమున్న దచట?’’ అనడిగాడు.

‘‘అచట జడల మాంత్రికుని కలవ వలె...’’ బదులిచ్చాడు వక్ర దంతుడు.

ఆ నిర్ణయం విని తెరిచిన నోరు`

మూయటం మర్చి పోయాడు మాయా శృంగుడు.

అతి భయంకరుడిగా పేరు పొందిన మహా మాంత్రికుడు ఆ జడల మాంత్రికుడు. కారణం తెలిదు గాని వాడు కొద్ది రోజులు మర్మ భూమి అటవీ ప్రాంతాల్లో సంచరించాడని విన్నాడు. అలాంటి వాడితో వక్ర దంతుడి కేమి పని? ఆలోచిస్తున్న మాయా శృంగుడికి వక్ర దంతుడి మదిలో ఏదో సరి కొత్త దుష్ట పన్నాగం రూపు దిద్దుకుంటోందని సందేహం ఏర్పడిరది.

‘‘అసలు నీ మనసున ఏమున్నదో చెప్పుము. అది విని నేను నీతో వచ్చుటయో, నా దారిన పోవుటయో తెలిపెద.’’ అన్నాడు.

అశ్వాలు కీకారణ్యంలో కొమ్మలు, డొంకలు తప్పించుకొంటూ నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి. కొన్ని లిప్తల కాలం తర్వాత వక్ర దంతుడు తన మనసు విప్పాడు.

‘‘అపజయముకు భయ పడి కూచున్న` కామితములు సిద్ధించవు. అవునా?’’ అడిగాడు.

''అయితే?''




''మన గమ్యమునకు ఒక మార్గము మూసుకు పోయిన ఆ వెను వెంటనే వేరొక మార్గము అన్వేషింప వలె. ఇప్పుడు నా ప్రయత్నము అదే. ఆ రెండో మార్గమే జడల మాంత్రికుడు.''

''నా మట్టి బుర్రకు అంత చప్పున అర్థము గాదు గాని విషమేమిటో వివరముగ    జెప్పుము.''

''నాగ రేడుకు అల్లుడనగుదునేని ఒక్కతే తనయ గావున తదుపరి వారసుడ నేనే గదా. నాగ లోక ఆధిపత్యం నాదేనని సింహాసనమునకు నేనే అధిపతినని ఆశ పడితి. ఇప్పుడా ఆశ నెర వేరదని రూఢమైనది. ఇక నా లక్ష్యం సాధించాలంటే రెండో మార్గం తప్పని సరి.

జడల మాంత్రికుడు గతంలో మర్మ భూమి యందు సంచరించినపుడు వానితో పరిచయమైనది. వాడు పది శిరముల నాగము కొరకు అన్వేషించుచున్నాడు. అలాంటి నాగము మన లోకాధీశుడు నాగ రేడు మహా పద్ముడు తక్క లోకమున వేరొకండు లేడు. ఆ విషయం తెలిసి ఆ మాంత్రికుడు మర్మ భూమిలో అన్వేషణ సాగించినాడు. కాని వాడికి నాగ లోకమునకు మార్గము తెలిదు. నాగ

రాజు భూ లోకమునకు రాక పోకలు సాగించు వేళయు తెలీక విసిగి నిరాశతో మరలి పోయినాడు. అప్పుడు నేను నా గురించి గాని మన గుట్టు మట్టు గాని చెప్ప లేదు.

అసలు విషయమేమనగా, ఈ జడల మాంత్రికునికి భూ లోకమున ఎలాంటి ఆశలు లేవు. అతడి దృష్టి గంధర్వ లోకముపై వున్నది. లోకాధి దేవత మోహినీ శక్తిని ఉపాసించి సిద్ధింప జేసుకుని ఆమె సాక్షాత్కారం పొంది తన అభీష్టం మనవి చేసాడు. అందుకు ఆ శక్తి సమ్మతించి తనకు భూలోకమున పది శిరముల నాగమును గొప్ప హోమం చేసి బలియిచ్చిన నీ కోరిక తీర్చెదనని మాటిచ్చినది.

అసలీ జడల మాంత్రికులు మహా కౄరులు, ప్రమాద కరమగు మహా మాంత్రికులని నాకు తెలియు. వాడి తల మీద జడలు గట్టిన కేశములు ఒక్కోటి ఒక్కో మంత్ర సిద్ధికి గురుతు. వాడిని ఎవరూ సంహరింప లేరు. వాడి ప్రాణం ఎక్కడ నిక్షిప్తం చేసుకున్నాడో ఎవరికీ తెలీదు. వానికి గంధర్వ లోకము అచటి భోగ భాగ్యములన్నీ మక్కువ మిక్కుటము.

వాడు మన నాగ రేడు జాడ రయుటలో విఫలమైనాడు. నేను మన నాగ రేడును వాడికి బంధీని చేస్తే వాడు నాకు మన నాగ లోకాధిపత్యమును యివ్వ గలడు. కాబట్టి నేను ఆ జడల మాంత్రికుని కలిసి మర్మ భూమికి గొని పోవలె.'' అంటూ అసలు గుట్టు బయట పెట్టాడు వక్ర దంతుడు.

వక్ర దంతుడి నిర్ణయం వినగానే కళ్ళు గిర్రున తిరిగి మూర్ఛ వచ్చినంత పనైంది మాయా శృంగుడికి. ఏదో దురాలోచన చేస్తున్నాడనుకున్నాడు గాని వక్ర దంతుడి కన్ను సింహాసనం మీద ఉందని గాని నాగ రాజుకే పొగబెట్టి నాగ లోకాధిపత్యం చేజిక్కించుకోవాలనుకుంటున్నాడని గాని వూహించ లేక పోయాడు.

ఈ కుట్ర గురించి తను వినక పోయినా బాగుండేది. విన్నాడు గాబట్టి ఇక తన దారిన నాగ లోకం పోలేడు. వక్ర దంతుడు సహించడు. వెళితే తన కుట్ర గురించి ప్రభువుకు ఎక్కడ చెప్పేస్తాడోనని సందేహించి తన ప్రాణం తీసే ప్రయత్నం చేయ వచ్చు.

''ఏమిరా! నాతో వత్తువా? నీ దారిన పోదువా?'' అడిగాడు వక్ర దంతుడు.

''మిత్రమా! నీవు రాజైన మహా మంత్రి నేనే గదా. సంతోషమే గదా. ఇనుముతో చేరినందుకు అగ్గికీ సుత్తి దెబ్బ తప్పవన్నట్టు నీతో చేరినందుకు నాకునూ తిప్పలు తప్పవు గదా. నీతోనే నేను'' అన్నాడు మాయా శృంగుడు.

అక్కడితో ప్రయాణం ఆపి పగలంతా విశ్రాంతి తీసుకున్నారు. చీకటి పడగానే అశ్వాలను వదిలి ఇద్దరూ ఆకాశ మార్గాన ప్రాగ్ జ్యోతిష పురం దిశగా సాగి పోయారు.

****************************************

శివ నాగ పురం నుండి మత్స్య దేశ సరి హద్దు దాటి అంగ రాజ్యంలో ప్రవేశించ డానికి వారం రోజులు, ఆంగ రాజ్యం నుండి అసోము రాజ్యం మీదుగా మర్మ భూమి అటవీ ప్రాంతం చేరడానికి మరో వారం రోజులు వెరసి పక్షం దినాలు అశ్వాల మీద ప్రయాణం సాగించాలి. కాని ధనుంజయ, భద్రాదేవిలు పట్టుదలతో ఏక ధాటిగా ప్రయాణం సాగించి ఏడో రోజుకే మర్మ భూమిలో ప్రవేశించారు.

ఆ రోజు నాగదండును నాశన మొనర్చి ఉలూచీశ్వరిని విడిపించాక అంతా శివ నాగ పురం కొండ గుట్టను చేరుకున్నారు. అక్కడ భూతం ఘృతాచి వాగు చెంత శాలి వృక్షం క్రింద వారి కోసం ఎదురు చూస్తోంది.

ధనుంజయుడు భద్రాదేవి, ఉలూచీశ్వరిలు అలుపు తీరా వాగు నీటిలో స్నానాలు చేసారు. రక్త సిక్తమైన దుస్తుల్ని ఉతికి పిండి ఆర బెట్టి పొడిదుస్తులు ధరించారు. తిరిగి కొండ గుట్ట ఎక్కి శివాలయాన్ని చేరుకున్నారు.

ఆ రోజు ఆలయాన్ని తెరిచే రోజే`

కాస్త ఆలస్యమైనప్పటికీ అర్చక స్వాములు వచ్చి`

గుడి తాళాలు తీసారు. ఆలయంలో శివుని అభిషేకించి పూజాదికాలు ఆరంభించారు. ధనుంజయుడు తన ఇరువురు భామలతో భక్తి శ్రద్ధలతో ఆ సదాశివుని సేవించుకుని తీర్ధ ప్రసాదాలు తీసుకున్నారు. శివ నాగ పురం సత్రంలో మధ్యాహ్న భోజనాలు గావించి ఇక బయలు దేరారు.

భూతం ఘృతాచి భద్రా దేవి అశ్వం మీది తోలు సంచి లోను, ఉలూచీశ్వరి శ్వేత నాగు రూపంలో ధనుంజయుని అశ్వం మీది తోలు సంచిలోను విశ్రమించారు. ధనుంజయ, భద్రాదేవులు అశ్వాలను మహా పథంలో శర వేగంతో పరుగులెత్తించారు. ఆ విధంగా ఏడో రోజుకే వీరు మర్మ భూమి అడవి లోకి ప్రవేశించారు.

న్యాయ ధర్మాలు, అక్రమాలు అన్యాయాలు వీటికి ఏ యుగం లోనూ, ఏ కాలంలోనూ కూడ పొసగదు. స్వార్థం మనిషిని అక్రమాలు అన్యాయాలకు నడిపిస్తే, న్యాయ ధర్మాల కోసం పోరాటాలు తప్పవు. గడచిన యుగాల్లో వీటి నడుమ మహా యుద్ధాలే జరిగాయి.

అక్కడ రత్న గిరిలో పరిస్థితి ఏమిటో ఇద మిద్ధంగా ధనుంజయునికి తెలిదు. తన జనకుడి ఆరోగ్యం రోజు రోజుకూ క్షీణిస్తూంటుంది. యుద్ధ ఘంటికలు మ్రోగుతూ వుంటాయి. తను ఎంత త్వరగా దివ్య నాగ మణితో రత్న గిరి చేరుకుంటే అంత మంచిది. తండ్రి గారిని, రాజ్యాన్ని కూడ కాపాడుకో గలడు. అందుకే తొందరగా నాగ లోకం చేరుకోవాలని ధనుంజయుడు వేగిర పడుతున్నాడు. నాగ రాజును ఎలాగోలా ఒప్పించి దివ్య నాగ మణిని సంపాదించాలని ఆరాట పడుతున్నాడు. అందుకు తగ్గట్టే త్వరిత గతిని మర్మ భూమికి చేరుకో గలిగారు. ఎనిమిదో రోజు పొద్దు పొడిచిన కొద్ది సేపటికి యువరాణి ఉలూచీశ్వరి అందరినీ సంపంగి వనానికి తీసుకెళ్ళింది.

విచిత్రంగా అక్కడ ఒంటరిగా శంకు పుత్రి తమ కోసం ఎదురు చూస్తూండటం అందరినీ ఆశ్చర్య పరిచింది. శంకు పుత్రి ముఖం కళ తప్పివుంది. ఆమె ముఖం చూడ గానే ఏదో జరిగిందని అందరికీ అర్థమై పోయింది.

అశ్వం నుంచి ఒక్క దూకులో దిగి`

శంకు పుత్రి చెంతకు పరుగెత్తింది ఉలూచీశ్వరి. వెనకే ధనుంజయుడు, భద్రా దేవి అశ్వాలు దిగి దగ్గర కెళ్ళారు.

‘‘అత్తా! ఏమి జరిగినది? నీ ముఖము వాడి యున్నది. నీ కనుల నీరు చిప్పిల్లుచున్నవి. అందరూ కుశలమే గదా?’’ అనడిగింది ఆత్రంగా.

‘‘లేదు. క్షేమముగా లేరు. నాతో రండి మీకే తెలియు’’ అంది ఖిన్న వదనంతో శంకు పుత్రి.

‘‘ఎవరు క్షేమమున లేరు. అసలేమి జరిగినది?’’ ఉలూచీశ్వరి పట్టుబట్టి అడిగింది. శంఖు పుత్రి కనులు తుడుచుకుంది.

‘‘ఏమి చెప్పుదు? ఎలా చెప్పుదు? నీ జనకుడు నాగరేడు ప్రమాదపు అంచున క్రుందుచున్నాడు. ఎంతో ఉత్తముడు, సమర్థుడని బావించి అల్లుడ్ని చేసుకోవాలని చూసిన వక్ర దంతుడు ఎంత నీచ నికృష్టుడో, ఎంతటి ధూర్తుడో ఇప్పుడు గదా తెలిసి వచ్చినది. వాడు నిజముగా ఆశ పడినది నిన్ను గాదు, నాగ లోక ఆధిపత్యము. ఇక నిన్ను పొందుట అసాధ్యమని గ్రహించి తన ద్రోహ బుద్ధి

చూపించినాడు. ఎవడో మాంత్రికుని వెంట దెచ్చి నాగ రేడును బలి పీఠమున ఉంచినాడు. అచట భయంకర విషాదము నెలకొని వున్నది. ఈ గండము కాయుట ఎవరి వల్లనూ అగునట్లు లేదు. మీరు వస్తే ఏదో విధమున రక్షించెదరని నిరీక్షించుచుంటి. తక్క సమయమునకు వచ్చితిరి. ధనుంజయా! వేగిరము నా వెంట రండు.'' అంటూ కన్నీరు తుడుచు కుని లేచింది శంకు పుత్రి.

నాగ రాజు మహా పద్ముని మూలంగా ఒకప్పుడు శంకు పుత్రి తన ప్రియుని కోల్పోయింది. నాగ లోక ప్రవేశార్హత కోల్పోయి ఎన్నో కడ గండ్ల పాలయింది. అయినప్పటికీ నాగరేడు ఆపదలో వుంటే సంతోష పడ లేదు. వేదన చెంది దుఃఖితురాలయిందంటే ఆమె ప్రభుభక్తి ఎంత గొప్పదో అర్థం చేసుకో వచ్చు. కాని వాస్తవంగా అక్కడ ఏమి జరుగుతుందీ ఎవరికీ అర్థం కాలేదు. ఆమె మాటలు అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురి చేసాయి. నాగ రాజు అంతటి మహా శక్తి సంపన్నుడిని ఒక మాంత్రికుడు బంధీని చేయటమా...?

''నిశ్శబ్ధంగా నాతో రావలె. అచట ఏమి జరుగుచున్నదీ మీరే చూద్దురు గాని.'' అంటూ అక్కడి నుండి కదిలింది శంకు పుత్రి. ధనుంజయుడు భద్రా దేవి అశ్వాలను సంపంగి వనం లోనే చెట్లకు బంధించి తమ ఆయుధాలు తీసుకుని కాలి నడకన బయలు దేరారు. ముఖ్యంగా ఉలూచీశ్వరి తన జనకుని చూడ నెంచి ముందు పోబోతూండగా శంకుపుత్రి, భద్రాదేవిలు ఆమె ప్రయత్నాన్ని అడ్డగించారు.

''ఇప్పుడు ఒంటిగ నీవచటికి పోవుట ప్రమాదము. మేము ఏదో ఒకటి జేసి నీ జనకుని రక్షింతుము గాక. వేగిర పాటు వలదు.'' అంటూ హెచ్చరించింది భద్రా దేవి. అంతే కాదు, ఉలూచీశ్వరి వెళ్ళకుండా చూసుకునే బాధ్యతను భూతం ఘృతాచికి వప్పగించింది. తామర మడుగును చుట్టి అవతలి కొండ పాదం వైపు కదిలారంతా.

అదృష్టవంతునికి అవకాశాలు వెదుక్కొంటూ వస్తాయి. దురదృష్ట వంతునికి వచ్చిన అవకాశాలు కూడ చేజారి పోతూంటాయి. మొదట మాటకు ఉదాహరణ యువరాజు ధనుంజయుడు అనుకొంటే రెండో మాటకు ఉదాహరణ వక్ర దంతుడు అనుకో వచ్చు. ఎన్ని కష్ట నష్టాలు ఎదురైనా న్యాయ ధర్మాలు తప్పక సాహసమే ఊపిరిగా ముందుకు సాగుతున్న వాడు ధనుంజయుడు. వరుస పరాజయాలతో అభాసు పాలై చివరకు వక్ర మార్గంలో నాగ లోక ఆధిపత్యానికే ఆశ పడి తప్పు మీద తప్పు చేస్తూనే వస్తున్నాడు వక్ర దంతుడు. దాని ఫలితమే ఇప్పుడీ క్లిష్ట పరిస్థితి.


ఏమైనప్పటికీ ఇది తమకు కలిసి వచ్చిన అవకాశం గానే భావిస్తున్నారు ధనుంజయ, భద్రాదేవిలు. నాగ రాజును గనుక తాము రక్షింప గలిగితే ఆయన కృపకు పాత్రులైనట్టే. ఉలూచీశ్వరితో బాటు దివ్య నాగ మణి ని కూడ ఇచ్చి సగౌరవంగా తమను అశీర్వదించి పంపిస్తాడు. కాబట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో గలగాలి. ఎట్టి పరిస్థితి లోను నాగ రాజును కాపాడాలి. కాని అక్కడ పరిస్థితి ఏమిటో, ఆ దుష్ట మాంత్రికుడు ఎవరో తెలికుండా వూహా గానాలు చేసి లాభం లేదు. ఆలోచిస్తూనే వడి వడిగా నడుస్తున్నారంతా. ఉలూచీశ్వరి అయితే దారి పొడవునా దుఃఖిస్తూనే వుంది. ఘృతాచి ఆమె ముందుకు వెళ్ళి పోకుండా జాగ్రత్తగా

అనుసరించి వస్తోంది. నిశ్శబ్దంగా ముందుకు సాగుతున్నారంతా.

అక్కడ తామర మడుగు పశ్చిమ తీరంలో సంపంగి వనం ఉండగా, మడుగు తూర్పు తీరాన వుంది ఎత్తయిన కొండ శిఖరం. ఈ కొండ పాదం లోనే తూర్పు దిక్కు నుండి నాగ లోకానికి రహస్య మార్గం వుంది. ధనుంజయ బృందం నిశ్శబ్దంగా మడుగును చుట్టి దక్షిణ భాగంగా కొండ పాదం చేరుకుంది. అక్కడ దట్టమైన చెట్ల మధ్య పొదల్ని అడ్డు పెట్టుకుంటూ కొంత దూరం ముందుకు పోగానే అప్పుడు వారి కంట బడిందా ఘోర దృశ్యం.

సూర్యుని నల్ల మబ్బులు మూసేయటంతో ఎండ జాడ లేదు. అయినా ఆ ప్రదేశం స్పష్టంగా గోచరిస్తోంది. ఎదురుగా కొండ పాదం వద్ద సువిశాలమైన మైదాన ప్రాంతం వుంది. ఆ మైదానం మధ్యలో అతి పెద్దదయిన అగ్ని వలయం ఒకటి కణ కణ రగులుతోంది. ఆ వలయం బయట కొండ పాదం అంతటా అనేక మంది నాగ లోక వాసులు, ప్రముఖులతో నిండి వుంది. అంతా శిలా విగ్రహాల్లా నిలబడి దుఃఖిస్తున్నారు. వాసుకి, తక్షకుడు, కర్కోటకుడు, గుళికుడు, మహా గుళికుడు, శంఖుడు మొదయిన ప్రముఖులంతా ఉండీ మంత్ర బద్ధులయి ఏమీ చేయ లేని నిస్సహాయ స్థితిలో కన్నీళ్ళతో చూస్తున్నారు. వారి ముందు శోక తప్త అయిన నాగ రాణి కీర్తి మతి కొంగు చాపి తన భర్తను కాపాడమని ధీనంగా అందరినీ అర్థిస్తున్న దృశ్యం గుండెల్ని కదిలించేలా వుంది.

అగ్ని వలయం కుడి పక్కన పెద్ద రాతి స్థంభం వుంది. దానికి చేర్చి కనిపించని బంధనాలేవో తనను కట్టి పారేసినట్టు భారీ సర్ప రూపం లోని నాగ రేడు మహాపద్ముడు బంధితుడై వున్నాడు.




పది శిరస్సుల సర్పరేడు. ఒక్కో శిరస్సు పైన దివ్య కాంతులు వెదజల్లుతూ నాగ మణులు ప్రకాశిస్తున్నాయి. మంత్ర బద్ధుడై నిస్సహాయ స్థితిలో ఆ సర్ప రేడు కనులు కన్నీరు వర్షిస్తున్నాయి.

ఆయనకు ఎదురు గానే పదడుగుల దూరంలో హోమ గుండం ఒకటి కణకణా రగులుతూ జ్వాలలు ఎగసి పడుతున్నాయి. దాన్ని చుట్టి ఏవో చిత్ర విచిత్రమైన రంగ వల్లికలు... వాటి మీద పసుపు కుంకుమ దట్టంగా చల్ల బడి ఎర్రటి పూలతో బీభత్సంగా ఉన్న ఆ హోమ గుండం ముందు నిలబడున్నాడు జడల మాంత్రికుడు. మనిషే విచిత్రంగా భయానకంగా వున్నాడు. సుమారు పదడుగుల పొడవున సన్నగా వున్నాడు. మసి బొగ్గు రంగు దేహ ఛాయ. పొట్ట వెన్నుకు అతుక్కుందాన్నట్టు లోపలికుంది. నెత్తురు వర్ణం లోని ఎర్రటి పంచె అంగీలా చుట్టుకున్నాడు. అది మోకాళ్ళ కింది వరకే వుంది. నడుంకి తెల్లటి వెండి బిళ్ళలతో కూడిన పట్టీ బిగించాడు. వంటి మీద మరే ఆచ్ఛాదనా లేదు. మెడలో ఎరుపు నలుపు కలగలిసిన పూసల దండలున్నాయి. కాలికి వెండి లోడా, ఒక చేతికి వెండి కడియం, మెడలోను భుజాలకు వెండి ఆభరణాలున్నాయి. అవి చూడ్డానికి ఆభరణాల్లా వున్నప్పటికీ అవి మంత్ర యంత్ర సమన్వితమై మహిమ కలిగినవి. ముఖాన రక్త వర్ణంలో పెద్ద బొట్టు వుంది.

వాడి జుత్తు ఒత్తుగా అనేక జడలు కట్టి భుజాల మీదకు వేలాడుతోంది. గుబురు మీసం... బవిరి గడ్డం... జుత్తు రాగి రంగులో ఉండి

అతడి వయసు ఎంతో అంచనా వేయటం కష్టం. తల విదిలించినప్పుడంతా జడ నుండి సన్నటి నిప్పు రవ్వలు రాలుతున్నాయి. సాధారణ మాంత్రికులకు జడల మాంత్రికులకు ఇదే తేడా. మాంత్రికులకే మాంత్రికుడన తగ్గ శక్తిమంతుడు ఈ జడల మాంత్రికుడు.

హోమ గుండాన్ని చేర్చి పొడవాటి ఖడ్గం. ఒకటి పసుపు కుంకుమలు పూసి నిల బెట్ట బడి వుంది. అది బలి ఖడ్గం. నాగ రేడును బలి ఇచ్చేందుకు సిద్ధంగా వుంచ బడింది. జడల మాంత్రికుని పక్కన మూడు కోణాలకు మూడు నిమ్మకాయలు గుచ్చ బడిన త్రిశూలం ఒకటి భూమిలో గుచ్చి నిల బెట్టి వుంది. జడల మాంత్రికుడు గుగ్గిలం పసుపు కుంకుమలు హోమ గుండం లోకి గుప్పిళ్ళతో విసురుతూ మంత్రోచ్చాటన చేస్తూ ఆకాశం వంక చూసి తను ఉపాసించే గంధర్వ లోకాధి దేవత మోహినీ శక్తిని ఆవాహన చేస్తున్నాడు.

వక్ర దంతుడు, పొట్టి మాయా శృంగుడు ఇద్దరూ అగ్ని వలయంలో మాంత్రికుడి సమీపం లోనే వున్నారు. అప్పుడే తను నాగ లోకాధి పతి అయినట్టు బోర విరిచి నిలబడి సగర్వంగా అవతల నిస్సహాయంగా చూస్తున్న నాగ లోక వాసుల్ని వీక్షిస్తున్నాడు. ఇక తనకు తిరుగు లేదన్న ధీమా వాడి నిశిత చూపుల్లో స్పష్టంగా కన్పిస్తోంది.

అయితే మాయా శృంగుడు మాత్రం ఎప్పుడేం జరుగుతుందోనన్న భయంతో బితుకు బితుకు మంటూ చూస్తున్నాడు. ఈ బలి వ్యవహారం ఏదో వేగిరం ముగిస్తే బాగుండునని వుంది వాడికి. ఎందుకంటే` వక్ర దంతుడు ఏది తల పెట్టినా అపజయమే గాని విజయమన్నది ఇంత వరకు లేదు. ఇప్పుడు కూడ అనుకున్నది అనుకున్నట్టు త్వరితము గా జరగాలి. లేదంటే ఎప్పుడే అవాంతరం వచ్చి పడుతుందో తెలీదు. ఆ పైన ఆ ధనుంజయుడు, భద్రా దేవి, ఉలూచీశ్వరి అంతా నేరుగా నాగ లోకం చేరటానికి వచ్చేస్తూంటారు. వాళ్ళు వస్తే కథ అడ్డం తిరిగినట్టే. ఏదో ఒకటి చేసి నాగ రాజును విడిపించగల సమర్థులు. అందుకే భయ పడుతున్నాడు మాయా శృంగుడు.

ఇక్కడ యిలా వుండగా`

అక్కడ పొదల వెనక నుండి జరుగుతున్నదంతా చూస్తున్న ధనుంజయ బృందానికి ఏం చేయాలో, ఎలా నాగ రేడును కాపాడాలో అర్థం గావటం లేదు. తన తల్లిదండ్రులకు పట్టిన దుర్గతిని జూచి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది యువరాణి ఉలూచీశ్వరి. భూతం ఘృతాచి తో బాటు శంకు పుత్రి చెరో పక్కన వుండి ఆప బట్టి గాని లేకుంటే ఉలూచీశ్వరి తండ్రి వద్దకు పరుగెత్తి తను కూడ ప్రమాదం బారిన పడి వుండేది.

ధనుంజయుడు భద్రా దేవి వంక చూసాడు.

అప్పటికే ఆమె దీర్ఘాలోచనలో కనులు మూసుకొని వుంది. ఇలాంటి విషయాల్లో ఆమె సలహా సంప్రదింపులు లేకుండా తను తొందర పడి ఏమీ చేయ లేడు. చూస్తే వాడు మహా మాంత్రికుడిలా వున్నాడు. మహా మహుల నాగ లోక వాసుల్నే నియంత్రించి నాగ రేడునే బంధించాడంటే తను వేసే బాణాల వలన ప్రయోజనం లేక పోగా తమ ఉనికి మాంత్రికుడికి తెలిసి పోయి తాము కూడ ఆ

దుష్టుడికి బంధీలుగా చిక్కే ప్రమాదం వుంది. అందుకే తొందర పడ్డం లేదు ధనుంజయుడు. ఈలోపల`

భద్రా దేవి తన మనసును కర్ణేంద్రియాలను లగ్నం చేసి గతం గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. వాడు జడల మాంత్రికుడు. సందేహం లేదు, తన తండ్రి అరుణ భట్టారకుని దయ, కృషి మూలంగా చిన్న వయసు నుండే అనేక మంత్ర సిద్ధులు పొందడమే గాక మాంత్రికులకు సంబంధించి గ్రంథాలనూ చదివింది. వాటిలో జడల మాంత్రికుల గురించి చదివిన వివరాలు గుర్తుకొస్తున్నాయి. ముఖ్యంగా ఆ విషయంగా తన తండ్రి చెప్పిన మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.''చూడు పుత్రీ! నీవు ఎప్పుడు గాని, ఎక్కడ గాని భవిష్యత్తులో పొరబాటున కూడ ఈ జడల మాంత్రికుల జోలికి పోవలదు. వాళ్ళు అతి కౄరులు. మహా ప్రమాద కారులు. ఘటనా ఘటన సమర్థులు. ఒక జడల మాంత్రికుని ఎదిరింప మరో జడల మాంత్రికుడే సమర్థుడు. సాధారణముగా వీళ్ళు తమ ప్రాణ పక్షిని గొంతులో నిక్షిప్తం జేసుకుందురు. కావున వీళ్ళ శరీర బాగాలను ఖండించినా తిరిగి యథా ప్రకారము అతుక్కొని తృటిలో పునర్జీవితులు కాగలరు.

అలాగని వీళ్ళకి చావే లేదా అంటే వున్నది. ఎవరైనా సాహసికుడైన వీరుడు వాడు గమనించక ముందే శిరస్సును ఖండించాలి. ఖండిత శిరస్సు నేల బడ కూడదు. నేలను తాకిన మరు క్షణమునే అది చెండులా చివ్వున లేచి మొండమునకు అతుక్కుని పునర్జీవితుడవుతాడు. కావున ఖండిత శిరస్సు గాలిలో వుండగానే అది నేరుగా పోయి అగ్గిలో బడి కాలి పోయేలా చూడాలి. ఈ లోపలే మరో ప్రక్క వాడి మొండెమునకు అగ్గి ముట్టించి అది కూడ కాలి పోయేలా చూడాలి. ఆ విధంగా చేసినచో ఈ జడల మాంత్రికులు జత్తురు. వాడి జడలు అగ్గిన బడి కాలి పోతున్నప్పుడు చిట పట లాడి పోతూ వాడి మంత్ర శక్తులు సర్వం తొలగి పోతాయి. ఎంతో సాహసము, ధైర్యముగ వీరులు తప్ప ఈ కార్యమును అన్యులు చేయ జాలరు.''

ఆ విధంగా`

ఒకప్పుడు తన జనకుడు చేసిన హిత బోధ గుర్తుకు రాగానే చప్పున కనులు తెరిచింది భద్రా దేవి. అది గమనించిన ధనుంజయుడు వెంటనే` ''భద్రా! ఒక్క బాణంతో ఆ దుష్ట మాంత్రికుని తల తృంచ గలను. ఏమి చేయ వలె? చెప్పుము.'' అనడిగాడు.

''త్వరితముగ మీరే ఏదో ఒకటి జేసి ఆ దుర్మార్గుని అంతమొందింప వలె. లేకున్న వాడు మా నాగ రేడును అన్యాయముగ బలి ఇచ్చు లాగున వున్నాడు.'' అంది ఆత్ర పడుతూ శంఖు పుత్రి.

''ఆత్ర పడిన పనులు కావు శంఖు పుత్రి. వేచి వుండ వలె... లేకున్న వాడు మన విడువడు.'' అంటూ హెచ్చరించి, ధనుంజయుని

వంక చూసింది.

భద్రా దేవి తెలిపిన సమాచారం విని ధనుంజయుడే కాదు, శంకు పుత్రి, ఉలూచీశ్వరిలు కూడ అచ్చెరు వొందారు. ధనుంజయుడు తన విల్లు అందుకుంటూ` ''దీనికింత చింతయేల భద్రా! ఏక కాలమున రెండు శరములు ప్రయోగించెద. అర్ధ చంద్రాకార బాణము వాడి శిరస్సును ఖండించగా, అగ్ని సెగలతో కూడిన రెండో బాణము వాడి శరీరమున నాటుకొని నిప్పు పెట్టగలదు. వరుస బాణాతో వాడి శిరస్సు నేల బడకుండా నేరుగా హోమ గుండంలో పడునట్టు జేసెద'' అన్నాడు.

''వూహుఁ... సఖుడా.... భగ భగ మండుతూ దూసుకు వెళ్ళు బాణము అధిక శబ్దము సృష్టించి జడల మాంత్రికుని దృష్టి నిటు మళ్ళించును. ఒక పరి వాడు తప్పించుకున్న ఇక ఏమీ చేయ లేము. ఇది ఒకరి వల్ల అగు కార్యము గాదు'' అంది భద్రా దేవి.

''అనగా నీవునూ....''

''అవును. నేను ఈటె మొనకు వస్త్ర భాగము చుట్టి మండించుటకు సిద్ధ పరిచెద. పిమ్మట వాడి శిరము సంగతి మీరు చూచు కోవలె. ఒకే బాణమునకు వాడి శిరము తెగి గాలి లోకి లేవాలి. ఆదే సమయమున నేను ఈటెతో బయలు దేరద. బాణ ప్రయోగము జేసిన వెంటనే మనము బయలు దేర వలె. వాడు పూజ ముగించి నాగ రేడును బలి ఇచ్చుటకు బలి ఖడ్గమును అందుకొను తరుణము మనకు అనుకూలము. వాడి దృష్టి పూర్తిగా ఖడ్గ మందు లగ్నమై యుండును'' అంటూ వివరించింది.

అంత వరకు ఆ దుష్ట మాంత్రికుని నిర్జించుట ఎలాగని చింతిస్తున్న ధనుంజయునికి భద్రా దేవి మాటలు ఒక వరంలా తోచాయి. తనకో మార్గము చూపిన్చినట్టుంది. ఆ విధంగా`

ధనుంజయ భద్రాదేవి లిరువురూ జడల మాంత్రికుని అంతం జేసి నాగ రేడును రక్షించేందుకు సంసిద్ధులవుతూ తక్క సమయం కోసం జాగ్రత్తగా ఎదురు చూడ సాగారు.

ఈ లోపల`

అక్కడ అగ్ని వలయంలో`

హోమ గుండం ముందు`

జడల మాంత్రికుడు గంధర్వ లోకాధి దేవత యగు మోహినీ శక్తికి నిర్వహిస్తున్న పూజా కార్యక్రమం ముగింపు కొచ్చింది. అంత వరకు తన వికృతమైన గొంతుతో జరుపుతున్న మంత్రోచ్ఛారణ ముగించాడు. అయితే బలి ఖడ్గాన్ని వెంటనే తీసుకో లేదు. వెను తిరిగి అగ్ని వలయం వెలుపల నాగ లోకం వెళ్ళే గుహ మార్గం పరిసరాలు మొత్తం నిలుచుని   దిక్కు తోచక ఆశ్రు నయనాలతో చూస్తున్న నాగ లోక వాసుల వంక చూసాడు.

ఒక చేత్తో వక్ర దంతుని దగ్గరకు తీసుకుని భుజం తట్టాడు. ఎలుగెత్తి నిశితంగా చూస్తూ` ''ఓ సర్ప జాతి ప్రజలారా! నాగ లోక వాసులారా. మీరంతా శ్రద్ధగా ఆలకించవలె. మీ ప్రభువు నాగ రేడును చివరి సారిగా దర్శించుకోండి. ఎందుకంటే కొద్ది సమయం లోనే నేను ఆయనను మోహినీ శక్తికి బలి యివ్వనుంటి. ఇక నుండి మీ నాగ లోకమునకు ప్రభువు, కొత్త నాగ రేడు ఈ వక్ర దంతుడు.'' అంటూ ప్రకటించాడు.

ఆ ప్రకటన వినగానే నాగ జనంలో వక్ర దంతుడికి అనుకూలురైన కొంత మంది ఉత్సాహంతో చప్పట్లు చరిచి అభినందించారు. వక్ర దంతుని వదిలి జడల మాంత్రికుడు తీవ్రంగా చూస్తూ ఇంకా ఇలా హెచ్చరించాడు.

''నేను ఆ బలి కార్యక్రమము ముగించు కొని గంధర్వ లోకము పోవుటకు ముందు, నా శక్తులు కొన్ని ఈ వక్ర దంతుని వశం జేసి పోయెద. ఇతడి ఆధిపత్యమును మీలో కొందరు ఆమోదించిన చాలదు. మీరంతా ఆమోదించి విధేయులయి వుండ వలె. కాదని ఎదిరించు వారిని అజేయుడగు వక్ర దంతుడు నిర్దయగా హతమార్చ గలడు. ఇది నా శాసనము. ఆన. ఇక నుండి, ఈ క్షణము నుండి మీ నాగ లోకాధిపతి వక్ర దంతుడు.'' అంటూ పెద్ద స్వరంతో ప్రకటించాడు.

ఆ ప్రకటన వినగానే`

మహా రాణి కీర్తి మతి గొల్లున విలపిస్తూ`

ఒక్క సారిగా మూర్ఛిల్లి నేల కూలినది.

నాగ రేడు మహా పద్ముడు కళ్ళ ముందు జరుగుతున్నదంతా చూస్తూ కన్నీరు విడుస్తున్నాడు. ఇక తన చావు నిక్కమని తెలిసి తను ఆరాధించు దేవతలను తలచుకో సాగాడు.

ఇక జడల మాంత్రికుడు బలి నిర్వహించేందుకు సంసిద్ధుడయ్యాడు. రెండు చేతులలో పొడవాటి ఖడ్గాన్ని అందుకున్నాడు.

రెండు చేతులలో బలి ఖడ్గాన్ని లేపి ముందుగా హోమ గుండానికి నమస్కరించాడు. భగ భగ మండుతూ అగ్ని కీలలు మరింత పైకి లేచాయి. తదుపరి ఆకాశం వంక చూసి తను సమర్పిస్తున్న బలిని స్వీకరించి తనకు గంధర్వ లోకాధి పత్యం వరంగా యిమ్మంటూ కనులు మూసుకుని మోహిని శక్తిని అర్థిస్తూ నమస్సులర్పిస్తున్నాడు. అప్పుడు... సరిగ్గా అప్పుడు జరిగిందా సంఘటన. ఎవరూ వూహించని ఒక మహాద్భుతం జరిగింది.

దక్షిణం వైపు పొదల మాటు నుండి తళ తళా మెరుస్తూన్న అర్ధ చంద్రాకారపు బాణం ఒకటి మెరుపు వేగంలో దూసుకొచ్చింది. గాలి శబ్దానికి ఉలికి పడి జడల మాంత్రికుడు తల తిప్పే లోన ఆ బాణం వాడి మెడ భాగాన్ని నరికి తలను గాల్లోకి ఎగుర వేసింది.



ఎగిరిన తల కిందకు జారే లోపలే మరో బాణం దూసుకొచ్చి ఆ తలను మరింతగా గాల్లో ఎత్తుకు లేపింది. బాణాల వెంబడే బాణం మీద బాణం ప్రయోగిస్తూ శర వేగంతో దూసుకొస్తున్న ధనుంజయుని అప్పుడు చూసారంతా.

ఎప్పుడైతే మాంత్రికుడి తల మొండెం నుండి వేరైందో ఆ మరు క్షణమే కణ కణ రుగులుతున్న అగ్ని వలయం చుట్టూ ఎవరో నీరు పోసి ఆర్పినట్టు చప్పున ఆరి పోయింది. తల లేని మొండెంగా నిల బడున్న మాంత్రికుడు రోదిస్తున్నట్టుగా గుండెలు బాదుకోవటం చూసి నివ్వెర పోయారంతా. అదే క్షణంలో ధనుంజయుని వెనకే ఆడు చిరుతలా ఈటె పుచ్చుకుని రంకె వేస్తూ దూసుకొస్తున్న భద్రా దేవిని చూసి మతి పోగొట్టుకున్నారు. అసలక్కడ ఏం జరుగుతుందో కొద్ది సేపు నాగ లోక వాసులకి అర్థం కాలేదు. అయితే తాము ఇంత మంది ఉండీ చేయ లేని కార్యాన్ని ఒక సాహస వీరుడు సాధించాడు. నాగ రాజు కాపాడ బడుతున్నాడని గ్రహించి ఆనంద బాష్పాలు రాలుస్తున్నారు.

భగ భగ మండుతున్న ఈటెలతో అగ్గి పిడుగులా దూసుకొస్తున్న భద్రా దేవి ఆరి పోయిన అగ్ని వలయాన్ని చెంగున ఒక్క దూకులో దాటింది. అక్కడి నుంచే ఈటెను గురి చూసి మాంత్రికుని ఛాతీ మీదకు బలంగా విసిరింది.

తృటిలో అది దూసుకెళ్ళి మాంత్రికుడి ఛాతీ లోకి బలంగా దిగ బడింది. ఈటె నాటుకున్న విసురుకు తూలి వెల్లికిలా పడి పోయింది మొండెం. ఛాతీ మీద ఈటె భాగం తగల బడుతోంది. భద్రాదేవి వస్తూనే పక్కన పళ్ళెంలో వున్న గుగ్గిలం పసుపు కుంకుమల్ని వాడి మీద వెదజల్లింది. అంతే ` మాంత్రికుడి శరీరం భగ భగా మంటల్లో చిక్కి ఒక్క సారిగా తగల బడి పోనారంభించింది. అయినా సరే `

నెత్తుటి మడుగులో తగల బడుతున్నా వాడి చేతులు ఛాతీని కొట్టుకోవటం ఆపలేదు. అంటే ` శిరస్సు నశిస్తే గాని వాడి ప్రాణాలు పోవని గ్రహించింది భద్రా దేవి. అవతల ధనుంజయుడు మాంత్రికుడి శిరస్సు పైనే గురి వుంచి హోమ గుండాన్ని చుట్టి పరుగెడుతూ బాణాలు సంధించి శిరస్సుతో చెండాడుకొంటున్నాడు. అది హోమ గుండానికి నేరుగా వచ్చేలా చూస్తున్నాడు. అతడి వేగం, ధనుస్సు ఎక్కు పెట్టి బాణాలు సంధిస్తున్న తీరు నాగ లోక వాసుల్ని అబ్బుర పరుస్తున్నాయి. ఈ లోపల `

సర్రున ఒర నుంచి ఖడ్గం దూసింది భద్రా దేవి.

మాంత్రికుడి మొండాన్ని కాలితో తొక్కి పట్టి రౌద్రంగా చూస్తూ ` ''నాగ రేడునే బలి యిచ్చెదవురా శునకమా! నీలాటి నీచునికి గంధర్వ లోకాధిపత్యము కావలెనా? నీ మరణంతో ఇక్కడే గాదు, గంధర్వ లోక వాసులూ అదృష్టవంతులవుతారు. ఇంకా ఎంతసేపు కొట్టుకొనెదవురా... చావుమురా'' అంటూ ఆవేశంతో ఆ మొండెం నుండి కాలు చేతుల్ని నరికి వేరు చేసింది.

ఇక్కడ అందరి కన్నా మిక్కుటంగా అమితాశ్చర్యంతో బాటు హతాశుడై చేష్టలు దక్కి చూస్తున్నవాడు వక్ర దంతుడు. పక్కనున్న మాయా శృంగుడికైతే మతి లేదు. చివరికి భయ పడినంతా అయింది. ధనుంజయ, భద్రా దేవి ప్రవేశంతో కథ మొత్తం మారి పోయింది అనుకుంటూ నేలకు పాతిన కొయ్యలా ఏం చేయాలో తోచక చేష్టలు దక్కి చూస్తున్నాడు. వక్ర దంతుడికైతే నాగ లోకాధిపతి కావాలన్న తన కల కళ్ళ ముందే కరిగి పోతున్నట్టుంది. జడల మాంత్రికుడు చావ కూడదు. ఏదో ఒకటి చేయాలి. ధనుంజయుడు ఆ తలను నేల బడకుండా చూస్తున్నాడంటే అది కింద పడితే మాంత్రికుడు బ్రతుకుతాడేమో... చివరి ప్రయత్నంగా అడ్డం పడేందుకు ధనుంజయుని వైపు కదులుతూ అక్కడ పడున్న బలి ఖడ్గం అందుకున్నాడు.

మరో రెండు బాణాలతో గాలి లోకి మాంత్రికుడి శిరస్సు నేరుగా అగ్ని గుండంలో పడి పోగలదు. కాని వక్ర దంతుడు అడ్డం పడితే సాధ్యం గాదు. ఓ పక్క బాణాలు సంధిస్తూ వాడి ఖడ్గం నుంచి తప్పించు కోవటం దుస్సాధ్యం. ఓర కంట వాడ్ని గమనించ గానే

ధనుంజయుని కోపం తారా స్థాయికి చేరుకుంది.. వెంటనే` ''భద్రా!'' అనరిచాడు.

''ఈ గుంట నక్క సంగతి చూడుము. ఆ రోజు నీ నుంచి తప్పించుకున్నాడు. ఇప్పుడు నీ చేతిలో చావు తప్పదు. వాడిని వదలకుము'' అంటూ హెచ్చరించాడు.

ధనుంజయుని పిలుపులో చివ్వున అటు తిరిగింది భద్రా దేవి. బలి ఖడ్గంతో ధనుంజయునే అంతం చేయాలని దూకుతున్న వక్ర దంతుని చూడగానే కోపంలో నిప్పు కణంలా మారిందామె. నెత్తురోడుతున్న ఖడ్గంతో శర వేగంగా పరుగెత్తి వక్ర దంతుని మార్గానికి అడ్డంగా నిలిచింది. ఒకే వేటుతో వాడి చేతిలో బలి ఖడ్గం జారి పోయేలా చేసింది. అదే సమయంలో ధనుంజయుని కృషి ఫలించింది. గాలి లోని మాంత్రికుడి శిరస్సు గింగిరాలు తిరుగుతూ వచ్చి నేరుగా హోమ గుండంలో పడింది. అంతే`

వాడి జడలను అగ్ని కీలలు ఆబగా కబళించనారంభించాయి. చిట పట పేలుతూ మాంత్రికుడి జుత్తుతో బాటు తల దగ్ధం గానారంభించింది. సరిగ్గా ఇక్కడే ఒకింత గందరగోళ పరిస్థితి నెలకొంది.

బలి ఖడ్గం చేజార గానే వక్ర దంతుడు ప్రాణ భయంతో భద్రా దేవికి దూరంగా పారిపో నారంభించాడు. వాడ్ని వదిలే వుద్దేశం ఆమెకు లేదు. వెంటడింది. ఇక్కడ ఎప్పుడైతే జడల మాంత్రికుడి జడలు అగ్నిలో తగల బడటం ఆరంభమైందో మరు క్షణం వాడి మంత్రశక్తులూ అంతరించ నారంభించాయి. దాంతో అంత వరకు బండకు బంధితుడై వున్న నాగ రేడుకు విముక్తి లభించింది. వెంటనే పది శిరముల సర్ప రూపం నుండి తన గంభీర పురుషాకృతి ధరించి గద భుజాన వేసుకున్నాడు. అటు అంత వరకు నేలకు పాతిన కొయ్య బొమ్మల్లా వున్న నాగ లోక వాసుకూ విముక్తి లభించి కదిలారు. వారి లోని వక్ర దంతుని మద్దతు దారులు సుమారు యాభై అరవై మంది వరకు భద్రా దేవి నుంచి వక్ర దంతుని కాపాడేందుకు ఆయుధాలు ఝుళిపిస్తూ కేకలు అరుపులతో పరుగులెత్తుకు రాసాగారు.

భద్రా దేవి ఖడ్గ ప్రహరా నుంచి రెండు మార్లు తప్పించుకున్న వక్ర దంతుడు ఇక భద్రా దేవి తనను విడువదని అర్థం కాగానే ప్రాణ భయంతో తప్పించుకోడానికి అదృశ్యమై ఆకాశ మార్గం వైపు పోబోయాడు. కాని భద్రా దేవి తన మంత్ర శక్తితో వాడిని కిందకు లాగింది. గాలి లోనే అదృశ్య శక్తి క్షీణించి దబ్బున క్రింద పడ్డాడు వక్ర దంతుడు.

''ఇంత జేసి ఎచటకు పారి పోయెదవురా నీచుడా! ఆనాడు నా సఖుడు ధనుంజయుల వారు ప్రాణ భిక్ష పెట్టగా తప్పించుకొంటివి. వారినే వధింప కత్తి లేపిన నిన్ను క్షమింప. ఇక నీవు తప్పించుకో లేవు. నీవు చావక తప్పదు'' అనరుస్తూ తన వైపు దూసుకొస్తున్న భద్రా దేవిని చూసి వణికి పోతూ చివ్వున లేచి తన కోసం వస్తున్న మద్దతు దారుల మధ్యకు పరుగు తీసాడు. అయినా వదల్లేదు. ఛురిక తీసి విసిరింది. గాలిని చీల్చుకు దూసుకెళ్ళిన ఛురిక వక్ర దంతుని వీపు భాగంలో పడి వరకు దిగ బడి పోయింది. 'కెవ్వున' అరిచి బోర్లా పడి పోయాడు వక్ర దంతుడు. పడి లేచే లోన సుడి గాలిలా వచ్చిన భద్రా దేవి ఒకే వేటుతో వాడి తల నరికేసింది. అంతే కాదు, వాడికి మద్దతుగా వచ్చిన నాగుల మీద వీరావేశంతో విరుచుకు పడి వీర విహారం చేయనారంభించింది. ఆమెకు అండగా వెనకే ధనుంజయుడు రావటంతో సంకుల సమరం ఆరంభమైంది. మరో ప్రక్క వారికి సాయంగా నాగ రేడు కూడ గదాయుధంతో దొరికిన వాడ్ని దొరికినట్టు పచ్చడి చేస్తూ పోరాటం లోకి వచ్చేసాడు. ఉన్నట్టుండి` ''ధనుంజయా....'' అనరిచాడు.

''వక్ర దంతుడి సాయ పడిన మాయాశృంగుడు తప్పించుకుని గగన మార్గంగా పారిపోవుచున్నాడు. వాడిని నేలకూల్చుము'' అంటూ హెచ్చరించాడు.

స్వయంగా నాగ రాజే తనను పిలిచి హెచ్చరించటం ధనుంజయునికి ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చింది. వెంటనే ఆకాశం వంక

చూస్తూ ధనుస్సు ఎక్కు పెట్టాడు. అప్పటికే చాలా దూరం పైకి వెళ్ళి పోయాడు మాయా శృంగుడు.

బాణాన్ని చెవి వరకు లాగి గురి చూసి వదిలాడు ధనుంజయుడు. అతడి గురి తప్పదు. తుమ్మెదలా ఝుంకారం చేస్తూ దూసు కెళ్ళిన బాణం ఏట వాలుగా మాయా శృంగుని వీపు భాగం నుండి గుండె ల్లోకి దూసుకు పోయింది. వాడి చావు కేకలతో ఆ ప్రాంతం మారు మ్రోగింది. గాల్లో ఉండ గానే వాడి ప్రాణాలు ఎగిరి పోగా శరీరం గిరికీలు కొడుతూ వచ్చి హోమ గుండంలో పడి దగ్ధం గా నారంభించింది.

ఈ లోపల నాగ లోక సైనిక దళం బిల బిలా దూసుకొచ్చి ఆ ప్రాంతాన్ని చుట్టు ముట్టింది. అరుపులు ఆర్తనాదాలు కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లనారంభించింది. ఇంతలో` ''అక్కా!'' అంటూ యువ రాణి ఉలూచీశ్వరి పెద్దగా అరవటం విన్పించి తృళ్ళి పడింది భద్రాదేవి. ధనుంజయుని వంక చూసింది. శతృ సంహారంలో నెత్తు రొడుతున్న ఖడ్గంతో ఎర్ర బడిన దుస్తులతో అగ్ని కీలలా ప్రకాశిస్తోంది భద్రా దేవి.

''భద్రా! వీళ్ళ సంగతి మేము జూచెదము. నీవు ఉలూచి వద్దకు పోయి ఏమి జరిగినదో చూడుము'' ఓ పక్క పోరాడుతూనే చెప్పాడు ధనుంజయుడు.

వెంటనే అటు యిటు ఉన్న శత్రువుల్ని ఖడ్గంతో చెండాడి మార్గం జేసుకుని పోరు మొన నుండి బయట పడి ఉలూచీశ్వరి కోసం పరుగెత్తింది భద్రా దేవి.

ఈ పరిస్థితిలో ఓ పక్క నాగ రేడు ఉగ్ర రూపంతో తన గదాయుధంతో విజృంభించగా మరో వంక ధనుంజయుడు తన ఖడ్గ ప్రహరాతో పూచ కోత కోస్తున్నాడు. మొదట వక్ర దంతుని మద్ధతు దారులు యాభై అరవైకి మించరనుకుంది పోరబాటే. సుమారు మూడు వందల మందికి పైగా ఉంటారు. ఇక నాగ భటుల ప్రవేశంతో వాళ్ళు కూడ దొరికిన వాళ్ళను దొరికినట్టు వధించ సాగారు. వక్ర దంతుని మరణంతో చాలా మంది పారి పోవాని చూసారు గాని ఎవరినీ వదిలే ఉద్దేశం లేదు. చూస్తూండగానే వాళ్ళ సంఖ్య తరిగి పో నారంభించింది.

ఇలా వుండగా`

అంతకు ముందే`

ఆరంభంలో ఎప్పుడైతే ధనుంజయ భద్రాదేవిలు పొదల వెనక నుండి జడల మాంత్రికుని వైపు కదిలారో ఆ వెను వెంటనే ఉలూచీశ్వరి తెలివి తప్పి పడున్న తన తల్లి కీర్తి మతి వద్దకు పరుగెత్తింది. ఆమె ననుసరించి శంఖు పుత్రి , భూతం ఘృతాచి వెళ్ళారు.

మహా రాణి కీర్తిమతి గాఢమైన మూర్ఛలో ఉలుకు పలుకు లేకుండా పడుంది. ఉలూచీశ్వరి తల్లి తలను ఒడిలోకి తీసుకుంది. ఆమె పరిస్థితికి ఆందోళన చెందింది. భూతం ఘృతాచి తృటిలో మడుగు వద్దకెళ్ళి నీరు తెచ్చింది. నీరు ముఖాన చల్లారు, బుగ్గలు తట్టారు, గాలి విసిరారు, శంఖు పుత్రి మహా రాణి పాదాలు రుద్దింది. ఎన్ని ఉప చర్యలు చేసినా మహా రాణికి తెలివి రాలేదు. ఈ లోపల మాంత్రికుడి శిరస్సు అగ్నిలో పడగానే వాడి మంత్ర శక్తి తొలగి నాగులు చైతన్యవంతుయ్యారు. రాజ కుటుంబానికి చెందిన స్త్రీలు, పరిచారికులు అంతా గుమి గూడి మహారాణి పరిస్థితికి విచారించ సాగారు. భద్రా దేవిని పిలిస్తే గాని పరిస్థితి చక్క బడదనుకుంది ఉలూచీశ్వరి. కాని అక్కడ హోరా హోరీ పోరులో వున్న భద్రా దేవిని పిలవాలా వద్దా అర్థం కాలేదు. కాని ఆత్రుత ఆపుకో లేక చివరికి ''అక్కా'' అంటూ ముమ్మారు ఎలుగెత్తి పిలిచింది.

ఆ పిలుపు వినగానే ధనుంజయుని సలహాతో పోరాటం నుంచి బయట పడి నేరుగా అక్కడికి పరుగెత్తు కొచ్చింది భద్రా దేవి. నెత్తురోడుతున్న ఖడ్గాన్ని ఒరలో వుంచుతూ అగ్ని పుష్పంలా వస్తున్న భద్రా దేవిని అబ్బురంగా చూస్తూ నాగ స్త్రీలంతా దారి వదిలారు.

"ఏమైనది?" వస్తూనే అడిగింది భద్రాదేవి కీర్తిమతిని నిశితంగా చూస్తూ.

"అక్కా... జనని... ఉలుకు పలుకు లేదు. ఎంత ఉపచరించినా తెలివి రాకున్నది." అంటూ ఏడ్చేసింది ఉలూచీశ్వరి.

"అరె... దీనికింత కలత ఏల? నేనున్నాగదా. కొంచెం తాళుము." అంటూ వచ్చినంత వేగం గానూ వెను తిరిగి సమీపం లోని పొదల్లోకి వెళ్ళింది భద్రాదేవి. వెళ్ళిన మూడో నిమిషం లోనే అర చేయంత వున్న ఒక పచ్చని ఆకు, ఎరుపు రంగు లోని మరో చిన్న ఆకులతో తిరిగి వచ్చింది. అవి రెండూ అర చేతిలో వుంచి నలిపి బాగా అదిమి పిండి కీర్తిమతి నాసికా రంధ్రాల్లో రెండు చుక్కలు పిండింది. అంతే`

బలంగా రెండు సార్లు తుమ్మి స్పృహ లోకి వస్తూ లేచి కూచుంది కీర్తి మతి. ఉలూచీశ్వరిని చూస్తూనే దుఃఖం ఆపుకో లేక విలపిస్తూ` "వచ్చినావా తల్లీ... చూచితివా ఈ ఘోరం... మీ జనకుని ఆ నీచ మాంత్రికుడు..." అని చెప్ప బోతుంటే వారించింది ఉలూచీశ్వరి.



"లేదమ్మా! నీవనుకున్నట్టు ఏ ఘోరము జరుగలేదు. ఆ జడల మాంత్రికుడు అంతమైనాడు" అంది నవ్వుతూ. కీర్తిమతి స్పృహ లోకి రావటంతో స్త్రీలంతా సంతోషించారు.

"ఏమంటివి? జడల మాంత్రికుడు అంతమైనాడా... నీ జనకుడు క్షేమమా... ఎవరు... సమయానికి దైవంలా వచ్చి కాపాడినది ఎవరు? ఈ వీర వనిత ఎవరు?" అంది భద్రా దేవిని చూస్తూ.

"ఇంకెవరు జననీ... ఓసారటు చూడుము" అంటూ నాగ రేడును, ధనుంజయుని చూపించింది.

ముందుగా తన నాధుడు నాగ రేడును గాంచగానే ఊరట చెంది ఆనందంతో కన్నీరు తుడుచుకుంది.ఖడ్గంతో వీర విహారం చేస్తూ శత్రువుల్ని చెండాడుతున్న ధనుంజయుని గాంచగానే అబ్బుర పాటుతో ఆమె కనులు విశాలమయ్యాయి. అతడేనా అన్నట్టు ఉలూచిశ్వరి వంక చూసింది. అవునన్నట్టు తల వూపింది ఉలూచిశ్వరి.

"వారేనమ్మా నేను వరించిన రత్న గిరి యువ రాజు ధనుంజయుల వారు. ఇదో... అక్క భద్రా దేవి. గొప్ప వైద్య శిఖా మణి, మంత్ర శక్తుల్లో అజేయురాలు, వీర వనిత. చూస్తున్నారుగా! జడల మాంత్రికుని ఎలా వధించి జనకుని కాపాడ వచ్చునో ఆ కిటుకు అక్క చెప్పకున్న ఈ విజయము సాధ్యమయ్యేది గాదు. అలాగే సకాలమున అత్త శంకుపుత్రి దారి కాచి మాకు విషయము చెప్ప బట్టి తక్క సమయమున మేమిచటకు చేర గలిగితిమి" అంటూ ఉలూచిశ్వరి ఉత్సాహంగా వివరిస్తుంటే రాణి కీర్తిమతి తో బాటు నాగస్త్రీలంతా అచ్చెరువొందారు.

కీర్తి మతి భద్రా దేవిని చూస్తూ` "ఏ తల్లి కన్న బిడ్డవో... ఈనాడు నాకు పతి భిక్ష పెట్టినావు. ఏమిచ్చి నీ రుణం తీర్చ గలను తల్లీ!" అంటూ చేతులు జోడిస్తుంటే చప్పున ఎదురుగా కూచుని ఆమె చేతులు పట్టి వారించింది భద్రా దేవి.

"అమ్మా! మీరు నాగ దేవతలు. మేము నరులము. మీ బిడ్డల్లాంటి వాళ్ళము. మీ కరములు ఆశీర్వదించాలే గాని నమస్కరించ కూడదు. తల్లిదండ్రులు లేని ఒంటరిని. ఇక నుంచి నన్ను కూడ మీ బిడ్డగా భావించిన చాలును" అంది.

భద్రా దేవి వినయానికి, ఆమె మాటలకు పులకించిన రాణి కీర్తి మతి ఆమెను దగ్గరకు తీసుకుని నుదురు ముద్దాడి శిరస్సున చేయి వుంచి ఆశీర్వదించింది.

ఈ లోపల అక్కడ సమరం ముగింపుకు రావటంతో వారి సంభాషణ ఆగి పోయింది. కీర్తి మతి లేచి భద్రా దేవి, ఉలూచీశ్వరి తో నాగ రేడు వద్దకు బయలు దేరింది.

వక్ర దంతుడి ఆఖరి మద్దతు దారులు ముగ్గురూ ధనుంజయుని చేతిలో హతం గావటంతో ఆ పోరాటం ముగింపు కొచ్చింది. ఎటు చూసినా శవాలు, నెత్తుటి మడుగు. బీభత్సంగా వుంది అంతటా. అంత దూరంలో గదాయుధాన్ని భుజాన వేసుకుని ధనుంజయుని అవక్ర పరాక్రమాన్ని ఆసక్తిగా వీక్షిస్తున్నాడు నాగ రేడు మహా పద్మడు.

అంతలో రాణి కీర్తి మతి శవాలను తొక్కుకొంటూ తన వద్దకు పరుగులెత్తుకు రావటం చూసాడు. భద్రాదేవి, ఉలూచీశ్వరి, శంఖు పుత్రి, భూతం ఘృతాచి అంతా ధనుంజయుని వద్దనే ఆగి పోయారు.

పరుగున వచ్చి భర్త కౌగిట వాలి పోయి ఏడ్చేసింది రాణి కీర్తి మతి. ఆనందం దుఃఖం ముప్పిరి గొనగా నాగ రేడు కళ్ళ లోనూ నీరు నిలిచింది. ఇది తమకు పునర్జన్మగా వుంది. తను కన్నీరు విడుస్తూనే భార్య కన్నీరు తుడిచి ఓదార్చాడు మహా పద్మడు. కీర్తిమతి ఆనంద పారవశ్యంతో పులకిస్తూ కుమార్తె ఉలూచీశ్వరి చెప్పిన విషయాలన్నీ భర్తకు వివరించి చెప్పింది.

ఈ లోపల నాగ సైనికుల శవాలను అక్కడి నుండి తొలగించటం ఆరంభించారు. అంత వరకు దూరం గానే వుండి చూస్తున్న నాగ లోక పెద్దలు, ప్రముఖులు, ప్రజలు అంతా కదిలి రానారంభించారు. తమ రాజ దంపతుల క్షేమం గాంచి ఆనంద భాష్పాలు విడుస్తున్నారు.

నాగ రేడు ధనుంజయ బృందాన్ని `

చెంతకు రమ్మని సైగ చేసాడు.

అంతా వచ్చి ఎదురుగా నిలిచారు. ఉలూచీశ్వరిని చెంతకు పిలిచి ప్రేమగా నుదురు ముద్దాడాడు. దుఃఖంతో మాటలు పెగల్లేదు ఉలూచీశ్వరికి.

నాగ రేడు తలెత్తి ముందుగా ` శంకు పుత్రి వంక చూసాడు.

అప్పటికే ఆమె తండ్రి శంఖుడు `

కుమార్తె వద్దకొచ్చి నిలిచాడు.

“మధూలిక! నర జాతి పట్ల నాకున్న తేలిక భావంతో నీకు చాలా అన్యాయమే చేసాను తల్లీ. అయినా నీవు మా క్షేమాన్ని కోరావు. నీ లోని క్షమా గుణాన్ని ఏమని పొగడను. నేను విధించిన అర్ధము లేని ఆంక్ష మూలంగా ఇంత కాలం ఎన్నో ఇడుముల బడితివి. నా మూర్ఖత్వమును మన్నించమ్మా. నాడు మరణించిన నీ ప్రియుని తిరిగి తేలేను గాని ఇక మీదట నీకు విధించిన నిషేదాజ్ఞలను తొలగించు చున్నాను. ఇక నుండి మాతో బాటు నీవును మన నాగ లోక మందే నీ జనకుని చెంత వశింప వచ్చును” అన్నాడు.

“కృతజ్ఞతలు ప్రభూ!” అంటూ తండ్రి కూతుళ్ళు యిద్దరూ నమస్కరించారు.

తర్వాత భద్రా దేవి వంక చూసి`

చెంతకు పిలిచాడు నాగ రేడు.

భద్రా దేవి శిరమున చేయి వుంచి`

అప్యాయంగా దీవించాడు.

“ఆ రోజు రాత్రి నిను మంత్ర గత్తెవని చులకన జేసి మాటలాడినందుకు చాలా బాధగా వుంది తల్లీ. సిగ్గు పడుచున్నాను, మన్నించు. నీ విలువ ఏమిటో ఇప్పుడు గదా తెలిసినది. స్త్రీలయందు ఆణి ముత్యానివి. ఇక మీదట తల్లి దండ్రులు లేరను కొరత నీకు లేదు. మేముంటిమి. ఈ దినము నుండి మాకు ఇరువురు బిడ్డలు. మా పెద్ద కుమార్తె భద్రా దేవి, రెండవ కుమార్తె ఉలూచీశ్వరి.” అంటూ అందరి ముందు ప్రకటించాడు. హర్షాతిశయంతో నాగ లోక వాసు చప్పట్లు చరిచి అభినందించారు. భద్రా దేవి ఆనందంతో నాగ రాజ దంపతులకు పాదాభివందనం చేసింది.

చివరిగా ధనుంజయుని చూసి ప్రసన్నుడవుతూ దరహాసం చేసాడు నాగ రేడు. ''యువ రాజా ధనుంజయా... మానవుల పట్ల నాలోని చులకన భావం నా కనులను పొరుగప్పి అహంకారమున నీకు అనేక కష్టములు కలిగించితి. నిను గుర్తించుటలో నేను పొర బడితి. అందుకే ద్రోహి ఆ వక్ర దంతుని నమ్మి తప్పు జేసితి. అందుకు తగిన శిక్ష అనుభవించితి. నేను తప్పు జేసినను మా తనూజ ఉలూచీశ్వరి ఒప్పు జేసినది. నిను గుర్తించి వరించినది. ఈనాడు మీ ధైర్య సాహసాలు మముల మృత్యు కుహరము నుండి కాపాడినవి. ఈ సంతోష సమయంబున ఆనందముగ నీకు రెండు వరంబు అనుగ్రహించెద. కోరుకొనుము... అదియును... దివ్య నాగమణి... మా గారాల పట్టి ఉలూచీశ్వరి తక్క... ఏమైనను కోరుకొనుము. ఇచ్చెద'' అన్నాడు మీసం మెలివేసి గంభీరంగా.

భద్రా దేవి, ఉలూచీశ్వరిలు ఒకరినొకరు చూసుకుని ముసి ముసిగా నవ్వుకున్నారు. ధనుంజయుడు కూడ నవ్వాడు.

''నన్ను పరీక్ష పెట్టకండి ప్రభూ! ఉలూచీశ్వరి నా రెండవ ప్రాణము. దివ్య నాగమణి, ఉలూచీశ్వరి తక్క లోకమున వేరేదియు నాకు సమ్మతము గాదు'' అన్నాడు.

''ఆహాః... మరి నీ మొదటి ప్రాణము భద్రా దేవి గదా. ఆమె వలదా? ఇప్పుడు ఆమె కూడ మా కుమార్తెయే గదా'' అనడిగాడు పరిహాసంగా నాగ రేడు.

''అయ్యో! భద్రా దేవి లేక ఎటుల? సరి ప్రభు! నాకు దివ్య నాగ మణి తో బాటు మీ ఇరువురు కుమార్తెలూ కావలె'' అంటూ తన మాటను సవరించుకున్నాడు ధనుంజయుడు.

ఒక్క సారిగా నవ్వు విరిసాయక్కడ.

''సరి మహా వీరా.నీకు దివ్య నాగ మణిని యిత్తును, అటులనే నీ కాళ్ళు కడిగి మా ఇరువురు కుమార్తెలను నీకు కన్యా దాన మొనర్చెద. కానీ....'' అంటూ ఆగాడు నాగ రాజు.

తిరిగి ఏమి మెలిక పెడతాడోనని`

కంగారు పడ్డాడు ధనుంజయుడు.

“కాని… ఈ సంతోష సమయంబున మా నాగ లోకమునకు ఏడు దినముల పండుగ దినముగ ప్రకటించు చుంటిని. ఈ ఏడు దినమును మీరు మా ఆత్మీయుగా మా నాగ లోకమున ఉండాలె. సమ్మతమే గదా?” అంటూ అడిగాడు నాగ రాజు.

ఇది ధనుంజయునికి ఇబ్బంది కర మగు సమస్య. అవతల తన జనకుడు ఎటున్నదీ తెలియదు తను రత్నగిరి వదలి చాలా దినము దాటినది. మరో పక్క బాహ్లీకుని కుట్ర ఫలితముగా అచట యుద్ధము అనివార్యము. ఎప్పుడు రత్న గిరికి మరలి పోవుదమాని ఆత్ర పడుచున్నాడు. ఈ సంకట స్థితిలో సంతోషముగ ఆతిధ్యమెటుల స్వీకరించునది! ధనుంజయుడు ఏమి బదులు చెప్పేవాడో గాని ఈ లోపల యువ రాణి ఉలూచీశ్వరి కల్పించుకొంటూ` “జనకా! యువ రాజా వారి కి మూడో ప్రాణము కూడ గలదు. ఆ సంగతి అడుగ రేమి? మాతో బాటు తను కూడ అతిధిగా రావాలి గదా” అంది అమాయకంగా.

“మూడో ప్రాణమా…” నమ్మ లేనట్టు చూసాడు నాగ రేడు.

ఈ కొంటెపిల్ల కొంప ముంచినదే. ఇప్పుడేమి చేప్పాలి అనుకుంటూ` “యువ రాణీ వారికిది పరిహాస సమయము గాదు సుమా” అన్నాడు.

“ఇందులో పరిహాస మేమున్నది. నీవు చెప్ప వేమి అక్కా!” అంటూ భద్రా దేవిని అడిగింది ఉలూచీశ్వరి.

భద్రా దేవి ఏమి చెప్పేదో గాని ఇంతలో చిన్న కలకలం విని మాటలు ఆపి అటు చూసారంతా. ఆశ్చర్య సంభ్రమాలతో నోట మాట రాలేదు ఎవరికీ.

అంత దూరాన ప్రత్యక్షమైన పాతాళ రేడు బలి చక్రవర్తి గదాయుధాన్ని భుజాన వేసుకుని మీసం తిప్పుతూ పెద్ద పెద్ద అంగలతో ఇటే వస్తున్నాడు. ఆయన వెనకే ఆయన దేవేరీ యువ రాణి మణి మేఖల, శుక్రా చార్యుల వారు మరి కొందరు ప్రముఖులు విచ్చేస్తున్నారు. తన కనులను నమ్మ లేక పోయాడు నాగ రేడు మహా పద్ముడు. వెంటనే చేతులు జోడిస్తూ ఎదురు వెళ్ళాడు. ధనుంజయునికి పరిస్థితి అర్ధమై పోయినది.

తను వూహించని విషమ పరిస్థితి యిది. ప్రసన్నుడైన నాగ రేడు నుండి తనకు అవసరమగు దివ్య నాగ మణిని పొంది, ఎలాగో ఒప్పించి వెంటనే రత్న గిరికి తిరుగు ప్రయాణం చేసే ఉద్దేశంతో తనుండగా, పులి మీద పుట్రలా యిలా అకస్మాత్తుగా పాతాళ రేడు రాక ఏ కొత్త సమస్యకు దారి తీస్తుందో ఏమిటో. యువ రాణి మణి మేఖల తమ వలపు గురించి చెప్పకుండా మరికొద్ది దినములు

ఆగాల్సింది అని చింతిస్తూ అక్కడే నిలుచుండి పోయాడు ధనుంజయుడు. ఈలోపల`

‘‘ఆహా‹... ఏమి ఈ సుదినం. ఓ పక్క మా ప్రాణములు రక్షింప బడుటయే గాక శత్రు సంహారము జరిగి వరుస శుభములొనగూడు చున్నవి. ప్రణామము మహా బలి. దయ చేయండి. తమ దర్శన భాగ్యమే కడు దుర్లభము. అలాంటిది తమరే స్వయముగా విచ్చేయుట మహదానంద కరం. దయ చేయండి.’’ అంటూ ఎదురు వెళుతూ బలి చక్రవర్తికి ప్రణామం చేసాడు నాగ రేడు. అయితే`

నాగ రేడు మాటలు పట్టించు కోకుండా పెద్ద పెద్ద అంగలతో ముందుకు వస్తూ` ‘‘ఎచట ఆ కపటి... మోసగాడు.. చోరుడు... ఎచట నుండెతను’’ అంటూ మేఘ గంభీర స్వరముతో అడిగాడు బలి.

నాగ రేడుకు అర్థం గాలేదు.

విస్తు పోయాడు.

‘‘మహా బలి! ఎవరిని గూర్చి పలుకుచున్నారు?’’ అనడిగాడు.

‘‘ఇంకెవరయ్యా నాగరాజా! ఆ రత్న గిరి యువ రాజు ధనుంజయుని గురించే’’ అంటూ గదను భుజం నుంచి దించి నేలకు ఆన్చి ఆగాడు బలి చక్రవర్తి.




ఈసారి మరింత విస్తుపాటు చెందాడు నాగరాజు మహా పద్ముడు` “మహా బలి... ఏమంటిరి? యువ రాజు ధనుంజయుడు కపటియా... మోసగాడా.. చోరుడా... ఇదేమి చోద్యము” అనడిగాడు.

“చోద్యముగాక ఇంకేమి. అతడిని ఏమనవలె? నిండు పేరోగమున నిలబెట్టి అడిగినను తన వివరములు తెలపని వాడు కపటి కాదా? మాకు చెప్పకనే మా అనుమతి లేకనే మా పాతాళము నుండి మరలి వచ్చిన వాడు మోసగాడు గాడా... వచ్చినాడు పో... ప్రాణాధికమగు మా దత్త పుత్రిక మణి మేఖల హృదయము దోచుకొని పారి వచ్చిన వాడు చోరుడు కాడా... అతడిని ఏ విధమున శిక్షింపవలె?” అంటున్న బలి చక్రవర్తి మాటలకు మొదట నివ్వెర పోయినా విషయం అర్థం కాగానే ఫక్కున నవ్వాడు నాగ రేడు. ఉలూచీశ్వరి చెప్పిన ధనుంజయుని మూడో ప్రాణం ఎవరో ఇప్పుడు తెలిసి పోయింది తనకు.

వచ్చిన వెంటనే ధనుంజయుని జాడ కోసం గాలిస్తోంది యువరాణి మణి మేఖల. ఆమె కనుగవల నుండి తప్పించుకో లేక పోయాడు యువ రాజు ధనుంజయుడు. అతని గాంచ గానే చంద్రుని గాంచిన చకోర పక్షిలా ఆనందంతో పొంగి పోయిందామె. అంతే` తన వారిని వరిని వదిలి చెంగున కదిలింది.

ఇన్ని రోజుల వేదన, విరహం ముప్పిరి గొన ఉక్కిరి బిక్కిరవుతూ లేడి పిల్లలా దూకింది. సకలాభరణ భూషితమై దేవ కన్యలా మెరిసి పోతూ కర కంకణాదులు సద్దు చేస్తుండగా నాగ జనాలను తప్పించుకుని దూసుకు వచ్చి ధనుంజయుని కౌగిట ఒదిగి పోయింది. అతడి గుండెల మీద వాలగానే దుఃఖం ఆగక వెక్కి వెక్కి ఏడ్చింది. ఆమెను బిగియార కౌగిలించి బుజ్జగించి ఓదార్చాడు ధనుంజయుడు. ఇంత వరకు వచ్చాక ఇక సందిగ్ధత వృధా అన్పించింది. తల తిప్పి భద్రా దేవి, ఉలూచీశ్వరిల వంక చూసాడు.

"ప్రియ సఖియూ! మూడో ప్రాణము ఎక్కడని అడిగినారుగా. ఇదో వచ్చినది మదీయ మూడవ ప్రాణంబు" అంటూ ఒకరి నొకరికి పరిచయం గావించి మణి మేఖలను వారికి వప్పగించి నేరుగా బలి చక్రవర్తి వైపు కదిలాడు.

నాగ రాణి కీర్తి మతి తనకు పాదాభివందనం చేసిన మణి మేఖలను లేపి మురిపెంగా చూసింది. "చక్క దనాల చుక్కవు. మీ మూవురి వలపు చూర గొన్న ధనుంజయుడే కాదు, మీరును అదృష్టవంతులే. మీ సఖ్యత ఇటులనే కొనసాగవలె" అంటూ ఆశీర్వదించి అక్కనచేర్చుకుంది.

అక్కడ ధనుంజయుడు నేరుగా బలిచక్రవర్తి ముందుకెళ్ళి నిలిచాడు. "క్షమించండి మహాబలి. మీరు వెదుకుచున్న కపటి, మోసగాడు, చోరుడు ధనుంజయుడు మీ ముందుకు వచ్చినాడు. మదీయ ప్రణామము దయతో స్వీకరించండి" అంటూ సవినయంగా మోకాళ్ళ మీద కూచుని నమస్కరించాడు.

"అహో...!" అంటూ తిరిగి గదను భుజాన వేసుకుని మీసం తిప్పుతూ హుంకరించాడు బలి చక్రవర్తి. తల తిప్పి శుక్రాచార్యుల వంక ఆశ్చర్యంగా చూసాడు.

"ఆచార్య దేవా... జూచితిరా! జూచినారా ఇతడిని? నిండు పేరోగమున మాకు ప్రణమిల్లి, తల వంచని వీరుడు ఇప్పుడు ఇచట ప్రణమిల్లినాడు. ఈ యువ కిశోరమునకు ఏమి శిక్ష విధింపవలె" అనడిగాడు.

"యువరాణి, మీ గారాలపట్టి మణిమేఖలనిచ్చి బెండ్లి చేయుట కన్ననూ వేరేమి శిక్ష కలదు మహాబలి" అంటూ నవ్వాడు శుక్రాచార్యులు.

"లెస్స పలికితిరి ఆచార్య దేవా. అదియే ఇతగాడికి సముచితమగు శిక్ష" అంటూ దరహాసంతో ధనుంజయుని లేపి ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు బలి చక్రవర్తి.

"క్షమించండి ప్రభూ! నేను పాతాళమున పడినప్పటి పరిస్థితులు వేరు. ఇది భూలోకము. మీరు పురాణ పురుషులు మాకెప్పుడూ

ఆరాధ్యులు…" అంటూ ధనుంజయుడు చెప్ప బోతుంటే వారించాడు బలి చక్రవర్తి.

"తప్పు నీది కాదు ధనుంజయా, మాది. నాడు సభలో నీ పలుకు డాంబికముని ఎంచితి. మంద బుద్ధినై నీ వివరము జ్ఞాన దృష్టినైన అరయ నైతి. మణి మేఖల చెప్పు వరకు నిజముగ నీవెవరో తెలియవైతివి" అన్నాడు.

ఇంతలో నాగ రాణి కీర్తి మతి, ఉలూచిశ్వరి, భద్రా దేవి, మణిమేఖల మూవురినీ వెంటనిడుకొని అచటి కొచ్చినది. యువతులు మూవురూ పాతాళ రాజ దంపతుకు పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు.

"మహా బలి! ఈ శుభ తరుణమున నాదో విన్నపము. ధనుంజయునితో బాటు మీరును సపరివారముగ మా నాగ లోకమునకు విచ్చేయ వలె. ఒక వారము దినముల పాటు మా ఆతిధ్యం స్వీకరింప వలె" అంటూ బలి చక్రవర్తిని అర్థించాడు నాగ రేడు మహాపద్ముడు.

వెంటనే అభ్యంతరము తెలిపాడు శుక్రాచార్యుడు.

"మీ అతిధ్యమును పొందుటకు మాకే అభ్యంతరమును లేదు నాగ రాజా. కాని ధనుంజయుని ఇబ్బంది పెట్టకుము. ఇతడు వెంటనే బయలు దేరవలసిన సమయమాసన్నమైనది" అన్నాడు.

ఆ మాటలు అందరినీ విభ్రాంతి పరిచాయి.

ధనుంజయుడు ఆందోళన చెందాడు.

"ఆచార్యా! ధనుంజయుని ఇబ్బంది ఏమున్నది?" అనడిగాడు నాగ రేడు.

"పరిస్థితులు విషమించినవి నాగ రాజా! మీకు తెలియనిదేమున్నది, కాలము ఎవరి కోసమూ ఆగదు గదా" అన్నాడు శుక్రాచార్యుడు. ఇంకా`

"అచట ఇతని జనకుడు మరణ శయ్యపై నుండె. వెంటనే వెళ్ళి బ్రతికించుకో వలె. మరో వంక యుద్ధము ఆరంభమైనది. పోయి

రాజ్యమును కాపాడుకో వలె. లేకున్న రెండును దక్కవు'' అంటూ హెచ్చరించాడు.

ఎప్పటికప్పుడు ఆ మహనీయుడు తన పట్ల అక్కర చూపుతూ రత్నా గిరి పరిస్థితుల్ని గమనిస్తూనే వున్నాడని ధనుంజయునికి అర్ధమైంది. వెంటనే చెంతకెళ్ళి ``ఆచార్య దేవా... నాడు సభలో మీ చిరు నవ్వున కర్ధము ఏమో మణి మేఖల నను వరించుటతో తెలిసినది. సర్వజ్ఞులు. నాయందు దయ వుంచి ప్రస్తుతము రత్నా గిరి పరిస్థితులేమిటో వివరించండి'' అంటూ అర్ధించాడు.

''ఏమి చెప్పుదు ధనుంజయా! నీ జనకుడు ధర్మ తేజుడు పుట్ట వ్రణ తీవ్రతకు నరక యాతన అనుభవించుచున్నాడు. పరిస్థితి ఇటులే వుండిన వారము దినములకు మించి బ్రతుకడు. నీ జనని కనకాంబిక కన్నీరు మున్నీరుగా విలపించుచూ క్షణమొక యుగము వలె నీ కొరకు ఎదురు చూచుచున్నది.

అటు మీ ఉప సైన్యాధ్యక్షుడు ద్రోహి బాహ్లీకుడు ఇదే తక్క సమయమని ఎంచి తిరుగు బాటు బావుటా ఎగుర వేసి అంతర్యుద్ధమునకు తెర తీసినాడు. నీవు మరణించితివను వదంతి పుట్టించినాడు. అటు ప్రజలు ఇటు సైన్యము గూడ వదంతిని నమ్మాలో వద్దో తెలియక అయోమయంలో ఉండె. ఎప్పుడేమి జరుగునోయని రత్నా గిరి వాసులు బీతిల్లుచున్నారు.

మరో పక్క గాంధారాధీశుడు శతానీకుడు బాహ్లీకుని అడ్డు పెట్టుకొని రత్నా గిరిని చేజిక్కించుకోవాలని యుద్ధ తంత్రమును నెరపు చున్నాడు. తన సేనతో బాటు మిత్ర పక్షాల సేనల గూడి బయలుదేరినాడు. నేడో రేపో అతడి యుద్ధ నౌకలు రత్నా గిరి జలాల్లోకి ప్రవేశింప నున్నవి. ఇరు పక్షాలుగా నిలువునా చీలిన మీ సేనలు ఇప్పటికే తమలో తాము నరుక్కు చస్తున్నవి. రత్నా గిరి ఓడ రేవు మూసి వేయ బడినది. మీ యుద్ధ నౌకలు జల మార్గమున గస్తీ తిరుగు చున్నవి. నగరమునకు రాక పోకలు నిషేధించి పుర ప్రవేశ ద్వారము మూయించి నాడు మీ సర్వ సైనాధ్యక్షుడు అర్కుడు. బాహ్లీకుని ఎలాగో నిలువరింప వచ్చును. కాని శతానీకుని బలగాలు రత్నగిరి చేరుకుంటే పరిస్థితి కరము దాటునని మహా మాత్యుడు వాసు దేవ నాయకుడు, సర్వ సైన్యాధ్యక్షుడు అర్కుడు సందేహ పడుచున్నారు. ఇక మాళవ యువ రాజు నీకు బావ యగు ఇంద్ర జిత్తు రత్నగిరిలో అంతర్యుద్ధముననచి వేయుటకు మీకు సాయముగా తన సేనతో బయలు దేరి రత్నగిరి వైపు సాగుచున్నాడు. ఈ క్లిష్ట సమయమున నీవు వెంటనే రత్నా గిరి చేరుట అవశ్యము.'' అంటూ వివరించిన శుక్రా చార్యుల మాటలు అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసాయి.

ఆ మాటలు వినగానే ముందుగా స్పందించినది భద్రా దేవి. వెంటనే భూతం ఘృతాచిని పిలిచి మడుగు ఆవల సంపంగి వనమున వదిలిన తమ అశ్వాలను వెంటనే తీసుకు రమ్మని ఆదేశించి పంపించింది.

అయితే, శుక్రా చార్యులు చెప్పింది వినగానే ఎలా స్పందించాలో ధనుంజయునికి అర్ధం కాలేదు. ఇచట ఈశాన్య బారతం లోని మర్మ భూమి నుండి నైరుతి దిక్కుగా అనేక రాజ్యాలు దాటుకొని అశ్వాల మీద తమ రత్నా గిరిని చేరాలంటే ఎంత తక్కువ అంచనా వేసినా ఇరువది దినములగును. అలాంటిది వారం దినములలోన తను రత్నగిరి చేరుట సాధ్యమగు కార్యమేనా? దివ్య

నాగమణి చెంత వున్నను తగు సమయమునకు చేరకున్న తన జనకుని కడ సారి చూపుకైనా నోచలేడే. ఏమి చేయాలి? అలా తీవ్రమైన ఆలోచనలతో చింతా క్రాంతుడైన ధనుంజయుని గాంచి మంద హాసంతో భుజం తట్టారు శుక్రాచార్యుల వారు. భద్రా దేవిని కూడ చెంతకు పిలిచారు. దుష్ట జడల మాంత్రికుని సంహారంతో బాటు కొద్ది సేపటి క్రితం వరకు సాగిన పోరుతో ఇరువురూ నెత్తుటి చారికలతో, మాసిన దుస్తులతో బీభత్సంగా వున్నారు.

''నాయానా ధనుంజయా! మేరు పర్వతము వోలె పిల్లలనిచ్చు నీ ఇరువురు మామలము చెంత నుండ రత్న గిరి ఎటు చేరుటయను చింత నీకేలనయ్యా... సకాలమునకు చేరెదవు గాక'' అంటూ తన కమండలము నుండి కొద్దిగా జలము గైకొని కొద్ది సమయం కనులు మూసుకొని తెరిచి ఆ జలమును ఇరువురి శిరస్సున సంప్రోక్షించి ఆశీర్వదించారు. అంతే`

ఆశ్చర్య కరంగా భద్రా దేవి, ధనుంజయులు ఇరువురూ తాజాగా మారి పోయారు. ఇపుడు వారి వంటి మీద రక్తపు చారికలతో కూడిన దుస్తులు లేవు. వాటి స్థానంలో నూతన దుస్తులు ఆవిష్కృతమయ్యాయి. పట్టు పీతాంబరాలతో సకలాభరణ భూషితగా దిగి వచ్చిన దేవ కన్యలా తన సహజ సౌందర్యంతో మెరిసి పోతోంది భద్రా దేవి. ఇక యువ రాజు ధనుంజయుడైతే రాజోచితమగు దుస్తుల్లో దిగి వచ్చిన నవ మన్మథుని వలె ప్రకాశిస్తున్నాడు. ఆ జంటను గాంచి మురిసి పోయారంతా. ఉలూచీశ్వరి, మణి మేఖల ఇరువరూ ''అక్కా'' అంటూ ఆనందంతో భద్రా దేవి కిరు వంకలా చేరి పోయారు. ధనుంజయుడు తన సఖియ మూవురితో సవినయంగా శుక్రా చార్యులకు పాదాభివందనం చేసాడు.

నాగ రాజు మహా పద్ముడు కరములు చాపి తవగానే అతడి చేతుల్లో దోసిట ఇమిడే ఒక పసిడి పెట్టగము ప్రత్యక్షమైనది. దాన్ని ధనుంజయునికి అందించి` ''తెరచి చూడుము'' అన్నాడు.

మూత తెరచిన ధనుంజయుని కనులు సంభ్రమంతో మెరిసాయి. ఏ దివ్య నాగమణి కోసమైతే ఇన్ని దినాలు తను రత్నగిరి వదలి శ్రమదామాదుల పాలయ్యాడో ఆ దివ్య నాగ మణి ఈ పసిడి పెట్టగంలో వుంది. నీలి రంగు దివ్య కాంతులతో ప్రకాశిస్తోంది. మూత మూసి కనులకద్దుకొని కృతజ్ఞతగా నాగ రేడు వంక చూసాడు. ఆయన ఆదరంగా కౌగిలించుకుని భుజం తట్టాడు` ''మిమ్మల్ని కొద్ది దినములు మా నాగ లోకమున అతిథులుగా ఉంచుకొని పంపించాలనుకొంటి. అదిపుడు సాధ్య పడదని తెలిసినది. ఈ నీల మణి నీకే సొంతము. ఇది మీ చెంత ఉన్నంత కాలము భవిష్య తరాల్లో కూడ ఎవరికీ పుట్ట వ్రణము సోకనటుల వరమనుగ్రహిస్తున్నాను. ఇక నీకు చింత వలదు. నీ తండ్రి ధర్మ తేజుడు తక్షణమే సంపూర్ణారోగ్య వంతుడు కాగలడు'' అన్నాడు.


ఈ లోపల`

బలి చక్రవర్తి కనులు మూసుకొని తలచి నంతనే అచట ఒక పుష్పక విమానం ప్రత్యక్ష మైనది.. పద్దెనిమిది స్థంభాలతో ఉచితాసనాలతో మణి మయ కాంతులు వెదజల్లె అందమైన ఆ బంగారు పుష్పక విమానాన్ని గాంచి ఆశ్చర్య చకితులయ్యారంతా.

“ధనుంజయా” అంటూ పిలిచాడు బలి చక్రవర్తి.

“ఇది ఒకప్పుడు మాకు ఇంద్ర దత్తమగు పుష్పకం. ఇప్పుడు నీవున్న స్థితిలో త్వరిత గతిని రత్న గిరి చేరుటకు వేరొండు మార్గము లేదు. నీవు కోరిన చోటుకు అది ఆకాశ మార్గమున వేగముగ గొని పోయి చేర్చ గలదు. మీ అశ్వముతో సహా పయనింప వచ్చును. మీరు దిగిన తక్షణం అదృశ్యమై పాతాళమున మా కోటకు చేరును. కావును నీవు భద్రా దేవిని వెంట నిడు కొని రత్నగిరికి మరులుము. అచట పరిస్థితులు చక్క బడగనే మేము ఉలూచిశ్వరి, మణి మేఖలను దోడ్కొని రత్న గిరికి వచ్చెదము” అన్నాడు.

“కృతజ్ఞుడను మహా బలి” అన్నాడు ధనుంజయుడు. ఒక సమస్య తీరినది గాని రెండో సమస్య మొదలయినది. ఉలూచిని, మణి మేఖలను విడిచి వెళ్ళుటకు అతడి మనసు అంగీకరించుట లేదు. ఈ సమస్యను యువతులే పరిష్కరించారు .




‘జనకా! వారిరువురి వెంట మేమును వెడుచున్నాము” అంది మణి మేఖల. ఆమెను ఉలూచిశ్వరి సమర్థించింది.

యుద్ధ వాతావరణము నెలకొని వున్న తరుణంలో ఇరువురినీ ధనుంజయుని వెంట పంపుట ఇటు నాగరాజు దంపతులకు, అటు

బలి చక్రవర్తి దంపతులకూ ఇష్టము లేదు. నచ్చ చెప్పి వారించాలని చూసారు. చివరకు శుక్రా చార్యులు కల్పించుకొంటూ` ''ఆ నలుగురి ప్రాణము ఒక్కటే. వారింపనేల? ఇక ఒకరిని విడిచి ఒకరు ఉండ లేరు. యుద్ధానంతర వేడుకలకు, వీరి వివాహమునకు ఎలాగూ మనమంతా రత్న గిరికి తరలి వెళ్ళ వలసిన వారమే గదా. అందరినీ ఆశీర్వదించి పంపించండి'' అన్నాడు. ఆ విధంగా ఈ సమస్య కూడ పరిష్కారమైంది.

ముందుగా భూతం ఘృతాచి అశ్వాలు గరుడ, ఢాకినీలను తీసుకుని పుష్పకంలో ప్రవేశించింది. ధనుంజయుడు సఖియు మూవురితో కలిసి నాగ రాజు దంపతులు, బలి చక్రవర్తి దంపతులు, శుక్రాచార్యులకు మరో సారి ప్రణమిల్లి ఆశీస్సులు పొందాడు. అలాగే వెను తిరిగి నాగ లోక పెద్దలు వాసుకి, తక్షక, కర్కోటకాది పెద్దలందరికీ నమస్కరించి ఆశీస్సులు పొందాడు. శంఖు పుత్రి మధూలిక ఉలూచీశ్వరిని కౌగిలించుకుంది. భద్రా దేవిని, మణి మేఖలను కూడ కౌగిలించుకుని విడిచి కన్నీళ్ళతో అందరికీ వీడ్కోలు పలికింది.

ధనుంజయునితో సహా యువతులు మూవురూ పుష్పక విమానంలో ప్రవేశించారు. ధనుంజయుడు కనులు మూసుకుని పుష్పకానికి నమస్కరించి ఇంద్రుని, బలి చక్రవర్తుల వారిని తలచు కుని తమను త్వరగా రత్న గిరి కోటకు చేర్చమని అర్థించాడు.

అంతే`

చివ్వున గాల్లోకి లేచిన పుష్పక విమానం మెరుపు వేగంతో మబ్బుల మాటున అదృశ్యమైంది. ఆ విధంగా ధనుంజయ బృందాన్ని సాగనంపిన పిమ్మట నాగ రాజు దంపతులు, బలి చక్రవర్తి దంపతులు, శుక్రా చార్యుల వారి పరివారంతో కలిసి తమ నాగ లోకానికి బయలు దేరారు.

***************************

ఆకాశ మార్గంలో మబ్బుల పైన`

మెరుపు వేగంలో దూసుకు పోతోంది పుష్పక విమానం. అది నేల విడిచి గగనంలో ప్రయాణం ఆరంభించిన కొద్ది సేపటికే ఉన్నట్టుండి ధగధగాయమానంగా ప్రకాశిస్తూ అమ్మ వారు ప్రత్యక్షమైంది. అష్ట భుజాలు ప్రసన్న వదనంతో జగన్మోహనమగు సుందర రూపంతో కట్టెదుట సాక్షాత్కరించిన అమ్మవారిని గాంచి గంధర్వలోకాధి దేవత మోహినీ శక్తిగా గుర్తించి తన సఖియతో కలిసి అనేక విధాలుగా

స్తుతిస్తూ భక్తితో సాష్టాంగ ప్రణామం చేసాడు ధనుంజయుడు.

“ధనుంజయా! దురాశపరులు దుష్టులైన భక్తులు, మాంత్రికుల వలన మాకును ఇబ్బందులు తప్పవు. జడల మాంత్రికుని సంహరించి లోక కళ్యాణం నెరపినారు. ప్రసన్నురాలినైతి. కోరుకొనుము. ఏమి వరము కావలెనో అనుగ్రహించెద” అంది లోక మాత.

“అమ్మా లోక రక్షకీ. అంబ గౌరీ పార్వతి జగన్మాత. గంధర్వ లోకాన మోహినీ శక్తిగా పూజలందుకొను ఆది శక్తివి. నాకంటూ ఏ వరముూా వద్దు జననీ. ఈ జరుగనున్న రణ రంగమున విజయము వరించునటు దీవించిన చాలును” అన్నాడు ముకుళిత హస్తాలతో ధనుంజయుడు.

“విజయీభవ. నీ శౌర్య పరాక్రమాలు వినయ సంపత్తి అద్వితీయము. నీవు కోరకున్నను ఇవి మీకు అనుగ్రహించితి” అంటూ తన ఎనిమిది చేతుల్లోని ఆయుధాల్లో ఒక అక్షయ తూణీరము, ఒక శంఖమును ధనుంజయునికి ఒక దివ్య ఖడ్గాన్ని భద్రా దేవికి ప్రసాదించింది.

“ఇవి మీ చెంత వున్నంతకాలం అపజయమన్నది మీ దరకి రాదు. దుందుభి యను ఈ శంఖ నాదము శత్రువుల భీతిల్ల జేయును. ఈ అక్షయ తూణీరము, ఈ అంబుల పొది నుండి ఎన్ని బాణములు ప్రయోగించినను నిండుగనే ఉండును. నీవు ప్రయోగించు ఒక్క బాణము నీవు తలవగనే అనేక బాణముగా పోయి ఏక కాలమున శత్రు సంహారము గావించును. బిడ్డా భద్రా దేవి. ఈ దివ్య ఖడ్గము నీ చెంతనున్నంత వరకు నీకును అపజయము కలుగదు. ఉలూచీశ్వరి, మణి మేఖల బిడ్డలారా. మీరెల్లరు కలకాలం యిలా సఖ్యతగానుండి ఎన లేని కీర్తి ప్రతిష్టలు, అష్టయిశ్వర్యములతో చిర కాలము రాజ్య పాలన చేయుదురు గాక. ఇక యుద్ధ రంగమున వీర విహారము చేయండి. మీ జయ కేతనమున వుండి రణ భూమిని వీక్షించెద. విజయీ భవ” అంటూ అందరిని అశీర్వదించి అదృశ్యమైంది మాత మోహినీ శక్తి.

********************

రత్న గిరి కోట.

మహా మాత్యుడు వాసు దేవ నాయకుడు.

కోట బురుజు మీద ఒంటరిగా నిలబడి తీవ్రంగా ఆలోచిస్తూ నగర పరిసరాల్ని పరికిస్తున్నాడు. ఎన్నో యుద్ధాలు చూసిన వాడు. ఎన్నో యుద్ధ తంత్రాలు, వ్యూహాలు తెలిసిన వాడు. అయినా ఇంతటి క్లిష్ట పరిస్థితిని ఎన్నడూ ఎదుర్కో లేదు.

ఉదయం అర్ధ జాము గడిచిన వేళ.

తూర్పున మసక బారిన ఆకాశంలో సూర్యుడు నెత్తుటి వర్ణంలో ప్రకాశిస్తున్నాడు. రత్న గిరి మీద రాత్రి కమ్మిన మంచు పరదాలు కరిగి పోయి సుదూర ప్రాంతం వరకు స్పష్టంగా కన్పిస్తోంది.

తమ ఉప సైనాధ్యక్షుడు బాహ్లీకుడు తిరుగు బాటు చేసే అవకాశముందని సమీపంగా సూచనలు అందుతూనే వున్నాయి. కాని చివరి క్షణం వరకు ఆ ధూర్తుడు నక్క వినయాలు ప్రదర్శించి తమ అంచనాలకి అందనంతగా ప్రభు భక్తిని ప్రదర్శిస్తూ తప్పించు కున్నాడు. ముందే తెలిసుంటే పరిస్థితి చేయి దాటక ముందే ఆ ద్రోహిని పట్టి చెరలో ఉంచే వాళ్ళు.

తగిన ఆధారాలు లేకుండా ఎవరిని నిర్బంధించ డానికి మహా రాజు ధర్మ తేజుని శాసనాలు అంగీకరించవు. ఆపైన ఒక వేళ వదంతులు నిజమై బాహ్లీకుడు అంతకు తెగించి అంతర్యుద్ధానికే ఒడి కడితే సులువు గానే తిరుగు బాటును అణచి వేసి బాహ్లీకుని అంతం చేయొచ్చన్న నమ్మకంతో వున్నాడు ఇంత వరకూ. కాని ఆ నీచుడు అధికార దాహంతో రత్న గిరికి తీరని ద్రోహం చేస్తూ గాంధార రాజు శతానీకునితో చేతులు కలుపుతాడని వూహించ లేదు. అసలు తిరుగు బాటుకు ధైర్యమే శతానీకుడిదని ఇప్పుడు అర్థమవుతోంది. ఇది అస్సలు వూహించని విషయం. ఇదే ఇప్పుడు మహా మాత్యుని తీవ్రంగా వేధిస్తున్న సమస్య.

గాంధారం నుండి కరూర దేశం సాయంతో రెండున్నర ఆక్షౌణీ సైన్యంతో ముప్పైవేల యుద్ధ నౌకల్లో శతానీకుడు సముద్ర మార్గంగా రత్న గిరి వైపు ప్రయాణిస్తున్నట్టు వేగులు సమాచారం పంపించారు. ఇప్పటికే తను ఎందుకైనా మంచిదని తీర రక్షణ కోసం వేయి యుద్ధ నౌకల్ని రత్నగిరి జలాల్లో మొహరించి ఉంచాడు. మరో వేయి నౌకల్ని సిద్ధం చేస్తున్నారు. అయినా ముప్పైవేల యుద్ధ నౌకల్ని రెండువేల నౌకలు నిలువరింప గలవా? అది హాస్యాస్పదము, ఆత్మ హత్యా స దృశ్యమును.

ఇటు చూస్తే తమ ప్రియతమ నాయకుడు ఆత్మీయుడు ప్రభువు ధర్మ తేజుడు మరో వారం దినములకు మించి బ్రతకడని ఈ లోపలే దివ్య నాగ మణి తే గలిగితేనే బ్రతికించుకో గలమని రాజ వైద్యులు తేల్చి చెప్పేసారు. అటు చూడ దివ్య నాగ మణి కోసం నగరం విడిచి వెళ్ళిన యువ రాజు ధనుంజయుడు ఇంత వరకు జాడ లేదు. ఈ వారం రోజుల్లో వస్తాడన్న నమ్మకమూ లేదు. ఈ క్లిష్ట

సమయంలో ఆ మహా వీరుడుంటే పరిస్థితి వేరుగా వుండేది. ఇంత వరకు తిరిగి రాలేదంటే ఒకవేళ ధనుంజయుడు మరణించాడన్నది వదంతి కాదేమో. అది నిజమేనేమో యను శంక పీడిస్తూ భయం గొలుపుతోంది.

మహా రాణి కనకాంబిక దుఃఖం వర్ణనాతీతం. మహా రాజు చూస్తే మరణ యాతనలో వున్నారు. భగవంతుడా... చిమ కైనా హాని తలపని ధర్మపరులు, దయా మూర్తులయిన మా రాజ దంపతులకే ఏలనీకష్టాలు. మూగ వేదనతో రోదిస్తోంది ఆ వృద్ధ అమాత్యుని హృదయం. చెమ్మ గిల్లిన కనులను ఉత్తరీయంతో తుడుచుకుని మనసు రాయి చేసుకున్నాడు. ఏది ఏమైనప్పటికీ ఆఖరి నెత్తుటి బొట్టు నేల రాలే వరకు రత్న గిరి రాజ్య లక్ష్మి కోసం ప్రభువు కోసం పోరాడక తప్పదు. వీర మరణాన్నయినా స్వాగతింపక తప్పదు.

దృష్టిని సముద్రజలాల మీదకు సారించాడు. దూరంగా తమ యుద్ధ నౌకలు బారులు తీరి గస్తీ తిరుగుతున్నాయి. ఇప్పటికే ఓడ రేవు మూసేయటం జరిగింది. వర్తక నౌకల్ని రేవు లోకి అనుమతించ కుండా వెనక్కి పంపేస్తున్నారు.

రత్న గిరి ప్రజలు ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలీక లోలోన భయ పడుతూనే మౌనంగా దిన చర్యలు సాగిస్తున్నారు. రోజూ విన బడే కోలాహం సందడి ఇప్పుడు నగర వీధుల్లో కన్పించటం లేదు. నగర వాకిళ్ళు మూసేయటంతో నగరం లోకి రాక పోకలు నిలిచి పోయి ఎటు చూసినా సైనికుల సందడే కన్పిస్తోంది. చివరిగా తమ సైనిక శిబిరాల వైపు దృష్టి సారించాడు మహా మాత్యుడు.

నిన్న అకస్మాత్తుగా మొదలైన అంతర్యుద్ధంలో చాలా నష్టం జరిగింది. సైనిక శిబిరాలు చాలా వరకు ధ్వంసమయ్యాయి. సాయంత్రం యుద్ధ విరామ సమయానికి ప్రభు భక్తి పారాయణుగు సైనికులు అయిదు వేల మందికి పైగా వీర మరణం పొందారు. అనేక మంది గాయ పడి చికిత్స పొందుతున్నారు. అటు వైపు నష్టం ఎంతో ఖచ్చితంగా తెలీదు.

నిన్న మొన్నటి వరకు కలిసి వున్న సైనికులే యిలా రెండు వర్గాలుగా నరుక్కు చావటం ఎంతో వేదన కలిగిస్తున్నా అనివార్యం. అధికార కాంక్ష... భోగ లాలస... ధన వ్యామోహం... మనిషిని ఎంతటి నీచానికైనా దిగ జారుస్తాయి.

మొత్తం రత్న గిరి రెండు అక్షౌణీల పైగా సైన్యం నిలువునా చీలింది. దీని పర్యవసానం ఏమిటో వూహకి అందటం లేదు. యుద్ధ విరామం తర్వాత బాహ్లీకుడు తన పక్షం వహిస్తున్న సేనను తీసుకుని ఎగువన మైదాన ప్రాంతాలకు పోయి విడిది చేసాడు. తెల్ల వార గానే తిరిగి పోరు ఆరంభం కావాలి. అనుభవజ్ఞుడైన సర్వ సైన్యాధ్యక్షుడు అర్కుని మీద తనకు పూర్తి విశ్వాసం, నమ్మకం వున్నాయి. యుద్ధ వ్యూహాల్లో ఆరి తేరిన వాడు. తెల్ల వారి ఈ సమయానికే తిరిగి పోరు ఆరంభం కావాలి. కాని ఇంత వరకు రణభేరీలు మ్రోగటం లేదు. ఎవరో ఒకరు అటు నుంచి వస్తే గాని ఏం జరుగుతుందో తెలీదు.

శతానీకుడు రత్న గిరి జలాల్లో ప్రవేశించే లోపలే అవంతి నుండి బయలుదేరిన మాళవ యువ రాజు ఇంద్ర జిత్తు తన సేనలతో రత్న గిరి చేరుకో గలిగితే ముందీ అంతర్యుద్ధాన్ని ఓ కొలిక్కి తెచ్చి బాహ్లీకుని బంధింప వచ్చు. పిదప శతానీకుని సేనల్ని ఎదుర్కొవటం ఎలాగో వ్యూహ రచన చేయటానికి వీలవుతుంది.

తీవ్రమైన ఆలోచనల్లో మునిగివున్న మహా మాత్యుడు వాసు దేవ నాయకుడు ఎవరో కోట బురుజు పైకి వస్తున్న అలికిడి విని అటు చూసాడు.


సర్వ సైన్యాధ్యక్షుడు అర్కుడు ఎవరినో వెంట నిడుకొని చర చరా మెట్లెక్కి రావటం కన్పించింది. వెనకే అంగ రక్షకులు నలుగురు పది మంది సైనికులూ వస్తున్నారు.

చేతులు వెనక్కి మడుచు కుని బురుజు మధ్య భాగం లోకి వచ్చాడాయన. అర్కుని వెంట వస్తున్న వాడు ద్రోహి బాహ్లీకుని మనిషి. వాడ్ని చూడగానే ఆ విషయం అర్థమవుతోంది. బురుజు పైకి వస్తూనే అమాత్యునికి సైనిక వందనం చేసి నిలిచారంతా.

“ఏమైనది? బాహ్లీకుడు రాయ బారం పంపించినాడా?” సూటిగా విషయాని కొస్తూ అడిగాడు మహామాత్యుడు.

“అవును మహా మాత్యా. తక్షణం తన ఆధి పత్యాన్ని అంగీకరించి లొంగి పోయి రత్న గిరిని తన స్వాధీనం చేయ వలె నట. అటుల గాకున్న భారీ విధ్వంసం తప్పదని హెచ్చరిస్తున్నాడు. మనకు అవకాశం యిచ్చుచూ ఈ రాయ బారి వెనక్కు పోయి మన అభిప్రాయము తెలుపునంత వరకు యుద్ధ విరామం పాటిస్తూ తన సేనల్ని హద్దులో ఉంచుతాడట. మన సేనల్ని కూడ అంత వరకు నిలువరించమని అడుగుతున్నాడు.” అంటూ విషయం వివరించాడు అర్కుడు.

వెంటనే సమాధానం చెప్పకుండా కాసేపు మౌనంగా పచార్లు చేస్తుండి పోయాడు మహా మాత్యుడు. ఇలా రాయబారం పంపించుటలో బాహ్లీకుని ధైర్యం వెనక శతానీకుని అండ జూచుకునే అని తేటతెల్లమవుతోంది. గాలి వాటు అనుకూలంగా లేనందున శతానీకుడు తన సేనతో రేపు ఉదయానికి గాని రత్న గిరి చేరుకో లేడు. ఇప్పుడే తాడో పేడో తేల్చుకోవటం బాహ్లీకుడికి ఇష్టం లేదు.




ఒక్క రోజు ఆగితే శతానీకుని సైనిక శక్తి అదనంగా చేరుతుంది కాబట్టి ఈ రోజుకి యుద్ధ విరామాన్ని ఆశిస్తున్నాడు వాడు. అలాగే అదనపు బలగాలు మాళవ సేన ఇక్కడికి చేరటానికి తమకూ ఒక రోజు విరామం అవసరమే. ఈ రాయబారాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలని ఆలోచిస్తున్నాడు మహా మాత్యుడు. అతడి సలహా కోసం వేచి చూస్తున్నాడు అర్కుడు. ఉన్నట్టుండి ఆగి రాయబారి వంక చూసాడు మహా మాత్యుడు.

''ఇతని పేరేమి?'' అడిగాడు.

''వరదుడు'' చెప్పాడు రాయబారి.

''ఇతను ఒక్కడే వచ్చినాడా వెంట ఎవరన్నా ఉంటిరా?''

''ఇంకో ఇరువురు వచ్చినారు. వారు రాజ ప్రాసాదం వద్ద వేచి వున్నారు''

ఈ సారి సర్వ సైన్యాధ్యక్షుడు అర్కుడు బదులిచ్చాడు.

“మంచిది. చూడు వరదా! రక్త పాతం నివారించుటకు మీ నాయకుడు బాహ్లీకుడు యిలా రాయబారం నెరపుట మాకును సంతోషమే. కాని సమాధానమిచ్చుటకు ఈ రాజ్యము మాది కాదు. కేవలము మేము భృత్యులము మాత్రమే. కావున రాజ దంపతులతో సంప్రదించక స్వయం నిర్ణయాధికారము మాకు లేదు. కావున మీకు ప్రత్యుత్తర మిచ్చుటకు తామదము తప్పదు. సాయం సమయాన గాని రేపటి ఉదయాన గాని మా మనిషి ద్వారా రాజ నిర్ణయాన్ని బాహ్లీకునికి తెలియ పర్చగలం. పోయి ఇదే మా మాటగా బాహ్లీకునికి తెలియ జేయుము. యద్ధ విరామానికి కట్టుబడి మా సేనలు ఉన్న చోటు నుండి కదలవు. మీరు కూడ అలాగే ఉండాలె. పోయి రమ్ము” అన్నాడు.

“చిత్తం మహామాత్య. శలవు” అంటూ రాయబారి వరదుడు వెను తిరిగాడు. అర్కుని అక్కడే వుండమని వరదుని వెంట సైనికుల్ని పంపించాడు వాసుదేవ నాయకుడు.

బాహ్లీకుని హెచ్చరిక విన గానే అక్కడే వరదుడ్ని ముక్కులుగా నరికి మూట గట్టి వచ్చిన యిద్దరి చేత వెనక్కి పంపించాలన్నంత కోపం వచ్చింది. అలాంటిది మహామాత్యుడు ఇంత ప్రశాంతంగా ఇంత తేలిగ్గా బాహ్లీకునికి వర్తమానం పంపటం ఏమిటో అర్థం గాక విస్తుపాటుతో చూస్తున్నాడు అర్కుడు. మహా రాణి దుఖ్ఖంలో వున్నారు, మహా రాజు ఉలుకూ పలుకూ లేదు. ఎవరితో సంప్రదించాలి? అతడి అవస్థ గమనించి దరహాసంతో` “ఏమిటి అర్కా! ఆశ్చర్యముగా వున్నదా? పరిస్థితి అర్థము గాలేదా?” అనడిగాడు వాసుదేవ నాయకుడు.

“పరిస్థితియే గాదు, మీ ఆలోచన గూడ అర్థము గాకున్నది అమాత్యా” అన్నాడు అర్కుడు.

“ఆవేశము తగ్గించిన ఆలోచన పరిస్థితిని మనకు బోధ పరుస్తుంది. ఆవేశము వచ్చిన అవకాశాల్ని ధ్వంసం చేస్తుంది. అంతర్యుద్ధంలో జయాపజయాలు అంచనా వేయ లేము. కాబట్టి గాంధార రేడు శతానీకుని బలగాలు సాయం వచ్చు వరకు బాహ్లీకునికి యుద్ధ విరామం అవసరం. అందుకే ఈ రాయబార తంత్రం ప్రయోగించాడు. ఆలోచిస్తే మనకు సాయం వచ్చు వరకు మన పరిస్థితీ అదే. ఇవి రెండూ ఇరు పక్షాలకు రేపటికి సమకూరగలవు. అందుకే నేనలా చెప్పి వరదుడ్ని పంపించితి. కాని ఈ సమయాన్ని ఉపయోగించుకొని మనము బాహ్లీకుని చావు దెబ్బ కొట్ట వలె” అన్నాడు దరహాసంతో వాసుదేవ నాయకుడు.

“మహా మాత్యా! అదెలా సాధ్యం?” అడిగాడు అర్కుడు.

“సాధ్యమే. ప్రస్తుత పరిస్థితిలో ఎవరి కోసం యుద్ధం చేయాలన్న నిరాశతో మనము లొంగి పోయి రత్న గిరిని దోసిట వప్పగించెదమన్న ధీమాతో బాహ్లీకుడు వాడ్ని బల పరిచే సేనలు రాత్రికి మైదానం లోని తమ శిబిరాల్లో తప్ప తాగి అద మరచి నిద్రస్తుంటారు. నీవు మన సేనల్ని మూడు భాగాలు చేసి సిద్ధంగా ఉంచుము. రాత్రి రెండో జాము ముగుస్తుండగా కాగడాలు వెలిగించకుండా చీకట్ల లోనే చాప కింద నీరు వలె మైదానం వైపు ప్రయాణించి వాళ్ళని చుట్టు ముట్టాలె. ఏమి జరుగుచున్నదో వాళ్ళకి తెలిసే లోపలే సగం మంది అంతం కావాలి. ఉదయానికి బాహ్లీకునితో సహా ఎవరూ ప్రాణాలతో మిగల రాదు.”

ఆ మాటలతో వాసుదేవ నాయకుడి అంతరంగం అర్ధమై విభ్రాంతి చెందాడు అర్కుడు. యుద్ధ తంత్రాల్లో ఇది దారుణము, నీచమైన తంత్రం. ఇది ధర్మ యుద్ధం అన్పించుకోదు. సందేహం పీడించగా` “మహా మాత్యా! నిద్రించే వాళ్ళని ఊచ కోత కోయటం న్యాయమా?” అనడిగాడు.

“న్యాయమే” అన్నాడు మహా మాత్యుడు.

“కలికాలము ఆరంభమై నాలుగో శతాబ్దం నడుస్తున్నది. కలి ప్రభావము. న్యాయ ధర్మాలు గతి తప్పబట్టే బాహ్లీకుని వంటి నీచులు అధికరిస్తున్నారు. అవతలి వాడు ధర్మం తప్పినప్పుడు మనం తప్పుటలో తప్పేమున్నది. ముల్లును ముల్లు లోనే తీయ వలె....” ఉన్నట్టుండి ఆకాశం వంక చూస్తూ మాటలు ఆపేసాడు వాసు దేవ నాయకుడు.

అతని చూపులు మబ్బుల పైనే నిలిచి పోయాయి.

సూర్య కాంతికి ధగధగాయమానంగా ప్రకాశిస్తూ ఏదో కిందికి దిగి వస్తూండటం అతని కంట పడింది. అర్కుడు కూడ అటు చూసి విస్మయం చెందాడు.

అప్పటికి బాహ్లీకుడు పంపిన రాయబారి వరదుడు మిగిలిన యిద్దరూ కోట విడిచి రాజ మార్గంలో నగర వాకిళ్ళ వైపు అశ్వాల మీద పోతూ కన్పిస్తున్నారు. వాళ్ళని నగర వాకిళ్ళు సురక్షితంగా దాటించ డానికి పది మంది అశ్వికులు కూడా వెంట వెళ్తున్నారు. వాళ్ళు దూరం వెళ్ళి పోతున్నందున ఆకాశం నుంచి వస్తున్న వస్తువు వాళ్ళ కంట బడే అవకాశం లేదు. కాని కోట పరిసరాల లోని కొందరు పౌరులు వీధుల్లో కొచ్చి మరీ ఆకాశం వంక ఆశ్చర్యంగా చూస్తున్నారు. అది మరి కాస్త దిగువకు రాగానే అర్కుడు గుర్తిస్తూ` “మహా మాత్యా! సరిగా చూడండి. అది పుష్పక విమానము కాదు గదా?” అన్నాడు.

‘‘అది ఏలాగున ఉండునో నాకును తెలియదు అర్కా! కాని ఎగిరి వచ్చుచున్న ఆ పసిడి వాహనమును గాంచ పుష్పకము వలెనే తోచుచున్నది. దేవతలు విహరించు ఆ విమానము అదియు ఉదయ కాలమున మన నగరమున కేతెంచుట అబ్బురముగ నున్నది. సరిగా గమనించుము. అందులో రెండు అశ్వములు, ఎవరో మనుషుల జాడ తెలియు చున్నది’’

‘‘అవును మహామాత్యా. సూర్య కిరణములు సరిగా చూడ నిచ్చుట లేదు. కాని నేరుగా అది కోట వైపే వచ్చు చున్నది. ఒక వేళ అందులో వచ్చునది మన యువ రాజు ధనుంజయుల వారు కాదు గదా’’ సందేహం వెలిబుచ్చాడు అర్కుడు.

‘‘అంత అదృష్టమా… అదియే నిజమైనచో మన ప్రభువు ధర్మ తేజుల వారు మనకు దక్కినట్టే. ఆ విమానము రాజ ప్రాసాద ఆవరణ వైపు వాలుచున్నటున్నది. అదేమిటో చూచెదము గాక పద’’ అంటూ కదిలాడు మహా మాత్యుడు వాసు దేవ నాయకుడు. ఇరువురూ వడివడిగా కోట బురుజు నుండి దిగ నారంభించారు.

***********

పుష్పక విమానం నేరుగా రత్నగిరి కోట లోకి వచ్చి రాజ ప్రాసాదం ముంగిట నేలకు వాలింది. ముందుగా యువరాజు ధనుంజయుడు కిందకు దిగి మాతృ భూమిని తాకి నమస్కరించాడు. పిమ్మట చేయి అందించి సఖియలు మూవురినీ కిందకు దించాడు. చివరిగా భూతం ఘృతాచి కళ్ళాలు పుచ్చుకుని అశ్వాలు రెంటినీ కిందకు దించింది.

రాజ ప్రాసాదం కావలి భటులు రక్షణ సైనికులు అప్పటికే పుష్పక విమానాన్ని గమనించి ఆశ్చర్య సంభ్రమాలతో చూస్తున్నారు. ఎప్పుడైతే అందు లోంచి తమ యువ రాజు ధనుంజయుడు దిగాడో ఇక వారి ఉత్సాహానికి అంతు లేకుండా పోయింది. ‘‘జయహో యువరాజా… జయము జయము. ధనుంజయుల వారికి జయము జయము’’ అంటూ ఒక్క పెట్టున జయ ఘోష ఆరంభించారు. ఆ ఘోష ద్వారాలు దాటి కక్ష్యలు దాటి మందిరాలు దాటి రాజ ప్రాసాదమంతటా సముద్ర ఘోషలా ప్రతిధ్వనించ సాగింది. వారి అభిమానానికి ముగ్ధుడవుతూ చిరు నవ్వుతో సైనికులకు చేయి వూపాడు ధనుంజయుడు. పిమ్మట`

ఇరవై దినముల పైగా గల తమ ప్రయాణ దూరాన్ని ఒక పగలు, రాత్రి లోనే ముగించి గగన మార్గాన తమను రత్నగిరి కోటకు చేర్చిన పుష్పక విమానానికి కృతజ్ఞతగా నమస్కరించాడు. అంతే` లిప్త కాలంలోనే పుష్పక విమానం అక్కడి నుండి అదృశ్యమైంది.

‘‘ఘృతాచి! నిన్నిటుల గాంచిన యిచటి జనులు హడలి చత్తురు. అదృశ్యముగా ఉండుము.’’ అంటూ భద్రా దేవి హెచ్చరించుటతో భూతం ఘృతాచి కూడ అదృశ్యమైనది.

కొందరు భటులను పిలిచి అశ్వాల మీది తమ ఆయుధాలను, సంచులను అన్నిటినీ తన మందిరానికి చేర్చమని ఆజ్ఞాపించాడు ధనుంజయుడు. అలాగే అశ్వాలు ఇన్ని రోజులు ఎడ తెగని ప్రయాణాలతో అలసి పోయి వున్నాయి. వాటిని అశ్వశాలలో వప్పగించి భద్రముగా వాటిని సంరక్షింప అశ్వశాల సంరక్షకులకు చెప్పమని ఆజ్ఞాపించాడు. పిమ్మట సఖియలు మూవురినీ తోడ్కొని రాజ ప్రాసాదంలో ప్రవేశించాడు.

ఈ లోపల`

అటు మహారాజు మంచానికి పరిమితమై.. ఇటు కన్న కొడుకు దూరమైన బెంగతో మహా రాణి కనకాంబిక తినీ తినక శుష్కించి ఆ భీమ శంకరుని నమ్ముకొని ధ్యానిస్తూ ఎక్కువ సమయం పూజా మందిరం లోనే గడుపుతోంది. ఆ ఉదయం కూడ అక్కడ ఉండగా ఉన్నట్టుండి బయట భటుల కోలాహలము, జయ ఘోష ఆమెకు విన్పించింది. అంతే`

అంతటి బలహీనతలో కూడ ఆ తల్లికి అంత బలం ఎలా వచ్చిందో తెలిదు. చివ్వున లేచింది.

‘‘బిడ్డా ధనుంజయా... వచ్చినావా నాయనా... ఎక్కడున్నావయ్యా...’’ అంటూ పరుగు పరుగున పరిచారికులు వెంట పడి వారిస్తున్నా వినకుండా తడ బడుతున్న అడుగులతో ఎదురు వెళ్ళింది. తన కోసం వస్తున్న కన్నతల్లిని చూడగానే పరుగున వచ్చాడు ధనుంజయుడు. తూలి పడబోతున్న తల్లిని ఒడిసి పట్టుకుని అక్కున చేర్చుకున్నాడు. ‘‘కుమారా... నాయనా... వచ్చినావా తండ్రీ’’ అంటూ దుఃఖిస్తున్న తల్లిని ఓదారుస్తుంటే ధనుంజయుని కళ్ళు చెమర్చాయి. ఆ తల్లీ కొడుకుల్ని చూస్తున్న అందరి కళ్ళలోనూ నీరు నిలిచింది.

‘‘అమ్మా నేను వచ్చితిని గదా. ఇక భయము వలదు. బెంగటిల్ల పని లేదు. దివ్య నాగమణి తెచ్చితి. జనకుడు ఎప్పటిలా లేచి నడయాడ గలరు’’ అంటూ తల్లిని వూరడించాడు.

మహా రాణి కన్నీరు తుడుచుకుంటూ అప్పుడు చూసింది తన కుమారుని వెంట దేవ కన్యల్లా మెరిసి పోతున్న ముగ్గురు యువతుల్ని. ఎవరన్నట్టు ధనుంజయుని చూసింది.

‘‘దివ్య నాగ మణితో బాటు నాకు లభించిన మూడు మేలిమి రత్నాలు.’’ అంటూ ధనుంజయుడు తన కాబోయే కోడండ్రు ముగ్గురినీ పరిచయం చేస్తుంటే మహా రాణి ఆనందానికి అంతు లేకుండా పోయింది. వినయంగా తనకు పాదాభి వందనం చేస్తున్న

ముగ్గురినీ లేపి అక్కున చేర్చుకుంది. పిమ్మట`

అందరినీ తీసుకుని తన తండ్రి మహా రాజు ధర్మతేజుడున్న మందిరానికి బయలుదేరాడు. ఇంతలో కోట బురుజు నుంచి దిగి వచ్చిన మహా మాత్యుడు వాసు దేవ నాయకుడు, సర్వ సైన్యాధ్యక్షుడు అర్కుడు అక్కడికి చేరుకున్నారు. పెద్దయిన ఆ యిరువురికీ సవినయంగా నమస్కరించాడు ధనుంజయుడు. తమ యువ రాజును చూడగానే ఆ యిరువురి ఆనందానికి మేర లేక పోయింది. ఆ మహా వీరుడు తిరిగి వచ్చుటతో గుండె నుండి పెను భారం దిగి పోయినట్టు సంతోషించారు.

అందరూ రాజ మందిరంలో ప్రవేశించారు.

హంస తూలికా తల్పం మీద స్పృహ లేని స్థితిలో బోర్లా పడి వున్నాడు ప్రభువు ధర్మ తేజుడు. ఇరువురు దాసీలు చెరో పక్కన వుండి వింజామరాలు వీస్తున్నారు. రాజ వైద్యులు నలుగురు అక్కడ వున్నారు.

మహా రాజు పరిస్థితి చాలా దయనీయంగా వుంది. అయన వెన్ను మీద రెండు రెక్క గూళ్ళకు మధ్యన వృత్తాకారంలో అరచేయంత మేర వ్యాపించిన రాచపుండు లావా పొంగుతున్న జ్వాలా ముఖిలా వుంది. ఎర్రగా పుట్టలా పెరిగి నెత్తుటి ముద్దలా వుంది. బాధ ఉపశమించ డానికి వ్రణం చుట్టూ వైద్యులు పూసిన ఔషధి లేపనాలు, పూతలు నల్లగా మాడి ఎండి పోయి చూడ్డానికి పగిలిన అగ్ని పర్వతాన్ని తలపిస్తోంది. ఇంత కాలము ఆ వ్రణ బాధను ఆయన ఎలా భరిస్తూ వచ్చాడో గాని ఆ బాధ వర్ణనాతీతం. ధనుంజయుని కళ్ళలో నీరు నిలిచింది.




“యువరాజా! పరిస్థితి విషమించినది. దివ్య నాగమణి లభించినదా. యిలా యివ్వండి.” అనడిగాడు రాజ వైద్యులలో వృద్ధుడు.

ధనుంజయుడు తన దుస్తుల నుంచి బంగారు పేటిక తీసి అందించబోతుంటే వెంటనే వారించింది భద్రా దేవి. వైద్యుని చూస్తూ` “మీరు ఘన వైద్యులు. అందులో సందేహం లేదు. కాని ఇంత వరకు మీరు దివ్య నాగ మణిని చూసి వుండరు. దాని శక్తిని మీరు తట్టుకో లేరు.” అంటూ ధనుంజయుని చేతుల నుంచి పేటికను అందుకుని ఉలూచీశ్వరికి అందించింది.

“చెల్లీ... ఈ కార్యము నీవే నిర్వహించ వలె. కానిమ్ము” అంది.

రాజ వైద్యులు నిర్ఘాంత పోయారు.

“అమ్మా! మీరెవరో మాకు తెలియదు. మేము చేయ లేని కార్యమును ఈ అమ్మడు చేయ గలదా?” అనడిగాడు వృద్ధ వైద్యుడు.

“సందేహము వలదు. ఈ దివ్య నాగ మణికి ఈమెయే వారసురాలు.” అని బదులిచ్చింది భద్రా దేవి.

రాజ వైద్యులకు అర్థం కాలేదు.

అయినా మిన్నకుండి పోయారు.

ఉలూచిశ్వరి పేటికను దోసిట ఉంచుకుని అర్ధ నిమీలిత నేత్రాలతో భక్తితో ముందుగా తన తాత గారు నాటి నాగ రేడు పద్ముడిని స్మరించుకుంది. పిమ్మట తన జనకుడు మహా పద్ముని తలచుకుంది. పిమ్మట పేటిక మూతను తెరిచింది. అంతే`

ఒక్క సారిగా నివ్వెర పోయారంతా.

స్వయం ప్రకాశమగు దివ్య నీల మణి నీలి రంగు కాంతి పుంజాలతో రాజ మందిరమే తేజో వంతమై పోయింది. ఆ కాంతుల్ని చూడ లేక కొంత తడవు కనులు మూసుకున్నారంతా.

ఉలూచిశ్వరి ఆ నీలి కాంతులు పుట్టవ్రణానికి సోకేట్టు వాలుగా పట్టుకుని సమీపంలో నిల బడింది. దివ్య నాగ మణి కిరణాలు తాకగానే మొదట వ్రణం చుట్టూ వేసిన పైపూతలు లేపనాలు ఎండి గట్టి పడినవి కరిగి సుడి గాలికి లేచి పోయే ధూళిలా లేచి పోయి చర్మం శుభ్ర పడింది. చీము నెత్తురులతో కూడిన వ్రణం లోని ద్రవం ఇంకి పోనారంభించింది.

పిమ్మట దివ్య నాగ మణిని తీయకుండానే ఆ బంగారు పేటికను అలాగే వ్రణం మీద బోర్లించి గట్టిగా అదిమి పట్టుకుంది. ఎప్పుడైతే దివ్య నాగ మణి వ్రణాన్ని తాకిందో అంత వరకు స్పృహలో లేని మహా రాజు ధర్మ తేజుడు ఒక్క సారి బిగ్గరగా మూలిగి తిరిగి అచేతనుడయ్యాడు.

ఏం జరుగులోంది ఎవరికీ అర్థం గావటం లేదు. సంభ్రమంలో వీక్షిస్తున్నారంతా. ఎవరో లోపలి నుంచి తోసేస్తున్నట్టు స్వర్ణ పేటిక లేచి లేచి పడుతోంది. ఉలూచిశ్వరి బలంగా అదిమి పట్టి ఉంచుతోంది. బహుశ పుట్ట వ్రణం తాలూకు దోషం తప్పించుకునే

ప్రయత్నం చేస్తోందా అనిపిస్తోంది చూపరులకు.

క్షణాలు భారంగా దొర్లి పోతున్నాయి.

మహా రాజులో చలనం లేదు.

చీమ చిటుక్కుమన్నా వినిపించేంతగా`

రాజ మందిరంలో నిశ్శబ్దం అలుముకునుంది.

ఊపిరి బిగ బట్టి ఉత్కంఠ భరితులై వీక్షిస్తున్నారంతా. పసిడి కాంతు లీను స్వర్ణ పేటిక క్రమంగా కాంతి హీనంగా మారి నల్లబడుతోంది. పాల కన్నా తెల్లని ఉలూచీశ్వరి చేతులు కూడ కమిలి వాడి పోతున్నట్టు నల్లగా మారి పోతున్నాయి. భద్రా దేవి ఆ దివ్య నాగ మణిని రాజ వైద్యులకు యివ్వకుండా ఎందుకు ఆపిందో అప్పటిగ్గాని ధనుంజయునికి అర్థం కాలేదు.

స్వర్ణ పేటికతో బాటు తన చేతులూ నల్ల బడి పోయినా పేటికను విడువ లేదు ఉలూచీశ్వరి. అదిమి పట్టి అలాగే ఉంచింది. చాలా సేపటికి ఉన్నట్టుండి మార్పు మొదలయింది.

పాలి పోయిన ధర్మ తేజుని శరీరం తిరిగి కాంతి పుంజుకో నారంభించింది. నలుపు వర్ణం తరిగి పోతూ స్వర్ణ పేటిక తిరిగి పసిడి వర్ణం సంతరించుకుంది. నల్ల బారిన ఉలూచీశ్వరి కరము తిరిగి యథా పూర్వ స్థితికి మారాయి.

ఉత్కంఠ భరితులై వీక్షిస్తున్నారంతా...

మరి కొంత తడవు ఆగిన పిమ్మట...

స్వర్ణ పేటికను దివ్య నాగ మణితో సహా...

వెనక్కు తీసుకుంది ఉలూచీశ్వరి...

దివ్య కాంతులతో మెరిసి పోతోంది నాగ మణి. పేటికను ఎప్పటిలా మూసి వేసింది. అందరి కళ్ళు ఆసక్తిగా ప్రభువు వెన్ను భాగాన్ని చూస్తున్నాయి. ఆశ్చర్యం... అద్భుతం... విచిత్రం. వెన్ను మీద ఎక్కడా కనీసం పుట్ట వ్రణం తాలూకు చిన్న మచ్చ కూడ కన్పించ లేదు. దివ్య నాగ మణి ప్రభావం మొత్తం పుట్ట వ్రణాన్ని సమూలంగా హరించి ప్రభువును సంపూర్ణ ఆరోగ్య వంతుడ్ని చేసింది. కాని ఆయన ఇంకా స్పృహ లోకి రాలేదు.

ఉలూచీశ్వరి దివ్య నాగ మణి వున్న స్వర్ణ పేటికను అత్త గారు రాణి కనకాంబికకు అందించగా ఆమె దాన్ని పక్క మందిరంలో భద్ర పరిచి వచ్చింది. ఈ లోపల భద్రా దేవి రాజ వైద్యుల్ని చూసి` ''మహా రాజు గారు స్పృహ లోకి వచ్చుటకు కొంత సమయమగును. లేవ గానే ఆకలికి తట్టుకో జాలరు. బల వర్ధకము, తేలికగా జీర్ణమగు ఆహారము ఏమి యివ్వ వచ్చునో నిర్ణయించి ఏర్పాటు చేయించండి'' అంది.

యువ రాజు ధనుంజయుని మనసు ఇప్పుడు తేలిక పడింది.

***************

అదే రోజు మధ్యాహ్న వేళ

రత్న గిరి కోట నుండి బయలు దేరిన అశ్వికుడొకడు చెమటలు కక్కుతూ అశ్వాన్ని మైదాన ప్రాంతాల వైపు దౌడు తీయిస్తున్నాడు. రత్న గిరికి ఈశాన్యంగా పది యోజనాల దూరంలో అటవీ ప్రాంత సమీపంలో విస్తరించి ఉన్నాయా మైదానాలు. బాహ్లీకుని సేనలు ప్రస్తుతం ఆ మైదానాల్లోని శిబిరాల్లో విడిది చేసి వున్నాయి.

అశ్వికుడు శిబిరాల మధ్యగా చాలా దూరం ముందుకు పోయి అక్కడ ప్రత్యేకంగా నిర్మించిన పెద్ద అందమైన శిబిరం ముందు అశ్వం దిగాడు. అతడ్ని ఎవరూ అడ్డగించ లేదు.

రత్నగిరిలో బాహ్లీకుని అనుయాయులు ఇంకా వున్నారు. ఎప్పటికప్పుడు అక్కడి సమాచారం అంద జేస్తుంటారు. వారిలో ఈ అశ్వికుడొకడు. రాజ ప్రాసాద రక్షణ దళం లోని సైనికుడు. ఏదో వంకతో నగర వాకిళ్ళు దాటి రాగలిగాడు.

అశ్వం దిగుతూనే వడి వడిగా లోన ప్రవేశించాడు వాడు. ఆ సమయంలో బాహ్లీకుడు కొందరు సేనాపతులతో యుద్ధంలో అనుసరించాల్సిన వ్యూహాల గురించి చర్చిస్తున్నాడు. లోనకొచ్చిన అశ్వికుని చూడగానే చిరు నవ్వుతో` ''రా ఉత్కళా... రత్నగిరి సమాచార మేమి? మా రాయబారము అచట సంచలనమైనదా?'' అనడిగాడు.

''సంచలనము కాదు నాయకా! సంక్షోభమయ్యేట్టున్నది. విషయము మీకు తెలిసినదో లేదో యని ఇటు వచ్చితి'' అన్నాడు ఉత్కళుడనే ఆ సైనికుడు.

''ఏ విషయము గూర్చి అడుగుచున్నావు?''

''ఏకాంతము కావలె.''

బాహ్లీకుడు సైగ చేయగానే`

సేనాపతులు శిబిరం నుండి నిష్క్రమించారు.

''ఇప్పుడు చెప్పుము ఉత్కళా. ఏమి జరిగినది?'' అడిగాడు.

''యువ రాజు ధనుంజయుడు కోటకు తిరిగి వచ్చిన సంగతి మీకు తెలియునా?'' అడిగాడు ఉత్కళుడు.

ఆ ప్రశ్న ఒక్క సారిగా బాహ్లీకుని ఉలికి పడేలా చేసింది. పాదాల కింద భూమి కొన్ని లిప్తల కాలం పాటు చలించినట్టనిపించింది.

నమ్మ లేనట్టు చూసాడు. ఇంత కాలం తిరిగి రాని వాడు ఈ సమయంలో వచ్చుట ఏమి? అతడి రాక తనకు ఇబ్బంది కరమే కాదు అత్యంత ప్రమాద కరము.

“ఏమంటివి? యువ రాజు వచ్చినాడా?” ఎలాగో నోరు పెకల్చి అడిగాడు.

“అవును. దివ్య నాగ మణితో బాటు అప్సరస వంటి ముగ్గురు కన్యలతో పుష్పక విమానంలో వచ్చి దిగినాడు. దివ్య నాగ మణి ప్రభావంతో మహా రాజు ధర్మ తేజుడు సంపూర్ణ ఆరోగ్య వంతుడైనాడు. కోటలో పండుగ వాతావరణం నెలకొని వున్నది. రాజ కుటుంబమంతా విందు భోజనాలారగిస్తుండగా ఆ సమాచారంతో నేనిటు వచ్చితి” అంటూ ఉత్కళుడు వివరిస్తుంటే బాహ్లీకుని ముఖం కళా విహీనమై పోయింది.

“నేను పంపించిన రాయ బారం గూర్చి ప్రస్తావన రాలేదా?” అడిగాడు.

“ఇంత వరకు ఈ విషయం తెలిసి ఉండదనుకుంటాను. మహా వీరుడయిన యువ రాజు గాని, మహా రాజు ధర్మ తేజుడు గాని రాజ్యాన్ని వదులుకోడానికి సిద్ధంగా ఉండరు. సందేహము లేదు. యుద్ధం తప్పదు. ఈ దినము యుద్ధ విరామము ప్రకటించ కుండా ఉండాల్సింది.”

తల పంకించాడు బాహ్లీకుడు.

“నీ పలుకులు సత్యములే. కాని యిక్కడ ఇరు వైపులా బలగాలు సమంగా వున్నవి. అటు చూడ ఒక అక్షౌణీ మాళవ సేను రత్న గిరికి మద్దతుగా తరలి వస్తున్నట్టు వార్తలు వింటున్నాము. ఈ సమయంలో మనకు అదనపు బలం అవశ్యం. గాంధారం నుండి మారు వేషాలతో రాజ్యాలు దాటి వచ్చిన అశ్విక దళం పాతిక వేల ఉత్తర సరిహద్దులో వేచి వుంది. అది మూడు దినముల క్రితమే బయలు దేరింది. అది రేపటికి వచ్చి చేరుతుంది.. అటు శతానీకుని నౌకలు కూడ రేపటికి గాని రత్న గిరి చేరుకో లేవు. చూచెదము గాక! రత్న గిరి, మాళవ సేను కలిపి రెండు అక్షౌణీ సైన్యం. శతానీకుని రాకతో మనది మూడున్నర అక్షౌణీ సైన్యం. మన ముందు నిలువ లేక రత్న గిరి దాసోహమనక తప్పదు. అందుకే ఈ యుద్ధ విరామం ఈ దినమున అనివార్యమైనది.” అంటూ వివరించాడు బాహ్లీకుడు.

“నిజమే. కాని ధర్మ తేజుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడగుట, యువరాజు తిరిగి వచ్చుట ఈ పరిణామం మన సైనికులకు తెలిసిన

కొంత సేన వెనక్కు పోవు ప్రమాదమున్నది…’’

‘‘తెలియదు. నేనా ఏర్పాటు చూసెదను. రేపు ఉదయం తిరిగి యుద్ధ భేరీలు మ్రోగనున్నవి. నీవు కోటకు మరలి పోదువా? ఉండి పోదువా?’’ అడిగాడు బాహ్లీకుడు.

‘‘యుద్ధానంతరము మీరు విజయ లక్ష్మితో రత్నా గిరిలో ప్రవేశించునపుడు ఘనంగా స్వాగత సత్కారాలు ఏర్పాటుకు నేను అచట ఉండుట అవసరము. పోయి వత్తును’’ అంటూ వచ్చిన వాడు వచ్చినటులే తిరిగి అశ్వాన్నధిరోహించి రత్నా గిరికి సాగి పోయాడు ఉత్కళుడు.

********************

రత్నా గిరి కోట పైన అదే బురుజులో `

యువ రాజు ధనుంజయుడు, మహా మాత్యుడు వాసు దేవ నాయకుడు, సర్వ సైన్యాధ్యక్షుడు అర్కులతో ఏకాంతంగా సమావేశమై వున్నాడు. మిట్ట మధ్యాహ్న సమయం. తను నగరంలో లేని సమయంలో జరిగిన పరిణామాలు ప్రస్తుత రాజకీయ పరిస్థితి నిన్నటి యుద్ధ విశేషాలు పూస గుచ్చినట్టు వివరిస్తుంటే శ్రద్ధగా విన్నాడు ధనుంజయుడు. బాహ్లీకుని రాయబార సమాచారం విన్నా కొంచెం కూడ ఆవేశం ప్రదర్శించ లేదు.

చాలా ఎత్తులో వున్న కోట బురుజు నుండి అటు పశ్చిమ సముద్రాన్ని ఇటు నగర పరిసరాలు సుదూరం వరకు స్పష్టంగా చూడ గలుగుతున్నారు. రాత్రికి తమ యుద్ధ వ్యూహం గురించి ఎత్తు గడ గురించి కూడ ఇరువురూ యువ రాజుకి వివరించి చెప్పారు.

చాలా కాలం తర్వాత తన మాతా పితలతో బాటు సఖియలు  ముగ్గురితో విందు భోజనం యువ రాజుకి చాలా ఆనందంగా వుంది. ముఖ్యంగా తండ్రి సంపూర్ణ ఆరోగ్యవంతుడు గావటం తన తల్లి ఆనందం యువ రాజుకి ఎన లేని సంతోషాన్ని ఆనందాన్ని ఇస్తున్నాయి. చాలా కాలం తర్వాత భోంచేయటంతో వెంటనే నిద్ర పోయాడు ప్రభువు ధర్మ తేజుడు.

కొంత తడవు మౌనంగా వున్న యువ రాజు దరహాసంతో ఎదురుగా వున్న ఇరువురినీ చూసాడు.




“ఈ ఒక్క రాత్రికి బాహ్లీకుని ప్రశాంతంగా నిద్ర పోనిచ్చెదము గాక. మన సేనల్లు కదలాల్సిన పని లేదు. విజయం కోసం మనమేల అడ్డు దారి తొక్కవలె? ఉదయము తొలి జాము గడువ గనే యుద్ధ భేరీలు మ్రోగాలె. ఇటు మన సేనలు అటు బావ ఇంద్ర జిత్తు వెంట వస్తున్న మాళవ సేన మధ్య అడ కత్తెరలో చిక్కిన పోక చెక్క వలె బాహ్లీకుడు వాని సేనలు చిక్కి నలిగి నశించి పోవలె. ముప్పేట దాడిలో మొత్తం తుడిచి పెట్టుకు పోగలరు.” అంటూ తన అభిప్రాయం విన్పించాడు.

అది విని ముఖ ముఖాలు చూసుకున్నారు మహా మాత్యుడు వాసు దేవ నాయకుడు, సర్వ సైన్యాధ్యక్షుడు అర్కుడు. పరిస్థితి యువ రాజుకి సరిగా బోధ పడినట్టు లేదనిపించింది వారికి.

“కానీ... శతానీకుని సంగతి మర్చి పోయినట్టున్నారు. భూ మార్గంగా వచ్చిన పాతిక వేల అశ్విక దళం ఉత్తర సరి హద్దు నుండి రత్న గిరి వైపు కదలి వస్తోందని సమాచారం...”

‘‘అవగతమైనది అమాత్య వర్యా’’ అంటూ మహా మాత్యుని మాటలకు అడ్డు వచ్చాడు యువ రాజు.

‘‘అశ్విక దళాన్ని నేను తుడిచి పెట్ట గలను. అయిననూ రెండు ఆక్షౌణీ గాంధార సేనల్ని సాగరం మీద నిలువరించ లేము. అది ఒక్కటే కలవర పరుస్తున్నది. ఏదో ఒకటి జేసి ఆ మూర్ఖుడు శతానీకుని నిలువరించాలె. చూచెదము గాక, మనమొక పరి సాయంకాలము సమావేశమగుట మంచిది. ఎవరు ఎటు వైపు సారధ్యము వహించిన మేలు జరుగునో చర్చించెదము గాక. మరొక్క విషయము, ప్రస్తుత పరిణామము జనకునకు తెలియవు. పోరు సంగతి తెలిసిన తనూ రణ క్షేత్రమునకు బయలుదేర గలరు. ఆయనకు విశ్రాంతి అవసరము. కోటకే పరిమితము గావలె. వారికి ఏ విషయమూ తెలియ గూడదు. అలాగే మన ప్రధాన సేనల్ని ఈ రోజే ఆరు భాగాలుగా విభజించి సిద్ధంగా ఉంచండి’’ అన్నాడు యువ రాజు.

అర్కుడు ఏదో మనవి చేయ బోతూ`

ఉన్నట్టుండి ఆగి పోయాడు.

రెండో సారి అతడి చెవులకు సోకిందా శబ్దం.

పాము బుస..!

ఇంత సేపు చర్చలలో పడి గమనించ లేదు గాని గప్పున వీస్తోంది సంపంగి పూల పరిమళం. ఉలికి పడి చూసిన అర్కునికి బురుజు మూడో స్తంభం వద్ద చుట్ట చుట్టు కొని లేచి పడగ విప్పి ఆడుతున్న పెద్ద శ్వేత నాగు కంట బడింది. తెల్లగా మెరిసి పోతున్న ఆ సర్పాన్ని చూసి హడలి పోయాడు` ‘‘యువ రాజా! అటు చూడండి విష సర్పం... శ్వేత నాగు... ఇది ఎలా వచ్చెనిటకు’’ అంటూ విసిరేందుకు వెంటనే చురిక తీయ బోయాడు. చప్పున వారించాడు ధనుంజయుడు. అంతటి మహా మాత్యుని కూ్కడా ఆ శ్వేత నాగును చూడగానే నుదుట శ్వేదం అలుముకుంది.

‘‘అది ఎవరినీ ఏమీ చేయదు. మీరు తత్తళింప పని లేదు. ఆగండి’’ అని వారిస్తూ శ్వేత నాగు వద్దకెళ్ళి నవ్వుతూ` ‘‘ఏమి కార్యమిది? ఇచటికేల వచ్చితివి ప్రియ సఖీ’’ అంటూ చేతులు చాపాడు. అంతే`

శ్వేత నాగు అతడి కరములకు చుట్టుకుని భుజం మీదికి ఎగ బ్రాకింది. అర్కుడు, వాసు దేవ నాయకుడు మాటలు మరిచి విభ్రాంతులయి చూస్తున్నారు. ఉలూచిశ్వరి నాగ కన్యయని వారికి తెలీదు. ఉన్నట్టుండి శ్వేత నాగు అదృశ్యమై అక్కడ ఉలూచిశ్వరి ప్రత్యక్షమైంది.

‘‘సఖీ... ఇది యేమి కొంటె తనము. అనవసరముగ వారిని కంగారు పరిచినావు గదా. అంతఃపురమున విశ్రాంతి గైకొనకు ఇటు

రానేల?'' ఆమె చేయి అందుకొంటూ అడిగాడు ధనుంజయుడు.

''రత్న గిరి పురము జూడ ఇచ్ఛ గలిగి వచ్చితి. మిము కలత పరిచిన పెద్దలు నను క్షమించ వలె.'' అంటున్న ఉలూచీశ్వరిని చూస్తూ కలత నుండి తేరుకొని నవ్వారు అమాత్యుడు, అర్కుడు ఇరువురూ.

''ప్రభూ! బాహ్లీకుని సేనలు విడిది చేసినది సుదూరమున కన్పట్టు ఆ మైదాన భూములే గదూ?'' చేయెత్తి చూపుతూ యువరాజును అడిగింది ఉలూచీశ్వరి.

''అవును గాని మా చర్యలు నీవు వింటివనుకొందును. ఈ యుద్ధ సన్నాహములతో నీకు పని యేమి? భద్రా దేవి, మణి మేఖల ఇరువురును ఎచట?'' అడిగాడు.

'ఇదో... వచ్చుచుంటిమి ప్రభూ!'' అంటూ అప్పుడే మెట్లెక్కి పైకి వస్తూ కన్పించారు అతివలిద్దరూ.వచిన భామలు ముగ్గురూ ఒక చోట చేరటంతో ఇక తమ ఉనికి అచట ఉచితము కాదని అర్థం జేసుకుని యువ రాజు వద్ద శలవు గైకొని కిందకు వెళ్ళి పోయారు వాసు దేవ నాయకుడు, అర్కుడు.

పిమ్మట సఖియలు మూవురితో ముచ్చటలాడుతూ చాలా సేపు ఆ బురుజు మీదే ఉండి పోయాడు యువ రాజు ధనుంజయుడు.

*************

అదే రోజు సాయం సమయాన`

ధనుంజయుడు తన యక్ష మిత్రుడు రుచికుని తలచుకుని పిలిచాడు. వెంటనే ప్రత్యక్షమై ధనుంజయుని సంతోషంగా కౌగిలించుకుని అభినందించాడు రుచికుడు. ఇద్దరూ చాలా సేపు మంతనాలు జరిపారు.

''మిత్రమా! నా సహకారం ఎప్పుడూ నీకు ఉంటుంది. అయిననూ రెండు ఆక్షౌణీల పైగా సైన్యము మాటలు కాదు. ఈ రాత్రికే

సాధ్యమగునంత వరకు నౌకను సముద్రము పాలు జేసి శతానీకుడు తల పట్టుకుని వ్యథ చెందేలా జేసెద. నీట మునిగి చచ్చిన వాళ్ళు చావగా బతికి తీరమునకు వచ్చు సేనలను మీ మలుకాండ్రు బాణము వేసి మట్టు పెట్ట వచ్చు. ఇక రత్నగిరి కోట వరకు మా యక్షులు అదృశ్య రూపమున కావలి ఉందురు. శత్రువు ఎవడు కోట గోడను తాకినా నెత్తురు కక్కుకుని చచ్చెదరు. రేపు యుద్ధ సమయమున వచ్చి కలిసెద'' అని మాటిచ్చి అదృశ్యమైనాడు రుచికుడు.

వెంటనే సర్వ సైన్యాధ్యక్షుడు అర్కుడితో మాట్లాడి అనేక మంది మేటి విలుకాండ్రను తమ గస్తీ నౌకల్లోకి తరలింప జేసాడు ధనుంజయుడు.

ఆ రాత్రి ప్రశాంతంగా నిద్ర పోయింది కోట లోని రాజ కుటుంబం మాత్రమే. అటు సముద్రం మీద తరలి వస్తున్న గాంధార రేడు శతానీకునికి, అక్కడ మైదాన భూముల్లో విడిసిన బాహ్లీకునికి వారి సైన్యానికి అది కాళ రాత్రి.

సముద్రం మీద గాలి వాటు అనుకూంగా లేక రెండ్రోజులు ఆలస్యమైనా ఆ రోజు ఉదయం నుండి వాతావరణం సానుకూలంగా వుంది. సముద్ర జలాల్ని చీల్చుకుంటూ తమ యుద్ధ నౌకలన్నీ రత్నగిరి వైపు శర వేగంతో దూసుకు పోతున్నాయి. నిండుగా గాలి పోసుకొని తెర చాపు రెప రెప లాడు తున్నా యి. ప్రయాణం యిలాగే సాగితే తెల్ల వారే సరికి నౌకలు రత్నగిరి చేరుకొని ముట్టడిస్తాయి. అటు నుంచి బాహ్లీకుని సేనలు ఇటు నుంచి గాంధార సేన మధ్య రత్న గిరి సేనలు అగ్నిలో పడ్డ శలబాల్లా మాడి మసి గాక తప్పదు. మూడు దినాలకు మించని ముట్టడితో రత్నగిరి తన వశం గాక తప్పదు.

తన ప్రత్యేక నౌక పై భాగంలో కూచుని మధిర సేవిస్తూ సముద్రం మీద మిడతల దండులా సాగుతున్న తమ నౌకలను, సముద్రం మీద సంధ్యా సమయాన్ని వీక్షిస్తూ రత్నగిరి ఇప్పుడే తన వశమై పోయినట్టు వూహా గానాలతో ఆనంద పడుతున్నాడు గాంధార దేశా ధీశుడు శతానీకుడు. నిజానికి రత్నగిరి యువరాజు ధనుంజయుడు రత్నగిరి చేరుకున్నట్టు గాని, దివ్య నాగ మణి ప్రభావంతో రత్న గిరి రాజు ధర్మ తేజుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడైనట్టు గాని శతానీకునికి తెలీదు.

సముద్రం మీద పశ్చిమాన సూర్యాస్తమయమైంది. చిక్కటి కాటుక వంటి నల్లటి చీకట్లు తూర్పు నుంచి చూస్తుండ గానే అలుముకున్నా యి. వేలాది యుద్ధ నౌకల మీద కాగడాలు వెలిగించ బడ్డాయి. రాత్రి తొలి జాములో శతానీకుడు తన నౌకలో సేనా పతులతో సమావేశమయ్యాడు. ఉదయం రత్నగిరి మీద ముట్టడి ఎలా చేయాలనే విషయంగా చాలా సేపు వారంతా చర్చించుకున్నా రు. సరిగ్గా అప్పుడే ఆరంభమైంది సంక్షోభం.

గగన తలం నుండి పెద్ద గ్రహ శకలం ఏదో జారి సముద్రంలో పడినట్టు భయంకర శబ్దం ఏర్పడింది. అది సరిగ్గా నౌక మధ్యన పడింది. ఉప్పెన తాకినట్టు రాకాసి అలలు లేచి సాగరం అల్లకల్లోలమైంది. అంత వరకు అనేక వరుసలు తీరి క్రమ శిక్షణతో సాగుతున్న యుద్ధ నౌకలు అలల తాకిడికి తలో పక్క దూరంగా చెదిరి పోనారంభించాయి. అది పడిన వేగానికి పది నౌకలు తల్లక్రిందులై

సముద్రంలో మునిగి పోయి వంద సైనికులు నీటి పాలయ్యారు. చీకట్లలో ఒక్క సారిగా హాహాకారాలు ఆర్తనాదాలు చెల రేగాయి. ఎందరు బతికున్నారో, ఎందురు చచ్చారో తెలీదు.

శతానీకుడు అతడి సేనాపతులు వున్న నౌక కూడ కొద్ది సేపు వూగి పోయింది. చర్చలు అర్థాంతరంగా ఆగి పోయాయి. అంతా నౌక ఉపరితలానికి పరుగెత్తు కొచ్చి చూసారు. అలల తాకిడికి చెదిరి పోతున్న నౌకలు కన్పించాయి. ఏదో సముద్రంలో పడిందని సైనికులు చెప్తున్నా అదేమిటో అర్థం కాలేదు.

నిజానికి అలా దూకింది ఎవరో కాదు`

ధనుంజయుని యక్ష మిత్రుడు రుచికుడు.

ఆకాశం లోనే తన శరీరాన్ని పర్వతంలా పెంచేసి ఒక్క సారిగా సముద్రం లోకి దూకి నౌకల్ని చెల్లా చెదురు చేసాడు. ఇక తర్వాత శతానీకుని నౌకతో ఆడుకోవటం ఆరంభించాడు. సముద్ర జలాల్లో తిమింగంలా ఈదుతూ దొరికిన నౌకను దొరికినట్టు సముద్రంలో ముంచేయ సాగాడు. కాని సొరచేపలు దాడి చేస్తున్నా యని శతానీకుడు బావించాడు. చూస్తుండగానే అనేక నౌకలు తల్లకిందులు గావటంతో ముందుకు పోడానికి ధైర్యం చాల్లేదు. ముందు సముద్రం విడిచి తూర్పు తీరం చేరుకుంటే తర్వాత ముట్టడి గురించి ఆలోచించ వచ్చనుకున్నాడు. దాంతో నౌకలు దిశ మార్చుకొని తూర్పుగా తీరం వైపు ప్రయాణం ఆరంభించాయి. అయినా మృత్యువులా రుచికుడు వాళ్ళని వెంటాడుతూనే వున్నాడు. తెలతెల వారుతూండగా నౌకలు తీరాన్ని సమీపించే సమయానికి పది వేల నౌకల్ని సముద్రంలో ముంచేసాడు రుచికుడు. శతానీకుడికి నిద్ర లేకుండా చేసాడు. ఏమైతేనేమి ఆ రాత్రి పది వేల నౌకల్ని, డెబ్బై వేల సైన్యాన్ని కోల్పోయాడు శతానీకుడు.

తెల్ల వారే సరికి వేలాది గాంధార సైనికుల మృత దేహాలు తీరానికి కొట్టుకు రా నారంభించాయి. ఎలాగో ప్రాణాలు గుప్పిట ఉంచుకొని తీరానికి ఈదుకొస్తున్నవాళ్ళను రత్నగిరి నావికా దళంలో విలుకాండ్రు బాణాు వేసి ప్రాణాలు తీయ సాగారు.

భళ్ళున తెల్ల వారే సరికి బ్రతుకు జీవుడా అన్నట్టు మిగిలిన సైన్యంతో రత్నగిరికి ఉత్తరంగా పది యోజనాల దూరంలో తీరం చేరుకున్నాడు శతానీకుడు.

ఈ లోపల అదే రాత్రి`

అక్కడ మైదాన భూముల్లో బాహ్లీకుడు అతడి సేనలు శిబిరాల్లో గాఢ నిద్రలో వుండగా ఒక్క సారిగా చెలరేగింది కలకలం. ‘‘బాబోయ్ పాములు... ఎటు చూసినా విష సర్పాలు’’ అంటూ సైనిక శిబిరాల్లో అరుపులు, ఆర్తనాదాలు చెల రేగాయి. గాఢ నిద్రలో వున్న బాహ్లీకుడు తృళ్ళిపడి లేచాడు. లేచి లేవ గానే కాగడాల వెలుగులో బుసలు కొడుతూ వస్తున్న రెండు విష సర్పాలను చూసి అదిరి పడి పక్కకు దూకాడు. వెంటనే ఖడ్గం దూసి రెంటినీ ముక్కలుగా ఖండించి చర చరా గుడారం లోంచి బయటి కొచ్చాడు.

అప్పటికే పరిస్థితి దారుణంగా వుంది.

ఎటు చూసినా కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న విష నాగులు కన్పిస్తున్నాయి. అవి దొరికిన వాళ్ళని దొరికినట్టు కాటు వేస్తున్నాయి. ఎటు చూసినా సైనికుల అరుపులు, ఆర్తనాదాలు, దానికి తోడు హడావుడిలో ఎలాగో ఎగిరి కొన్ని కాగడాలు గుడారాల మీద పడి భగ్గున ఎగసాయి మంటలు. మరో వంక సైనికులు కన్పించిన సర్పాన్ని కన్పించినట్టు తన కరవాలాలకు బలివ్వ సాగారు. బాహ్లీకునికి పిచ్చి పట్టినంత పనయింది. ఉన్నట్టుండి ఆ మైదాన భూముల్లోకి వేలాది విష నాగులు ఎలా వచ్చాయో ఎందుకు తమ మీద దాడి చేస్తున్నాయో బుర్ర చించుకున్నా అర్థం గావటం లేదు. గాలి వాటు అధికరించటంతో శిబిరాలు వరసగా తగల బడి పోతున్నాయి. అశ్వాలు తాళ్ళు తెంచుకొని గంతులేస్తున్నాయి. గందర గోళంగా వుంది పరిస్థితి. సర్ప ద్రష్టులై తన సైనికులు ఎందరు నేలకు ఒరిగి పోతున్నారో తెలీటం లేదు. పరిస్థితి ఇలాగే కొన సాగితే ఎవరూ ప్రాణాలతో మిగలరని అర్థమై పోయింది.




దిక్కు తోచ లేదు బాహ్లీకునికి. పాముల నుంచి కాపాడుకోడానికి శిబిరాల మధ్య పరుగులు తీస్తున్నారు సైనికులు. కొందరు బళ్ళాలు, బరిసెలతో దొరికిన వాటిని దొరికినట్లు చంపేస్తున్నారు. ఎటు చూసినా అలజడి కలవరం కన్పిస్తోంది. వెంటనే మైదాన భూములు విడిచి పారి పోవటం కన్నా మరో మార్గం కన్పించ లేదు. వెంటనే అన్నీ సర్దుకుని తన అశ్వాన్ని అధిరోహించాడు. ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి బయట పడమని అజ్ఞాపిస్తూ అశ్వాన్ని అదిలించాడు.

తూర్పుగా వెళ్తే అటుగా వస్తున్న మాళవ సేనకు చిక్కే ప్రమాదం వుంది గాబట్టి నేరుగా ఉత్తర అడవుల వైపు దారి తీసాడు. అతడి వెనకే సైన్యం బయలు దేరింది. రథ గజ తురగ పదాతి దళాలన్నీ క్షణాల్లో బయలుదేరి పోయాయి. రాత్రంతా అడవిలో ప్రయాణం సాగిస్తూనే వున్నాయి.

ఇప్పుడున్న గందరగోళ పరిస్థితిలో నిద్ర లేక భయందోళనల్లో వున్న తన సైన్యం ఉదయమే పోరుకు సిద్ధంగా ఉండదని గ్రహించిన బాహ్లీకుడు తెలతెల్ వారే సమయానికి చిక్కటి లోతట్టు అడవుల్లోని లోయ ప్రాంతాలకు వెళ్ళి పోయాడు. తెల్లవారి చూసుకుంటే విష సర్పాల దాడిలో పది వేల సైనికులకు మూడు వేల అశ్వాలు గల్లంతయినట్టు తేలి తల పట్టుకున్నాడు. ఇక ఆ రోజంతా విశ్రాంతి తీసుకుని సైన్యంలో కొత్త ఉత్సాహం నింపితే గాని యుద్ధం చేయ లేరని గ్రహించి సేనాపతుల ఆలోచన కూడ అదే విధంగా వుండటంతో ఆ రోజు కూడ యుద్ధ విరామం ప్రకటించి లోయ లోనే ఉండి పోయాడు బాహ్లీకుడు.

ఇక అతడు విడిసిన మైదాన భూముల్లో తెల్ల వారే సరికి ఆ ప్రాంతమంతా బీభత్సం గాను భయానకంగానూ వుంది. యుద్ధం జరక్కుండానే అపార నష్టం. ఎన్నో గుడారాలు తగలబడి పోయాయి. ఎటు చూసినా పాము కాట్లతో విషానికి మరణించిన సైనికు మృత దేహాలు, ఖండిత సర్పాలు కన్పిస్తున్నాయి. అడవి నక్కలు శవాలను పీక్కు తింటున్నాయి. ఆకాశంలో గ్రద్దలు కారాడుతున్నాయి. ఆవిధంగా బాహ్లీకునికి, అతడి సేనలకు ఆ రాత్రి కంటి మీద కునుకు లేకుండా చేసినది ఎవరో కాదు, నాగ రాకుమారి ఉలూచీశ్వరి. తన నాగ శక్తితో మైదాన ప్రాంతాల చుట్టూ వున్న విష సర్పాలను ప్రేరేపించటంతో అవి చెలరేగి సైనిక శిబిరాల మీద దాడి చేసి దారుణ మారణ హోమం సృష్టించాయి. ఇలా ఉండగా`

ఆ రోజు వేకువ జామునే రత్నగిరి కోటలో యుద్ధ సన్నాహాలు ఆరంభమయ్యాయి. రాజ కుటుంబం తలారా స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించారు. యుద్ధంలో గెలుపు కోసం రాజ కుటుంబం కుల దైవంగా భావించే సహ్యాద్రి భీమ శంకరునికి... ధనుంజయుడు కొలిచే వేణు గోపాలునికి... రత్న గిరి నగర అధి దేవత ఆంకా దేవికి... రాజ పురోహితులు ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. సూర్యోదయమయ్యే సరికి అవన్నీ భక్తి శ్రద్ధలతో నిర్వహించి పురుషులు యుద్ధ సన్నద్ధులయ్యారు.

ధనుంజయుడు శిరస్త్రాణం, ఛాతీ కవచం, భుజ కవచాలు, మణి కట్టు కవచాలు ధరించాడు. భుజాన అక్షయ తూణీరం బిగించాడు. గాంధార లోక అధి దేవత మోహినీ శక్తి ప్రసాదించిన అక్షయ తూణీరం అది. ఎన్ని బాణాలు వాడినా అది సదా బాణాలతో నిండుగా సిద్ధంగా వుంటుంది. గతంలో ఇలాంటిది గాండీవి వద్ద మాత్రమే ఉండేది. ఇక మహా రాజు ధర్మ తేజుడు కూడ ఆ వయసులో రణోత్సహంతో సర్వ సన్నద్ధమై వచ్చాడు.

అసలు ధనుంజయుని ఆలోచన వేరు.

తన తండ్రితో బాటు సఖియలు మువ్వురినీ కూడ కోటకే పరిమితం చేయానుకున్నాడు. కాని మహా మాత్యుడు వాసు దేవ నాయకుని సహా... తండ్రి సమరోత్సాహం చూసాక ఆయన్ని వారించ లేక పోయాడు.

రాజు ధర్మ తేజ మహా వీరుడు. గతంలో ఎన్నో యుద్ధాలు చూసిన వాడు. ఆ పైన చాలా కాలంగా ప్రభు దర్శనం లేక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆయన ముందుంటే చాలు సైన్యం రెట్టించిన ఉత్సాహంతో పోరాడ గలదు.

ఇక భద్రా దేవి కూడ పురుష వేషంలో రణ క్షేత్రానికి సర్వ సన్నద్ధు రాలయి వచ్చింది. పాతాళ లోక యువ రాణి మణి మేఖల కూడ

పురుష వేషంలో సర్వ సన్నద్ధు రాలయి నడుమున వీర ఖడ్గం, భుజాన విల్లు, వీపున అంబుల పొది ధరించి భద్రా దేవి వెంట వచ్చింది.

కుసుమ కోమలి అయిన మణి మేఖల వీర విద్యల్లో కూడ నిష్ణాతురాలని ఇంత వరకు ధనుంజయునికే తెలిదు. ఆమె సామాన్యురాలు కాదు. బలి చక్రవర్తుల వారి ప్రియ దత్త పుత్రిక. ఘటనా ఘటన సమర్ధులగు శుక్రా చార్యుల వారి శిష్యు రాలు. ఇక ఆమెకు రాని విద్యంటూ ఏముంటుంది? ఇవన్నీ గ్రహించాకే భద్రా దేవి మణి మేఖలను తన వెంట నిడుకొని వచ్చింది. అశ్వశాల ఆవరణలో కలిశారంతా. భద్రా దేవి మణి మేఖల వెంట రాణి కనకాంబిక, యువ రాణి ఉలూచిశ్వరి పరిచారికలు అంతా వచ్చారు. అచట రథాలు సిద్ధం చేయ బడి వున్నాయి. జరిగేది మహా యుద్ధం గాబట్టి ధనుంజయుడు తన అశ్వం గరుడని, భద్రా దేవి తన మచ్చల గుర్రాన్ని అశ్వ శాలలోనే ఉంచేసారు. అశ్వ శాల సంరక్షుకుడు యుద్ధంలో పరుగెత్తే ప్రత్యేక అశ్వాలు రెంటిని భద్రా దేవి, మణి మేఖల ఇరువురి కోసం సిద్ధం చేసి వుంచాడు.

సాధారణంగా యుద్ధ రంగానికి వెళ్ళే రథాలు అశ్వాలు ఎటు బడితే అటు సులువుగా పరుగెత్తడానికి రథం కోరిన వైపు మళ్ళటానికి అనువుగా రెండే చక్రాలు కలిగి వుంటాయి. నాలుగు చక్రాలు రథాలు ప్రయాణాలకు ఉపయోగించేవి.

రెండు నల్లటి అశ్వాలు పూన్చిన, రథకునికి గొడుగు పట్టినట్టుండే తన రథం పైన జయ కేతనం వంక చూసాడు ధనుంజయుడు. ఉదయపు గాలికి అది రెప రెప లాడుతోంది. ఒక సారి కనులు మూసుకుని గంధర్వ లోకాధి దేవత మోహినీ శక్తిని స్మరించుకుని కనులు తెరిచాడు. అంతే` రథ కేతనం ఒక్క సారిగా ప్రకాశవంతమైంది. జండాలో తమ రాజ చిహ్నం పైన ధగ ధగాయ మానంగా ప్రకాశిస్తూ అమ్మ వారు తనను ఆశీర్వదిస్తూ ప్రత్యక్షమైంది. ధనుంజయుడు ఆ దేవిని భక్తితో ప్రణామం చేసాడు.

మహా రాజ ధర్మ తేజునిది ఎర్రటి ఒకే అశ్వం పూన్చిన బాదం కాయ ఆకారం లోని రథము. దానికి పైన గూడు లేదు. రథ చోదకుని వెనక అడ్డు చెక్క నుండి నిటారుగా వున్న కొయ్య పైన జయ కేతం రెప రెప లాడుతోంది. రథంలో బాణాలు గుట్టగా ఉంటాయి. రధికుడు నిలబడి బాణాలు సంధిస్తుంటాడు. అలాగే`

వరుసలో మహా మాత్యుడు వాసు దేవ నాయకుని రథం, మరి కొందరు రథికుల రథాలు సిద్ధంగా వున్నాయి. ఈ రథాలన్నీ రాజ కుటుంబ బంధు వర్గము, ముఖ్యులకు చెందినవి. అంతా రణ రంగంలో అంప వర్షం కురిపించ గల సమర్ధులు. ఇవి గాక సైనిక శిబిరాల వద్ద మూడు వేలకు పైగా రథాలున్నాయి. రెండు వేల రథాల సైన్యం రెండుగా చీలినప్పుడు బాహ్లీకుని పక్షాన వెళ్ళి పోయాయి.

అప్పటికే రథ చోదకులు కళ్ళాలు పుచ్చుకుని రథాల మీద సిద్ధంగా వున్నారు. మహా రాణి కనకాంబిక, నాగ లోక యువ రాణి ఉలూచిశ్వరి మహా రాజ ధర్మతేజునికి, యువ రాజు ధనుంజయునికి, భద్రా దేవికి, మణి మేఖలకు హారతులిచ్చి వీర తిలకం

దిద్దారు. మిగిలిన రథికులు కూడ వారి కుటుంబ సభ్యుల నుంచి హారతులందుకొని వీర తిలకం పొందారు.

అంతా బయలు దేరు ముహూర్త సమయం కోసం ఎదురు చూస్తున్నారు. అంతలో గూఢచారులిద్దరు అశ్వాల మీద వచ్చి దిగారు. మహా రాజుకి, యువ రాజుకి నమస్కరించారు. వారు తెచ్చిన సమాచారం విని నిర్ఘాంత పోయారు.

రాత్రి మైదాన ప్రాంతాల్లోని బాహ్లీకుని శిబిరాల మీద కుప్పలు తెప్పలుగా విష నాగుల దాడి చేయటంతో బాహ్లీకుడు మైదాన ప్రాంతాలు వదిలి ఉత్తరంగా అడవుల్లోని లోయ ప్రాంతానికి తన సేనలతో పారి పోయాడు. వేలాది సైనికులు మరణించి అపార నష్టం జరిగిందన్నది ఆ సమాచారం.

అది వినగానే`

నిన్నటి రోజున కోట బురుజు పైన ఉలూచీశ్వరి మైదాన ప్రాంతాలను చూపిస్తూ ఒకటికి రెండు మార్లు అడిగిన సంగతి గుర్తొచ్చి ఆమె వంక చూసాడు ధనుంజయుడు. ఈ పని ఆమె తప్ప ఎవరూ చేయ లేరు.

ఉలూచీశ్వరి అల్లరిగా నవ్వుతోంది.

‘‘దేవీ... ఇది తగునా?’’ చెంతకు వెళ్ళి అడిగాడు.

‘‘ఏది తమరు తగదనుచున్నారు?’’ గడుసుగా ఎదురు ప్రశ్నించింది.

‘‘నాకు తెలుసు. బాహ్లీకుని శిబిరాల మీదకు విష నాగుల్ని ప్రేరేపించినది నీవే కదూ?’’

‘‘అవుననుకోండి. అక్క భద్రా దేవి లాగో, చెల్లి మణి మేఖల వలెనో నేను మీతో వచ్చి కత్తి పట్టి కదన రంగమున యుద్ధము సలుప లేను గదా. అందుకే తోచినంతలో మన శత్రువు బలాన్ని కొంతయినా తగ్గింప నెంచి అటుల జేసితి. అది తగదందురా!’’ అంటూ అమాయకంగా చూస్తూ ఉలూచీశ్వరి పలుకుతుంటే ధనుంజయునికి నవ్వొచ్చింది. మహారాజు ధర్మ తేజుడు, రాణి కనకాంబిక

కోడలిని మెచ్చుకోలుగా మురిపెంగా చూసారు.

అంతలో మరో యిద్దరు గూఢ చారులు వేగంగా వచ్చి అశ్వాలు దిగి నమస్కరించి నిలిచారు. వారు తెచ్చిన సమాచారం కూడ అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేసింది.

తన అపార సైనిక శక్తితో సాగరం మీద తరలి వస్తున్న గాంధారాధీశుడు శతానీకుడు ఉదయానికి రత్న గిరి దరి దాపుల్లో ఉండాలి. కాని రాత్రికి రాత్రి దిశ మార్చుకొని తూర్పుగా ప్రయాణించి రత్న గిరికి ఉత్తరంగా పది యోజనాల దూరంలో తీరం చేరాడు. రాత్రి ఏదో సముద్ర రాకాసి తాకిడికి వేలాది నౌకల్ని, సైన్యాన్ని కోల్పోయాడన్నది చారులు తెచ్చిన సమాచారం.

ఎందుకలా జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు గాని అలా చేసి తమ శత్రువును కొంత బలహీన పర్చింది మాత్రం తన యక్ష మిత్రుడు రుచికుడని ధనుంజయునికి తెలుసు. మాట నిలుపుకున్నాడు రుచికుడు.

సరిగ్గా ఇదే సమయంలో మాళవ యువ రాజు ఇంద్ర జిత్తు కొందరు ముఖ్యుల్ని వెంట బెట్టుకుని సరా సరి అక్కడికి చేరుకున్నాడు. అంతా సైనిక దుస్తుల్లో యుద్ధ సన్నాహం లోనే వున్నారు. ఇంద్ర జిత్తు వెంట వచ్చిన ఒక అక్షౌణీ మాళవ సైన్యం రత్న గిరికి తూర్పుగా రెండు యోజనాల దూరంలో నిలిచి వుంది. బాహ్లీకుడు వాడి సైన్యం మైదాన ప్రాంతాల్లో లేక పోవటం... అక్కడ తగల బడిన శిబిరాలు... గుట్టలుగా విగత జీవులైన సర్పాలు... సైనిక శవాలను చూసి ఏం జరిగిందో అసలేం జరుగుతోందో అర్థం గాక సైన్యాన్ని అక్కడే వుంచి నేరుగా బయలు దేరి వచ్చాడు ఇంద్రజిత్తు.

సంపూర్ణ ఆరోగ్య వంతుడైన తన మేన మామ మహా రాజు ధర్మ తేజుని చూడ గానే అతడి ఆనందానికి మేర లేదు. అలాగే ధనుంజయుని వరించిన కన్యలు మువ్వురినీ కూడ చూసి సంతోషించాడు. కొద్ది సేపు పరిస్థితిని సమీక్షించుకున్నాక తన సేనల్ని తీసుకుని వేగంగా తమ సైనిక శిబిరాలను చేరుకోమని ఇంద్ర జిత్తును వెనక్కి పంపించాడు ధనుంజయుడు.

ఇక ముహూర్త సమయం వచ్చిందని పురోహితు హెచ్చరించటంతో అంతా తమ తమ రథాలను అధిరోహించారు. అందరి వద్ద వీడ్కోలు తీసుకుని బయలు దేరారు. ఉలూచీశ్వరి అత్త గారు రాణి కనకాంబికతో కోట లోనే ఉండి పోయింది.

ఆరంభంలో వంద మంది అశ్వికులు రెండు వరుసల్లో బయలు దేరగా వెనకే మహా రాజు ధర్మ తేజుని రథం, దాని అనుసరించి ధనుంజయుని రథం కదిలాయి. వాటి వెనక చెరో పక్క భద్రా దేవి, మణి మేఖల తమ అశ్వాలను అదలించారు. వారి వెనక మహా

మాత్యుడు వాసు దేవ నాయకుడి రథం దాన్ని అనుసరించి ముఖ్యులయిన వారి రథాలు యాభై నడవగా చివరగా మరో వంద అశ్వాల మీద రెండు వరుసల్లో అశ్విక దళం కదిలింది. మంగళ వాద్యాలు భేరీ నాదాలు కొమ్ము బూర శబ్దాలు మారు మ్రోగాయి.

ఆ విధంగా బయలు దేరిన మహా రాజు ధర్మ తేజుని చూసేందుకు నగర ప్రజలు బారులు తీరి పుష్ప వర్షం కురిపించారు. చాలా కాలం తర్వాత తమ ప్రభువుని చూసిన ఆనందంలో జేజేలు పలికారు. పడతులు ధర్మ తేజునికి, ధనుంజయునికి విజయ హారతులిచ్చారు. నగర వీధుల నుండి నగర వాకిళ్ళ వరకు ప్రజా సందోహం వెల్లువెత్తి జయ జయ నాదాలు చేసింది. నీరాజనాలు పట్టింది.

నగర వాకిళ్ళు దాటగానే`

రథాన్నీ వేగం అధికరించి తమ సైనిక శిబిరాల దిశగా శర వేగంతో పరుగులు తీసాయి.



యుద్ధం ` అది విధ్వంసం.

యుద్ధం ` అది వినాశకరం.

యుద్ధం ` భయానకం.

యుద్ధం ` అభివృద్ధి నిరోధకం.

యుద్ధం ` అది మృత్యు క్రీడ.

శాంతి కాముకుయిన రత్నగిరి ప్రజలు గాని ప్రభువు గాని యుద్ధాన్ని కోరుకో లేదు. రాజ్య కాంక్షతో ప్రత్యర్థులే పోరుకు తెర తీసారు. కాబట్టి ఆత్మ రక్షణ కోసం రత్నగిరి యుద్ధం చేయక తప్పదు. రత్నగిరి ప్రభువులు శాంతి కాముకులే కాదు, శౌర్య ప్రతాపాల్లో తీసి పోరని లోకానికి తెలుసు. అది మరో సారి రుజువు చేయాల్సిన సమయం వచ్చింది.

అధికార కాంక్షతో అంతర్యుద్ధం ఆరంభించిన ఉప సైన్యాధ్యక్షుడు బాహ్లీకునికి, అటు బాహ్లీకుని అడ్డు పెట్టుకుని రత్నగిరి సింహాసనం మీద కన్నేసిన గాంధార రేడు శతానీకునికి రాత్రి బలమైన ఎదురు దెబ్బలే తగిలాయి. కోలుకోడానికి ఈరోజు యుద్ధ విరామం కోరుకో వచ్చు. కాని తమకు ఆ అవసరం లేదు. ఇంట్లో చేరిన విష కీటకాల్ని వెదికి వెదికి చంపినట్టు రాజ్యంలో చొర బడిన శతానీకునికి... ఇంటి దొంగ బాహ్లీకునికి తగిన బుద్ధి చెప్పాలి.

రత్నగిరి సైన్యం సగం, కళింగ సైన్యం సగం కలిసి రథ గజ తురగ పదాతి దళాలతో సహా మహా రాజు ధర్మ సేనుడి వెంట పది యోజనాల దూరంలో తీరం చేరిన శతానీకుని వైపు తరలింది. మాళవ యువ రాజు ఇంద్ర జిత్తు, మహా మాత్యుడు వాసు దేవ నాయకుడు ప్రభువు వెంట వున్నారు.

ఇక మిగిలిన సైన్యంలో అయిదు వేల సైన్యాన్ని తీసుకుని ధనుంజయుడు బాహ్లీకునికి బాసటగా వస్తున్న పాతిక వేల గాంధార అశ్విక దళాలకు ఎదురు వెళ్ళాడు. మిగిలిన రత్నగిరి, మాళవ సేనలు సర్వ సైన్యాధ్యక్షుడు అర్కుని నాయకత్వంలో బాహ్లీకుని కోసం లోయ ప్రాంతాల వైపు కదిలాయి. భద్రా దేవి, మణి మేఖల అర్కుని వెంట వున్నారు.

ఇక ఆరంభమైంది భయంకర యుద్ధం.

ఆ యుద్ధం మూడు చోట్ల ఆరంభంలో కేంద్రీకృతమైంది. ముందుగా ఆరోజు మధ్యాహ్నానికే యువరాజు ధనుంజయుడు తన అశ్విక దళంతో ఎదురు వెళ్ళి బాహ్లీకునికి బాసటగా వస్తున్న పాతిక వేల గాంధార అశ్విక దళం మీద విరుచుకు పడ్డాడు. మూడు దినాలు రేయింబవళ్ళు సాగిన ఆ ఘోర యుద్ధంలో ధనుంజయుడు పాతిక వేల అశ్విక దళాన్ని సమూలంగా తుడిచి పెట్టేసి అక్కడి నుండి వాయువ్యంగా శతానీకుడితో ప్రధాన యుద్ధం జరుగుతున్న సముద్ర తీర ప్రాంతాల వైపు తన అశ్విక దళంతో సాగి పోయాడు.

ఇక అక్కడ చావు తప్పి కన్ను లొట్ట పోయిన చందంగా తీరం చేరిన గాంధారాధీశుడు శతానీకుడు అతడి అశేష సేన ఆ రోజంతా అక్కడే విశ్రాంతి తీసుకుని మరునాడు ఉదయం దక్షిణంగా రత్నగిరివైపు కదలింది. అంతలో రత్నగిరి సైన్యం తమ వైపు తరలి వస్తున్న సంగతి తెలిసింది. వేగులు తెచ్చిన సమాచారం అతడ్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎందుకంటే, స్వయంగా రత్నగిరి ప్రభువు తన సేనల్ని నడిపిస్తున్నాడు. వెంట మహా మాత్యుడు వాసు దేవ నాయకుడు, మాళవ యువ రాజు ఇంద్ర జిత్తు వున్నారు. మహా రాజు పుట్ట వ్రణం నుండి సంపూర్ణ ఆరోగ్యవంతుడు గావటం, యువరాజు క్షేమంగా తిరిగి వచ్చిన విషయం ఇవి రెండూ శతానీకునికి శరాఘాతం వంటి వార్తలే. అయినా ఇంత వరకు వచ్చాక వెనక్కు తగ్గే ఆలోచన శతానీకునికి లేదు. ఇక వ్యూహాలు ప్రతి వ్యూహాలు ఆరంభమయ్యాయి. రత్నగిరి సేన మూడు భాగాలుగా విడి పోయి శతానీకునిపై ముప్పేట దాడి ఆరంభమైంది. సంకుల సమరం బీభత్సంగా సాగింది.

ఇక అటు బాహ్లీకుని కోసం కదిలిన అర్కుని సేన సాయంకాలానికే నేరుగా పోయి లోయ ప్రాంతాలను చుట్టు ముట్టి బాహ్లీకుని అతడి సైన్యాన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది. భీకర యుద్ధం ఆరంభమైంది.

అర్కము అంటేనే పిచ్చి కుక్క యని అర్థం.

రెచ్చి పోయిన పిచ్చి కుక్క విచక్షణా రహితంగా దాడి చేసినట్టు అర్కుడు రెచ్చిపోయి ప్రత్యర్థుల్ని పూచ కోత కోసే దృశ్యం చూడ వలసిందేగాని చెప్పనలవి కాదు. అసలు సర్వ సైన్యాధ్యక్షుడైన అర్కుడు తమ వైపు వస్తాడని బాహ్లీకుడు వూహించ లేదు. అదలా వుంటే ఇక పురుష వేషం లోని భద్రా దేవి, మణి మేఖల ఇరువురి శౌర్య పత్రాపాలు వర్ణనాతీతం.

మొత్తం ఏడు రోజులు సాగిందక్కడ పోరు.

బాహ్లీకుడు గొప్ప యోధుడే. అందులో సందేహం లేదు. సైన్య పరంగా కూడ అప్పటికీ అతడిదే పై చేయి. కాని అర్కుని వర్గం పోరాట పటిమ ముందు అతడి సేనలు నిలువ లేక పోయాయి. ఇరు వైపులా ఎందరో వీరులు నేలకొరుగుతున్నారు. అశ్వాలు విగత జీవులవుతున్నాయి. నెత్తురు ఏరులై ప్రవహించింది. ఏడో రోజు భీకర పోరాటంలో బాహ్లీకుడు భద్రా దేవి, మణి మేఖల ఇరువురికీ చిక్కాడు. అతడ్ని తరిమి తరిమి అశ్వం నుండి పడగొట్టింది మణి మేఖల. అతడ్ని నిరాయుధుడ్ని చేసింది భద్రా దేవి. చండిక లా వాడ్ని కాలితో తొక్కి పట్టి ఖడ్గం లేపింది. దేవీ దత్తమైన ఆ ఖడ్గానికి ఎదురు లేదు. ''రేయ్ విశ్వాస ఘాతకా. నీకు రత్నగిరి సింహాసనం కావలెనా? నమ్మిన ప్రభువునే వెన్నుపోటు పొడిచిన పిచ్చి కుక్కవి. ఇంత నీచానికి పాల్పిడిన నీకు ఒక ఆడదాని చేతిలో కుక్క చావు చచ్చావను సంగతి జన్మ జన్మకీ గురుతుండవలె. నీకు బతికే అర్హత లేదు'' అంటూ ఒకే వేటుతో వాడి తల నరికి శూలానికి గుచ్చి పైకి లేపింది.

ఎప్పుడైతే బాహ్లీకుని అంతం చూసారో ఇక ఎవరి కోసం యుద్ధం చేయాలన్న నిరాశతో చావగా మిగిలిన ఇరవై వేల బాహ్లీకుని సేన అర్కునికి లొంగి పోయింది. ఆ విధంగా లోయ ప్రాంతంలో యుద్ధం ముగియటంతో అర్కుని వర్గం ప్రధాన రణ క్షేత్రమైన సముద్ర తీర ప్రాంతం వైపు బయలు దేరింది.

శతానీకుడు తలచింది ఒకటి, జరిగింది ఒకటి అయింది. అతి సులువుగా రత్నగిరి తన వశమవుతుందన్న అతడి అంచనా అంతా తారుమారయింది. ఆరంభంలో తనదే కాస్త పైచేయిగా వున్నా నాలుగో రోజు స్వయంగా ధనుంజయుడు తన సైన్యంతో వచ్చి చేర గానే అతడి రంగ ప్రవేశంతో పరిస్థితి మారింది. బాహ్లీకుని అంతం చేసిన అర్కుని వర్గం ససైన్యంగా పదో రోజుకి వచ్చి చేరటంతో ప్రభువు ధర్మ తేజుని సైన్యం పరి పుష్టమై తెగించి పోరాడ సాగింది. మహా వీరులయిన ధర్మ తేజుడు, ధనుంజయుడు, మాళవ యువరాజు ఇంద్ర జిత్తు, మహా మాత్యుడు వాసు దేవ నాయకుడు, సర్వ సైన్యాధ్యక్షుడు అర్కుడు, భద్రా దేవి, మణి మేఖల ఇంకా అరి వీర భయంకరులు విశ్వాస పాత్రులయిన రత్నగిరి దళపతులు సేనాపతులు పాల్గొన్న మహా యుద్ధమది.

ద్వాపర యుగాంతంలో జరిగిన కురు క్షేత్ర సంగ్రామం తర్వాత కలి యుగం నాలుగో శతాబ్దంలో సంభవించిన రెండో అతి పెద్ద యుద్ధమది. మొత్తం ఇరు పక్షాలూ కలిపి అయిదు వేల అక్షౌణీ సైన్యం పాల్గొన్న మహా సంగ్రామం. పదకొండు దినాలు రేయింబవళ్ళు సాగిన ఆ ఘోర సంగ్రామంలో ఎందరో వీరులు మరణించారు. ఇరు పక్షాల్లోనూ కలిపి నాలుగు అక్షౌణీ సైన్యం తుడిచి పెట్టుకు పోయింది. ఎటు చూసినా పీనుగుల కుప్పలు, వేలాది అశ్వాలు, ఏనుగులు మరణించాయి. మృత్యువు విలయ తాండవం చేసింది. సుమారు మూడు అక్షౌణీ సేనలతో తరలి వచ్చిన శతానీకుడికి చివరకు ముప్పై వేల సైన్యం కూడా మిగల్లేదు. ఓటమి తప్పదని ఇవాళో-రేపో తను రత్నగిరి సేనకి పట్టు బడక తప్పదని శతానీకుడు గ్రహించాడు.

రత్నగిరికి పట్టుబడితే జరిగేదేమిటో కూడ తెలుసు. రత్నగిరికి నష్ట పరిహారం చెల్లించాలి. చెల్లించినా తనను ప్రాణాలతో వదులుతారో లేదో తెలీదు. చివరకు ఓటమికి భయ పడిన శతానీకుడు పదకొండో రోజు రాత్రి చీకటి మాటున మిగిలిన తన సేనలతో పారిపోయి, తమ నౌకలను చేరుకొని తిరోముఖుడైనాడు. విషయం గ్రహించి రత్నగిరి నౌకలు కొంత దూరం తరుముకెళ్ళాయి గాని శతానీకుడు తప్పించుకున్నాడు.

రత్నగిరి విజయ పతాక ఎగుర వేసింది.

ఇక్కడ ముఖ్యంగా చెప్పుకోవలసింది ఈ యుద్ధానికి మూల కారణమైన వాడు బాహ్లీకుని అంటి పెట్టుకుని వున్న శతానీకుని మనిషి కరోతి. యుద్ధారంభంలోనే వాడు బాహ్లీకుని ఇంటి నుంచి మోయ గలిగినంత ధనం మూట గట్టుకొని రత్నగిరి వదిలి ఉత్తరంగా సాగి పోయాడు. అలా వెళ్ళిన వాడు తపతి నదీ తీర ప్రాంతాల్లో బంది పోటు దొంగలకు చిక్కి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. వాడు మోసుకొచ్చిన ధనాన్ని దొంగలు దోచుకు పోయారు.

ఇక భూతం ఘృతాచికి యుద్ధం సాగిన పదకొండు దినాలు విందు భోజనంలా సాగింది. తన రుధిర దాహం తీరేలా మృత వీరుల శరీరాల నుంచి గోరు వెచ్చని నెత్తురు తాగుతూనే వుంది. అలా తన రుధిర దాహం తీరగానే యుద్ధం ముగిసిన మూడో రోజునే దేహ త్యాగం చేసింది. ధనుంజయుడు భూతం ఘృతాచికి ఘనంగా అంత్య సంస్కారాలు జరిపించాడు.

యుద్ధం ముగిసింది.

కాని యుద్ధం సృష్టించిన విధ్వంసం నుండి రత్నగిరి తేరుకుని సాధారణ పరిస్థితులు నెలకొనడానికి రెండు మాసాలు పట్టింది. పది దినాలు రత్నగిరిలో సమర విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఇక యుద్ధంలో ఘోర పరాజయం పాలై తప్పించుకు పారి పోయిన శతానీకుని నౌకలు పక్షం దినాలకు కరూర దేశం ఓడ రేవుకు చేరుకున్నాయి. గాంధార రాజు సైన్యం వెంట కరూర ఓడ రేవులో అడుగు పెట్టడం అంతా చూసారు. కాని తర్వాత అతడి జాడ ఎవరికీ తెలికుండా పోయింది. వారం రోజులు ఓడ రేవు లోనే వేచి చూసిన సైన్యం నిరాశతో ప్రయాణించి గాంధారం చేరుకుంది. ఆరు మాసాలు గడిచినా శతానీకుని జాడ తెలిక పోవటంతో మంత్రులు అతడి కొడుకునకు పట్టాభిషేకం చేసి గాంధారకు ప్రభువుగా ప్రకటించారు.

నిజానికి రాజు శతానీకుడికి కరూర దేశంలో అడుగు పెట్టే సరికే జీవితం మీద విరక్తి కలిగింది. అత్యాశకు పోయి తన సేనలతో బాటు మిత్ర దేశాల సైన్యాన్ని కూడ రత్నగిరికి తరలించి బలి పెట్టాడు. ఇప్పుడు స్వదేశం లోకి వెళ్ళి వారికి ముఖం ఎలా చూపించాలి, యుద్ధంలో ఓటమి తాలూకు పరాభవాన్ని అవమానాలను ఎలా సహించాలి. అందుకే ఎవరికీ తన ముఖం చూపించ లేక రాత్రికి రాత్రి అశ్వం మీద ఒంటరిగా బయలు దేరి భృగు కచ్ఛ మీదుగా ఎగువన యాదవ రాజ్యం చేరుకుని ఆ పైన కొద్ది దినాలు ప్రయాణించి హిమాలయాలకు చేరుకున్నాడు. శేష జీవితాన్ని అక్కడే ముని వృత్తిలో గడుపుతూ రహస్యంగా ఉండి పోయాడు. అతడేమైనాడో బయటి ప్రపంచానికి తెలీకుండా పోయింది.

*********

యుద్ధం ముగిసిన మూడు మాసాల అనంతరం`

అత్యంత వైభవంగా రత్న గిరి కోటలో యువరాజు ధనుంజయుని వివాహం జరిగింది. వివాహానికి కళింగ రాజ కుటుంబం కతు మరచి తరలి వచ్చింది. యక్ష మిత్రుడు రుచికుడు హాజరయ్యాడు. నాగ లోకం నుండి నాగ రేడు మహా పద్ముడు, పాతాళం నుండి బలి చక్రవర్తి సకుటుంబ సపరివారంగా తరలి వచ్చారు.

నాగ రేడు దంపతులు తమ కుమార్తె ఉలూచీశ్వరితో బాటు భద్రా దేవిని కన్యా దానం చేయగా బలి చక్రవర్తి దంపతులు తమ దత్త పుత్రిక మణి మేఖలను కన్యా దానం చేసారు. ఎన లేని కానుకలందించారు. ఒకే సుముహూర్తంలో ధనుంజయుడు సఖియలు మువ్వురికీ తాళి కట్టి తన రాణుల్ని చేసుకున్నాడు. రంగ రంగ వైభవంగా సాగిన వివాహ వేడుకల్ని దేవతలు కూడ సంతోషంగా వీక్షించారు.

తర్వాత కాలంలో ధనుంజయుడు రత్నగిరి రాజ్యానికి ప్రభువై, అరి వీర భయంకరుడిగా, ప్రజలకు ప్రజా రంజకమగు పాలన అందిస్తూ తన మువ్వురు భార్యలతో సుఖసంతోషాలతో ఎన లేని కీర్తి ప్రతిష్టలను సంపాదించాడు.